apou
LIBRARY

# తెలుగు

## మౌలిక అంశాలు

ఖండికలు: 13-20

BRAOU

ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

హైదరాబాదు

1983-84

ఆధునిక భారతీయ భాషలు: తెలుగు

రచయితల బృందం

ఆచార్య చేకూరి రామారావు (సంపాదకుడు)
డా. కేతు విశ్వనాథరెడ్డి (సహ సంపాదకుడు)
డా. ఎం. వి. శాస్త్రి
డా. వి. లక్ష్మణరెడ్డి
శ్రీమతి ఏ. మంజులత

apou
LIBRARY

A.P.O.U. LIBRARY
Acc. No.........................
Date.........................
Call No.........................
BRAOU

ముఖచిత్రం
చంద్ర

ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విశ్వవిద్యాలయం
హైదరాబాదు
ప్రథమ ప్రచురణ 1984
కాపీరైటు © 1984 ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విశ్వవిద్యాలయం
అన్ని హక్కులూ విశ్వవిద్యాలయానివి. ఈ పుస్తకంలోని ఏ భాగం అయినా ఉపయోగించుకోదలచుకొంటే, విశ్వవిద్యాలయం అనుమతి పొందాలి.
ఈ పాఠాలు సార్వత్రిక విశ్వవిద్యాలయం పాఠ్యప్రణాళికలో ఒక భాగం.
పాఠ్య ప్రణాళిక మొత్తం వివరాలు ఈ పుస్తకం చివరలో ఉన్నాయి.
ఇతర వివరాలకు: డైరక్టర్, ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విశ్వవిద్యాలయం
6-3-645, సోమాజిగూడా, హైదరాబాదు-500 004.

ముద్రణ: నాట్యకళ ప్రెస్ ఖైరతాబాద్, హైదరాబాదు.

## ఖండికలు

13. శైలి
14. శైలిలో భేదాలు
15. శైలిలో ఏకరూపత
16. అనువాద విధానం
17. అనువాదంలో భేదాలు
18. ఆధునిక కవిత్వం పరిచయం
19. కథానిక పరిచయం
20. నాటకరచన పరిచయం

BRAOU

BRAOU

ఖండిక 13 పాఠం 22

# శైలిలో పదాల కూర్పు

**ఉద్దేశం**

మీరు తెలుగు మౌలిక అంశాలు పాఠాల్లో వచన రచనా భాషను గురించే ప్రధానంగా తెలుసుకుంటున్నారు. వచన రచనాభాష, వచన రచనా ప్రక్రియలు వ్యాసం, కథానిక, నవల, నాటకం, లేఖారచన, పత్రికారచన వంటి సాహిత్య రూపాలలో ఉపయోస్తున్నారని తెలుసుకున్నారు. ఈనాటి మాట్లాడే భాషనుంచే ఆధునిక రచన భాష రూపొందింది అన్న విషయం కూడా తెలుసుకున్నారు. వివిధ వచన రచనల్లో ఉపయోగించే వచనం సంవాదాత్మకంగానో, విమర్శనాత్మకంగానో, కథాత్మకంగానో, ఉపన్యాస రూపంలోనో, తాత్వికంగానో, వైజ్ఞానికంగానో, వ్యంగ్యాత్మకంగానో ఉండడం మీరు గమనించి ఉంటారు. ఈ పాఠంలో స్థూలంగా వచన రచనలో సాధించవలసిన పనితనం గురించీ, శైలిలో పదప్రయోగాన్ని గురించీ తెలుసుకుంటారు.

**ప్రణాళిక**

1. శైలి నిర్వచనం
2. రచనలోని అంశాలు
3. శైలిని రూపొందించే ప్రమాణాలు
4. శైలిలో పదాల కూర్పు
5. అదనపు సమాచారం
6. ముఖ్య విషయ క్రోడీకరణ

BRAOU

**శైలి నిర్వచనం**

ఒక రచనలో భాషను వాడుకునే శక్తినీ, నేర్పునూ, ప్రత్యేకతనూ శైలి అనవచ్చు. భాషాప్రయోగ నైపుణ్యం, రచనారీతి, రచనావిధానం అనే మాటలతో కూడా శైలిని సూచిస్తారు.

## రచనలోని అంశాలు

మనం ఒక రచన అంటున్నప్పుడు ఆ రచనలో అనేక అంశాలు ఉంటాయన్నది మరచిపోరాదు. వాటిలో కొన్ని ముఖ్యమైన వాటిని తెలుసుకోవడం ద్వారా, రచనకూ, రచనా విధానానికి గల పరస్పర సంబంధం తెలుస్తుంది. రచనలోని ముఖ్యమైన అంశాలు:

1. రచన ద్వారా రచన చేసే వ్యక్తి (రచయిత లేదా రచయిత్రి) వెల్లడించ దల్చుకున్న భావం.
2. రచనలోని విషయం (వస్తువు) పట్లా, పాఠకుల పట్లా రచయిత ప్రదర్శించే వైఖరి. రచయిత గంభీర వైఖరి తీసుకుంటున్నాడా, నిర్లిప్తవైఖరి ప్రదర్శిస్తున్నాడా, హాస్యవైఖరీ, వ్యంగ్య వైఖరీ, ఆవలంబిస్తున్నాడా అని తెలిపే అంశం.
3. రచనోద్దేశం: పాఠకునికి సమాచారం అందచేయడమా? పాఠకునిలో అభిప్రాయాలు కల్గించడమా? అనుభూతులను రేకెత్తించడమా? ఒక రచనలో ఈ రచనోద్దేశాల్లో ఏ రెండైనా ఉండవచ్చు. అన్నీ ఉండవచ్చు.
4. రచనా భేదం: రచన ఏ ప్రక్రియకు సంబంధించినది? అది కథా? నవలా? వ్యాసమా? లేఖా? పాత్రికేయ రచనా లేక వీటి భేదాలా?

5. రచనాకాలం: సమకాలికమైన రచనా? ప్రాచీనా రచనా? ప్రాచీనం అయితే ఏ కాలానికి చెందింది అని తెలిపే అంశం.

6. రచన ఎవరికోసం? ఏ సాంఘికస్థాయి, ఏ విద్యాస్థాయి ఉన్న పాఠకుల కోసం? లేదా శ్రోతలకోసం? ఏ సాంఘిక సన్నివేశం కోసం? అని తెలిపే అంశం.

7. భాషా భేదాలు: రచన ఏ భాషా భేదానికి సంబంధించినది? ప్రామాణిక భాషకా? మాండలికానికా? కథలు, నవలలు, నాటకాలలో పాత్రలుపయోగించే భాషా భేదాలేమిటి? అని తెలిపే అంశం.

ఈ అంశాలను రచనలో నిర్వహించాలంటే, భాషమీద అధికారం ఉండాలి, భాషమీద అధికారమే రచనా విధానాన్ని నిర్ణయిస్తుంది. రచనోద్దేశాన్ని సమర్థంగా నిర్వహించే రచనా విధానమే ఉత్తమ మయింది. అంటే శైలులలో మంచివి చెడ్డవి అనేవి రచనోద్దేశాన్ని బట్టి ఉంటాయిగానీ స్వతస్సిద్ధంగా ఉండవు.

శైలిని రూపొందించే ప్రమాణాలు మూడు. అవి:

1. పదాలు, పదబంధాల ఎంపిక, వాటి ద్వారా కలిగించే నాదం, భావం

2. అలంకారికత

3. వాక్య ప్రయోగ భేదాలను ఉపయోగించుకోవడంలోని సామర్థ్యం

1. పదాలు, పదబంధాల ఎంపిక, వాటిద్వారా కలిగించే నాదం, భావం: భాషాప్రయోగ సామర్థ్యానికి నిదర్శనం పదశక్తిని గుర్తించడం. అంటే సజీవమైన మాటలనూ, మాటలకు సందర్భాన్ని బట్టి వచ్చే అర్థ భేదాలనూ గుర్తించడం, అర్థభేదాలు వచ్చే పద్ధతులు తెలుసుకోవడం, నానార్థాలూ,పర్యాయ పదాలూ, జాతీయాలు రచనలో నిర్వహించే పాత్రను తెలుసుకోవడం. (వీటిని గురించి మీరు 3, 4, 5 ఖండికల్లో విపులంగా తెలుసు కున్నారు). అట్లాగే వివిధ భాషలనుంచీ వచ్చి చేరే పదాలనూ, అవి వ్యక్తం చేసే కొత్తభావాలనూ గుర్తించడం అవసరం. జపనీస్ భాషలాగానే తెలుగు ఆదానాత్మక భాష (Borrowing language) అనేది మనం మరచి పోరాదు.

BRAOU

వాడుకలో ఉండే మాటలే వచనానికి జీవం. ఎందువల్లనంటే నిత్య వ్యవహారంలో వాడే పదాలకు రూఢి ఉంటుంది. పదస్వరూపంలో, అర్థంలో ప్రయోగ ప్రామాణ్యం ఉంటుంది. అట్లాకాక ప్రాచీన కాలంలో మన పూర్వులు వాడిన పదరూపాన్నే, అర్థాన్నే గ్రహిస్తే, భావబోధ సక్రమంగా జరగదు. రచనా విధానంలో కృత్రిమత్వం చోటు చేసుకుంటుంది. వాడుకలో నశించిపోయిన మాటలు ఏ భాషలోనైనా ఉంటాయి. ఉదాహర ణకు ఈనాటి ఇంగ్లీషు శైలిలో Quoth, howbeit, Prithee, I wot, I trow వంటి మాటలను పరిహరించడం చూడవచ్చు. తెలుగులో అట్లాగే మనం ఈ నాటి వాడుక భాషలోకానీ, వచనాభాషలో కానీ వాడని పదాలు ఉన్నాయి. ఉదాహరణకు :

1. నామ పదాలు : కొమరిత, అంధకత్తియ, నెలతుక, పొలతి, ముద్దియ

2. సర్వ నామాలు: ఏను, ఏము, ఈవు, తారు, మీరలు, అయ్యది, ఏ వాడు, ఎద్ది

3. సంఖ్యా వాచకాలు : ఒక్కరుండు, వేవురు.

4. క్రియలు: చనియె, ఇడియె, ఇయ్యకొనియె, శపియించెద, చేయుండు, వ్రాయకుము

5. అవ్యయాలు; నావుడు, అనవుడు

తెలుగు భాషలో వాడుకలో లేని తద్భవరూపాలు కందుకూరి వీరేశలింగం పంతులు, చిలకమర్తి లక్ష్మీనర సింహం పంతులు, వేదం వేంకటరాయశాస్త్రి వంటి ప్రసిద్ధ రచయితల వచన రచనల్లో కన్పిస్తాయి.

ఉదా : కరజము, వితము, సందియము, గరువంబు, తిరుడు, విద్దియ, నేమము, గారాము, ఒజ్జ

పాత రచనలను అర్థం చేసుకోవడానికి వీటిని నేర్చుకునే అవసరం ఉంటే ఉండవచ్చు, కానీ మంచి ఆధు నిక వచన శైలికి అతకవు.

ఈ క్రింది ఉదాహరణలు గమనించండి :

1. "బాగా చదువు కుంటున్నావా బాబూ" పృచ్ఛ చేసింది రోహిణి
   (ఒక ప్రసిద్ధ నవలా రచయిత్రి నవలలోని వాక్యం)
2. "అనుంగు ఆత్మజకు తమ శక్తిమేరకు అత్యున్నతమైన వరుని తేవాలని తలిదండ్రులు..."
   (ఒక ప్రసిద్ధ నవలా రచయిత్రి నవలలోని వాక్యం)
3. "ఈ పాఠము అప్పగించుట బాగుంది"
   (ఒక ప్రసిద్ధ నవలా రచయిత్రి నవలలోని వాక్యం)

మొదటి వాక్యంలోని 'పృచ్ఛ', రెండవ వాక్యం లోని అనుంగు ఆత్మజ, అత్యున్నత వరుడు, మూడవ వాక్యంలోని అప్పగించుట వాడుకలో లేని మాటలు. ఈ మాటలను వాడడం ద్వారా రచనలో ఒక కృత్రిమత్వం వచ్చి చేరుతుంది.

మరొక ఉదాహరణ చూడండి:

"వీపుమీద హరికెన్ లాంతరూ, వాటరు బాటలూ ఒకదాన్నొకటి కొట్టుకుంటూ టకటకలాడటం కర్ణాకర్ణిగా వినిపిస్తోంది."

(ఒక కథా రచయిత కథలోని వాక్యం)

ఈ వాక్యంలోని 'కర్ణాకర్ణిగా' అనే పదం సందర్భానికి తగింది కాదని ఏ నిఘంటువు చూసినా తెలుస్తుంది.

పానుగంటి లక్ష్మీ నరసింహం పంతులు రాసిన 'కంఠాభరణము' అనే నాటకంలో సోమావధాన్లు 'పూర్వ వృత్తాంతము' అనే మాటకు అర్థం తెలియక, భవిష్యత్ వృత్తాంతము అని అంటాడు. "వాల్మీకి మహర్షి యొద్దకు రుతుస్నాతలై యంబికాంబాలికలు పోయినపుడు వాలీ సుగ్రీవులను ప్రసాదించి యా మహర్షి యాదవకులము నుద్ధరించినట్లు నేను మా వంశము నీ రీతిగా నిలుపబెట్టినాను" అని అంటూ భారత భాగవత రామాయణాలను కట్టగట్టి రోటిలో దంచుతాడు.

BRAOU

ఈ రకమైన పొరబాట్లు పదస్వరూపానికీ, పదాల వాడుకకూ, పదాల అర్థానికీ, పదాల ద్వారా తెలిసే సమాచారానికీ సంబంధించినవిగా ఉంటాయి. అందువల్ల రచనావిధానంలో పదాలూ, పదబంధాలూ పదకల్పనా శక్తికీ, పదప్రయోగ ప్రావీణ్యానికీ, ప్రత్యేకతకూ దృష్టాంతంగా ఉంటాయి.

## శైలిలో పదాల కూర్పు

కవిత్వరచనలో పదాల కూర్పు ద్వారా కవులు నాద సౌందర్యాన్నీ, భావ గాఢతనూ సాధిస్తారు. కవులు రాసే వచనంలో కూడా ఈ గుణాలు ఉంటాయి. ఆలంకారికంగా చెప్పే గుణం కూడా ఉంటుంది. ఈ విషయాన్ని మీరు దేవులపల్లి కృష్ణశాస్త్రి వ్యాసాల్లో గమనించారు. కానీ ఆధునిక వచన శైలికి నాదసౌందర్యం, ఆలంకారికత ఆడంబరాన్నీ, పటాటోపాన్నీ తెచ్చి పెడతాయి. ఆధునిక వచన శైలిలో పదాల కూర్పు ఎంత సూటిగా, స్పష్టంగా, నిరాడంబరంగా, సంగ్రహంగా ఉంటే శైలి అంత గంభీరంగా, ప్రసన్నంగా, అప్రయత్నంగా బిగువుగా ఉంటుంది. రచనలోని అంశాలను పాఠకులు గ్రహించడానికీ, అనుభవించడానికీ అనువుగా ఉంటుంది. ఒకప్పుడు వచన రచనలో దీర్ఘ సమాసాలు గుప్పించే సంప్రదాయం ఉండేది. అటువంటి దీర్ఘ సమాస రచనతో కూడిన పదగుంఫన శైలి (Rhetoric Style) కంటే, సరళ శైలి ఆధునిక రచనా సంస్కారానికి సన్నిహితమైంది.

"నిరంతర పరిఫుల్ల వన మల్లికా వల్లికా మతల్లికా వేల్లిత నికుంజ పుంజ రంజితంబయి, కుసుమ పరిమళ మిళిత గళిత మకరంద బిందు సందోహ స్వాద నాగత మిళింద బృంద సుందరంబయి, నికట విటపి చ్ఛటాఘటచ్ఛకుంత సంతన్నాక్రాంత తత రవాక్రాంత దిగన్తరాళంబయి."

పాఠం మొదట్లో వివరించిన రచనలోని అంశాలను గుర్తుపెట్టుకొని, వాడుక భాషలోని నుడికారాన్ని రచనా భాషలో సహజంగా తీసుకు రాగలిగినప్పుడే భాషను సమర్థంగా వాడగలిగిన పనితనం అబ్బుతుంది. దీని కోసం చుట్టూ ఉన్న జీవితంలోని భాషా ప్రయోగాన్ని పరిశీలించడం ఎంత అవసరమో, వివిధ ఆధునిక రచయితల రచనా రీతులను నిశితంగా పరిశీలించడం అంతే అవసరం. అప్పుడు మాత్రమే మంచి శైలిని గుర్తించగలుగుతారు. మంచి శైలిలో రాయడానికి ప్రయత్నిస్తారు.

**అదనపు సమాచారం**

"సాధారణంగా రచయితలు పనిగట్టుకొని సాధనచేసి యేదో ఒక రచనా విధానాన్ని అలవరచు కుంటారు. దాన్నే శైలి అంటాం. శైలిలో గాంభీర్యమూ, ఉదాత్తతా, వేగమూ, ఉద్ధతిలాంటి గుణాలు బలీయంగా వున్నప్పుడు, ఆ శైలి పాఠకులను ఊపిరాడకుండా ఉక్కిరిబిక్కిరిచేసి భళీ అనిపించుకుంటుంది— డియంకె నాయకుల వాగ్ధాటిలాగా. Rhetoric అంటే అదే. అది మామూలు మనుషులను ఉక్కిరి బిక్కిరి చేస్తూందిగనుకనే దాన్ని యెవరైనా సులభంగా గుర్తించగలరు. Rhetoric కాని శైలీ భేదాలను గుర్తించడం కొంత కష్టం— లాలిత్యమూ, మార్దవమూ, పదునూ, బిగువూ మొదలైన గుణాలు కల వాటిని ప్రసన్నతా, సుబోధకతా, అరమరికలులేని అమాయకత్వమూ, ఆడంబరంలేని సరళత్వమూలాంటి గుణాలను గుర్తించడం మరీ కష్టం.

నిజానికి Rhetorical శైలిపట్ల యీనాడు నాగరిక ప్రపంచ మంతటా విముఖత్వం యేర్పడింది. ఉద్బోధకూ, అధిక్షేపణకూ తప్ప దాన్ని సాధారణంగా యెవరూ వాడరు. ఆ శైలి కృత్రిమమైందని యీనాటి సంస్కారవంతుల అభిప్రాయం. ఒకనాడు రాజులూ, నవాబులూ ధరించిన కిరీటాలూ, భుజకీర్తులూ, చమ్కీకోట్లూ వేసుకొని యీనాడు బజార్లో తిరగడానికి మనం సిగ్గుపడినట్లే, ఆ శైలిలోని ఆడంబరాన్ని, పటాటోపాన్ని ఆధునిక రచయితల సంస్కారం ఆమోదించదు. అందువల్లనే యింగ్లీషు రచయిత లెవ్వరూ యీనాడు మెకాలేలాగా, జాన్సన్‌లాగా, రస్కిన్‌లాగా, న్యూమన్‌లాగా రాయడంలేదు. Rhetorical అనే మాటకు (దాని మొదటి అర్థంతోపాటు) fales, showy, artificial, inflated, insincere అనే అర్థాలు కూడా యేర్పడినాయి.

BRAOU

ఈనాటి యింగ్లీషు రచయితల్లో Rhetoric లేకపోయినా శైలి అనేది వుంది. ఆధునిక శైలి ఆడంబరం లేకుండ బరువుగా, ప్రసన్నంగా వుంటుంది. పాఠకులను చకితులను చేయకుండా, ఆహ్లాదం కలిగిస్తుంది; మృదంగ సంగీతంలాగ తన్మయత్వం కలిగించకుండా, చెప్పే విషయం మీద శ్రద్ధాసక్తులు కలిగిస్తుంది. బెర్ట్రాండ్ రసెల్, సామర్సెట్ మామ్ లాంటి వాళ్ళలో ఆధునిక శైలిని స్పష్టంగా గుర్తించవచ్చు. ఆధునిక శైలిలో ముఖ్యమైన గుణం కృత్రిమత్వం లేకపోవడం—అంటే, నిత్య జీవితంలోని వ్యవహారానికి దగ్గరగా వుండటం. వీలైనంత వరకు నిత్య వ్యవహారంలోని మాటలే వాడడం, వీలైనంతవరకు నిత్య వ్యవహారంలోని వాక్య నిర్మాణ పద్ధతులే అవలంబించడం, నిత్య వ్యవహారంలోని భాష సాధారణంగా పేలవంగా వుంటుంది గనుక ఆ పేలవత్వాన్ని పరిహరించడానికి కొంత శ్రద్ధ తీసుకోవడం—యిది శైలిని గురించి ఆధునికుల అవగాహన, ఆధునిక శైలీ భేదాలు యెన్నివున్నా యీ అవగాహనకు లోబడే వుంటున్నాయి.

మామూలు మనుషులు నిత్య వ్యవహారంలో మాట్లాడుకునే భాష యెల్లప్పుడూ పేలవంగానే వుండదు. ఉదాహరణకు మా వూరి వీధి కొళాయిలదగ్గర కొట్లాడుకునే ఆడవాళ్ళ శైలిని పేలవం అని జాన్సన్ కూడా అనలేడు. బైబిల్‌ను మించిన అర్థపుష్టి, కమ్యూనిస్టు మానిఫెస్టోను మించిన జలపాతపు దూకుడూ ఆ శైలిలో వుంటాయి. అసంస్కారుల ఆవేశ బలంవల్ల వచ్చిందే ఆ శైలి, కానీ ఆవేశం లేనప్పుడుకూడా నిత్యవ్యవహారంలోని భాష పట్టి చొప్పదంటులాగా వుండనక్కరలేదు. సాధువూ, సంస్కారవంతుడూ అయిన వ్యక్తి సహజంగా మాట్లాడే భాష ప్రసన్నంగా వుంటుంది. ఆ వ్యక్తి మిత్రులతో మాట్లాడే భాష మరింత ధారాళంగా, సరసంగా వుంటుంది. ఆ వ్యక్తి మితభాషి కూడా అయితే ఆ భాష బిగువుగా, గంభీరంగా కూడా వుంటుంది. ఆ వ్యక్తి విద్యావిజ్ఞాన సంపన్నుడై తనకు కరతలామలకమైన విషయం గురించి మాట్లాడేటప్పుడు, మాటలకు

తడుముకోవడమూ, తడబాటూ లేకుండా, అప్రయత్నంగా మనసులో కలిగిన భావాలు అప్రయత్నంగానే వాగ్రూపం ధరిస్తాయి గనుక, ఈ భాషకొక ప్రవాహ గుణం, ఒక ధారాశుద్ధి, లభిస్తుంది.''

(రాచమల్లు రామచంద్రారెడ్డి సాహిత్య ప్రయోజనం [కొడవటిగంటి కుటుంబరావు వ్యాసాల సంకలనం] గ్రంథానికి రాసిన పరిచయం నుంచీ, విశాలాంధ్ర పబ్లికేషన్స్, విజయవాడ, అక్టోబరు 1969).

ముఖ్య విషయ క్రోడీకరణ :

1. వచన రచనా ప్రక్రియలు అనేకం ఉన్నాయి. వాటిలోని వచనం తీరు ఈ కింద రకాలుగా ఉంటుంది
   1. సంవాదాత్మకం 2. విమర్శనాత్మకం 3. వర్ణనాత్మకం 4. నాటకీయం 5. లేఖా రూపం 6. కథాత్మకం 7. ఉపన్యాసాత్మకం 8. తాత్త్వికం 9. వైజ్ఞానికం 10. వ్యంగ్యాత్మకం.
2. రచనలో భాషను వాడుకునే శక్తినీ, నేర్పునూ, ప్రత్యేకతనూ, శైలి అంటారు. భాష ముడి పదార్థం. శైలి ముడి పదార్థానికి ఇచ్చిన రూపం— శిల్పి రాతిని ఉలులతో పెచ్చులు తీస్తూ ఒక బొమ్మగా చెక్కినట్లు.
3. రచనలో గమనించదగిన అంశాలు చాలా ఉన్నాయి.
4. శైలిని మూడు ప్రమాణాలు రూపొందిస్తాయి. వాటిలో పదాల కూర్పు ఒకటి.
5. వాడుకలో లేని పదాలూ, సందర్భశుద్ధి లేని పదాలూ శైలిని దెబ్బతీస్తాయి. దానితో చెప్పదల్చుకున్న విషయం పాఠకునికి చేరదు.
6. ఆధునిక వచన శైలిలో పదాల కూర్పు సూటిగా, స్పష్టంగా, నిరాడంబరంగా, సంగ్రహంగా ఉండాలి దీర్ఘ సమాస రచన ఆధునిక రచనా సంస్కారానికి తగదు.

BRAOU

ఖండిక **13** పాఠం **23**

# శైలిలో వాక్యాల కూర్పు

**ఉద్దేశం**

తెలుగు రచనలో వాక్య నిర్మాణ ప్రయోగాల దృష్ట్యా కనిపించే శైలీ భేదాలను పరిచయం చెయ్యటం. మంచి వచనం రాయటానికి ఈ శైలీ భేదాలను గుర్తించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పటం.

ప్రణాళిక

1. మాట్లాడే భాషలో శైలీ భేదాలు
2. ప్రాచీన సాహిత్యంతో శైలీ భేదాలు
3. పూర్వపు పాఠాలలో సూచించిన శైలీ భేదాలు
4. కొన్ని పద్ధతుల పరిచయం
5. మరికొన్ని పద్ధతుల సూచన

## శైలిలో వాక్యాల కూర్పు

భాషను ప్రయోగించే పద్ధతిని శైలి అంటారు. ఒక్కో వ్యవహర్తకు ఒక్కోతీరు, కొన్ని ఊతపదాల వాడుక, ఒకరకమైన ఎత్తుగడ ఉంటాయి. ఇవన్నీ కలిపి అతని శైలి అవుతుంది. కొంతమంది ప్రతిమాటకీ ఒక సామెత వాడేసి మాట్లాడే వాళ్ళున్నారు. కొంతమందికి **"అన్నమాట"**, **"అన్నట్టు"** అని వాక్యం చివర సంధించటం అలవాటు. కొంతమందికి **"అప్పుడేమో,"** **"మరేమో"** అని ప్రతి మాటకీ **ఏమో** శబ్దాన్ని సంధించటం అలవాటు. పల్లెటూరి భాషలో మరికొన్ని రకాల ఊతపదాలూ, బూతులూ భాషలో అలవాటుగా దొర్లుతాయి. ఇవన్నీ అయా వ్యక్తుల భాషా శైలీభేదాలుగానే గుర్తించాలి. ఈ శైలీ భేదాలను శాస్త్రజ్ఞులు భిన్న పద్ధతుల్లో విశ్లేషించి చూపించారు.

మాట్లాడే భాషలో లాగానే రాసే భాషలోనూ, శైలీభేదాలు ఉంటాయి. అవి పదాల్లోనూ, పదబంధాల్లోనూ, వాక్య వాక్యాంశాల్లోనూ, వాటి ప్రయోగ క్రమంలోనూ ఉంటాయి. వీటిని సాహిత్యంలో గుర్తించారు. కవిత్వంలో నన్నయ అక్షర రమ్యత, తిక్కన నాటకీయత, శ్రీనాధుని ప్రౌఢ పదగుంఫనం, పోతన శబ్దాలంకార ప్రియత్వం, అల్లసానివారి అల్లిక జిగిబిగి, వసుచరిత్రకారుని శ్లేషప్రౌఢి, కృష్ణశాస్త్రిగారి లలిత లలిత పదవిన్యాసం, శ్రీశ్రీగారి వార్షుకాభ్రముల ప్రళయఘోష లాంటి శబ్దఘోష - ఇవన్నీ శైలీభేదాల్ని సూచించే వర్ణనలే.

ఈ కోర్సులో మన ప్రధాన గమ్యం తెలుగుభాషా శక్తిని గ్రహించి వచన రచనలో ప్రయోగించటం. రచనాభాషే (రాసేభాషే) ప్రధాన లక్ష్యం.

వచన రచనలో శైలిని గురించి **పూర్వపు** పాఠాలలో తొలినుంచీ కొంత పరిచయం **చేస్తూ** వచ్చాము. చాలాపాఠాలకు చదివే అభ్యాసంలో ఆధునిక వచన రచనల్లోని కొన్నిముఖ్యభాగాలను ప్రవేశపెట్టాము. ఆ భాగాలలో వచనశైలిని గురించి కొన్ని విషయాలు మీ దృష్టికి తెచ్చాము.

ఉదాహరణకు మొదట పుప్పల లక్ష్మణరావుగారి 'బతుకు **పుస్తకం**'లో నుంచి కొంతభాగం చదివారు. అది ప్రధానంగా జీవిత చరిత్ర కావటం వల్ల అందులో మీకు కనిపించేది కథనశైలి. జరిగిన సంఘటనలను ఆ వరసలో చెప్పుకుపోయే శైలి పద్ధతి కథన**శైలి.** ఆ తరవాత ఇంగ్లీషు, తెలుగు కలగలిపిన **హాస్యశైలి** పురాణం సీతగారి **'ఇల్లాలి ముచ్చట్లు'** లోది. వీరేశలింగం గారిని గురించి. రాజ్యలక్ష్మమ్మగారిని గురించి దేవుల కృష్ణశాస్త్రిగారి వ్యాసాలు రెండు చదివారు. ఆయన శైలిలో కాల్పనికత, ఆత్మీయత, ఆవేశం కనిపిస్తున్నాయని

ఉదాహరించాము. మునిమాణిక్యంగారి ఉత్తరంలో మనకంటె కొంచెం ముందటికాలపు సాంప్రదాయక కుటుంబాల్లో ఉత్తరం రాసేటపుడు వాడే శైలి చూశారు. అట్లాగే కుటుంబాల్లో వ్యవహరించే సంభాషణశైలి చదివారు. నాయని కృష్ణకుమారి గారి 'కాశ్మీర దీపకళిక'లో సాంప్రదాయకమైన నమ్మకాలు.కాల్పనికత కలకలిసిన శైలి చూశారు. విశదమైన, స్పష్టమైన, మొహమాటంలేని సూటి వాక్యాలతో కూర్చిన పదునైనశైలిని రంగనాయకమ్మగారి 'సినిమాల్లో స్త్రీ పాత్రలు' అనే వ్యాసంలో చూశారు. ఆవేశంతో కూడిన ఆవేదన వ్యక్తమయిన శైలి నార్ల వేంకటేశ్వరరావుగారి "దుష్టగ్రహకూటమి" అనే సంపాదకీయ వ్యాసంలో చూశారు. గోరాశాస్త్రిగారి 'పత్రికారచనతో అనుభవాలు జ్ఞాపకాలు' అనే వ్యాసంలో సూటిగా చురుగ్గా ఉన్న వాక్యశైలిని చూశారు. రంగనాయకమ్మగారి రచనలో వెక్కిరింపుతో వచ్చిన హాస్యం, గోరాశాస్త్రిగారి రచనలో ప్రతి సమాధానాల్లో (రిపార్టీ) వచ్చిన హాస్యం మీరు గమనించే ఉంటారు. నిత్య జీవితంలో అమాయకపు సంభాషణలోంచి వచ్చిన హాస్యం రాచకొండ విశ్వనాథశాస్త్రిగారి కథ 'మోసం'లో చూశారు.

రాసే భాషలో శైలి ప్రధానంగా పదప్రయోగం మీదా ఆధారపడి ఉంటుంది. ఈ రెండింటినీ ఒక్కోసారి విడదీయటం కష్టమైనా, అధ్యయన సౌలభ్యం కోసం పాఠాల్లో వేరుచేశాము. కిందటి పాఠంలో పదప్రయోగ మూలకమైన శైలీభేదాలు చూశారు. ఈ పాఠంలో వాక్యాల కూర్పు శైలీభేదాలను ఎట్లా సృష్టించగలదో తెలుసుకుంటారు. తెలుగులో సాధ్యమైనవన్నీ ఈ పాఠంలో చెప్పటానికి వీలులేకపోయినా కొన్ని ముఖ్యమైన పద్ధతులను పరిచయం చేస్తాము. ఒకసారి కొన్ని పద్ధతులను పరిచయం చేసిన తరువాత మిగతా పద్ధతులు మీరే గమనించగలుగుతారు.

## 1. విషయం : వ్యాఖ్య

వాక్యం కొంత విషయాన్ని (information) తెలియపరుస్తుంది. అదే వాక్యంలో ఆ విషయంమీద వ్యాఖ్య జోడిస్తే ఆ వాక్యంలో విషయం - వ్యాఖ్య రెండూ ఉన్నట్టు. ఉదాహరణకు శ్రీశ్రీగారి ఈ కింది వాక్యం చూడండి:

BRAOU

"మన రాజ్యాంగంలో పౌరహక్కుల్ని ఇంకేదేశమూ ప్రజలకియ్యలేదనడం *అతిశయోక్తికాదు.*"

"*మన రాజ్యాంగంలో పౌరహక్కుల్ని ఇంకేదేశమూ ప్రజలకియ్యలేదు*"-అనేది విషయాన్ని వ్యక్తం చేసే వాక్యభాగం. *అతిశయోక్తి కాదు* అనేది వ్యాఖ్య. *అనడం* అనేది పైరెంటినీ కలిపేమాట.

ఒట్టి విషయ వ్యక్తీకరణతో తృప్తిపడక దానిమీద వ్యాఖ్యకూడా చేర్చటం సంపాదకీయశైలితో అవసరం రావచ్చు. ఉదాహరణకు ఆంధ్రపత్రిక 1984 ఫిబ్రవరి 15 నాటి దినపత్రిక సంపాదకీయంలో ఈ వాక్యాలున్నాయి:

అ. ఆయన కార్మిక నాయకులలో కూడ ప్రథముడని ఈ సందర్భంలో జ్ఞాపకం చేసుకోవటం *సముచితంగా ఉంటుంది.*

ఆ. కాంగ్రెసుకు చెందనివారు సయితం త్యాగాలు చేశారని *ఈ తరుణంలో మరోసారి గుర్తుచేసుకోవచ్చు.*

ఇ. ఆయన అనుకున్నట్లు కాకపోయినా కాంగ్రెసు నామరూపంగా మిగిలి నిజానికి నశించిపోయిందంటే *సత్యదూరం కాదు.*

ఈ. రాజకీయవాదులలో ఎక్కువమంది తమ త్యాగాల ద్వారా, ప్రజలకి చేసిన సేవద్వారా కాకుండా ధనబలంతో సాధ్యం అయిన ప్రచారం వగయిరాల ద్వారా ఎన్నికలలో గెలవ గలుగుతున్నారంటే *అంగీకరించని వారుండరు.*

పైన ఏటవాలు అచ్చులో కనిపించే భాగం వ్యాఖ్య. ఈ వాక్యాలలో చాలాసార్లు *అంటే, అనటంలో* అనే విధంగా ఒకపదం విషయాన్నీ, వ్యాఖ్యనూ కలుపుతుంది. అప్పుడు రచయిత విషయాన్ని, తాను వ్యక్తీకరించిన

పద్ధతిని సమర్థించుకోవటం కోసం వ్యాఖ్యానిస్తున్నట్లు గుర్తించగలము. అట్లాంటిది లేనప్పుడు, ప్రత్యక్షంగా ఆ వాక్యం చెప్పే విషయం మీద వ్యాఖ్యగా గుర్తించగలము. ఈ రకమైన వ్యాఖ్యలూ, సమర్థింపులూ చాలా తరచుగా ఒక వ్యాసంలో వాడితే రచనలో మొహమాటం పెరుగుతుంది. శైలి మందకొడిగా తయారవుతుంది.

ఉదాహరణకు రాచమల్లు రామచంద్రారెడ్డిగారి శైలి నిర్మొహమాటమైన చురుకైన శైలి. ఒక సంపాదకీయంలో ఆయన వాక్యాలు చూడండి:

"ఉత్తమ సాహిత్యానికి జన్మస్థానం సమాజ జీవితమైనట్లే దాని గమ్యస్థానం కూడా సమాజ జీవితమే"

ఈ వాక్యం చివర "...అని నాకనిపిస్తుంది", "...అనటంలో అతిశయోక్తిలేదు", "...అనుకోటం సమంజసమే" వంటి వ్యాఖ్యాప్రాయమైన సమర్థనలు చేర్చి చూడండి. ఆ శైలిలో ఉన్న చురుకుదనం తగ్గుతుంది. మొహమాటం పెరుగుతుంది.

అయితే ఈ రకపు వాక్యాలను గడుసుదనం నింపి వాడుకున్నారు రాచకొండ విశ్వనాథశాస్త్రిగారు.

"మానవులంటూ ఉండటంవల్లనే వారు సంఘజీవులుగా ఉండటం చేతనే, కథలంటూ పుట్టాయని నేననుకొంటున్నాను". ఈ పై వాక్యంలో వ్యాఖ్యతను సత్యమని నమ్మినదాన్ని చెప్పుతూ, 'నేననుకొంటున్నాను' అని చేర్చటం కేవలం గడుసుదనం కోసమే. అంటే ఆ వ్యాఖ్య చేర్చకపోయినా దాన్ని(అంటే truth value ని) శంకించే వీలులేదు. అయినా ఆ వ్యాఖ్య చేర్చటం వల్ల ఇది కేవలం నా అభిప్రాయం మాత్రమే సుమా అని చెపుతున్నట్లు పైకి కనిపిస్తుంది. కాని అసలు ఉద్దేశం ఇది శంకించటానికి వీలులేని చారిత్రక సత్యం అని అసలు అభిప్రాయం.

## 2. ప్రశ్నల కూర్పు

ప్రశ్నల ప్రధానోద్దేశం అవతలి వ్యక్తినుంచి సమాధానాలు రాబట్టటం. అయితే ఒక్కోసారి నిశ్చయంగా చెప్పే అభిప్రాయాన్నే ప్రశ్నరూపంలో చెపుతాము. అప్పుడా ప్రశ్నకు సమాధానాన్ని ఆశించము. ఈ రకమైన కూర్పు ద్వారా రచయిత ఉద్వేగాన్ని వ్యక్తం చెయ్యవచ్చు.

BRAOU

రాచకొండ విశ్వనాథశాస్త్రిగారు ఈకింది వచనభాగంలో ప్రశ్నావాక్యాలను పేర్చిన పద్ధతిని గమనించండి:

"...దగేక ఆయన ఆ రావణుణ్ని అడిగిందేమిటి? రావణాసురుణ్ని మానం ప్రాణం ఇచ్చేయమన్నాడా? అతగాడి రాజ్యం అడిగాడా? అతగాడి అంతఃపురంలోని ఆడవాళ్ళ్ని ఇమ్మని అడిగాడా? దేశంలోని ధాన్యరాసులన్నీ ఇచ్చి తీరాలన్నాడా? బొక్కసంలోని బంగారం అంతా ఇచ్చేస్తేకానీ వీల్లేదన్నాడా"

ఈ ప్రశ్నలకన్నిటికీ సమాధానం 'లేదు' అనేది పాఠకులకు తెలిసిందే. అయితే పాఠకుల్లో ప్రత్యేకమైన ముద్ర కలిగించటం కోసం రచయితలు ఈ రకం వాక్యాల పరంపర వాడతారు. అట్లాగే నిఘంటువుల పాఠం చివర ఇచ్చిన అభ్యాసంలో కృష్ణశాస్త్రిగారు ఈ రకం ప్రశ్నావాక్యాలను వాడి ఆవేశాన్ని వ్యక్తం చేసిన తీరును ప్రదర్శించాము. 10 వ ఖండిక, 16 వ పాఠం కిచ్చిన అభ్యాసంలో నార్ల వెంకటేశ్వరరావుగారి సంపాదకీయంలో ఈ వాక్యాలున్నాయి:

"వైజ్ఞానిక శాస్త్రాలు ఎంతగా పురోగమిస్తేనేమి? ఎన్నెన్ని సృష్టి రహస్యాలను సభ్య మానవుడు ఛేదిస్తేనేమి? చంద్రమండల యాత్రకై సన్నాహాలు సాగుతుంటే మాత్రమేమి? అంగారక గ్రహంలో అడుగు పెట్టటం సుసాధ్యమైన సమయం ఆసన్నమయితే మాత్రమేమి? పాత పంచాంగాలనే ప్రామాణిక శాస్త్రాలుగా పరిగణించే వారున్నారు!......"

ఈ రకంగా ప్రశ్నార్థక వాక్యాలు వరసగా గుప్పించటానికి ఉద్వేగానికి సంబంధం గుర్తించగలము. రచయితలు చాలా తరచుగా వాడుకునే పద్ధతి ఇది. అయితే వీటిని వాడుకోవటంలో సంయమనం లేకపోతే ఒక రకమైన విసుగు పుడుతుంది.

## 3. ఒకేరకపు వాక్య, వాక్యాంశాల పేర్పు

రచయిత ఆవేశాన్ని వ్యక్తీకరిస్తూ రచనకు ఉద్వేగాన్ని చేకూర్చే పద్ధతి, ఒకే రకపు వాక్యాంశాల్నికాని,

క్రమంగా వాడటం. ఈ వాక్యాల మధ్య సాధారణంగా తూగు (balance) ఉంటుంది. ఉదాహరణకు చలంగారి వాక్యాల పేర్పును చూడండి:

"వీళ్ళందరి అధ్యక్షుడూ మీ దేవుడు, మీ డబ్బుకి దాసుడు, మీ సంగిపూజలకీ స్వార్థ ప్రార్థనలకీ వశ్యుడు. దొంగభక్త పరాధీనుడు"

అట్లాగే అదే ఖండికలో ఇంకోచోట చూడండి.

"ఇన్ని బాంబులు కురుస్తున్నా, ఇన్ని మరఫిరంగులు మోగుతున్నా, ఇన్ని చెరసాలలు నిండుతున్నా, ఇంకా విశదం కాలేదా మీకు-పాత పద్ధతులు, విశ్వాసాలు, ధర్మాలు ఓ మూలనించి కూలిపోతున్నాయని, ఇంక లాభంలేదని, మీ ఆటలు ఇంక సాగవని"

**4. పద, పదబంధాలు గుప్పించటం**

పైన చూపించిన దానితో సమానమయినదే ఇది. అయితే ఈ పద్ధతిలో పదాలు, పదబంధాలు అర్థ సాన్నిహిత్యం ఉన్నటువంటిని ఎక్కువ వాడటంవల్ల రచనకు వేగం వస్తుంది. పదబంధాలకు సాధారణంగా వ్యాకరణ సామ్యం ఉంటుంది. ఈ రకపు పద్ధతి చలంగారి రచనలో సర్వసాధారణం. ఆయనకు ఈ పద్ధతి ఇష్టమైనదిగా కనిపిస్తుంది. ఈ కింద ఇచ్చే ఉదాహరణలవల్ల ఈ విషయం స్పష్టంగా గమనించగలం. ఈ ఉదాహరణలన్నీ శ్రీశ్రీగారి మహాప్రస్థానానికి చలంగారు రాసిన యోగ్యతాపత్రం నుంచి తీసుకున్నవే. దీన్నిబట్టి చలంగారికి ఈ రకపు శైలి ఎంత ఇష్టమో తెలుస్తుంది.

అ. "సులభంగా, సూటిగా చెప్పేసి ఇంతధ్యానానికీ, మౌనానికీ, కార్యాలకీ, విజయాలకీ వ్యవధి ఇవ్వరాదా? అని చలం కోర్కె"

ఆ. "ఆ పని స్త్రీలూ చెయ్యరు, దేశనాయకులూ చెయ్యరు, కవులూ చెయ్యరు-ఎంకీ, శ్రీశ్రీ తప్ప"

ఇ. "అబద్ధాలతో స్తోత్రాలతో, వంచనలతో, అనుకూల దుష్ప్రచారంతో, ఆత్మశ్లాఘనలతో దేశంమీద పడి బతుకుతున్న ఈ parasite కవివరేణ్యులు శ్రీశ్రీని విమర్శించడానికి సాహసిస్తున్నారు"

ఈ. "తెలుగు కవిత్వాన్ని ఖండించి, దీవించి, ఊగించి, శాసించి రక్షించే అపూర్వశక్తి మీ చేతిలో పుస్తకం"

ఉ. "పాతపదాలూ, డిక్షన్, వర్ణనలు, అలంకారాలు, ఛందస్సు, ఉపమానాలు, పద్ధతులు, ఆచారాలు, కవిత్వంలోవీ, జీవితంలోవీ, ఇంక మళ్ళీ లేవకుండా వాటి నడ్డి విరక్కొట్టాడు శ్రీశ్రీ."

పై వాక్యాల్లో కీ, తో, అనే ప్రత్యయంతో వచ్చే పదబంధాల ఆధిక్యాన్ని, వాటి మధ్యనుండే అర్థ (భావ) సామ్యాన్ని గుర్తించే ఉంటారు. అట్లాగే 'ఈ' లో ఇ తో అంతమయ్యే 'ఖండించి, దీవించి, ఊగించి, శాసించి' అనే క్రియల మధ్యఉన్న ధ్వని, అర్థ, రూప సామ్యాలు గుర్తించదగినవి. వీటివల్ల రచనకు సమకూరిన వేగం స్పష్టంగా గుర్తించగలం.

ఈ రకంగా పదాలు, పదబంధాలు ఒక క్రమంతో గుప్పించటం చలంగారి శైలిలో ఎక్కువ కనిపిస్తుంది.

**5. రచయిత తానుగా కాక ఇంకొకరుగా చెప్పటం**

తెలుగు రచయితల్లో ఈ ధోరణి చలంగారిలోనే ఎక్కువగా కనిపిస్తుంది. ఉదాహరణకి పై యోగ్యతా పత్రంలోనే ఇట్లా రాశారు.

"తన కవిత్వానికి ముందుమాట వ్రాయమని శ్రీశ్రీ అడిగితే కవిత్వాన్ని తూచే రాళ్ళు తన దగ్గర లేవన్నాడు చలం. తూచవద్దు. అనుభవించి పలవరించమన్నాడు శ్రీశ్రీ.

చలం చూశాడు. మాట్లాడాడు. కాని శ్రీశ్రీని ఎరగడు."

ఈ రకపు వాక్యాలు 'యోగ్యతాపత్రం'లో ఇంకా ఉన్నాయి.

BRAOU

ఒక రచయిత తానే రాసేటప్పుడు 'నేను', 'నా' అని ఉత్తమ పురుష వాడటం సాధారణం. అసాధారణత కోసం రచయితలు ప్రథమ పురుష వాడవచ్చు.

మహాభారతావతారికలో నన్నయ్యగారు 'తనకిష్టుడు' అని నారాయణభట్టు గురించి చెప్పారు. "నన్నయ్య భట్టు దక్షతన్" అని ఎవరో చెపుతున్నట్టుగా రాశారు. అయితే ఈ రకపు అలవాటు ఇటీవల ఇంగ్లీషు నుంచే ఎక్కువగా తెలుగు వచనానికి పాకినట్టుంది. విషయ ప్రాధాన్య వ్యక్తీకరణకోసం (objectivity కోసం) ఉత్తమ పురుష బదులు ప్రథమ పురుష వాడటం ఇంగ్లీషులో ఉంది. అదే నేడు తెలుగులో పాకినట్టు కనిపిస్తుంది.

విజ్ఞాన సంబంధమైన, శాస్త్రసంబంధమైన పరిశోధక వ్యాసాల్లో ఈ సంప్రదాయం ఇంగ్లీషులో ఉంది. తెలుగులోకి ఈ సంప్రదాయం ఇంగ్లీషునుంచే వచ్చి ఉండాలి. పరిశోధక వ్యాసం కాకుండా ఆవేశంతో, ఉద్వేగంతో రాసినప్పుడు కూడా ఈ పద్ధతిని వాడటం ఇక్కడ విశేషం. ఇట్లా ఉద్వేగవంత (emotional) రచనల్లో రచయిత 'నేను' అని వాడకుండా ప్రథమ పురుష (Ist person) వాడటం చాలా అరుదు. చలంగారు కాక ఇతరులెవరూ ప్రయోగించినట్టు దాఖలా లేదు.

## 6. కుండలీకరణ పద్ధతి

ఒక విషయాన్ని చెపుతూ దానితో అంత సన్నిహిత సంబంధంలేని విషయాన్ని చెప్పాల్సివచ్చినపుడు ప్రధాన విషయంతో సంబంధంలేని విషయాన్ని కుండలీకరణాల్లో ఉంచటం ఇటీవల సంప్రదాయం. కుండలీకరణాలు (brackets) మాట్లాడే భాషలో ఉండవు. అంటే కుండలీకరణ పద్ధతి పూర్తిగా లిఖిత భాషాపద్ధతిగా గ్రహించాలి.

కుండలీకరణ పద్ధతి రెండు ప్రధాన ప్రయోజనాలకు ఉపయోగపడుతున్నది. ఒకటి చెప్పిన విషయాన్ని ఇంకా వివరించటానికి రెండు. ప్రధాన విషయానికి ప్రత్యక్ష సంబంధంలేదని చెప్పటానికి.

BRAOU

చలంగారి ఈ వాక్యం చూడండి:

"ఇది మహాప్రస్థానం సంగతికాదు. ఇదంతా చలం గొడవ. ఇష్టం లేనివాళ్ళు యీ పేజీలు తిప్పేసి (దీంటో మీ సెర్పుని ఉద్రేకించే సంగతులు ఏమీలేవు) శ్రీశ్రీ అర్ణవంలో పడండి"

చలంగారు ఒక సమాజంఅంగీకరించనికాలంలో స్త్రీ పురుష సంబంధాల్ని సమర్థిస్తూ కథలూ,నవలలూ రచించారు. ఆకాలపు(సుమారు 1935-1950) మధ్యతరగతి విలువలను భంగపరిచేవిగా ఆ రచనలుండేవి. ఆ విషయం ఈ కుండలీకరణంలో ఉంచిన వాక్యంలో సూచన ప్రాయంగా ప్రస్తావించ బడింది. ఆ వాక్యం లేకపోయినా చెప్పదల్చుకున్న అసలు విషయాన్ని గ్రహించటానికి ఆటంకంలేదు. అయితే ఈ విషయం ఇంకాస్త పెరుగుతుంది.

రాచమల్లు రామచంద్రారెడ్డిగారు ఈ వాక్యాల్లో కుండలీకరణాలు వివరణకోసం వాడారు.

"టాగూర్ భగవంతుణ్ని సౌందర్యమూర్తి (సుందరమయిన మూర్తికాదు-సౌందర్యమే మూర్తి అయిన వాడు) గా భావించుకొని ఆ భగవంతుణ్నే సౌందర్య వాదంలోకి లాక్కొచ్చినాడు."

"భావ కవిత్వమంటే ప్రేమకవిత్వమనే పరిమితమయిన అర్థంలో కాక, లలితమైన కవిత్వం అనే విస్తృతార్థంలో తిలక్‌కు అన్వయించుకోవలసి వుంటుంది. (అనగా ఇంగ్లీషులోని lyrical Poetryకి పర్యాయ పదంగా)."

ఈ పద్ధతి కవిత్వంలో కూడా ఎక్కింది. ఇంగ్లీషులో E. E. Cummings అనే ఆయన ఈ పద్ధతి బాగా వాడుకున్నాడు. శ్రీశ్రీ కవిత్వంలో ఈ కుండలీకరణ పద్ధతి తరచుగానే కనిపిస్తుంది. కమింగ్స్ రాసిన పద్యానికి శ్రీశ్రీ చేసిన ఈ అనువాద భాగాన్ని చూడండి.

ప్లేట్లో చెప్పాడు
వాడికి; (విన్నాడు

చెప్పేడు వాడికి;
(నమ్మేడుకాడు

ద్వే తప్పకుండా
చెప్పేడు : జనరల్

| | | |
|---|---|---|
| కాదు నమ్మేడు | వాడు విన్నాడు | (చిత్రం శ్రీమతి) |
| కాదు) జీసస్ | కాదు) లావ్ | షెర్మనీ చెప్పేడు |
| | | .............. |

**7. డాష్ పద్ధతి**

ఇదికూడా కుండలీకరణ పద్ధతి లాంటిది. చెప్పదల్చుకున్న విషయంలో భాగం చెప్పిన వాక్యంతో మర్చిపోయినట్టుగా చివర చేర్చటానికి ఈ డాష్ పద్ధతి వినియోగిస్తారు. రాచమల్లు రామచంద్రారెడ్డిగారి ఈ వాక్యం చూడండి:

"కొంతవరకు రొమాంటిక్ కవులందరినీ అనుభూతివాదులే అనవచ్చు—వాళ్ళలో వివిధ దశలు లేక పోయినా."

అట్లాగే రంగనాయకమ్మగారి వాక్యాలు చూడండి:

"చాలాసార్లు దీన్ని నిజంగానే నమ్ముతాం కూడా—సైన్సు విజ్ఞానం తగినంతగా లేక.

"సినిమా అన్నదాంట్లో (అది ఏరకం సినిమా అయినా)—కథ అనేది ఎప్పుడూ హీరోని గొప్పచేసే పద్ధతిలోనే నడుస్తూ వుంటుంది - అతను ముప్పైఏళ్ళ వయసులో మెట్రిక్ పాసయినా సరే"

డాష్ తరవాత ఇచ్చిన వాక్యాంశం అసలు వాక్యంలోనే ఇమడ్చవచ్చు. కాని ఆ అంశానికి ప్రాధాన్యం ఇయ్యటం కోసం ఇట్లా ఇవతలికి లాగి వేరుచేసి చూపిస్తాం.

పెద్ద పెద్ద వాక్యాల వాడకం వల్ల ఒక శైలి; చిన్న చిన్న వాక్యాల వాడకం వల్ల ఇంకో శైలి; సంబోధనల వల్ల, సంభాషణలవల్ల మరోరకం శైలి ఏర్పడతాయి. కొన్నిరకాల వాక్యాలు ఎక్కువగా వాడటంవల్లకూడా శైలీ భేదాలు ఏర్పడుతాయి. ఇట్లా వాక్యాల కూర్పువల్ల రకరకాల శైలీ భేదాలను కల్పించుకోవచ్చు. భాషా శక్తిని గ్రహించి ప్రయోగిస్తే ఎన్నో భేదాలు సాధించుకోవచ్చు. అవి రచనకు వైవిధ్యాన్ని (Variety) సమకూరుస్తాయి, చదివే వారిలో ఆసక్తిని పెంచుతాయి. మంచి వచనం రాయాలనుకునేవారు ఈ శైలీ భేదాలను, ప్రయోజనాలను గుర్తుంచుకోవాలి.

BRAOU

**ముఖ్యవిషయ క్రోడీకరణ**

ఈ పాఠంలో మీరు ఈ కింది విషయాలు నేర్చుకొన్నారు

1. భాషను ప్రయోగించటంలో భేదాలుంటాయి. ఈ భేదాలను శైలీభేదాలు అంటారు.

2. మాట్లాడే భాషలోనూ శైలీభేదాలుంటాయి.

3. సాహిత్యంలో శైలీభేదాలను గుర్తించారు.

4. రాసే భాషలో శైలి ప్రధానంగా పద ప్రయోగం మీదా, వాక్యప్రయోగం మీదా ఆధారపడి ఉంటుంది.

5. విషయాన్ని దానిమీద వ్యాఖ్యను ఒకే వాక్యంలో చెప్పవచ్చు. ఈ రకపు వాక్యాలు దినపత్రిక సంపాదకీయాల్లో అవసరం అవుతాయి. ఈ వాక్యాలను జాగ్రత్తగా ప్రయోగించకపోతే శైలి మందకొడిగా ఉండే ప్రమాదం ఉంది.

6. సమాధానాలను ఆశించని ప్రశ్నలను వరసగా కూర్చటం వల్ల రచయిత ఆవేశాన్ని వ్యక్తం చెయ్యవచ్చు.

7. ఒకే రకపు వాక్య వాక్యాంశాల పేర్పు వల్ల రచనకు తూగు (balance) వస్తుంది.

8. ఏదో విధమైన ఏకత్వం ఉన్న పదాలూ, పదబంధాలూ గుప్పించటం వల్ల రచనకు వేగం వస్తుంది.

9. రచయిత తనను ప్రథమ పురుషలో పరిచయం చేసుకోవటంలో ఒక వైచిత్రి వస్తుంది. పరిశోధక వ్యాసాల్లో ఈ శైలి వస్తు ప్రాధాన్యతను (objectivity) సూచిస్తుంది.

10. చెప్పిన విషయాన్ని వివరించటానికి, లేక భిన్న విషయాన్ని చేర్చటానికి కుండలీకరణ పద్ధతి పనికొస్తుంది.

11. వాక్యంలో ఒక భాగానికి అధిక ప్రాధాన్యం చూపించదల్చుకున్నప్పుడు ఆ భాగాన్ని బయటకు లాగి డాష్ గుర్తుతో సూచిస్తారు.

12. ఇంకా అనేకానేక పద్ధతుల ద్వారా శైలీ భేదాలను చూపించి రచనకు వైవిధ్యాన్ని కూర్చవచ్చు.

## అభ్యాసం (చదివేపని)

పదమూడవ ఖండికలోని రెండు పాఠాలకు అనుబంధంగా చదివే పనికింద శ్రీశ్రీ మహాప్రస్థానానికి రాసిన చలం పీఠిక "యోగ్యతాపత్రం" ఇస్తున్నాము.

చలం పూర్తిపేరు గుడిపాటి వెంకటచలం (1894-1979). కందుకూరి, గురజాడల తర్వాత స్త్రీ విమోచన కోసం కాల్పనిక విప్లవోద్వేగంతో కలం పట్టిన ఒంటరి యోధుడు. వైవాహిక ధర్మాల అమానుషత్వం నుంచీ, కుల, మత నీచ సంస్కారాల నుంచీ స్త్రీ పురుష ప్రేమకు విముక్తి కోరిన రచయిత. జలపాతంలాంటి వచనశైలి ఆయనది. తన రచనావస్తువును మెచ్చుకోకుండా, రచనా విధానాన్ని పొగిడిన వాళ్ళంటే ఆయనకు మంట. దీన్నిబట్టి ఆయన వస్తువులో శైలి విడదీయరాని భాగమనీ, ఆ వస్తువు ఆయన వ్యక్తిత్వం నుంచీ పుట్టినదనీ తెలుస్తుంది. తెలుగు సాహిత్యంలో చలం ఒంటరి యోధుడే అయినా ఒక అపూర్వమైన సాహిత్యశక్తి. ఆయన రచనల్లో ముఖ్యమైనవి : మైదానం, బ్రాహ్మణీకం, అరుణ, అమీనా (నవలలు) ఓ పువ్వుపూసింది, స్టేషన్ పంపు, ఆ రాత్రి (కథల సంపుటాలు), పురూరవ, ఊర్వశి, చిత్రాంగి, యముడి ముందు చలం (నాటకాలు, నాటికలు), మ్యూజింగ్స్, ప్రేమలేఖలు ఆనందం, విషాదం (వ్యాసాలు). (తొలి రోజుల్లో చెలం అనీ, తర్వాత చలం అనీ చలం సంతకం చేసేవాడు).

### యోగ్యతాపత్రం

౧

ఇది మహాప్రస్థానం సంగతి కాదు. ఇదంతా చెలం గొడవ. ఇష్టంలేనివాళ్ళు యీ పేజీలు తిప్పేసి (దీంట్లో మీ సెక్సుని ఉద్రేకించే సంగతులు ఏమి లేవు) శ్రీశ్రీ అర్ణవంలో పడండి. పదండి ముందుకు. అగాధంలోంచి పైలుదేరే నల్లని అలలు మొహానకొట్టి, ఉక్కిరి బిక్కిరై, తుఫానుహోరు చెవుల గింగురుమని, నమ్మిన కాళ్ళకింది భూమి దొలుచుకుపోతో వుంటే, ఆ చెలమే నయమని వెనక్కి పరిగెత్త చూస్తారు.

తన కవిత్వానికి ముందుమాట వ్రాయమని శ్రీశ్రీ అడిగితే, కవిత్వాన్ని తూచే రాళ్లు తన దగ్గర లేవన్నాడు చెలం. 'తూచవద్దు. అనుభవించి, పలవరించ' మన్నాడు శ్రీశ్రీ.

చెలం చూశాడు. మాట్లాడాడు. కాని శ్రీశ్రీని ఎరగడు. రుక్మిణీనాథశాస్త్రి ఒక ఉదయం వచ్చి—

"ఇదేమిటి, ఈ మూల స్త్రీలకోసం ఇట్లా మూలుగుతున్నారు? శ్రీశ్రీ పద్యాల వేగంతో ప్రపంచపు పాత దుమారమంతా వూడ్చుకు పోతోవుంటే!

"హృదయాల మీది పెంకులు పగిలిపోతున్నాయి. పైట వినబడుతున్నాయి. ఇట్లారండి. రోడ్డుమీదికి" అన్నాడు.

అంతవరకు శ్రీశ్రీ కవిత్వాన్ని ఎరక్కపోవడం చెలంలో క్షమించతగిన విషయంకాదు. కాని చాలా వాటికి క్షమించాలి చెలాన్ని.

కవిత్వాన్ని, ముఖ్యం తెలుగు కవిత్వ కన్యల్ని చూస్తే చెలానికి impatience, అనుమానం, శబ్ద సౌందర్యంతో తృప్తిపడి సంతోషించవలసిందేకాని, చెప్పేదానికి అర్థం వెదకడం అవివేకం అని. కాని నీరసపు కళాచతురుల మల్లే అందాన్ని దూరంనించి చూసి సంతోషించి, విచారించి తప్పుకోడం చెలానికి చాతకాదు. తను చెప్పదలచుకున్న సంగతి తనకే స్పష్టంగా తెలీనప్పుడు తన చాతగానితనాన్నీ, అర్థ అస్పష్టతనీ ఛందస్సు చీరల

వెనకా, అలంకారాలమధ్యా, కఠినపదాల బురఖాలలోనూ దాచి మోసగించాలని చూస్తాడు కవి—ముఖ్యం, సహజ సౌందర్యం తక్కువైనప్పుడు! సులభంగా, సూటిగా చెప్పేసి, ఇంత ధ్యానానికీ, మౌనానికీ, కార్యాలకీ, విజయాలకీ వ్యవధి నివ్వరాదా అని చెలం కోర్కి. ఆ పని స్త్రీలూ చెయ్యరు, దేశనాయకులూ చెయ్యరు, కవులూ చెయ్యరు—ఎంకీ, శ్రీశ్రీ తప్ప. కవిత్వంలోనూ, జీవితంలోనూ economy of words and thoughts లేకపోవడం దేశభక్తికన్న హీనమైన పాపం. ఆత్మలోకంలో దివాలా.

తనకీ, ప్రపంచానికీ సామరస్యం కుదిరిందాకా కవిచేసే అంతర్, బహిర్ యుద్ధరావమే కవిత్వమంటాడు చెలం. అందువల్లనే దిక్కుల్నీ, దేవుళ్ళీ, అధికారుల్నీ పూగించి ప్రశ్నించే శ్రీశ్రీ పద్యాలు అంత అభిమానం చెలానికి. నెత్తురూ, కన్నీళ్ళూ తడిపి కొత్త tonic తయారుచేశాడు శ్రీశ్రీ యీ వృద్ధ ప్రపంచానికి.

హృదయం ఎల్లా కంపిస్తే ఆ కంపనకి మాటల రూపాన్ని యివ్వడం అతనికే తెలుసు. మాటల్ని కత్తులూ, ఈటెలూ, మంటలుగా మార్చడం అతనికే చాతనవును. పద్యాలు చదువుతోవుంటే, ఇవి మాటలు కావు. అక్షరాలు కావు— ఉద్రేకాలు, బాధలు, యుద్ధాలు—అతని హృదయంలోంచి మన హృదయంలోకి direct గా పంపిన ఉత్సాహాలు, నెత్తురు కాలవలనిపిస్తుంది.

ఎందుకంటే—

క్రిష్ణశాస్త్రి తన బాధని అందరిలోనూ పలికిస్తే, శ్రీశ్రీ అందరి బాధనూ తనలో పలికిస్తాడు.

క్రిష్ణశాస్త్రి బాధ ప్రపంచానికి బాధ. ప్రపంచపు బాధ అంతా శ్రీశ్రీ బాధ.

౨

శ్రీశ్రీ కవిత్వము, పాల్‌రోబ్సన్ సంగీతమూ ఒకటేరకం అంటుంది సౌరిస్. ఆ రెంటికీ హద్దులూ, ఆజ్ఞలూలేవు. అప్పుడప్పుడు లక్షణాలనూ, రాగాలనూ మీరి చెవి కిర్రుమనేట్టు ఇద్దరూ అరుస్తారు. ఏమీ రసం లేకుండా flat గా ఎక్కడికో, ఏమీ చాతకాని వాళ్ళమల్లే జారిపోతారు. కాని ఆ అరుపుల్లో, చీకట్లో మొహాలూ, తోకలూ కనపడక వెతుక్కునే ప్రజల రొదా, గాలి దెబ్బలకింద ఎగిరిపడే సముద్రపు తుఫాను గర్జనం, మర ఫిరంగుల మరణధ్వానం గింగురుమంటాయి. కంఠం తగ్గించి వినపడనుండా తగ్గుస్థాయిలో మూలిగారా, దిక్కులేని దీనుల మూగవేదన, కాలికింద నలిగిన చీమల కాళ్ళువిరిగిన చప్పుడు, నీళ్ళులేక ఎండుతున్న గడ్డిపోచ ఆర్తనాదం వినిపింపచేస్తారు. బుద్ధివున్న వాడెవ్వడూ అతనిది సంగీతమని కాని, ఇతనిది కవిత్వమని కాని వొప్పుకోడు. వొప్పుకోవటమూ లేదు. ఎందుకంటే యీ యిద్దరి appeal బుద్ధిని, వివేకాన్ని, కళానిబంధనల్ని మించిన ఏ అంతరాళానికో తగులుతుంది— ఆ అంతరాళం అనేది వున్నవాళ్ళకి. కీర్తి మర్యాదల్నీ డిగ్రీలతో కొలుచుకుంటే అగచాట్లుపడి కులికే మనుషులకి ఆత్మ ఎన్నో మందపు ఇనప పొరల వెనుక అణగిచచ్చి, కొన వూపిరితో ఆరిపోలేక మిణుకు మిణుకుమంటో వుంటుంది. అటువంటి వాళ్ళకి ఉత్త అర్థంలేని న్యూసెన్సుగా తోస్తాయి శ్రీశ్రీ పద్యాలు. సొంత యిల్లూ, అణగారిన భార్యా, ప్రతి సంవత్సరం పై క్లాసులోకి వెళ్ళేకొడుకూ, bank account వొట్టిపోని ఆవుతో తృప్తిపడే సంసారుల శాంత హృదయాల మీదినుంచి యీ గీతాల్లోని ఉద్రేక ఉత్సాహాలు విశాఖపట్నం సముద్రంలో నల్లరాళ్ళమీద అలలు విఫలమైనట్టు దొర్లిపోతాయి. తాంబూలం వేసుకుంటో, పుస్తకాన్ని ముడిచిపెట్టి "దేనికోసం? ఎందుకు? ఏమిటి కావాలంటాడు? ఏమిటి ఈ వేదన పాపం?" అని కొంచెం ఆలోచిస్తారేమో!

ఇదీ సాధారణంగా కల్చెర్డు పీదర్సు సంగతి.

కవుల సంగతి వేరు. ఉత్తమ కవిత్వం ఎప్పుడు ప్రచురిత మవుతుందా అని వెయ్యికన్నులతో కనిపెడుతూ వుంటారు. కనపడ్డదా, ఆనాటి నుంచీ అతిశ్రద్ధగా ఆ కవిత్వాన్ని గురించీ, కవిని గురించీ ప్రచారం మొదలు. సారస్వత పోషకులతో, ఉచితులతో ఎట్లాగో ఓలాగు ఆ కొత్త కవిత్వాన్ని సంభాషణలోకి తీసుకొనివచ్చి వ్యక్తి, కాల, పరిస్థితులనుబట్టి చప్పరించడమూ—తమ కావ్యాలనించో ఇతర కావ్యాలనుంచో సంగ్రహించపడిన దనటమూ-విప్లవకారణమనడమూ-నిర్జీవ మనడమూ-కవినిగురించి చాలా Righteous Indignationతోనో, జాలిపడుతోనో, చాలా సానుభూతి, దయావున్నట్టు ప్రస్తావించడమూ వీళ్ళ టెక్నిక్.

BRAOU

"*శ్రీశ్రీ కవిత్వాన్ని గురించి మీ అభిప్రాయం చెప్పండి*" అని కవిని అడిగారా, అతను "దానికేం, చాలా బావుంటుంది, ఓ బాగా వ్రాస్తాడు. నేను అతన్నికూడా బాగా ఎరుగుదును. నా అభిప్రాయం ఏమిటంటే—" అన్నాడా, అతను చాలా సన్నిహిత ప్రియమిత్రుడన్నమాట కవికి. చిరునవ్వుతో శ్రీశ్రీ విషయమై మీ కళ్ళల్లో కారంకొట్టి పోతున్నాడు. పొగడ్తలతో మీ నోట్లో విషంకక్కి పోతున్నాడు. జాగ్రత్త!

శ్రీశ్రీ కవిత్వానికి Motive Springs చూపుతాడు ఆ మిత్రుడు. తప్పదు.

"ఆకలిపాట...కటిక దరిద్రుడు అతను—తిండిలేక వీధులు తిరిగాడు... పాపం" అంటో ప్రపంచపు సరి హద్దుల్ని పూరించాలని ప్రయత్నించే అతని హృదయోద్రేకాన్ని explain చేస్తాడు.

నిజమా? నిజమైతే శ్రీశ్రీ "ఆకలేసి" నక్షత్రాలు అదిరి చూసే "కేక లేశాడు."

ఈ కవికి ఆకలివేస్తే రా-గారి ఇంటికెళ్ళి శ్లాఘించి భత్యఖర్చు తెచ్చుకుని, భోజనం ప్రియురాలిమీద గీతం వ్రాసాడు.

అబద్ధాలతో, స్తోత్రాలతో, వంచనలలో, అనుకూల దుష్ప్రచారంతో, ఆత్మ శ్లాఘనలతో దేశం మీదపడి బతుకుతున్న యీ Parasite కవిపరేణ్యులు శ్రీశ్రీని విమర్శించడానికి సాహసిస్తున్నారు. 'అభివృద్ధికి రాతగిన వ్రాడవు' అని ఆకాశమంత ఎత్తుగావుండే అతని వీపు తట్ట చూస్తున్నారు.

ప్రపంచంలో ఈనాడు ప్రతిదేశంలోనూ నూతనయుగ నిర్మాణంకోసం ధర్మయుద్ధం చేసే ధీరులు ఈనాడు పడుతున్న ఘోరమైన ఆగచాట్లు చూస్తే, అనాదిగా తన కోసం ప్రయత్నించే dreamers మీద యీ లోకం వర్షిస్తున్న కర్కశత్వం వరించి ఆవేశించిన rotten channels యీ నాటి సారస్వత సభాపతులు.

తాము బతికివున్న కాలంలో పాతవాఙ్మయంమీద తిరగబడ్డ ఈబతికివున్నశవాలు ఈనాటికీ తాము ముప్ఫై యేళ్ళ కిందచేసిన తిరగుబాటు ఇతరుల ఖర్చుమీద కాఫీ యిడ్లీలముందు inspire ఐ ప్రగల్భాలు పలికే యీ రసికులు, తాము తెచ్చిన సంస్కారమే ఇంక సారస్వతానికి శాశ్వతావధి అని నిరూపించి, ఉప్పొంగి తెలుగు ప్రపంచాన్ని పావనం చెయ్యటానికి మీదికి ఉరికే భగీరథ ప్రవాహాల్ని ఊరి రబ్బిష్ చెత్తల కట్టలతో ఆపాలని ప్రయత్నిస్తున్నారు.

BRAOU

మద్రాసు బస్సుల గోలమధ్య ఓసారి "శ్రీశ్రీ, ఇప్పుడు వ్రాస్తున్న కొత్తతనాలకే ప్రజలు ఇంకా అలవాటు కాలేదే, ఇంకా యీ సర్రియలిజం తెస్తే అసలు గాబరాపడి చదవడమే మానేస్తారేమో!" అన్నాడు చెలం, man of little faith.

శ్రీశ్రీ ఏం జవాబు చెపితేనేం? మానవజాతిని ఉద్ధరించడానికి కొత్త మతాన్ని కనిపెట్టిన ప్రవక్తవలె చిరునవ్వు నవ్వాడు. తన వ్రాతలు అంగీకారాన్ని పొందేందుకు ఇరవైయేళ్ళ తర్వాత ఇంకా ఆశవదలక కాచుకొని వున్న చెలం మానవత్వం మీద శ్రీశ్రీకి వున్న గాఢ విశ్వాసాన్ని చూసి తలవొంచాడు.

శ్రీశ్రీ కవిత్వాన్ని analyse చేసి, ముక్కలకింద ఎత్తిచూపి, కవీ, మనిషీ, శైలీ, బాల్యం, కవిత్వం, ఛందస్సు ఎదిరింపు, కొత్తపోకడలు, పాత influences అంటో వాటి శ్రేష్ఠత్వాన్ని explain చెయ్యడానికి చెలానికి అధికారమూ, అర్హతా లేవు. చెలానికి విమర్శే చాతనైతే కొత్తవ్రాతల్ని పాత ప్రతికల్లో చీల్చి, చెండాడి, గొప్పతనం లేదని నిరూపించి, ఘనత సంపాయించి, సంవత్సరానికోసారి నిండు భోజనాలుచేసే ఒక డజన్ సారస్వత, కళా, నాటక, నృత్య, గాన, సినిమా పరిషత్తులలో సభ్యత్వం, ఏమో అదృష్టం అపూర్వంగా కలిసివొస్తే జాయంటు సెక్రటరికూడా సంపాయించేవాడు కాడా!

శ్రీశ్రీ పుస్తకంకొని తీరికగా చదవండి. పద్యం పదిసార్లు చదవండి. ఏమీ అర్థం కాలేదా—ఏ యువకుడికో, భిక్షకుడికో, death-bed present గా పంపండి. పారెయ్యకండి. అంతకన్నా దాచుకోకండి. తెలుగు కవిత్వాన్ని ఖండించి, దీవించి, ఊగించి, శాసించి, రక్షించే అపూర్వశక్తి మీ చేతులో పుస్తకం. Pass it on.

పదేళ్ళు ఆగండి. ఈ లోపల ఆస్తి సంపాయించడం, పిల్లల్ని కనడం, ధరలు హెచ్చడంకాక, జీవితంలో ఇంకా ఏవన్నా మిమ్మల్ని అమితంగా influence చేసినవి జరిగివుంటే—మళ్ళీ కొత్తకాపీ కొని శ్రీశ్రీ పద్యాల్ని చదవండి, అపుడన్నా అర్థమౌతుందేమో. స్వయంగా చదవండి. చదివింతరవాత శ్రీశ్రీని చూడాలనిపిస్తే స్వయంగా చూడండి. ఎవరి అభిప్రాయమూ అడగకండి. ముఖ్యం, కవి అనేవాణ్ణి—చెప్పినా, వినకండి.

కవిత్వపు కాలం అంతమయింది. నగలూ, అపురూపపు కళలూ, సూర్యకిరణాల్ని ఎరగని అందాలూ గతిస్తున్నట్టే కవిత్వమూ గతించింది. కవిత్వానికి కూడా తన ప్రయోజనం తానే చెప్పుకోవలసిన గతి పట్టింది. "ఈనాటి కవిత్వమంతా ఏమిటి? ఎందుకు వుంది? ఏం చేస్తోంది?" అని ధిక్కరించి అడిగే తెలుగుప్రజలకు శ్రీశ్రీ కవిత్వం ప్రత్యుత్తరం. కొద్దిరోజుల్లో నేడు విర్రవీగే కవులు ప్రతివొక్కరూ శ్రీశ్రీ నీడకింద నించుని తమ ఉనికిని సమర్థించుకోవలసిన గతి వొస్తుంది.

చెప్పుకోతగిన ఒక్క కవీ, మన క్రిష్ణశాస్త్రి ఉన్నత హిమాలయ శిఖరాల్లో కురిసిన కవితావర్షం పాయలై, దేశాలవెంట ప్రవహించి, చివరికి సైడుకాలువల్లో పలుకుతున్న సమయాన, తన భీషణాతప జ్వాలలతో ఆవిరి పొగలురేపి, ఆకాశమార్గాన విహరింపజేసి రక్షించాడు శ్రీశ్రీ.

ఎవరినించి దొంగిలించామో వాళ్ళని క్షమించడం కష్టం.

క్రిష్ణశాస్త్రి పద్యాలు చదివి, అర్థం విడతీసి, "ఏదీ గొప్పతనం, చూప" మంటే చూపలేకపోయినాను పూర్వం. శ్రీశ్రీ అగ్గిపుల్లలోనూ, కుక్కపిల్లలోనూ కవిత్వం చూపలేను ఈనాడూ.

అగ్గిపుల్లవంక—ముఖ్యం పుచ్చిన అగ్గిపుల్లవంక చాలాసేపు చూడమంటాను.

కుక్కపిల్లని—ముఖ్యం తల్లి చచ్చిన దిక్కులేని గజ్జికుక్క పిల్లని పెంచమంటాను.

మెరినాలో గాలిలోవూగే (రేడియోలేని రోజులవి) Flower-bed పుష్పశయ్యకేసి చూస్తున్న నన్నుచూచి, "ఈ పువ్వులు-పాడు పువ్వులు! ఎక్కడ చూసినా రోడ్డుపక్కన అంతా ఈ పువ్వులే!" అని నన్ను నిందిస్తున్న మిత్రుడికి ఏం జవాబు చెప్పగలిగాను?

"ఏమిటి వంతెనమీద నించుని చూస్తున్నావు."

"సంధ్య కేసి,"

"ఎవరు ఆమె?"

అంటే ఏం మాట్లాడగలిగాను?

BRAOU

పాతపదాలు, డిక్షన్, వర్ణనలు, అలంకారాలు, ఛందస్సు, ఉపమానాలు, పద్ధతులు, ఆచారాలు, కవిత్వంలోపీ, జీవితంలోపీ ఇంక మళ్ళీ లేవకుండా వాటి నడ్డి విరక్కొట్టాడు శ్రీశ్రీ.

ధ్వంసంచేసి రోడ్డు వేశాను-

"పదండి ముందుకు
పదండి తోసుకు—" అంటున్నాడు.

తాము వేటిని ఎదురించలేక ప్రతిదినమూ లొంగిపోతున్నారో, ఆ నిరంకుశాధికారుల నెత్తిమీద నాలుగు దెబ్బలు కొట్టాడని యువకులు చెలం మీద చూపే అభిమానం చాలదు శ్రీశ్రీకి. తామూ ఇంకో నాలుగు దెబ్బలు కొట్టగల శక్తిని తెచ్చుకోమంటున్నాడు మనషుల్ని.

శ్రీశ్రీ ధ్వంసంచేసిన పాత ఛందస్సుల్లోంచి పాతమూలుగులూ, Serenadings, మూర్ఛలూ, వేదాంతాలూ, మత్తులూ పోయి—దేశాలకి, ఉత్సాహాలకి, కదలిపోయే యువక సైన్యాలకి, నూతన యుగనిర్మాతలకి back ground music కింద marching band కింద. కొత్తరకాన్ని కదను తొక్కించే సంగీతం వినపట్టం లేదా, శ్రీశ్రీ గీతాల్లో! వినపడకపోతే—

"ఎముకలు క్రుళ్ళిన, వయస్సు మళ్ళిన
సోమరులారా, చావండి!"

ప్రపంచం ఎట్లా పోతేనేం? మీకెందుకు లెండి.
అదృష్టవంతులు మీరు...
వడ్డించిన విస్తరి మీ జీవితం."

apou
LIBRARY

ప్రభుత్వాలు, న్యాయస్థానాలు, రక్షకభట వర్గాలు, చెరసాలలు, ఉరికొయ్యలు, భాషకవిత్వం ఇవన్నీ మీ ప్రియమిత్రులు, యుద్ధాలనించి, ముష్టివాళ్ళనించి, విప్లవాలనించి, అనాథలనించి, అశాంతినించి, సత్యాన్నించి మిమ్మల్ని కాపాడుతారు వీళ్ళు.

వీళ్ళందరి అధ్యక్షుడూ మీ దేవుడు. మీ డబ్బుకి దాసుడు. మీ నంగిపూజలకీ, స్వార్థప్రార్థనలకీ వశ్యుడు. దొంగ భక్త పరాధీనుడు.

ఇన్ని బాంబులు కురుస్తున్నా, ఇన్ని మరఫిరంగులు మోగుతున్నా, ఇన్ని చెరసాలలు నిండుతున్నా, ఇన్ని విప్లవాలు జరుగుతున్నా ఇంకా విశదంకాదా మీకు- పాతపద్ధతులు, విశ్వాసాలు, ధర్మాలు అన్నీ ఓ మూలనించి కూలిపోతున్నాయని! ఇంక లాభం లేదని! మీ ఆటలు ఇంక సాగవని!

ఈ విధ్వంసం అనంతరం నవప్రపంచ నిర్మాణకర్తల ఉత్సాహంతో కంఠం కలిపి పాడుతున్నాడు శ్రీశ్రీ

ఏ లోకంలో అన్యాయాలు, అధికారాలు, ఏడుపులు, క్షామాలు, యాచకాలు, క్షుద్ర కవిత్వాలు, శిక్షలు, Scandals లేవో ఆ లోకాన్ని dream చేస్తున్నాడు యీ కవి.

మీ ఆనందంకన్న ఇతరుల క్షోభ సంతృప్తి నిచ్చే మీకు నరకమంటే అల్లాంటి లోకం.

శ్రీశ్రీ ఎందుకు నచ్చుతాడు?

ఇంకా రాత్రి చీకట్లో లోకం నిద్రలో భయంకర స్వప్నాలు కంటో దీనంగా పలవరించే సమయాన ఉషాగమాన్ని గుర్తించి స్వాగతమిచ్చే వైతాళికుడు శ్రీశ్రీ.

దేవుడు, అధికారాలు, పాతర్లు, సౌఖ్యాలు, స్వర్గం, మర్యాదలు మూట కట్టుకుని కులికే మీకు అర్థంకాని బాధ, మరణం, దరిద్రం, అవిశ్వాసం, అశాంతి ఇవన్నీ అర్థంకాక గట్టిగా సృష్టినే ప్రశ్నిస్తున్న యువకుల లక్ష కంఠాల్ని ఏకంచేసి పలుకుతున్నాడు శ్రీశ్రీ.

మీకెందుకులెండి, పట్టు దిళ్ళలో తలలు దూర్చి, భాగ్యవంతుల పాలిటి ఈశ్వరుడిమీద స్తోత్రశ్లోకాల చదువుతో—'All is well with the world' అనుకుంటో నిద్రపొండి.

BRAOU

నిర్భాగ్యులం కొందరం మాకు—

"అన్నీ సమస్యలే, సందేహాలే"
"ఏవో,
ఏవేవో, ఏవేవో
ఘోషలు వినబడుతున్నాయ్!
గుండెలు విడిపోతున్నాయ్!"

మీకు కవిత్వం కావాలా?

అదుగో ఆ మూల పాతగోరీలకేసి మొహాలు తిప్పుకొని, నగిషీలు చెక్కుతున్నారు—పాత పదాలకీ, ఊహలకీ చిత్రికలు పట్టి—ప్రేయసి మెల్లకన్నులమీద పద్యాలు అల్లుతున్నారు—రామాయణాలు, శర్మిష్ఠలూ వృద్ధమునులు వ్రాసి అర్పిస్తున్నారు, "భారతి"కి నైవేద్యంగా.

వాళ్ళలో చేరండి. వాళ్ళ ధైర్యవచనాలను విని మళ్ళీ నిద్రపొండి,

"రాబందుల రెక్కల చప్పుడు,
పయోధర ప్రచండ ఘోషం,
ఝుంఝూనిల షడ్జధ్వానం"

విని తట్టుకోగల చావవుంటే ఈ పుస్తకం తెరవండి.

—చెలం

బెజవాడ,
17-7'40.

## అభ్యాసం (రాసేపని)

1. చలం శైలిలో పదాల కూర్పుపై మీ వ్యాఖ్య రాయండి.
2. చలం శైలిలో వాక్యాల కూర్పుపై మీ విమర్శ రాయండి.
3. చలం రచనా విధానంలో ఇంగ్లీషు మాటలు కన్పిస్తాయి. చలం వాటిని ఉపయోగించడంలో ఉద్దేశమేమిటి? ఆ మాటల స్థానంలో తెలుగు పదాలను ఉంచడం ద్వారా శైలిలో మార్పు ఏమైనా వస్తుందేమో పరిశీలించండి.
4. Economy of Words and thoughts అంటే అర్థమేమిటి?
5. చలం వాడిన కొన్ని పద బంధాలను ఏరి, సందర్భవశంగా వచ్చిన వాటి అర్థమేమిటో తెల్పండి.

   (ఉదా: **హృదాయాల మీది పెంకులు** పగిలి పోతున్నాయి)
6. చలం వాడిన కొన్ని సమాసాలను ఏరి వివరించండి.
7. ఈ వ్యాసంలో ఒక చోట వాడిన Diction అనే మాటకు ఒక మంచి ఇంగ్లీషు నిఘంటువు సాయంతో అర్థం-తెలుసుకోండి. లేదా మీ ఇంగ్లీషు, తెలుగు సలహాదారుల సహాయం తీసుకొని ఆ మాటను అర్థం చేసుకోండి.

BRAOU

ఖండిక **14** పాఠం **24**

# శైలిలో భేదాలు: పదగుంఫన శైలి, సరళశైలి

**ఉద్దేశం**

విషయం విశదంగా చెప్పే రచనల్లోని శైలినీ, కళాత్మకమైన రచనా రీతిని పరిచయం చేయడం. పదగుంఫనశైలి లక్షణాలను, సరళశైలి లక్షణాలను వివరించడం.

**ప్రణాళిక**

1. విషయ వైశద్యం, కళాత్మక వ్యక్తీకరణం
2. పదగుంఫన శైలి (Rhetoric style) లక్షణాలు
3. సరళశైలి
4. ముఖ్యవిషయ క్రోడీకరణ
5. అభ్యాసాలూ, ప్రశ్నలూ

## విషయ వైశద్యం, కళాత్మక వ్యక్తీకరణం

శైలి రకరకాల ఉండవచ్చుననీ, అది చెప్పేవిషయాన్నిబట్టీ, చెప్పేవాని ప్రవృత్తినిబట్టి ఉద్దేశించిన పాఠకులను బట్టీ, సందర్భాన్నిబట్టీ ఉంటుందని మీకుతెలుసు. అంతే కాకుండా శైలిని ప్రధానంగా రెండు రకాలుగా విభజించుకోవచ్చుననే సూచన కూడా కిందటి పాఠంలో మీరు గమనించారు. "విషయం విశదంగా చెప్పటానికి ఉద్దేశించిన రచనలు ఒక రకం; విషయం కంటే దానిని చెప్పే కళాత్మక మయిన తీరు ముఖ్యమయిన రచనలు మరోరకం. దీనిని బట్టే శైలీ వైవిధ్యం క్రమంగా భాషలో ఏర్పడింది."

వచనం ప్రధానంగా విషయ వివరణకోసం ఉద్దేశించినది. అందులో 'వైశద్యం' ప్రధానం.

కాని సృజనాత్మక రచనలలో కూడా - అంటే కళాత్మక మయిన విలువలు ముఖ్యమైనవి - వచనం ఒక భాగమవుతుంది. అక్కడ చెప్పేతీరు ముఖ్యం. కనుక కొంత ఉదాత్త శైలి రాణిస్తుంది.

ఇక్కడ ఒక సత్యం గమనించాలి. ఏ శైలి అయినా, దేనిని గూర్చి ఎన్నిసూత్రాలు పద్ధతులు చెప్పినా, ప్రధాన మైనది రచయితయొక్క ప్రతిభ-నేర్పు. పూర్వరచయితలు చూపిన ప్రతిభ, విన్నాణం బాగా పరిశీలన చేయటం ద్వారా, స్వయంకృషి ద్వారా రచయితలు ఇంకా కొత్త మెలకువలు తమ రచనలలో ప్రవేశపెట్టగలుగుతారు. కనుక మనము చెప్పుకొనే సూత్రాలు, సిద్ధాంతాలు, వివరణలు అటువంటి అవగాహన నిమిత్తమే.

## ఉదాత్త శైలి/పదగుంఫన శైలి (Rhetoric)

ఉదాత్త శైలిని ఆంగ్లేయ భాషావిదులు 'రెటరిక్' అన్నారు. దీనిని పదగుంఫన శైలి అని వ్యవహరించవచ్చు. ముందుగా రెటరిక్ అంటే నిఘంటువు ఇచ్చే నిర్వచనాలు పరిశీలిద్దాము.

1. The study of the effective use of language.
2. The ability to use language effectively.
3. The art of science of all specialised literary uses of language in prose or verse, including the figures of speech.
4. The art of prose in general as opposed to verse.

BRAOU

5. (in prose or verse) the undue use of exaggeration or display; bombast.
6. (in classical oratory) the art of influencing the thought and conduct of an audience.

## పదగుంఫనశైలి లక్షణాలు

పై నిర్వచనాలనుబట్టి పదగుంఫనశైలి లక్షణాలను ఈ కింది విధంగా వర్ణించుకోవచ్చు.

1. భాష ప్రభావవంతంగా ఉండటం.
2. శైలి అలంకార యుక్తంగా ఉండటం.
3. పాఠకులను ఆకట్టుకొని తిప్పుకో గలగటం.
4. ఆడంబర స్ఫూర్తి ఉండటం.

ఇటువంటి లక్షణాలు కొంతవరకు ప్రాచీనకావ్య శైలిలోనూ కనబడతాయి. ఆధునిక కాలానుగుణ మయిన శైలిలో ఈ లక్షణాలను చొప్పించటం సాధ్యమా అన్న అనుమానం రావచ్చుగాని రచయిత నేర్పరి అయితే అది సాధ్యమే.

కథ నవల మొదలయిన వాటిలో విడవకుండా చదివించే లక్షణం వస్తువులలో ఉండే విశేషంచేతనే సిద్ధిస్తుంది. అట్లా కాక శైలిలోనే ఆ లక్షణం ఉండాలంటే కొన్ని ఆవశ్యకమయిన అంశాలను గుర్తించవలసి ఉంటుంది. సమత వేగము అనేవి అటువంటి ముఖ్యమయిన రెండు అంశాలు. ఈ రెండింటికీ ఈ ఉదాహరణలు పరిశీలించండి. ఇవి పానుగంటివారి సాక్షిలోని ఘట్టాలు:

"చీమ కుత్తుక - సింహము ప్రవేశించినదే ! సముద్ర సప్తకము-చొటి పడియలో నిఱికినదే ! పరమాణువులో-పర్వతమిమిడినదే ! కాసులేని వాని గుడిసెలో-కైలాస మవతరించినదే !

BRAOU

ఇక్కడ ప్రతి వాక్యం రెండు విరుపులు. ఆ రెంటికీ సమతూకం సాధించటం జరిగింది. అపైన ఆ విరిగిన చోట పద్యం కాదు కనుక నిజానికి అవసరం లేకున్నా 'యతి' (చీ-సి; స-చొ; ప-ప; కా-కై)

ఒక్కొక్కచోట ఇట్లాంటి సమ తూకాన్నే, ఆయన వాక్య సముదాయం మధ్యన సాధించారు :

"వైద్యుడు లేకుండ - వ్యాధి దాటింపవచ్చును. పురోహితుడు లేకుండ - పెండ్లి నీడువ వచ్చును. పొసగుడువాడు లేకుండ - సంత సాగింపవచ్చును. భోక్త లేకుండ - తద్దినము కడతేర్చవచ్చును."

ఇక్కడ నాలుగు వాక్యాలు ఉన్నాయి. చెప్పదలుచుకున్న దేనికో ఇదంతా ఉపోద్ఘాతం. మరేదో ఒకటి ఇట్లా ఇంకేదో లేకుండా సాధ్యం కాదని చెప్పాలి. ఆ విషయం కూడా చెపితేనే కాని ఈ సమతూకం పూర్తి కాదు. "కాని, వార్షికోత్సవము మాత్ర మగ్రాసనాధిపతి లేకుండ తెప్పదాటించుటకు వీలులేకుండపోవుట చేత..."

వైద్యుడు లేకుండా వ్యాధి దాటించటం ఎట్లా? పురోహితుడు లేకుండా పెండ్లి ఎట్లా? ఆఖరికి అన్నీ వీలయితాయిగాని ఇది మాత్రం వీలుగాదని ఒక స్వల్ప విషయం గొప్పగా చెప్పటం జరిగింది.

పైగా చెప్పవలసినదేదో ఆ ప్రధానాంశాన్ని దాచిపెట్టి పాఠకుల కుతూహలం పెంచటంవల్ల ఇక్కడ ఒక చిత్రమయిన వేగం కూడా ఏర్పడింది.

ఈ శైలిలో కనిపించే మరో విశేషం పద గుంఫనం, అంటే పదాలు గుప్పించటం. వ్యాధి *'దాటించడం'*; పెండ్లి *'ఈడవటం'*; తద్దినం *'కడతేర్చటం'*; వార్షికోత్సవం *'తెప్ప దాటించటం'* కాస్త కుడి ఎడమగా ఒక అర్థాన్ని ఇచ్చేవాటినన్నిటినీ ఒక నిర్దిష్టార్థంతో ప్రయోగించటం ఒక విశేషం.

అలంకారయుక్తంగా శైలి ఉండటం కూడా ఒక ప్రత్యేకత. సాహిత్యంలో మన పూర్వులు నూరు అర్థాలంకారాలు చెప్పారు. అలంకారం అంటే చెప్పదలుచుకున్నదానిని చమత్కారంగా చెప్పే విధానం అనవచ్చు.

సాధారణంగా వాక్యనిర్మాణంలో రచయితలు ఎక్కువభాగం ఒకే మూసన పోసినట్లుండే వాక్యాలు కూరుస్తూ ఉంటారు. కాని చెప్పదలుచుకున్నదానిని ఎంతో విస్పష్టంగా చెప్పగల నిశితదృష్టి కుదిరితే, వాక్య నిర్మాణ

పద్ధతులను ఎన్నో గిరికీలు తిప్పించవచ్చు. ఈ నేర్పులన్నీ కూడా 'సాక్షి' వ్యాసాలు చూస్తే బ్రహ్మాండంగా అవగతమవుతాయి. పదగుంఫన శైలికి సాక్షికి మించిన ఉదాహరణ దొరకటం అరుదు. సాక్షిలోని శైలి జీవద్భాష లోని ప్రాణ శక్తిని గ్రహించినా సరళగ్రాంథిక శైలిగా పరిగణించదగినది.

చిక్కని వ్యావహారికంలో పదగుంఫన శైలి మనోహరంగా రాసిన వారిలో మల్లాది రామకృష్ణశాస్త్రిని చెప్పుకోవాలి. ఈ శైలినే "హృద్యశైలి' అని కూడా కొందరు వ్యవహరించారు.

## సరళ శైలి

విషయ ప్రధానంగా రాసే శైలిని 'సరళశైలి' అనవచ్చు. శాస్త్రవైజ్ఞానిక వ్యాసాలలోనే కాక సృజనాత్మక సాహిత్యంలో కూడా ఈ శైలి చక్కగా రాసినవారు ఎందరో ఉన్నారు. ఈ శైలిలో సూటిదనం, తేలికదనం ప్రధాన లక్షణాలు. చలం, కొడవటిగంటి, మునిమాణిక్యం మొదలయిన వారి రచనలలో ఈ శైలి గమనించవచ్చు. (22వ పాఠంలో అదనపు సమాచారం కింద ఇచ్చిన పరిచయ వ్యాస భాగాన్ని ఇక్కడ సమన్వయం చేసుకోండి).

**ముఖ్య విషయ క్రోడీకరణ**

1. విషయం విశదంగా చెప్పడానికి ఉద్దేశించిన రచనలు ఒకరకం. కళాత్మకమైన రచనారీతి మరొకరకం. వచనంలో వైశద్యం ప్రధానం. సృజనాత్మక రచనల్లో చెప్పే తీరు ముఖ్యం.
2. పదగుంఫన శైలిలోని లక్షణాలు: భాష ప్రభావవంతంగా ఉండడం; అలంకారికంగా ఉండడం, పాఠకులను ఆకట్టుకొని తిప్పుకోగలగడం, ఆడంబరంగా ఉండడం
3. సాక్షివ్యాసాలన్నీ పదగుంఫన శైలికి దృష్టాంతాలు.
4. సరళశైలిని శాస్త్రవైజ్ఞానిక వ్యాసాల్లోనూ, సృజనాత్మక రచనల్లోనూ చక్కగా రాసిన రచయిత లున్నారు.

BRAOU

## అభ్యాసం (చదివేపని)

సరళ శైలికి నమూనాగా కొడవటిగంటి కుటుంబరావు రాసిన శాస్త్రీయ విజ్ఞానం అనే వ్యాసాన్ని ఇస్తున్నాము. ఈ వ్యాసం విశాలాంధ్ర ప్రచురణాలయం, విజయవాడ వారు 1983లో ప్రచురించిన శాస్త్రీయ విజ్ఞానం అనే వ్యాస సంపుటిలోది.

కొడవటిగంటి కుటుంబరావు(1909-1980) ఆధునిక సంస్కారానికి సంకేతం. ఆయన ఆధునిక వచనానికి పట్టుగొమ్మ; ఆధునిక శైలికి ఒక ఆదర్శం. దాదాపు యాభై ఏళ్ళ కలం దించకుండా అయిదువందలు పైగా కథలు, గల్పికలు రాశారు. ఇరవైనవలలూ, నవలికలూ, వంద దాకా రేడియో నాటికలు రాశారు. రెండుమూడు సినిమాలకు స్క్రిప్టులు రాశారు. ఆరువందలకు పైగా వివిధ సాహిత్య, వైజ్ఞానిక, సాంస్కృతిక విషయాల మీద వ్యాసాలు రాశారు. ప్రగతిశీల ఉద్యమాల స్ఫూర్తితో, ఆధునిక తెలుగు జీవితాన్ని అభ్యుదయోన్ముఖం చేయడానికి ఆయన ప్రయత్నించారు. అందుకోసం వివిధ సృజనాత్మక వచన ప్రక్రియలను చేపట్టారు. విజ్ఞానశాస్త్ర విషయాలపై స్వతంత్ర రచనలు చేశారు, శాస్త్రీయ విజ్ఞానాన్ని అనువాదాల ద్వారా అందించారు. సారళ్యం, స్పష్టత, గాంభీర్యం, గడుసుదనం, వ్యంగ్యం, అధిక్షేపణం, హాస్యకుశలత, పొదుపరితనం, బిగువు ఆయన శైలిలోని ముఖ్య లక్షణాలు.

ఈ వ్యాసంలో జనన శాస్త్రం అనే మాట కన్పిస్తుంది. ఈనాడు జన్యుశాస్త్రం (Genetics) అని వాడుతున్నారు. గిరీశం ప్రస్తావన కన్పిస్తుంది. గురజాడ కన్యాశుల్కం నాటకంలోని పాత్ర గిరీశం మహా గట్టివాడు.

# శాస్త్రజ్ఞానావశ్యకత

**కొడవటిగంటి కుటుంబరావు**

ప్రతి వ్యక్తికీ ఈనాడు భౌతికదృష్టి, శాస్త్రజ్ఞానం ఉండితీరాలి. ఈ ఆవశ్యకత ప్రతిదేశంలోనూ గుర్తించబడుతూనే ఉన్నది. కాని అనేక దేశాలలో సామాన్య ప్రజలూ, ప్రభుత్వాలూ కూడ శాస్త్రీయ దృక్పథం లేకుండా ప్రవర్తించటం మనం చూస్తున్నాం. ఈ విషయంలో మనదేశం చాలా వెనుకబడి ఉన్నది. దీన్ని గురించి తగినంత ఆందోళన లేకపోవడం శోచనీయం. మనదేశంలో పాలకవర్గానికి శాస్త్రీయ దృక్పథం లేనందుకు ప్రొఫెసర్ హాల్డేన్ ఇటీవల విమర్శించాడు.

మనం నిన్నమొన్నటిదాకా ధార్మికదృష్టితో బ్రతికినవాళ్ళం. ఆచరించినా ఆచరించకపోయినా, పురాణ గ్రంథాలలో చెప్పి ఉన్న ధర్మాలు తెలిసి ఉండటం విజ్ఞతాలక్షణంగా ఉండేది. మతవిశ్వాసాలూ, ఆకుకు అందని పోకకు పొందని ఆదర్శాలూ జనాన్ని భూతాల్లాగా ఆవహించి ఉండేవి. ఆంధ్రలో ఈ విశ్వాసాలను చీల్చి చెండాడిన యుగపురుషుడు వీరేశలింగంగారే తెలుగులో శాస్త్రగ్రంథ రచనోద్యమానిక్కూడా అంకురార్పణ చేశాడు. కాని ఆ శంకుస్థాపనరాయి ఈనాడు మన మంత్రులు వేస్తున్నరాళ్ళలాగానే కొట్టుకుపోయింది.

శాస్త్ర విజ్ఞానం కావాలనే వాళ్ళను 'ధర్మవాదులు' శత్రువుల్లే చూస్తారు. కాని ఇది పొరపాటు. శాస్త్ర విజ్ఞానం తప్పని నిరూపించిన విశ్వాసాలు పట్టుకుని వేళ్ళాడతామనే వారికి శాస్త్రం శత్రువే. ఎవరైనా తుమ్మితే ముక్కు నుంచి ఒక కొడుకు ఊడి పడతాడనిగాని, ఎవతెనోచూసి ఎవరికో వీర్యస్ఖలన మైతే దాన్ని కుండలో పెడితేనో ఒక చేప మింగితేనో తత్ఫలితంగా పిల్లలు ఏర్పడతారనిగాని, ఒక పిండాన్ని నూరుముక్కలు చేస్తే నూరుమంది పిల్లలు పుడతారనిగాని ఎంతటి సనాతనవాది అయినా నమ్ముతాడా? ఇవి జనన శాస్త్రానికి విరుద్ధం. పురాణాలలో అబద్ధాలుంటాయా అని యీ కట్టుకథలు నమ్మే అమాయకులు జీవితమంతా అసమర్థంగానే బతుకుతారు. అటువంటి వాళ్ళచేత అపరగిరీశంగాళ్ళు ఏదైనా నమ్మించగలరు. ('చుట్ట పంపిణీ మీదే తెల్లవాడు స్టీము యంత్రం వగైరా కనిపెట్టాడు')

"ఏమీ శాస్త్రజ్ఞానం లేకుండానే మనం - డబ్బుంటే! — కార్లలోనూ, విమానాలలోనూ తిరగవచ్చుగదా, రేడియో మోగించవచ్చు గదా" అన్న ధోరణి ఒకటి ఉన్నది. ఇది పూర్తిగా తప్పుధోరణి.

శాస్త్రజ్ఞానమంటే రేడియోలూ, విమానాలూ తయారుచెయ్యటం మాత్రమేకాదు. ఒక్కముక్కలో చెప్పాలంటే, శాస్త్రజ్ఞానంయొక్క పరమార్థం నిజానికీ అబద్ధానికీ తేడా కనిపెట్టటం. అందుకు శాస్త్రీయ దృక్పథం కావాలి. శాస్త్రజ్ఞానం లేనిదే శాస్త్రీయ దృక్పథం అలవడదు. ఎద్దు ఈనిందంటే దూడను కట్టెయ్యమన్నవాడికి ఒక్క శాస్త్రీయ దృక్పథమే కాదు, శాస్త్రజ్ఞానం కూడా లోపించింది.

అశాస్త్రీయ దృక్పథాన్ని బలపరిచే వాళ్ళు "చెట్టుముందా? విత్తుముందా? ఎవడూ చెప్పలేడు!" అన్న ధోరణి అవలంబిస్తారు. "ప్రాణం" అంటే ఏమిటి అన్న ప్రశ్నకు కూడా శాస్త్రవేత్తలు సమాధానం ఆలోచిస్తున్నారు. శాస్త్రజ్ఞానం కలవాడికి "చెట్టుముందా, విత్తుముందా" అన్న ప్రశ్న రానేరాదు.

శాస్త్రీయ దృక్పథం అనేది జీవితం తాలూకు అన్ని రంగాలలోను అవసరమైనట్టిది. భాషాశాస్త్రం ఉంది. చరిత్ర రచనాశాస్త్రం ఉంది. సాంఘిక పరిణామశాస్త్రం ఉంది. గాన శాస్త్రమూ, నాట్యశాస్త్రమూ ఉన్నాయి. ప్రతిశాస్త్రమూ ప్రకృతి ధర్మాలను అన్వేషిస్తుంది. భాషాశాస్త్రం తెలియనివాళ్ళు గ్రాంథిక భాషను ఎంతోకాలం మనపైరుద్ది తెలుగు సాహిత్యాన్ని బీడు పెట్టటానికి శాయశక్తులా ప్రయత్నించారు. వీరి పాలిటికి పరశురాముడల్లే గిడుగువారు అవతరించకపోతే మనం కృతకభాషలో ఓలలాడుతూ ఉందుమేమో!

ఆర్థిక సాంఘిక రాజకీయసూత్రాలను గురించి శాస్త్రజ్ఞానమూ ఉంది, మూఢవిశ్వాసాలూ ఉన్నాయి. ఈ దేశంలో వీటిని గురించి మూఢవిశ్వాసాలు చెలామణీ అయినంతగా శాస్త్రజ్ఞానం చలామణీ కావటంలేదు.

నాగరికతను పెంచే వర్గాలు కొన్ని ఉన్నాయనీ, అవసరమైన శాస్త్రజ్ఞానాన్ని అవే పెంపొందిస్తాయనీ చాలామందికి దుర్భ్రమ ఉన్నది. సామ్రాజ్యాలు ఏలిన దేశాలు వలసదేశాలలో కొంత విజ్ఞానాన్ని ప్రవేశపెట్టిన

BRAOU

మాట నిజమే. కాని ఈ దేశాలను వారు వదిలిపెట్టి వెళ్ళేనాటికి వీటి పరిస్థితి కుక్కలు చించిన విస్తరివంతుగా ఉన్నది.

పారిశ్రామికులూ, పెట్టుబడిదార్లూ తమ స్వార్థం తీరినంతకాలమూ శాస్త్రజ్ఞానాన్ని ఉపయోగపరచుకుంటారు. తమకు నష్టం కలిగే పరిస్థితిలో శాస్త్రజ్ఞానాభివృద్ధికి రాహువులల్లే అడ్డుతగిలి తీరుతారు. వారు దేశ సంపదను పెంచటానికే పరిశ్రమలు నడుపుతారనుకోటం ఎంత భ్రమో, వారికి శాస్త్రజ్ఞానంపైన అభిమానం ఉంటుందనుకోవడమూ అంత భ్రమే. పారిశ్రామికంగా అన్నిదేశాలను మించి ఉన్న అమెరికాలో అగ్రగణ్యులు దేవుణ్ణి అనుక్షణమూ ప్రస్తావిస్తారు.

రాజకీయంగా కూడా అంతే. రాజకీయ వ్యవస్థలు తత్కాలానికి పాలకవర్గంగా ఉండేవాళ్ళ దయాధర్మభిక్షం కావు. బ్రిటన్‌లోగాని అమెరికాలోగాని ప్రజలచేత ఎన్నుకోబడ్డ వారు "మాకు ప్రజాస్వామ్యంలో నమ్మకం పోయింది" అనేస్తే ఏం జరగాలో అది జరుగుతుంది. కాని వీళ్ళు ప్రజలకు రాజకీయ శాస్త్ర విజ్ఞానం లేకపోవడం ఆసరాచూసుకుని, నియంతృత్వ దేశాలతో పొత్తుగలిగి, ప్రజలకు లేనిపోని భీతికలిగించి, ప్రజాస్వామ్య సూత్రాలను క్రమక్రమంగా నీట కలిపెయ్యగలరు. అమెరికా పౌరులకు రాజకీయ శాస్త్ర విజ్ఞానమే ఉంటే, వారు అణు యుద్ధంకన్న కమ్యూనిస్టు ప్రమాదాన్ని ఎక్కువగా పరిగణించరు. అమెరికా ప్రభుత్వం కమ్యూనిస్టు ప్రమాదం పేరిట అనేక ప్రజావ్యతిరేక శాసనాలను అమలు చేసింది. దానితోబాటు అణ్వస్త్ర నిషేధానికి అంతరాయాలుకూడా కలిగించి, యుద్ధ ఖర్చు అంతకంతకు పాపంలా పెంచగలుగుతున్నారు.

మనదేశంలో మూఢత్వం మరింత విచ్చలవిడిగా సంచారం చేస్తున్నది. కులతత్వం అశాస్త్రీయం. కులమనేది రక్తానికి, పారంపర్యానికి చెందినదైన పక్షంలో కులాలు ఏనాడో కలిసిపోయాయి. "స్త్రీషు దుష్టాసు జాయతే వర్ణసంకరః" అని గీత చెప్పింది. కులాలు ఏర్పడటమే సాంకర్యంలో ఏర్పడ్డాయి. కులాలు ఏర్పడ్డ మీదట సాంకర్యం ఆగలేదు. స్త్రీలు దుష్టులు కాకుండా చెయ్యటం ఎలాగో ఆ భగవానుడు చెప్పాడు కాడు. ఒక 'దుష్టస్త్రీ' మూలంగా కులంలో మరొక కులంవాడి 'రక్తం' చేరితే ఎన్నితరాల అనంతరం ఆ రక్తం ఆ కులానికంతకీ సంక్రమించేదీ గణిత వేత్తలు చెబుతారు. (వర్ణాంతర వివాహాలు పరిపాటిగాలేని పరిస్థితిలో ఈ సంక్రమణ మరింత త్వరగా జరుగుతుంది.)

అయినప్పటికీ మన దేశంలో కులతత్వాన్ని ఆశ్రయించినవాళ్ళు కోట్ల సంఖ్యలో వున్నారు. ఇది అశాస్త్రీయం, కర్మచేత కులంనిలబడుతుందా అంటే, వర్ణధర్మాలు ఏనాడో తారుమారయాయి. కులతత్వం ఇంకా ఎందుకు నిలబడి ఉంది? దానివల్ల స్వార్థం అమలు జరుగుతుంది గనకనూ, అధిక సంఖ్యాకులకు కులాలలో మూఢ విశ్వాసం ఉండి గనకనూ.

నన్నడిగితే శాస్త్రజ్ఞానం మతానికీ, ఆధ్యాత్మిక చింతనకూ శత్రువు కాదు. స్వార్థం శాస్త్రజ్ఞానానికి ప్రబల శత్రువు. శాస్త్రజ్ఞానాభివృద్ధిని సాంఘిక స్వార్థం నిరోధించినట్టుగా మరేదీ నిరోధించలేదు.

అందుకే సాంఘిక స్వార్థానికి తావులేకుండా పోయిన సోషలిస్టు దేశాలలో శాస్త్రజ్ఞానాభివృద్ధి అవిచ్ఛిన్నంగా సాగుతున్నది. శాస్త్ర వేత్తలు ఆ దేశాలలో గౌరవింప బడుతున్నారు. శాస్త్రప్రయోజనం ప్రజలందరికీ అధికంగా దక్కుతున్నది. రాజకీయంగా చూసినా, స్వార్థరహితమైన శాస్త్ర జ్ఞానం నియంతృత్వానికి బద్ధశత్రువు.

## అభ్యాసం (రాసేపని)

ఈ కింద సాక్షివ్యాసంలోని భాగం ఏ శైలికి చెందుతుందో నిరూపించండి.

1. ఆ సభలో దాదాపుగా నందఱు స్వదేశీ యాంబరాలంకృతులై కనుపట్టిరి. సభాస్తరులెల్లరు "మీ బట్ట లెక్కడి వయ్యా మీ బట్ట లెక్కడివయ్యా? యని యన్యోన్య సంప్రశ్నాలాపకలాపులై ప్రకాశించిరి. మావి పొందూరు వయ్యా యని యొకరు,మావి నరసన్న పేట వయ్యా యని యొకరు, మావి తాటిపాక సీమవయ్యాయనియొకరు, మావి బహర్‌జల్లీ పాటివయ్యా యని యొకరు, మావి సొంత మగ్గములోనివేయయ్యా యని యొకరు,

BRAOU

నిట్లన్యోన్యోత్తర ప్రధాన ప్రవీణులై భాసిల్లు చుండిరి. వీరి బట్టలను వారు నాడెము చూచిరి-వారి బట్టలను వీరు నాడెము చూచిరి"

2. కుటుంబరావు రచనా విధానంలో అణుమాత్రం కూడా భేషజం, కృత్రిమత్వం లేని స్వచ్ఛమైన, అప్రయత్న పూర్వమైన వాడుక శైలి ఉంటుందని విమర్శకులు అంటారు. చదివేపని కింద ఇచ్చిన వ్యాసం ఆధారంగా విమర్శకులు అన్నది నిజమో కాదో వ్యాఖ్యానించండి.

3. కుటుంబరావు సరళ శైలిలోని ప్రవాహగుణం, ధారాశుద్ధి, సరసత్వం, గాంభీర్యం, బిగువు పదాలకూర్పులో, వాక్యాల కూర్పులో ఏ విధంగా ఉన్నాయో వ్యాఖ్యానించండి.

4. కుటుంబరావు వాక్యప్రయోగాన్ని గురించి రాయండి.

5. కుటుంబరావు దృష్టిలో శాస్త్రజ్ఞానం ఏమిటో తెల్పుతూ మీరొక వ్యాసం సొంతంగా రాసి మీ సలహాదారునికి చూపించండి.

6. సాక్షివ్యాసాల నుంచీ ఉదహరించిన శైలికీ కుటుంబరావు శైలికీ తేడా లేమిటో విమర్శించండి.

7. కుటుంబరావు కథలు, నవలలు ఒకటిరెండైనా సంపాదించి చదివి. వాటిలోని శైలికీ చదివే పని కింద ఇచ్చిన వ్యాసంలోని శైలికీ, భేద సాదృశ్యాలేమైనా ఉన్నాయేమో పరిశీలించండి.

8. "వీణలు కీరించి శంఖము మ్రోగినది......వేణువులు క్రీంకరించి లయమూన మందీయగా, తాపము తమకించగా, మర్దళములు గంగాఝుర నిస్సాణముగా గజ్జెల కలపరము క్రమ్ముకొనంగా, కనక వేదికమీద మల్లెలు విరజాజులు రాసులై, అది కైలాసమైనది.

దేవినీదేవరను-ప్రసన్నుల జేసికొని ప్రస్తుతించి, 'మీ పరిణయగాథను మే మభినయించేమిది-మాకు నిత్య దీవనెన మేల్బళా! అని పలికి, కోలాహలము సేయంగా......" ఈ వాక్యాలు మల్లాది రామకృష్ణశాస్త్రి రాసిన కనక-వీణె అనే కథలోవి. ఈ రకం శైలిని మీరు ముందు చదివిన కథల శైలితో పోల్చి పరిశీలించండి. కుటుంబరావు కథల శైలితో కూడా పోల్చి చూడండి.

BRAOU

ఖండిక 14 పాఠం 25

# శైలిలో భేదాలు: ప్రాచీన శైలి, ఆధునిక శైలి

**ఉద్దేశం**

వివిధ కాలాల్లోని తెలుగు వచన లక్షణాలను దృష్టాంత పూర్వకంగా ప్రదర్శించడం. ప్రాచీన కావ్యశైలి, ఆధునిక వచన శైలి మధ్య ఉండే భేదాలను వివరించి, విద్యార్థులు వాటిని గుర్తించేటట్లు చేయడం.

**ప్రణాళిక**

1. వచన సాహిత్యంలో శైలీ భేదాలు, శైలీ వైవిధ్యం
2. పందొమ్మిదో శతాబ్ది పూర్వపు రచనల్లో శైలి
3. ఈ శతాబ్ది రచనల్లో శైలి
4. ముఖ్య విషయ క్రోడీకరణ
5. అదనపు సమాచారం

ఏదైనా ఒక రచన చదువుతున్నప్పుడు, అందులోని విషయంతోపాటుగా చెప్పేతీరు కూడా బాగా ఉంటేనే గాని ఆసక్తితో చదవలేము గదా! అట్లా చెప్పేతీరులో వాడే పదాలు, ఆ పదాల కూర్పు, వాక్యరచన, ఒక దాని తరువాత మరొకటిగా వచ్చే వాక్యాల కూర్పు-అంటే రచన యొక్క నడక-ఇవన్నీ అంతర్భాగాలే. స్థూలంగా ఈ అంశాన్నే శైలి అని వ్యవహరిస్తూ ఉంటామని మీకు తెలుసు.

BRAOU

## వచన సాహిత్యంలో శైలీభేదాలు, శైలీవైవిధ్యం

ఒక భాషలో వచ్చే రచనలన్నీ ఒకే విధమయిన శైలిలో ఉంటే, ఆ శైలి ఎంత బాగున్నా, మొగం మొత్తుతుంది.

అయితే మన తెలుగు సాహిత్యం-ముఖ్యంగా వచన సాహిత్యం-తీసుకొని చూస్తే ఎక్కడో సూక్ష్మాంశాలలో ఏకాస్తో తప్ప మొత్తం మీద కొట్ట వచ్చినట్లుగా శైలీ భేదాలు కనబడటం చాలా కాలం దాకా జరగలేదు. ఒక విధంగా చెబితే మనవాళ్లు 'శుచి' కోసం తంటాలు పడినంతగా 'రుచి' కోసం పడలేదు. ఎటు వచ్చీ శైలీ వైవిధ్యం కోసం కావాలని చేసిన ప్రయత్నాలు గడిచిన నూరేళ్ళలో వచ్చినవే.

చెప్పే విషయాన్ని బట్టి, ఆ విషయంపట్ల రచయితకు ఉన్న ప్రవృత్తి వైఖరినిబట్టి, ఎటువంటి పాఠకుల నుద్దేశించి రచన చేస్తున్నారో అన్న దానిని బట్టి, రచన యొక్క లక్ష్యం ఏమిటి అన్న దానినిబట్టి శైలి ఎట్లా ఉండవలసినదీ నిర్ణయం అవుతుంది.

### పందొమ్మిదో శతాబ్ది పూర్వపు రచనల్లో శైలి

పూర్వ కాలంలో- అంటే దాదాపు పందొమ్మిదో శతాబ్ది మధ్య భాగం దాకా కూడా రచనలు ముఖ్యంగా పండితుల మెప్పుకోసం చేసినవే కనక అందులో శైలీ వైవిధ్యానికి అంతగా ఆస్కారం లేకపోయింది.

నానార్థపదాలు, పర్యాయపదాలు సాహిత్యభాషలో ఎక్కువగా ఉండేవి కనుక మామూలు జనుల వాడుకలో లేని పదాలు సాహిత్యభాషలో ఉండి అర్థమయ్యేవి కనుక-అటువంటి పదాలను రచనలో ఉపయోగించటం ఒక గొప్ప అయింది. పదాల ఎన్నికలో సైతం అర్థము, రసము మొదలయిన వాటికి ప్రాధాన్యం ఇచ్చినాక శబ్దాలంకార ఆడంబరం పైన, దీర్ఘసమాస భూయిష్ఠమయిన రచనపైన దృష్టి నిలిపే వారు.

పూర్వపు తెలుగు వచనంలో కనబడే మరో లక్షణం- సుదీర్ఘ వాక్య నిర్మాణం. అంతేకాక వాక్యం ముగిసి మరొక వాక్యం ప్రారంభించేటప్పుడు కూడా సంధి కలిపి అదేదో అనంతమైన వాక్యం అనిపించేటట్లు చేయటం.

వచనశైలిలో ఆడంబరం ఆది నుంచీ లేదు. క్రమక్రమంగా వచ్చింది. ఆ మాటకు వస్తే, ఆదికవి నన్నయ వచనం పరిమిత సమాసాలతో సరళంగానే సాగింది- ఎక్కడో తప్ప.

"నిర్మల స్ఫటిక శిలా నిర్మితంబై, శశి ప్రకాశంబై, వివిధ రత్న ప్రభా భాసురంబైన యా సభ విభవంబు సూచువేడుక నందుఁ గ్రుమ్మరువాఁడ హరినీల బద్ధస్నిగ్ధమణి స్థలంబునందు జలబుద్ధింజేసి పరిధానో త్కర్షణంబుసేసి, విమల శిలాతల బుద్ధి నుదక పరిపూర్ణంబయిన వాపిసొచ్చి కట్టిన పుట్టంబు దడియం ద్రెళ్ళిన నన్నుం జూచి వృకోదరుండు నగియె; దానినంతయు నెఱింగి ధర్మరాజ చోదితులయిన కింకరులు నాకుం బరిధానంబులు దెచ్చి యిచ్చిరి మఱియు వివృతద్వారంబుఁ గవాట ఘటితంబని చొరనొల్లక కవాట ఘటితంబు వివృతంబుగా వగచి చొరంబోయి తత్కవాట స్ఫటిక శిలా ఘట్టిత లలాటుండనైన నన్నుం జూచి యనేక సహస్ర విలాసినీ పరివృత యయియున్న ద్రౌపది నగియె నంత నకుల సహదేవులు పరతెంచి యిదె వాకిలి యిట వచ్చునదియని నన్నుం దోడ్కొనిపోయి రట్టి సభాప్రలంభంబు నాకు హృదయ శల్యంబయి యున్నయది."

ఏవో కొన్ని ప్రత్యేక ఘట్టాలలో పనిగట్టుకొని దీర్ఘవచనాలు చొప్పించటం తరువాత తరువాత కవులు ప్రారంభించారు. సాధారణంగా అవి వర్ణనాత్మకమయినవి. పోతనగారి భాగవతంలో హిరణ్యకశిపుని వధ నిమిత్తం నృసింహావిర్భావం జరగటం గూర్చిన సుదీర్ఘ వచన రచన (ఏడవ స్కంధంలో 285) ఇందుకు ఒక ఉదాహరణం. అట్లాగే అరణ్య వర్ణన మొదలయిన వాటిలోనూ చెట్లు, పిట్టలు మొదలయిన వాటి జాతి విశేషాలన్నీ గుదికూర్చి చెప్పటం చాలామందికి ఒక అనువాయితీ అయింది. మొత్తంమీద సాహిత్య భాషాశైలి అనదగిన ఈ రీతి వచనాలలో శబ్దాలంకారాలు, సుదీర్ఘ సమాసాలు-వీటితోపాటుగా సుదీర్ఘ వాక్యాలు ఉండటం, వాడుకలోలేని పదాలు బహుళంగా ఉండటం వాటి రూపాలుకూడా వాడుకకు భిన్నంగా ఉండటం మొదలయినవి లక్షణాలు. విరివిగా త్రికసంధులు చేయటం (అమ్మునీంద్రుడు; అయ్యరణ్యంబున); అరసున్నలు నిండు సున్నలు చేసిన రూపాలు వాడటం (పురుషోత్తముండు; ఎఱింగి); ముకారంతో ముగిసే రూపాలకు (నగరము) ద్విత్వముకారము (నగరమ్ము) లేదా నిండుసున్న బుతో ఉన్న రూపాలు (నగరంబు) వాడటం కూడా అటువంటి శైలిలో గమనించవచ్చు.

అయితే ఇందుకు భిన్నంగా సమకాలపు వాడుక భాష అని అనుకోదగిన దానిని కూడా కొన్ని ప్రత్యేక ప్రయోజనాలకోసం ఉద్దేశించిన గ్రాంథిక రచనలలో ప్రవేశపెట్టినట్టి సందర్భాలు కూడా లేకపోలేదు.

16వ శతాబ్దంలోనే రచించిన 'రాయవాచకం'లో ఉన్న రచనా సరళి ఇందుకు ఒక ఉదాహరణ:

"విద్యానగరమందు వీర నృసింహరాయలవారు......పేరోలగంబై కూర్చుండగాను నూట యెనిమిది తిరుపతులనించిన్ని తీర్థప్రసాదములున్ను డబ్బైరెండు దేవస్థలాలనుంచి విభూతి గంధ ప్రసాదములున్ను రాగా యెదురుకొని ప్రత్యుత్థానముజేసి అంజలిచే నందుకొని శిరసావహించి స్థలాంతరాల నుంచిన్ని వచ్చిన అయ్యం గార్లనున్ను ఆరాధ్యపీఠం వారలనున్ను ఉచితాసనములయందు కూర్చుండ నియమించి..."

వేదాంతాది శాస్త్ర గ్రంథాలలోను, వ్యాఖ్యానాలు, తాత్పర్యాలు చెప్పేచోట కూడా ఇట్లాగే చక్కని చిక్కని వ్యావహారిక భాషాశైలి కనబడుతుంది.

"అసురాంశల బుట్టినవారి లక్షణము చెప్పేము. శ్రుతులకు విపరీతార్థములు కల్పింతురు. విష్ణుభక్తులను ద్వేషింతురు. వారితో వాదించబోవద్దు. వారు చెప్పే శ్రుతి స్మృతేతి హాస పురాణాల యొక్క విపరీతార్థాలు నీవు యెల్ల కాలము దిద్దుకొని సరిపోయ్యేని: నీవు దిద్ది చెప్పితివాయనా వారు సమ్మతి పడనే పడరు. సమ్మతి పడిరా విశేషమార్గాన నడవనే నడవరు."

పందొమ్మిదో శతాబ్దం ప్రారంభంనాటికే వ్యాకరణ గ్రంథాలలో సూత్రీకరించిన పద్ధతిగా వాక్యరచన చేస్తూ రచనలు సాగిస్తే, అవి సర్వజనులకు ఉపయోగపడవనే అభిప్రాయం వ్యక్తం అవుతూ వచ్చింది. 'చార్

దర్వీమ కథలు' తెలుగులో రాసిన యెల్లమిల్లి మల్లికార్జునుడు ఆ గ్రంథం పీఠికలో ఇట్లా అన్నాడు. ఇవి జాగ్రత్తగా గమనించదగిన మాటలు :

"వ్యాకరణ పద్ధతిగా గ్రంథముచేసే యెడల సర్వజన సాధారణము కాకపోవడమే కాక దేశీయభాషా చమత్కారము బోధపడక విరసమౌనని తోచి, స్త్రీ పురుషులు వకరితో నొకరు మాటలాడునట్లు సులభముగా అర్థమయ్యేలాగున సంక్షేపముగా జాతీయ రసముతో ఈ గ్రంథము సేయ నిశ్చయించడమైనది. కనుక ఇందుకు సమస్తమైన వారు హర్షించవలసినది."

ఇట్లాంటి ఆశయంతోనే పలువురు కథా సాహిత్యాన్ని శాస్త్రగ్రంథాల వివరణలను కూడా రాశారు. అట్లా రాసిన వారిలో నాడు పేరుమోసిన పండితులే ఉన్నారు. అయితే ఇటువంటి పరిస్థితులలో చిన్నయసూరి నీతి చంద్రిక రాస్తూ కావ్యభాషాశైలిని ఆదరించటం, ఆయన బాలవ్యాకరణం అనే పేరిట ఒక వ్యాకరణం కూడా రాయటం, ఆ వ్యాకరణం అందరకూ శిరోధార్యం కావటంచేత వచనశైలి గ్రాంథికానికి మారిపోయింది. ఆ తరవాత వచనగ్రంథాలు రాసినవారు సర్వజనోపయోగకరమయిన తేట వ్యావహారిక శైలిని విడిచిపెట్టి కావ్యశైలినే ఆదరించసాగారు. అక్కడితో ఆగక, మునుపు తేట వ్యవహారంలో ఉన్న వ్యాఖ్యానాలవంటి వాటిని సైతం తిరగ రాసి కావ్యశైలిలో ప్రకటించ సాగారు. ఇలా వచనశైలి పరిణామంలో ఒక హానికరమయిన ఉపద్రవం సంభవించింది.

## ఈ శతాబ్ది రచనల్లో శైలి

గిడుగు రామమూర్తి పండితులు, గురజాడ అప్పారాయ కవి వంటివారు ఈ శతాబ్దిలో తిరిగి సజీవంగా ఉండే వ్యవహారశైలి నిమిత్తం కృషి చేయనారంభించిన వెనుక, కొంతకాలం వారి వాదాన్ని నిరోధించ గలిగినా క్రమంగా వచనశైలి తిరిగి వాడుకకు చేరువ అయింది.

BRAOU

కాని వాడుక శైలి అన్నది కూడా అంత సులువైనది కాదు. జనుల నోళ్ళలో ఉన్న భాషా రూప సంప్రదాయాలకు లిఖితరూపం ఇవ్వటం భాషలోని ప్రాణనాడిని పట్టుకోవటమే. 'వాడు నిద్రించుచున్నాడు' అనే వ్యాకరణ సూత్ర యుక్తమైన రూపాన్ని 'వాడు నిద్రిస్తున్నాడు' అని మారిస్తే అది వాడుక భాష అయిపోదు. మన వాడుక నిద్రిస్తున్నాడనికాదు; 'నిద్రపోతున్నాడు' అని.

కావ్యశైలినుండి ఆధునిక కాలానుగుణ్యమయిన వాడుక శైలి ఏర్పడటంలో ఎన్నో అంచెలు ఉన్నాయి. కొంతకాలం కావ్య శైలిలోని కఠినత తొలగిస్తే చాలునని-చిన్నచిన్న వాక్యాలతో, దీర్ఘ సమాసాలు లేని రచన చేస్తే, అంటే 'సరళగ్రాంథికం' రాయదగునని వాదించారు. నాటకాలలో ఉత్తమ పాత్రలకు గ్రాంథికమే రాస్తూ తక్కిన పాత్రలకు ఉచితమయిన శైలి వాడాలన్నారు. కాని వచనంలో అందరికీ ఉపయోగించే విధంగా రాయాలంటే వాడుక భాషే - సజీవమయిన భాషే తగినదనే నిశ్చయానికి పెద్దపెద్ద కవులు, పండితులూ కూడా వచ్చారు. క్రమంగా వాడుక శైలి బలం పుంజుకున్నది.

ఆధునికకాలంలో వచనం విశ్వరూపం తాల్చింది. కథ, నవల, లేఖ, వార్త, వ్యాసం, ఆధునిక సాంకేతిక వైజ్ఞానిక రచనలు - ఈ విధంగా ఎంతో వైవిధ్యంగల అంశాలకు ఒకే శైలి, బాణీ పనికిరావు. విషయం విశదంగా చెప్పటానికి ఉద్దేశించిన రచనలు ఒక రకం, విషయంకంటే దానిని చెప్పే కళాత్మకమయిన తీరు ముఖ్యమయిన రచనలు మరో రకం. దీనినిబట్టే శైలీ వైవిధ్యం క్రమంగా భాషలో ఏర్పడింది.

ఇంత జరిగినా, ఒక్కమాట మాత్రం మనం గమనించక తప్పదు. ఒక ప్రత్యేక శైలిని చక్కగా వాడగలగటం ఒక నేర్పు, కౌశలం. అది ప్రయత్నం మీదటగాని అంత సులువుగా పట్టుపడదు. నేటికీ విద్యా విధానంలో అటు 'సరళగ్రాంథికం' లోగాని, ఇటు 'సజీవమయిన వాడుక భాష' లోగాని చక్కగా రాయగల నేర్పు విద్యార్థి లోకానికి అందించలేకపోవటం జరుగుతూనే ఉన్నది. కారణం ఏ రకమయిన శైలికి ఎటువంటి ప్రాముఖ్యం, ఎంతటి ప్రాముఖ్యం ఇవ్వవలసి ఉంటుంది అనే యోచనచేసి పాఠ్యక్రమ నిర్మాణం చేయకపోవటమే అందుకు కారణం తత్ఫలితంగా, ఈ రెండు రకాల సమ్మిశ్రణంచేసి చెడిపోవటం ఎక్కువగా జరుగుతున్నది.

సమయ సందర్భాల ననుసరించి శైలి మార్చుకోగలుగుతూ విభిన్న శైలులు ఉపయోగించగల నేర్పే కలిగితే అది మరో విశేషం కదా!

**ముఖ్య విషయ క్రోడీకరణ**

1. ఒక భాషలో వెలువడే రచనలన్నీ ఒకే రచనా రీతిలో ఉంటే, విసుగుపుట్టవచ్చు.
2. గతంలో రచనా విధానంలో 'శుచి' కోసం తంటాలు పడినంతగా 'రుచి' కోసం పడలేదు. గత నూరేళ్ళలోనే శైలీ వైవిధ్యం వచన రచనల్లో కన్పిస్తుంది.
3. పందొమ్మిదో శతాబ్ది మధ్యదాకా వచ్చిన రచనలు ముఖ్యంగా పండితుల మెప్పుకోసం చేసినవి. కాబట్టి పదప్రయోగంలో ఆడంబరం కన్పిస్తుంది. శబ్దాలంకారాలూ, దీర్ఘ సమాసాలూ, సుదీర్ఘమైన వాక్యాలూ ఈ రచనా విధానంలో ప్రముఖంగా ఉండేవి.
4. కావ్యభాషా సంప్రదాయంతోపాటు, సమకాలపు వాడుక భాషా సంప్రదాయం రాయవాచకం వంటి కొన్ని వచన రచనల్లో అంతర్భాగంగా కన్పిస్తుంది.
5. పందొమ్మిదో శతాబ్ది ప్రారంభం నాటికే కథా సాహిత్యాన్ని, శాస్త్ర గ్రంథాల వివరణలనూ సులభ శైలిలో రాసే అలవాటు నెలకొంది.
6. ఈ శతాబ్దిలో సజీవమైన వ్యావహారిక శైలి నిమిత్తం కృషి జరిగింది. గిడుగు, గురజాడ, కొత్తబాట వేశారు.
7. ఆధునికకాలంలో వచనం విశ్వరూపం తాల్చింది. వివిధ వచన ప్రక్రియల్లోని విషయ వైవిధ్యానికి అనుగుణంగా శైలీ వైవిధ్యం భాషలో ఏర్పడింది.

BRAOU

**అదనపు సమాచారం**

వచన శైలిలో మార్పులు రావాలనీ, వైవిధ్యం రావాలనీ ఆకాంక్షించిన వారిలో పానుగంటి లక్ష్మీనరసింహారావు (1865-1940) ఒకరు. 1922లో పిఠాపురంలో జరిగిన ఆంధ్ర సాహిత్య పరిషత్తు పదకొండవ వార్షికోత్సవానికి అగ్రాసనాధిపత్యం వహిస్తూ ఆయన చెప్పిన మాటలు కొన్ని నేటికీ ఆసక్తికరమయినవే. చూడండి:

"చిత్రములైన శైలీ భేదములు మన భాషలో మిగుల నరుదుగా నున్నవని వేరే చెప్పనేల? రైమని పేక చువ్వ పైకెగిరినట్లున్న శైలి భేదమేది? కాకి పైకెగిరి యెగిరి ఱెక్కలు కదలకుండ జందెపుఁబెట్టుగ సాపుగ వాలుగ దిగునప్పటి లఘుపతన చమత్కృతి కనఁబఱుచు శైలి పద్ధతి యేది? తాళము వాయించునప్పటి తళుకు బెళుకులు, ఢింగుఢింగులు, గలగలలు, జలజలలు గల శైలి యేది?......భయంకరమయ్యును మనోహరమై, మహాశక్తి సక్తమయ్యు మార్దవయుక్తమై, ధారాళమయ్యు విశాలమై, స్వభావ సమృద్ధమయ్యు సరసాలంకార భూయిష్ఠమై, సముద్ర ఘోషము గలదయ్యు సంగీతప్రాయమై, స్పష్టీకృత సకల విషయ తత్త్వమయ్యు నస్పష్ట స్వకీయ తత్త్వమై, చదువరులకుఁ గనుకట్టై, వాకట్టై, మదిగట్టై తల పులిమినట్లు, శ్వాసమైన సలుపకుండఁ జేసినట్లు, ముష్టివాని చిప్పనుండి మూర్ధాభిషిక్తుని కిరీటము వఱకు, భూమిక్రింది యరలనుండి సముద్రములోని గుహలవఱకు, నెవరెస్టు కొండనుండి యింద్రధనుస్సు రంగుల వఱకు, మందాకినీ తరంగ రంగద్ధంసాంగనా క్రేంకారములనుండి మహాదేవ సంధ్యాసమయ నాట్యరంగము వఱకు మనో వేగముతో నెగురు శక్తిగల చిత్ర విచిత్ర శైలీ భేదము లింకనెన్నియో భాషలోఁ బుట్టవలసియున్నవి."

మరొక సందర్భంలో కూడా పానుగంటివారు ఇటువంటి సూచనే సంక్షిప్తంగా చేశారు. "ఇప్పటి వచన శైలి తరచుగ నీరసముగను, నిస్ప్రౌఢముగ నున్నది. కాని మిగుల సంతుష్టికరముగ నుండలేదు. ఇంకను బలిష్ఠమై, ధారాళమై, పౌరుషయుక్తమై, ప్రాణ ధురంధరమైన శైలి బయలుదేరలేదు. క్రమక్రమముగ బయలు దేరగలదు."

## అభ్యాసాలూ, ప్రశ్నలూ

1. మీ పాఠ్యాంశాలు సమాజ విజ్ఞానం, విజ్ఞానశాస్త్రం పుస్తకాల్లో వాడిన శైలిపై వ్యాఖ్య రాయండి.

2. ముందు చదివిన పాఠాల్లో మీరు వివిధ తెలుగు వచన ప్రక్రియలతో పరిచయం ఏర్పరచుకున్నారు. వాటిలోని శైలీ వైవిధ్యంపై వ్యాఖ్య రాయండి.

3. పందొమ్మిదో శతాబ్ది మధ్యదాకా వచ్చిన వచన రచనల్లోని రచనా విధానాన్ని గురించి రాయండి.

4. ఈ శతాబ్ది వచన రచనల్లోని శైలి లక్షణాలను తెల్పండి.

BRAOU

## ఖండిక 14 పాఠం 26

# శైలిలో భేదాలు: మాండలిక శైలిలో భేదాలు

**ఉద్దేశం**

ఆధునిక సృజనాత్మక రచయితలు తమ రచనలను ప్రజలకు మరింత సన్నిహితం చేయాలనే ఉద్దేశం ఉన్నవాళ్ళు. అందువల్ల తమకు పరిచితమైన ప్రాంతాల జీవితాన్నో, వర్గాల జీవితాన్నో వాళ్ళు చిత్రిస్తున్నారు. ఆ ప్రాంతాల్లోని భాషాభేదాలను రచనల్లో వాడుకుంటున్నారు. వచన రచనా భాషలో వివిధ మాండలిక భాషా భేదాలు కన్పిస్తాయి. ఇవి రచనా విధానంలో అంటే శైలిలో అంతర్భాగంగా ఉన్నాయి. వీటిని పరిచయం చెయ్యడమే ఈ పాఠం లక్ష్యం.

**ప్రణాళిక**

1. భాషలో వైవిధ్యం
2. ప్రాంతీయ మాండలికాలు
3. వర్గ మాండలికాలు
4. వచన రచనలో మాండలిక భేదాలు
5. కాల్పనిక సాహిత్యంలో మాండలిక భేదాలు
6. మాండలిక శైలీ భేదాలను వాడిన రచయితలు
7. ముఖ్య విషయ క్రోడీకరణ
8. అభ్యాసాలూ, ప్రశ్నలూ

BRAOU

మొదటి పాఠంలో మాండలికాలు అనే మాటను పరిచయం చెయ్యడమే కాకుండా, తెలుగు మాండలికాల గురించి స్థూలంగా వివరించాము. మాండలిక భాషాభేదాలు కథల్లో, నవలల్లో, నాటకాల్లో సందర్భాన్నిబట్టి వాడతారనీ, అన్నిరకాల ప్రజలనూ ఉద్దేశించి చేసిన రచనల్లో (వ్యాసరచనలో, పత్రికా రచనలో) ప్రామాణిక భాషను వాడతారనీ అక్కడ తెలుసుకున్నారు. ఈ పాఠంలో ఆంధ్రదేశంలోని మాండలిక భేదాలను గురించీ, తెలుగు వచన రచనలో ముఖ్యంగా కల్పనా సాహిత్యంలో వాటి వాడుకను గురించీ వివరిస్తున్నాము.

## భాషలో వైవిధ్యం

రకరకాల మనుషులూ, వివిధ ప్రాంతాలకు చెందిన వాళ్ళూ, ఏదో ఒక వర్గం వాళ్లూ, ఏదో ఒక వృత్తి చేసుకునే వాళ్లూ, అక్షరం ముక్కరాని వాళ్ళూ, చదువుకున్నవాళ్ళూ, పిల్లలో, పెద్దలో, స్త్రీలో, పురుషులో మీకు నిత్యమూ ఎదురవుతుంటారు. ఇంట్లో, వీధిలో, పొలంలో, గనిలో, పనిలో, కార్ఖానాలో, ప్రభుత్వ కార్యాలయాల్లో, పత్రికా కార్యాలయాల్లో, తరగతి గదుల్లో, సభల్లో, సమావేశాల్లో. మీ ఊళ్ళోనో, మీ పట్టణంలోనో ఎక్కడో ఒకచోట, ఏదో ఒక మానసిక స్థితిలో ఎదురవుతుంటారు. మీతోనో మరొకరితోనో మాట్లాడుతున్నప్పుడు వాళ్ళ పలుకుబడినీ, మాటతీరునూ పరిశీలించడం నేర్చుకోండి. జీవితంలో ఎంత వైవిధ్యముందో, భాషలోనూ అంత వైవిధ్యముందని గ్రహిస్తారు. జీవితంలో సామాన్య లక్షణాలూ, ఏకత్వమూ ఉన్నట్లే, భాషలోనూ సామాన్య లక్షణాలూ, ఏకత్వమూ ఉంటాయని తెలుసుకుంటారు.

అతి సూక్ష్మంగా పరిశీలిస్తే, ఒక మనిషి ఒకచోట, ఒక మానసిక స్థితిలో ఒకరితో ఒక విషయాన్ని గురించి మాట్లాడిన తీరులో, మరొకచోట, మరొక మానసిక స్థితిలో, మరొకరితో మరొక విషయాన్ని గురించి

మాట్లాడడు. మాట్లాడేవాడు వక్త కదా! వక్తకు విలక్షణమైన వేలిముద్రలాంటి ఒకమాట తీరును మనం గమనించవచ్చునని భాషా శాస్త్రజ్ఞులు అంటారు. వక్తకు విలక్షణమైన మాటతీరును వ్యక్తిమాండలికం (ideolect) అని పిలుస్తారు. (ఈ పాఠం పరిమితిలో వ్యక్తి మాండలికాలను పరిచయం చేయడంలేదు).

స్థూలంగానే పరిశీలించండి. ఒక ప్రాంతంలో ఉన్నమాట తీరుకూ, మరొక ప్రాంతంలోని మాటతీరుకూ భేదం కన్పిస్తుంది. మన పల్లెపట్టుల్లో తూర్పు యాస, పడమటి యాస, దక్షిణాది యాస, ఉత్తరపు యాస అనే మాటలు మీరు వినే ఉంటారు. ఇవి ఒక ప్రాంతంలోని జనం మరొక ప్రాంతం ప్రజల ఉచ్చారణను స్థూలంగా గమనించి అనే మాటలు. అంటే ఒక కాలంలో వివిధ భౌగోళిక ప్రాంతాల మధ్య మాట తేడా ఉందన్నమాట. ప్రాంతీయమైన మాట తేడాను ప్రాంతీయ మాండలికం (Regional dialect) అంటారు.

ఒక జన సముదాయం (వర్గ భేదాల వల్లా, వృత్తి భేదాల వల్లా, కులమతాది శాఖా భేదాల వల్లా ఒక సాంఘిక ప్రతిపత్తి, ఒక సాంఘిక వ్యక్తిత్వం అంటూ ఏదో ఒక రూపంలో ఉన్న జనసముదాయం) మాట ధోరణికీ, మరొక జనసముదాయం మాట ధోరణికీ తేడా కనిపిస్తుంది. ఇట్లాగా సమాజంలోని అంతరువులను సూచించే ఆర్థిక, సామాజిక, సాంస్కృతికపరమైన మాట తేడాను వర్గ మాండలికం (Social dialect/ Sociolect) అని అంటారు.

ఉచ్చారణలో, వాడే పదాల్లో, జాతీయాల్లో, సామెతల్లో, వ్యాకరణ రూపాల్లో వ్యవహార వైవిధ్యం కనిపిస్తుంది. భాషను మాట్లాడే వాళ్ళ వాడుకలోని వివిధ రూపాలనే మాండలిక భేదాలు అని అంటారు.

ఈ పదాలను, పదబంధాలను, వాటి అర్థాలను, వాటిని వాడే వాళ్ళనూ గమనించండి:

| పదం | అర్థం | వాడే వ్యవహర్తలు | ప్రాంతం |
|---|---|---|---|
| బెమ్చా | ముఖస్తుతితో ఆశ్రయించే వ్యక్తి | విద్యార్థులు | తెలంగాణా |
| లైటుగొట్టడం | అకర్షణీయంగా ముస్తాబుకావటం | ,, | ,, |
| బుస్సుబుస్సుమని | ఉపన్యాసంలో గాలి పోగుచేసి | ,, | రాయలసీమ |
| పామును వదలడం | మాట్లాడడం, గ్యాసు కొట్టడం | | |
| కలర్స్ | అమ్మాయిలు | ,, | ,, |
| టచింగ్స్ | సినిమాల్లో నాయికా నాయకుల శృంగార చేష్టలు | ,, | ,, |
| బీటు వేయడం/ బీటు కొట్టడం | ఆడపిల్లలకోసం పడిగాపులు పడడం | ,, | దాదాపు అన్నిప్రాంతాల్లో |
| పట్టు పరిశ్రమ | స్వలాభంకోసం మనుషుల్ని వాడుకునే తీరు | ,, | ,, కొంతమందిలో |
| తలకాయ తినడం, సుత్తిగొట్టడం | తెగవాగి బోరుకొట్టడం | అన్ని వర్గాలవాళ్లు | దాదాపు అన్నిప్రాంతాల్లో |
| పాసింజరు | విటుడు | అధోజగత్తు | కోస్తా |
| విభూదిపండు | కోడిగుడ్డు | మాంసం తినని కులాల రహస్యభాష | దాదాపు అన్నిప్రాంతాల్లో పరిమిత ప్రయోగం |
| జలపుష్పం | చేప | ,, | ,, |

ఈ పదప్రయోగాలు గమనిస్తే వ్యవహార వైవిధ్యంలో చాలాచాలా అవాంతర భేదాలున్నాయని మనకు తెలుస్తుంది. ఈ అవాంతర భేదాలన్నీ ఇప్పుడు మీకు అవసరంలేదు. ముఖ్యంగా ప్రాంతీయ, వర్గ మాండలికాలను మాత్రమే తెలుసుకోండి.

BRAOU

### ప్రాంతీయ మాండలికాలు-భాషా మండలాలు

ప్రాంతీయ మాండలికం అనే మాటను, మాట తేడా కన్పించే ఒక చిన్న ప్రాంతం మొదలుకొని విస్తారమైన ప్రాంతం వరకు అన్వయించవచ్చు. ఉదాహరణకు కడపజిల్లాలో పులివెందుల తాలూకా వాళ్ళ మాట తీరుకూ, నెల్లూరుజిల్లాకు దగ్గరగా ఉన్న రాజంపేట మాట తీరుకూ తేడా కనిపిస్తుంది. అట్లాగే కరీంనగర్ జిల్లా మాట తీరుకూ, ఆదిలాబాదు జిల్లా మాట తీరుకూ తేడా కనిపిస్తుంది. అంటే స్థానిక భేదాలు ఉంటున్నాయన్నమాట. మాట తీరులోని స్థూలమైన ఏకత్వం ఆధారంగా తెలుగునాడును నాలుగు భాషా మండలాలుగా ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తిగారు విభజించారు. (ఈ విషయమై మరికొంత విస్తారంగా తెలుసుకోవాలనే కుతూహలమున్న విద్యార్థులు పాఠం చివరలో ఇచ్చిన చదవదగిన పుస్తకాలు చూడండి). వృత్తి పదపరిశోధన ఆధారంగా ఆయన సూచించిన భాషా మండలాలు నాలుగూ ఇవి:

1. పూర్వ మండలం (శ్రీకాకుళం, విశాఖ జిల్లాలు)
2. దక్షిణ మండలం (రాయలసీమ జిల్లాలు, నెల్లూరు, మహబూబ్‌నగర్ జిల్లా దక్షిణప్రాంతం, ప్రకాశంజిల్లా కొంతభాగం)
3. ఉత్తర మండలం (తెలంగాణా జిల్లాలు, మహబూబ్‌నగర్, ఖమ్మం జిల్లాలలోని కొన్ని ప్రాంతాలుకాక)
4. మధ్య మండలం (పశ్చిమ గోదావరి, తూర్పుగోదావరి, క్రిష్ణా, గుంటూరు, క్రిష్ణా గోదావరి జిల్లాలకు ఆనుకొని ఉన్న ఖమ్మం జిల్లాలో కొంతభాగం.)

ఈ కింది అయిదు పదాల వాడకంలోని భేదాలను చూడండి

| పూర్వ మండలం (కళింగప్రాంతం తెలుగు) | దక్షిణ మండలం (రాయలసీమ తెలుగు) | ఉత్తర మండలం (తెలంగాణా తెలుగు) | మధ్య మండలం (కోస్తా తెలుగు) |
|---|---|---|---|
| ఆనపకాయ | సొరకాయ | ఆనిగెంకాయ | సొరకాయ |
| గోంగూర | గోనాకు | పుంటికూర | గోంగూర |
| చోడి (బహు వ చోళ్ళు) | రాగి | తమిదె | తమిదె |
| పూజు/పూచు | కాడిమాను/కాడిమాకు | కాండి/కాశి/కాని | కాడి |
| గంటె/గంటి | సద్ద | సజ్జ/సద్ద | సజ్జ |

BRAOU

## వర్గమాండలికాలు :

చదువుకున్న వాళ్ళు, చదువుకోనివాళ్ళ మధ్యఉండే భేదాలు పైన వివరించిన నాలుగు భాషా మండలాలకూ సామాన్యమైనవి చాలా ఉన్నాయి. చదువుకున్న వాళ్ళ మాటతీరును ప్రామాణిక మాండలికం అని అనవచ్చు. చదువురాని వాళ్ళ మాటతీరును అప్రామాణిక మాండలికం (non standard dialect) అని అనవచ్చు. చదువుకున్న వాళ్ళ మాటతీరుకు మూలం చాలా మటుకు మధ్యమండల భాషఅనీ, అదే ఆధునిక ప్రామాణిక భాష అనీ మొదటి పాఠం ద్వారా గ్రహించి ఉంటారు, ఈ నాటి ప్రసార సాధనాలూ, రచనా సంప్రదాయం ఆధునిక ప్రామాణిక భాషనే ఉపయోగిస్తున్నాయని కూడా తెలుసుకున్నారు. ప్రామాణిక భాష, అప్రామాణిక మాండలికం మధ్య ఉచ్చారణలో కొన్ని ముఖ్యమైన తేడాలు కనిపిస్తాయి. ప్రామాణిక భాషలో ఫ, భ, ధ, మొదలైన ఒత్తులు ఉచ్చారణలో ఉంటాయి. అప్రామాణికంలో ప, బ, ద అని ఒత్తులులేకుండా పలుకుతారు. పదం మొదట్లోని వకారం ప్రామాణిక భాషలో ఉంటుంది. అప్రామాణికంలో పోతుంది. (వాడు అనేమాట ఆడు అని ఉచ్చరించడం మీరు గమనించే ఉంటారు). ప్రామాణిక భాషలో సంయుక్తాక్షరాలు స్త, మ్య, క్ష లాంటివి నిలుస్తాయి. అప్రామాణికంలో పుస్తకం, పుత్తకం; అమృతం-అమురుతం; డాక్టరు-డాకటేరు. ప్రామాణికంలో శ, ష, స-ల మధ్య భేదం ఉండి, అవి అప్రామాణికంలో 'స'గా మారుతాయి (భాష - బాస). ఈ రకం

ఉచ్చారణలోని భేదాలను బట్టి తెలుగు భాషలోకి సంస్కృతం, ఇంగ్లీషు భాషల ద్వారా వచ్చిన అన్యదేశాలను ప్రామాణిక భాషా వ్యవహర్తలు, తెలుగుకు ప్రకృతి సిద్ధమైన పద్ధతిలో మార్చకుండా ఉచ్చరించగలరనీ, అప్రామాణిక భాషా వ్యవహర్తలు ఉచ్చరించలేరనీ తెలుస్తుంది. ప్రకృతి సిద్ధమైన అనే మాటను మనం వాడుతున్నప్పుడు భాష వాడకాన్ని సామాజిక ప్రతిష్ఠ (Social prestige) అనే విషయంకూడా నిర్ణయిస్తుందనేది మరచిపోరాదు. చదువుకోనివాళ్ళు, చదువుకున్నవాళ్ళు భాషను అనుకరించడం, ఒక ప్రాంతం భాషను మరొక ప్రాంతం వాళ్ళు వాడకానికి తీసుకోవడం ఈ సామాజిక ప్రతిష్ఠకు సంబంధించిన అంశమే. ప్రాంతం, వర్గం, కులం, మతం భేదాలు లేకుండా చదువుకున్న వాళ్లు, చదువుకోని వాళ్ళ మధ్య ఉచ్చారణలో ఈ మార్పులు కనిపిస్తాయి. కొన్ని ప్రాంతీయ మాండలికాలకే పరిమితంగా చదువుకున్న వాళ్ళకూ, చదువుకోని వాళ్ళకూ ఉచ్చారణలో తేడాలు ఉన్నాయి. విశాఖ, శ్రీకాకుళం జిల్లాలలో ప్రామాణికంలో 'లేదు' అని ఉంటే అప్రామాణికంలో 'నేదు' అని ఉంది. ఇట్లాటి తేడాలు గ్రామీణ ప్రాంతాలూ, పట్టణ ప్రాంతాల మధ్యకూడా ఉన్నాయి.

పైన చెప్పిన మాండలిక భేదాలన్నీ మాట్లాడే భాషకు సంబంధించినవి. వీటిని వ్యాస రచన భేదాలలో, పత్రికా రచనా భేదాలలో, లేఖా రచనా భేదాలలో ప్రదర్శించడం ప్రమాణ భాష ఆవశ్యకత దృష్ట్యా సాధ్యం కాదు. వ్యాసరచన, పత్రికా రచన, లేఖా రచన (వ్యక్తిగత లేఖలు తప్ప మిగతవన్నీ), ప్రధానంగా అభిప్రాయ వినిమయానికి తోడ్పడేవి. వాస్తవికత కోసం ప్రాంతీయ మాండలికాలుగానీ, వర్గ మాండలికాలుగానీ, ఈ రకం రచనల్లో ఎవరూ వాడరు. అయితే ఏదో ఒక ప్రాంతంలోని చదువురాని పల్లె ప్రజల ముందు వాళ్ళ మాండలికంలోనే ఆ ప్రాంతానికే చెందిన ఉపన్యాసకుడు ఉపన్యాసమిచ్చి, ఆ ఉపన్యాస పాఠాన్ని యథాతథంగా అచ్చు వేసే అరుదైన సందర్భాల్లో తప్ప ఇది సాధ్యం కాదు. అయితే కొందరు రచయితలు కొన్ని ప్రాంతీయ మాండలిక పదాలను ప్రమాణ భాషలో కలిపి వాడుతున్నారు. క్రియా రూపాల్లో రాయలసీమ రచయితలు 'చేసినాడు' అనీ, తెలంగాణా రచయితలు 'చేసిండు' అనీ ప్రయోగించడం కొన్ని సందర్భాల్లో జరుగుతోంది.

BRAOU

## కల్పనా సాహిత్యంలో మాండలిక శైలీ భేదాలు

కథల్లో, నవలల్లో, నాటకాల్లో జీవిత వాస్తవ చిత్రణ ఉంటుంది. జీవిత వాస్తవం అంటే సంఘంలోని వాస్తవం. సంఘ చరిత్ర వాస్తవం. వ్యక్తుల మీద ప్రభావం చూపే వివిధ ప్రాంతీయ, సాంఘిక శక్తుల ప్రభావాన్ని రచయితలు కల్పనా సాహిత్యంలో చిత్రిస్తారు. ఆ శక్తుల ప్రభావంలోని వ్యక్తుల చిత్తవృత్తినీ, మాట తీరునూ చిత్రిస్తారు. ఈ రకమైన చిత్రణ పాత్రల సృష్టిలో భాగంగా, వాతావరణ కల్పనలో భాగంగా కొందరు సృజనాత్మక రచయితలు తమ రచనల్లో మాండలికాలను వాడతారు. రచయితల వాడుక భాష, రచయితలు సృష్టించే జీవితంలో ప్రజల భాష ఒకటిగా ఉన్నప్పుడు వాస్తవిక సాహిత్య సృష్టి జరుగుతుంది. పాఠకుల్లో ఆ వాస్తవికత అనుభవాని కొస్తుంది.

పోయిన శతాబ్దిలోనే మొట్టమొదట మాండలిక భాషా భేదాలను గురజాడ తమ కన్యాశుల్కం నాటకంలో వాడారు (1897). కన్యాశుల్కంలోని భాష కళింగ ప్రాంతపు మాండలికం. అయితే అందులో అనేకమైన వర్గ మాండలికాలు పాత్రల ద్వారా గురజాడ పలికిస్తాడు. గిరీశం, బుచ్చమ్మ, వెంకటేశం, అగ్నిహోత్రావధాన్లు రామప్పంతులు, సౌజన్యరావు పంతులు, మధురవాణి, పోలిశెట్టి, బైరాగి, పీరేశం, మునసబు, మనవాళ్ళయ్య మొదలైన వాళ్ళు ఒక కులం వాళ్ళు, ఒక కులంలోని ఒకే శాఖలోని వాళ్ళు కారు. చదువు సంధ్యల విషయంలో తేడాలున్నాయి. యాసల్లో తేడాలున్నాయి.

ఉదాహరణకు వైదీకుల మాండలికం:
బుచ్చమ్మ: తమ్ముడూ, అమ్మ కాళ్ళు *కడుక్కో మంచూందిరా*
అగ్ని హోత్రావధాన్లు : మీది రాజ *మహేంద్రంషండీ*
నాయుళ్ళ మాండలికం: (రామచంద్రపురం అగ్రహారంలో గ్రామ మునసబు సోమి నాయుడు)

''పంగనావాఁలు ముంచా, పట్టె హొర్దనాలు పుందా? నామాలోడా, నా సవాలేటి నీ జవాబేటి? ఆకాశానికి మట్టా బూఁవి? బూవికి కప్పా ఆకాశం? సదువుకున్నోడెవడో సెప్పండొస్సి''

జంగం వీరేశ మాండలికం :

''చివచివా చివచివా!'' (శివశివా! శివశివా!)

భాష విషయంలో గురజాడ సంప్రదాయాన్ని నమ్మిన కొందరు రచయితలు వివిధ మాండలిక శైలీ భేదాలను తమ రచనల్లో ఉపయోగిస్తున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతపు జీవితాన్ని చిత్రించే రచయితల రచనల్లో, పట్టణ ప్రాంతాల్లోని అధోజగత్తును చిత్రించే రచయితల రచనల్లో మాండలిక శైలీ భేదాలు ప్రముఖంగా కనిపిస్తాయి: కొందరు రచయితలు, రచనల్లో ప్రముఖంగా వాడిన మాండలిక శైలీ భేదాల వివరాలు చూడండి (వీలుంటే ఈ పుస్తకాలు సంపాదించి చదవండి).

| | రచయిత పేరు | రచనా ప్రక్రియ | రచనలు | వాడిన మాండలికం |
|---|---|---|---|---|
| I. | రాచకొండ విశ్వనాథశాస్త్రి | కథలు, నవలలు | సొమ్ములు పోనాయండి (పెద్దకథ)<br>ఆరు సారా కథలు | కళింగాంధ్రం (విశాఖ) |
| | కాళీపట్నం రామారావు | కథలు | కా. రా. కథలు<br>యజ్ఞం | కళింగాంధ్రం (శ్రీకాకుళం) |
| | భూషణం | కథలు, నవలలు | కొండగాలి (నవల) | ,, |
| | గణేష్‌పాత్రో | నాటకం | పావలా (నాటిక) | కళింగాంధ్రం (విశాఖ) |
| II. | కరుణకుమార | కథలు | కరుణకుమార కథలు<br>సన్నజీవాలు | రాయలసీమ తెలుగు (నెల్లూరు) |
| | కేశవరెడ్డి | నవలలు | ఇన్‌క్రెడిబుల్ గాడెస్<br>స్మశానం దున్నేరు | రాయలసీమ తెలుగు (చిత్తూరు) |
| | కేతు విశ్వనాథరెడ్డి | కథలు, నవల | జప్తు (కథలు) | రాయలసీమ తెలుగు (కడప) |
| III. | వట్టికోట ఆళ్వారుస్వామి | నవలలు | ప్రజలమనిషి<br>గంగు | తెలంగాణా తెలుగు |
| | దాశరథి రంగాచార్య | నవలలు | చిల్లరదేవుళ్ళు<br>మోదుగుపూలు<br>జనపదం | ,, |
| | అల్లం రాజయ్య | కథలు, నవలలు | భూమి (కథలు)<br>సృష్టికర్తలు (కథలు)<br>కొలిమంటుకున్నాది (నవల) | తెలంగాణా తెలుగు (ఆదిలాబాదు) |
| | బి. ఎస్. రాములు | నవల | బ్రతుకుపోరు | తెలంగాణా తెలుగు (కరీంనగర్) |
| IV. | మా. గోఖలే | కథలు | మూగజీవాలు<br>బల్లకట్టు పాపయ్య | కోస్తా తెలుగు (గుంటూరు) |

పోరంకి దక్షిణామూర్తి కోస్తా, తెలంగాణా, రాయలసీమ మాండలికాల్లో వరుసగా మూడు నవలలు రాశారు. అవి: వెలుగు వెన్నెల గోదారి, రంగవల్లి, ముత్యాల పందిరి. చాలా సాహసమైన ప్రయత్నం ఇది.

BRAOU

తెలంగాణా ప్రాంత రచయితలు ఈనాడు గణనీయమైన సంఖ్యలో తమ మాండలికంలో రాస్తున్నారు. వీరిలో రెండు రకాలుగా రాసేవాళ్ళున్నారు. మొదటిరకం రచయితలు కథ చెప్పడానికి ప్రామాణిక భాషను ఉపయోగిస్తారు. పాత్రలు మాండలిక భాషను ఉపయోగిస్తాయి. రెండవ రకం **పూర్తి** మాండలికంలోనే (అంటే కథ చెప్పే తీరూ, పాత్రలు మాట్లాడే తీరూ ఒకే మాండలికంలో ఉండడం) రాసేవాళ్ళు. ఒకే రచయిత రెండు రకాల్లో కూడా రాసిన సందర్భాలున్నాయి.

ఇప్పుడు ఈ కింది ఉదాహరణలు గమనించండి :

1. "మామా! వాకిలితియ్యి; మామా! వాకిలి, వాకిలి!" పెట్టకూత వినబడ్డ పుంజులాగ, చెవులు బారెడు చేసుకొని ఆప్యాయంగా ఆలకించాడు ఆ పిలుపు-సాలలో గుర్రానికి మాలీసు చేస్తున్న రొబ్బయ్య; వడివడిగాపోయి **వాకిలి చిలుకు** తీసి తలుపు తెరిచాడు, గడపలో నిలబడ్డ పెంచెల్ని ఆహ్వానం చేస్తూను.

"వాకిలి బిగించుకొన్నావేందయ్యా, సంజకాడ? లోగా బిళ్ళాటలాడుతుండావా ఏంది?" అని కిసుక్కున నవ్వింది పెంచెలి.

"ఆడుతూనే ఉండా" అన్నాడు బింకంగా రొబ్బయ్య." (కరుణకుమార రాసిన 'పశువులకొఠం' కథలో ప్రారంభం)

2. "రాత్తిరి బువ్వల్దిని పొండుకునే యాలయింది. సలిరోజులు. ఎప్పురమటుకు పొండుకోక సేసేదేంది.

బూసమ్మ మొగుడు బసవయ్య సందేల బువదిని 'ఇదిగిప్పుడు రానంటే' అని ఎల్లినోడు పొండుకునే యాల సానా లెక్క మిగిలిపోయినా మల్లీ తిరిగిరాలా.

బుడ్డిదీపం ఎల్తుర్లో పక్కేసిన మంచమ్మీన, రావణాబ్రెమ్మ పుద్యానకంలో సీతమ్మోరికి మల్లే, అటనే తలొంచుక్కూచుని ఇశార పడ్తండది బూసమ్మ. (మా. గోఖలే "పెల్లాం బూసమ్మ" కథలో ప్రారంభం)

మొదటి ఉదాహరణంలో కథచెప్పే వ్యక్తి (రచయిత) ప్రామాణికంలో ఉన్నట్లు (పెట్టకూత వినపడ్డ... చేస్తూను) మీరు గ్రహించగలరు. అయితే, ప్రామాణిక భాషలో వాకిలి, చిలుకు వంటి రాయలసీమ ప్రాంత మాండలిక పదాలను వాడడం మీరు చూడవచ్చు. రెండవ ఉదాహరణలో కథ చెప్పే వ్యక్తి భాష మొత్తం మాండలికంలో ఉంది. ఈరకం భేదాలన్నిటినీ నిశితంగా మాట్లాడే భాషను పరిశీలించడంవల్లా, మాట్లాడే భాషను తమ సృజనాత్మక రచనల్లో నిశితమైన పరిశీలనతో ఉపయోగించుకున్న రచయితల రచనలు పరిశీలించడంవల్లా మరింత విశదంగా తెలుస్తాయి.

BRAOU

**ముఖ్య విషయ క్రోడీకరణ**

1. భాషలో వైవిధ్యం ఉంటుంది.
2. ప్రాంతాన్నిబట్టి సామాజిక వర్గాన్నిబట్టి భాషలో మాండలికాలు ఏర్పడతాయి. ప్రాంతీయ మాండలికాలు, వర్గ మాండలికాలు ముఖ్యమైనవి.
3. వృత్తిపద పరిశోధన ఆధారంగా ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తిగారు తెలుగునాడును నాలుగు భాషా మండలాలుగా విభజించవచ్చునని సూచించారు. ఆయన సూచించిన భాషా మండలాలు 1. పూర్వ మండలం దీన్నే కళింగాంధ్రం అంటారు. 2. దక్షిణ మండలం-దీన్నే రాయలసీమ తెలుగు అంటారు. 3. ఉత్తర మండలం-దీన్ని తెలంగాణా తెలుగు అంటారు. 4. మధ్యమండలం-దీన్ని కోస్తా తెలుగు అంటారు.
4. వర్గ మాండలికంలో ప్రామాణిక-అప్రామాణిక భేదాలున్నాయి. చదువుకున్నవాళ్ళు రాసేదీ, మాట్లాడేదీ ప్రామాణికం. చదువుకోనివాళ్ళు మాట్లాడేది అప్రామాణికం.
5. వ్యాసరచనలో, పత్రికారచనలో ప్రమాణభాషే వాడతారు.
6. కల్పనా సాహిత్యంలో వివిధ ప్రాంతీయ, వర్గ మాండలికాలను రచయితలు జీవిత వాస్తవ చిత్రణ కోసం వాడతారు.

## అభ్యాసాలూ, ప్రశ్నలూ.

1. ఈ కింది బాంధవ్య బోధక పదాలను మీ మాండలికంలో ఏమంటారో రాయండి. మీరు స్త్రీలయిత్తే ఏమంటారు? పురుషులైతే ఏమంటారు?
   తల్లి, తండ్రి తల్లి, భర్తసోదరి, తల్లిసోదరుడు, తండ్రిసోదరి, సోదరికొడుకు, సోదరికూతురు, భర్త సోదరుని భార్య, భార్యసోదరిభర్త, కూతురు, కూతురు/కొడుకు మామగారు.
2. ఈ కింది పదాలకు సమాంతరమైన పదాలను మీ మాండలికంలో రాయండి.
   గోరుచిక్కుడు, జేడలు, మేఘం, వాకిలి, గొళ్ళెం, వంద, నేయి, నూనె, దుకాణం (shop), బంకు (bunk)
3. మీరు మీ మాండలికం పేరు పేర్కొని, దానిలోని క్రియా రూపాలను వాక్యాల్లో రాయండి (వర్తమాన కాలం, భూత కాలం, భవిష్యత్కాలం).
4. మీ భాషా మండలంలో జిల్లాకు జిల్లాకు గానీ, జిల్లాలోని తాలూకాలు లేదా ప్రాంతాల మధ్య గానీ స్థానిక మాండలిక భేదాలు మీరు పరిశీలించినవి రాయండి.
5. తరుణకుమార రాసిన 'బిళ్ళల మొలతాడు' అనే కథ నుంచీ, అల్లంరాజయ్య రాసిన 'ఎద్దు'అనే కథలో నుంచీ రెండు భాగాలు ఇస్తున్నాము. ఇటాలిక్స్‌లోని మాటలకు సమానమైన మాటలను మీ మాండలికంలో రాసి అర్థాలు రాయండి (వ్యవసాయ వృత్తిపదకోశం సహాయం తీసుకోండి)

'బిళ్ళల మొలతాడు'లో నుంచి :

''ఇక వ్యవసాయ కృషిలో సుబ్బులుకు తెలియని పని లేదు గదా! అటు *వడదుక్కిలో* గాని, ఇటు రొంపి దుక్కిలో గాని, వాడు *కయ్యలో* దిగి *నాగేటి* మేడతోక పట్టుకుంటే, పదేసి వందల రూపాయలు కిమ్మతు చేసే రెడ్డిగారి పెద్ద ఎద్దుల జత కూడా గడగడలాడి పోవలసిందే. వాడి చేత్తో *గుంటక* తోలి, *నల్లమానూ*, *కర్రలమానూ* ఒక్కసారి అట్లా ఆడిస్తే చాలు - నునుకు అంతా పోయి కయ్య అలా ఉండి పోవలసిందే. నాగేటి అర్రు మీద పెట్టి, *వారిణ* బిగించి *పణతకొయ్య* ఆరు పట్టుకొని వాడు చాలు తోలితే, ఒక్క *మడక* తోనే కయ్య పదును తేలి చాళ వేసుకోవచ్చు. విత్తనం ఏ అదును చల్లాలో కయ్య *అరగట్టాలో* సుబ్బులుకు తెలిసినట్టు మరొక *సేద్యగాడికి* తెలియదని అనుకొంటారు....పుట్టు *కలగర* కట్టి మిట్టలు తేల బెడతారు...మోపు పైకి లేచేసరికి రెండు మూడు కలగరలు పెట్టి నీళ్ళు నిలవేస్తారు...ఎక్కడెక్కడ ఏయే కయ్యలో నీళ్ళు పులక తేలిపోయాయో, ఏ కయ్య ఆరగట్టాలో, ఏ కయ్యకు నీళ్ళు ఎద్దడయినాయో—

...*తుంగా*, *గాజా*, *ఊదారా* కోయించి కలుపు తీయించే వరకు ఊరుకోడు సుబ్బులు. కయ్యలో పైరు *పాలు పోసుకొని*, సుంకు మీద *పొట్ట* దేలి కరుగు మోపిందనే వరకు— ఇక సుబ్బులు సంతోషం చెప్పలేము.

'ఎద్దు' కథలో నుంచి:

"*గుంటక అడిని పాలేరోల్లు* పలుగు యాడగొట్టుకొని బారెడు *దొత్తెలు* పగ్గాలు సుట్టు *తండాంద్రు*.

మెడ లిసురుకొని *ఎడు గెట్ల* పొంట పసక (పచ్చిక) మేసుకొంట సెలుక దాటి బీట్లకు పొయినయ్.

ఆదివరకే బీట్లె రెండెడ్లు మేత్తున్నయ్ ... *గ* రెండెడ్లల్ల ఓటి *కముల* తోకది. ఇంకోటి కయిలిది. *గ* రెండెడ్లు *ఓదెలుయి*. *గీ* పదెడ్లు యాదగిరియి.

యాదగిరి పొట్టి కొమ్ములది వుట్ల సిమ్మి పెడీ పెడీన వెంకలేసింది.

ఓదెలు కముల తోకెద్దు రేషానికచ్చి గుపిక్కన పొట్టి కొమ్ముల దాన్ని తాకింది. తొమ్మిదెడ్లు పొట్టి కొమ్ములదానికి మజ్జెతు (మద్దతు) పోయినయ్. కలుము తోకది పదెడ్లను గెదుముకుంట (తరుముకుంట)పొడిసింది. పదెడ్లు తోకలు మిడగొట్టి పారిపోయినయ్.

కండ్లు పులపొడుసుకుంట గెట్టు పొంట సింగులు సంకల బెట్టుకోనత్తన్న యాదగిరికి తల కొట్టేసినంత పనైంది. ఏలకేలు కానియ్యి. యాదగిరికి మేరువానుగ (మెచ్చుకోలుగా) అన్నడు.

BRAOU

“ఓదెలు బొచ్చెగిరి (ఛాతీ) పడంగ కిసక్కన నవ్వింది.”

8. మాగోఖలే ‘బల్లకట్టు పాపయ్య’ నుంచీ, రావిశాస్త్రి ‘సొమ్ములు పోనాయండి’ నుంచీ, కింద ఇస్తున్న రెండు భాగాలనూ మీరీ పాఠాల ద్వారా నేర్చుకున్న ఆధునిక ప్రామాణిక భాషలో తిరగరాసి, మీ అభిప్రాయాలు రాయండి:

‘బల్లకట్టు పాపయ్య’ నుంచీ:

“ఏకువ జామున తొలికోడి కూసేయాల మెట్టపల్లీ, సొట్టపల్లికి మయాన పారుతుండ కిట్ట కాలవ గెట్టు మీన్నుంచి ఎవురయినా నిలబడి సూత్తా యింటుంటే, మెట్టపల్లి ఏపుల్నుంచి సీకట్లో బజన పాటలు యినిపించి, యీకూసేపుటికి డొంకల్లోంచి సేతికర్ర పొడుసుకుంటా ఓ నల్ల యిగ్రహం మిట్ట పట్టాలు ఎక్కి దిగుతా వొచ్చొచ్చి, కిట్ట కావల గెట్టెక్కి ఆడ గొలుసుతో కట్టేసుండ బల్లకట్టు కాడికొచ్చి నిలబట్టం తెలుసుద్దన్నమాట. ఆ యిగ్రహం బల్లకట్టు పాపయ్య.

పాపయ్యపని ఏకువజామున తొలికోడి కూసే యాల్టినుంచి రేత్తిరి జనం తిరుగాట్టం మాటుమణిగే దాకా కిట్ట కాలవలో బల్లకట్టు నడపటం. బల్లకట్టు ఉద్యోగ మయినాక పాపయ్య బల్లకట్టు పాపయ్యయినాడు, ఆ సుట్టుపక్కల వూళ్ళ జనానికి, వుత్త పాపయ్యంటే పాపయ్య ఎవరికీ తెలవదు.

పెద్దమనిసి, సమ్మకస్తుడు, ఎవురిజోలికీ పోడు, పద్దాకా బజనపాటలు పాడుకుంటా వుంటాడని వూళ్ళో పదిమందీ అనుకుంటుంటే నెలకు ఆర్రూపాయల పావలాకాడికి బల్లకట్టు ఉద్యోగమయింది పాపయ్యకు.

పెల్లాం బూసమ్మ కట్టిచ్చిన సద్దిమూట బల్లకట్టులోనబెట్టి సెక్కమూతేసి, కాత్తె సలిగా వుంటాన దుప్పటి అటనే కప్పుకుని, బొడ్లోంచి పుగాకు పాయదీసి వాసన సూసుకుంటా, యిప్పట్నుంచి బల్లకట్టుకు కరుసుక్కాసోటం దేనికనుకుంటా కాలవగెట్టు మీన కూకుని సుట్ట ముట్టిచ్చి, జనం ఎవురన్నా వొత్తా వుండారేమోనని సుట్టుపక్కల సీకట్లో సూత్తా... ఆలోసనలో పడ్డాడు బల్లకట్టు పాపయ్య.”

BRAOU

సొమ్ములు పోనాయండి నుంచి:

“సొమ్ములు పోనాయండి.

అదండి ! అది ఆరాంబ(వండి.

జెత పోతులండి !

జెనం నిలబడి సూసేసీవోరండి.

అలాంటి సొమ్ములండి, పోనాయండి.

సొమ్ములు పోనాక, బూదేవత గూడా పోనాదండి. ఆ యెనకనించి సంసార(వంతా సల్లారి పోనాదండి.

బూదేవత పోద్దేటండి ?

మనం బోతాంగాని, బూదేవత పోదండి. మరంచేత, ఏటైనాదన్న మాటండి ?

నాబూదేవత ఉందిగానీ అందుమీద నానులేనండి. ఉంకోడున్నడండి.

ఆడికి నాను అమ్మలేదండి. అడు నా బూదేవతని బలి(విని అక్కర మిచ్చిసుకున్నడండి.

బలి(విని అక్కరమిచ్చిసుకున్నోడు ఒవుడండి ?

మరొవుండూ మరొవుడూ గాదండి. మా వూరి పెసిడెంటు గోడేనండి.

అవునండి. ఆడేనండి. ఆడు తొల్త ఇలాగ్గ లేడండి-తొల్త మిండలాగ్గ ఉండేవోడండి-ఉప్పుడైతే కొంచ లాగ్గ ఎదిగి పోనాడుగాని.

ఎదిగీ వోళ్ళంతా ఎలాగ్గ ఎదగతన్నారండి ?

గోన్నుంచి తొల్త ఎలాగుంటదండి? నేలంట కాలిగ్గ సతికిల బడుంటదండి. మరింక అందల సిట్టో,

తప్పుడో, బియ్యంవో(బంగారవో( ఏస్తే అది లెగిసి నిలబడ్డది గదండి ?! ఊరోళ్ళ సొమ్ము ఒడసీసుకుని (పడవేసుకుని) మా పెసిడెంటుగోడు చరిగ్గ ఆలాగ్గె బస్తాలాగ్గ బలిసి పోనాదండి. కొండలాగ్గ లెగిసిపోనాదండి".

7. తెలుగు భాషలోని వైవిధ్యాన్ని గురించి రాయండి.

8. తెలుగు భాషా మండలాలను గురించి వివరించండి.

9. కల్పనా సాహిత్యంలో మాండలిక శైలీ భేదాలు ఏవో గుర్తించండి.

చదవదగిన పుస్తకాలు :


1. భద్రిరాజు కృష్ణమూర్తి, "తెలుగు మాండలికాలు : ప్రమాణభాష" తెలుగుభాషా చరిత్ర, సాహిత్య అకాడెమీ, హైదరాబాదు, 1979, పేజీలు 397-416.

2. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ తరపున వెలువడిన మాండలిక వృత్తి పదకోశాలు. 1. వ్యవసాయం (1962) 2. చేనేత 3. వాస్తు 4. కుమ్మరం

3. తెలుగు అకాడెమీ తరపున వెలువడిన తెలుగు మాండలికాలు - కడప, చిత్తూరు, గుంటూరు, కరీంనగర్, జిల్లాలపై తెలుగులో వెలువడిన మోనోగ్రాఫులు. సంపాదకుడు: బూదరాజు రాధాకృష్ణ.

4. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ తరపున వెలువడిన మాండలిక పదకోశము, 1970.

5. రావిశాస్త్రీయం (రావిశాస్త్రి రచనల్లోని మాండలిక పదాల కోశం) సంపాదకుడు : అత్తలూరి నరసింహారావు, నవయుగ బుక్‌హౌస్, విజయవాడ, 1977.

6. వి. సి. బాలకృష్ణశర్మ, శ్రీకాకుళం ప్రజలభాష, శ్రీకాకుళం 1975.

7. గురజాడ అప్పారావు, కన్యాశుల్కము.


(మొదటి వ్యాసం, తర్వాత పుస్తకాల్లోని ముందుమాటలు, వీలుంటే తప్పకుండా చదవండి-పరీక్ష దృష్టితో కాదు, విషయాన్ని విపులంగా గ్రహించడానికి.)

BRAOU

**ఖండిక 15 పాఠం 27**

# శైలిలో ఏకరూపత: ప్రాచీన ఆధునిక శైలుల మిశ్రమం

**ఉద్దేశం**

వచన రచనలో ప్రధానంగా రెండు శైలులున్నాయి. ఒకటి ప్రాచీన భాషా సంప్రదాయం. ఇది ప్రాచీన కావ్యభాష నుంచి ఏర్పడింది. రెండోది ఆధునిక భాషా సంప్రదాయం. ఇది ఈనాటి మాట్లాడే భాష నుంచి ఏర్పడింది. ఒకదాని ప్రభావం ఇంకోదానిమీద పడటం సహజం. అయితే ఆధునిక వచన రచనలో ప్రాచీన వ్యాకరణాంశాలు రాకుండా వచన రచనలో తీసుకోవలసిన జాగ్రత్తలను సూచించటం.

ప్రణాళిక

1. మాట్లాడేభాషకు, రచనాభాషకు భేదం
2. ప్రాచీన కావ్యాల్లో వచనం
3. పూర్వ వచనకావ్యాల్లో వచనం
4. ప్రాచీన భాషా చట్రంలో ఈనాటి వాక్యాలు, పలుకుబళ్ళ ప్రయోగం
5. ఈనాటి రచనాభాషలో కనిపించే ప్రాచీన భాషా లక్షణాలు
6. వచన రచన చేసేటపుడు తీసుకోవలసిన జాగ్రత్తలు
7. ముఖ్య విషయ క్రోడీకరణ
8. అభ్యాసాలూ, ప్రశ్నలూ

BRAOU

## ప్రాచీన ఆధునిక శైలుల మిశ్రమం

రాసేభాష మాట్లాడేభాష నుంచి ఏర్పడుతుందని తెలుసుకున్నాం. అయితే రాసేభాషకూ, మాట్లాడేభాషకూ ఎంతో కొంత అంతరం వస్తుంది. మాట్లాడేభాష ఎదురుగా ఉన్న మనుష్యులను ఉద్దేశించి వ్యవహరించేది. రాసే భాష పరోక్ష వ్యవహారానికి ఉద్దేశించింది. అందువల్ల రాసేభాష మాట్లాడేభాష మధ్యకూడా శైలిభేదం ఉంది.

సమాజపు అవసరాలనుబట్టి రాసేభాషలో కూడా భేదాలుంటాయి. ప్రాచీన భాషలో కావ్యభాష, శాసన భాష ఒకటిగా ఉండవు. ఒక సంప్రదాయం ఏర్పడ్డ తరవాత అనంతర గ్రంథకర్తలు ఆదే సంప్రదాయాన్నను సరించి గ్రంథాలు రాస్తారు. ప్రాచీన కావ్యభాషా సంప్రదాయం మొన్నమొన్నటి వరకు అట్లాగే సాగింది. ప్రాచీనకాలంలో ప్రత్యేకంగా వచన గ్రంథాలులేవు. పద్యగద్యమిశ్రమమైన చంపూకావ్యాల్లో గద్యభాషకూ పద్య భాషకూ భేదం ఉండదు. మహాభారతంలోకాని, ఇతర ప్రబంధాల్లోకాని వచన భాగాన్ని చూడండి. గద్యపద్య భాగాల్లో భాష ఒకటిగానే ఉందని గుర్తిస్తారు.

అనంతరం గద్యకావ్యాలు వచ్చినాయి. గద్యకావ్యాల్లో భాష పద్యాల్లో కన్నా సరళంగా ఉంటుంది. కథా కథనం మీద దృష్టి ఉండటం వల్ల ఇట్లా జరిగింది. అయినా వ్యాకరణ నిర్మాణ దృష్ట్యా ఆ భాష అంతకు ముందటి సంప్రదాయానికి చెందిందే.

సముఖము వేంకట కృష్ణప్పనాయకుడి జైమిని భారతము (17వ శతాబ్దం) లోనుంచి ఈ భాగాన్ని చూడండి:

"ఇవ్విధంబున మహావ్యధం బరితపించుచున్న నన్ను రూక్షేక్షణంబులం నిరీక్షించుచు హర్యక్షంబు వాల విక్షేపణంబుల నప్పళించుచు, మనుష్య భాషణంబుల గర్జించుచు నన్ను నుద్దేశించి నాచేఁబడిన జంతువుం

గృతాంతువానినంత వానినైన బలవంతంబున విడిపింపందల బంటి; నీ శిష్యుండును నీవును నింటికిజనుండని నిరాశంబుగాంబలికిన గ్రోశంబున నా శిశువుం బాసిపోవం జాలక, బాలకవిహీనులగు మానవులకు నౌర్ధ్వ దైహికంబులు లేవు గావున నీవు మచ్ఛరీరంబు కబళంబుగొని సుతశరీరంబు విడుపుమనిన..."

కథన శైలి ఉన్నా ప్రధానంగా ఇది కావ్యభాషా శైలి అని దీన్ని గుర్తుపట్టగలం. పై వచనంలో అర సున్నలు, 'కచటతప'లతో మొదలయ్యే మాటలు, గజడదబలతో మొదలు కావటం, భాషణంబులు, నిరాశంబు, శరీరంబు, అని ప్రాచీనరూపాల వాడకం, రూక్షేక్షణంబులు, ఔర్ధ్వ దైహికంబులు వంటి సామాన్య పాఠకుల కర్థంకాని సంస్కృతం మాటల ప్రయోగం-ఈ లక్షణాల వల్ల ఇది ప్రాచీన శైలి అని గుర్తుపట్టగలం. వ్యాకరణం విషయంలో కూడా ప్రాచీనత కనిపిస్తుంది. పరితాపించుచున్న, నిరీక్షించుచు వంటి క్రియలు, నన్ను నుద్దేశించి, మానవులకు నౌర్ధ్వ దైహికంబులు వంటి సంధులు 'విశ్వేపరాంబునన్' వంటి ప్రాచీన విభక్తి రూపాలు ఉన్నాయి. ఈ రకమైన వచనం సాహిత్య భాషా సాంప్రదాయంలో భాగంగా ఉండేది.

సామాన్య పాఠకుల నుద్దేశించి రచించే వచన సంప్రదాయం ఒకటి వేరుగా ఉండేది. ఉదాహరణకు తాతా చార్ల కథల్లో వచనం చూడండి:

'ఉత్తరాది సీమలో వక గ్రామంలో అన్నదమ్ములు యిద్దరు బ్రాహ్మలు వీరు విభాగములై యిల్లు వాకిలి రెండూ పంచుకున్నారు. వారిపెరట్లో వక బావి వున్నది. ఆ బావి తొలి కట్టించడమునకు సుమారు నూరు వర హాలు పట్టును. అవి యేమిటికంటే-ఆ భూమి చట్టుగనుక నున్నూ, ఊటలేనిది గనుకనున్నూ, బహులోతున నీళ్ళు గలది గనుకనున్నూ, ఆ ప్రాంతం వూళ్ళలో రెండు వూళ్ళకు, మూడు వూళ్ళకు అటువంటి బావి వకటి కలిగి వుండును గనుక యీ అన్నదమ్ములు యిద్దరున్ను తమ పెరడు పంచుకునేటప్పుడు తమ్ముడి పాలికి వారి పెరట్లో నుంచి వీరి పెరట్లోకి వక కంత దోవ పెట్టుకొని నీళ్ళు వాడుకుంటూ వుండిరి."

ఈ పైవచనంలో సరళత ఉంది. అర్థంకాని కొట్టు మాటల్లేవు. ప్రాచీన సంధి రూపాలు లేవు. కాగా 'నున్నూ' వంటి కొత్త వ్యాకరణ ప్రత్యయం స్పష్టంగా కనిపిస్తున్నది. 'వుండును, వుండిరి, పట్టును' వంటి ప్రాచీన క్రియలు ఇంకా కనిపిస్తున్నాయి. మాట్లాడే భాషనుంచి ఏర్పడ్డ రచనాభాషగా దీన్ని గుర్తించవచ్చు.

ఈ సంప్రదాయాన్నే గిడుగు రామమూర్తిగారు, గురజాడ అప్పారావుగారు పాటించి ; దీన్ని శిష్ట వ్యావహారిక శైలి అన్నారు. ఈ వచనం రాసేవారికి సాహిత్య పరిచయంకూడా ఉంటుంది కనుక కొన్ని ప్రాచీన పదాలు, పదరూపాలు దొర్లుతుంటాయి. ఈ శైలి ఆధునిక శైలికి దారితీసింది.

అయితే ప్రాచీన భాషలో సంధి నియమాలు సడలించి, ప్రాచీన పదాలు తగ్గించి, మాట్లాడేభాష వాక్య నిర్మాణం, సంభాషణారీతి వాక్యాలు, చిన్నవాక్యాలు ప్రవేశపెట్టి ప్రధానంగా వ్యాకరణంలో మాత్రం ప్రాచీనతను నిలుపుకుంటూ ఆధునికులు కొందరు వచనం రాశారు. ప్రాచీన భాషా చట్రాన్ని ప్రధానంగా నిలుపుకుంటూ మాట్లాడేభాషలోని పలుకుబళ్ళను రచనలో కెక్కించటం ఈ మార్గం. ఉదాహరణకు పానుగంటి లక్ష్మీనరసింహారావుగారి సాక్షివ్యాసాల్లో నుంచి ఈ భాగాన్ని చూడండి:

"ఎక్కడంజూచిన దేశభక్తులే! బజారులో దేశభక్తులు, మంద బయట దేశభక్తులు, చెఱువునొడ్డున దేశభక్తులు! పశువుల సంతలో దేశభక్తులు, మేదర గూడెములో దేశభక్తులు. మాలపల్లిలో దేశభక్తులు, ఇంటిలో దేశభక్తులు, దొడ్డిలో దేశభక్తులు: వాకిటిలో వాంకిటిలో దేశభక్తులు. రైలుస్టేషనులో దేశభక్తులు, నేలయీనినట్లం దరుదేశభక్తులు-వందలు వేలు లక్షలు-ఇందరు దేశభక్తులు మనదేశమునసున్న తరువాత మనదేశమున కింకం గొరత యేమి? ఇంకను దేశమునకు దురవస్థఏమి? ఏమియులేదు. ఇదియే స్వతంత్రరాజ్యము. ఇదియే స్వర్గలోకము."

ఈ పైవచన భాగం సంభాషణలోని వాక్యనిర్మాణరీతికి దగ్గరగా ఉంది. చిన్నవాక్యాలు, అయితే ఆ సంధులూ, అరసున్నలూ, బండి'రా' లు కొద్దిపాటి ప్రాచీన రూపాలు దీన్ని ప్రాచీన వచనశైలికి సన్నిహితంచేసినాయి. ఈ ప్రాచీన చట్రాన్ని వదలకుండా మాట్లాడే భాషాలక్షణాన్ని రాసే భాషలోకి దించిన వారున్నారు. విశ్వనాథ సత్యనారాయణగారి వచన భాగాన్ని చూడండి:

BRAOU

"మఱి పద్యమునకు గద్యమునకు భేదమేమి? నేటి విమర్శలు చిత్ర చిత్రములుగా నుండును. తొలుత పాట పుట్టినదనియు, తరువాత పద్యము వచ్చినదనియును, నిది యొక యనుక్రమణిక. నిజానికి మొదటనే గద్య మున్నది. అందఱును గద్యములోననే మాటాడెదరు. పాటలతో మాటాడరు. పద్యములతో మాటాడరు."

ఈపైవచనంలో ప్రశ్న అడగటం, సమాధానం ఇయ్యటం సంభాషణ లక్షణం. అట్లాగే మాట్లాడే భాషలో వాక్యాలు చిన్నవిగా ఉంటాయి. ఆ లక్షణాలుండటాన నేటి భాషకు ఇది దగ్గరయింది. అయితే మాట్లాడే భాషను ప్రాచీన భాషా చట్రంలోకి ఇరికించటం వల్ల ఇది ఆధునికవచనం కాలేకపోయింది. అరసున్నాలూ బండిఱాలు అట్లానే ఉన్నాయి. ఒక నియమంగా మధ్యలో వచ్చే అచ్చులకు 'య' కారం రాయటం, సంధులు పాటించటం, ప్రాచీన భాషా క్రియలు వాడటం అనే అంశాల వల్ల దీనికి ప్రాచీనతాస్వరూపం వచ్చింది. ఆధునిక భాషలో రచిస్తున్నా, ప్రాచీనతా ముద్రను వదిలించుకోలేని దశకూడా తెలుగు వచనంలో ఉంది. రచనా భాష మాట్లాడేభాష నుంచీ తయారు కావాలన్న తొలినాటి పెద్దలు, గిడుగు, గురజాడల వచనంలో ప్రాచీన భాషా విశేషాలు స్పష్టంగా కనిపిస్తాయి. 'ఆంధ్ర పండితభిషక్కుల భాషా భేషజం'లో గిడుగు రామమూర్తిగారి ఈ వచనం చూడండి:

"చరిత్ర జిజ్ఞాసకు దొరికే సాధన సామగ్రి వంటిదే భాషా జిజ్ఞాసకు దొరికేదిన్ని. ఇప్పుడు మేము వ్రాస్తూ ఉన్న వ్యాసము మా అలవాటు చొప్పున మా తెలుగు భాషలో రచిస్తూ ఉన్నాము. మా ఉత్తరం ప్రత్యుత్తరములు కూడా ఈ భాషలోనే వ్రాస్తాము. సంభాషించినప్పుడున్నూ ఈ తెలుగే వాడుతాము. అయినా అన్నివిధములయిన వ్రాతలలోను, సంభాషణలలోను మా భాష ఏమీ భేదము లేకుండా, ఎల్లప్పుడూ ఒక్కలాగున ఉంటుందని ఒప్పుకోలేము.........దేశమును బట్టి, జాతినిబట్టి, వృత్తిని బట్టి, మతమునుబట్టి, విద్యనుబట్టి, వయస్సును బట్టి, నాగరికతను బట్టి, ఎంతో కొంతవ్యత్యాసము ఏర్పడక తప్పదు. అయినా నేటి నాగరికుల తెలుగులో సాధర్మ్యము అధికముగాను వైషమ్యము తక్కువగాను ఉన్నందున దానిని విశేషించి ప్రత్యేకించి సగటున అనగా మొత్తము మీద పరీక్షించి ఒక్కలాటిదే అనవచ్చును"

ఆధునిక వచన రచనాభాష ఏర్పడే విధానాన్ని ఎంతో శాస్త్రీయంగా వివరించారు రామమూర్తిగారు, పై భాగంలో. అయినా వచనం చూడండి. ప్రాచీన లక్షణాలను వదిలించుకోలేని అశక్తత కనిపిస్తుంది. ఎక్కడో కొన్ని అధికారిక ప్రతులలోనూ, టీకల్లోనూ కనిపించే 'ఇన్నీ, ఉన్నూన్నూ'ల భాష ఆధునిక వచనలక్షణం అనుకున్నారు. 'వ్రాస్తాము, వ్రాత' అనే రాశారుకాని, 'రాస్తాము, రాత' అని రాయలేకపోయారు. 'వాడుతాము' అని రాశారు కాని 'వాడతాం' అని రాయలేదు. వ్యాసము, వ్యత్యాసము వంటి మాటల్లో 'ము' అనే అక్షరానికి బదులు సున్న రాయలేదు. 'ఉత్తరములు' అని పూర్వభాషాబహువచనమే రాశారుగాని, ఇప్పటి విధంగా 'ఉత్తరాలు' అని రాయలేదు. 'దేశమును బట్టి' అని పూర్వ వ్యాకరణ బద్ధరూపం రాశారుగాని 'దేశాన్ని బట్టి' అని రాయలేదు ఈ విధంగా ప్రాచీన భాషా లక్షణాలు ఆధునిక వచనపు తొలినాళ్ళలో కనిపిస్తూనే ఉండేవి. ఆతరవాత తరవాత వచనంలో ఆధునికాంశాల ప్రాచుర్యం పెరిగి ఈనాటి వచనం ఏర్పడింది. ఈనాటి వచనం ఈనాటి మాట్లాడే భాషకు అతిసన్నిహితంగా ఉంటుంది. చలంగారి 'స్త్రీ' నుంచి ఈ వచన భాగాన్ని చూడండి:

"అన్నిటికన్నా-విద్యకన్నా-ముఖ్యం స్త్రీ స్వతంత్ర ఆర్జన. మనుషుల్నిగానీ, దేశాల్నిగానీ అణగదొక్కాలంటే ఆర్థిక అసహాయత్వం ముఖ్యసూత్రం. అందుచేతనే స్త్రీ ముఖ్యంగా బానిస అయింది. తాను సంపాయించుకునే శక్తిలేక, తన పొట్టపోషించుకోడానికి తగిన పని స్త్రీ సంపాయించిందా ఈ పురుష ప్రపంచం నేలకూలిందన్నమాటే! విద్య ఐనా స్త్రీకి ఆర్థిక స్వాతంత్ర్యాన్ని ఇయ్యకపోతే వృథా!"

ఇది ఈనాటి వచనానికి ఒక నమూనా. అయితే ఇందులో "విద్య, స్వతంత్ర ఆర్జన, ఆర్థిక అసహాయత్వం, ఆర్థిక స్వాతంత్ర్యం" అనే మాటలు మామూలు సంభాషణలో ఉండకపోవచ్చు. రచనా భాషలో సంస్కృత పదాల వాడకం హెచ్చు. సంస్కృత పదాల వాడకానికి రెండు కారణాలున్నాయి. ఒకటి కొన్ని రకాల భావాల వ్యక్తీకరణకు సంస్కృతం మాటలు ప్రయోగించటం చదువుకున్న తెలుగు వాళ్ళకు మొదటి నుంచీ అలవాటు. రెండు సంస్కృత శబ్దాలు తెలుగు రచనకు గౌరవాన్ని పెంచుతాయని ఒక అవ్యక్తపు నమ్మకం.

BRAOU

ఆధునిక వ్యవహారంలో-అంటే రచనా వ్యవహారంలో ఉన్న సంస్కృతం మాటలు వాడకుండా రాయలేం కాని ప్రత్యేకంగా ఎంచి ఎంచి ప్రాచీన కావ్యాల్లో మాత్రమే దర్శనమిచ్చే పదాలను వాడటం ఆధునిక వచన రచనకు గుణంకాదు.

అయితే ఒక్కోసారి వాతావరణంకోసం ప్రాచీన భాషా పదాలు, సంస్కృత పదాలు ఆధునిక వచనంలో కనిపిస్తాయి. ఉదాహరణకు కృష్ణశాస్త్రిగారి ఈ వచన భాగాన్ని చూడండి:

"అంతంత దూరంనుంచి **విరివిపణి** కలకలం! చిరుగంటల మోతల వంటి **విరివెలదుల** నవ్వుల రవళులతో కలిసిపోయి, దూర మేఘ గర్జన వంటి **విటరాయుల** సరసుల కల కంఠరవాలు వినబడతాయి. అంతలో పువ్వుల అంగడి తెరువు ప్రవేశిస్తాము. ఎంత పెద్దతెరువు! ఎన్ని అంగళ్లు! అక్కడ **అపర సంధ్యాకాలం అవనికి** జారినట్టు, ఇక్కడ ఇంద్రధనస్సులు విరిగి పడ్డట్టు. అక్కడ రక రకాల అంచుల రంగుల పావడాల జిలుగుపన్నెల **వసనాల** వల్లెవాటుల **అచ్చరలు మంజరులై**, మాలికలై సమావేశమయినట్టు."

—పైవచనంలో ***విరివిపణి, విరివెలది, రవళి, విటరాయడు, కంఠరవం, తెరువు, అపర సంధ్యాకాలం, అవని, వసనం, అచ్చర, మంజరి***—అనే మాటలు ప్రాచీన భాషనుంచి తెచ్చుకున్నవి.

పూర్వ ప్రబంధ వర్ణనల్లో పుష్పలావికల వర్ణనం అని ఒకటుండేది. పుష్పలావికలు అంటే **పూలమ్ము**కునే ఆడపిల్లలు. **పూలుకొనేవాళ్లు** వాళ్ళతో నర్మగర్భంగా (రెండర్థాల మాటలతో) మాట్లాడినట్టు కవులు వర్ణించేవారు. ఆ వాతావరణం తీసుకురావాలనే దృష్టితో కృష్ణశాస్త్రిగారు పైమాటలు వాడారు. ఇట్లా వాతావరణ సృష్టికోసం, అవసరంకోసం, రచనకు గౌరవంకల్పించటం కోసం ఆధునిక వచన రచనలో సంస్కృతంమాటలు ప్రాచీన భాషా పదాలు కనిపిస్తాయి. ***వీటిని ఆధునిక వచన రచనలో సంస్కృతం మాటలు, ప్రాచీన భాషా*** పదాలు కనిపిస్తాయి. వీటిని ఆధునిక వచన రచనలో భాగాలుగానే గుర్తిస్తున్నాం. ఇతర భాషలనుంచీ, సంస్కృతం నుంచీ, ప్రాచీన భాషనుంచీ అవసరమైన పదజాలాన్ని తెచ్చుకొని వాడుకోవటం ఆధునిక వచనరచనకు వ్యతిరేకంకాదు. తగినట్టు వాడుకోవటం రచయిత నేర్పునిబట్టి ఉంటుంది. క్రియారూపాలూ, విభక్తులూ, ఇతర ప్రత్యయాలూ, శబ్దరూపాలూ, వాక్యనిర్మాణం ఆధునికమైతే వచన రచన ఆధునిక మవుతుంది. ప్రాచీన భాషాపదాలు అవసరంకొద్దీ వాడుకోవటం, ఆధునిక రచనలో నలిగిన సంప్రదాయమే. తొలినాటి రచనల్లోలాగా ప్రాచీన ఆధునిక లక్షణాల మిశ్రమం కానీయకుండా ఉండటం ఆధునిక వచన రచన చేసేవారు తీసుకోవలసిన జాగ్రత్త.

BRAOU

## ముఖ్యవిషయ క్రోడీకరణ

ఈ పాఠంలో ఈ క్రింది విషయాలు నేర్చుకున్నారు:

1. రాసేభాష మాట్లాడే భాషనుంచి ఏర్పడ్డా రెండికీ కొంత అంతరం ఉంటుంది.
2. రాసే భాషలోకూడా కాలాన్ని బట్టి, ఉద్దేశించిన పాఠకులను బట్టి, వస్తువులనుబట్టి భేదాలుంటాయి.
3. ప్రాచీన కాలంలో వచన కావ్యాలు ప్రత్యేకంగా లేవు. గద్య పద్యాలు కలిపి చేసిన చంపూ కావ్యాలు ఉన్నాయి. వాటిల్లో భాషఅంతా ఒకేరకంగా ఉంటుంది.
4. 17వ శతాబ్దంనుంచీ వచన కావ్యాలు వచ్చినా, అవీ పాత సంప్రదాయాన్నే అనుసరించినాయి. అయితే రచన సరళమయింది.
5. వచన కావ్యాల్లో, పదరూపాల్లో, సంధిలో, విభక్తిలో, క్రియాపదాల్లో ప్రాచీనత కనిపిస్తుంది.
6. సామాన్య పాఠకుల నుద్దేశించిన వచన రచనకూడా ఉంది. ఇందులోకూడా కొన్ని అలవాటుగా వచ్చిన ప్రాచీన రూపాలు ఉంటాయి.
7. గిడుగు రామమూర్తిగారు, గురజాడ అప్పారావుగారి వచనంలో కూడా ప్రాచీన రూపాలు కొన్ని కనిపిస్తాయి. అయితే అది మాట్లాడే భాషనుంచి ఏర్పడ్డ రచనా భాష.
8. ప్రాచీన భాషా చట్రంలో నేటికాలపు మాట్లాడే వాక్యపు పద్ధతిని చొప్పించి చేసిన వచన రచన కూడా ఉంది. అయితే అది ప్రధానంగా ప్రాచీన వచన రచన నుంచి ఏర్పడ్డది.

9. ఆధునిక వచన రచనలో వాతావరణం కోసం, అవసరంకోసం, సంస్కృతం మాటలు ప్రాచీన భాషా పదాలు ఉంటాయి.

10. ఆధునిక వచనం రాసే వాళ్ళు ప్రాచీన పదాలు వాడినా, ఆధునిక వ్యాకరణ పరిధిలోనే ఉండేట్టు జాగ్రత్త పడాలి.

## అభ్యాసం : [రాసేది]

1. ఈ కింది వచనాన్ని ఆధునిక భాషలో సులభ శైలిలో రాయండి.

"... ధర్మనందనుడు కృష్ణద్వైపాయను గనుంగొని, మహాత్మా! నా తమ్ములు భీమార్జున నకుల సహదేవులు యుద్ధంబున మిగులడస్సి యున్న వారలు. మహా బలుండును, గర్ణసూనుండును వృషకేతుండు బాలుండు. ఘటోత్కచుండు మా కార్యంబున హతుండయ్యె. అతని తనయుండగు మేఘవర్ణుం డత్యంత బాలుండు గావున వారల నిగుపురఁ గయ్యంబునకుం బంపుట మయుక్తంబు."

2. ఈ కింది వచన భాగంలో ప్రాచీన లక్షణాలు తొలగించి ఆధునిక వచనంగా మార్చండి.

"ఈ షహరు గోడకు చేరినట్టుగా 'ముసి' అక్కడి వారి చేత చెప్పుచున్న ముచుకుంద నది పారుచున్నది. ఆ నది వాడపల్లె వద్ద కృష్ణలో కలియుచున్నది. అది గొప్పనది. పోయిన సంవత్సరం నదీ ప్రవాహం ఎక్కువగా వచ్చి డిల్లీ దరవాజా వద్ద యింగిలీషువారు కట్టిన వారధి పగలగొట్టి ఆ షహరు కొన్ని వీధులున్ను షహరుకున్ను నడుమ ఆ నది దాటుటకు పూర్వకాలమందు తురకలు మంచి రాళ్ళతో అతి బలముగా నొక్క వారధి యేనుగులు మొదలయినవి గుంపుగా నెక్కి పోవడానకు యోగ్యముగా కట్టినారు. ఆ షహరు చుట్టున్ను చిన్న తిప్పలున్నవి. కొండలు మెండు."

3. ఈ కింది వచనంలో మిగిలిఉన్న ప్రాచీన లక్షణాలను గుర్తు పట్టండి.

'లౌకిక భాష శిష్ట వ్యవహార సిద్ధమయినది గనుక పూజ్యమేకాని ఎంత మాత్రము నింద్యము కాదని మా మతము. శిష్ట జన వ్యవహార సిద్ధమయినా లౌకిక భాష గ్రామ్యమే అనిన్ని గ్రంథములో వాడుటకు తగినది కాదనిన్ని కొందరు వాదిస్తున్నారు. ఆలాగున వాదించే వారి మతము మా మతమునకు విరుద్ధమయినది గనుక వారితో మాకు వివాదము గలిగినది. వారి వాదమును మేము ఖండించుటకు పూనుకొన్నంత మాత్రము చేత వారి యెడల మాకు గౌరవము లేదని తలంచగూడదు.

BRAOU

## ఖండిక 15 పాఠం 28

# శైలిలో ఏకరూపత: ఆధునిక మాండలిక శైలుల మిశ్రమం

ఉద్దేశం

ఈనాటి మాట్లాడే భాషనుంచీ ఏర్పడినవే ఆధునిక శైలీ, మాండలిక శైలీ భేదాలు. వ్యాసరచనలో, పత్రికా రచనలో ఆధునిక ప్రామాణిక శైలి కన్పిస్తుంది. కల్పనా సాహిత్యంలో మాండలిక శైలీ భేదాలను వాడుకునే పద్ధతి ఉంది. ఆధునిక శైలినీ, మాండలిక శైలీ భేదాలనూ ఈనాటి వచన రచనల్లో ఉపయోగించేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలను సూచించడం.

ప్రణాళిక

1. పూర్వకావ్యాల్లో, పూర్వ వచనంలో మాండలికాలు
2. ఆధునిక శైలిలో మాండలిక శైలీ భేదాల మిశ్రమం
3. మాండలిక శైలిలో ఆధునిక శైలీ లక్షణాల మిశ్రమం
4. వచన రచన భేదాలనుబట్టి శైలి విషయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు
5. ముఖ్య విషయ క్రోడీకరణ
6. అభ్యాసాలూ, ప్రశ్నలూ.

## పూర్వకావ్యాల్లో, పూర్వ వచనంలో మాండలికాలు

BRAOU

ఏ రకం శైలిని ఏ రకం రచనకు వాడతారనేది తెలుసుకున్నారు. ఆధునిక వచన రచనల్లో కన్పించే శైలీ భేదాలనూ, వాటి ప్రయోజనాలనూ తెలుసుకున్నారు. ఒకే రచనలో శైలులను మిశ్రమం చేయడంవల్ల ఎదురయ్యే సమస్యలను ఈ పాఠం ద్వారా తెలుసుకుంటారు. ఆధునిక వచనం రాసేవాళ్ళు ఈ సమస్యలను ఎట్లా పరిష్కరించుకోవాలో తెలుసుకుంటారు.

ప్రాచీన కావ్యాల్లో కొందరు కవులు అక్కడక్కడ మాండలికాలను వాడారు. దీన్నిబట్టి కావ్యభాషా శైలి మీద మాండలికాల ప్రభావం పడిందని చెప్పవచ్చు. ఉదాహరణకు శ్రీనాథుడు పాసెము (పాయసం), చల్ల (మజ్జిగ) అనే మాండలిక పదాలను ఉపయోగించాడు. ఎల్లుండి, శాస్తి, అవునషే, కాదషే అనే మాండలిక పదాలు శుకసప్తతిలో కన్పిస్తాయి. గంగాపుర మహాత్మ్యములో తెలంగాణా మాండలిక పదం పోరి (చిన్నపిల్ల) కన్పిస్తుంది. అట్లాగే పప్పు, బేడలు, ఏంది, ఆనిక, తరవాయ, ఈలాగు, అంటిపండ్లు, కూకలువేయు, టూసుపోక వంటి మాటలు ప్రాచీన కావ్యాల్లో కన్పిస్తాయి.

ప్రాచీన కాలానికి చెందిన గద్యకావ్యాల్లో వచన రచనల్లో కూడా మాండలికాలు కన్పిస్తాయి. మాట్లాడే భాషకు చాలా దగ్గరయిన వచనంలో తాళ్ళపాక పెదతిరుమలయ్య [1474-1534] భగవద్గీతకు భావానువాదం చేశాడు. శ్రీమద్భగవద్గీతలోని వచనాన్నీ, అందులోని రాయలసీమాంధ్ర మాండలికాలను చూడండి:

"నిష్కంటకమై సమృద్ధమైన రాజమున్ను దేవతాధిపత్యమునున్నూ పొందిన్ని సమస్తమైన యింద్రియాలను శోషింపజేస్తున్నట్టి నా యొక్క శోకమున్ను తొలగదొబ్బే వుపాయంగానను"

"మనుష్యుడు పాతకోకలు విడిచి కొత్తకోకలు యెటువలెనైనా నేమి కట్టుకొనునో, ఆటువలెనే దేహాన్ని జీర్ణమైన శరీరాలు విడిచి వేరే కొత్త శరీరాలు ధరియించును."

"అయితే వేదోక్తం విడువ వచ్చునా? అంటివా? నిండా నీళ్ళుండే మడుగులోను దప్పిగొన్నవాడు తగినన్నే పుచ్చుకొనును. ఆటువలెనే జ్ఞానియైన బ్రాహ్మణుడు సర్వవేదాలందున్ను తనకు మోక్ష విరోధము గాక దగిన పుణ్యమే పుచ్చుకొనుట."

"కర్మము కంటెను జ్ఞానమే శ్రేష్ఠమని నీకు సమ్మతమాయనా, ఘోరమైన కర్మమందు నన్ను యాల బుద్ధి పంపు పెట్టు చున్నావు"

"అటు గనక పక్కప్పుడున్ను కర్మమందు *యామరక* నేనున్ను ప్రవర్తించ కుండినా సర్వమైన మనుష్యులున్ను నాయొక్క మార్గమునే అనువర్తింతురు"

"యింద్రియ జయంగలవాడు వివేక పంతం (చిత్తం) చాతను "అర్జునా ! నన్ను యెరుగలేని తామస గుణానకు *వాకిలి యైన* యీ కామ క్రోధ లోభాల చాతను..."

ఈ వచనంలో కనిపించే తొలగదొబ్బు, కోకలు, నిండా, యాల. గనక, పక్కప్పుడు, యామరక, వాకిలి,చాత అనేవి ప్రాంతీయ మాండలికాలు. పోయిన పాఠంలో చూపిన తాతాచార్లు కథలలోని శైలికీ, గిడుగు రామమూర్తి, వచనంలోని శైలికీ పెద తిరుమలయ్య శైలి దగ్గరగా వున్నట్లు కూడా ఈ ఉదాహరణల వల్ల గమనించ గలరు.

## ఆధునిక శైలిలో మాండలిక శైలీభేదాల మిశ్రమం

వ్యాసరచనలో, పత్రికారచనలో రెండురకాల మాండలికాలు వాడుకలో ఉండటం మీరు గమనించ వచ్చు. మొదటిరకం కొన్నిరకాల మాండలిక పదాలనూ, నుడికారాలనూ, ఆయా ప్రాంతీయ రచయితలు తమ ప్రామాణిక శైలిలోని ఏకరూపతలో భాగంగానో, ప్రత్యేకమైన ప్రభావక పద ప్రయోగంలో భాగంగానో వాడటం. రెండవరకం, శైలిని గురించిన స్పృహలేని ఆధునికశైలిలో వివిధ ప్రాంతీయ మాండలికాల నుడికారాలను కలగలపడం.

మొదటి రకం గురించి చూడండి. ఉదాహరణకు కొందరు రాయలసీమ రచయితలు చెప్పినాడు, అడిగినాడు, చూసినాడు, అభిప్రాయ పడినాడు వంటి క్రియారూపాలను క్రమ బద్ధంగా తమరచనలలో వాడారు. అట్లా, ఇట్లా, ఎట్లా, చేయడం, చూడడం వంటి రూపాల విషయంలోకూడా ఒక ఏకరూపతను పాటించారు. కొందరు ప్రత్యేకమైన ప్రభావక మాండలిక పద ప్రయోగాలు చేశారు. ముఖ్యంగా నెల్లూరు మండల రచయితల్లో ఈ రకమైన పద ప్రయోగాలు కన్పిస్తాయి. ఈ ఉదాహరణలు చూడండి :

తనది మొసలిక్రియ వ్యవహారం స్థాయి మట్టుకే (కె. వి. రమణారెడ్డి, శ్రీశ్రీ సాహిత్యం, ఒకటి).

సమాజజీవితం చిక్కటిపొదరిల్లు, బీరకాయపీచు, *గిజిగానిగూడు* (కె.వి. రమణారెడ్డి పీఠికలు, 'బంగోరె' మాలపల్లి నవలపై ప్రభుత్వ నిషేధాలు.)

చూట్టానికి 'ఒంటూపిరి' వాడే కావచ్చుగాని, సైకిలుతొక్కేవాడు (కె.వి.రమణారెడ్డి, మహోదయం, 125)

తక్కెడ, పిల్లకాయలు, కసాలా, కేటాబడు వంటిమాటలూ, అల్లుల్లోమల్లువంటి సామెతలూ ఇతర నెల్లూరు మండల రచయితల్లో కనిపిస్తాయి. రెండవరకం శైలీ స్పృహలేని మాండలికపు నుడికార మిశ్రమం అడపా దడపా రాయలసీమ, తెలంగాణా ప్రాంతరచయితల్లో కనిపిస్తుంది. ఈ రకం మిశ్రమం వ్యాసరచనలో, పత్రికా రచనలో అరుదు. కల్పనా సాహిత్యంలో కొంచెంఎక్కువగానే కనిపిస్తుంది. ముఖ్యంగా కథల్లో, నవలల్లో రచయిత కథ చెప్పేశైలిలోనూ, పాత్రలు మాట్లాడే శైలిలోనూ ఈ మిశ్రమం కన్పిస్తుంది. ఉదాహరణకు చూడండి.

"పుంతలో కంపచెట్లను చాటుకు తోసేసి *వచ్చినాడంట*" (కుప్పిరెడ్డి పద్మనాభరెడ్డి, వోబిగాడు కథలో.)

"సోమవారంనాడు మీరు **పూరెల్తాయెల్తా** రాంబాబుకు అయిదు రూపాయలనోటు యిచ్చినారంట గదా" (కుప్పిరెడ్డి పద్మనాభరెడ్డి, వోబిగాడు కథలో.)

వాళ్ళు వాడిని కూకలేసి ఆ డబ్బు రాంబాబుకు **యిప్పియ్యమన్నారంట** (వోబిగాడు కథలోనుంచే)

ఉదహరించిన ఈ వాక్యాల్లోని పుంత, ఎల్తాఎల్తా, కూకలేసి కోస్తాంధ్ర మాండలిక నుడికారానికి సంబంధించినవి. వాటిని రాయలసీమ శైలిలో భాగంగా రచయిత వాడాడు. నిజానికి రాయలసీమ మాండలికంలో పుంతకు

BRAOU

దారి అనీ, ఎల్తాఎల్తాను పోతాపోతా అనీ, కూకలేసి అనే మాటకు అర్సి, అరిచి అనీ వాడతారు. (వోబిగ డు కథ కడప మండల వాతావరణాన్ని చిత్రించిన కథ). ఈ రకం రాయలసీమ మాండలికంలో కోస్తా మాండలిక నుడికారాన్ని కలగలపడం డా. కేశవరెడ్డి ఇన్‌క్రెడిబిల్ గాడెస్, స్మశానం దున్నేరు అనే నవలల్లో కూడా చూడవచ్చు. నుడికార మిశ్రమం వల్ల కథా వాతావరణ చిత్రణ వల్ల కలిగే మన స్థితి చెదిరిపోతుంది. మాండలిక

## శైలిలో ఆధునిక శైలి లక్షణాల మిశ్రమం

ఇటీవలి కాలంలో మాండలిక జీవితాన్ని మాండలిక భాషలోనే రాస్తున్న రచయితలు తెలుగులో బయలు దేరారు. కథనంలో రచయిత శైలీ, కథలో వచ్చే పాత్రలు మాట్లాడే శైలులు ఒక ప్రాంతీయ మాండలికానికి సంబంధించినవి. (మాండలిక శైలీ భేదాలను వాడిన కొందరు రచయితలను గురించి మీరు 2(?)వ పాఠంలో తెలుసుకున్నారు). మాండలిక శైలిలో రచనలు చేసిన రచయితలు చదువుకున్నవాళ్ళు కావడం వల్లా, పట్టణ జీవితంతోనూ, ప్రామాణిక శైలితో వాళ్ళకు సంబంధం ఉండడం వల్లా మాండలికంలో రచనలు చేసినా,అశ్రద్ధ వల్ల కావచ్చు, పుస్తక భాష అలవాటు వల్ల కావచ్చు, పొరపాటు వల్ల కావచ్చు ఆధునిక శైలి లక్షణాలు, కలుపుతున్నారు. ఈ మిశ్రమం వల్ల మాండలిక భాషలోని నుడికార సహజత్వం, మాండలిక జీవితంలోని వాస్తవికత దెబ్బతింటున్నాయి. ఉదాహరణకు చూడండి: "కొంరని గుండె బత్తి పెట్టిన బండోలె పగిలింది. సొన సేసటి దాకా ఆని గుమ్మిల నుంచి మాటెల్లలే ఆటెసుక ఆని కండ్లు సింత నిప్పులయినయ్...అంగిలేని ఆని సాతి ఎగిరెగిరి పడ్డది.

"నర్సయ్య పటేలా! మీరు గుడుక అదే మాటంటర" అని గొంతులో కాఠిన్యం (అల్లం రాజయ్య ఎదురు తిరిగితే కథలో) "తాళ్ళ తోపుల సిలుకలు ఒళ్ళిరుసుకొని రెక్కలు తపతపలాడిచ్చి పొద్దు పొడుపుకు సాగతం పలుకుతున్నయ్" మాఘ మాసపు సలి ఎంద పొడకు భయపడి తాటి మట్టల సందుల దాక్కొని మల్ల నమ్మకం సిక్కక ఓ తాడిసెట్టు మీన్నుంచి మరో తాడిసెట్టు మీనికి ఆదుర్దతోని ఉరుకతంది." (అల్లం రాజయ్య, కొలిమంటుకున్నది నవలలో) "గిట్ల గాంధారోల్ల కంభాలు పీక్కపోయిండు. సమజ్ సేసుకునే ఘనుడు. దొరలేడు, ధాతలేడు (అల్లం రాజయ్య, కొలిమంటుకున్నది నవలలో). ఉదాహరించిన వాటిలో రచయిత కథ చెప్పే భాష తెలంగాణా మాండలికం. పాత్రలు మాట్లాడే భాష తెలంగాణా మాండలికం. అయితే మహా ప్రాణోచ్చారణ విద్యావంతులు కాని వాళ్ళ మాండలికంలో ఉండదు. కానీ కాఠిన్యం,మాఘ మాసపు,భయపడి,గాంధారోల్ల, కంభాలు వంటి మాటలు ఆధునిక ప్రామాణిక భాషా శైలి ప్రభావాన్ని సూచిస్తాయి.అంతే కాదు స్వాగతం తద్భవ రూపం సాగతం కనపడడం కూడా విచిత్రమే. అంటే రచయిత మాండలిక భాషలోనే రాయాలనుకున్నా, ఆధునిక భాష మిశ్రమం జరిగిపోయింది. ఈ మిశ్రమాన్ని సాధన వల్ల పరిహరింపవచ్చు. ఇటువంటి రచయితలు సాధన వల్ల పరిహరించారు కూడా.

## వచన రచన భేదాలను బట్టి శైలి విషయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు

మాండలిక పదాలు, నుడికారాలు అన్ని భాషల్లో ఉంటాయి. ఇవి ఆధునిక వచన రచనకు వ్యతిరేకంకావు. అయితే వీటిని రచనా భేదాలనుబట్టి వాడుకోవలసి ఉంటుంది. తెలుగు సినిమాల్లో అపరనాగరికులూ విద్యాధికులూ అయిన నాయికా నాయకులు జానపదగీతం బాణీలో ఒక యాసలో పాటపాడినప్పుడు మనకు ఎబ్బెట్టుగా ఉంటుంది.అట్లాగే చదువు సంధ్యలులేని పల్లెటూరి నాయికానాయకులు సంస్కృత పదాలలో, క్లిష్ట భావాలలో కూడిన పాట పాడితే నవ్వు వస్తుంది. వచన రచన ఎబ్బెట్టుగా ఉండడంకోసం కాదు; నవ్వు పుట్టించడంకోసం కాదు. మనం చెప్పే విషయాన్నిబట్టి, మనం ఉద్దేశించిన పాఠకులనుబట్టి, మనం చేపట్టిన ప్రక్రియనుబట్టి శైలీ వైవిధ్యాలను వాడుకోవాలేగానీ, కృత్రిమత్వానికి చోటివ్వరాదు. తెలిసిన జీవితంలో భాగంగా తెలిసీ తెలియని జీవితం చిత్రించినట్లు, తెలిసిన మాండలికపు నుడికారంలో భాగంగా తెలిసీ తెలియని మాండలికపు నుడికారం వాడకూడదు. మాండలికాలనుంచీ అవసరమైన పదజాలాన్ని తెచ్చుకొని వాడుకోవడంవల్ల ఆధునిక రచనా భాష సంపన్నమవుతుంది. కానీ ప్రతి మాండలికాలలోని ప్రతియాసనూ, ప్రతిభేదాన్నీ వ్యాసరచనలో, పత్రికా రచనలో వాడడంవల్ల అన్ని రచనలూ అన్ని ప్రాంతాలవాళ్ళకూ అర్థమయేట్లు రాయడమనే లక్ష్యం దెబ్బతింటుంది.

BRAOU

### ముఖ్య విషయ క్రోడీకరణ

1. ప్రాచీనకావ్యాల్లో కొందరుకవులు మాండలికాలను వాడారు. ప్రాచీన వచనరచనల్లోకూడా మాండలిక పదాలు కన్పిస్తాయి.
2. వ్యాసరచనలో, పత్రికారచనలో రెండురకాల మాండలికాలు వాడుకలో ఉన్నాయి. మొదటిరకం కొన్ని రకాల వాటిని ఆయా ప్రాంతీయరచయితలు తమ ప్రామాణిక శైలిలోని ఏకరూపతలో భాగంగానో, ప్రత్యేకమైన ప్రభావక పద ప్రయోగంలో భాగంగానో వాడడం, రెండవ రకం శైలీ స్పృహ లేక కలగలపడం.
3. మాండలిక జీవితాన్ని మాండలిక భాషలో రాస్తున్న రచయితల్లో ఆధునిక శైలి లక్షణాల ప్రభావం మాండలిక శైలి మీద కన్పిస్తుంది. అందువల్ల మాండలిక జీవిత వాస్తవికత దెబ్బతింటుంది.
4. మాండలిక పదాలు, నుడికారాలు ఆధునిక వచన రచనకు వ్యతిరేకంకావు. కృత్రిమత్వానికి తావు ఇవ్వని విధంగా మనం చెప్పే విషయాన్ని బట్టి, ఉద్దేశించిన పాఠకులను బట్టి, చేపట్టిన ప్రక్రియను బట్టి శైలీ వైవిధ్యాన్ని పాటించాలి. ఏకరూపత ధ్యేయంగా పాటించాలి.

## అభ్యాసాలూ, ప్రశ్నలూ

1. ఈ కింది రెండు వాక్యాల్లోని శైలుల మిశ్రమాన్ని గుర్తు పట్టండి.
   "ఏంవయింది మునసబు గెలిచినాడు. చెంబుతో మంచి నీళ్ళు ముంచుకొని నోట్లో పోసుకొని మింగినంత సులభంగా గెలిచినాడు"
   "ఇట్టుండగా తొలి ముంగార్ల వానలు పడినాయన్నా"
2. ఈ కింది వాక్యాల్లోని శ్రీకాకుళ ప్రాంతీయ మాండలిక పదాలను గుర్తుపడుతూ, అవి ప్రామాణిక శైలిలో భాగమో కాదో తెల్పండి.

   "ఒక వేసవిలో తప్ప మిగిలిన అన్ని కాలాల్లోనూ గోరిజ వెంట జలజల మంటూ ఊటనీరు పారుతుంది. ఉప్పూ, కారం గుండా, బెల్లం, పొగాకు ఇతర దినుసులూ చిన్నచిన్న డొక్కుల్లో పెట్టి గడపలో దుకాణం వేయించి డొక్కుల మధ్యన పీటమీద చిన్న పెళ్ళాన్ని కూచో బెట్టాడు"
   "దుక్కిపూజలు భుజాన వేసుకొని కాపులు కల్లాలవైపు కదులుతున్నారు"
3. మీ ప్రాంతంలో జరిగిన ఒక సంఘటనను మీ ప్రాంతీయ మాండలికంలో ముందురాసి తర్వాత ఆధునిక ప్రామాణిక భాషలోకి దాన్ని మార్చి రెండు శైలుల మధ్య ఉండే భేదాలను గుర్తించండి.

BRAOU

ఖండిక 16 పాఠం 29

# అనువాద విధానం: అనువాదంలో సాంస్కృతిక సమస్యలు

**ఉద్దేశం**

అనువాదం, లిప్యంతరీకరణ, దుబాసి, దుబాసించడం అనే మాటలను వివరించడం. ఒక భాషకు అనువాదాలు చేసుకోవలసిన అవసరం ఎందుకుంటుందో తెల్పడం. అనువాదాలు చేసేటప్పుడు మనకు ఎదురయ్యే ప్రధానమైన రెండు సమస్యలలో ఒక సమస్య అయిన సంస్కృతుల మధ్య తేడాను వివరించడం.

**ప్రణాళిక**

1. మనిషి మాట్లాడే జంతువు
2. అనువాదం, లిప్యంతరీకరణం
3. అనువాదం ఎందుకోసం
4. అనువాదంలో సమస్యలు
5. సాంస్కృతిక సమస్యలు
6. ముఖ్య విషయ క్రోడీకరణ
7. అదనపు సమాచారం
8. అభ్యాసాలూ, ప్రశ్నలూ

BRAOU

**మనిషి మాట్లాడే జంతువు:**

మనిషి సాంఘిక జంతువు అనీ, రాజకీయ జంతువు అనీ సామాజిక శాస్త్రజ్ఞులు అంటారు. 'మాట్లాడే జంతువు' అని భాషా శాస్త్రజ్ఞులు అంటారు. ఇక్కడ జంతువు అనే మాటకు విశేషణాలుగా వాడిన మాటలు: 'సాంఘిక', 'రాజకీయ', 'మాట్లాడే'. ఇవి మానవున్ని ఇతర జంతు ప్రపంచాన్నుంచీ వేరు చేసే అంశాలు; మానవునికే, మానవుడు సాధించిన ప్రగతికే విలక్షణమైన అంశాలు.

ఒక భాషను మాట్లాడడమేకాదు, రాయడమే కాదు; భిన్నభాషల్లో మాట్లాడడమూ, రాయడమూ మానవుని ప్రత్యేకత. అయితే ప్రపంచంలోని భాషలన్నిటినీ-సుమారు 2000 పై బడిన భాషలన్నీ- ఏ ఒక్క మానవుడూ తన జీవిత కాలంలో గట్టిగా నేర్చుకోవడం, వాటిని తాను ఉంటున్న సంఘంలో వాడడం సాధ్యంకాదు. కాని, ప్రపంచంలోని భాషలన్నిటిలో ఉన్న విజ్ఞానాన్ని ఒక భాషను మాతృ భాషగా వ్యవహరించే వాళ్ళు తమ భాషలోకి తెచ్చుకోవడం సాధ్యమే.

ఎట్లా? మానవ భాష నోటితో చేసే ధ్వనుల రూపంలో ఉంటుందనీ, మనుషులందరూ మాట్లాడతారు కాబట్టి మానవ సమాజాలన్నిటిలో భాష ఉందనీ, వాటిలో కొన్ని భాషలకు లిపులు ఉన్నాయనీ, లిపి ద్వారా విజ్ఞాన ప్రసరణం జరుగుతుందనీ ఒకటవ పాఠంలోనే మీరు నేర్చుకున్నారు. భిన్న భాషలను-నోటితో చేసే ధ్వనుల రూపాన్నీ (అంటే వాగ్రూపమైన సంకేతాలనూ) లిపులనూ-నేర్చుకోవడం ద్వారా ప్రపంచంలోని భాష లన్నిటిలో ఉన్న విజ్ఞానాన్ని, ఒక భాషను వ్యవహరించే వాళ్ళు తమ భాషలోకి తెచ్చుకోవడం సాధ్యమే. తాను పుట్టి, పెరిగిన భాషా సమాజంలోని భాషనే కాకుండా, మరికొన్ని భాషలను కూడా నేర్చుకునే శక్తి మానవులకు ఉంది. అట్లాగే ఒక భాషలోని ఆలోచనలనూ, భావాలనూ, మరొక భాషలో వెల్లడించగలిగిన పద్ధతీ; నేర్పూ ఉన్నాయి.

## అనువాదం, లిప్యంతరీకరణం

ఒక భాషలోని ఆలోచనలనూ, భావాలనూ మరొక భాషలో ప్రకటించే పద్ధతినే తెలుగులో భాషాంతరీకరణమనీ, అనువాదమనీ, తర్జుమా అనీ అంటారు. 'ఒక భాష' అంటే ఏ భాషలోని ఆలోచనలనూ, భావాలనూ అనువాదం చెయ్యాలనుకుంటామో ఆ భాష. దీన్ని మూలభాష (Source language) అంటారు. ఏ భాషలోకి అనువాదం చెయ్యాలనుకుంటామో అది లక్ష్యభాష (Target language). ఇంగ్లీషు భాషలోనుంచి ఒక విషయాన్ని తెలుగులోకి అనువాదం చెయ్యాలనుకున్నప్పుడు ఇంగ్లీషు మూల భాష, తెలుగు లక్ష్యభాష. తెలుగు భాషలో నుంచి ఇంగ్లీషులోకి అనువాదం చెయ్యాలనుకున్నప్పుడు తెలుగు మూలభాష, ఇంగ్లీషు లక్ష్యభాష. మూల భాష నుంచి లక్ష్యభాషలోకి భాషాంతరీకరణం చేయగలిగిన నేర్పునే అనువాద సామర్థ్యం అంటారు. మానవుల భాషల్లో అనువాద పద్ధతీ, మానవులకు అనువాద సామర్థ్యమూ ఉన్నాయి.

అనువాదమంటే మూలభాషలోని ఆలోచనలనూ, భావాలనూ లక్ష్యభాషలో వెల్లడించడం అన్నాము. ఈ విధంగా వెల్లడించేటప్పుడు వాగ్రూపమైన సంకేతాలు మారతాయి. వాగ్రూపమైన సంకేతాలు ఒక భాషలో ఉన్నట్లు మరొక భాషలో ఉండవు. కానీ ఆ సంకేతాల వెనుక ఆలోచనల్లో పోలికలు ఉంటాయి. ఉదాహరణకి దిగువ ఇచ్చిన వివిధ భాషలకు చెందిన మాటలను చూడండి:

| వాగ్రూప సంకేతం | భాష | మానవుల ఆలోచనల సామ్యం వల్ల వచ్చిన అర్థం |
|---|---|---|
| మా అమ్మ | తెలుగు | తల్లి |
| मेरी माँ | హిందీ | ,, |
| My mother | ఇంగ్లీషు | ,, |
| ma mere | ఫ్రెంచి | ,, |
| meine mutter | జర్మన్ | ,, |
| mi madre | స్పానిష్ | ,, |

ఈ వాగ్రూప సంకేతాలు ఒకే పదార్థాన్ని - అమ్మ అనే పదార్థాన్ని సూచిస్తున్నాయి. ఇవి వరుసగా తెలుగు లిపిలోనూ, హిందీ లిపిలోనూ, రోమన్ లిపిలోనూ ఉన్నాయి. ఒక వాగ్రూప సంకేతంలో ఉండే పదార్థానికి లేదా భావానికి దీటైన మాటను మరొక వాగ్రూప సంకేతంలో తెలిపితే అది భాషాంతకరీణం. ఒక లిపిలోని మాటను మరొక లిపిలో రాస్తే అది లిపి మార్పు అంటే లిప్యంతరీకరణం (Transliteraion). లిప్యంతరీకరణాన్నే ప్రతి లేఖనమని కూడా అంటారు. మా అమ్మ అనే మాటను హిందీ లిపిలో मा अम्मा అని రాయవచ్చు. రోమన్ లిపిలో Ma Amma అని రాయవచ్చు. కన్నడంలోనో, మరాఠీలోనో, తమిళంలోనో, మరొక రకంగా రాయవచ్చు. ఇది భాషాంతరీకరణం కాదు. లిపి మార్పు మాత్రమే. భాషాంతరీకరణంలో ఒక భాషలోని మాటల భావాన్ని వేరొక భాషలోని మాటలతో రాస్తారు. లిప్యంతరీకరణంలో ఒక భాషలోని మాటల అక్షరక్రమాన్ని యదాతథ ఉచ్చారణలో వేరొక భాషలోని అక్షరక్రమంలో (వర్ణక్రమంలో) రాస్తారు.

## దుబాసి, దుబాసించడం

ఇప్పుడు దుబాసి (interpretor), దుబాసించడం (interpretation) అనే మాటలకు అర్థాలు తెలుసుకుందాము. దుబాసి అనే మాట సంస్కృతం నుంచీ ఏర్పడిన మాట. దానికి మూలరూపం ద్విభాషి. అంటే

BRAOU

రెండు భాషలు మాట్లాడే వ్యక్తి. రెండు భిన్నభాషలు మాట్లాడే వక్తల మధ్య భావ వినిమయానికి తోడ్పడేవాడు అనే అర్థం తర్వాతి కాలంలో ఏర్పడింది. ఉదాహరణకు ఇంగ్లీషు మాత్రమే తెలిసిన వ్యక్తి, తెలుగు మాత్రమే తెలిసిన వ్యక్తితో వ్యవహారం జరుపు కోవాలనుకుంటే, వాళ్ళ మధ్య రెండు భాషలు తెలిసిన వ్యక్తి ఒకరు ఉండడం తప్పనిసరి. ఆ వ్యక్తి రెండు భాషల్లోనూ అటు ఇటు వ్యవహారగ్రహణకు తోడ్పడేవాడు. ఈ రకంగా భాషల మధ్య వ్యవహార గ్రహణకు తోడ్పడడాన్నే దుబాసించడం అనవచ్చు. దుబాసించడం వాగ్వ్యవహారానికి సంబంధించిన విషయం. అనువాదం రచనా భాషకు సంబంధించిన విషయం.

**అనువాదం ఎందుకోసం**

ఏ భాషలో నుంచి అయినా దేన్ని అయినా ఎందుకు అనువాదం చేసుకోవాలి? తెలుగు లిఖిత సాహిత్యమే మహాభారతానువాదంతో మొదలైంది.నన్నయ,తిక్కన, ఎఱ్ఱన(కవిత్రయం)సంస్కృత మహాభారతాన్ని తెలుగులోనికి ఎందుకు తర్జుమా చేసుకున్నారో పరిశీలిస్తే, మన పూర్వులుకూడా అనువాదాలు ఎందుకు చేపట్టారో తెలుస్తుంది. సంస్కృత మహాభారతంలోని వైదిక మతసంబధమైన సమాచారాన్నీ, అభిప్రాయాలనూ తెలుగుప్రజలకు వెల్లడించేందుకు వాళ్ళు అనువాదాన్ని చేపట్టారు. మహాభారతంలోని కథలు, వాటిలో పాల్గొనేవ్యక్తులూ, వాళ్ళు నివసించిన దేశకాలాదులు, వీటిద్వారా అనుభూతి వ్యక్తీకరణకోసం వాళ్ళు అనువాదాన్ని చేపట్టారు. అంతెందుకు? హెబ్రూ భాషలోని పాతనిబంధన అనువాదం గ్రీకుభాషలోకి క్రీ.పూ. 2, 3 శతాబ్దిలలోనే వెలువడింది. అప్పటినుంచీ ఇప్పటిదాకా మొత్తం బైబిలుగ్రంథం 210 భాషల్లోకి అనువదింపబడింది. అట్లాగే ప్రపంచప్రఖ్యాతి పొందిన మేధావులూ, రచయితల పుస్తకాలు వందలాది భాషల్లోకి అనువాదమయ్యాయి. ఈనాడు ఇంగ్లీషు భాషలోనుంచీ అనేక వ్యాసాలూ కథలూ, నవలలూ, నాటకాలూ వివిధ శాస్త్రగ్రంథాలూ వందలాది భాషల్లోకి అనువాదమయ్యాయి: అవుతున్నాయి.

ఒక భాషకు ఏ ఇతర భాషతో ఎక్కువ అవసరం ఉంది? ఆ అవసరం ఎందుకు ఏర్పడింది? ఎప్పుడు ఏర్పడింది? ఈ అంశాలు అనువాద అవసరాన్ని నిర్ణయిస్తాయి. అనువాదం సాంస్కృతిక వైజ్ఞానిక వినిమయ సాధనం కాబట్టి ఏ భాషకు మరొక భాషలోని సంస్కృతీ, విజ్ఞానమూ అవసరమో, అది అనువాదాలు చేసుకుంటుంది. ఎప్పుడు అనేది భాషల సంసర్గం మీదా, తమ భాషను అభివృద్ధి పరచుకోవాలనే వాళ్ళ దృష్టి మీదా, ప్రయత్నం మీదా ఆధారపడి ఉంటుంది.

ఆధునిక యుగంలో సంస్కృతి, విజ్ఞానం అనువాదాల ద్వారా ఉమ్మడిసంపద అవుతుంది. ఒక దేశంలో ఒక భాషలో కొన్ని కారణాలవల్ల సంస్కృతీ, శాస్త్రవిజ్ఞానమూ పుంజుకుని ముందంజవేసినా, ఆ సంస్కృతినీ, శాస్త్ర విజ్ఞానాన్నీ ప్రపంచంలోని అన్ని దేశాలవాళ్ళు, తమతమ భాషల్లో అనువాదాల ద్వారా తాము తెలుసుకోవచ్చు. అంతేకాదు, అభివృద్ధి చెందని భాషల పురోగతికి కూడా అనువాదాలు తోడ్పడతాయి. పరాయిభాషలోని సంస్కృతినీ, శాస్త్రవిజ్ఞానాన్నీ అభివృద్ధి చెందని భాషా సమాజం తమ భాషలోకి తెచ్చుకోవాలనుకున్నప్పుడు, కొత్త భావాలనూ, కొత్త వస్తువులనూ తెలియచేసే పదాలనూ, పదబంధాలనూ అరువు తెచ్చుకోవడమో, తమ భాషలోనే కొత్తగా కల్పించుకోవడమో చేయడంవల్ల భాషలు వృద్ధి చెందుతాయి.

**అనువాదంలో సమస్యలు**

అనువాదంలో తలెత్తే సమస్యలు రెండు రకాలు: 1. సాంస్కృతిక సంబంధమైనవి. 2. భాషా సంబంధమైనవి. సాంస్కృతిక సంబంధమైన సమస్యలు ఆయా భాషలు మాట్లాడే ప్రజల సంస్కృతుల మధ్య ఉండే తేడాలవల్ల ఏర్పడతాయి.

# అనువాదంలో సాంస్కృతిక సమస్యలు

ఇవి రెండురకాలు. మొదటివి భిన్న సంస్కృతుల మధ్య ఉన్న తేడాలవల్ల ఉత్పన్నమైనవి. రెండవరకం ఒకే సంస్కృతిలో భిన్న కాలాల్లో, భిన్న చారిత్రక కారణాలవల్ల కన్పించే వ్యత్యాసాలు.

భిన్న సంస్కృతుల మధ్య తేడాలంటే ఏమిటో ముందుగా తెలుసుకుందాము. ఏభాషను మాట్లాడే ప్రజలైనా అత్యధికులు ఒక భౌగోళిక ప్రాంతంలో ఉంటారు. (తెలుగు వాళ్ళు రాష్ట్రేతర ప్రాంతంలోనూ, విదేశాల్లోనూ ఉన్నసంగతి మీకు తెలుసు. కానీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నివసిస్తున్న వాళ్ళు దాదాపు అయిదు కోట్లమందికదా). ఆ భౌగోళిక ప్రాంతంలో కొన్ని నైసర్గిక పరిస్థితులు ఉంటాయి. అట్లాగే ఒకభాషా ప్రాంతానికి సంబంధించిన ప్రజలకు అంటే జాతికి ఒక నిర్దిష్టమైన భౌతిక జీవితం ఉంటుంది; సాంఘిక జీవితం ఉంటుంది: మత విశ్వాసాలు ఉండవచ్చు. ఒకమాటలో చెప్పాలంటే వీటన్నిటి ప్రభావాలవల్ల జాతిభావాలు, భావాల తీరునుబట్టి భాషా ఉంటాయి.

ఉదాహరణకు ఎస్కిమోలు మంచుపరిసరాల్లో జీవించేజాతి. ఎస్కిమోల భాషలో ఉన్నన్ని మంచురకాలను తెలిపే పదాలు మంచు పరిసరాల్లో జీవించని జాతి భాషలో ఉండవు. తెలుగులో లేవుకదా! మరొక ఉదాహరణ చూడండి. ఇంగ్లీషులో ice, snow, dew, mist, fog, frost అనే ఆరు పదాలు ఆరు వేరువేరు అర్థాలలో కన్పిస్తాయి. తెలుగులో మంచు, చలిమంచు, పొగమంచు అనే మూడు పదాలు కన్పిస్తాయి. తెలుగులో ఎండను తెలిపే పదాలు: ఎండ, పొడఎండ, మండుటెండ, పొద్దుటెండ, నీరెండ, మూగెండ. ఇంగ్లీషులో ఎండను తెలపటానికి ఇన్ని పదాలు,ఇన్ని అర్థచ్ఛాయల్లో లేవు. ఆ మాటకువస్తే ఎండను తెలిపే ప్రత్యేక పదమే లేదు—Sun తప్ప, ఇన్ని లేకపోవటానికి భౌగోళిక, శీతోష్ణ స్థితిగతుల్లో తేడాలు కారణం కావచ్చు. భౌగోళిక శీతోష్ణ పరిస్థితులనుబట్టి పండేపంటల్లో తేడాలుంటాయనీ, ఆ తేడాలు ఆహారపు అలవాట్లను చాలామటుకు నిర్ణయిస్తాయనీ మనం మరచిపో కూడదు. ఇంగ్లీషులోని Bread, Soup, Sandwich అనే మాటలను గమనించండి. తెలుగులో అన్నంలోనూ కూరల్లోనూ చాలాచాలా రకాలున్నాయి. వరి అన్నం వేరు, కొర్రన్నం వేరు, సంగటివేరు ఇట్లాగా. ఇంగ్లీషులోని **R**ice అన్నమూ కావచ్చు; బియ్యమూ కావచ్చు.

భౌతిక జీవితమే తీసుకుందాం, మనది ఇంకా ప్రధానంగా వ్యవసాయ నాగరికత. వ్యవసాయంలో కూడా పూర్తిగా సాంకేతికాభివృద్ధిని మనం సాధించవలసిఉంది. యూరప్‌లో పారిశ్రామిక నాగరికత చాలా అభివృద్ధి చెందింది. ఇంగ్లీషు, రష్యన్‌లో ఉన్నన్ని - యూరోపియన్ భాషలలో ఉన్నన్ని - శాస్త్రవిజ్ఞాన సంబంధమైన పదాలు మనతెలుగులో కానీ, ఇతర భారతీయభాషల్లోకానీ లేవు.జపనీస్‌లో ముఖ్యంగా ఎలక్ట్రానిక్ రంగంలో ఎన్నో కొత్తపదాలు కన్పిస్తాయి. నూతన వస్తుకల్పన జరిగినప్పుడు నూతన భావకల్పన జరుగుతుంది. కొత్త వస్తువులను తెలిపే మాటలతో బాటూ, కొత్త భావాలను తెలిపే మాటలు కూడా భాషలో ప్రవేశిస్తాయి. ఇటువంటి మాటలు అనువాదంలో ఒక సమస్యగా పరిణమిస్తాయి. వాటిని యథాతథంగా అనువదించుకోవాలా? లిప్యంతరీకరణం చేసుకోవాలా?

సాంఘిక జీవితం చూడండి. ఉదాహరణకు తెలుగులో ఉన్నన్ని బాంధవ్య బోధక పదాలు ఇంగ్లీషులో లేవు. అన్న, తమ్ముడు అనేమాటలు మనకు విడివిడిగా ఉన్నాయి. ఇంగ్లీషులో brother అనే ఒక మాట మాత్రమే ఉంది. మేనత్త, పెద్దమ్మ, పిన్నమ్మ మాటలకు ఇంగ్లీషులో aunt అని మాత్రమే అనాలి. ఇంగ్లీషులోని friend అనే మాటను తీసుకోండి. సందర్భాన్ని బట్టి స్నేహితుడైనా కావచ్చు, స్నేహితురాలైనా కావచ్చు. తెలుగు వాక్య నిర్మాణంలో అట్లాంటి చోట్ల కర్తను సూచించేక్రియ కూడా మారుతుంది. చూడండి:

Prasad met his friend Lalitha

Prasad met his friend Ramana

BRAOU

అలాగే ఇంగ్లీషులో widower, divorcee అనే మాటలను తీసుకోండి. మన భాషా సంస్కృతిలో భర్త చనిపోయిన భార్యను సూచించే పదం విధవ, విధవరాలు ఉన్నాయి కానీ భార్య చనిపోయిన భర్తను సూచించే పదాలు లేవు. (విధురుడు అనే మాట నిఘంటువులో ఉంది. వాడుకలో లేదు) బొట్టు చెరిగిపోవడం, కుంకుమ చెదిరిపోవడం, తాడుతెగడం, గాజులు పగిలిపోవడం వంటి మన సామాజిక జీవితంలోని నుడికారాలు ఇంగ్లీషు జీవితంలోలేవు. ఈ మాటలు మన వైవాహిక వ్యవస్థలో స్త్రీ పురుషులమధ్య తేడాలను సూచించడమేకాదు, మన మత విశ్వాసాలను కూడా సూచిస్తాయి. అట్లాగే courtship, courting, wooing, petting వంటి మాటలను పరిశీలించండి. మనుషుల పేర్లు, ఇంటి పేర్లు కూడా ఒక జాతి నామకరణ పద్ధతిని తెలుపుతాయి.

ఏతవ పాఠంలో జాతీయాలను గురించి వివరించేటప్పుడు చచ్చు, చావు పదాలమీద ఏర్పడిన జాతీయాలను మీరు గమనించారు. కైలాసం, లింగైక్యం, శివసాయుజ్యం, హంస లేచిపోవడం వంటి జాతీయాలను మరొక భాషలోకి అనువదించడం ఎంత కష్టమో ఆలోచించండి. ఇంగ్లీషులో క్రైస్తవ మతాచారాలను సూచించే పదాలు ఇట్లాంటివే. (cross, baptise, baptism, baptist, sermon, holy spirit, evil spirit, demon, divil, unclean spirit, brother, brother superior, Son of God, Son of Man, methodist, minister, వంటి మాటల అర్థాలు గమనించండి.

ఇప్పుడు ఒకే సంస్కృతిలో భిన్న కాలాల్లో, భిన్న చారిత్రక కారణాలవల్ల కన్పించే సాంస్కృతిక వ్యత్యాసాలను గురించి తెలుసుకుందాము. మధ్యయుగానికి చెందిన యూరోప్ జీవితాన్ని చిత్రించిన రచనల్లో అప్పటి మాటలు ఇప్పటి రచనల్లో ఉండకపోవచ్చు. ఉదాహరణకు inn, knight, duel, fort, castle, వంటి పదాలను అనువాదం చేసేటప్పుడు అప్పటి అర్థంలోనే ఉపయోగించవలసి ఉంటుంది.

ఇంగ్లీషు మూలభాషఅయి,తెలుగు లక్ష్యభాషగా ఉన్నప్పుడు ఈ రకమైన సమస్యలు మనకు ఎన్నో ఎదురవుతాయి. (ఈ పాఠాల్లో ఇంగ్లీషు, తెలుగు తర్జుమా సూత్రాలే ఎక్కువ నేర్చుకుంటున్నారు. కాబట్టి, ఉదాహరణలు ఎక్కువగా ఇంగ్లీషునుంచే ఇస్తున్నాము). ముఖ్యంగా ఐరోపీయ సంస్కృతి మన సంస్కృతికంటే బాగా వికసించింది కావడంవల్ల, ఇంగ్లీషులో ఉన్న అనేక రంగాలలోని పదాలకు మన భాషలో సమానార్థకాలు లేవు. వస్తువులు కొత్త, భావాలు కొత్త, మాటలు కొత్త. ముఖ్యంగా విజ్ఞానసాంకేతిక శాస్త్రాలకు సంబంధించిన పదాలు మనకు చాలాకొత్త. ఉదాహరణకు మనస్తత్వ విజ్ఞానంలోని id, super ego, extrovert, intrcovrt, లాంటి మాటలను తీసుకోండి. ఈ భావాలకు తగిన పదాలను తెలుగులో మనం సృష్టించుకోవలసి ఉంటుంది. అంతెందుకు, పరిపాలనారంగంలోని ఈ కింది పదాలనే గమనించండి:

commnnique, rejcinder, reference, endorsment, affidivit, resolution, despatch, proclamation.

ఈ సమస్యలు ఉండడంవల్లనే, అనువాదకులు మూలభాషలోని సంస్కృతిని నిశితంగా అధ్యయనం చేయాలని అంటారు.

**ముఖ్యవిషయ క్రోడీకరణ**

1. మానవులకు భాషలను నేర్చుకొనే శక్తి ఉంది; ఒక భాషలో ఉన్న విజ్ఞానాన్ని మరొక భాషలోకి తెచ్చుకోగలిగిన పద్ధతీ, నేర్పూ ఉన్నాయి.
2. ఒక భాషలో చేసే ఆలోచనలనూ మరొక భాషలో ప్రకటించే పద్ధతిని అనువాదం అంటారు. మరొక రకంగాచెబితే మూలభాష (Source language) లోని ఆలోచనలనూ, భావాలనూ లక్ష్యభాష (Target language) లో వెల్లడించడమే అనువాదం.

BRAOU

3. అనువాదం, భాషాంతరీకరణం, తర్జుమా అనేమాటలు పర్యాయపదాలు. ఇంగ్లీషులోని Translation అనే పదాన్ని సూచించే సమానార్థక పదాలు ఇవి. రచనావ్యవహారాన్ని సూచించే మాటలు ఇవి. దుబాసి(interpret) దుబాసించడం (interpretation) అనేవి వాగ్వ్యవహారాన్ని సూచించే మాటలు. లిప్యంతరీకరణం (Transliteration) అంటే ఒక భాషలిపిలోని అక్షరాలను (వర్ణాలను) ఉచ్చారణ విధేయంగా మరొక భాషలోని లిపిలో రాయడం.

4. భాషల మధ్య ఉండే అవసరాలే అనువాదాలు చేసుకొనే అవసరాన్ని నిర్ణయిస్తాయి. అనువాదాలు భాషల అభివృద్ధికి తోడ్పడతాయి.

5. అనువాదంలో రెండు రకాల సమస్యలున్నాయి. అవి 1. సాంస్కృతిక సమస్యలు 2. భాషా సమస్యలు సాంస్కృతిక సమస్యలు మళ్ళీ రెండు రకాలు; 1. వేరు వేరు సంస్కృతుల మధ్య ఉండే తేడాలవల్ల కలిగేవి. 2. ఒకే సంస్కృతిలో కాలభేదం వల్లా, చరిత్ర ప్రభావంవల్లా కలిగేవి.

6. భాషల్లో భావాలతీరు ఆయా భాషల్లోని భౌగోళిక పరిస్థితులమీదా, వస్తుసంస్కృతిమీదా, సాంఘిక జీవితం మీదా; ఆచార వ్యవహారాలమీదా ఆధారపడి ఉంటుంది. భాషలలోని భావాల తీరునుబట్టి మాటలు ఉంటాయి.

### అదనపు సమాచారం

ఈ పాఠంలో ప్రస్తావించిన విషయాలు విశదంగా తెలుసుకోవడానికి జి. యన్. రెడ్డిగారు రాసిన "భాషలలో భావాలతీరు" అనే వ్యాసాన్ని దిగువ ఇస్తున్నాము. ఈ వ్యాసం చదవండి. పాఠంలో చెప్పిన అంశాలు ఆలోచించండి. వాటిని వ్యాసంలో రచయిత చెప్పిన అంశాలతో పోల్చి చూడండి. సమన్వయించి పరిశీలించండి. భాషకూ సంస్కృతికీ ఉన్న సంబంధం తెలియడమే కాకుండా, అనువాదంలో మనకు ఎదురయ్యే సాంస్కృతిక సమస్యల స్వరూపం ఎట్లా వుంటుందో తెలుస్తుంది. ఇక చదవండి:

BRAOU

## భాషలలో భావాల తీరు

### జి. ఎన్. రెడ్డి

మానవులు పరస్పరం భావ వ్యవహారాన్ని నడుపుకోటానికి వుపయోగించే సాధనం భాష. ఇది వాగ్రూపమైంది. ప్రపంచంలో సుమారు 2000 భాషలు వ్యవహారంలో వున్నాయి. ఒక భాషను వ్యవహరించే ప్రజానీకాన్ని ఒక భాషా సమాజంగా మనం గుర్తించవచ్చు. అంటే ప్రపంచంలో యెన్ని భాషలున్నాయో అన్ని భాషాసమాజాలున్నట్లు. మాతృభాషనే గాక మరికొన్ని భాషలను కూడా నేర్చి వ్యవహరింపగల శక్తి మానవునికి వుండటం ఒక విశేష లక్షణం.

మానవభాష వాగ్రూప సంకేతాల సముదాయం. ఈ వాగ్రూప సంకేతాలు వేర్వేరు భాషల్లో వేర్వేరు విధంగా వుంటాయి. ఈ లక్షణాన్ని బట్టి భాషల భిన్నత్వాన్ని బిడ్డలైనా గుర్తించగలుగుతారు. ఉదాహరణకు కుక్క అనే జంతువును తెలియజేయటానికి కల వాగ్రూప సంకేతాలు సంస్కృతంలో 'శునకః', హిందీలో 'కుత్తా', తమిళంలో 'నాయి', ఇంగ్లీషులో 'డాగ్' లాటిన్‌లో 'కానిస్', ఫ్రెంచిలో 'షైఁ'— ఈ విధంగా వస్తువు ఒకటే అయినా దానిని తెలియజేసే వాగ్రూప సంకేతాలు భిన్నభాషల్లో భిన్నంగా వుంటాయి. ఒకే వస్తువును సంకేతించటానికి ఒకటి రెండుకు మించిన వాగ్రూప సంకేతాలు కూడా భాషల్లో వుండవచ్చు. పంచేంద్రియాల అనుభూతికి వచ్చే సమస్త భౌతిక వస్తు సముదాయానికి సంబంధించే కాక కేవలం మానవుని చైతన్యప్రపంచానికి సంబంధించిన అమూర్తములైన భావాలకు కూడా వాగ్రూప సంకేతాలు మానవులు కల్పించుకోగలగడం ప్రతి

భాషలోనూ కన్పిస్తుంది. ఈ దృష్టితో మనం భాషను పరిశీలిస్తే ప్రతి భాష కూడా ఆయా భాషా సమాజపు ప్రజలయొక్క భౌతిక మానసిక అనుభూతులను తెలియజేసే వాగ్రూప సంకేతాల—పదాల—రాశి అని నిరూపించవచ్చు.

పదరాశిలో యే రెండు భాషలు సమానంగా వుండవు: అదే విధంగా, సంకేతింపబడిన వస్తువుల్లో, భావాలలో సమానత్వం వుండదు. దీనికి కారణం ఆయా సమాజాల యొక్క భౌగోళిక బౌద్ధిక పరిమితులు. ఒక భాషా సమాజపు పరిసరాల్లోని—ప్రతి వస్తువు భాషలో సంకేతింపబడి వుండకపోవచ్చు. ఏ వస్తువులు లేక భావాలయితే ఆ సామాజిక జీవితంలో ప్రత్యక్షంగానో, పరోక్షంగానో సంబంధం కలిగి వుంటాయో అవి ఆ సమాజపు భాషలో సంకేతింపబడి వుంటాయి. అట్టి సంబంధం లేని వస్తువులను, భావాలను తెలియజేసే పదజాలం ఆ భాషలో లేకపోవచ్చు. సముద్రతీరంలో నివాస మేర్పరచుకొని మత్స్యాహారులైన వారి భాషలో మత్స్య సంబంధ పదజాలం వున్నట్లు యెడారుల్లో జీవించే సమాజపు వారి భాషలో వుండకపోవచ్చు. ఎస్కిమోల భాషలో మంచురకాలను తెలిపే పదాలు చాలా వున్నాయి: దీనికి కారణం వారి జీవితం మంచుపరిసరాలతో ముడిపడి వుండటమే. అదేవిధంగా వైజ్ఞానికంగా పురోభివృద్ధి చెందిన సమాజపు వారి భాషలో కల శాస్త్ర పరిభాష అటవికుల భాషలో అగుపించదు. పరిసర ప్రకృతికి సంబంధించిన సూక్ష్మభేదాలను గుర్తించడం, గుర్తించకపోవడం వైయక్తిక. సామాజిక జీవిత విధానంమీద ఆధారపడి వుంటుంది; వ్యక్తులూ సమాజం సంతరించుకొన్న విజ్ఞానంమీద కూడా ఆధారపడి వుంటుంది.

భాషలనుబట్టి, భాషా సమాజాలయొక్క భౌగోళిక, సాంఘిక, సాంస్కృతిక, మానసిక జీవిత విశేషాల యొక్క తీరులో భేదం వుండవచ్చు. ఈ భేదం భాషల్లో ప్రతిబింబిస్తూనే వుంటుంది. భిన్నభాషా సమాజాలు వాస్తవిక జగత్తును పరిశీలించే తీరు ఆ భాషల్లో వ్యక్తమౌతుంది, రంగులకు కల పేర్లను బట్టి చూచినట్లయితే కొన్ని భాషల్లో రంగు రంగుకు గల అవాంతరభేదాలను తెలియజేసే పదాలు యెక్కువగా వుండవచ్చు: కొన్ని భాషల్లో తక్కువగానూ వుండవచ్చు. ఉదాహరణకు ఇంద్రధనుస్సులోని రంగుల భేదాలను ఇంగ్లీషు, బస్సా భాషా జనులు గుర్తించే తీరు :

ఇంగ్లీషు :

| | | | | | |
|---|---|---|---|---|---|
| Purple | blue | green | yellow | orange | Red |

బస్సా (లైబీరియన్ భాష) :

| | |
|---|---|
| hui | Ziza |

ఇదేవిధంగా ఇంగ్లీషులోయెరుపురంగుకు సంబంధించి Pink, Crimson, Red మొదలైన విభేదాలను గుర్తిస్తే తెలుగులో—యిన్ని రకాల యెరుపును ఒకే రంగుగా - యెర్రరంగుగా - భావిస్తాం. అంటే ఒక సమాజంవారి ఆలోచనా విధానం వాళ్లు మాట్లాడే భాషను బట్టి నడుస్తుందని చెప్పవచ్చు. మన ఆలోచనలను వ్యక్తం చేయడానికి సాధనమైన భాష మన ఆలోచనా మార్గాన్ని నిర్ణయిస్తుంది. తెలుగులో కల కొన్ని మాటలకు సమానార్థక పదాలు యింగ్లీషులో కన్పించవు. ఉదాహరణకు బంధువాచకాలు: వియ్యంకుడు, వియ్యపురాలు. వదిన, మరది, మరదలు, అన్న, తమ్ముడు, అక్క, చెల్లెలు, అట్లాగే ఇంగ్లీషులోని Divorcee, Widower, Parent, fiancee—యిటువంటి మాటలను ఋజువుగ తెల్పే తెలుగు పదాలు లేవు. ప్రథమ పురుష పుంలింగవాచకం ఇంగ్లీషులో He అను మాట ఒక్కటే. తెలుగులో వాడు, అతడు, ఆయన, వారు అనే నాలుగు మాటలున్నాయి; తెలుగులో ఈ పదాల ప్రయోగం మూడో వ్యక్తి మీద వక్తకు గల న్యూనతా గౌరవభావాలను సూచిస్తుంది. రెండు భాషల మధ్య కల పదజాలన్ని పరిశీలించినట్లైతే సమానార్థక పదాలు చాలా అరుదుగా



BRAOU

వుంటాయి. సామాన్యమైన కొన్ని భావాలను కానీ, వస్తువులను కానీ తెలియజేసే పదజాలం ఒక భాషలో వున్నట్లు మరొక భాషలో వుండకపోవచ్చు. జాలినీస్ భాషలో 'తిన్' అను ఒక మాట వుంది. దీనికి అర్థం: వేడిగా వున్నపుడు చల్లదనాన్ని, చలిగా వున్నపుడు వెచ్చదనాన్ని పొందడం. జర్మన్ భాషలో తెల్లగుర్రానికి ఒకమాట (Schmmel), నల్లగుర్రానికి వేరొకమాట (Reppe) వున్నాయి. వియత్నమీస్ భాషలో పెత్తండ్రికి 'Bac', పినతండ్రికి 'can' అని వేరు మాట లున్నాయి. హోపీ భాషలో ఘటజలానికి 'Keji' అని పేరు. తటాక, సముద్ర, ప్రవాహ జలాలన్నిటికి చేర్చి 'Pade' అనే వేరొకమాట వుంది.

ఒక భాషలోని పదజాలాన్ని రెండు రకాలుగ వర్గీకరించుకోవచ్చు:

1. రూఢములు, 2. వ్యుత్పన్నములు. పదాన్ని విశ్లేషించి వ్యుత్పత్తిని చెప్పటానికి సాధ్యం కాని పదాలు రూఢములు. ఉదా: చెట్టు, పుట్ట, కొండ, గోడ, ఇల్లు మొదలైనవి. ఇందుకు భిన్నమైనవి వ్యుత్పన్నములు: ఉదా: కోత (∠కోయు). ఆట (∠ఆడు) తవ్వోడ (Drudger), నులకమంచం, దంపుడుబియ్యం, గబ్బు నూనె (కిరసనాయిల్) మొదలయినవి. భాషాచరిత్రలో రూఢములైన పదాలు అతి ప్రాచీనమైనవి. విజ్ఞానము, నాగరికత అభివృద్ధి చెందుతున్నకొద్దీ, వివిధ వస్తువులను, భావాలను తెలియజేయడానికి యేర్పడే అవసరాన్నిబట్టి నూతన పదాలు, పదబంధాలు భాషల్లో వెలుస్తూవుంటాయి. భాషలలోని రూఢములు, వ్యుత్పన్నములైన పదజాలం ఆ సమాజంయొక్క భావ వికాసానికి సూచికలు.

మాతృభాషను మాత్రమే వ్యవహరింపగల వ్యక్తియొక్క ఆలోచనా విధానం ఆ భాషా వ్యవస్థకు మాత్రమే పరిమితమై వుంటుంది. మరొక భాషను కూడా నేర్చుకొన్న వ్యక్తి ఆలోచనా విధానం కేవలం మాతృ భాషా వ్యవహర్త ఆలోచనా సరళికన్న విస్తృతమై వుంటుంది. ఉదాహరణకు కేవలం తెలుగు భాషను వ్యవహరించే తెలుగు వాడికంటే సంస్కృతభాషా పరిచయం కానీ, ఇంగ్లీషుభాషా పరిచయం కానీ కల తెలుగువానియొక్క ఆలోచనా సరళి భిన్నంగానూ, కొంత విస్తృతంగానూ వుండక తప్పదు. అన్యభాషా సంపర్కం. తద్వారా భావ సాంకర్యం ఆలోచనాశక్తిని మరింత పదను పెడుతుంది. వేరొక భాషను నేర్చుకొనడంవల్ల కలిగే లాభాలను గురించి Schpenhaner ఈ విధంగా అంటారు:

'In learning any foreign language, you form new concepts, you discover relationships you don't realise before, innumerable naunces, similarities, differences enter your mind; you get a rounded view of everything. which means that you think differently in every language, that learning a language modifies and colors your thinking, corrects and improves your views, and increases your thinking skill, since it will more and more detach your ideas from your words.'

[జి.యస్.రెడ్డి., సాహిత్యసమితి వ్యాసావళి 2, తిరుపతి, మార్చి 1969, 170-174]

BRAOU

## ఖండిక 16 పాఠం 30

# అనువాదంలో భాషా సమస్యలు

ఉద్దేశం

మూలభాష, లక్ష్యభాష నిర్మాణాలలోని తేడాలవల్ల అనువాదకులకు ఎదురయ్యే సమస్యలను దృష్టాంత పూర్వకంగా తెల్పడం. అనువాదం చేపట్టడానికి రెండు భాషలపై తగినంత అధికారం అవసరమనే స్పృహను కల్గించడం. మూలభాషలోని పదాలూ, నుడికారాలూ అర్థాలూ అర్థచ్ఛాయలూ తెలుసుకోవడానికి కనీసం నిఘంటువును చూసే అలవాటును విద్యార్థులలో ప్రోత్సహించడం.

ప్రణాళిక

1. భాషా సమస్యలు ఏవి?
2. అనువాదంలో రాసే అలవాట్లు
3. పదాలూ, నుడికారాలూ-వాటి అర్థ విశేషాలు
4. పద నిర్మాణం
5. వాక్య భేదాలూ, ప్రయోగాలు
6. ముఖ్య విషయ క్రోడీకరణ
7. అభ్యాసాలూ, ప్రశ్నలూ.

BRAOU

## భాషా సమస్యలు ఏవి?

భాషా సమస్యలంటే అనువాదంలో ఇమిడి ఉన్న రెండు భాషలకు సంబంధించిన సమస్యలు. అంటే మూల భాషా నిర్మాణానికీ, లక్ష్య భాషా నిర్మాణానికీ మధ్య ఉండే తేడాలవల్ల అనువాదకులకు ఎదురయ్యే సమస్యలన్న మాట.

మొదట ఎనిమిది ఖండికలను చదివిన మీరు, భాషా నిర్మాణంలో ఉన్న అంశాలను గ్రహించి ఉంటారు. మొదటి ఎనిమిది ఖండికల్లో తెల్పిన ముఖ్యమైన అంశాలు:

1. రాసే అలవాట్లు 2. పదాలు, నుడికారాలు-వాటి అర్థ విశేషాలు 3. పద నిర్మాణం 4. వాక్య భేదాలు, ప్రయోగాలు—ఇవి ఏ భాషా నిర్మాణానికైనా వర్తించే అంశాలు.

అయితే ఒక భాషా నిర్మాణం ఉన్నట్లు మరొక భాషా నిర్మాణం ఉండకపోవచ్చు. అందువల్ల అనువాదం చేయాలనుకున్నప్పుడు ఈ నాలుగు అంశాలూ మూలభాషకూ లక్ష్యభాషకూ మధ్య సమస్యలుగా పరిణమిస్తాయి.

అనువాదమంటే ముక్కకు ముక్క అర్థం చెప్పడమే కదా అని ఎవరైనా అనుకోవచ్చు. ఏదైనా ఇంగ్లీషు తెలుగు నిఘంటువు చూడండి. ఇంగ్లీషులోని ప్రతి పదానికి సమానార్థకమైన పదం తెలుగులో ఉందేమో పరిశీలించండి. అంతెందుకు దాదాపు ఒకే అక్షర క్రమం (Spelling) ఉన్న రెండు భాషల్లోని రెండు వేరు వేరు పదాలకు అర్థాలు ఒకటిగానే ఉంటాయను కోవడం కూడా భ్రమే. కాబట్టి అనువాదమంటే ముక్కకు ముక్క

అర్థం చెప్పడం కాదనీ, మూలభాషలోని నిర్మాణాన్ని దృష్టి ఉంచుకొని లక్ష్యభాషలోని నిర్మాణానికి అనుగుణంగా మూల భాషలోని ఆలోచనలనూ, భావాలనూ వెల్లడించడమనీ తెలుస్తుంది. ఇట్లా వెల్లడించడంలో ఎదురయ్యే పైన పేర్కొన్న అంశాలను దృష్టాంత పూర్వకంగా తెలుసుకుందాము.

### రాసే అలవాట్లు

మూలభాషలోని ధ్వని రీతులూ, లక్ష్యభాషల్లోని ధ్వని రీతులూ సరిగ్గా తెలిస్తే తప్ప, మూల భాషలోనుంచీ అనువాదం చేయకుండా యథాతథంగా తీసుకొనే కొన్ని మాటలను ఉచ్చారణకు సాధ్యమైనంత దగ్గరగా లక్ష్య భాషలో రాయడం సాధ్యంకాదు. ఇంగ్లీషులో నుంచి తెలుగులోకి అనువాదం చేసేటప్పుడు ఎన్నో పదాలు రాతలో నిర్దిష్టంగా, ఏక సూత్రతను పాటిస్తూ రాయవలసిన అవసరం ఏర్పడుతుంది. అని వస్తువుల పేర్లు కావచ్చు; స్థలాల పేర్లు కావచ్చు; మనుషుల పేర్లు కావచ్చు; భావాల పేర్లు కూడా కావచ్చు; అంతర్జాతీయ పరి భాష కావచ్చు. ముఖ్యంగా శాస్త్రీయ విషయాలను అనువాదం చేసేటప్పుడు ఉచ్చారణకు లోబడి మూల పదాలను లిప్యంతరీ కరణం చేయడం మంచిది. సమాజ విజ్ఞానం, విజ్ఞాన శాస్త్రం మౌలిక అంశాలలో లిప్యంతరీకరణం చేసిన మాటలను పరిశీలించండి. ఉదాహరణకు:

### ఉదాహరణకు

(అ) వస్తువులపేర్లు: Cardiogram, Sputnik, Soyuz, Challenger, Appolo, Arya-bhatta, Microscope, Telescope, Thermometer, Keleido-scope, Computer.

(ఆ) స్థలాలపేర్లు: Minoas, Mycenaean, Anatolia, Hallusha, Loyang, Shensi, Yein.

BRAOU

(ఇ) మనుషులపేర్లు: Kautilya, Pythagaras, Aristotle, Archemedis, Ptolemy,

(ఈ) వంశాలపేర్లు: Rene Descartes, Kassite, Shang, Chou, Medes.

(ఉ) పుస్తకాలపేర్లు: De Materia Medica, De Humani Corpovis Fabrica, Micrographia.

(ఊ) భావాలపేర్లు : Feudalism, appeal, prorogue, curfew.

(ఎ) అంతర్జాతీయ పరిభాష : Chromosomes, Semnopithecus, Fibrinogen, Thrombin, Harmone.

తెలుగులో రాసే అలవాట్లనుబట్టి ఇటువంటి వాటిని నేర్చుకోవలసి ఉంటుందని మొదటి పాఠంలో చెప్పాము. అయినా, విచిత్రంగా ఉచ్చరించే పద్ధతిలో, విచిత్రంగా రాయకుండా పేర్లు వచ్చినప్పుడు వాటి ఉచ్చారణ రీతి తెలుసుకోవడానికి ఒక మంచి పెద్ద ఇంగ్లీషు నిఘంటువు చూడడం ఉత్తమం.

### పదాలూ, నుడికారాలూ - వాటి అర్థ విశేషాలు

ఈకింది పదాలూ, నుడికారాల అనువాదాలు చూడండి:

| | | | |
|---|---|---|---|
| she-buffalo | ఆమె దున్నపోతు | Vyasa | వైశ్యుడు |
| river | కాలువ, చెరువు | Vyasapurana | వైశ్య పురాణము |

| | | | |
|---|---|---|---|
| heroes | గుర్రపు సంఖ్య | agamas | ఆగమాను అనువాడు |
| cultivation | నాగరికత | tremendrous | మూడు |
| all sects | క్రిమికీటకాలు | Puranas | పూరనామాస్ అనువాడు |
| underground | భూగర్భవాసం | Bulls eye | ఎద్దుకన్ను |
| old church | ముసలి చర్చి | incamera | కెమెరా లోపల |
| temple | దేవాలయం | live catridges | నిండు ప్రాణంతో ఉన్న తూటాలు |
| class war | తరగతుల యుద్ధం | arson supsected | అర్సన్ ఆయనను అనుమానించాడు |

His head carrys five thousand rupees వాడి తలమీద అయిదువేల రూపాయలు దొరికాయి

Straight from the horse mouth సరాసరి *గుర్రం నోట్లోంచి*

To fall in love with a machine *యంత్రంతో ప్రేమలో* పడటానికి

For a man like you, this cigerette gives satisfaction మీలాంటి *మగవానికి* ఈ సిగరెట్టు తృప్తినిస్తుంది.

Have a winning time with Allwyn ఆల్విన్‌తో విజయాన్ని వరించే సమయాన్ని చేపట్టింది.

Time barred కాలదుష్టమైనది

You have come at the wrong time నువ్వు చెడ్డకాలంలో వచ్చావు

BRAOU

పై అనువాదంలోని పొరపాట్లు కొన్ని విద్యార్థులు చేసినవి, కొన్ని పత్రికేయులు చేసినవి, కొన్ని ప్రకటనల అనువాదకులూ, ప్రభుత్వ అనువాదకులూ చేసినవి. వీటిని ఈ కింది విధంగా వర్గీకరించుకోవచ్చు:

(అ) మూల భాషలోని పదాలకున్న మామూలు అర్థాలు కూడా తెలియకపోవటం.

ఉదాహరణకు Arson అనే పదానికి ఉన్న, దురుద్దేశపూర్వకంగా తగలబెట్టడం అనే 'అర్థం' తెలియక పడిన పొరపాటు. అంతకంటే ఘోరమైన పొరపాట్లు river అంటే కాలువ అనడం, she buffelo అంటే ఆడ దున్నపోతు అనడం, cultivation అంటే నాగరికత అనడం లాంటివి. ఇటువంటి పొరపాట్లు విద్యార్థులు పరీక్షల్లో సర్వసాధారణంగా చేస్తూ ఉంటారు. అనువాద స్థాయికి అవసరమైన పదజాలంతో పరిచయం ఉన్నపుడు సాధారణంగా ఈ పొరపాట్లు దొర్లవు.

(ఆ) మూల భాషలోని పదాలకు మాటల కలయికలో సందర్భవశంగా వచ్చిన అర్థాలు, అర్థచ్ఛాయలు తెలియకపోవడం.

ముందుగా temple అనే మాటనే తీసుకుందాం. He hit him on his temple అన్నప్పుడు temple అనే మాటకుండే అర్థాలు తెలియాలి. temple అనే మాటకు దేవాలయం, కణత అని రెండు అర్థాలున్నాయి. కణతమీద కొడతారుగాని దేవాలయం మీద కొట్టరు. అట్లాగే underground అనే మాటకు మాటకు రహస్య జీవితం అనే అర్థం ఉందని తెలియాలి. వీటికంటే కొంచెం ఇబ్బంది పెట్టేవి Man లాంటి మాటలూ; old, live లాంటి విశేషణాలున్న మాటలూ. Man అంటే మనిషి. ఉదాహరణగా ఇచ్చిన వాక్యంలో మగవాడు అని ఉంది. ఈ అనువాదం సమంజసమేనా? child is the father man అనే వాక్యంలోని man అనే పదాన్ని ఎట్లా అనువదించాలి? He is a real man అనే వాక్యంలోని man అనే మాటకు అర్థం ఏమని? ఈ ఉదాహరణలనుబట్టి ఒక మాటను ఏ అర్థచ్ఛాయలో ఉపయోగిస్తున్నారనేది గమనించాలి. old man అన్నపుడు ముసలాయన, వృద్ధుడు అని అనువాదం చేయవచ్చుకానీ, old church అన్నపుడు చర్చి మనిషిలాగా ముసలిదౌతుందా?

ఇట్లాగే live catridge, live broad cast, live wire, live stock అనే మాటల్లో live, కున్న అర్థచ్ఛాయలు గమనించండి.

(ఇ) మూల భాషలోని నుడికారం తెలియక పోవడం. మూల భాషా సంస్కృతిని బట్టి ఏర్పడిన జాతీయాలు, సామెతలు అనువాదకుని తెలియకపోతే పొరపాట్లు తప్పవు. Bulls eye, Horse mouth ఇంగ్లీషు జాతీయాలు. fall in love, winning time వంటివి ఇంగ్లీషు పలుకుబడికి ప్రత్యేకమైన ప్రయోగాలు. ఇటువంటి నుడికారాలకు తెలుగులో కానీ, మరొక భాషలో కానీ కచ్చితంగా సరిపోయే లక్ష్యభాషా నుడికారాలు ఉండకపోవచ్చు. అట్లాంటి సందర్భంలో లక్ష్యభాష మర్యాద ననుసరించి నుడికారం ఏర్పరచుకోవాలి. to fall in love with machine అన్నప్పుడు fall in loveకు వ్యామోహం అనే అర్థంలో ఉపయోగిస్తున్నారు.

పదాలు, నుడికారాల విషయంగా అనువాదంలో తలయెత్తే సమస్యలుపైన పేర్కొన్న మూడు తరగతులకే పరిమితం కావు. మరి కొన్ని రకాల సమస్యలున్నాయి. అవి :

1. మూల భాషలోని శైలిలో మాండలిక పదాలను వాడడం. దక్షిణ అమెరికన్ ఇంగ్లీషులో Bird అనే మాట Boid అంటారు, Girlను Goil అంటారు. వీటిని అనువాదం చేసేటప్పుడు తెలుగు మాండలిక పద భేదాలను వాడవచ్చునా అనేది సమస్య - పోరి అనో, పిల్ల అనో, అమ్మాయి అనో.
2. కల్పనా సాహిత్యంలో పాత్రలు మాట్లాడేటప్పుడు చేసే ధ్వనులూ, ఆశ్చర్యార్థకాలూ మొదలైన వాటిని ఎట్లా అనువదించడం?
3. మూల భాషలో ఆ భాషకు చెందిన పాతపదాలు వాడితే వాటిని అనువదించేటప్పుడు అది సూచించడానికి లక్ష్యభాషలోని పాత పదాలను వాడాలా?

వీటి వివరాలు ఇప్పుడు మీకు అవసరంలేదు. ముందు ముందు వీటిని గురించి తెలుసుకుంటారు. పదాలూ నుడికారాలను అనువాదం చేసేటప్పుడు గమనించ వలసిన అంశాలు ఇవి:

BRAOU

1. ఇప్పటికే పత్రికల్లో రూఢికి వచ్చిన అనువాదాలను దృష్టిలో ఉంచుకోవడం.

| | | | | |
|---|---|---|---|---|
| ఉదా: | Summit Conference | శిఖరాగ్ర సమావేశం | demand | కోర్కె |
| | buffer zone | నిస్సైనిక మండలం | Favouritism | ఆశ్రితపక్షపాతం |
| | white paper | శ్వేతపత్రం | Assembly Seat | అసెంబ్లీ స్థానం |
| | time capsule | కాలనాళిక | opposition party | ప్రతిపక్షం |
| | pardon | క్షమాభిక్ష | crossing the floor | (పార్టీ)ఫిరాయింపు |
| | illicit liquor | దొంగ సారాయి | | |

2. ఇప్పటి సమాజ విజ్ఞాన గ్రంథాల్లోనూ, విజ్ఞానశాస్త్ర గ్రంథాల్లోనూ ఉపయోగిస్తున్న మాటలనూ పరిభాషనూ, కొన్ని సందర్భాల్లో వాటికి చేస్తున్న అనువాదాలనూ దృష్టిలో ఉంచుకోవడం. మీ పాఠ్యగ్రంథాల ద్వారా మీరు వీటిని సులభంగా తెలుసుకోవచ్చు.

| | | |
|---|---|---|
| ఉదా : | spermatazao | శుక్రకణాలు |
| | coordinated geometry | నిరూపక జామితి |
| | archaic period | ప్రాచీనయుగం |
| | classical period | సుప్రతిష్ఠిత యుగం |
| | dialectics | గతి తర్కం, పరస్పరవాదం |
| | Republic | గణరాజ్యం |
| | patriarchal | పితృస్వామిక |
| | amplifier | ధ్వనివర్ధకం |

3. తెలుగులో పరిపాలన సాగించాలనే ప్రయత్నంలో భాగంగా వెలువడిన నమూనా అనువాదాలూ, పద కోశాలు, వాటిలోని మాటలకు ఇచ్చిన అర్థాలూ దృష్టిలో పెట్టుకోవడం ఇవి తెలుగు నుడికారానికి దగ్గరగా ఉన్నాయో లేదో పరిశీలించడం మంచిది.

ఉదా : Employment Exchange ఉద్యోగ సాధక కేంద్రం
Land Tax భూ రాజస్వము

**పదనిర్మాణం**

పదనిర్మాణానికి సంబంధించిన సమస్యలన్నీ ఈ దశలో మీకు అక్కరలేదు. సాధారణంగా ఎదురయ్యే ఒకటి రెండు సమస్యలను మాత్రమే ఇక్కడ చర్చిద్దాము.

1. విశేషణ, విశేష్యక్రమం : Blue Shirt అనే మాటను తీసుకోండి. ఈ మాటను తెలుగు చేస్తే 'నీలిరంగు చొక్కా' అవుతుంది. ఇంగ్లీషులోనూ, తెలుగులోనూ విశేషణం ముందుంది. విశేష్యం తర్వాత ఉంది. క్రమం ఒకటే. మిగతా భాషా భాగాలన్నీ, పదక్రమాలన్నీ ఇట్లా ఒకే క్రమంలో ఉండవు.

2. క్రియా విధానం : ఇంగ్లీషు క్రియలను వచనంలో వాడిన వాళ్ళు ఎవరూలేరు. అరుదత్వమే వాహమ్‌లోనసనంకి, పెరిషించు అనేవి వాడినా ఆ చమత్కారం తెలుగువాళ్ళకు అలవాటు కాలేదు. ఇంగ్లీషు నామపదాలకు తెలుగు సహాయక క్రియలు చేర్చి వాడడం అనువాదంలో మన అలవాటు.

ఉదా :

| | |
|---|---|
| to resign | రాజీనామా చేయు |
| to nationalise | జాతీయం చేయు |
| to arrest inflation | ద్రవ్యోల్బణాన్ని అరికట్టు |
| to maintain good relations | సత్సంబంధాలను నెలకొల్పు |
| to arrest | అరెస్టుచేయు |
| to transfer | బదిలీచేయు |

BRAOU

3. ఉపసర్గలు చేరే పద్ధతి : ఇంగ్లీషు సమూనాలు ఉపసర్గలు ఎట్లా చేరతాయో పదాల మధ్య రూప సంబంధాలు అనే పాఠంలో మీరు తెలుసుకున్నారు. ఈ విధానాన్ని అనువాదంలో దృష్టిలో ఉంచు కోవాలి.

ఉదా : legal, illegal చట్టసమ్మతం, చట్టవిరుద్ధం
official, unofficial అధికార, అనధికార
co existance సహజీవనం

**వాక్యభేదాలు, ప్రయోగాలు:**

మూల లక్ష్య భాషల్లోని వాక్యభేదాలూ, వాక్య ప్రయోగాల మధ్య తేడాలుంటాయి. అనువాదకుడు వాటిని తెలుసుకోవాలి. లేకపోతే అనువాదంలో అర్థనష్టం కలగడమే కాకుండా, అస్పష్టత వస్తుంది. ఇంగ్లీషులోని కర్త, కర్మ, క్రియ క్రమానికీ, తెలుగులోని వాటి క్రమానికీ భేదం ఉంది. ఇంగ్లీషులో ఉపవాక్యాల సహాయంతో పెద్ద పెద్ద వాక్యాలను నిర్మించుకొనే వీలుంది. ఇంగ్లీషులో సాధ్యమైనట్లు పెద్దవాక్యాల నిర్మాణం తెలుగులో సాధ్యం కాదు. అప్పుడు మూల భాష అయిన ఇంగ్లీషులోని వాక్యభావం, తెలుగులో అర్థవంతమైన చిన్నచిన్న వాక్యాలలో తీసుకరావలసి ఉంటుంది.

వాక్యవిషయంలో కొన్ని సమస్యలను పరిశీలిద్దాము.

ఈ క్రింది వాక్యాలనూ, వాటి అనువాదాలను పరిశీలించండి,

| | |
|---|---|
| teacher is there | అక్కడ ఉపాధ్యాయుడున్నారు. |
| this is a chair | ఇది ఒక కుర్చీ |
| Rama and Sita are friends | రమా, సీతా స్నేహితులు |
| Are you coming to the college or not? | కాలేజీకి వస్తున్నావా? లేదా? |

ఈ నాలుగు వాక్యాల్లో is, and, or అనేమాటలు తెలుగులోకి వచ్చిన తీరు చూడండి. మొదటివాక్యంలో ఉన్నారు అనే క్రియ ద్వారా ఉంటున్నటోటు తెలుస్తుంది. is ఇంగ్లీషులో ఏకవచనం. తెలుగులో క్రియ గౌరవాన్ని తెలిపే బహువచనంలో ఉంది. ఇంగ్లీషు సర్వనామాలు He, she అనే మాటలను తెలుగులో ఆయన, అతను, వాడు; ఆమె, ఆది అనే మాటలద్వారా సూచించవచ్చు. పదాల మధ్య గౌరవస్థాయిని బట్టి క్రియను మార్చవచ్చు. రెండవ వాక్యంలో is అనువాదంలోకి రాలేదు. తెలుగులోని క్రియారహిత వాక్యం ఇంగ్లీషులోని క్రియాసహిత వాక్యభావాన్ని తెలుపుతుంది. మూడవవాక్యంలో and అనే మాటకు మరియు అని అనుదించడం తెలుగు నుడికారానికి అసహజమైన పాతకాలపు పద్ధతి. and అనే మాటకున్న సంకలనార్థం తెలుగులో కర్తకు ఆ చేర్చడంవల్ల (రమ + ఆ, సీత + ఆ) వచ్చింది. నాలుగో వాక్యంలో క్రియకు ఆ చేర్చడం ద్వారా (వస్తున్నావు + ఆ, లేదు + ఆ) or అనే మాటకున్న వికల్పసంబంధం వ్యక్తమైంది. (సంకల్ప, వికల్ప సంబంధాలను గురించి 14 వ పాఠంలో మీరు తెలుసుకున్నారు. వైరుధ్య సంబంధాన్ని సూచించే but అనే మాటను దృష్టిలో ఉంచుకోండి),

ఇంగ్లీషులోని విభక్తులను, తెలుగులోని విభక్తిపదాల ద్వారా సూచింపవచ్చు. అయితే on time, in time అన్నప్పుడు లో (సకాలంలో) on, in విభక్తులు చేసే పని చేస్తుంది. ఇటువంటి తేడాలను దృష్టిలో ఉంచుకోవాలి.

BRAOU

ఇంగ్లీషు వాక్యనిర్మాణంలోని మరొక ముఖ్యమైన భేదం సంబంధ బోధక సర్వనామాలకు (Relative Pronouns) సంబంధించినది. who, what, which, that, where, when, why అనే మాటల సాయంతో ఇంగ్లీషులో ఉపవాక్యాలను నిర్మించే పద్ధతి ఉంది. తెలుగులో ఎవరైతే, ఏమైతే, ఏదైతే, ఎక్కడైతే, ఎప్పుడైతే, ఎందుకైతే అంటు వాక్యాలను నిర్మించడం తప్పు కాకపోవచ్చు కానీ కృత్రిమంగా కన్పిస్తుంది. (13వ పాఠంలో సంబంధ బోధక వాక్యాలు తెలుగులో ఎట్లా ఉంటాయో చూడండి). ఉదాహరణకు ఒక్కవాక్యం చూడండి.

the man who is honest is trusted

ఎవరైతే నిజాయితీగా ఉంటాడో అతను నమ్మబడతాడు

నిజాయితీగల మనిషిని నమ్ముతారు

ఈ ఉదాహరణలో తెలుగుకు సహజమైన వాక్య ప్రయోగం రెండవ వాక్యం.

మరొక ముఖ్యమైన అంశం కర్మణి ప్రయోగాలకు సంబంధించినది. ఇంగ్లీషులోని కర్మ ప్రధాన వాక్యాలను (Passive sentences) తెలుగు చేసేటప్పుడు వాటి అవసరాలను బట్టి అనువాదం చేసుకోవాలి. (12వ పాఠంలో వీటిని గురించి తెలుసుకున్నారు) ఇల్లాంటి భాషా సమస్యలు అనువాదంలో అనేకం తల ఎత్తుతాయి. వీటిని పరిష్కరించుకోవాలంటే రెండు భాషల నిర్మాణాన్ని క్షుణ్ణంగా తెలుసుకోక తప్పదు.

**ముఖ్య విషయ క్రోడీకరణ**

1. అనువాదంలో భాషా సమస్యలంటే మూల భాషా నిర్మాణానికి, లక్ష్యభాషా నిర్మాణానికి మధ్య ఉండే తేడాల మూలంగా అనువాదకులకు ఎదురయ్యే సమస్యలు

2. అనువాదమంటే ముక్కకు ముక్క అర్థం చెప్పడం కాదు.

3. మూల భాష నుంచీ యథాతథంగా తీసుకునే మాటలను ఉచ్చారణకు తోబడి లిప్యంతరీకరణం చేయడం మంచిది.

4. మూల భాషలోని పదాలకున్న అర్థాలనూ, అర్థచ్ఛాయలనూ, నుడికారాన్నీ సరిగా గ్రహించకపోతే అనువాదంలో పొరపాట్లు వస్తాయి.

2. పదాలనూ, నుడికారాలను ఇంగ్లీషు నుంచీ అనువాదం చేసేటప్పుడు రూఢి పదాలను, పరి భాషనూ దృష్టిలో ఉంచుకోవాలి.

6. పద నిర్మాణంలో క్రియా విధానం, ఇంగ్లీషు నమూనాకు భిన్నంగానూ, ఉపసర్గలు చేరే పద్ధతి ఇంగ్లీషు నమూనాలోనూ కన్పిస్తాయి.

7. ఇంగ్లీషు తెలుగు వాక్య భేదాలను, వాక్య ప్రయోగాలనూ అనువాదకుడు దృష్టిలో ఉంచుకుంటూ లక్ష్య భాష అయిన తెలుగులో కృత్రిమత్వం రాకుండా అనువాదం చేయాలి.

## అభ్యాసం [రాసేపని]

ఈ అభ్యాసాలు 16వ ఖండికలోని రెండు పాఠాలకూ సంబంధించినవి.

1. కింద బైబిలునుంచి ఒక 'శుభవార్త'ను ఇస్తున్నాము. ఈ భాగంలోని సాంస్కృతిక ప్రత్యేకత కలిగిన మాటలను గుర్తించి, వాటికి తెలుగు మాటలు రాయండి.

"And Jesus, when he was baptised went up straight way out of the water: and, lo, the heavens were opened unto him, and he saw the spirit of God descending like a dove, and lighting upon him.

BRAOU

2. కట్టమంచి రామలింగారెడ్డి గారు ఇంగ్లీషులో రాసిన వేమన అనే వ్యాసంలోని భాగమిది. అనువదించి, లిప్యంతరీకరణం చేయవలసినవి చేసి, ఈ భాగంలోని సంస్కృతిని తెలిపే మాటలను పేర్కొనండి.

There is not an aspect of Hindu religiosity which has not been the target of Vemana's satire. Can we get salvation by bathing frequently? Why, then, all the fishes must be saved! Can we get salvation by smearing ourselves with ashes (vibhuti)? Why then, a donkey rolls frequently in ashes! Can we get salvation by eschewing eating of meat and taking to vegetarinism —"ism" as though that is religion.

Akulella tinna meka potulakela
Kakapoyenayya Kayasiddhi
Lokuella verri pokalla poduru

As regards the superstitions, what can you do with them? They are perverse by nature. You can straighten the snake groud by tying a stone, but how can you ever straighten a dog's tail?

Potlakaya rayi podugu tratana gatta
Leelatoda vankaleka perugu
Kukka toka gatta Kuduruna chakkaga!

3. ఒక గ్రీకు మిథ్యాగాథ (Myth) ఇది. ఇందులోని స్థలాలా పేర్లనూ, మనుషుల పేర్లనూ మీ ఇంగ్లీషు సంహోదారుల సహాయంతో తెలుగు లిపిలో రాయండి. మిథ్యా గాథలోని ఈకింది మాటలకు సందర్భాన్ని దృష్టిలో పెట్టుకొని తెలుగులో అర్థాలు రాయండి.

Goddess nymph goat skin friendly combat spear shield taken of grif, the Birth of Athene.

## THE BIRTH OF ATHENE

ACCORDING to the pelasgians, the goddess Athene was born beside Lake Tritonis in Libya, where she was found and nurtured by the three nymphs of Libya, who dress in goat-skins. As a girl she killed her playmate, pallas, by accident, while they were engaged in friendly combat with spear and shield and, in token of grief, set pallas's name before her own. Coming to Greece by way of Crete, she lived first in the city of Athenae by the Boeotian River Triton.

4. ప్రసిద్ధ ఇంగ్లీషు కాల్పనిక కవి కీట్స్ తాను ప్రేమించిన ఫానీబ్రౌన్‌కు రాసిన లేఖాంశాలు ఇవి. అనువాదం చేసి, ఇటాలిక్స్‌లోని మాటల అర్థచ్ఛాయలను పేర్కొనండి.

I appeal to you by the blood of christ you believe in. Donot write to me if you have done any thing this month which it would have pained me....

I cannot live without you, and not only you but *chaste* you; *virtuous* you. The sun rises and sets, the day passes and you follow the bent of your inclination to a certain extent-you have no *conception* of the quantity of *miserable feeling* that passes through me in a day. *Be Serious* ! Love is not a play thing and again do not write unless you can do in with a *crystal conscience*.

BRAOU

## ఖండిక 17   పాఠం 31

# అనువాదంలో భేదాలు : మూల విధేయానువాదం

### ఉద్దేశం

అనువాదంలోని రకాలను తెల్పడం. అనువాదం చేసే విషయాన్ని బట్టీ, అనువాదం చేసే పద్ధతిని బట్టీ ఈ రకాలను వివరించడం. మూలానికి కట్టుబడి చేసే పద్ధతిలోని సాధక బాధకాలను తెల్పడం-నమూనా అనువాదాల ద్వారా వీటిని విద్యార్థుల దృష్టికి తీసుకరావడం.

### ప్రణాళిక

1. విషయాన్ని బట్టి రకాలు
2. విధానాన్ని బట్టి రకాలు
3. మూలవిధేయానువాదం
4. నమూనా అనువాదం
5. ముఖ్యవిషయ క్రోడీకరణ
6. అభ్యాసాలూ, ప్రశ్నలూ

ఇంతకు ముందు ఖండికలో అనువాదంలోని సాంస్కృతిక సమస్యలనూ, భాషాసమస్యలనూ వివరించాము. సాంస్కృతిక వినిమయంలో అనువాదకుడు ఒక ప్రయోజనవంతమైన పాత్రను నిర్వహిస్తాడని మీరు గ్రహించి ఉంటారు. రెండు భాషలలోని సంస్కృతినీ, భాషానిర్మాణాన్నీ అనువాదకుడు విశదంగా తెలుసుకొని ఉండాలని కూడా మీరు గ్రహించి ఉంటారు. ఈ పాఠంలో అనువాదంలోని రకాలను వివరిస్తాము. ఇవి అనువాద సామర్థ్యం పెంచుకొనేందుకు దోహదం చేస్తాయి.

BRAOU

వైజ్ఞానికంగా, సాంకేతికంగా అభివృద్ధి చెందిన దేశాల్లో యంత్రానువాదం (machine translation) ఇటీవల మొదలైంది. వైజ్ఞానికసాంకేతిక సమాచారాన్ని కంప్యూటర్లు ఆయా మూలభాషలనుంచీ, లక్ష్యభాషల్లోకి అనువదిస్తున్నాయి. అడపాదడపా, కంప్యూటర్లు సాహిత్యానువాదాలను చేపడుతున్నాయనే వార్తలను మీరు పత్రికల్లో చూసి ఉంటారు. ఆధునిక యుగంలో యంత్రానువాదం, మానవానువాదం అనే రెండు రకాల అనువాదాలనూ, వాటి పరిమితులనూ తెల్పడం ఈ పాఠం పరిమితిలో లేదు. అందువల్ల విషయాన్ని బట్టీ, విధానాన్ని బట్టీ విభజింపగలిగిన అనువాద భేదాలను మాత్రమే తెలుసుకుందాము.

### విషయాన్ని బట్టి రకాలు

దేన్ని అనువాదం చేస్తామో అది విషయం. విషయాన్నే వస్తువు అనవచ్చు; పాఠం (text) అనవచ్చు. అనువాదవిషయం నాలుగు రకాలు: 1. సమాచారానువాదం 2. వచన సాహిత్యానువాదం 3. కవిత్వానువాదం 4. వైజ్ఞానిక, సాంకేతికపాఠానువాదం.

1. సమాచారానువాదం: వార్తలనూ, అధికారలేఖలనూ, ఇతర పరిపాలనా వ్యవహార పత్రాలనూ అనువదించడం.

2. వచన సాహిత్యానువాదం: సాహిత్యం సృజనకు సంబంధించినపని. వచనసాహిత్యంలో మానవుల అనుభూతులనూ, భావాలనూ, ఉద్వేగాలనూ చిత్రిస్తారు. అందువల్ల భాషలో అభిప్రాయప్రకటనతోపాటూ, ఉద్వేగ ప్రకటన కూడా ఉంటుంది. దీన్నిబట్టి పదాలకూ, నుడికారాలకూ, అర్థచ్ఛాయలూ, అర్థవిశేషాలూ ఉంటాయి. వాక్యప్రయోగాలుంటాయి. అనువాదంలో ఈ అర్థచ్ఛాయలను, అర్థవిశేషాలనూ తీసుకరావలసిఉంటుంది.

3. కవిత్వానువాదం: కవిత్వం కూడా సృజనకు సంబంధించినదే. అయితే వచన సాహిత్యశిల్పం కంటే కవిత్వశిల్పం వేరు. కవిత్వంలో లయా, అలంకారాలూ, పదకల్పనా వచనంలో కంటే విశిష్టంగా ఉంటాయి. మూల రచయిత ఆత్మాశ్రయ లక్షణాలు కవిత్వశైలిలో వచనశైలిలో కంటే మరింత విలక్షణంగా, ప్రస్ఫుటంగా ఉంటాయి. అందువల్ల ఏభాషలోని కవిత్వాన్ని అయినా అనువదించడం దాదాపు అసాధ్యమని అంటారు.

4. వైజ్ఞానిక సాంకేతిక పాఠానువాదం; విజ్ఞాన శాస్త్రానికీ సాంకేతిక శాస్త్రానికీ సంబంధించిన భాష ఒక విధంగా ప్రత్యేకభాష, ఆ రంగాలకు పరిమితమైనభాష. దీన్ని అనువదించడానికి అనువాదకుని విజ్ఞానశాస్త్ర, సాంకేతిక శాస్త్రాలతో తగు పరిచయం ఉండాలి. ఈ అనువాదాన్ని ఒకరకంగా ఫోటోగ్రఫీతో పోల్చవచ్చు.

## విధానాన్ని బట్టి రకాలు

మూలభాషలోని పాఠాన్ని లక్ష్యభాషలోకి ఏ పద్ధతిలో తేవడం అనే అంశాన్ని బట్టి అనువాదవిధానాన్ని రెండురకాలుగా విభజింపవచ్చు: 1. మూల విధేయానువాదం (literal or faithful translation) 2. స్వేచ్ఛానువాదం (free or idiomatic translation). ఈ పాఠంలో మూల విధేయానువాదం గురించి మాత్రమే తెలుసుకుంటారు.

## మూలవిధేయానువాదం

BRAOU

మూలానికి కట్టుబడి చేసే అనువాదాన్నే మూలవిధేయానువాదం అంటారు. మూలానికి కట్టుబడడం అంటే ముక్కకుముక్క తర్జుమా చేయడం కాదు. మూలవిధేయానువాద లక్షణాలు స్థూలంగా ఇవి 1. అనువాదం చదివినా మూలం చదివినట్లే ఉండాలి 2. మూలంలోని రచనా విధానమే అనువాదంలో ప్రతిఫలించాలి 3. మూలం వెలువడిన కాలంనాటి రచనలాగే అనువాదం ఉండాలి. 4. మూలంలోని అస్పష్టమూ, అర్థరహితమూ అయిన పలుకుబడిని అనువాదకుడు ప్రత్యేకంగా అధోజ్ఞాపికల్లో (Footnotes) ఇస్తూ పదగుంఫన శైలి ప్రత్యేకతలను పాఠకుల దృష్టికి తేవాలి. ఈ నాలుగు లక్షణాలను మరి కొంత వివరంగా తెలుసుకుందాము.

1. అనువాదం చదివినా, మూలం చదివినట్లే ఉండాలి: అనువాదకుడు స్వతంత్ర రచయిత కాడు. అనువాదం చేస్తున్నది సొంత రచన కాదు, అతడు ఒక రకంగా వ్యాఖ్యాత - మూలరచయిత మనస్సుకూ, పాఠకుల మనస్సులకు ఒక వారధిలాంటివాడు. మూలంలోని భావాలను సాధ్యమైనంతవరకు లక్ష్యభాషలోకి తెచ్చే ప్రయత్నం ఈ పద్ధతిలో జరుగుతుంది.

2. మూలంలోని రచనా విధానమే అనువాదంలో ప్రతిఫలించాలి: మూల రచయిత వాడిన శైలిలాంటి శైలిని అనువాదకుడు మాతృభాషలో తేగలగాలి. ఒక రకంగా ఇది మన జానపద కథల్లో చెప్పే పరకాయప్రవేశం లాంటిది.

3. మూలం వెలువడిన కాలంనాటి రచనలాగే అనువాదం ఉండాలి; ఉదాహరణకు షేక్స్పియరు రచనను అనువాదం చేస్తున్నారనుకోండి. అప్పుడున్న ఇంగ్లీషు నుడికారంలాంటి నుడికారాన్ని తెలుగులో కూడా తేగలగాలి.

4. మూలంలోని అస్పష్టమూ, అర్థరహితమూ అయిన పలుకుబడిని అనువాదంలో ప్రత్యేకంగా అధోజ్ఞాపికల్లో ఇస్తూ, పద గుంఫన శైలీ ప్రత్యేకతలను పాఠకులదృష్టికి తేవాలి. మూల రచనలో అస్పష్టమైన మాటలుండవచ్చు. అర్థరహితమైన పద ప్రయోగాలుండవచ్చు. వాటిని అనువాదం చేసేటప్పుడు రచయిత మూలంలో ఏం ఉద్దేశించాడు సులభంగా నిర్ణయించడం కష్టం కాబట్టి అధోజ్ఞాపికల్లో ఇవ్వాలి. మూలంలోని పదగుంఫనశైలి ప్రత్యేకతలను పాఠకులకు అందించాలి.

ఇక్కడ ఒక సందేహం కలుగుతుంది. "అనువాదకుడు మానవుడు కాబట్టి అతని ఆలోచనలు, అనుభవాలు, అభిరుచులూ మూల రచయిత లక్షణాలకన్నా విభిన్నంగా ఉండక తప్పదు కదా" అని. "అందువల్ల అనువాదంలో ఆత్మాశ్రయత (Sudjectivity), కొంత కృత్రిమత్వం ఉంటుంది. అంటే సిద్ధాంతరీత్యా ఏ మానవుడు నిర్దుష్టంగా అనువదించలేడు" కదా అని. నిజమే మనిషి యంత్రంకాదు. అందువల్ల "ఏ వ్యక్తి చేసిన అనువాదమైనా మూలానికి దగ్గరగా ఉంటుందేమోగాని అన్నివిధాలా సమానంగా ఉండదు. "అనువాదం అనుసృజన (transcreation) అనేది అందువల్లనే. అంతమాత్రంచేత మూలవిధేయానువాదంచేసే అనువాదకుడికి అనియతమైన స్వేచ్ఛ ఉండదు. ఈ కింది నమూనా అనువాదాల ద్వారా మూలవిధేయానువాద లక్షణాలను పరిశీలించవచ్చు.

### నమూనా అనువాదాలు

ముందుగా ఇంగ్లీషు బైబిలులోని మూలానికి ప్రాచీన శైలిలో ఉన్న ఒక్క అనువాదాన్నీ, ఆధునిక శైలిలో ఉన్న మరొక అనువాదాన్ని చూడండి.

మూలం

"Beware of false prophets, which come to you in sheeps clothing, but inwardly they are ravening wolves.

ye shall know them by their fruits. Do men gather grapes of thorns, or figs of thistle?

Even so every good tree bringeth forth good fruit; but a currupt tree bringeth forth evil fruit.

A good tree cannot bring forth evil fruit, neither can a corrupt tree bring forth good fruit.

Every tree that bringeth not good fruit is hewn down, and cast into the fire.

Where fore by their fruits ye shall know them (New Testament 7. 15-20)

BRAOU

### ప్రాచీన శైలిలోని అనువాదం

"అబద్ధ ప్రవక్తలను గూర్చి జాగ్రత్తపడుడి. వారు గొర్రెల చర్మములు వేసికొని మీ యొద్దకు వత్తురు గాని లోపల వారు క్రూరమైన తోడేళ్ళు. వారి ఫలముల వలన మీరు తెలుసుకొందురు. ముండ్ల పొదలలో ద్రాక్ష పండ్లనైనను పల్లేరు చెట్లను అంజూరపు పండ్లనైనను కోయుదురా? అలాగుననే ప్రతి మంచి చెట్టు మంచి ఫలములు ఫలించును, పనికిమాలిన చెట్టు కాని ఫలములు ఫలించును. మంచి చెట్టు కాని ఫలముల ఫలింపనేరదు; పనికిమాలిన చెట్టు మంచి ఫలముల ఫలింపనేరదు. మంచి ఫలములు ఫలింపని ప్రతి చెట్టు నరకబడి అగ్నిలో వేయబడును. కాబట్టి మీరు వారి ఫలము వలన వారిని తెలిసికొందరు". (పరిశుద్ధ గ్రంథము, మత్తయి శుభవార్త 7.21)

### ఆధునిక శైలిలోని అనువాదం

"కపట ప్రవక్తల విషయం జాగ్రత్త! వాళ్ళు గొర్రె తోలు కప్పుకొని మీ దగ్గరకు వస్తారు, కాని అంతర్యంలో వాళ్ళు క్రూర స్వభావం గల తోడేళ్ళు సుమా! వాళ్ళ పనులను బట్టి వాళ్ళ నిజస్వరూపం తెలుసుకుంటారు. ముళ్ళ పొదలలో ద్రాక్షపళ్ళూ, పల్లేరు చెట్లలో అంజూరపళ్ళూ దొరుకుతాయా? దొరకవు. మంచి చెట్టుకే మంచి పళ్లు కాస్తాయి. పనికిమాలిన చెట్టుకు పనికిమాలిన పళ్ళు కాస్తాయి. మంచి చెట్టుకు పనికిమాలిన

పళ్ళు కాయవు, పనికిమాలిన చెట్టుకు మంచి పళ్లు కాయవు. మంచి పళ్ళు కాయని ప్రతి చెట్టును నరికి అగ్నిలో పారవేస్తారు. ఈ విధంగా వాళ్ళ పనుల వల్ల వాళ్ళను గుర్తించగలుగుతారు.

(క్రీస్తు జీవితం, సందేశం, బైబిలు రెండవ భాగం, వాడుక శైలిలో : చెట్టూ ఫలమూ)

ఇంగ్లీషు మూలానికి తెలుగులో వచ్చిన రెండు అనువాదాలూ మూలానికి దగ్గరగా ఉన్నాయని మీరు గుర్తించగలరు. అయితే పాఠంలో ముందు వివరించిన నాలుగు లక్షణాలను మనం అన్వయింపగలమా అన్నది ప్రశ్న.

ఇంగ్లీషు బైబిలును చదువుతున్నట్లే తెలుగు అనువాదం ఉందా? ఇంగ్లీషు బైబిలులోని కొన్ని మాటలకు ప్రాచీన శైలిలోని అనువాదాలూ, ఆధునిక శైలిలోని అనువాదాలు ముందు పరిశీలిద్దాము.

| ఇంగ్లీషు బైబిలు మూలం | ప్రాచీన శైలి అనువాదం | ఆధునిక శైలి అనువాదం |
|---|---|---|
| False prophets | అబద్ధ ప్రవక్తలు | కపట ప్రవక్తలు |
| Sheeps clothing | గొర్రెచర్మములు వేసుకొని | గొర్రెతోలు కప్పుకొని |
| in wardly | లోపల | అంతర్యంలో |
| ye | మీరు | × |
| gather | కోయు | దొరుకు |
| corrupt tree | పనికిమాలిన చెట్టు | పనికిమాలిన చెట్టు |
| evil fruit | కాని ఫలములు | పనికి మాలిన పళ్ళు |
| wherefore | కాబట్టి | ఈ విధంగా |

ప్రాచీన శైలిలోని అనువాదంలోని అబద్ధ ప్రవక్తలు, గొర్రె చర్మములు, కాని ఫలములు తెలుగు నుడికారానికి సహజమైనవి కావు. ఆధునిక శైలిలోని కపట ప్రవక్తలు, గొర్రెతోలు తెలుగు పలుకుబడికి సహజమైనవి. అయితే corrupt tree, evil fruit అన్నటువంటి మాటల అర్థచ్ఛాయలు బైబిల్ సంస్కృతిని దృష్టిలో పెట్టుకొని మరికొంత లోతుగా ఆలోచిస్తే పాపిష్టి చెట్టు, పాపిష్టి పండ్లు అనవచ్చునేమో ఆలోచించండి. ఆధునిక శైలి అనువాదంలో wherefore కు ఇచ్చిన అర్థం 'ఈ విధంగా' సరైన అర్థంకాదు. ఈ రెండు అనువాదాలూ మూల విధేయానువాద లక్షణాలను సంపూర్ణంగా ప్రతిఫలించడంలేదు. కానీ ఇంగ్లీషు మూలానికి చాలా దగ్గరగా ఉన్నాయి.

BRAOU

ఇప్పుడు గురజాడ ఇంగ్లీషులో రాసిన ఒక లేఖా భాగానికి ఇద్దరు అనువాదకులు చేసిన అనువాదాలను తులనాత్మకంగా పరిశీలించండి:

> The fact is the study of anthropology has necessitated readjustment of social ideas. There is no use blinking facts. What is the meaning of making so much of the sexual tie? Do not think that I am belittling the importance of the institution of marriage in the history of social evolution. Humanity progressed much in knowledge during the past two centuries and thinking men have begun to examine old ideas and ideals. If the institution of marriage has conduced to progress, it must not be forgotten that the idea of the inviolability of the marriage tie was the cause of untold tragedies.
>
> The tale is not completed yet. Among Englishmen, marriage has become a civil contract. Shelley and George Eliot scouted it. The modern women will rewrite human history.

ఈ భాగానికి గుడిపాటి వెంకటచలం తమ 'ఆనందం' వ్యాసాల్లో చేసిన అనువాదం చూడండి:

'అంత్రోపాలజీ' (పురాతన మనుష్యుల చరిత్రనుంచి తెలుసుకునే శాస్త్రం) వల్ల మన సాంఘికాభిప్రాయాలు మార్చుకోవలసిన అవసరం కలిగింది. స్పష్టంగా గోచరించే విషయాన్ని కప్పిపుచ్చడంవల్ల ఏమీ లాభంలేదు.

వివాహ (Sexual) బంధాలను ఇంతగొప్ప చెయ్యడంలో అర్థమేమిటి? సాంఘిక పరిణామంలో వివాహ సంస్థయొక్క ప్రాముఖ్యతను నేను తగ్గించ చూస్తున్నాననుకోకండి. గడిచిన శతాబ్దంలో ప్రపంచం జ్ఞానంలో

చాలా మారింది. వివేకవంతులైన మనుషులు పాత అభిప్రాయాల విలువను పరీక్షించడం ప్రారంభించారు. వివాహసంస్థ మానవాభివృద్ధికి తోడ్పడినమాట వాస్తవమే కాని వివాహబంధం ఛేదించకూడదనే అభిప్రాయంవల్ల ఎన్ని చెప్పతరంగాని దారుణ కృత్యాలు తటస్థిస్తున్నాయో మరవకూడదు. అంతేకాదు. ఇంగ్లీషువారిలో పెళ్ళి (సివిల్ కాంట్రాక్టు) చట్ట సంబంధమైన వొడంబడికగా వుంది. షెల్లీ, జార్జి ఇలియట్ దాన్ని తోసేసి తిరిగారు. (Modern Woman will rewrite history) నవీనయుగపు స్త్రీ చరిత్రను పునర్లిఖింపబోతోంది. నార్ల ఇంగ్లీషులో రాసిన 'గురజాడ' తెలుగు అనువాదంలో ఈ భాగానికి చేసిన అనువాదం చూడండి:

"మానవ విజ్ఞాన అధ్యయనంవల్ల సామాజిక భావాలను సవరించుకోవలసిన అవసరం ఏర్పడింది. వాస్తవాలను దాటవేయడంవల్ల లాభంలేదు. లైంగిక బంధానికి అంత విలువ ఇవ్వడంలో అర్థమేముంది?

సామాజిక పరిణామ చరిత్రలో వివాహ వ్యవస్థ ప్రాముఖ్యాన్ని నేను తగ్గిస్తున్నాననుకోవద్దు. గత రెండు శతాబ్దాల్లో మానవజాతి జ్ఞానం ఎంతో పురోగమించింది. ఆలోచనపరులైన మనుషులు పాత భావాలనూ, పాత ఆదర్శాలనూ పరీక్షించడం ప్రారంభించారు. వివాహ వ్యవస్థ పురోగతికి తోడ్పడి ఉంటే, వివాహబంధం అవిచ్ఛేద్యమైనదనే భావం అసంఖ్యాకమైన విషాదాలకు కారణమైందనే విషయం కూడా మరిచిపోకూడదు.

కథ ఇంకా ముగిసిపోలేదు. ఆంగ్లేయుల్లో పెళ్ళి అనేది లౌకికమైన ఒప్పందం అయింది. షెల్లీ, జార్జి ఇలియట్ దాన్ని నిరాకరించారు. ఆధునిక మహిళ మానవ చరిత్రను తిరగరాస్తుంది"

ఈ అనువాదాల్లోని కొన్ని మాటల అర్థాలను పరిశీలించండి.

| మూలం | మొదటి అనువాదం | రెండవ అనువాదం |
|---|---|---|
| Anthrepology | 'అంత్రోపాలజీ' (పురాతన మనుష్యుల చరిత్ర నుంచి తెలుసుకునే శాస్త్రం) | మానవ విజ్ఞానం |
| has neccessitated-readjustment | మార్చుకోవలసిన అవసరం కలిగింది. | సవరించుకోవలసిన అవసరం ఏర్పడింది |
| blinking | కప్పిపుచ్చడం | దాటవేయు |
| facts | స్పష్టంగా గోచరించే విషయం | వాస్తవాలు |
| Sexual tie | వివాహ బంధాలు | లైంగిక బంధాలు |
| Progressed much | చాలా మారింది | ఎంతో పురోగమించింది |
| thinking men | వివేకవంతులైన మనుష్యులు | ఆలోచనపరులైన మనుషులు |
| old ideas and ideals | పాత అభిప్రాయాల విలువ | పాత భావాలూ, పాతఆదర్శాలూ |
| Institution of marrage | వివాహ సంస్థ | వివాహ వ్యవస్థ |
| untold tragldies | చెప్పతరంకాని దారుణ కృత్యాలు | అసంఖ్యాకమైన విషాదాలు |
| The tale is not completed yet | అంతేకాదు | కథ ఇంకా ముగిసిపోలేదు. |
| civil contract | చట్టసంబంధమైన వొడంబడిక | లౌకికమైన ఒప్పందం |

రెండు అనువాదాలూ మూలవిధేయమైనవే. కొన్ని మాటలకు, నుడికారాలకు ఇద్దరు అనువాదకులు వేరు వేరు అర్థాలను ఇచ్చారు. దీన్నిబట్టి మూల విధేయానువాదం అంటే యథాతథానువాదం కాదని మీరు తెలుసుకోవచ్చు. పైన వివరించిన నాలుగు లక్షణాల్లో ఒకే ఒక లక్షణం- మూలభావాన్ని సాధ్యమైనంతవరకు లక్ష్య భాషలోకి తెచ్చే ప్రయత్నం జరుగుతుంది అనే లక్షణం - ఒక్కటే మూల విధేయానువాద ధ్యేయంగా ఉంటుంది.

BRAOU

## ముఖ్యవిషయ క్రోడీకరణ

1. వైజ్ఞానికంగా, సాంకేతికంగా అభివృద్ధి చెందిన దేశాల్లో యంత్రానువాదం ఇటీవల మొదలైంది. ఆధునిక యుగంలో మానవానువాదం ఉన్నాయి.

2. విషయాన్ని బట్టి అనువాదంభేదాలు నాలుగు. అవి: 1. సమాచారానువాదం 2. వచన సాహిత్యానువాదం 3. కవిత్వానువాదం 4. వైజ్ఞానిక సాంకేతిక పాఠానువాదం.

3. విధానాన్ని బట్టి అనువాద రకాలు రెండు. అవి: 1. మూల విధేయానువాదం 2. స్వేచ్ఛానువాదం.

4. మూల విధేయానువాద లక్షణాలు నాలుగు. మూలభావాన్ని సాధ్యమైనంతవరకు లక్ష్యభావంలోకి తెచ్చే ప్రయత్నం జరుగుతుంది అనే లక్షణమే మూలవిధేయాను ధ్యేయంగా ఉంటుంది.

## అభ్యాసాలూ, ప్రశ్నలూ [రాసేపని]

1. సమాజశాస్త్రం మౌలికఅంశాలు ఇంగ్లీషు మూలంనుంచీ ఒక పాఠాన్ని తీసుకొని దాని తెలుగు అనువాదంతో సరి పోల్చి మీ వ్యాఖ్య రాయండి.

2. విజ్ఞానశాస్త్రం మౌలిక అంశాలు ఇంగ్లీషునుంచీ ఒక పాఠాన్ని తీసుకొని దాని తెలుగు అనువాదంతో సరిపోల్చి మీ అభిప్రాయాలు రాయండి.

3. కింద బిపిన్ చంద్ర రాసిన మాడరన్ ఇండియా అనే పుస్తకం నుంచీ కొంత భాగాన్ని ఇస్తున్నాము. ఇంగ్లీషు మూలం కింద తెలుగుఅనువాదం ఇస్తున్నాము. మూలంలో ఇటాలిక్స్‌లో ఉన్న వాక్యం తెలుగులో అనువాదమైందో లేదో చూడండి. అట్లాగే తెలుగు అనువాదంలో ఇటాలిక్స్‌లో ఉన్న తెలుగుమాటలకు సరిపోతున్న ఇంగ్లీషు మాటలను గుర్తించండి. అవి ఇంగ్లీషు మాటలకున్న అర్థచ్ఛాయలను సరిగా సూచిస్తున్నాయో లేదో తెల్పండి.

BRAOU

### SOCIAL REFORM

The major effect of national awakening in the 19th century was seen in the field of social reform. The newly educated persons increasingly revolted against rigid social conventions and out-dated customs. They could no longer tolerate irrational and dehumanising social practices. In their revolt they were inspired by the humanistic ideals of social equality and the equal worth of all individuals.

Nearly all the religious reformers contributed to the social reform movement. This was because the backward features of Indian society, such as the caste system or inequality of sexes, had religious sanctions in the past. In addition, certain other organisations like the Social Conference, Servants of India Society, and the Christian missionaries worked actively for social reform. Many prominent persons-Jotiba Govind phule, Gopal Hari Deshmukh, Justice Ranade, K. T. Telang, B. M. Malabari, D. K. Karve, Sasipada Banerjee, B. C. Pal, Viresalingam, and B. R. Ambedkar, and many others-also played an important role. In the 20th century, and especially after 1919, the national movement became the main propagator of social reform. Increasingly, the reformers took recourse to propaganda in the Indian languages to reach the masses. They also used novels, dramas, poetry short stories, the press, and, in the thirties, the films to spread their views.

While social reform was linked with religious reform in some cases during the 19th century, in later years it was increasingly secular in approach. Moreover,

many people who were orthodox in their religious approach participated in it. Similarly, in the beginning social reform had largely been the effort of newly educated Indians belonging to higher castes *to adjuast their social behaviour to the requirements af modern western culture and values.* But gradually it penetrated down to the lower strata of society and began to revolutionise and reconstruct the social sphere. In time the ideas and ideals of the reforms won almost universal acceptance and are today enshrined in the Indian Constitution.

The social reform movements tried in the main to achieve two objectives: (a) emancipation of women and extension of equal rights to them; and (b) removal of caste rigidities and in particular the abolition of untouchability.

(Bipin chandra, Modern India, NCERT, New Delhi, 1971, P)

**సంఘ సంస్కరణ:**

19వ శతాబ్దంలో జాతీయ జాగృతి ప్రధానమైన ప్రభవం సంఘసంస్కరణ రంగంలో పొడగట్టింది. కొత్తగా చదువులు నేర్చినవాళ్లు కఠోర సామాజిక నియమాలకు కాలదోషం పట్టిన ఆచారాలకు వ్యతిరేకంగా ఆతోధికంగా తిరుగుబాటు చేశారు. అర్ధరహితమైనటువంటి, మానవతా లక్షణాలను రూపుమాపేటటువంటి సాంఘికాచారాలను వాళ్ళింకా సహించలేక పోయారు. సాంఘికసమానత, సర్వమానవ సమానార్హత అనే మానవతాదర్శాలు వాళ్ళని ఆ తిరుగుబాటుకు ఉత్తేజితుల్ని చేశాయి.

దాదాపు మత సంస్కర్త లంతా సంఘ సంస్కరణోద్యమానికి తోడ్పాటు ఇచ్చారు. కులవ్యవస్థ, స్త్రీ పురుష అసమానత వంటి భారతీయ సమాజంలోని వెనుకబాటు లక్షణాలకు గతంలో మతానుమోదం ఉండటమే దానికి కారణం. పైపెచ్చు, సోషల్ కాన్ఫరెన్స్, సర్వెంట్స్ ఆఫ్ ఇండియా సొసైటీ, క్రైస్తవ మిషనరీలు ఇంకా ఇతర సంస్థలు సంఘసంస్కరణ రంగంలో చురుగ్గా కృషిచేశాయి. జోతిబా గోవిందపూలే, గోపాల్ హరి దేశ్‌ముఖ్, జస్టిస్ రానడే, కె. టి. తెలాంగ్, బి. యమ్. మలబారీ, డి. కె. కార్వేశ్చ, శిపాద బెనర్జి, బి.సి. పాల్, వీరేశలింగం పంతులు, బి. ఆర్. అంబేద్కర్ వంటి ప్రముఖ వ్యక్తులు కూడా సంస్కరణోద్యమంలో ముఖ్యపాత్ర నిర్వహించారు. 20వ శతాబ్దంలో, ముఖ్యంగా 1919 తరువాత జాతీయోద్యమం సంఘసంస్కరణకు ప్రధాన ప్రచారకర్త అయింది. సంస్కరణవాదులు ప్రజాబాహుళ్యంలోకి చొచ్చుకుపోవడానికి ఎక్కువగా ప్రాంతీయ భాషల్లో తమ ప్రచారం కొనసాగించారు; తమ భావాలను ప్రజాల్లో విరివిగా వ్యాప్తిచెయ్యటం కోసం వాళ్ళు నవల, నాటకం, కవిత, కథానిక వగైరా సహిత్యరూపాల్నీ, పత్రికల్నీ, 1930 తరువాత చలనచిత్రాల్నీ ప్రచార సాధనాలుగా వాడుకున్నారు.

19వ శతాబ్దంలో కొన్ని సందర్భాల్లో సంఘసంస్కరణ మత సంస్కరణతో జతపడ్డప్పటికీ, తరువాతి కాలంలో అది ఇతోధికంగా లౌకిక వైఖరిని సంతరించుకొంది. పైగా, మతానికి సంబంధించి సనాతనులుగా ఉన్న వ్యక్తులు కూడా సంస్కరణోద్యమంలో పాల్గొన్నారు. అట్లాగే, మొట్టమొదట్లో సంఘసంస్కరణ కృషి కొత్తగా విద్యావంతులైన అగ్రవర్ణాల భారతీయులకే పరిమితమైంది. రానురాను, అది సమాజంలోని కిందితరగతులకు పాకింది; సామాజిక రంగాన్ని పునర్నిర్మింపసాగింది; విప్లవాత్మకం చెయ్యసాగింది. సంఘసంస్కర్తల భావాలు ఆదర్శాలు నకాలంలో సర్వత్రా ఆమోదంపొందాయి. ఈనాడు భారతరాజ్యాంగంలో పొందుపర్చబడ్డాయి.

సంఘసంస్కరణోద్యమాలు ప్రధానంగా రెండు లక్ష్యాలను సాధించ పూనుకున్నాయి. (1) స్త్రీ విముక్తి; పురుషులతోపాటు స్త్రీలకు సమానహక్కులు; (2) కులంయొక్క కాఠిన్యాన్ని తగ్గించటం; ముఖ్యంగా అస్పృశ్యతా నిర్మూలనం.

(ఆధునిక భారతచరిత్ర, తెలుగు అనువాదం: సహవాసి, హైదరాబాదు బుక్ ట్రస్ట్, 1983, పేజీ 212, 213)



BRAOU

ఖండిక 17 పాఠం 32

# అనువాదంలో భేదాలు: స్వేచ్ఛానువాదం

## ఉద్దేశం

స్వేచ్ఛానువాదమంటే ఏమిటి తెలిపి, లక్షణాలను వివరించడం. నమూనా అనువాదాల ద్వారా వీటిని విద్యార్థులకు తెలియచెప్పడం.

## ప్రణాళిక

1. స్వేచ్ఛానువాదం అంటే
2. స్వేచ్ఛానువాద లక్షణాలు
3. నమూనా అనువాదాలు
4. ముఖ్య విషయ క్రోడీకరణ
5. అభ్యాసాలూ, ప్రశ్నలూ

## స్వేచ్ఛానువాదం అంటే

మూల భాషలోని భావాలను లక్ష్య భాషలో ఒక మౌలికమైన రచనలో వెల్లడించినట్లు వెల్లడించే అనువాద విధానం - అంటే స్వతంత్ర రచన అనిపించేట్లు చేసే అనువాద విధానం- స్వేచ్ఛానువాదం. మూలంలోని ప్రధానాంశాలు లక్ష్యభాషలోకి రావడం ముఖ్యంగాని, ప్రతి అక్షరం, ప్రతిపదం, పదబంధం, వాక్య ప్రయోగం, వాక్య భేదం రానవసరంలేని అనువాద పద్ధతి ఇది. సమాచారాన్ని, వచన సాహిత్యాన్నీ అనువదించేటప్పుడు సర్వ సాధారణంగా కొంత స్వేచ్ఛను అనువాదకుడు తీసుకోవడం పరిపాటి. అంటే మూలంలో తన కిష్టమైన భాగాలను అనువదించి, ఇష్టంలేని భాగాలను వదిలి పెడతాడని కాదు దీని అర్థం, అట్లా ఇష్టంలేకగాని, ప్రత్యేకంగా మాతృ భాషలోని పాఠకులను దృష్టిలో పెట్టుకొనిగాని, ఇతర కారణాల వల్లగానీ కొన్ని భాగాలను అనువాదంలో తొలిగించే స్వేచ్ఛ అనువాదకునికి న్యాయంగా లేదు. ఆ పని చేసేది, చేయవలసింది అనువాదానికి పాఠాన్ని సిద్ధం చేసే సంపాదకుడు. సంపాదకుడి బాధ్యత పాఠంలో తొలగింపులూ, కుదింపులూ మొదలైనవి చేయడం. అనువాదకుడి బాధ్యత కేవలం మూలాన్ని తర్జుమా చేయడం. తర్జుమా చేసేటప్పుడు స్వేచ్ఛానువాద పద్ధతిలో అనువాదకుడు తీసుకొనే స్వేచ్ఛ ఎట్లాంటిదో పరిశీలిద్దాము.

BRAOU

## స్వేచ్ఛానువాద లక్షణాలు

స్వేచ్ఛానువాదంలో స్థూలంగా ఈ కింది లక్షణాలుంటాయి.

1. మూలంలోని భావానుసరణం ఉంటుంది.
2. స్వతంత్ర రచన అనిపించేట్లు అనువాదం ఉంటుంది.
3. అనువాదకుడు లక్ష్యభాషకు అనుగుణమైన తన శైలిని తాను ప్రదర్శిస్తాడు.
4. అనువాదం వెలువడిన కాలంనాటి రచనలాగే అనువాదం ఉంటుంది.

ఈ నాలుగు లక్షణాలనూ స్థూలంగా తెలుసు కుందాము. మొదటి లక్షణం భావాను సరణం. మూలంలోని భావాలు మూలరచయితవి. అనువాదకుడికావు. అయితే ఆ భావాలను వ్యక్తంచేసే నుడికారం, భాషానిర్మాణం,

లక్ష్యభాషలో లేనప్పుడు, భావాలకు నష్టం వాటిల్లకుండా అనువదించే పద్ధతి ఇది. రెండవ లక్షణం, స్వతంత్రరచన అనిపించేటట్లు అనువదించడం. ప్రతిపదాన్నీ, పదబంధాన్నీ అనువదిస్తూ, మూలభాషావాక్యాల్లోని పదక్రమాన్ని మాతృభాషా పదక్రమంలోకి దిగుమతి చేయడం ద్వారా అనువాదానికి చదివించేగుణం ఎక్కువపాళ్ళు పోతుంది. అందువల్ల లక్ష్యభాషా నుడికారానికి సహజమైన రీతిలో, స్వతంత్రరచన ఏమోఅనిపించేటట్లు అనువాదం ఉంటుంది. మూడవ లక్షణం శైలికి సంబంధించినది. మూలభాషలోని పదప్రయోగ నైపుణ్యాన్నంతటినీ లక్ష్యభాషలోకి తెచ్చే ప్రయత్నం చేయకుండా, అనువాదకుడికి సహజమైన శైలిలోనే అనువాదం ఉంటుంది. నాల్గవ లక్షణం సమకాలికతకు సంబంధించినది. మూలం ఏకాలానికి చెందిందో ఆ కాలంనాటి రచనలాగే అనువాదం ఉండాలని కొందరంటారు. ఉదాహరణకు చాసర్ రచనను తెలుగులోకి తర్జుమా చేస్తే, ఆ రచన చాసర్ కాలంనాటి తెలుగులాగా ఉండాలన్నమాట. ఇది సిద్ధాంతరీత్యా సమంజసం కావచ్చునేమో కానీ, ఆచరణరీత్యా అసాధ్యం. అందువల్ల ఏ అనువాదమైనా, అది వెలువడిన కాలంనాటి రచనలాగే ఉంటుంది.

స్వేచ్ఛానువాదాల్లో మరొక రకమైన స్వాతంత్ర్యం కన్పిస్తుంది. కథలను, నవలలను, నాటకాలను ఇంగ్లీషు నుంచీ అనువదిస్తున్నప్పుడు తెలుగువాతావరణానికి అనుకూలమైన మార్పులన్నిటినీ అనువాదకులు చేస్తూ ఉంటారు. తెలుగుదనం తేవడానికి వీలుగా పాత్రల పేర్లనూ, స్థలాల పేర్లనూ, ఐరోపీయ సంస్కృతికి సంబంధించిన నుడికారాలనూ మారుస్తారు. ఉదాహరణ చెహోవ్ రాసిన The cherry orchard అనే నాటకం పేరును శ్రీశ్రీ "సంపెంగతోట"గా మార్చాడు. ఇంగ్లీషు మూలంలోని రష్యన్ పేర్లన్నిటినీ తెలుగు పేర్లుగా మార్చాడు. నాటకానువాదం ఎట్లా సాగిందో చూడండి:

**ఇంగ్లీషుమూలం**

The First Act

A room, which is still called the nursery. One of the doors leads to Anya's room. Dawn, the sun will soon rise. It is already May, the cherry trees are in blossom, but it is cold in the garden with the frost of early morning. The windows are closed.

(Dunyasha, with a candle, and Lopakhin, with a book in his hand, come in).

Lopakhin : So the train's in, thank Heaven. What time is it?

Dunyasha : Nearly two. (She puts out the candle.) It is day light already.

Lopakhin : How late is the train? A couple of hours at least (yawning and streching). I' m certainly a fine one! To have come or purpose to meet them at the station and them go and doze off sitting in a chair. What a shame! Why did'nt you wake me?

**తెలుగు అనువాదం**

ఒక గది. అరుణ గదికి పోవడానికి ఒక గుమ్మం.

ఉదయం. రంగమధ్యంలో సూర్యోదయం అవుతుంది. సంపెంగతోటలో మంచుకురుస్తోంది. కిటికీలు మూసివేసి ఉంటాయి. లాంతరు పుచ్చుకొని జానకి, పుస్తకం చేత్తో పట్టుకొని శేషశాయి ప్రవేశిస్తారు.

శేషశాయి: అమ్మయ్య! రైలొచ్చేసింది. ఎన్ని గంటలిప్పుడు?

జానకి : అయిదు (చేతిలోని లాంతరు ఆర్పి). అప్పుడే తెల్లారిపోతోంది.

శేషశాయి: రైలివ్వాళ యెంతో ఆలస్యమయింది. (ఆవలించి బద్ధకం తీర్చుకుంటూ) ఎంత బుద్ధితక్కువ పని చేశాను! వాళ్ళని రైలు దగ్గర కలుసుకుందామని వచ్చినవాణ్ణి యిక్కడ కూర్చుని అట్లా నిద్రపోవడం వేమిటి? కాస్త నువ్వయినా లేపకపోయినావూ!

ఇంగ్లీషు మూలంలోని "Which is still called the nursery" అన్న వాక్య భాగం తెలుగు అనువాదంలో లేదు. పేర్లన్నీ మారిపోయాయి. Anya అనువాదంలో అరుణ అయింది. Dunyasha జానకిగానూ, Lopakhin శేషశాయిగానూ మారారు. నాటకంలోని మే నెల శీతాకాలమైంది; కాండిల్ బదులు లాంతరును అనువాదంలో ప్రవేశపెట్టారు. సంభాషణలు మూల విధేయంగా ఉన్నాయి. ఈ రకమైన స్వేచ్ఛను సాధారణంగా అనుసరణ (adoptation) అంటూ ఉంటారు; మనం అనుసరణ లక్షణాలున్న స్వేచ్ఛానువాదం అన్నా నష్టంలేదు.

రష్యన్ నాటక రచయిత చెహోవ్ నాటకం ఇంగ్లీషు అనువాదం The cherry oreard తెలుగు లోకి తర్జుమా చేసినట్లే, కారల్ చాపెక్ అనే సుప్రసిద్ధ జెక్ రచయిత నాటకం ఇంగ్లీషు అనువాదం The Mother ను కూడా అమ్మ అనే పేరుతో శ్రీశ్రీ అనువాదం చేశాడు. తెలుగు అనువాదానికి శ్రీశ్రీ తొలిపలుకు రాశాడు. అందులో తను చేస్తున్న అనువాదాన్ని గురించి ఇట్లా అన్నాడు: "......దీని ఇతివృత్తం చెకీ దేశానికిగాని మున్పది నలుబదేళ్ళనాటి కాలానికిగానీ పరిమితమైనది కాదు. అందువల్లనే *ఇందలి పాత్రలన్నిటినీ తెలుగు పేర్లతో పరివర్తన చెయ్యడం నాకు సాధ్యమయింది. పేర్లను కూడా మార్చివేసే అనువాదం అనుసరణ మాత్రమే అవుతుంది. అలా చేస్తే మూల గ్రంథంలోని వాతావరణాన్ని కూడా మార్చవలసి వస్తుంది.* ఈ విధమైన ఇబ్బంది నాకీ గ్రంథంలో కలగకపోవడానికి కారణం ఇందలి బలిష్ఠమైన సార్వకాలిక మైన ఇతివృత్తమే!

ఈ అభిప్రాయాలను గమనించినపుడు పాత్రల పేర్ల మార్పు వాతావరణం మార్పు అనువాద లక్షణాలు కావనీ, అనుసరణ లక్షణాలనీ తెలుస్తుంది. శ్రీశ్రీ సంపెంగతోటలో పేర్లు మార్చాడు. వాతావరణం మార్చాడు. అయితే మూలభావాలను తెలుగులోకి తర్జుమా చేశాడు. అందువల్ల దాన్ని స్వేచ్ఛానువాదంగా పరిగణించవచ్చునని అన్నాము. మూలవిధేయానువాదంలో మూలంలో ఉన్న విషయానికీ, ఆ విషయాన్ని వ్యక్తీకరించే వాక్యాలకూ మించి సాధారణంగా దేనినీ చేర్చరు, ఉన్నదాన్ని తగ్గించరు, తీసివేయరు. స్వేచ్ఛానువాదంలో కొన్ని చేర్పులూ, మార్పులూ ఉంటాయి. రచయిత స్వాతంత్ర్యం తీసుకుంటాడు.

BRAOU

## నమూనా అనువాదం

లూసన్ రాసిన "The wise Man, The Fool And The slave" అనే కథలో కొంత భాగాన్ని ఇస్తున్నాము. దానికింద ప్రచురితమైన ఒక తెలుగు అనువాదం కూడా ఇస్తున్నాము. చదవండి:

## ఇంగ్లీషు మూలం

A slave did nothing but look for people to whom to pour out his woes. This was all he would and all he could do. One day he met a wise man.

"Sir"! He cried sadly, tears pouring down his cheeks. "you know, I lead a dog's life. I may not have a single meal all day, and if I do it is only husks of sorghum which not even a pig would eat. Not to say there is only one small bowl of it . . ."

"That's really too bad," the wise man commiserated. "Isn't it"? His spirits rose. "Then I work all day and all night. At down I carry water, at dusk I cook the dinner; in the morning I run errands, in the evening I grind wheat; when it's fine I wash the cloths, when it's wet I hold the umbrella; in winter I mind the furnace, in summer I wave the fan. A midnight I boil white fungus, and wait on our master at his gambling parties; but never a tip do I get, only some times the strap . . ."

తెలుగు అనువాదం

ఓ బానిస కష్టాలతో కాపురం చేస్తున్నాడు. అయినా వాటిని వదించుకునేందుకు అతగాడు చేసేదేమీ లేదు.

కానీ, తన బాధలన్నీ విని సానుభూతి చూపే తీరికా, ఓపికా గల వారెవరేనా దొరుకుతారేమోనని మాత్రం చూస్తుండేవాడు.

ఓ సుప్రభాతాన అతగాడికో "పెద్దమనిషి" ఎదురయ్యేడు. ఆయనగారు చాలా తెలివైనవాడనీ, మేధావి అనీ అందరూ అంటూంటారు.

బానిస తన దీన స్థితినంతా అతనితో మొరపెట్టుకున్నాడు. "చూడండయ్యగారూ! నాదో కుక్క-బ్రతుకనుకోండి. రోజుకోపూట తిండికూడా గతిలేదు నాకు. పందులు కూడా ముట్టనిదేదో ఇంత నా మొహాన్న కొడుతుంటాడు మా యజమాని. అది మాత్రం ఎంతుందనుకున్నారూ" అంటూ దోసలివిప్పి చూపించేడు.

మేధావిగారు చాలా బాధపడిపోయేరు బానిస వాలకం చూసి. "నిజంగానా? ఐతే. ఇది చాలా అన్యాయం అన్యాయమే!" అంటూనే ఆగని యజమానుల దాక్షిణ్యరాహిత్యానికి ఆగ్రహపడిపోయేరు. ఆయన మొహం ఎర్రబడింది. కనుబొమలు ముడిపడ్డాయి.

దాంతో బానిసకు ఉత్సాహం వచ్చింది. "కాదుటండీ! రాత్రింబవళ్ళు గొడ్డుకన్న మిన్నగా చాకిరి చేస్తుంటాన్నేను. కోడికూత కన్నా చాలా ముందే లేచి నీళ్ళు తోడి మోస్తుంటాను. ధాన్యం దంచుతాను, పిండి రుబ్బుతాను, కట్టెలు కొడతాను, అయ్యగారికి విందు భోజనాలు తయారుచేస్తుంటాను, బట్టలుతుకుతాను, వేసవిలో రెక్కలూడేలా పంకా విసురుతుంటాను. చలికాలంలో నెగడు ఆరిపోకుండా అక్కడే కాపలా ఉంటాను; వర్షాకాలంలో అయ్యగారికి గొడుగు పట్టేది కూడా నేనే. అయ్యగారు జూదంలో కూర్చుంటే అర్ధరాత్రిళ్ళు కూడా టిఫిన్లు తయారుచేసి కనిపెట్టుకుంటాను. కానీ...కానీ... ఇంత చేసినా నన్నెవరూ పట్టించుకున్న పాపాన పోవటంలేదు. ఏనాడూ ఎర్రని ఏగానీ కూడా ఎవరూ నా ఎదాన వేసిన జాడలేదు. ఎప్పుడేనా దయదలిస్తే పీక్కు-తినలేక వదిలేసిన ఓ బొమికె ముక్క మాత్రం..."

ఈ అనువాద కథపేరు మేధావి. పేరులో ఇంగ్లీషు మూలంలోని the Fool, the Slave రాలేదు. ఇంగ్లీషులోని వాక్యాలకు ఇందులో మూలవిధేయమైన అనువాదం కొన్నిచోట్ల ఉంది; కొన్నిచోట్ల లేదు. అనువాదకుడు స్వతంత్రంగా కొన్ని మాటలు వదిలివేశాడు. కొన్ని మాటలు చేర్చాడు. మార్పులు చేశాడు.

ఇంగ్లీషు మూలంలోని రెండవ పేరాలో యజమాని ప్రస్తావనలేదు. తెలుగు అనువాదంలోకి వచ్చింది. చైనా సాంస్కృతిక జీవితాన్ని తెలిపే "husks of sorghum...అనే మాటలకు తర్జుమాలేదు. దిగువ ఇచ్చిన పట్టికను చూడండి, అనువాద పద్ధతి అర్థమవుతుంది.

| ఇంగ్లీషు మూలం | అనువాదంలోని తొలగింపులూ, చేర్పులూ, మార్పులూ |
|---|---|
| one day het met a wise man | ఓ సుప్రభాతాన అతగాడికో "పెద్దమనిషి" ఎదురయ్యేడు ఆయనగారు చాలా తెలివైనవాడనీ, మేధావి అనీ అందరూ అంటూంటారు. |
| he cried sadly, tears pouring down his cheeks | బానిస తన దీన స్థితి నంతా అతనితో మొర పెట్టుకున్నాడు. |
| and if Ido it in only | పందులు కూడా కూడా ముట్టనిదేదో |
| husks of sorghum which even a | ఇంత నా మొహాన్న కొడుతుంటాడు మా యజమాని. |
| pig would eate. Not to say | అది మాత్రం ఎంతుందనుకున్నారూ? "అంటూ |
| there in only one shall bowlt of it | దోసిలి విప్పి చూపించేడు. |
| Then I work all day and all night | రాత్రింబవళ్ళు గొడ్డు కన్నా మిన్నగా చాకిరి చేస్తుంటాన్నేను. |
| At down | కోడి కూత కన్నా ముందే లేచి |

మూలంలోని మూడవ పేరాలో ఒక చర్యను at dawn, at dusk, in the morning, in the evening అనే మాటలద్వారా ఒక క్రమాన్ని పాటించడం ఉంది. తెలుగులో ఆ క్రమంలేదు...

అనువాదంలో ఈ రకమైన స్వేచ్ఛను అనువాదకుడు తీసుకోవచ్చునా అన్న ప్రశ్నకు ఖచ్చితమైన రెండు సమాధానాలు చెప్పవచ్చు.

1. అనువాదం మూల విధేయమైనదైతే ఆ విషయం అనువాదకుడు చెప్పడమే కాదు మూల విధేయానువాద సూత్రాలకు కట్టుబడాలి.
2. అనువాదం స్వేచ్ఛానువాదమో, పూర్తి అనుసరణమో అయితే ఆ విషయాన్ని అనువాదకుడు ప్రకటించాలి. అయితే మొత్తం పాఠాన్ని మార్చే అధికారం స్వేచ్ఛానువాదంలో కానీ, అనుసరణలో కానీ లేదు.

ముందు ముందు ఇంగ్లీషు మూలపాఠాలను, అనువాదాలను చదవడం ద్వారా పైన చర్చించిన వాటిని మీరు మరింత విపులంగా తెలుసుకుంటారు.

### ముఖ్యవిషయ క్రోడీకరణ

1. స్వతంత్ర రచన అనిపించేటట్లు చేసేది స్వేచ్ఛానువాదం. అనిపించేటట్లే కానీ పూర్తి స్వతంత్ర రచనకాదు.
2. స్వేచ్ఛానువాద లక్షణాలు నాలుగు. అవి 1. మూలభావానుసరణ 2. స్వతంత్ర రచన అనిపించడం 3. అనువాదకుడు తన శైలిలోనే రాయడం 4. సమకాలిక రచనలాగే అనువాద ముండడం.
3. స్వేచ్ఛానువాదం వేరు. పూర్తి అనుసరణం వేరు. స్వేచ్ఛానువాదాల్లో అనుసరణ లక్షణాలు కన్పిస్తాయి.

## అభ్యాసాలూ ప్రశ్నలూ (రాసేపని)

1. వార్తలు, ఉత్తరాలు, ప్రకటనలు మొదలైన కేవలం సమాచారం తెలిపే వాటిని మూల విధేయంగా అనువదించవచ్చునో, స్వేచ్ఛానువాదం చేయవచ్చునో మీ అభిప్రాయాలు రాసి మీ సలహాదారులకు చూపించండి.
2. ఏదైనా ఒకరోజు వచ్చిన ఆంగ్ల దినపత్రికలోని ఒక పి.టి.ఐ. వార్త ఆరోజు తెలుగు పత్రికల్లో ఎట్లా అనువదింపబడిందో పరిశీలించి మీ వ్యాఖ్య రాయండి.
3. అధికార భాషగా తెలుగు అమలు జరిపే కార్యక్రమంలో ప్రభుత్వ ఉత్తర ప్రత్యుత్తరాలను నేరుగా తెలుగులోనే రాయవచ్చునా? ఇంగ్లీషులో రాసి వాటికి అనువాదాలు చేయాలా? ఆలోచించండి.
4. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జనరల్ అడ్మినిస్ట్రేషన్ (అధికార భాష) డిపార్టుమెంటు వారు ప్రచురించిన "సాధారణంగా ఉపయోగించే లేఖలు మెమోలు వగైరా వాటి తెలుగు అనువాదము" అనే గ్రంథం నుంచి ఈ కింది నమూనా ఇస్తున్నాము. ఇంగ్లీషు మూలాన్ని అనువదించిన పద్ధతిపై మీ వ్యాఖ్య రాయండి. ఇంగ్లీషు మూలం అవసరం లేకుండా, ఆ విషయాన్ని నేరుగా తెలుగులోనే రాయగలరేమో చూడండి.

BRAOU

### MONEY-LENDING LICENCES

(As provided in sub-section (2) of 8.3 of the *Money Lenders Act* and referred in rule 8).

Serial number of Money-Lending Register ( ), dated

I certify that Mr. or Mrs.

son of/wife of community or

religion resident of

taluk district

has been rigistered today as money-lender under sub-section (2) of section 3 of the Money-Lenders Act of 1349 Fasli for district:

and permission is hereby accorded to the said Mr. or Mrs. to carry on *Money-Lending* business in the said district.

*Tahsildar*,.........................

*Taluk* *District*

## ఋణ దాత లైసెన్సులు

ఋణదాతల చట్టము, 3వ విభాగము (2) వ ఉప విభాగములో నిబంధింపబడి 8 వ నియమములో పేర్కొన్న ప్రకారము.

*ఋణదాన రిజిష్టరు* క్రమసంఖ్య ( ) తేదీ

నేను ప్రమాణికరించున దేమనగా శ్రీ లేక శ్రీమతి

తండ్రి పేరు భర్త పేరు కులము

లేక మతము కాపురము తాలూకా

జిల్లా గారిని

జిల్లాకై 1349వ ఫసలీ ఋణదాతల చట్టము, 3వ విభాగము (2)వ ఉపవిభాగాము క్రింద ***ఋణదాతగా*** పేరు రిజిష్టరు చేయడమైనది. సదరు జిల్లాలో ***ఋణదాత వ్యాపారము*** చేసికొనుటకు సదరు శ్రీ లేక శ్రీమతి గారికి ఇందు మూలముగా అనుమతి కూడ ఇవ్వనైనది.)

తహశీల్దారు,

..........తాలూకా,

..........జిల్లా.

BRAOU

apou
LIBRARY

**ఖండిక 18 పాఠం 33**

# ఆధునిక కవిత్వ పరిచయం : భావ కవిత్వం

**ఉద్దేశం**

ఆధునిక కవిత్వంలో ఒక ప్రధాన శాఖ అయిన భావ కవిత్వాన్ని పరిచయం చేయడం.

**పథకం**

1. ప్రాచీన కవిత్వంలో ప్రధాన లక్షణాలు
2. సమాజ స్థితిలో మార్పు: ఆధునికత ప్రవేశం
3. ఆధునిక కవిత్వంలో వచ్చిన మార్పులు
4. నవ్య కవిత్వం - భావ కవిత్వం: వీటి మధ్య భేదాలు
5. నవ్య కవిత్వంలో ప్రధాన శాఖలు
6. భావ కవిత్వం - ప్రధాన లక్షణాలు
7. భావకవిత్వం - కవిత్వంలో తెచ్చిన మార్పు
8. ముఖ్య విషయాల క్రోడీకరణ

## ప్రాచీన కవిత్వం

19వ శతాబ్ది సగభాగం వరకు వచ్చిన తెలుగు కవిత్వాన్ని ప్రాచీన కవిత్వం అంటాం. పురాణకవిత్వం, ప్రబంధ కవిత్వం అని ప్రాచీన కవిత్వంలో అంతర్గతమైన భేదాలు కొన్ని ఉన్నాయి. అయినా ప్రాచీన కవిత్వానికీ ఆధునిక కవిత్వానికీ కొన్ని మౌలికమైన తేడాలున్నాయి.

BRAOU

ప్రాచీన కవిత్వంలో దేవతలు, ఋషులు, పైవర్ణాలవారు, రాజులు ప్రధాన పాత్రధారులు. వీళ్ళలో చాలా మందికి అతీతశక్తులుంటాయి. శాపాలు, వరాలు ఇచ్చే శక్తులుంటాయి, మధ్యకాలపు కవిత్వంలో స్త్రీ కేవలం భోగవస్తువుగా వర్ణింపబడింది. స్త్రీలు రచించిన కావ్యాల్లోనూ ఈ పరిస్థితి అంతే. స్త్రీ శరీరానికి ఇచ్చిన ప్రాధాన్యం ఆమె ఆలోచనలకు లేదు. దాదాపు ప్రాచీన కవిత్వం అంతటికీ వర్ణ ధర్మాల రక్షణ ప్రధానాశయంగా ఉండేది. ప్రబంధాల్లో చతుర్వర్ణ వర్ణన ఒక తప్పనిసరి అంశంగా ప్రవేశించింది. ఈ రకమైన సాహిత్యం అప్పటి సమాజస్థితికి, అప్పటి అల్ప సంఖ్యాకులైన చదువరుల ఆలోచనలకు అనుకూలంగా ఉండేది.

సామాన్య ప్రజలు తమ సాహిత్యాన్ని పాటల రూపంలోనూ, కథాగేయాల రూపంలోనూ, యక్షగానాల రూపంలోనూ సృష్టించుకున్నారు.

ఈ రెండు రకాల సాహిత్యాలకు ఒకదానికి మరొకదానికి సంబంధాలున్నట్లు మనం గుర్తించవచ్చు. అయినా, ఈ రెండూ వేరువేరు శాఖలుగానే తెలుగులో విస్తరించాయి.

### నవ్య కవిత్వం

భారతదేశంలో చిరకాలం దాదాపు నిశ్చలంగా ఉన్న సమాజంలో, ఇంగ్లీషు వారి రాకతో కొన్ని విశేషమైన మార్పులు జరిగాయి. ఇంగ్లీషు చదువులద్వారా కొన్ని ఆధునిక భావాలు ప్రచారమయినాయి. రవాణా సౌకర్యాలు పెరిగాయి, పత్రికలవంటి ప్రచారసాధనాలు అచ్చుయంత్రంవల్ల సాధ్యమయ్యాయి. దేశంలో పారిశ్రామిక, వ్యాపార నాగరికతలు ప్రవేశించాయి. ఈ మార్పులు సాహిత్యంలోనూ ప్రవేశించాయి.

ఆధునిక కాలపు కవిత్వం అంతటి ముందటికన్నా ఎక్కువమంది చదువుతున్నారు. దానివల్ల కవిత్వంలో సరళత ఒక అవసరమైన గుణంగా ప్రవేశించింది. భాషకూడా సామాన్య వ్యవహారానికి కొంత సన్నిహిత మయింది. కవిత్వంలో పాండిత్య ప్రకర్షకన్నా భావ ప్రకటనకే ప్రాధాన్యం పెరిగింది.

కావ్య వస్తువు విషయంలో కూడా మార్పులు వచ్చాయి. అతీత శక్తుల ప్రస్తావన తగ్గింది. సమకాలిక సమాజ చిత్రణ స్పష్టంగా కనిపిస్తుంది. వర్ణాశ్రమ ధర్మాల నిరసన తొలికాలపు నవ్య కవిత్వంలో ఎక్కువ కనిపిస్తుంది. స్త్రీని ఒక ఆరాధ్య దేవతగా (కవిత్వంలో) నవ్యకవులు భావించారు. అంగాంగ వర్ణన పోయింది. జాతీయతా భావం, స్వదేశ రాష్ట్ర సంస్కృతుల మీద ప్రేమ స్వాతంత్ర్యోద్యమంలో భాగంగా చోటుచేసుకున్నాయి. ఈ మార్పులన్నిటినీ నవ్య కవిత్వం ప్రతిబింబించింది.

### నవ్యకవిత్వం–భావకవిత్వం

ఈ రెండు మాటలూ చాలావరకు సమానార్థకాలయినా వీటిమధ్య ఉండే భేదాల్ని గుర్తించటం అవసరం. ఆధునిక కవిత్వంలో వచ్చిన అన్నిరకాల మార్పుల్ని సూచించటానికి నవ్యకవిత్వం అనేమాట వాడతారు. అందులో కొంత భాగాన్ని మాత్రమే భావకవిత్వం అంటారు.

ప్రాచీన కవిత్వం ప్రధానంగా కథా ప్రధానమైనది. ఆధునిక కవిత్వంలో కథా ప్రధాన కావ్యాల ప్రాచుర్యం తగ్గింది. కథ ఉన్నా ఆ కథకు ప్రాధాన్యం లేదు. రాయప్రోలు సుబ్బారావుగారి లలిత (1900) తృణకంకణం (1913) కావ్యాలు చిన్న కావ్యాలు. అంతకన్నా చిన్నవి గురజాడ అప్పారావుగారు రచించిన లవణరాజుకల, డామన్-పితియస్, కన్యక, పూర్ణమ్మ అనేవి. వీటికి కథా ప్రాధాన్యం తక్కువ. వీటితోపాటు అసలు కథేలేని చిన్న ఖండికల ప్రాచుర్యం కూడా పెరిగింది ఆధునిక సాహిత్యంలో నవల, కథానిక అనే వచన ప్రక్రియలు ప్రజాదరణ పొందాయి, అందువల్ల కథ కవిత్వాన్ని వదలి వేరుశాఖగా ఏర్పడిందనవచ్చు.

ప్రాచీన కావ్యాల్లో ప్రాచీన కావ్య భాషా పదాలు, అలంకారాలు, కవి సమయాలు ఉండేవి. పద్య ఛందస్సుల ప్రయోగం ఎక్కువ. ఆధునిక కవిత్వంలో గేయ ఛందస్సుల ప్రయోగం పెరిగింది. గురజాడ అప్పారావుగారు తన ముఖ్య కావ్యాలన్నీ గేయాల్లో రచించారు. తరువాత కవులు గేయాలు కొందరు వాడారు. మరికొందరు గీత పద్యాలు ఎక్కువ వాడారు. ముఖ్యంగా దేవులపల్లి కృష్ణశాస్త్రి, విశ్వనాథ సత్యనారాయణ, నాయని సుబ్బారావుగారు గీతపద్యాన్నీ ప్రత్యేక శ్రద్ధతో తీర్చిదిద్దారు.

BRAOU

ప్రాచీన కవిత్వం కొద్దిమంది పండితులైన వారే పూర్తిగా అర్థం చేసుకొనేవారు. అవి భాషాసాహిత్య పరిజ్ఞానం అధికంగా ఉన్న పాఠకులకే ఉద్దేశించ బడ్డాయి. నవ్య కవిత్వానికి సామాన్య పాఠకు లెక్కువ.

నవ్య కవిత్వంలో సంస్కరణాభిలాష, తిరుగుబాటుతనం, ప్రకృతి చిత్రణ, దేశభక్తి, ప్రణయం, విషాదస్మృతి, భగవద్భక్తి, మొదలైనవి ప్రధాన వస్తువులు. ఖండకావ్య రచన, ఆత్మాశ్రయత్వం, గీత గేయ రచన ప్రధాన ధోరణులు.

గురజాడ అప్పారావుగారి కవిత్వంలో సంఘ సంస్కరణాభిలాష కనిపిస్తుంది. త్రిపురనేనిరామస్వామి చౌదరిగారి కవిత్వంలో ప్రాచీన సంస్కారంపట్ల తిరుగుబాటుతనం, హేతువాదదృష్టి కలిసి ఉంటాయి. గుర్రం జాషువాగారి కవిత్వంలో సంస్కరణాభిలాష మెండుగా కనిపిస్తుంది. కవికొండల వెంకటరావుగారి కవిత్వంలో ప్రకృతిచిత్రణ ఉంటుంది. నండూరి సుబ్బారావుగారి ఎంకి పాటల్లో, నాయని సుబ్బారావుగారి సౌభద్రుని ప్రణయయాత్రలో, విశ్వనాథ సత్యనారాయణగారి గిరికుమారుని ప్రేమగీతాలలో ప్రణయం ప్రధానవస్తువు. వీరిది ఆత్మాశ్రయతత్వం, ఎంకి పాటలు పూర్తిగా గేయచ్ఛందస్సులు, నాయని, విశ్వనాథ, కృష్ణశాస్త్రిగార్ల కృతులలో గీత పద్యాల వాడకం ఎక్కువ,

విషాదస్మృతి కావ్యాల్లో నాయని సుబ్బారావుగారి మాతృగీతాలు, విషాద మోహనము ప్రసిద్ధమైనవి, ఆత్యంతమైన ఆప్తులు మరణించినప్పుడు వారిని తల్చుకుంటూ చెప్పిన కావ్యాలు విషాదస్మృతి కావ్యాలు. తల్లి మరణించినపుడు మాతృగీతాలు, తనయుడు మరణించినపుడు విషాద మోహనము సుబ్బారావుగారురాశారు. భార్య మరణించినప్పుడు విశ్వనాథ సత్యనారాయణగారు వరలక్ష్మీత్రిశతి రచించారు.

తన భావాలను, వేదనను వ్యక్తంచేసే ధోరణిని ఆత్మాశ్రయత్వం అంటారు. నవ్యకవిత్వంలో ముఖ్యంగా ప్రణయ కవిత్వంలో నీవు-నేను అనే పదాల ప్రయోగం ఎక్కువ. ఉదాహరణకు నాయని సుబ్బారావుగారి ఈ పద్యం చూడండి:

ఇంత కాలమ్ముగా నాకదృష్టములయి
ఎన్ని ఆనందధామమ్ములీ యనంత
భువన సంధుల భాసిల్లినవియు, నేడు
మత్పదాక్రాంతములు భవన్మహిమజేసి
(మత్ = నా, భవత్ = నీ)

అట్లాగే కృష్ణశాస్త్రిగారి ఈ పద్యం చూడండి:

నడిలేని నడిరేయి బడిపోయినట్టి నీ
కడియాల రవళులే, చిరుగాజు మ్రోతలే
వ్రేలెత్తి చూపు జీనిత పథమ్ములు, నాకు
కేలెత్తి నడిపించు నెగ్గెత్తి సన్నిలుచు.

దేశభక్తి కవిత్వానికి రాయప్రోలు సుబ్బారావుగారు ప్రసిద్ధులు.

శ్రీలు పొంగిన జీవగడ్డయి
పాలుపారిన భాగ్యసీమయి
వరలినది ఈ భరతఖండము
భక్తిపాడర తమ్ముడా!

అనే గేయం అందరికీ తెలిసిందే. ఇది భారతదేశపు గొప్పతనాన్ని గూర్చి రచించింది. "ఏ దేశమేగినా ఎందుకాలిడినా, పొగడరా నీ తల్లి భూమి భారతిని" అనేది కూడా అట్లాంటిదే. ఆంధ్రదేశ వైభవాన్ని గురించి కూడా రాయప్రోలు సుబ్బారావుగారు 'ఆంధ్రావళి' అనే పద్య సంపుటి రచించారు. ఈ కోవలోవే విశ్వనాథ సత్యనారాయణగారి 'ఆంధ్ర పౌరుషము'. 'ఆంధ్ర ప్రశస్తి' అనే గ్రంథాలు. తెలుగు రాష్ట్ర ప్రశంసతో ఇంకాస్త ముందుకు పోయింది తుమ్మల సీతారామమూర్తిగారి రాష్ట్రగానము. త్రిపురనేని రామస్వామిచౌదరిగారి సూతాశ్రమ గీతాల్లో కొన్ని ప్రసిద్ధమైన రాష్ట్రభక్తి గీతాలున్నాయి.

BRAOU

## భావ కవిత్వం

గురజాడ అప్పారావుగారు మొదలు శ్రీశ్రీ వరకు వచ్చిన ఆధునిక కవిత్వపు ధోరణులను నవ్య కవిత్వం అనే పిలిచేవారు. ప్రాచీన సాహిత్య ధోరణులకు భిన్నంగా వచ్చిన కవితా రీతులన్నింటికీ కలిపి పిలవటానికి నవ్య కవిత్వం అనే మాట బాగా పనికొచ్చింది.

ఆధునిక కవిత్వంలో ఒక ప్రత్యేక ధోరణికి మాత్రమే భావ కవిత్వం అనే పేరు స్థిర పడింది. ముఖ్యంగా ప్రణయ, భక్తి, ప్రకృతి, స్మృతి కవితలకే ఈ పేరు ఎక్కువ ప్రచారంలో ఉంది. కథకన్నా, పాత్రల కన్నా భావం ప్రధానమైనదన్న అర్థంలో భావ కవిత్వం అనే మాట ఈ ధోరణికి కవిత్వానికి రూఢి అయింది. ఈ కవిత్వం పాఠకుడిలో కలిగించే అనుభూతి ప్రధానమైంది.

**1. ప్రణయం :** ముఖ్యంగా స్త్రీ పురుషుల ప్రణయానికి మాత్రమే పరిమితమయి ఉంటుంది. పురుషులు రాసిన కావ్యాలయితే ప్రాప్త, అప్రాప్త మనోహరిని ఉద్దేశించి ఉంటాయి. ఈ మనోహరికి కావ్యంలో ఏదో ఒక పేరుండవచ్చు. నాయని సుబ్బారావుగారి ఫలసల, దేవులపల్లి కృష్ణశాస్త్రిగారి ఊర్వశి నండూరి

సుబ్బారావుగారి ఎంకి, తల్లావఝుల శివశంకర శాస్త్రిగారి లక్ష్మి ఇట్లాంటివే. ఈ కావ్యాలకు కవుల స్వీయానుభవాలు ప్రేరణ అని గుర్తించవచ్చు.

ఈ ప్రణయంలో స్త్రీ పురుష శారీరక సంబంధాల ప్రాధాన్యం ఉండదు. దీనినే రాయప్రోలు సుబ్బారావుగారు అమలిన శృంగారం అన్నారు. పరస్పర దర్శనం, మానసిక సాన్నిహిత్యం మాత్రమే కనిపిస్తాయి. గురజాడ అప్పారావుగారు అట్లాంటి కవిత్వం రాయకపోయినా, శారీరక సంబంధంలేని స్త్రీ పురుషుల సంబంధాన్ని గురించి ప్రస్తావించారు:

మరులు ప్రేమని మదిదలంచకు
మరులు మరలును వయసు తోడనె
మాయమర్మం లేని నేస్తమె మగువలకు మగవారికొక్కటె
బ్రతుకు సుకముకు రాజ మార్గం

2. భక్తి : భగవంతుని ప్రియుడుగా భావించి, అతడు తన హృదయనాథునిగా సంభావించి, మానవ జీవితంలోని విరహాన్ని ఇక్కడకూడా ఆపాదించి కవిత్వం రాశారు. ఇట్లాంటి వాటిలో వేంకట పార్వతీశ కవుల 'ఏకాంతసేవ' ముఖ్యమైన కావ్యం. కృష్ణశాస్త్రి, వేదుల సత్యనారాయణశాస్త్రి మొదలగు వారి కావ్యాల్లో ఈ రకమైన పద్యాలున్నాయి.

3. ప్రకృతి చిత్రణ : భావ కవిత్వంలో ప్రకృతిని సుందర దృశ్యాలుగా చిత్రించే పద్ధతి ఉంది. అంతేకాక ఏకాంత ప్రకృతిలో ఒంటరి యువతిని గురించో, ప్రకృతిలో భాగంగా శ్రమించే పల్లెజీవులనుగురించో విచారిస్తూ కావ్యాలు రాస్తారు. కవికొండల వేంకటరావుగారు ఈ మార్గంలో ప్రసిద్ధులు. అడవి బాపిరాజు, దువ్వూరి రామిరెడ్డి, ఏటుకూరి వెంకట నరసయ్య వంటి కవులీరకపు కావ్యాలు రాశారు. ఇందులో శ్రమజీవుల శ్రమను వాస్తవ దృష్టితోకాక కవులు సౌందర్యదృష్టితోనే చూశారు.

BRAOU

4. స్మృతి : ఆప్తులయిన వారు మరణించినప్పుడు వేదనను వ్యక్తం చేసే కవితకూడా భావకవిత్వంలో భాగంగానే వచ్చింది. తల్లి మరణించినప్పుడు నాయని సుబ్బారావుగారు రచించిన మాతృగీతాలు స్మృతి కావ్యాలకు ఒరవడిగా ఉంది, కృష్ణశాస్త్రిగారు మొక్కపాటి రామమూర్తి మీద రాసిన 'మానవోత్తమా' అనేపాట, బసవరాజు అప్పారావుగారు తన కూతురు మంగళప్రదను స్మరిస్తూ రాసిన 'చలిపిడుగు' అనేపాట ఇదే కోవకు చెందినవి. భావ కవితా ధోరణి ఆగిపోయినా స్మృతి గీతారచన మాత్రం సాగుతూనే ఉన్నది.

భావ కవితా ధోరణి సుమారు 1910 నుంచి 1940 వరకూ సాగింది. 1934-35 సంవత్సరాల్లో శ్రీశ్రీ కొత్త కవిత్వం వచ్చిం తర్వాత ఇది వెనక్కి తగ్గింది. అయితే ఇది తెలుగు కవిత్వం మీద గొప్ప ముద్ర వేసింది.

ఖండ కావ్యరచన భావకవిత్వం జమిలిగా సాగాయి. కావ్యభాషలో సారళ్యం, భావ వ్యక్తీకరణంలో సాంద్రత కవిత్వంలో ఆశించదగ్గ గుణాలుగా గుర్తించారు. పూర్వం శతకాల్లో మాత్రమే కానవచ్చే ఆత్మాశ్రయత్వం, ప్రత్యక్ష భావ వ్యక్తీకరణ కవిత్వపు సాధారణ లక్షణమయింది, రచనలో శిల్పదృష్టి, సౌందర్యదృష్టి పెరిగాయి, వృత్తాల ప్రాచుర్యం తగ్గి గేయాల, గీతాల ప్రాబల్యం పెరిగింది, ఇవన్నీ భావకవులు సాధించిన ప్రగతి సోపానాలుగా గుర్తించవచ్చు.

ఈ పాఠంలో నేర్చుకున్న ముఖ్య విషయాలివి :

1. ప్రాచీన కవిత్వంలో దేవతలు, రాజులు, ఋషులు, ప్రధాన పాత్రధారులు. అతీతశక్తుల ప్రస్తావన ఉంటుంది. వర్ణధర్మాల రక్షణ ప్రధానాశయం.
2. సామాన్య ప్రజల సాహిత్యం పండిత సాహిత్యం కంటే భిన్నంగా సాగింది.

3. ఇంగ్లీషువారి రాకతో భారతదేశ సామాజిక పరిస్థితుల్లో మార్పులు వచ్చాయి. ఆ మార్పులు కవిత్వంలో ప్రతిబింబించాయి.

4. ఆధునిక కవిత్వంలో వర్ణాశ్రమ ధర్మ నిరసన, సంఘ సంస్కరణ, దేశాభిమానం మొదలైన వస్తువులు ప్రవేశించాయి.

5. 'కథ' ఆధునిక కవిత్వం నుంచి విడివిడి కథానిక, నవల అనే సాహిత్య ప్రక్రియలలో చేరింది.

6. లఘు కావ్యాలూ, ఖండకావ్యాలూ ఎక్కువయ్యాయి.

7. నవ్య కవిత్వంలో సంస్కరణాభిలాష, తిరుగుబాటుతనం, ప్రకృతి చిత్రణ, దేశభక్తి, ప్రణయం విషాదస్మృతి, భగవద్భక్తి ప్రధాన వస్తువులు.

8. భావ కవిత్వంలో ప్రణయం, భక్తి, ప్రకృతి చిత్రణ, స్మృతి ప్రధాన వస్తువులు.

9. భావకవిత్వం ఆత్మాశ్రయత్వం, ప్రత్యక్ష భావ వ్యక్తీకరణ, పద్య రచనలో శిల్పదృష్టి అనే వాటిని కవిత్వంలో ప్రవేశపెట్టింది.

**అదనపు సమాచారం**

1. తెలుగులో భావకవిత్వం మీద చాలా వ్యాసాలువచ్చాయి. వాటిలో కొన్నిటి ప్రస్తావన: "తెలుగు సాహిత్య విమర్శలో ఆధునిక ధోరణులు" అనే వ్యాసంలోఉంది. ఇది ఆంధ్రసారస్వత పరిషత్తు, హైదరాబాదు వారు ప్రచురించిన (1979) తెలుగు సాహిత్యం వికాసం (పేజీలు 133-179)లో ఉంది.

2. భావకవిత్వాన్ని గురించి వెల్చేరు నారాయణరావు రచించిన "తెలుగులో కవితావిప్లవాల స్వరూపం' అనే గ్రంథంలో 'భావవిప్లవం' అనే అధ్యాయంలో విశేషమైన వివరణ ఉంది. (పేజీలు 112-158).

3. భావకవుల కావ్యల్లో కొన్ని దొరుకుతాయి, కాని అన్నీ దొరకవు. దొరకినంతవరకు వీటిని చదవటం ఉపయోగం. భావకవుల పద్యాలు దొరికే మంచి సంకలనం ముద్దుకృష్ణ (1935) కూర్చిన వైతాళికులు.

BRAOU

## అభ్యాసం [చదివేదీ. చేసేదీ. రాసేదీ]

**1. ముందుగతి**

యెనక జల్మంలోన యెవరమోనంటి
సిగ్గొచ్చి నవ్వింది సిలక నా యెంకి
ముందు మనకే జల్మముందోలె నంటి
తెల్ల తెల బోయింది పిల్ల నా యెంకి
ఎన్నాళ్ళు మనకోలె ఈ సుకములాంటి
కంట నీరెట్టింది జంట నా యెంకి

—నండూరి సుబ్బారావు

అ. ఈ పైపాటలో కనిపించే భావకవితా లక్షణాలేమిటి ? ఈ పాట మూడు చరణాల్లో మూడు విషయాల ప్రస్తావన ఉంది వీటి క్రమ సంబంధమేమిటి ?

ఆ. ఈ పాటలో ఒకరు మాట్లాడతారు. ఒకరు మాట్లాడరు. అయినా ఇద్దరి అభిప్రాయాలు ఎట్లా తెలుస్తున్నాయి ?

ఇ. ఈ పాటలో సిలక, పిల్ల, జంట అనే మాటల ప్రత్యేక ప్రయోజన ముందా?

## 2. ప్రతీక్ష

నాటి తుది సంజె చీకటి కాటుకల వి
లీనమై పోవు రాజమార్గాన, నీవు
కదలిపోతి, విషాద సుఖమ్ము గూర్చి
సగము నిద్దురలో గ్రమ్ము స్వప్నమటుల
ఆపుకోలేని మమత, ఘంటా పథమ్ము
నడుమ పరువిడి, నిలబడి నాడనట్టి
విప్పుకొని పోవు వీక్షణ వితతితోడ
మూసికొని పోవు శూన్య హృత్పుటము తోడ
ఆ నిగూఢ ప్రశాంత సంధ్యా దురంత
గర్భ కుహరాంతరమ్ముల కలచిపోవు
కమ్ర భవదీయ మంజీర కటకగాన
రవముచే తిమిరమ్ము సాంద్రతరమయ్యె
ఆ యగణ్య తమస్సాంద్ర యవనికాంత
రంపు టేకాంతమునబడి, యాక్రమక్ర
మాస్తమిత నూపురారవాహ్వానమును
వెంటనంటి నా హృదయము వెడలిపోయె
ఆ సరణి, నేను ప్రతి దివసావసాన
సమయమున నీవు పోయిన చక్కి, చూపు
లట్టె పరపుచు, శ్రవణాలనట్టె, తెరచు
ఎదురు చూతు నీ కొరకు, నాయెడద కొరకు

—దేవులపల్లి కృష్ణశాస్త్రి

BRAOU

అ. పై పద్యాలు భావ కవిత్వంగా గుర్తుపట్టటానికి ఏ ఆధారాలున్నాయి?

ఆ. భావకవులు ప్రయోగించే శబ్దజాలం మిగతా కవులకన్న భిన్నంగా ఉంటుంది. మనోహరమైన వస్తువులను సూచించే శబ్దాలు, సుకుమారమైన శబ్దాలు వాడతారని ప్రతీతి. ఉదాహరణకు 'మంజీర కటక గానరవము', 'నూపురారవము' అట్లాంటివి. ఈ పద్యాలలో అట్లాంటివి ఏరి వివరించండి.

ఇ. ఈ పద్యాల్లో పోలికల్లో ఉన్న వైచిత్రిని గుర్తించండి. ఉదాహరణకు "సగము నిద్దురలో గ్రమ్ము స్వప్నమటులు" అనే ఉపమానంలో స్పష్టాస్పష్ట స్థితిని సూచించారు కవి. చీకట్లో కలిసిపోయిన రూపాన్ని సూచించటానికి ఈ పోలిక తెచ్చారు. అట్లాంటి పోలికలను ఏరి వివరించండి.

## 3. ఫలశ్రుతి-౧

అంత శ్రమపడి పావనమ్ము గంగ
ధారుణికి దెచ్చినాడు భగీరథుండు
అంత మథియించి కలశ రత్నాకరమ్ము
అమృత భాండమ్ము పడసినా రమరవరులు
మత్పురానేక పుణ్య జన్మములు పండి
జాహ్నవీ స్వచ్ఛవును సుధాస్వాదుమూర్తి

వైన నీ దివ్య సాన్నిధ్య మందుకొంటి
పుడమికిన్ స్వర్గమున కొక్కముడి రచించి
ఇంత కాలమ్ముగా నా కదృష్టములయి
ఎన్ని ఆనందధామమ్ము లీయనంత
భువన సంధుల వాసిల్లునవియునేడు
మత్పథాక్రాంతములు భవన్మహిమచేసి

—నాయని సుబ్బారావు

పద్యాల భావం ఇది: భగీరథుడు ఎంతో కష్టపడి గంగను భూమికి తీసుకువచ్చాడు. చాలాకాలం పాల సముద్రాన్ని తరచి దేవతలు అమృతకలశాన్ని సంపాయించారు. నా పూర్వజన్మల సుకృతంవలన గంగ వంటి స్వచ్ఛమైన దానివీ, అమృతంవలె తీయని దానివీ అయిన నీ దివ్య సాన్నిధ్యాన్ని భూమ్యాకాశాలకు ఒక్క ముడివేసి పొందాను. ఈ రెండు లోకాల నడుమ ఎన్ని ఆనంద ప్రపంచాలు ఇంతకాలం నాకు కనపడకుండా ఉన్నాయో, అవన్నీ ఈవేళ నీ మహిమ వల్ల నా కాళ్ళ దగ్గరికి వచ్చి పడ్డాయి.

అ. ఈ పద్యాల్లో కనిపించే భావకవిత్వపు లక్షణాలేమిటి?

ఆ. ఈ పద్యాల్లో స్త్రీని ఊహించిన పద్ధతి ఎట్లాఉంది? ఆమె ఆకారం ఎక్కడన్నా పొడగడుతున్నదా?

ఇ. ఈ పద్యాల్లో పోలికల సామంజస్యాన్ని వివరించి వాటి విశిష్టతను వర్ణించండి.

BRAOU

ఖండిక 18 పాఠం 34

# అభ్యుదయ కవిత్వం

## ఉద్దేశం

ఆధునిక కవిత్వంలో భాగంగా అభ్యుదయ కవిత్వాన్ని పరిచయం చేయడం. భావ కవిత్వానికీ, అభ్యుదయ కవిత్వానికీ మధ్య ఉన్న భేదాలను వివరించడం. అభ్యుదయ కవిత్వంలో ప్రధాన లక్షణాలను తెల్పడం. దాని చరిత్రను స్థూలంగా పరిచయం చేయడం.

## ప్రణాళిక

1. భావ కవిత్వపు చరమదశ, కొత్తమార్గం కోసం అన్వేషణ.
2. అభ్యుదయ కవిత్వానికి ఆర్థిక ప్రేరణలు.
3. అభ్యుదయ కవిత్వానికి బలమైన ప్రతినిధిగా శ్రీశ్రీ అవతరణ.

## అభ్యుదయ కవిత్వం

భావకవిత్వం 1920-1930 దశాబ్దంలో ఎక్కువ ప్రచురమయింది. సుమారు 1935 వరకు విస్తరించింది. ఆ తరువాత భావ కవిత్వం లాంటి పద్యాలు అక్కడక్కడా కనిపించినా దాని ప్రాచుర్యం తగ్గింది.

భావకవిత్వం 'స్వేచ్ఛాగానం' చేసినా అది వ్యక్తినిష్ఠమయినది. వ్యక్తిస్వేచ్ఛ సమాజ పరిమితులకు లోబడి ఉంటుందన్న స్పృహ భావ కవులకు లేదు. భావకవులు వ్యక్తిగతంగా స్వాతంత్ర్యోద్యమం పట్ల సానుభూతి ఉన్నవారు, సంఘ సంస్కరణకు అనుకూలురు. భాషలో మార్పును ఆహ్వానించినవారు. కృష్ణశాస్త్రి, వేదుల, నాయని వంటి కవులు భారత పూర్వ ప్రశస్తినమూ, జాతీయ నాయక ప్రశంసా చేసినవారే. కృష్ణశాస్త్రిగారు రఘుపతి వెంకటరత్నం నాయుడు గారిని బ్రహ్మర్షి అని ప్రశంశించారు. కందుకూరి వీరేశలింగం, రాజ్యలక్ష్మమ్మగార్ల కృషిని గురించి వ్యాసాలు రాశారు. అయినా వీరిని దేశం భావకవులుగానే గుర్తించింది.

భావకవిత్వం నిస్సారమైన వేలంవెర్రిగా తయారైన దశలో పఠాభి 'ఫిడేలురాగాల డజన్' అనే కావ్యం ద్వారా భావకవుల సౌందర్యవాదాన్ని అపహేళన చేశాడు. "కవిత్వపు వేషం వేసుకుని అకవిత్వం తిరుగుతున్నపుడు, కవిత్వం అకవిత్వపు వేషంలో రావలసి వుంటుంది. సరిగ్గా ఈ పనే చేసింది పఠాభి కవిత్వం...ఫిడేలు రాగాల డజన్ భావ కవిత్వానికి దహన సంస్కారం చేసింది." అని ఫిడేలు రాగాలు నిర్వహించిన పాత్రను ఒక విమర్శకులు ప్రశంసించారు.

భావకవిత్వపు మార్గంకన్నా కొత్త మార్గాన్ని అన్వేషించే ప్రయత్నం శ్లిష్టా ఉమామహేశ్వరరావు, శ్రీరంగం నారాయణబాబు వంటి కవులు చేశారు. శ్రీశ్రీ భావకవిగా 'ప్రభవ' అనే కావ్యాన్ని (1928) ప్రకటించి అక్కడితో ఆగక కొత్త ప్రయోగాలు చేశారు.

1930వ దశాబ్దిలో పెట్టుబడిదారీ దేశాల్లో ఆర్థికమాంద్యం ఏర్పడింది. అది ఇండియావంటి వలస దేశాలను కూడా కదిలించింది. ఈ ఆర్థికమాంద్యం సోవియట్ యూనియన్‌ను తాకలేదు. ఆర్థిక అసమానతలను, ధనికులు- పేదలు అనే భేదాలను లేకుండాచేసే ఒక మార్గంకోసం చాలా దేశాల్లో మేధావులు ఎదురుచూశారు. ఆ అన్వేషణలో సోవియట్ రష్యా అనుసరించిన మార్గం ఆశాజనకంగా కనిపించింది. మార్క్సిస్టు విజ్ఞానం కూడా అప్పుడప్పుడే చాలా దేశాలకు వ్యాపించింది. సుమారు 1930-35 సంవత్సరాల ప్రాంతంలో అభ్యుదయ

BRAOU

కవిత్వం అనే శాఖ వివిధ సాహిత్యాల్లో బయలుదేరింది. తెలుగులో దానికి బలమైన ప్రతినిధి శ్రీశ్రీ (శ్రీరంగం శ్రీనివాసరావు 1910-1983)

"నేను సైతం భువన భవనపు
బావుటానై పైకి లేస్తాను"

అని 1933లో 'జయభేరి' అనే గీతం రాశారు.

'మరో ప్రపంచం
మరో ప్రపంచం
మరో ప్రపంచం పిలిచింది'

అని నవప్రపంచ నిర్మాణానికి 'మహా ప్రస్థానం' (1934) అనే గీతం ద్వారా ఆహ్వానించారు.

'అలజడి మా జీవితం
ఆందోళన మా ఊపిరి
తిరుగుబాటు మా వేదాంతం'

అని 'వ్యత్యాసం' (1937) అనే గేయంలో ప్రకటించారు.

"శ్రమైక జీవన సౌందర్యానికి
సమానమైనది లేనేలేదని
కష్టజీవులకు
కర్మ వీరులకు
నిత్యమంగళం నిర్దేశిస్తూ'

'ప్రతిజ్ఞ' (1937) చేశారు.

'నరజాతి చరిత్ర సమస్తం
పరస్పరాహరణోద్యోగం'

అని చరిత్ర తత్వాన్ని నిరూపించి

'ఒక వ్యక్తిని మరొక్క వ్యక్తీ
ఒక జాతిని, వేరొక జాతీ
పీడించే సాంఘిక ధర్మం
ఇంకానా ఇకపై సాగదు.'

అని 'దేశ చరిత్రలు' (1938) అనే ఖండిక నిష్కర్ష చేశారు.

1930-1940 దశాబ్దంలో ఒక ముఖ్య సంఘటన రెండో ప్రపంచ యుద్ధం. నాజీ జర్మనీ, ఫాసిస్టు ఇటలీ, జపానులు ప్రపంచాన్ని పంచుకునే ఉద్దేశంతో ఒక మహా యుద్ధాన్ని ప్రారంభించాయి. ఆ యుద్ధ ప్రతిస్పందనలు శ్రీశ్రీ కవిత్వంలో కనిపిస్తాయి. నాజీ సైన్యాలకు వ్యతిరేకంగా సోవియెట్ వైమానిక దళాల రంగంలోకి దిగినప్పుడు 'గర్జించు రష్యా

గాండ్రించు రష్యా'

అని 'గర్జించు రష్యా' (1942) అనే గేయం రాశారు. ఈ విధంగా ఈ కాలపు సందేశాన్ని శ్రీశ్రీ యుగకవిగా వినిపించారు.

శ్రీశ్రీ తరవాత వచ్చిన అభ్యుదయ కవులు ఆ మార్గంలో పయనిస్తూ స్వదేశంలో జరిగే సంఘటనలకు స్పందించారు. ముఖ్యంగా తెలంగాణంలో భూస్వాములకూ, నిజాం నవాబుకూ వ్యతిరేకంగా జరిగిన ఉద్యమాన్ని సమర్థిస్తూ సోమసుందర్ వజ్రాయుధం (1949) అనే కావ్యంలో కొన్ని గేయాలు రచించారు. ఆరుద్ర 'త్వమేవా ఓహమ్' (1949) అనే కావ్యం రాశారు. దాశరథి అగ్నిధార(1949)గీతాలు, రుద్రవీణ (1950) గీతాలు వచ్చాయి.



BRAOU

తెలంగాణాలో గెరిల్లా దళాల పోరాటాన్ని వర్ణిస్తూ గంగినేని వెంకటేశ్వరరావు 'ఉదయిని' (1950) అనే కావ్యం రాశారు. ఈ వరసలో కుందుర్తి ఆంజనేయులుగారి 'తెలంగాణా' (1956) అనే కావ్యం చివరిది. కె. వి. రమణారెడ్డిగారు అడవి (1952), భువనఘోష (1956) అనే కావ్యాల్లో తెలుగు ప్రాంతపు రైతుకూలీల తిరుగుబాట్లను వర్ణించారు.

అభ్యుదయ కవిత్వం 1933 ప్రాంతం నుంచి సుమారు 1952 వరకు ప్రాబల్యంలో ఉందనవచ్చు, అయితే సాహిత్యంలో యుగాల ఆద్యంతాలు స్పష్టంగా ఉండవు. పై సంవత్సరాలు స్థూలమైన సరిహద్దులు మాత్రమే, అభ్యుదయ రచయితల సంఘం 1943 లో ఏర్పడింది. అభ్యుదయ కవిత్వం అంతకు ముందూ తరవాతా ఉంది.

అభ్యుదయం అనే మాటకు కేవలం 'శుభం' అనే ప్రాచీనార్థం. ఇప్పటి సాహిత్యంలో సమాజ ప్రగతి అని అర్థం. సామాజిక రుగ్మతలకు కారణాలు వివరించి ఈ సమాజాన్ని మార్చమని ప్రజలను ఉత్తేజ పరచటం అభ్యుదయ కవిత్వపు ధ్యేయం. మార్క్సిస్టు సిద్ధాంతం బోధించే వర్గ సంఘర్షణ, సోషలిస్టు విప్లవం వీరి కవిత్వంలో కనిపిస్తాయి, కవి అనుభూతిని పాఠకుడితో పంచుకోవటమే భావ కవిత్వం ధ్యేయం. పాఠకుడిలోగాని, శ్రోతలోగాని భావ చైతన్యాన్ని కలిగించి కార్యాచరణకు ప్రేరేపించటం అభ్యుదయ కవిత్వ లక్షణం. అందువల్ల అభ్యుదయ కవిత్వం సమకాలిక ఆర్థిక రాజకీయ వ్యవస్థల మీద తిరుగుబాటును ప్రోత్సహిస్తుంది. చరిత్రకందినప్పటినుంచీ సమాజంలో పీడకవర్గం, పీడితవర్గం ఉన్నాయని, ఇప్పుడు పల్లెల్లో, పట్టణాల్లో ఉండే కార్మికులు పీడితులనీ. వారి పక్షాన నిలబడటం తమ ధర్మమనీ అభ్యుదయ కవులు గుర్తిస్తారు. వస్తుపరంగా అభ్యుదయ కవులు చాలా మార్పు తీసుకొచ్చారు. ఉద్యమాలలో వీరులను కీర్తించటంతో ఆగక ఉద్యమాలనే వర్ణించటం అభ్యుదయ కవిత్వంలో కనపిస్తుంది. అభ్యుదయ రచయితల సంఘానికి సమాంతరంగా అదే లక్ష్యంతో ప్రజానాట్యమండలి అనే సాంస్కృతిక సంస్థ కూడా పనిచేసింది. ఆ సంస్థవారు ప్రజలకు తేలిగ్గా అర్థమయ్యే పాటలు పాడి అభ్యుదయ కవితా లక్ష్యాలనే ప్రచారం చేశారు. బుర్రకథ, నాటకం, ఛాయానాటకం వంటి ప్రదర్శన యోగ్యమైన, గానయోగ్యమైన ప్రజా కళారూపాలను ప్రచారం చేశారు. సుంకర సత్యనారాయణ, వాసిరెడ్డి భాస్కరరావుల 'కష్టజీవి', 'బెంగాలు కరువు' అనే బుర్ర కథలు, "ముందడుగు", "మాభూమి" అనేనాటకాలు బాగా ప్రచారమయ్యాయి. అభ్యుదయ కవుల కవిత్వం పుస్తకాలు చదువుకునే నగరవాసుల వరకుపోతే, ప్రజానాట్యమండలి వారి పాటలు, బుర్రకథలు చదువురాని ప్రజలవరకు వెళ్ళకలిగేవి.

BRAOU

కవితాపరంగా అభ్యుదయ కవులు తెచ్చిన మార్పులు కొన్ని ఉన్నాయి. సుందర దృశ్యాల్ని, మధురోహల్ని వర్ణించిన భావకవులకు లలిత లలిత పదజాలం అవసరం అయింది. తిరుగుబాటును, విప్లవాన్ని ప్రోత్సహించే కవిత్వానికి ఉద్ధతిని సూచించే పదజాలం కావలసి వచ్చింది. అందుకే 'నవకవిత' అనే ఖండిక (1937)లో శ్రీశ్రీ

"రాబందుల రెక్కల చప్పుడు
పొగగొట్టపు భూంకారధ్వని
అరణ్యమున హరీంద్ర గర్జన
పయోధర ప్రచండ ఘోషం
ఖడ్గ మృగోదగ్ర విరావం
ఝంఝానిల షడ్జధ్వానం
కావాలోయ్ నవకవనానికి"

అని రాశారు.

భావకవులూ, సమకాలికులూ, కొంచెం పూర్వులూ వ్యాప్తిలోకి తెచ్చిన ఖండకావ్యమే అభ్యుదయ కవితా వేదికగా నిలిచింది. భావకవులు పద్యాన్ని వాడుకున్నారు. అభ్యుదయ కవులు గేయాన్ని, వచన పద్యాన్నీ వాడుకున్నారు. పద్యం రాగయుక్తంగా చదువుతారు. నాటకాల్లో తప్ప పద్యాలు పాడే వాళ్లుండరు. గేయాలు పాడు

తారు. అభ్యుదయ కవులు ప్రజలను కార్యాచరణాసక్తులను చెయ్యాలి కాబట్టి వారికి గేయం బాగా పనికొచ్చే వాహకం. కాని గంగినేని వెంకటేశ్వరరావు, కుందుర్తి ఆంజనేయులుగారు వచన రూపాన్నే వాడుకున్నారు. ఆరుద్ర పాటలు రాసినా వచన కవిత్వం కూడా ఎక్కువే రాశారు. మిగతా అభ్యుదయ కవులు కూడా వచన కవిత్వపు రూపాన్నే వాడుకున్నారు. గేయంలో శబ్ద సంబంధమైన లయ ఉంటుంది. అందువల్ల లయ బద్ధంగా దాన్ని చదవవచ్చు, పాడవచ్చు. వచన పద్యానికి శబ్ద సంబంధ లయ తప్పనిసరిగా ఉండాలని లేదు. వాక్య వైచిత్రిమీద ఆధారపడింది వచన కవిత్వం. వచన లక్షణం ఎక్కువున్న వచన కవిత్వంలో లయ ఉండదు. లయబద్ధంగా చదవటం కుదరదు.

**ముఖ్య విషయాల క్రోడీకరణ**

ఈ పాఠంలో మీరీ కింది విషయాలు నేర్చుకున్నారు.

1. భావకవులు సంఘ సంస్కరణపట్ల సుముఖులే అయినా వారి కవిత్వంలో అది ప్రముఖాంశంకాదు.
2. భావకవుల సౌందర్య దృష్టిని అవహేళన చేస్తూ వచ్చిన కావ్యం పఠాభిగారి 'ఫిడేలు రాగాలడజన్'
3. 1930వ దశాబ్దపు ఆర్థికమాంద్యం, అభ్యుదయ కవిత్వానికి పరోక్ష ప్రేరణ.
4. ప్రపంచంలో ఇతర భాషల్లోకూడా 1930-35 ప్రాంతంలోనే అభ్యుదయ కవిత్వం మొదలయింది.
5. అభ్యుదయ కవిత్వానికి బలమైన తెలుగు ప్రతినిధి శ్రీశ్రీ.
6. శ్రీశ్రీ తరవాత అభ్యుదయ కవులు స్వదేశ సంఘటనలకు స్పందించారు, అందులో ముఖ్యమైనది భూస్వామ్య వ్యతిరేక పోరాటం.
7. సామాజిక రుగ్మతలకు కారణాలు వివరించి, వర్తమాన సమాజాన్ని మార్చమని బోధించటం అభ్యుదయ కవిత్వ ధ్యేయం.
8. వర్గ సంఘర్షణ, సోషలిస్టు విప్లవం అభ్యుదయ కవిత్వంలో కనిపిస్తాయి.
9. అభ్యుదయ కవులు పీడితుల పక్షాన ఉంటారు.
10. భావకవులు పద్యాన్ని, గేయాన్ని వాడుకున్నారు, అభ్యుదయ కవులు గేయాన్ని, వచన కవిత్వాన్ని వాడుకున్నారు.

## అభ్యాసం (చదివేది, రాసేది)

1. ఈ కింది కవిత పెద్దగా చదివి చూడండి,

వాడు

అందరం కలిసి చేసిన ఈ  
అందమైన వస్తు సముదాయం అంతా  
ఎక్కడో ఒక్కడే వచ్చి  
ఎత్తుకుపోతూ ఉంటే చూచి,  
"అన్యాయం,అన్యాయం!" అని మేమంటే-  
"అనుభవించాలి మీకర్మం" అంటాడు.

—శ్రీశ్రీ

అ. ఇది గేయమా ? వచన కవిత్వమా ?

(గేయం పాడగలిగింది, లేక లయబద్ధంగా చదవదగింది. వచన కవిత్వం సాధారణ వచనం కన్నా భిన్నమైనా పాడటానికి వీల్లేనిది, లయబద్ధంగా చదవటానికి వీల్లేనిది)

BRAOU

ఆ. ఇది అభ్యుదయ కవిత్వం అనటానికి మీక్కనిపించే ఆధారాలేమిటి ?

ఇ. ఇందులో 'వాడు' అంటే ఎవరు ? 'మేము' అంటే ఎవరు ?

ఈ. 'కర్మం' అనే భావం ఎవరికి ఎక్కువ ఉపయోగిస్తున్నది ?

2. "పదండి ముందుకు !
పదండి తోసుకు !
ప్రభంజనంవలె హోరెత్తండీ !
భావ వేగమున ప్రసరించండీ !
వర్షుకాభ్రముల ప్రళయఘోషవలె
పెళపెళ పెళపెళ విరుచుకుపడండి
పదండి,
పదండి,
పదండి ముందుకు !
కనబడలేదా మరో ప్రపంచపు
కణ కణ మండే త్రేతాగ్ని !

—శ్రీశ్రీ

అ. ఈ పై కవిత గేయమా ? పద్యమా ? మీ సమాధానాన్ని వివరించండి.

ఆ. ఈ ఖండికలో పద ప్రయోగాన్ని గురించి ఆలోచించండి. భావకవిత్వపు పదప్రయోగంతో పోల్చిచూడండి. పదాలు నాజూగ్గా, లలితంగా, అందంగా, మృదంగా, మందానిలచందంగాఉన్నాయా ? కరుగ్గా చురుగ్గా ఉన్నాయా ?

ఇ. ఈ కవిత్వంలో 'మరో ప్రపంచం' ఏమిటో ఐదారు వాక్యాల్లో వివరించండి ?

ఈ. ఈ పై ఖండికలో వేగం (Speed) ఏమైనా కనిపిస్తున్నదా ? అదెట్లా వచ్చిందనుకుంటున్నారు ?

1. ఈ క్రింది చరణాలను చదవండి.

*దేశ చరిత్రలు*

బలంవతులు దుర్బల జాతిని
బానిసలను కావించారు
నరహంతలు ధరాధిపతులై
చరిత్రమున ప్రసిద్ధికెక్కిరి.
చిరకాలం జరిగే మోసం,
బలవంతుల దౌర్జన్యాలూ,
ధనవంతుల పన్నాగాలూ,
ఇంకనా! ఇకపై చెల్లవు.

నైలూనదీ నాగరికతలో
సామాన్యుని జీవనమెట్టిది?
తాజమహల్ నిర్మాణానికి
రాళ్ళెత్తిన కూలీలెవ్వరు?
చారిత్రక విభాత సంధ్యల
మానవకథ వికాసమెట్టిది?
ఏ దేశం ఏకాలంలో
సాధించినదే పరమార్థం?"

-శ్రీశ్రీ

అ. ఈ ఖండిక గేయమా? వచన కవిత్వమా? ఎందువల్ల ?

ఆ. చరిత్రను గురించి పై చరణాల్లో వెల్లడించిన భావాలను వివరించండి.

ఇ. మార్క్సిస్టులు చరిత్రను వివరించే పద్ధతిని చారిత్రక భౌతిక వాదమంటారు. ఈ చరణాల్లో కనిపించే చారిత్రక భౌతికవాద పద్ధతిని వెల్లడించండి?

[మనకు తెలిసిన చరిత్ర అంతా వర్గ సంఘర్షణల చరిత్రే. మానవజాతి అభివృద్ధి విరుద్ధశక్తుల సంఘర్షణ వల్లే జరిగింది. ఈ శక్తులే సాంఘిక వర్గాలు.]

BRAOU

ఖండిక : 18 పాఠం 35

# గేయకవితా పద్ధతులు

**ఉద్దేశం**

ఆధునిక కవితా వాహకంగా సుమారు 1910 నుంచీ నిలబడ్డ గేయ కవిత్వ లక్షణాల్ని స్థూలంగా పరిచయం చెయ్యటం. గేయాల్లో ముఖ్యమైన నడకల్ని విశ్లేషించి చూపించటం.

**ప్రణాళిక**

1. గేయ నిర్వచనం
2. జానపద గేయాలు గేయాలే
3. పద్యరచన
4. గురు, లఘువుల వివరణ
5. పద్యాల్లో గురు లఘుక్రమం
6. మాత్రాగణాల వివరణ
7. లయ వివరణ
8. ముఖ్యమైన నడకల (గతుల) వివరణ
9. ఆధునిక కవులలో గేయాల వాడకం
10. ముఖ్యవిషయ క్రోడీకరణ

BRAOU

**గేయకవిత్వం**

పూర్వపు పాఠాల్లో భావకవులు పద్యాలు, గేయాలు వాడుకున్నారని, అభ్యుదయ కవులు గేయాలు, వచన కవిత్వం వాడుకున్నారని చెప్పుకున్నాం. అంటే భావ కవిత్వానికి అభ్యుదయ కవిత్వానికి సమాన లక్షణం 'గేయం' అని పైన చెప్పిన దాన్నిబట్టి గ్రహించగలం. గేయం అంటే పాడుకోదగిందీ, లయబద్ధంగా చదువుకోదగిందీ అని కూడా పూర్వం చెప్పుకున్నాం.

పాటలు మొదటి నుంచీ ఉన్నాయి. చదువు సంధ్యలు లేని పామరులు తమ తమ పనిపాటల్లో పాటలు పాడుకోవటం అందరికీ తెలిసిందే. కలుపు పాటలు, కపిల పాటలు, విసురు రాతి పాటలు మొదలైనవి తెలుగు నాట అతి ప్రసిద్ధమైనవి. ప్రాచీన సాహిత్యంలో ఈ పాటల ప్రసక్తి బసవ పురాణం వంటి గ్రంథాల్లో కనిపిస్తుంది. ఏల పాటలు, తుమ్మెద పాటలు - వంటివి సాహిత్యంలో ప్రస్తావించబడ్డాయి. దీన్ని దేశీ వాఙ్మయం అని పిలుస్తారు. జానపద సాహిత్యం, మౌఖిక సాహిత్యం వంటి ఇతర పేర్లు కూడా ఉన్నాయి. జాతి జీవితంలో భిన్న కాలాలలో రకరకాల పాటలు ప్రవర్తిల్లినాయి- బుర్రకథలు, ఒగ్గుకథలు, వీరగాథలు, పదాలు, కీర్తనలు తత్వాలు (అధ్యాత్మ రామాయణ కీర్తనలు, బ్రహ్మంగారి తత్వాలు మొదలైనవి) ఇవి.

ఇవన్నీ తెలుగు జీవనంలో భాగంగా, సాహిత్యాంగాలుగా చాలా కాలంనుంచి ఉన్నాయి. వీటన్నిటికీ ఒక సమాన పద్ధతి ఉంది. దాన్ని పాట లక్షణం అనీ, పాడే లక్షణం అనీ అందాం. దాని వివరాలు కొంచెం సేపట్లో గ్రహిద్దాం.

తెలుగులో 9వ శతాబ్దినుంచి శాసనాల్లోనూ, 11వ శతాబ్ది నుంచి శాసనాల్లోనూ, కావ్యాల్లోనూ తెలుగు పద్యాలు కనిపిస్తున్నాయి. ఇవి పాటలకన్నా భిన్నమైనవి. ఈ పద్యాల్లో మళ్ళీ రెండు రకాలున్నాయి. వాటి స్థూలంగా వృత్తాలు-జాతులు అని వేరువేరుగా పిలుస్తారు.

పద్యరచన

ప్రపంచంలో ప్రతి భాషలోను సాహిత్యం ఉంటుంది. అది ప్రధానంగా రెండు రకాలు: 1. పద్యం 2. వచనం. వచన సాహిత్యంలో కథ చెప్పే పద్ధతికి ప్రాధాన్యం ఉంటుంది అట్లాగే కొన్ని వాక్య రచనా పద్ధతులు, వాక్యాల కూర్పు మాట్లాడే భాషకన్నా వచన సాహిత్యంలో భిన్నంగా ఉండవచ్చు. ప్రాచీన కాలంలో కథల రూపంలో ప్రవర్తిల్లిన దాన్ని వచన సాహిత్యం అనవచ్చు. నేటికీ పల్లెటూళ్ళలో కథలు చెప్పుకునే పద్ధతి ఉంది. దాన్ని కూడా వచన సాహిత్యంగా గుర్తించవచ్చు.

వృత్త, గేయ సాహిత్యా లన్నిటినీ కలిపి పద్య సాహిత్యం అని కాసేపు అనుకుందాం. పద్య సాహిత్యంలో అక్షరాల కూర్పు మామూలు భాషకన్నా భిన్నంగా ఉంటుంది. మీ పూర్వ తరగతుల్లో ఎక్కడో చోట గురువు, లఘువు అనేమాట వినే ఉంటారు. గురువు అంటే దీర్ఘకాలం ఉచ్చరించే పొడుగు అక్షరం. లఘువు అంటే తక్కువకాలం (అంటే గురువుకన్నా తక్కువకాలం) ఉచ్చరించే అక్షరం. ప్రతి అక్షరానికి ఒక అచ్చు ఖచ్చితంగా ఉంటుంది. పద్యపాదంలో ఎన్ని అచ్చులుంటే అన్ని అక్షరాలున్నట్టు. ఒక అక్షరంలో అచ్చుకు ముందూ, వెనకా హల్లులుండవచ్చు.

గురు, లఘువుల భేదం ఇట్లా చెప్పవచ్చు:

1. ముందు, వెనకల హల్లులతో నిమిత్తం లేకుండా దీర్ఘాచ్చులున్న అక్షరాలన్నీ గురువులే.
2. హ్రస్వాచ్చులున్న అచ్చు తరవాత ద్విత్వహల్లుగాని, సంయుక్త హల్లుగాని ఉంటే అది గురువు అవుతుంది. అంటే హల్లుల గుంపులో మొదటి హల్లు పూర్వపు అచ్చుకు గురుత్వాన్ని, బరువును కల్పిస్తుంది. హల్లుతో అంతమయే అక్షరం కూడా గురువే.
3. తక్కిన హ్రస్వాచ్చులు (పొట్టి అచ్చులు) ఉన్న అక్షరాలన్నీ లఘువులే.

**ఆకు, అర్చన, అచ్చు, కాయ, కంప** అనే మాటల్లో మొదటి అక్షరాలు గురువులు. తక్కిన అక్షరాలు లఘువులు. పూర్వకావ్యాల్లో **చేయగన్**, **అంతటన్**, మొదలైన మాటల్లో నకార పొల్లుతో అంతమయ్యే మాటలు ఉండేవి. ఇప్పటి గేయాల్లో సున్నతో అంతమయ్యే మాటలుంటాయి. ఇవి కూడా గురువులే.

BRAOU

[ఈ గురు లఘువుల గూర్చిన చర్చ పరీక్ష దృష్ట్యా ముఖ్యంకాదు కాని, పద్య రచనను గూర్చి అర్థం చేసుకోటానికి మాత్రం కావాలి. వీటిని అర్థం చేసుకోటానికి మీ సలహాదార్ల సహాయం పొందండి]

వృత్తాల పేర్లతో మనం పిల్చే పద్యాల్లో గురు లఘువులు ప్రతిపాదంలోను నిర్ణీత స్థానంలో ఉంటాయి. ఉత్పలమాల, చంపకమాల, శార్దూలం, మత్తేభం వంటి పద్యాల్లో ఒకదాన్ని తీసుకొని చూడండి.

జాతుల్లో మళ్ళీ ఇంకో రకం పద్ధతి ఉంది. అక్కడ కొన్ని రకాల అక్షరాల వరుసలను ఒక గుంపుగా గుర్తించి దానికి గణం అని పేరు పెట్టారు. ఆ గణాల వరస జాతుల్లో ముఖ్యం. [ఇది కూడా పరీక్ష దృష్ట్యా ముఖ్యంకాదు. కాని మీ సలహాదారు సహాయంతో సీస, గీత, ఆటవెలది, ద్విపద లక్షణాలను తెలుసుకోండి]

## ఇక గేయాలు

గేయాల్లో గణాలుంటాయి. ఈ గణాలను మాత్రా గణాలంటారు. ఒక లఘువును ఉచ్చరించే కాల పరిమితి ఒక మాత్ర. రెండు లఘువులకు పట్టేకాలం రెండు మాత్రలు. ఒక గురువు రెండు లఘువులకు సమానం. అంటే గురువును ఉచ్చరించే కాలపరిమితి రెండు మాత్రలు.

ఈ మాత్రల సంఖ్యతో ఏర్పడే గణాలు ముఖ్యంగా మూడు.

1. మూడు మాత్రల గణాలు. అతడు, ఆమె, సిరా - ఇలాంటి మాటలు మూడు మాత్రల మాటలు.
2. నాలుగు మాత్రల గణాలు. నాగలి, తిరగలి, గొడ్డలి, రంపం, పలుగూ, పారా అనే మాటలు నాలుగు మాత్రల మాటలు.

3. అయిదు మాత్రల గణాలు: ఎందుకో, ఎవరోయి, ఈరేయి, వంటి మాటలు అయిదు మాత్రల మాటలు

గేయాలు లయబద్ధమైనవి. ఒక పరిమాణం గల గణాలు క్రమంగా వస్తే దాన్ని లయ అంటారు. ఈలయ ఉచ్చారణ ప్రధానమైనది. పద విభాగమూ, పదోచ్చారణలో ఊనిక (stress) ఈ లయను తెలియ పరుస్తాయి. మూడు మాత్రల గణాలతో ఏర్పడే లయను త్రిశ్రగతి, అనీ, నాలుగు మాత్రల గణాలతో ఏర్పడే లయను చతురశ్రగతి అనీ, అయిదు మాత్రలలో ఏర్పడే లయను ఖండ గతి అనీ, మూడు, నాలుగు మాత్రల క్రమ ప్రయోగం వచ్చే లయను మిశ్రగతి అనీ పిలుస్తారు. అయితే గేయాల్లో ప్రతిచోట్ల ఈ గణాల విభజన సరిగ్గా కుదరదు. పాదానికి 12 మాత్రల పరిమితితో మూడేసి మాత్రల గణాల అంతర్విభజనతో ఉండే గేయంలో ఒక్కొచోట ఆరేసి మాత్రలకు విరుగుతూ ఉంటుంది. అట్లా పాదానికి 16 మాత్రల పరిమితితో నాలుగేసి మాత్రల అంతర్విభజన ఉండాల్సిన గేయంలో ఎనిమిది మాత్రలకు విరగవచ్చు. ఈ విరుపులు ఆ లయలో కలిసిపోతాయి గనుక వేరుగా కనిపించవు. వీటికి కొన్ని ఉదాహరణలు గ్రహించండి.

*త్రిశ్రగతి :* (పాదానికి 12 మాత్రలు. మూడు మాత్రలకు విరుగుతుంది).

అవల పూజ సలిపి నాడ
నచట లభ్యమైన కుసుమ
చయము తోడ శ్రద్ధ తోడ
శంకరు పాద ద్వయికిని

పై గేయంలో నాలుగో పాదంలో 3 మాత్రలు విభజన సరిగ్గా కుదరదు.

*చతురశ్రగతి :* (పాదానికి 16 మాత్రలు, నాలుగేసి మాత్రలకు విరుగుతుంది).

మేలిమి బంగారు మెలతల్లారా
కలువల కన్నుల కన్నెల్లారా
తల్లుల గన్నా పిల్లల్లారా
విన్నా రమ్మా యీ కథను.

(పై గేయంలో చివరి పాదంలో నాలుగో గణం అసంపూర్ణం)

*ఖండగతి :* (పాదానికి 10 మాత్రలు ఐదేసి మాత్రలకు విరుగుతుంది.

కాళిదా సునిరూఢ
కావ్యమ్ము నొకసారి
పఠియించుచుండగా
పండు వెన్నెల రేయి
మనసు వోడు మిను మేఘు
మార్గాన పయనింప

*మిశ్రగతి :* పాదానికి 14 మాత్రలు 3, 4, 3, 4 మాత్రల గణాలుగా విరుగుతాయి. నాలుగో పాదం, పొట్టిగా ఉండి 9, గాని 12 మాత్రలు గానీ ఉండవచ్చు.

గుత్తు నాయని జాతి ముత్యాల్
గుచ్చినాడే మేలి సరముల
ఇత్తు నాయని తెలుగు తల్లికి
ఇచ్చినాడే భక్తితో

నవవ సంతము నవ్య వసరమ
మావి కొమ్మల కమ్మ చివురుల
పాట పాడెడి పరభృ తమ్మును
ఎవ్వ రాపుదురో.

ఈ గేయాన్ని ముత్యాలసరం అని కూడా పిలుస్తారు. గురజాడ అప్పారావు ఈ రకపు గేయాన్ని ఎక్కువగా వాడారు. భావ కవులలో కొందరు దీన్ని బాగా వాడుకున్నారు. శ్రీశ్రీ ఈ గేయపు నడకలో చాలా ప్రయోగాలు చేశారు.

ఈ పై గేయాల్లో ఒక దాంట్లో నాలుగోపాదంలో 3 + 4 + 3 + 2 అనే విభజన ఉంది. రెండో దాంట్లో 3 + 4 + 2 అనే విభజనఉంది.

ఈ గేయాలన్నిటికీ కొన్ని సామాన్య సూత్రాలున్నాయి.

1. పాదం చివరా, ఒక్కోసారి గణం చివరా అవసరమైనపుడు లఘువును (పొట్టి అక్షరాన్ని) పొడిగించి చదువుకోవాలి.
2. రెండో సరి పాదాల్లో అక్షరాలు తగ్గించి గేయాలు రాసే సంప్రదాయం ఉంది.
3. నాలుగు పాదాలుగా నడిచే గేయంలో నాలుగో పాదాన్ని తగ్గించే సంప్రదాయం ఉంది. ఈ తగ్గింపు 2 మాత్రలు కావచ్చు. ఇంకా ఎక్కువ కావచ్చు.
4. పాదంలో మాత్రలు సరి సంఖ్యలో ఉంటే పాదాన్ని రెండు సమభాగం మీద ఒక గురువు (పొడుగు అక్షరం) వేసి నాలుగోపాదం కూర్చవచ్చు.
5. యతులూ, ప్రాసలూ అందం కోసం వాడవచ్చు. కాని వృత్తాల్లోలాగా తప్పనిసరిగా ఉండాలనే నియమం లేదు.

BRAOU

జానపద గీతాలు అని మనం పిలిచే పాటలను విభజించుకుంటే పై రకపు గతులు (నడకలు)కనిపిస్తాయి. ప్రాచీన కావ్యాల్లో ముఖ్యంగా ప్రబంధాల్లో వర్ణనల సందర్భంగా *రగడలు* అనే రకపు పద్యాల్లో ఈ నడకలు కనిస్తాయి. వృత్తాల్లో కూడా మానిని, తోదకము, ఉత్సాహము, వంటివాటిని పూర్వకవులు లయబద్ధంగా అంటే గేయంలాగా నడిపించారు.

మొదట్లో గురజాడ అప్పారావు గారు వెనకటి పద్యాల్లోనే కవిత్వం రాశారు. కాని తరవాత గేయాలే రాశారు. ముఖ్యంగా మిశ్రగతి నడక (3 + 4 + 3 + 4)ను ఎక్కువగా వాడారు. దానినే ముత్యాలసరం అని పేరు పెట్టారు. అప్పట్నుంచీ ఆ నడకకు అదే పేరు స్థిరపడింది. అడివి బాపిరాజుగారు, బసవరాజు అప్పారావు, దేవులపల్లి కృష్ణశాస్త్రి వంటి భావకవులు గేయాలు విరివిగా వాడారు. తల్లావఝుల శివశంకరశాస్త్రి గారు గేయ నాటికలు రచించారు. ఎంకి పాటలన్నీ గేయాలే. అభ్యుదయ కవుల్లో శ్రీశ్రీ మొదట పద్యాలు రాసినా తరవాతే గేయాలే రాశారు. అనిసెట్టి సుబ్బారావు, సోమసుందర్, కె.వి. రమణారెడ్డి, ఆరుద్ర, గజ్జెల మల్లారెడ్డి వంటి అభ్యుదయ కవులు గేయాలు రాశారు. సుంకర సత్యనారాయణ, వాసిరెడ్డి భాస్కరరావు, నాజర్ల బుర్రకథలు గేయాలే. దాశరథి కృష్ణమాచార్యులు గారు పద్యాలు గేయాలు సమంగా రాశారు. సి. నారాయణ రెడ్డిగారు తొలి రోజుల్లో కొద్దిగా పద్యాలు రాసినా తరవాత గేయాలు రాసి గేయ కవిగానే ప్రసిద్ధి చెందారు. తరవాత విప్లవ కవులుగా ప్రసిద్ధి చెందిన చెరబండరాజు, గద్దర్‌లు పాటలు రాశారు. ఈ విధంగా ఆధునిక సాహిత్యంలో లయ ప్రధానమైన గేయం బాగా ప్రచారమయింది. ఆధునిక కవితావాహికంగా నిల్చింది. తరవాత వచన కవిత్వం అనే రూపం వచ్చినా, గేయం పూర్తిగా వెనకపడలేదు.

**ముఖ్య విషయ క్రోడీకరణ**

ఈ పాఠంలో మీరు నేర్చుకున్న ముఖ్య విషయాలివి:

1. భావ కవులూ, అభ్యుదయ కవులూ కూడా గేయ రచన చేశారు.
2. జానపద సాహిత్యం, మౌఖిక సాహిత్యం, దేశి వాఙ్మయం అనే వాటిల్లో కవిత్వం పాటల రూపంలో ఉంది. అంటే అదీ గేయ కవిత్వమే- బుర్ర కథలూ, ఒగ్గు కథలూ, తత్వాలూ, సంకీర్తనలూ కూడా గేయాలే.
3. సాహిత్యాన్ని పద్య, వచన సాహిత్యాలుగా విభజించవచ్చు.
4. పద్య రచన, అంటే గేయ రచనలో కూడా అక్షరాలు కూర్పు మామూలు వచనం కన్న భిన్నంగా ఉంటుంది.
5. పద్య రచనలో అక్షర పరిమాణం రెండు రకాలు. అక్షరాలు పొడుగువీ, పొట్టివీ, ఉంటాయి. వీటినే గురు, లఘువు లంటారు.
6. వృత్తాలు అని పిలిచే పద్యాలు అన్ని పాదాల్లోనూ అక్షరాల వరస ఒకే రకంగా ఉంటుంది.
7. గేయాలు లయబద్ధమైనవి. లయ మాత్రాగణాల కూర్పు వల్ల, పదాలు విరుపుల వల్ల అక్షరాలమీద ఉచ్చరించేటప్పుడు ఇచ్చే ఊనిక (stress) వల్ల ఏర్పడుతుంది.
8. లయల్లో త్రిశ్రగతి (మూడేసి మాత్రల కూర్పు), చతురశ్రగతి (నాలుగేసి మాత్రల కూర్పు) ఖండగతి (అయిదేసి మాత్రల కూర్పు మిశ్రగతి (మూడు నాలుగు మాత్రల గణాలు క్రమంలోకూర్చటం) ముఖ్యమైనవి.
9. గేయాల్లో అవసరమైనపుడు చివరి పొట్టి అక్షరాన్ని పొడిగించి చదువుకోవాలి. సరిపాదాల్లోనూ, నాలుగో పాదంలోనూ, అక్షరాలు తగ్గించి రాసే సంప్రదాయం ఒకటుంది.
10. ప్రాచీన కావ్యాల్లో రగడలు గేయాలే.
11. గేయం గురజాడ అప్పారావుగారి కాలం నుంచి (1910 నుంచి) ఇప్పటివరకూ ఆధునిక కవితా రూపంగా నిలదొక్కుకుంది.

BRAOU

## అభ్యాసం [చదివేదీ, రాసేదీ]

1. మీరు ఇటీవల చూసిన సినిమా పాటను గుర్తున్నంతవరకు రాసి దాంట్లో నడకను గుర్తుపట్టండి.
2. ఈ కింది జానపద గీతంలో నడకను గుర్తుపట్టండి. అయితే ఇందులో పాదం చివరి గణం మొదటి మూడు గణాల పరిమాణంలో లేదు.

"మల్లెతోటల వున్న మామయ్యగారు
మాయన్నలొచ్చింద్రు మముదోలరయ్యా!"
"ఏరి మీయన్నల్లు యేవి మీ గుర్రాలు!"
"బంకుల్ల యన్నల్లు బయట గుర్రాలు"
"నేనెరుగు నేనెరుగ మీ బావనడుగు"
"భారతము సదివేటి ఓ బావగారు?"
"మాయన్న లొచ్చింద్రు మమ్మంపరయ్యా!"
"నేనెరుగ నేనెరు మీ యక్కనడుగు."
"సల్లల్లు సేసేటి సాటి యారాల!
మాయన్నలొచ్చింద్రు మముదోలరమ్మా!"

పై పాట ఇంకా ఉంది. కొంత మాత్రమే పైన ఇచ్చాం. ఇందు 'బంకు' అంటే ఇంటి ముందు గది; యారాలు (ఏరాలు) అంటే తోటి కోడలు. పై పాటకు ద్విపద అనే పద్యంతో ఉన్న పోలికను గుర్తుపట్టగలరా?

3. ఈ కింది గేయాల్లో నడకను (లయను) సహేతుకంగా నిరూపించండి.

అ) నిజంగానే నిఖిలలోకం
నిండు హర్షం వహిస్తుందా
మానవాళికి నిజంగానే
మంచికాలం వహిస్తుందా?

ఆ) యేటి కడుపునదాగి
తోట నిదరోయింది
అలనా నా సొదకు
పొలనా యనుకొంటి

ఇ) తెప్పపోలిక చంద్రబింబం
తేలిపోతోవుంది నింగిని
అందులో నా ముద్దు ప్రేయసి
ఉంది కాబోలు.

ఈ) చింతమాను కొమ్మపైన
వింతగాను గువ్వజంట
సంతోషము తోడ సరస
సల్లాపము లాడుచుండె.

ఉ) పొలాలనన్నీ హలాల దున్నీ
ఇలాతలంలో హేమం పిండగ
జగానికంతా సౌఖ్యంనిండగ
విరామ మెరుగక పరిశ్రమించే
బలం ధరిత్రికి బలికావించే
కర్షక వీరుల కాయంనిండా
కాలువ కట్టే ఘర్మజలానికి
ధర్మజలానికి ఘర్మజలానికి
ఘర్మజలానికి ఖరీదు లేదోయ్.

4. పైన ఉదాహరించిన గేయాల్లో కొన్ని భావకవులవి, మిగిలినవి అభ్యుదయ కవులవి. ఏవి ఎవరివో గుర్తు పెట్టండి. ఈ ఖండికలో కనిపించే భావ, అభ్యుదయ కవితా లక్షణాలను ముందు చదివిన పాఠాలు ఆధారంగా నిరూపించండి.

BRAOU

ఖండిక: 18 పాఠం 36

# వచన కవితా పద్ధతులు

## ఉద్దేశం

ఆధునిక కవితారూపంగా స్థిరపడ్డ వచనకవిత్వం పుట్టుక, వ్యాప్తిని సూచించి, లక్షణాలను పరిచయం చెయ్యటం.

## ప్రణాళిక

1. వచన కవిత్వపు తొలిదశ. భావకవుల వచనకవిత
2. నూత్నమార్గాన్వేషణలు-వచన కవిత అవతరణ
3. వివిధ దశాబ్దుల్లో వచనకవిత్వపువ్యాప్తి
4. వచన కవితకు ఇతర పేరు
5. వచన కవిత్వానికి లక్షణ ప్రతిపాదన-నారాయణరెడ్డి, సంపత్కుమారగార్లు చెప్పిన లక్షణాలు
6. ఒక ఖండికనిర్మాణ స్వరూపం- విశ్లేషణ
7. వచన కవిత్వానికి పరిమితి

# వచన కవిత్వం

## తొలిదశ

BRAOU

నవ్యకవులంతా అంటే భావకవులూ, అభ్యుదయకవులూ గేయాలు రాసిన వాళ్ళేనని పూర్వ పాఠాల్లో నేర్చుకున్నాం. గురజాడఅప్పారావుగారి తరవాత ఆధునిక కవులంతా గేయాన్ని వాడుకున్నారు.

భావకవిత్వపు మలిదశలోనే కొత్తమార్గంకోసం అన్వేషణ జరిగింది. భావకవుల్లో కవికొండల వెంకటరావు గారు, (1933) మల్లవరపు విశ్వేశ్వరరావుగారు (1938) వచన గీతికలు రాశారు. శ్రీశ్రీ 1934లో ఆకాశదీపం అనే వచనగేయం రాశారు. శిష్ట్లా ఉమామహేశ్వరరావుగారి నవమి చిలుక, విష్ణుధనువు అనే వచన కావ్యసంపుటులు 1938లో వెలువడ్డాయి. దీన్ని ప్రాహ్లాదక కవిత్వం అన్నారు. 1939లో పఠాభి 'ఫిడేలు రాగాలుడజన్' అనే సంపుటి వెలువడింది. అందులో "నా వచన పద్యాలనే దుడ్డుకర్రతో పద్యాలనడుములు విరగదంతాను" అన్నారు. దీన్ని బట్టి 1930 దశకంలోనే వచన కవితా ప్రయోగాలు బాగా జరిగినట్టు గ్రహిస్తాం. (విష్ణుధనువు 1938 లో అచ్చయినా రచన 1931 ప్రాంతంలో జరిగింది).

## పెరుగుదల

1940వ దశకంలో అభ్యుదయ కవులు వచన కవిత్వాన్ని రచించారు. బెల్లంకొండ రామదాసు, కుందుర్తి ఆంజనేయులు, ఏల్చూరి సుబ్రహ్మణ్యంగార్లు తమ వచన కవితా ఖండికలను 1944లో నయాగరా పేరుతో ప్రకటించారు. వీరిలో కుందుర్తి అంజనేయులుగారు ఓవరిపరకూ (1939) వచన కవిత్వమే రచించారు. వచనకవితా వ్యాప్తికి ఎక్కువ కృషిచేశారు. 1949లో వెలువడిన ఆరుద్ర 'త్వమేవాఽహమ్', అనిసెట్టి 'అగ్నివీణ', సోమసుందర్ 'వజ్రాయుధం', దాశరథి 'అగ్నిధార'లలో వచనగేయాలున్నాయి. 1950 లో అచ్చయిన గంగినేని వెంకటేశ్వరరావు 'ఉదయిని' కావ్యం పూర్తిగా వచనగేయాల సంపుటం. కె. వి. రమణారెడ్డిగారు 'అడవి' (1952)లో వచన కవిత్వమే ఎక్కువుంది. కుందుర్తి ఆంజనేయులుగారు 'తెలంగాణ' (1956) తొలితెలుగు సంపూర్ణవచన కావ్యం. కుందుర్తి వచనగేయం నాటక రచనకు కూడా తోడ్పడగలదని భావించి ఆశ అనే వచనగేయ నాటకం రాశారు. ఆ ప్రయోగం తెలుగులో ఇతరులు కుందుర్తి తర్వాత

చేయలేదు. 1950వ దశకంలో అజంతా, బైరాగి, తిలక్‌లు వచన కవిత్వం ఎక్కువగా రాశారు. బైరాగి నూతిలో గొంతుకలు 1949లోనే తెలుగు స్వతంత్రలో అచ్చయింది.

1965-70 మధ్య వచ్చిన దిగంబర కవుల మూడు సంపుటాలు వచన కవిత్వపు సంపుటాలే. "మా కవిత్వాన్ని వచన కవిత్వం అని అననీయం" అని దిగంబర కవులు ప్రకటించుకున్నా, విమర్శకులు దాన్ని వచన కవిత్వం అనటం మానలేదు. దిగంబర కవుల్లో నిఖిలేశ్వర్, జ్వాలాముఖి, చెరబండరాజు, భైరవయ్య, నగ్నముని అనే కవులు తరవాత వేరువేరు వచన కవితా సంపుటలు (1970 దశకంలో) అచ్చేసుకున్నారు. 1969 లో వచ్చిన తిరుగుబడు, మార్చి అనే విప్లవ కవితా సంపుటుల్లో ఉన్నది వచన కవిత్వమే. 1970 దశకంలో కె. వి. రమణారెడ్డి, శివసాగర్, చెరబండరాజు, శ్రీశ్రీలు పాటలు, వచన కవిత్వం- రెండూ విప్లవ కవితా పద్ధతిలో రచించినారు. 1970వ దశకంలో కె. శివారెడ్డి రక్తం సూర్యుడు/ చర్య, ఆసుపత్రిగీతాలు అనే వచన కావ్య సంపుటులు ప్రకటించారు. ఇటీవల కాలంలో శివసాగర్, చెరబండరాజు, గద్దర్ వంటి వాళ్ళను మినహాయిస్తే దాదాపు తెలుగు కవులంతా వచన కవిత్వమే రాస్తున్నారు. వచన కవిత్వం బలమైన ఆధునిక కవితా రూపంగా స్థిరపడిపోయింది.

## పేరు

ఈ కవితా రూపానికి వచన పద్యం, వచన గేయం, వచన గీతం, వచన కవిత అనే పేర్లే ప్రచారంలో ఉన్నాయి. ఇవన్నీ సమానార్థకాలే. ఇవి కాక ముక్తచ్ఛందం, స్వేచ్ఛా కవిత, నిశ్ఛంద కవిత వంటి పేర్లు కొందరు వాడుతున్నా అవి ఎక్కువగా వ్యాప్తి కాలేదు. పై వాటిలో వచన కవిత అనే పేరు ఎక్కువ వ్యాప్తిలో ఉంది. అయితే మిగతావి కూడా చాలా మంది వాడుతున్నారు.

BRAOU

## వచన కవిత్వ లక్షణాలు

ఇంతకు ముందటి పాఠంలో గేయ కవిత్వపు లక్షణాలు చెప్పుకున్నాం. గేయాల్లో లయ ఉంటుందనీ, వాటిల్లో కొన్ని గతి భేదాలున్నాయని నేర్చుకున్నాం. అట్లాగే వచన కవిత్వానికి కూడా లక్షణాలను నిరూపించ గలమా ?

అట్లాంటి ప్రయత్నాలు కొందరు చేశారు. వచన కవిత్వంలో అంతర్లయ ఉన్నదని నారాయణ రెడ్డి గారన్నారు. ఈ కింది వాక్యాలద్వారా నారాయణరెడ్డిగారి అభిప్రాయాలు తెలుసుకోవచ్చు.

"వచన గేయమునకు లయ ముఖ్యము. ఈ లయ గణములు కూర్చుటతోనే యుత్పన్నము కాదు. ఒకానొక ఊపులో విరుపులో పదములు గుప్పించుట వలన ఈ లయ ఏర్పడును. ఏ నియమము లేకుండా శుద్ధ వచనమును లయాత్మకముగా మార్చిన వచన గేయమగును. వచనమునకు వచన గేయమున కిక్కడే వ్యత్యాసమున్నది. వచనములో విషయ ప్రకటనమే ముఖ్య లక్ష్యము. అందుకు వచన రచయిత వైశద్యము కొరకే ప్రయత్నించును. వచన గేయములో వైశద్యము ప్రధాన గుణము కాదు. పాఠకులలో భావోద్వేగము కలిగించు అంతర్లయ దీని ప్రధాన లక్షణము. దీనిలో కేవలము అనుప్రాసాదుల వలన సంక్రమించు శబ్దలయ ఆనుషంగికమైనది. దీని కతీతమైన 'భావలయ' ముఖ్యమైనది. భావలయ యనగా పూసలలో దారము వలె నుండు అంతర్లయ."

పై వాక్యాలలో నారాయణరెడ్డి గారు శుద్ధ వచనం నుంచి వచన గేయాన్ని వేరుచేసేది అంతర్లయ అన్నారు. అదే భావలయ అని కూడా అన్నారు. ఆ భావలయ పదాలు గుప్పించటం వల్ల వస్తుందన్నారు. 'పదాల గుప్పించుట'మనే వివరణ భావలయకు చాలదు. చాలా మంది అంతర్లయ, భావలయ అనే మాటలు వాడారు కాని వాటికి స్పష్టమైన వివరణ ఎవరూ ఇయ్యలేదు.

సంపత్కుమార "వచన పద్యం దాని స్వరూపం" (భారతి, జూన్ 1965) అనే వ్యాసంలో వచన పద్య లక్షణాలుగా ఈ క్రింది వాటిని సూచించారు.

1. భావాన్ని, భావాంశాన్ని బట్టి పాదాలను విభజించటం.
2. క్రియాపదాలతో ప్రారంభించటం, పూర్తిచేయటం.
3. క్రియారహితంగా భావాన్ని వాక్యంలో నిరూపించటం.
4. అనియతంగా యతిప్రాసల్ని, అంత్యప్రాసల్ని ఉపయోగించటం.
5. ఒక్కొక్క పాదాన్ని తత్పూర్వ పాదం కన్నా పొడిగిస్తూ భావోద్దీప్తిని కలిగించటం.
6. భావాన్ని లయబద్ధంగా స్ఫురించేట్టు పదాల కూర్పు ద్వారా ఇమడ్చటం.

పద్యంలో, గేయంలో కనిపించే అక్షరాల కూర్పు వచన కవిత్వంలో ఉండదు. వ్యాసాల్లో కాని, సంభాషణల్లో కాని కనిపించే వచనం, కవిత్వంలో కనిపించే వచనం ఒకటేనా? కవిత్వంలో వచనం, కవిత్వపు వచనం కావాలి. మామూలు వచనం కన్నా వేరుగా ఉండాలి. అట్లా వేరుచేసే లక్షణాల కోసమే ఈ అన్వేషణ అంతా. పైన సంపత్కుమారుగారు లక్షణాలను బట్టి ఒకటి గ్రహించగలం. వచన కవిత్వంలో పద్యత్వాన్ని పదప్రయోగం ద్వారా, వాక్యాల కూర్పు ద్వారా సాధించాలి. వాటిల్లో కొన్నిటిని సంపత్కుమార పైన సూచించారు. నిజానికి ఇట్లాంటి పద్ధతులు ఇన్ని అని లెక్కపెట్టలేం.

వేరే ఇంకోచోట సంపత్కుమారగారు భావగణాలు అని వాడారు. పదాల పద బంధాల, వాక్యాల విరామాల్ని బట్టి భావగణాలుంటాయని అర్థంచేసుకోవచ్చు. పాద విభజన కోసం ఈ లక్షణాన్ని సూచించారు. పద్యంలో పాద విభజన భావాన్ని బట్టి కాక అక్షరాల్ని బట్టి ఉంటుంది. గేయాల్లో పాద విభజన లయ కోసం వేసే మాత్రాగణాల పరిమితిని బట్టి ఉంటుంది. వచన కవిత్వంలో ఇట్లాంటిలేవీ ఉండవు కనుక పాద విభజనకు పనికొచ్చే అంశాన్ని అన్వేషిస్తూ భావగణాన్నే సూచించారు. భావగణాలను గుర్తుపట్టటం కష్టం. పాద విభజన అక్షరానుసారిగా కాక భావానుసారిగా ఉంటుందని సంపత్కుమార గారి భావం.

BRAOU

వచన కవిత్వానికి ప్రాచీన లక్షణ గ్రంథాల్లోలాగా నిర్దిష్ట లక్షణాలను చెప్పలేం. పద్యానికి, గేయానికి నియత నిర్మాణముండే ఉంటుంది. కవి తన భావాలను భాషా రూపంలో ఆ నిర్మాణంలో ఇముడుస్తాడు. వచన పద్యానికి అట్లా ముందే తయారయిన చట్రం ఉండదు. అందువలన వచనకవి తన చట్రాన్ని తానే ఏర్పర్చుకోవాలి. ఆ విధంగా 'వచనకవి' పద్య, గేయ కవులకన్నా చాలా స్వతంత్రుడు. అయితే స్వేచ్ఛ బాధ్యతతో కూడిన స్వేచ్ఛ. అంటే పటిష్టమైన చట్రాన్ని తానే ఏర్పర్చుకోవాలి.

మామూలు వాక్యాల్లో పదక్రమం ఒక పద్ధతిలో ఉంటుంది. కొన్ని పద్ధతులలో ఆ క్రమాన్ని మారిస్తే అసాధారణ పదక్రమం ఏర్పడి వాక్యాలకు కొత్తదనం వస్తుంది.

అట్లాగే రకరకాల వాక్య విన్యాసాలద్వారా, కూర్పుద్వారా కవిత్వానికి ఒక చట్రాన్ని తయారు చేసుకుంటాడు వచన కవి.

ఉదాహరణగా ఈ కింది చిన్న వచన కవిత చదవండి. (ఇది ఆంధ్రజ్యోతి వార పత్రిక 1984 మార్చి 23 సంచికలో అచ్చయింది.)

**బందిపోట్లు**

పాఠం ఒప్పజెప్పకపోతే
పెళ్ళిచేస్తానని
పంతులుగారన్నప్పుడే
భయం వేసింది.

అఫీసులో నా మొగుడున్నాడు-
అవసరమున్నా సెలవివ్వడని
అన్నయ్య అన్నప్పుడే
అనుమానం వేసింది.

'వాడికేం మహారాజ'ని
ఆడా మగా వాగినప్పుడే
అర్థమైపోయింది.

"పెళ్ళంటే" పెద్ద శిక్షని!
"మొగుడంటే" స్వేచ్ఛా భక్షకుడని!
మేం పాలిచ్చి పెంచిన జనంలో సగమే
మమ్మల్ని విభజించి పాలిస్తోందని!

ఈ కవిత స్త్రీ పరంగా చెప్పింది. స్త్రీ మాట్లాడుతున్నది. మామూలు వ్యవహారంలోనే అమాయకంగా వాడుకునే పోలికలూ, వాక్చిత్రాలు స్త్రీల దైన్య స్థితిని ఎట్లా చెప్పుతున్నాయో చూపించారు రచయిత్రి.

ఈ కవితలో రెండు భాగాలున్నాయి. మొదటి మూడు చరణాలు ఒకరకంవి. వాటిల్లో మూడు రకాల మనో వ్యాపారాలు వర్ణించబడ్డాయి. 1. భయం వెయ్యటం 2. అనుమానం వెయ్యటం 3. అర్థమైపోవటం. రెండో భాగంలో వాటిని విశదం చేసే కారణాలూ, వివరణలూ ఉన్నాయి. వీటిని చివరి దాకా విలంబం చెయ్యటంలో కొంత కుతూహలాన్ని (Suspense) పెంచుతుంది. రెండో భాగంలో మూడు వాక్యాలు మొదటి మూడు చరణాల్లో వాక్యాలకు అనుసంధిస్తేనే కవిత సమగ్రం అవుతుంది.

ఈ మూడు మనో వ్యాపారాల్లో క్రమ పరిణామం ఉంది. భయం వెయ్యటం తరవాత అనుమానం వెయ్యటం చివరికి అంతా అర్థమైపోవడం. ఇవి కవితకు క్రమపరిణామం, పతాక స్థితిని చేకూరుస్తాయి. అని తో వచ్చే వాక్యాలు అన్ని చరణాల్లోను వాడటం వల్ల పదానికి (ఖండికకు) ఏక సూత్రత వచ్చింది.

వచన కవితకు చట్రం రచయితలు ఎట్లా ఏర్పర్చుకుంటారో ఉదాహరణ ప్రాయంగా సూచించాం. రచయిత స్పష్టంగా ఆలోచించకపోవచ్చు. తనకు సహజంగా ఉన్న క్రమ ప్రియత్వం వల్ల అప్రయత్నంగా కవితకు స్వరూపం ఏర్పడుతుంది. అయితే ఇదే నిర్మాణం అన్నింటికీ వర్తించదని, దేనికదే ప్రత్యేక నిర్మాణం ఉంటుందనీ గుర్తించాలి.

వచన కవిత్వం ఆధునిక కాలంలోనే ఏర్పడ్డ కవితారూపం. దీనికి ప్రాచీన సారస్వత మూలాలు చూపించటానికి ప్రయత్నించారు కానీ అవేవీ ఫలించలేదు.

వచన కవిత్వం ప్రచారానికి అచ్చుయంత్రం చాలా దోహదం చేసింది. లిఖిత సాహిత్యంలేని భాషల్లో వచన కవిత్వంలేదు. అట్లాగే అచ్చు సౌకర్యంలేని భాషల్లో కూడా వచన కవిత్వం లేదు. అందువల్ల ఆధునిక నాగరికత వ్యాపించిన సమాజాల్లోనే వచన కవిత్వం కనిపిస్తుంది.

వచన కవిత్వం ప్రధానంగా చదువుకునే కవితారూపం. అందువల్ల అక్షరాస్యులకే ఈకవితారూపం అందుబాటులో ఉంటుంది. చదువుకున్న నడిమి తరగతి నాగరికుల్లోనే దీని ప్రభావం ఎక్కువ. సామాన్యులు, శ్రామికులు వాళ్ల పాటల సాహిత్యాన్ని కల్పించుకొంటూనే ఉన్నారు.

**ముఖ్య విషయ క్రోడీకరణ**

ఈ పాఠంలో మీరు నేర్చుకున్న విషయాలివి :

1. భావకవిత్వపు మలిదశలో కొత్త కవితారూపం కోసం చేసే అన్వేషణలో వచన కవిత పుట్టింది.
2. కొందరు భావకవులు కొన్ని వచన కవితలు రాశారు.

3. అభ్యుదయ కవులు గేయంతోపాటు వచన కవిత్వం రాశారు. కుందుర్తి ఆంజనేయులు, గంగినేని వెంకటేశ్వరరావులు వచనకవితా రూపాన్నే తాము రాసిన అభ్యుదయ కవిత్వానికి వాడుకున్నారు.

4. వివిధ దశాబ్దాల్లో వచన కవిత్వం వాడుక క్రమక్రమంగా పెరిగింది

5. ఇటీవలి కాలంలో ఎక్కువమంది వచన కవిత్వం రాస్తున్నారు

6. వచన గేయం, వచన గీతం, వచన పద్యం అనే పేర్లు వాడుకలో ఉన్నా వచన కవిత అనే పేరే ఎక్కువ ప్రచారంలో ఉంది.

7. వచన కవిత్వ లక్షణాలుగా 'అంతర్లయ, భావలయ అనే వాటిని ప్రతిపాదించారు. కాని ఆ ప్రతిపాదనలో స్పష్టతలేదు.

8. పద్యాల్లో గేయాల్లో పాద విభజన అక్షర సంఖ్యానుసారి, లేక గణానుసారి. వచన పద్యంలో భావానుసారి. రచయిత ఇష్టంమీద ఆధారపడి ఉంటుంది.

9. వచన కవిత్వానికి నిర్ణీత చట్రంలేదు. రచయితే కవిత్వపు చట్రాన్ని, నిర్మాణాన్ని తయారు చేసుకుంటాడు.

10. ప్రతి కవితకూ స్వరూపం ఒకే రకంగా ఉండదు.

11. వచన కవితకు ప్రాచీన మూలాలు లేవు.

12. వచన కవిత పత్రికల ద్వారా, అచ్చు ద్వారా ఎక్కువ ప్రచారమయింది.

13. వచన కవిత నడిమి తరగతి నాగరీకులకు పరిమితమైంది.

వచన కవిత్వం మీద ఆధునిక సాహిత్యంలో చాలా చర్చ జరిగింది. మీ వీలును బట్టి ఆ పుస్తకాలను చదవండి.

1. కుందుర్తి ఆంజనేయులు, గోపాల చక్రవర్తిగార్లు వచన కవిత వివిధ కవుల పద్యాలూ, దృక్పథాలూ అని ఒక పుస్తకం సంకలనం చేశారు; అందులో ప్రముఖుల వ్యాసాలున్నాయి. ఈ వ్యాసంలో ప్రస్తావించని చాలా అంశాలు అందులో ఉన్నాయి. ఫ్రీవర్స్ ఫ్రంట్ తరపున స్నేహాంజలి ప్రచురణ 1967 జనవరిలో అచ్చయింది. దీని ఖరీదు మూడు రూపాయలేకాని మార్కెట్లో దొరకటం లేదు. లైబ్రరీలలో దొరకవచ్చు.

BRAOU

2. చేకూరి రామారావు, కోకిల సంపత్కుమారలు వచన కవిత్వపు లక్షణాలను ఆంధ్రపత్రిక-భారతి సంచికల్లో విపులమైన చర్చలు చేశారు. ఛందస్సును గురించి ఎన్నో అంశాలు అందులో చర్చకు వచ్చాయి. ఆ చర్చంతా వచనపద్యం: లక్షణచర్చ అనే పేరుతో 1978లో అచ్చయింది. ఖరీదు పది రూపాయలు. దేశి బుక్ హౌస్ విజయవాడలో దొరకవచ్చు.

3. ఆరుద్ర 'వచన కవిత - ప్రయోగ వైవిధ్యం' అనే పరిశోధక వ్యాసం రాశారు. అందులో వచన కవిత తొలిరోజుల విశేషాలు కొన్ని దొరుకుతాయి. ఇది జి.వి. సుబ్రహ్మణ్యంగారి సంపాదకత్వాన ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమీ, హైదరాబాదువారు 1980లో అచ్చువేసిన 'సమాలోచనం' అనే పుస్తకంలో (పేజీలు 99-123) ఉంది. ఆ పుస్తకం ఖరీదు 10 రూ.

4. వచన కవిత్వం రాసిన ప్రసిద్ధులయిన వారి రచనలు చదవటం మంచి అలవాటు. ముఖ్యంగా కుందుర్తి ఆంజనేయులు, బైరాగి, బాల గంగాధర తిలక్‌గార్ల పుస్తకాలు సంపుటాలుగా దొరుకుతాయి. అజంతా గేయాలు ఇంకా సంపుటీకరణం కాలేదు. కాని సంపుటాల్లో దొరుకుతాయి.

5. వచన కవితలు కొన్ని సంకలనాల్లో దొరుకుతాయి. ముఖ్యంగా

అ) అనిసెట్టి సుబ్బారావు, అవసరాల సుబ్బారావు, బెల్లంకొండ రామదాసు, రెంటాల గోపాలకృష్ణగార్లు సంకలనం చేసిన 'కల్పన' అనే పుస్తకం చేతన సాహితి, విజయవాడ వారు 1953లో ప్రకటించారు.

ఆ) అనిసెట్టి, శ్యామ్‌కృష్ణ, కాపుగంటి అనే వారు కూర్చిన శ్రీశ్రీ యుగం అనేది 1961లో అచ్చయింది.

ఇ) నండూరి రామమోహనరావు, ఇంద్రగంటి శ్రీకాంత శర్మ గార్లు కూర్చిన మహాసంకల్పం'లో 1940—1975 సంవత్సరాల మధ్య కాలంలో వచ్చిన వచన కవితలు కొన్ని దొరుకుతాయి. చైతన్య భారతి, విజయవాడ వారు 1976లో అచ్చేశారు.

ఈ) హైదరాబాదు ఫ్రీవర్స్ ఫ్రంటు వారు 1976లో 'తరం తరం' పేరుతో 100 మంది కవుల కవితలతో వచన కవితా సంకలనం వేశారు.

ఉ) ఈ తరం యుద్ధ కవిత (1971-80)' పేరుతో ఉస్మానియా యూనివర్సిటీ రైటర్సు సర్కిల్ వాళ్ళు 1982లో వేశారు. ఇందులో 10 ఏళ్ళ కాలపు ఎన్నిక చేసిన వచన కవితలు దొరుకుతాయి.

## అభ్యాసాలూ, ప్రశ్నలూ

1. ఈ కింద ఖండిక గేయమా? వచన పద్యమా? ఎందువల్ల?

నిప్పులు చిమ్ముకుంటూ
నింగికి నేనెగిరిపోతే
నిబిడాశ్చర్యంతో వీరు-
నెత్తురు క్రక్కు కుంటూ
నేలకు రాలిపోతే
నిర్దాక్షిణ్యంగా వీరే...

పై ఖండికలో నిర్మాణాన్ని గురించి ఏమైనా చెప్పగలరా

2. ఈ కింది ఖండిక చదవండి

—ఇవేమిటీ వింత భయాలు?
—ఇంట్లో చీకటి
—ఇవేమిటీ అపస్వరాలు?
తెగింది తీగ
—అవేమిటారంగుల నీడలు?
—చావూ, బ్రదుకూ
—ఎచటికి పోతావీరాత్రి?
—అవతలి గట్టుకు !

ఈ పై ఖండికలో వాక్యాల కూర్పులో ఉన్న విశేషం ఏమిటి? దీనిమీద ఒక చిన్న వ్యాఖ్య రాయండి.

3. మీకు నచ్చిన ఒక వచన గేయాన్ని నిర్మాణం దృష్ట్యా వ్యాఖ్యానించండి.

BRAOU

ఖండిక 19 పాఠం 37

# కథానికా పరిచయం: కథానిక స్వరూప స్వభావాలు

**ఉద్దేశ్యం**

ఆధునిక వచన ప్రక్రియగా కథానిక ఎట్లా ఆవిర్భవించిందో స్థూలంగా తెల్పడం. కథానిక లక్షణాలను వివరించడం.

**ప్రణాళిక**

1. వచన రచన-కథానిక పుట్టుక
2. కథానిక అంటే
3. కథానిక లక్షణాలు
4. ముఖ్య విషయ క్రోడీకరణ
5. అదనపు సమాచారం

తెలుగులో ప్రాచీన కావ్యాలలో పద్య రచనే ఎక్కువ. పద్యాల మధ్యన అక్కడక్కడ వచనం కూడా ఉండేది. ఇట్లా పద్యం, వచనం కలిసిన కావ్యాన్ని 'చంపూకావ్యం' అంటారు. ఆ చంపూ కావ్యంలోని వచనం తప్ప వచన రచన అప్పుడు దాదాపుగా లేదు; అందుకే 19వ శతాబ్దపు వరి సగం వరకు తెలుగులో వచన రచన అభివృద్ధే జరగలేదు.

దేశంలో ఇంగ్లీషు చదువులు పెరగడంతో, పత్రికలు రావడంతో పెద్ద మార్పులు వచ్చాయి. పాఠకుల సంఖ్య ఎక్కువయింది. పండితులవరకే పరిమితమైన కావ్యాలు వెనకబడ్డాయి. ఈనాటి జీవితానికీ, సాహిత్యానికీ, కథానిక, నవల, నాటిక, జీవిత చరిత్ర, వ్యాసం వంటి ప్రక్రియలు అనుగుణమైనవని తెలిసింది. ఇంగ్లీషు చదువుల వల్లా, మన జీవితంలో కలిగిన మార్పుల వల్లా ఈ కొత్త ప్రక్రియలు తెలుగులో మొదలయ్యాయి. ఈ ప్రక్రియల్లో చాలా వాటిని తెలుగులో పరిచయం చేసింది కందుకూరి వీరేశలింగం గారు.

కథానిక స్వరూపం, స్వభావం.

కథానిక అంటే

కథలు ప్రతిభాషలోను పూర్వం నుంచి ఉన్నాయి; తెలుగులోనూ ఉన్నాయి; కాని యిప్పటి తెలుగు కథానిక మాత్రం ఇంగ్లీషు సాహిత్యం ప్రభావం వల్ల అభివృద్ధి చెందినదే. ఇంగ్లీషులో దీన్ని 'షార్ట్ స్టోరీ' (Short Story) అంటారు. ఇది పత్రికల వల్ల బాగా ప్రచారం పొందిన ప్రక్రియ. 1910లో గురజాడ రాసిన 'దిద్దుబాటు' అనేదే ఇప్పటి కథానికలలో మొదటిది.

కథానికను, ఇంగ్లీషులో 'షార్ట్‌స్టోరీ' అన్నట్లుగానే 'చిన్నకథ' అని కూడా పిలిచేవారు. అయితే చిన్నగా ఉన్న కథలన్నీ కథానికలు కావు. చిన్నగా అంటే సంక్షిప్తంగా ఉండటం కథానికకు ఒక లక్షణమే గాని, చిన్న, పెద్ద అన్న పరిమాణం ఒక్కటే కథానికకు ముఖ్యంకాదు.

సంఘంలో ఒక మనిషి జీవితాన్ని గాని, అతని జీవితంలో ముఖ్యమైన ఘట్టాలు జరిగిన కొంత కాలాన్ని గాని చిత్రించడానికి నవల, నాటకం వంటి విస్తృతమైన ప్రక్రియలు ఉపయోగపడతాయి. ఒక మనిషి జీవితంలో జరిగిన ఒకటిరెండు ముఖ్యమైన సంఘటనలు చిత్రించడానికి కథానిక, నాటిక వంటి ప్రక్రియలు ఉపయోగపడతాయి. ఇది స్థూలమైన వివరణ మాత్రమే. మొత్తం అన్ని కథానికలకూ, నాటికలకూ వర్తిస్తుందని కాదు.

BRAOU

## కథానిక లక్షణాలు

కథానికలో "క్లుప్తత" అనేది ఒక లక్షణం. ఇదికాక మరిరెండు ముఖ్య లక్షణాలు : ఒకే అంశం ప్రధానంగా ఉండటం, దానికదే సంపూర్ణమైనదిగా ఉండటం.

1. ఒకే విషయం ప్రధానంగా ఉండటం :

కథానిక మొదటి నుంచి చివరివరకు ఒకే విషయాన్ని ఇతర విషయాల వల్ల మరుగుపడకుండా చెప్పడం. అంటే ఒక మనిషిలోని దానగుణాన్ని చిత్రించడానికి ఒక కథానిక రాస్తున్నారనుకోండి. ఆ కథానికలో మొదటి నుంచి చివరివరకు పాత్రలు, సంఘటనలు, వర్ణనలు ఆ గుణాన్ని కనబరచేవిగా, దోహదం చేసేవిగా, ఉండాలి. [అంతేకాని, మధ్యలో అనవసరంగా అతని పక్కింటి వాడిని గురించి చెప్పడమో, ప్రకృతి వర్ణనో చెయ్యకూడదు]

దానికదిగా సంపూర్ణమై ఉండడం :

అవసరమైన విషయం అవసరమైనంత వరకే చెప్పి, అంతకుమించి చెప్పవలసింది ఇంకేమీ లేనట్లూ, దానికదిగా సంపూర్ణమైనట్లూ అనిపించాలి; అంతే ఇంకా కొన్ని సంఘటనలో, వివరణో ఇస్తేగాని కథానిక పూర్తికాదు, అర్థంకాదు అనేటట్లు ఉండకూడదు.

కథానిక స్వరూపం :

కథానిక స్వరూపంలో ముఖ్యమైనవి వస్తువు, శిల్పం. కథానిక ఒక కట్టడం లాంటి దనుకుంటే వస్తువు పునాది; పాత్రలు, సంఘటనలు ఇటుకలనుకోవచ్చు; కట్టడానికి వేసిన ప్రణాళిక (ప్లాన్), కట్టే తీరు శిల్పం అవుతాయి.

## వస్తువు

BRAOU

కథానికలో చెప్పదల్చుకున్న ప్రధాన విషయమే వస్తువు. అది రోజువారీ జీవితంలో జరిగే ఒక మామూలు సంఘటనే. రచయిత ప్రత్యేక దృష్టితో చూసింది కావచ్చు; ఒక మనిషి మానసిక వైఖరి కావచ్చు ఒక ఆలోచన కావచ్చు. రచయిత తనచుట్టూ ఉన్న మనుషుల జీవితాలనుంచీ వస్తువు ఎన్నుకుంటాడు. కాలక్రమేణ సంఘం మారుతూ ఉండే వస్తువు మారుతుంటుంది. ఇట్లా మారుతున్న సాహిత్యం సంఘం (మనుషుల) మీద ప్రభావం చూపుతుంది. ఇట్లా సాహిత్యాన్ని మార్చేశక్తి సంఘానికి (మనుషులకి); సంఘాన్ని (మనుషులను) మార్చేశక్తి సాహిత్యానికి ఉంటాయి.

కథానికకు రచయిత ఉద్దేశించిన లక్ష్యం ఒకటి ఉంటుంది. అది ఒక నీతిని పాఠకులకు చెప్పడమో; ఒక కొత్త ఆలోచన కలిగించడమో ఏదైనా కావచ్చు. ఆ లక్ష్యాన్ని సాధించడానికి రచయిత తగిన వస్తువునే ఎన్నుకుంటాడు, పాత్రలు; సంఘటనలు సృష్టిస్తాడు; సన్నివేశాలు కల్పిస్తాడు; అతడు పాఠకులకు హత్తుకునుట్లుగా చెప్పడానికి తగిన శిల్పంతో మలుస్తాడు. అట్లా కథానికకు రూపం ఏర్పడుతుంది.

కథానికకు రూపాన్ని ఇచ్చేవి పాత్రలు, సంఘటన మలచేదే శిల్పం. కథానిక పరిధి చిన్నది కనుక పాత్రలు, సంఘటనలు ఎక్కువ ఉండవు. మాటలద్వారా; చేతలద్వారా, ఆలోచనల ద్వారా పాత్రలు కథలో జీవిస్తాయి. కథానికలో పాత్రలు రచయితచుట్టూ ఉండే సంఘంలోని మనుషులను పోలిన వాళ్ళే. కాబట్టి సంఘంలో మనుషులు ఎట్లా బ్రతుకుతున్నారో, ఏ ఆశలకోసం, ఆశయాలకోసం పోరాడుతున్నారో, ఆ పాత్రలు ఆ కథానికలో అట్లాగే ఉండాలి. అంటే పాత్రవేషం, భాష,ఆలోచనలు, నమ్మకాలు, నడత అన్నీ వాస్తవికంగా ఉండాలన్నమాట. అందుకే పాత్రల సంభాషణలలో పాత్రలకు తగిన భాషే ఉండాలి. ఒక కథానికలో తెలుగు దేశంలోని ఏదో ఒక ప్రాంతంలోని చదువుకోని పల్లెటూరి మనిషి పాత్ర ఉంటే, ఆ పాత్ర సంభాషణలు ఆ పాత్రకు తగిన యాసతో, మాండలికంలో ఉండాలి. ఆ పాత్ర; రచయితకు తెలిసిన నిఘంటువులలోని సంస్కృతం మాటలతో, పెద్ద సమాసాలతో సంభాషణ చెబితే, కథానిక ఉద్దేశం దెబ్బతింటుంది.

కథానికలో వర్ణనలు ప్రధాన విషయానికి దోహదం చేసేటట్లుగా, సంక్షిప్తంగా ఉండాలి. ఎక్కువగా ఉండకూడదు. అందువల్లే కథానిక రచనలో నిగ్రహం ఎక్కువ అవసరం.

**శిల్పం**

కథను నిర్మించే పద్ధతిని, లేక మలచే పద్ధతిని శిల్పం అనవచ్చు. అంటే రచయిత కథను తాను, ఎట్లా చూసి (దర్శించి) పాఠకులకు ఎట్లా చెబుతున్నాడు అనేది. సన్నివేశాలు ఎట్లా కల్పించాలి, ఏ సన్నివేశం తరవాత దేనిని కూర్చాలి అనేది భావన చేసి వాటిని ఆ విధంగా మలచి ముగించడం; ఎత్తుగడ, ముగింపు. నడక, పాత్రల మధ్య సంఘర్షణ, ఆ సంఘర్షణ తీవ్రం కావడం అనేవి శిల్పంలో అంశాలు. సంఘర్షణ తీవ్రం కావడాన్నే ఉత్కర్ష, లేదా క్లైమాక్స్ అంటారు. కొన్ని కథానికలు దానితో అంతం కావచ్చు. కొన్ని ఇంకా ముందుకు సాగి క్లైమాక్స్ నుంచి విడివడి ముగింపుకు దారితియ్యవచ్చు. కొన్ని కథానికలు ఎత్తుగడలో ఆ కట్టుకుంటాయి. కొంత మంది అభిప్రాయం ప్రకారం అద్భుతమైన ముగింపు ఉండటం కథానికకు తప్పనిసరిగా ఉండవలసిన లక్షణం. కాని అన్ని మంచి కథలకు అద్భుతంతో కూడిన ముగింపు ఉండదు. అందువల్ల అటువంటి ముగింపు ఉండదు. అందువల్ల అటువంటి ముగింపు ఉండితీరాలన్న నియమంలేదు. కథను చివరనుంచి మొదలుపెట్టి వెనక్కి నడవడం. మధ్యలో ప్రారంభించి వెనక్కి నడిపి, మళ్ళీ ముందుకు నడవడం-ఇటువంటి పద్ధతులు ఎత్తుగడలో అవలంబిస్తారు.

కథనం అంటే కథ చెప్పడం. కథ చెప్పేవాడు కథకుడు. సాధారణంగా కథానికలలో రచయితే కథకుడుగా ఉంటాడు. అటువంటప్పుడు అన్ని పాత్రల ఆలోచనలను రచయిత వర్ణించడానికి వీలుంటుంది. అట్లా కాక ఒక్కొక్కసారి కథానికలోని ఒక పాత్ర తానే కథ చెప్పవచ్చు. అటువంటప్పుడు ఆ పాత్ర తన దృష్టి నుంచి ఇతర పాత్రలను గురించి చెబుతుంది.

కథానికను చక్కగా తీర్చగల మరో అంశం శైలి. కథానిక శైలిలో కథనూ, కథలో ఒక్కొక్క సన్నివేశాన్ని చెప్పడంలో రచయిత వాడే రచనా విధానం ఉంటుంది; పాత్రలు పలికే తీరు ఉంటుంది. కథ చెప్పడంలో ఉపయోగించే పదాలు, నిర్మించే వాక్యాలు, వాక్యాలలో విరుపులు, వాడే జాతీయాలు సామెతలు శైలిని నిర్ణయిస్తాయి. మంచి భావ లేకపోతే మంచి శైలి రాదు. మంచి భాష అంటే సంస్కృతమయంగా, పెద్ద సమాసాలతో ఉండే పూర్వపు కావ్యాల భాష (గ్రాంథికం) అనికాదు. కథానికలోని వస్తువుకు, పాత్రలకు, సన్నివేశాలకు తగినట్లుగా ఉండి, రచయిత ఉద్దేశాన్ని పూర్తిగా చెప్పగలిగేదే మంచి భాష.

శిల్పానికి ప్రాణం పోసేది శైలి. ఒక్కొక్క రచయితది ఒక్కొక్క శైలి. రచయితలో ప్రతిభ ఉండాలే గాని, ఎటువంటి విషయం అయినా, అది రాజకీయాలకు, విజ్ఞాన శాస్త్రాలకు, తత్వశాస్త్రానికి (Politics, Science, Philosophy) సంబంధించిన వస్తువయినా, సులభమైన భాషలో, చక్కటి పలుకు బళ్ళతో చెప్పవచ్చునని కొడవటిగంటి కుటుంబరావు, గోపీచంద్, చలం, రంగనాయకమ్మ వంటి వారి కథానికలు నిరూపిస్తాయి.

మంచి కథలలో రచయిత ఉద్దేశించిన లక్ష్యం పాఠకుడికి పరోక్షంగా తెలుస్తుంది. అంటే రచయిత కథలో 'ఇది చెప్పదల్చుకున్న నీతి' అని మాటలలో ఎక్కడా రాయడు. కథనంలో, పాత్రల సంభాషణలలో, వర్ణనలలో ఆ లక్ష్యం పరోక్షంగా, వ్యంగ్యంగా తెలుస్తుంది. అట్లా తెలియకుండా కథానికను అర్థం చేసుకోవడం మరీ క్లిష్టంగా ఉన్నా, అట్లాకాక రచయిత ప్రత్యక్షంగా రాసినా కథానిక లక్ష్యం నీరసించినట్లే. అట్లా లక్ష్యాన్ని సాధించడంలోను, శిల్పంలోను, శైలిలోను రచయిత నేర్పు కనబడుతుంది. ఎంత మంచి వస్తువు తీసుకున్నా నేర్పుగల రచయితే దానిని మంచి కథానికగా రాయగలుగుతాడు.

**ముఖ్య విషయ క్రోడీకరణ**

1. ఇంగ్లీషు చదువులవల్లా, మన జీవితంలో కలిగిన మార్పులవల్లా వచనంలో వెలసిన కొత్త ప్రక్రియ కథానిక.



BRAOU

2. తొలి కథానిక గురజాడ రాసిన దిద్దుబాటు 1910లో వెలువడింది
3. ఇంగ్లీషులోని short storyకి సమానార్థకమైన తెలుగుపదం కథానిక
4. కథానికకు క్లుప్తత అనేది ముఖ్య లక్షణం
5. కథానికలో వస్తువు, శిల్పం ముఖ్యమైన అంశాలు. వస్తువు అంటే దేన్ని గురించి రచయిత రాయదలుచుకున్నాడో అది. శిల్పం అంటే రాయదల్చుకున్నదాన్ని రాసే పద్ధతి
6. వస్తువు కథ అనే కట్టడానికి పునాది. పాత్రలు, సంఘటనలను కట్టడంలో ఉపయోగించే ఇటుకలతో పోల్చవచ్చు. కట్టేతీరు శిల్పం
7. వస్తువులో పాత్రలు, సన్నివేశాలు ఉంటాయి. వాటి వెనుక సమాజ జీవితం ఉంటుంది
8. శిల్పంతో వీటిని దిద్ది తీర్చే తీరు ఉంటుంది
9. శిల్పానికి ప్రాణం పోసేది మంచి శైలి
10. రచయిత ఉద్దేశించిన లక్ష్యం పరోక్షంగా తెలియాలే గానీ ప్రకటన లాగా ఉండకూడదు

## చదవదగిన పుస్తకాలు

1. తెలుగు కథ, ఆంధ్ర సారస్వత సమితి, మచిలీపట్నం, 1977.
2. కథలెలా రాస్తారు? (అనుభవాల సంపుటి) సంపాదకుడు : శార్వరి, వసుబుక్స్, మద్రాసు, **1975.**
3. నేనెందుకు వ్రాస్తున్నాను, సంకలనం : భరాగో, డా॥ అత్తలూరి నరసింహారావు, నవజ్యోతి పబ్లికేషన్స్, విజయవాడ, 1980.
4: అలసిన గుండెలు, రాచమల్లు రామచంద్రారెడ్డి, యుగసాహితి, ప్రొద్దుటూరు, 1982. (ఈ కథల పుస్తకంలో కథానికా; దాని శిల్పమూ అనే వ్యాసం ఉంది):

BRAOU

# అభ్యాసాలూ, ప్రశ్నలూ

1. కథానిక ఎప్పుడు, ఏ పరిస్థితుల్లో పుట్టింది?
2. కథానిక అంటే ఏమిటో తెల్పండి.
3. కథానికలో వస్తు శిల్పాలను గురించి రాయండి.
4. కథనం అంటే ఏమిటి?
5. ఈ పాఠంలో చదివిన అంశాల ఆధారంగా ముందు పాఠంలో అభ్యాసం చదివేపని కింద ఇచ్చిన కథలపై వ్యాఖ్య రాయండి.
6. మీరు చదివిన ఒక కథను ఆధారం చేసుకొని కథానిక లక్షణాలతో సమన్వయించండి.

ఖండిక 19 పాఠం 38

# కథానిక భేదాలు

**ఉద్దేశం**

తెలుగులో విస్తృతంగా వెలువడిన, వెలువడుతున్న కథానికలలోని వివిధ భేదాలను స్థూలంగా పరిచయం చేయడం.

**ప్రణాళిక**

1. తెలుగులో కథానికల వ్యాప్తి
2. కాలక్షేప (జనరంజక) కథాసాహిత్యం; జీవిత వ్యాఖ్యాన కథాసాహిత్యం
3. గ్రామీణ జీవిత కథలూ; పట్టణ, నగర జీవిత కథలూ
4. ఆధునిక ప్రామాణిక వచన కథలూ, మాండలిక కథలూ
5. ముఖ్యవిషయ క్రోడీకరణ
6. అభ్యాసాలూ, ప్రశ్నలూ

BRAOU

తెలుగు కథానికకు గురజాడ ఆద్యుడు. ఆయన తెలుగులో రాసిన కథలు నాలుగు: 1. దిద్దుబాటు 2. దేవుడు చేసిన మనుష్యుల్లారా, మనుషులు చేసిన దేవుళ్ళారా మీ పేరేమిటి; 3. పెద్దమసీదు 4. మెటిల్డా. సంస్కర్త హృదయం అనే ఒక్క కథను ఇంగ్లీషులో రాశాడు. తప్పుదారిన పోతున్న భర్తను విద్యావంతురాలైన భార్య దిద్దుకున్న కథ దిద్దుబాటు. మతశాఖాకలహాల వెనుకగల కరడుగట్టిన స్వార్థాన్నీ, జిత్తులనూ, బూటకాన్నీ ఎత్తిచూపిన కథ మీపేరేమిటి. మత విద్వేషాన్ని సమస్యగా చిత్రించిన కథ పెద్ద మసీదు. అనుమాన పిశాచి అయిన ముసలి మొగుడూ, అందమైన పడుచు భార్య-ఈ సమస్యను చిత్రించిన కథ మెటిల్డా. వస్తువులో ఈ విధంగా గురజాడ సమకాలిక సాంఘిక సంస్కరణ సమస్యలను తీసుకోవడమే కాకుండా, ఆ సమస్యలలోని వాస్తవాన్ని ఆయన చిత్రించాడు. ఆయన జీవిత అవగాహనలో విమర్శ కన్పిస్తుంది. వస్తువులో శిల్పంలో, భాషలో, కథనంలో ఆయన నూటికి నూరుపాళ్ళు వాస్తవికతను సాధించి, తెలుగుకథానిక కాలక్షేపానికి కాదు. జీవితాన్ని వ్యాఖ్యానించేందుకు, మార్చేందుకు అని నిరూపించాడు.

**తెలుగులు కథానికల వ్యాప్తి**

అప్పటి నుండీ గడిచిన 73 సంవత్సరాల్లో వేలాది కథలు వచ్చాయి. దిన, వార, మాసపత్రికలు పెరిగే కొద్దీ, విద్యాశాతం పెరుగుతున్న కొద్దీ, మధ్య తరగతి పాఠకులు పెరిగే కొద్దీ కథలు కూడా అధిక వ్యాప్తిలోకి వచ్చాయి. కథల పోటీలు యువ కథకులను ప్రోత్సహించాయి. ఈ రోజుల్లో ఏడాదికి మూడు వేల కథలు వెలువడుతున్నాయని ఒక అంచనా. కథానిక ఎక్కువ పాళ్ళు జనరంజక సాధనంగా తయారయినప్పటికీ, సమకాలిక ఉద్యమాల ప్రభావంతో (సంఘ సంస్కరణోద్యమం, జాతీయోద్యమం, కాల్పానికోద్యమం, అభ్యుదయోద్యమం మొదలైనవి) సమాజం మార్పుకు తోడ్పడే సాధనంగా కూడా తయారయింది. కథానిక ఆకర్షించినంతమంది రచయితలను మరే ఆధునిక వచన ప్రక్రియ ఆకర్షించలేదు. కథానికల్లోని వైవిధ్యం కూడా మరే ఇతర ప్రక్రియల్లోనూ లేదు.

ఈ సందర్భంగా తెలుగు కథా వికాసానికి తోడ్పడిన ప్రముఖ రచయితలు కొందరిని గుర్తుంచుకోండి. చింతా దీక్షితులు, చలం, మునిమాణిక్యం నరసింహారావు, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి, మల్లాది రామకృష్ణశాస్త్రి, కొడవటిగంటి కుటుంబరావు, గోపీచంద్ బుచ్చిబాబు, పాలగుమ్మి పద్మరాజు, కరుణ కుమార, మా గోఖలే, దాగంటి సోమయాజులు, రామశాస్త్రి, కాశీ పట్నం రామారావు, రంగనాయకమ్మ, మధురాంతకం, రాచమల్లు రామచంద్రారెడ్డి, పురాణం సుబ్రహ్మణ్యశర్మ మొదలైన వాళ్ళ కథలలో వైవిధ్యం ఇతి వృత్తంలో, శిల్పంలో, కథనంలో, శైలిలో ఎంతో కన్పిస్తుంది.

## కాలక్షేప కథా సాహిత్యం, జీవిత వ్యాఖ్యాన కథా సాహిత్యం

తెలుగు కథానికలను సాహిత్య ప్రయోజన దృష్టితో రెండు రకాలుగా విభజించవచ్చు. అవి 1. కాలక్షేప కథలు 2. జీవితాన్ని వ్యాఖ్యానించే కథలు. కాలక్షేప కథలనే వినోద కథలనీ, ఉబుసుపోక కథలనవచ్చు. అవి పిప్పరమెంటు బిళ్ళల్లాంటివి. మన పెరుగుదలకు తోడ్పడే బలవర్ధకమైన ఆహారం లాంటివి కావు. జీవితం లోని సమస్యలను మానవ ప్రయత్నంతో ఎదుర్కోకుండా, వాటి నుంచీ తప్పుకునే మనస్తత్వాన్ని ఈ కథలు పెంపొందిస్తాయి. తెలుగులోనే కాదు, ప్రపంచంలోని చాలా భాషల్లో వీటికి వ్యాప్తి ఉంది. ఆదరణ కూడా ఉంది. ముఖ్యంగా కృత్రిమ సమస్యలతో బాధపడే అబ్బాయి అమ్మాయి కథలు ఈ తరగతికి చెందినవి. మనుష్యుల జీవితంలో కన్పించని డిటెక్టివులూ, జానపదకథల్లోని వీరుల్లాంటి సాహసవీరులతో నిండిన కథలుగూడా ఈవర్గంలోవే. రెండవరకం జీవితాన్ని వ్యాఖ్యానించేవి. జీవిత సమస్యలను ఒక జీవిత దృక్పథం నుంచీ చూచి వాస్తవికంగా చిత్రం చేవి. వాస్తవికత అంటే సంఘ వాస్తవికత, వ్యక్తులమీద ప్రభావం చూపే సంఘ శక్తులను, సంఘ చరిత్రలో భాగంగా అర్థం చేసుకుంటూ సంఘాన్ని, సంఘ జ్ఞానాన్ని పెంచడానికి తోడ్పడే వాస్తవికత. అయితే తెలుగులో చాలా కథలు సంఘం ఇట్లా ఉంది అని విమర్శించినవే ఎక్కువ. ఇట్లా ఉన్న సంఘ సంస్కారం ఇట్లా మారాలి అని చెప్పిన కథలు తక్కువ. చలం, గోపీచంద్, కుటుంబరావు, చాసో, రావిశాస్త్రి, కాశీపట్నం లాంటి కథకులు సంఘంలో మార్పు కోరుతూ కథలు రాశారు. ఈనాటి కొందరు యువ రచయితలు రాస్తున్నారు.

BRAOU

### జీవిత కథలూ, గ్రామీణ, పట్టణ, నగర జీవిత కథలూ

కథల్లో తీసుకున్న జీవితాన్ని బట్టి కథలను రెండు రకాలుగా విభజింపవచ్చు: 1. గ్రామీణ జీవితాన్ని చిత్రించిన కథలు 2. పట్టణ, నగర జీవితాన్ని చిత్రించిన కథలు, ఆంధ్ర దేశంలో ఎనభై శాతం ప్రజలు పల్లె పట్టుల్లో నివసించేవాళ్ళే. ఇటీవలి కాలంలో పట్టణాలు, నగరాలు అభివృద్ధి చెందుతున్నాయి. కథానికా రచయితలు తమ తమ ప్రాంతాల గ్రామ సీమల్లోని కర్షకులూ, ఇతర వృత్తి పనివాళ్ళ జీవితాన్ని చిత్రించారు. మరి కొందరు పట్టణ, నగర జీవితంలోని మధ్య తరగతి జీవితాన్ని ప్రధానంగానూ, ఇతర వర్గాల జీవితాన్ని అప్రధానంగానూ చిత్రించారు. పట్టణాల్లో ఇటీవల పెరుగుతున్న అధో జగత్తుకు (వ్యభిచారులు, పిక్‌పాకెటీర్లు, జూదగాండ్రూ మొదలైన వారితో నిండిన ప్రపంచం, పొట్ట కూటి కోసం నానా పనులు చేసే వాళ్ళ ప్రపంచం, ప్రమాద వర్గ ప్రపంచం) సంబంధించిన జనం జీవితాన్ని కొందరు చిత్రించారు. 26వ పాఠంలో ఆయా మాండలికాలలో రాసిన కొందరు కథకులను పేర్కొన్నాము. వాళ్ళు తమ మాండలికాలు వాడడమే కాదు. మన ప్రాంతాల గ్రామీణ జీవితాన్ని కూడా చిత్రించారు. గ్రామీణ జీవితాన్ని చిత్రించిన కథకులు ప్రధానంగా ఆర్థిక పీడనకు గురి అవుతున్న రైతుల సమస్యలను, కులపీడనకు గురి అవుతున్న హరిజనుల సమస్యలను చిత్రించారు. రాయలసీమ జీవితాన్ని చిత్రించిన కథల్లో మనిషికి శత్రుస్థానంలో నిలిచిన ప్రకృతినీ, సమాజాన్నీ చిత్రించారు. కళింగాంధ్ర కథల్లోనూ తెలంగాణా కథల్లోనూ ప్రధాన సమస్య ఆర్థిక పీడన. పట్టణ, నగర జీవిత కథల్లో కొన్ని ప్రధాన సమస్యలు

కన్పిస్తాయి. అవి 1. కుటుంబ జీవితంలో సనాతన సంస్కారానికి ఆధునిక సంస్కారానికీ మధ్య ఘర్షణ 2 నిరుద్యోగం 3. ఉద్యోగ జీవిత కష్ట నష్టాలు 4. పెచ్చు పెరిగిపోతున్న అథోజగత్తు, దానితో ముడిపడిన ఉద్యోగ ప్రపంచం, రాజకీయ ప్రపంచం. 5. ఏకాకితనం. 6. స్త్రీల ఆగచాట్లు 7. పిల్లల సమస్యలు.

కథల్లో ఉపయోగించే శైలినిబట్టి కథలను రెండు రకాలుగా విభజించుకోవచ్చు. మొదటిరకం ఆధునిక ప్రామాణికంలో రాసిన కథలు. రెండవరకం కేవలం ఏదో ఒక ప్రాంతీయ మాండలికంలో రాసిన కథలు. ఆధునిక ప్రామాణికంలో కథ చెబుతూ పాత్రల నోట మాండలిక భాష పలికించడం చాలా కథల్లో కన్పిస్తుంది. కథా రచయిత తీసుకునే జీవితం మీదా, చేసే పాత్ర చిత్రణమీదా, చిత్రించే వాతావరణంమీదా ఏ భాష వాడాలి అనేది నిర్ణయవుతుంది. ఇటీవల మాండలిక జీవిత చిత్రణకు ప్రాధాన్యమిస్తున్న రచయితలు మాండలికాల్లో రాస్తున్నారు. కథనంలో, శైలిలో జానపద కథకులచేత ప్రభావితులై సారళ్యాన్నీ, నాటకీయతనూ, జీవాన్నీ, కథల్లో తీసుకొని వచ్చే ప్రయత్నాలు చేస్తున్నారు.

ఈ పాఠంలో ఇంతవరకు తెల్పినవి స్థూలమైన భేదాలు మాత్రమే. సూక్ష్మ విచారణ చేస్తే, మరికొన్ని అవాంతర భేదాలు కథల్లో కనిపిస్తాయి. ఉదాహరణకు లేఖల్లో రాసిన కథలు, మనస్తత్వ చిత్రణ ప్రాధాన్యమున్న కథలు, కాలాన్ని వస్తువుగా చిత్రించినకథలు, డిటెక్టివ్ కథలు, భయానక కథలు, చారిత్రక కథలు, ప్రతీక కథలు, వ్యంగ్య కథలు, అధిక్షేప కథలు, అన్యాపదేశ కథలు, విజ్ఞాన కల్పనా కథలు (science fiction) అకథానికలు (anti-stories) మొదలైనవి. కథానికా సాహిత్యాన్ని విరివిగా చదివేకొద్దీ, వాటిని నిశితంగా పరిశీలించే కొద్దీ, ఈ అవాంతర భేదాలు మీకు అర్థమవుతాయి. వాటి వైవిధ్య ప్రయోజనం కూడా అవగత మవుతుంది.

BRAOU

**ముఖ్యవిషయ క్రోడీకరణ**

1. తెలుగు కథానికకు ఆద్యుడు గురజాడ. కథలద్వారా జీవితాన్ని వ్యాఖ్యానించేందుకు, మార్చేందుకు ప్రయత్నించిన తొలి కథకుడు ఆయన. సంఘ సంస్కారాన్ని ముందుకు నడిపించిన కథకుడు ఆయన.
2. తెలుగులో కథానికల వ్యాప్తి, పత్రికల వ్యాప్తితో బాటు జరిగింది. పత్రికల ద్వారా ఎక్కువపాళ్లు వినోద కథలు వచ్చాయి. సమకాలిక ఉద్యమాల ప్రభావంతో సమాజం మార్పుకు తోడ్పడే కథలను కూడా పత్రికలు ప్రోత్సహించాయి.
3. సాహిత్య ప్రయోజన దృష్టితో కథలు రెండురకాలు: 1. కాలక్షేపకథలు 2. జీవితాన్ని వ్యాఖ్యానించే కథలు, మార్చేకథలు.
4. కథల్లో తీసుకున్న జీవితాన్ని బట్టి కథలు రెండురకాలు: 1. గ్రామీణ జీవితాన్ని చిత్రించేవి. 2. పట్టణ నగర జీవితాన్ని చిత్రించేవి.
5. కథల్లో ఉపయోగించే రచనా విధానాన్ని బట్టి కథలు రెండురకాలు. 1. ఆధునిక ప్రామాణికంలో రాసినవి. 2. మాండలికంలో రాసినవి.
6. పాఠంలో చెప్పిన భేదాలేకాక కథల్లో ఎన్నో అవాంతర భేదాలున్నాయి.

## అభ్యాసాలూ, ప్రశ్నలూ

1. సమకాలిక సాంఘిక సమస్యలను తీసుకున్న తొలికథకుడెవరు? ఆయన రాసిన కథలేవి? ఆ కథల్లో చిత్రించిన సమస్యలేవి.
2. తెలుగులో కొందరు ప్రముఖ కథా రచయితలను పేర్కొనండి.
3. ఈ పాఠంలో పేర్కొన్న కథానిక భేదాలుగాక, మీ దృష్టికి వచ్చిన భేదాలను పేర్కొనండి.

4. ముందు పాఠాల్లో అభ్యాసాలూ చదివేపనిలో ఇచ్చిన కథలు చదివి అవి ఏ తరగతి చెందుతాయో రాయండి.
5. రాచకొండ విశ్వనాథశాస్త్రి మోసం కథలోని మాండలిక భాషపై మీ వ్యాఖ్య రాయండి.
6. మీరు చదివిన ఒక కథను పేర్కొని, అందులోని శైలీ వైవిధ్యంపై ఒక వ్యాఖ్య రాయండి.

**చదవదగిన కథానికా సంపుటులు**


1. తొలినాటి తెలుగు కథలు 1936-45, (సంపాదకుడు: మధురాంతకం రాజారాం), ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ, హైదరాబాదు 1978.
2. ఒక దశాబ్ది తెలుగు కథలు (సంకలనకర్త: మధురాంతకం రాజారాం), ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ, హైదరాబాదు, 1980.
3. కథాభారతి తెలుగు కథానికలు (సంకలనం: వాకాటి పాండురంగరావు, పురాణం సుబ్రహ్మణ్యశర్మ) నేషనల్ బుక్ ట్రస్ట్, కొత్తఢిల్లీ, 1973.
4. నూట పదహార్లు (సంకలనం: తాళ్లూరి నాగేశ్వరరావు, హితశ్రీ, విశాలాంధ్ర, విజయవాడ.
5. తెలుగు కథా రచయితలు, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ, హైదరాబాదు, 1982.


BRAOU

ఖండిక 20 పాఠం 39

# నాటక రచన పరిచయం

# నాటకం, నాటిక స్వరూప స్వభావాలు

**ఉద్దేశం**

నాటకం, నాటిక ఏ పరిస్థితులలో తెలుగులో పుట్టాయో స్థూలంగా తెల్పడం. వాటిలక్షణాలనూ వాటి మధ్యగల భేదాలనూ పరిచయం చేయడం.

**ప్రణాళిక**

1. నాటకం అంటే
2. తెలుగులో అనువాద నాటకాలు, స్వంతంత్రనాటకాలు
3. నాటకస్వరూపం
4. నాటిక స్వరూపం
5. ఏకాంకిక స్వరూపం
6. నాటకాల్లో భాష
7. ముఖ్యవిషయ క్రోడీకరణ

**నాటకం అంటే**

చూసే ప్రక్రియ నాటకం. నటులు, ఒక కథలోని పాత్రల వేషాలువేసుకొని, ఆ పాత్రలు చెయ్యవలసిన చేతలు చేస్తూ, మాటలు మాట్లాడుతూ, ఆకథ తమ కళ్ళ ఎదుట నిజంగానే జరుగుతున్నదన్న భావం లేదా అనుభూతి ప్రేక్షకులకు నాటకంద్వారా కలిగిస్తారు. అందువల్ల మన ప్రాచీనులు నాటకాన్ని దృశ్యకావ్యం అనిఅన్నారు. పాత్రల మాటలద్వారా, హావభావాలద్వారా కథను నటింపచేసే రచననే మనం ఈ రోజుల్లో నాటకం అని పిలుస్తున్నాము.

**తెలుగులో అనువాద నాటకాలు; స్వతంత్ర నాటకాలు**

స్వతంత్రనాటకాలు తెలుగు సాహిత్యంలో ఇటీవల కాలంలోనే వచ్చాయి. తెలుగు సాహిత్యం మనకు దొరికినంత వరకు నన్నయ భారతంలో మొదలైయింది. నన్నయ భారతం సంస్కృతభారతానికి అనువాదం. ఆ తర్వాత వచ్చిన తెలుగు కావ్యాలలోని మూలకథలు కూడా సంస్కృతంలోని పురాణలకథలే. సంస్కృతంలో క్రీ. శ. 1వ శతాబ్దంనుంచి నాటకాలు ఉన్నా, తెలుగులో మాత్రం 19వ శతాబ్దందాకా నాటకాలు రాలేదు. పైగా సంస్కృతంలోని నాటకాలను తెలుగులో కవులు కావ్యాలుగానే రాశారు.

1860లో కోరాడ రామచంద్రశాస్త్రిగారు రాసిన 'మంజరీ మధుకరీయం" అనేది ఇప్పటి తెలుగు సాహిత్యంలో మొదటి నాటకం 1897లో వచ్చిన గురజాడగారి 'కన్యాశుల్కం' తెలుగులో మొట్టమొదటి స్వతంత్ర సాంఘిక నాటకం. అటువంటి నాటకం అప్పటికి భారతీయ భాషల్లోనే పుట్టలేదని చెప్పవచ్చు. సంఘసంస్కరణకు, భాషాసంస్కరణకు తలపెట్టిన ఉద్యమంలో భాగంగా వచ్చిన నాటకం కన్యాశుల్కం. అప్పటికే మద్రాసు విశ్వవిద్యాలయం ఒకటి కొత్తగా ఏర్పడింది. దానితో షేక్స్పియర్ నాటకాలు తెలుగు వాళ్ళకు పరిచయం అయినాయి. సంస్కృతం, ఇంగ్లీషు నాటకాల ప్రభావంతో తెలుగులో ఇంగ్లీషు, సంస్కృతం నాటకాల అనువాదాలు.



BRAOU

స్వతంత్ర నాటకాలు వచ్చాయి. షేక్స్పియర్ నాటకాలలాగా విషాదాంత నాటకాలు (Tragedies), మోదాంత నాటకాలు (Comedies) మొదలైనాయి. 1900 సంవత్సరం తరువాత వృత్తి నాటక సమాజాలు మొదలైనాయి. అంటే నాటకం వెయ్యడమే వాళ్ళవృత్తిగా పెట్టుకొని ఊరూరా తిరిగి నాటకాలు ప్రదర్శించే వాళ్ల గుంపుగా ఏర్పడిన సమాజాలన్నమాట. ఈ సమాజాల్లోని నటులను, ప్రదర్శన యోగ్యతను దృష్టిలో ఉంచుకొని, కేవలం ప్రదర్శన కోసమే నాటకాలు రాయడం అప్పటినుంచి మొదలయింది. ఈ కాలంలోనే చారిత్రక నాటకాలు బాగా వచ్చాయి. 1920 తరవాత ఏకాంకికలు (ఏకాంకికలు అంటే ఒకే అంకంగల నాటకాలు అని అర్థం) బాగా ప్రచారం అయినాయి. 1944 తరవాత నాటకాలు, నాటికలు రాసేవాళ్ళ సంఖ్య బాగా పెరిగింది. వాళ్ళకి ప్రోత్సాహం కలిగించడానికి నాటకాలూ నాటికల పోటీలు ఎన్నో జరిగాయి. ఇప్పటికీ జరుగుతూనే ఉన్నాయి.

పూర్వం భరతముని అనే ఆయన సంస్కృత నాటకాలు విభజించి వాటి లక్షణాలు రాశాడు. అవి పది రకాలని వర్ణించాడు. వాటిని దశరూపకాలు అంటారు. కంటికి కనపడేది కనుక నాటకాన్ని రూపకం అని అన్నారు. ఇప్పుడు అన్ని రకాల నాటకాలనూ రూపకాలు అని కూడా అంటున్నారు. అయితే భరతముని దశరూపకాలకి చెప్పిన లక్షణాలను, ఇప్పటి తెలుగు నాటకాలకు, నాటికలకు కుదరవు. ఇప్పటి తెలుగు నాటకాలు చాలవరకు ఇంగ్లీషు సాహిత్యం ప్రభావంవల్ల వచ్చినవే.

**నాటక స్వరూపం**

నాటకానికి, నాటికకు ముఖ్యమైన తేడా విస్తృతిలో ఉంది. నాటకం కంటె నాటిక చిన్నది నిర్మాణం విషయంలో నవలకు కథానికకుఉన్న తేడాయే నాటకానికి నాటికకు ఉంది కాని నాటకాన్ని కుదిస్తే నాటిక అవుతుందని అనుకోకూడదు. దేనికదే ప్రత్యేకమైనది ఒక మనిషి జీవితాన్నిగాని జీవితంలో ముఖ్య ఘట్టాలు జరిగిన కొంతకాలాన్నిగాని చెప్పడానికి నాటకం నవలవంటి విస్తృతమైన ప్రక్రియల్లో అవకాశం ఉంటుంది. మనిషి జీవితంలో జరిగే ముఖ్యమైన ఒకటి రెండు ఘట్టాలను చెప్పడానికి నాటిక కథానికవంటి ప్రక్రియలు ఉపయోగపడతాయి. నాటకం నాటిక పూర్తిగా వేరు వేరు స్వభావం కలవడానికి ఇదొక నిదర్శనం.

BRAOU

నాటకంఅంతా విరామంలేకుండా ఏకబిగిని సాధారణంగా ప్రదర్శించరు. మధ్యలో చూసేవారికి, విశ్రాంతి కోసంగానీ; రంగస్థలంమీద ప్రదర్శించడానికి వీలులేనిది. అవసరమైనవి తీసెయ్యడానికిగాని నాటకాన్ని కొన్ని భాగాలుగా విభజిస్తారు. అట్లాంటి ఒక్కొక్క కథాభాగాన్ని అంకం అంటారు మళ్ళీ ఒక్కొక్క అంకంలోని కథను వీలుకోసం కొన్ని దృశ్యభాగాలుగా విభజించవచ్చు. ఇటువంటి దృశ్యాలను రంగాలు అంటారు.

నాటక పరిభాషలో 'రంగం' అనేదానికి రెండు అర్థాలున్నాయి. నటులు నటించే రంగస్థలప్రదేశం అనేది ఒక అర్థం. అంకంలో విభజించిన దృశ్యభాగం అని ఇంకొక అర్థం. నాటకంఅనేది అయిదునుంచి పది అంకాల నిడివి ఉండాలనేది సంస్కృత నాటకాలకున్న లక్షణం. తెలుగులో నాటకాలు మొదలైనప్పుడు అనువాదాలే వచ్చాయికనుక, షేక్స్పియర్ నాటకాల ప్రభావం వల్ల అవి అయిదు అంకాలతో ఉండేవి. తరవాత తరవాత తెలుగు నాటకాలు నాలుగంకాలు. మూడంకాలు కూడా అయ్యాయి. తెలుగు నాటకాల ప్రదర్శన మొదలైనప్పుడు ఆ నాటకాలు రాత్రి తెల్లవార్లూ నడిచేవి. ఇప్పటి తెలుగు నాటకం సుమారు రెండు మూడు గంటల సమయం పడుతుంది. ఈ మధ్యకాలంలో నాటక రచయితలు 'అంకం' అనేదాన్ని వదలేసి, మొత్తం నాటకం అంతటినీ 'రంగాలు' గా విభజిస్తున్నారు. నాటకాలలో స్థలం, కాలం మారతాయి.

తెలుగు నాటకాలు మొదలైనప్పుడు కఠినమైన భాషతో, పెద్దవర్ణనలతో ఉండేవి. వర్ణనలకు ఉపయోగపడటానికి వందలకొద్దీ పద్యాలు, పాటలుఉండేవి. 1889 లో ఒక మహారాష్ట్ర నాటక సమాజం తెలుగుదేశంలో చాలా ఊళ్ళలో నాటక ప్రదర్శన ఇచ్చింది. ఆ ప్రోత్సాహంతో రాజమండ్రిలో కందుకూరి వీరేశలింగంగారు తాను రాసిన 'రత్నావళి' అనే నాటకాన్ని మొదటిసారిగా ఆడించారు. ఆ తర్వాత నాటకాల ప్రదర్శన ఉధృతంగా సాగించింది బళ్ళారిలోని ధర్మవరం రామకృష్ణాచార్యులు అనే ఆయన, ఆయనే తెలుగు నాటకాల్లో పద్యాలు పాడే

సంప్రదాయాన్ని ప్రారంభించారు. ఇట్లా పద్యాలు పాడటం తెలుగు నాటకాల్లో తప్ప ఇతర భారతీయ భాషల్లో లేదు.

నాటిక స్వరూపం నాటకం కంటె చిన్నది. దీనిలో రెండు, ఒక్కొక్కసారి మూడు అంకాలుంటాయి. స్థలం, కాలం మార్పు ఉండవచ్చు. అయిదు లేక ఆరు రంగాలు ఉండవచ్చు. సుమారు గంట సమయంలో పూర్తి అవుతుంది. మనిషి సంఘంలో ఎదుర్కొనే సమస్యలు, స్త్రీలకు సంబంధించిన సమస్యలు చెప్పడానికి తెలుగులో నాటిక బాగా ఉపయోగపడింది. నాటకంలోలాగా విస్తృతిని పెంచడానికి కథను అనవసరంగా పెంచి, పద్యాలను చేర్చి, అనవసరంగా హాస్యం చొప్పించి, నాటకంలోని పట్టును తగ్గించకుండా, రచయిత చెప్పదల్చుకున్న విషయం సూటిగా, క్లుప్తంగా ప్రేక్షకులమీద బాగా ముద్రపడేట్లుగా చెప్పడానికి నాటిక ఉపయోగపడింది.

## ఏకాంకిక స్వరూపం

ఏకాంకిక అనేదానికి సంక్షిప్తంగా ఉండటం ముఖ్యమైన లక్షణం. ఏకాంకిక పేరు సూచించినట్లు ఒకే అంకం గలది. దీనిలో ఎక్కువ పాత్రలు ఉండవు. ఒకటే రంగం ఉంటుంది. దీనిలో కథ ఒకే విషయాన్ని చెప్పేదై ఉండాలి. అంటే ఏకాంశవ్యగ్రత ఉండాలి. అంతేకాక, దీనిలో కథ దానికదిగా సంపూర్ణంగా ఉండాలి. అంటే ఇంకా కొంత కథ నడిస్తేగాని, ఇంకా కొంత విషయం రచయిత చెబితేగాని ఏకాంకిక ముగియదు. అర్థంకాదు అనే భావం రాకుండా ఉండాలి. ఏకాంకికలో కథ నడిచే స్థలంలో మార్పు ఉండదు. ఇక కాలం – నిజ జీవితంలో ఆ కథ జరగడానికి ఎంతసేపు పడుతుందో, ఏకాంకికలో కూడా అంతేకాలం పడుతుంది. సాధారణంగా ఏకాంకిక 20 నిమిషాల్లో గాని, 30 నిమిషాల్లోగాని, ఒక్కొక్కసారి 45 నిమిషాలల్లో గాని పూర్తి అవుతుంది.

ప్రహసనం అంటే పెద్ద నవ్వుపుట్టించేది అని అర్థం. ప్రహసనాలు చాలవరకు ఏకాంకికలే. ఇంగ్లీషు సాహిత్యం ప్రభావంతోనే ఇవి తెలుగులో మొదలయ్యాయి. సంఘంలో మూఢనమ్మకాలు దురాచారాలు అపహాస్యం చెయ్యడానికి ఈ ప్రహసనాలు మొదట వీరేశలింగంగారు ప్రారంభించారు.

BRAOU

తెలుగులో ఏకాంకిక, నాటిక, ప్రహసనం, మూడింటినీ సాధారణంగా ఇప్పుడు నాటిక అనే పేరుతోనే వ్యవహరిస్తున్నారు.

## నాటకాల్లో భాష

విజ్ఞాన శాస్త్రం ఎంతో పెరిగింది. దానివల్ల మనుషుల ఆలోచనలో మార్పు వచ్చింది. దాని ఫలితంగా జీవన విధానంలో చాలా మార్పులు వచ్చాయి. ఆ మార్పులన్నీ సాహిత్య ప్రక్రియల్లో కనపడుతూ ఉంటాయి. సామాన్య మనుషుల జీవితం, వాళ్ళ జీవితంలో సమస్యలు చిత్రించడమే, పరిష్కారం సూచించడమే సాహిత్య ప్రక్రియలు చెయ్యవలసిన అని అనే భావం బాగా ఏర్పడింది. అందువల్ల సాహిత్యం ఇదివరకటిలాగా పండితులకు, జమీందారులకు పరిమితం కాదు. కేవలం సాహిత్యం చదివి ఆనందించడానికే అన్న అభిప్రాయాలు మారిపోయాయి. సామాన్యులలోకి సాహిత్యం వచ్చేసింది. అందుకు అనువైన ప్రక్రియలే కథానిక, నాటిక ప్రహసనం, నవల మొదలైనవి. అందుకే వీటిలోని భాష వినగానే అర్థమయ్యేటంత సరళంగా ఉండటం ప్రధాన లక్షణమయింది. అంతేకాక, రోజువారీ జీవితంలో సామాన్య ప్రజలు మాట్లాడే భాషే 'శిష్టవ్యావహారికం' అనే పేరున ఒక నిర్దిష్ట రూపం పొంది పత్రికలవల్ల బాగా ప్రచారం అయ్యింది. ముఖ్యంగా నాటకాల్లో, నాటికల్లో, కథ అంతా పాత్రల సంభాషణ ద్వారానే జరుగుతుంది కనుక, ఆయా పాత్రలకు ఉచితమైన భాష ఆయా పాత్రల చేత పలికించడం అనేది ముఖ్యమైన లక్షణమయింది. ఉదాహరణకి, ఒక నాటికలో ఏమీ చదువుకోని ఒక పల్లెటూరి మనిషి గ్రాంధిక భాషలో సంభాషణ చెప్పినట్లు రచయిత రాస్తే, ఆ నాటిక లక్ష్యమే దెబ్బతిని హాస్యాస్పదం అవుతుంది.

ముఖ్యవిషయక్రోడీకరణ

1. చూసే ప్రక్రియ నాటకం, అందువల్లనే మన ప్రాచీనులు ఈ ప్రక్రియను దృశ్యకావ్యమని పిలిచారు.
2. తెలుగులో 19 వ శతాబ్దం దాకా నాటక సాహిత్యం లేదు. మొదట్లో అనువాద నాటకాలు వచ్చాయి. తర్వాత స్వతంత్ర నాటకాలు వచ్చాయి.
3. గురజాడ కన్యాశుల్కం తెలుగులో వెలువడిన మొట్టమొదటి స్వతంత్ర సాంఘిక నాటకం, అది 1897 లో వచ్చింది. తెలుగులో వచ్చిన మొదటి నాటకం కోరాడ రామచంద్రశాస్త్రిగారు రాసిన మంజరీ మధుకరీయం.
4. నాటకం, నాటికకు ముఖ్యమైన తేడాలు : 1. విస్తృతి. 2. జీవిత ఘట్టాలను చిత్రించడంలో పరిమితి
5. ఏకాంకిక ఒకటే అంకంగల నాటిక. ప్రహసనం నవ్వుపుట్టించే నాటిక. ఈ రోజుల్లో ఏకాంకిక, నాటిక, ప్రహసనం ఈ మూడింటినీ నాటికే అంటున్నారు.
6. నాటకాల్లో, నాటికల్లో ప్రజల జీవిత చిత్రణ ఎంత ముఖ్యతమో, ప్రజల భాషను చిత్రించడం కూడా అంతేముఖ్యం.

## అభ్యాసాలూ, ప్రశ్నలూ

1. నాటకం అంటే ఏమిటి ?
2. నాటకం, నాటిక, ఏకాంకిక, ప్రహసనం-వీటి మధ్య భేదసాదృశాలను తెల్పండి.
3. నార్ల 'శకునపక్షి' నాటిక లక్షణాలను ఈ పాఠంలో చదివిన అంశాలు దృష్టిలో పెట్టుకొని సమీక్షించండి.

BRAOU

ఖండిక 20 పాఠం 40

# నాటకాల్లో, నాటికల్లో భేదాలు

**ఉద్దేశం :**

నాటకాల్లో, నాటికల్లో వాటి స్వరూపస్వభావాలనుబట్టి ఎన్నిరకాలుగా విభజించవచ్చునో తెల్పడం.

**ప్రణాళిక :**

1. దృశ్యం, శ్రవ్యం
2. రూపాన్నిబట్టి విభజన
3. వస్తువును బట్టి విభజన
4. జనరంజకత్వం
5. ముఖ్యవిషయ క్రోడీకరణ
6. అభ్యాసాలూ. ప్రశ్నలూ

**దృశ్యం, శ్రవ్యం**

నాటకాన్ని రంగస్థలంమీద ప్రదర్శించవచ్చు. ఇట్లా ప్రదర్శించినపుడు అది దృశ్యమవుతుంది.

రేడియో మనకి బాగా ప్రచారం అయిన తర్వాత నాటకాన్ని వినిపించడం జరుగుతోంది. వినడానికేగాని చూడటానికి కుదరదు. అప్పుడు నాటకం శ్రవ్యమవుతుంది. అందువల్ల రేడియోలోవచ్చే నాటకాలను, నాటికలను శ్రవ్యనాటకాలని, శ్రవ్యనాటికలని పిలుస్తున్నారు. శ్రవ్యనాటకాలలో, శ్రవ్యనాటికలలో నటుల చేష్టలూ ముఖభావాలూ కనపడవు. కనుక అవి అన్నీ వాళ్ళుచెప్పే సంభాషణలలోనూ, కంఠస్వరంలోనూ కళ్ళకుకట్టినట్లుగా వినిపించాలి. అంటే రచయిత వినేవారి (శ్రోత) కళ్ళకుకనబడని నాటకంలోని వివరాలు. సంభాషణలలో అంటే వాచికంద్వారా తెలిసేటట్లు రాయాలి. కథలోని వాతావరణానికి సంబంధించిన వివరాలు కథనడకకు భంగం కలిగించకుండా అసందర్భంగా ఉండకుండా ఉండాలి. ఉదాహరణకు ఒక పేదవాడి ఇంట్లో కథ నడవ వలసి వుంటే అతను పేదవాడని, అతని యింటి పరిసరాలు, వివరాలు మొదటే శ్రోతకు అర్థం అయ్యే సంభాషణలతో నాటకం మొదలు కావాలి. అదే రంగస్థలంమీద ప్రదర్శించే నాటకం అయితే తెరతీయగానే పేదవాడిఇల్లే రంగస్థలంగా ప్రేక్షకుడికి కనబడుతూ ఉంటుంది. ఇది దృశ్యనాటకానికి, శ్రవ్యనాటకానికి ఉన్న ముఖ్యమైన భేదత తెలుగులో మొదటి శ్రవ్యనాటిక ముద్దుకృష్ణగారి అనార్కలీ.

తెలుగులో నాటకాలు ప్రారంభం అయిప్పుడే షేక్స్పియర్ నాటకాల ప్రభావం తెలుగులోకూడా విషాదాంత నాటకాలు, సుఖాంతనాటకాలు (Tragedies comedies) అని రెండు రకాలుగా నాటకాలు వచ్చాయి. పేర్లు సూచించినట్లే నాటకంలో కథ విషాదంతో ముగిస్తే విషాదాంత నాటకం, సుఖాంతమయితే అది సుఖాంత నాటకం. షేక్స్పియర్ నాటకాలే విషాదాంత, సుఖాంత నాటకాలుగా మొదట్లోనే తెలుగులోనికి అనువాదమయ్యాయి. అవేకాక "విషాదసారంగధర" వంటి తెలుగు కథలే నాటకాలుగా తెలుగులో వచ్చాయి.

**రూపాన్ని బట్టి విభజన :**

వీటిలో మరికొన్ని భేదాలున్నాయి. అవి 1) గద్యపద్యాత్మక నాటకాలు 2) గేయ నాటికలు. 3) వచన నాటికలు.

పాత్రల వచన సంభాషణలమధ్య పద్యాలు ఉన్నవాటిని గద్య పద్యాత్మక నాటకాలు అంటారు. నాటకాలు తెలుగులో మొదలైన తొలిరోజుల్లో అన్నీ చాలా వరకు ఇట్లాగే ఉండేవి. పద్యం పాటడం అనే పద్ధతిని పౌరాణిక

నాటకాల్లో ఇప్పటికికూడా చూడవచ్చు. మొత్తం పద్యాలతోనే నడిచిన నాటకాలుకూడా కొన్ని వచ్చాయి. వాటిలో సంభాషణలు సైతం పద్యాలే.

గేయనాటకాలు అంటే నాటకంలో పాటలు ఉండేవి; వీటిని సంగీతబద్ధంగా పాడుతారు.

వచన నాటకాలు పద్యాలు పాటలు లేనివి ఇటీవలి కాలంలో వచ్చేరంగస్థల నాటకాల్లో చాలాభాగం ఇటువంటివే.

ఇవి దృశ్యనాటకాలు కావచ్చు. ఈ రెండు రకాలు కాక నృత్యనాటకాలుకూడా కొన్ని వచ్చాయి. ఇవి గేయనాటకాలే. వీటిని రంగస్థలంమీద నృత్యాభినయంతో ప్రదర్శించి చూపుతారు.

**వస్తువును బట్టి విభజన :**

నాటకంలోని విషయం (దీన్నే వస్తువు అని పిలుస్తారు) ఆధారంగా నాటకాలను పౌరాణికాలు, చారిత్రకాలు, సాంఘికాలు అని విభజించవచ్చు.

పురాణకథలు ఆధారంగా వచ్చిన నాటకాలు పౌరాణిక నాటకాలు, తెలుగునాటకాలు మొదలై బాగా ప్రచారం పొందిన కాలంలో పౌరాణిక నాటకాలే ఎక్కువ. వీటిలో పద్యాలకు బాగా జనాదరణ లభించింది. తిరుపతి వేంకటకవులనే జంటకవులు రాసిన 'పాండవోద్యోగ విజయాలు' నాటకాలు, వాటిలోని పద్యాలు, ఎంత ప్రచారం పొందాయంటే ఆ రోజుల్లో చదువురానివాళ్ళ నోళ్ళలో సయితం నలిగాయి.

పౌరాణిక నాటకాల్లో మరొకరకం నాటకాలు వచ్చాయి. పురాణాలలోని కొన్ని కథలు మూఢనమ్మకాలే, తర్కానికి నిలిచేవి కావు; ఆ కథలు రాసినవారి పక్షపాత బుద్ధిని తెలిపేవి అని నిరూపిస్తూ పురాణాల కథలను విమర్శన ధోరణిలో, హేతువాదదృష్టితో రాసిన శంబుక వధ, ఖూనీవంటి నాటకాలు వచ్చాయి. అంతేగాక; పురాణ కథల విషయాన్ని పూర్తిగా మార్చి రాసిన 'అశోకం' వంటి నాటకాలు వచ్చాయి. త్రిపురనేని రామస్వామి చౌదరి, చలం, నార్ల వెంకటేశ్వరరావు, ముద్దుకృష్ణ ఈరకమైన నాటకాలను, నాటికలను తెలుగులో ఎక్కువ రాశారు.

BRAOU

చరిత్ర ఆధారంగా రాసిన నాటకాలు చారిత్రక నాటకాలు, నాటకాల ప్రదర్శన మొదలైన తర్వాత చారిత్రక నాటకాలు కొన్ని (ఖిల్జీపతనం వంటివి) బాగా ప్రచారం పొందాయి.

మన చుట్టూ ఉన్న మనుషులు, వాళ్ళ జీవితం, ఆ జీవితంలో సమస్యలు, వాటికి పరిష్కారాలు - ఇవి చిత్రించడం కొత్తనాటక సాహిత్యం ప్రధానలక్షణమయింది. ఇవి చిత్రించేవే 'సాంఘిక నాటకాలు'. ఆకలి, నిరుద్యోగం, అవినీతి, లంచగొండితనం మొదలైన అనేక సమకాలిక సాంఘిక సమస్యలమీద వందలాది నాటకాలు, నాటికలు తెలుగులో వచ్చాయి, వస్తున్నాయి.

నాటకాలు, నాటికలు ప్రదర్శనవల్ల బాగా ప్రచారం అయిన తర్వాత కేవలం ప్రదర్శనకే నాటకాలు రాయడం పరిపాటి అయింది. ధర్మవరం రామకృష్ణమాచార్యులుగారి నాటకాలు ఎన్నో ప్రదర్శనల తర్వాత గానీ ప్రచురణ కాలేదు. కేవలం ప్రదర్శనకు వీలుగా ఉండటం, జనరంజకత్వం అనే విషయాలకు ప్రాముఖ్యం ఇస్తూ రాసిన చాలా నాటకాలు వచ్చాయి. ప్రదర్శనకు వీలుగా ఉండటమే కాక, సాహిత్య గౌరవం కాపాడుతూ రాసిన నాటకాలు తెలుగులో అరుదుగా వచ్చాయి.

**ముఖ్యవిషయ క్రోడీకరణ :**

1. రంగస్థలం మీద ప్రదర్శించే నాటకం, నాటిక దృశ్యరూపకాలు. రేడియో ద్వారా వినిపించే నాటకం, నాటిక శ్రవ్యరూపకాలు.
2. దృశ్య నాటకాల్లో, నాటికల్లో రంగస్థలాలంకరణ, నటుల ఆహార్యం, అభినయం కన్పిస్తాయి. శ్రవ్య నాటకాల్లో, నాటికల్లో వాచికమే ప్రధానం.

3. విషాదాంత ఇతివృత్తం ఉన్నవి విషాదాంత నాటకాలు, మోదాంత ఇతివృత్తం ఉన్నవి మోదాంత నాటకాలు.

4. రూపాన్నిబట్టి మూడు రకాలుగా నాటక సాహిత్యాన్ని విభజించవచ్చు.
1. గద్యపద్యాత్మక నాటకాలు 2. శ్రవ్యనాటికలు 3. వచన నాటికలు.

5. వస్తువునుబట్టి పౌరాణికాలు, చారిత్రకాలు, సాంఘికాల అని మూడు రకాలుగా విభజించవచ్చు.

## అభ్యాసాలూ, ప్రశ్నలు

1. దృశ్యనాటకాలకు, శ్రవ్యనాటకాలకుగల తేడా తెల్పండి.
2. గద్య పద్యాత్మక నాటకాలను గురించి తెల్పండి.
3. గేయనాటిక అంటే ఏమిటి ?
4. వస్తువునుబట్టి నాటక సాహిత్యాన్ని విభజించి, ఆయా విభాగాల కింది వాటిని గురించి రాయండి
6. శకునపక్షి దృశ్యనాటికా ? శ్రవ్య నాటికా ? వివరించండి.

**అదనపు సమాచారం**

ఏకాంకిక, నాటిక, నాటకం-వీటిని గురించి ఈ దిగువ వ్యాసంలోని కొంత భాగం మరికొన్ని వివరాలను తెల్పుతుంది. ఆంధ్రప్రదేశ్ సాహిత్య ఆకాడమీ 1982లో ప్రచురించిన నాటిక పంచవింశతి సంకలనకర్త కొర్రపాటి గంగాధరరావు ఆ గ్రంథానికి సమకూర్చిన పీఠికలోని భాగం ఇది. చదవండి:

"పూర్వం సంగతెట్లా వున్నా, తెలుగుదేశంలో మాత్రం - నాటికా రచన 1930కి ముందుగానే ప్రారంభమయిందనవచ్చు. విశ్వనాథ కవిరాజుగారూ, రాజమన్నారుగారూ వంటి ప్రముఖులు ఈపద్ధతికి వొరవడి పెట్టారు". అవి చాలా ప్రజాదరణ పొందినవి గూడా. రంగస్థల సౌకర్యాలేవీ లేని ఆంధ్ర దేశంలో, అనేక నాటిక రచనలు మొదట వెలువడినాయి. పాశ్చాత్య నాటికా రచనలలో వెలువడిన రకరకాల మార్గాలతోనూ (Different Schools Like-'Realism' 'Surrealism'; 'Symbolism'; Expressionism వగైరా) రచనలు సాగినవి. అయితే ప్రదర్శనావకాశాలు దేశంలోనే లేక, అవి ఎక్కువభాగం- "చదువుకొని సంతోషించటానికి మాత్రమే ఉపయోగపడినాయి". [చలం, విశ్వనాథ మొ॥ వారి రచనలు, 1930-40 ప్రాంతం].

తర్వాత కాలంలో పరిషత్ పోటీలు ప్రారంభమయిన తర్వాత, ఈ ప్రక్రియకు పూర్తి ప్రాముఖ్యం రావటమే కాక—ప్రదర్శన సౌలభ్యమే ప్రధానంగా భావించనారంభించారు. పాశ్చాత్యదేశ పద్ధతులు-కొన్ని అనుసరణలు రాకపోలేదు గాని— అవే ఇతర రచయితలకు మార్గదర్శకాలయినాయి కూడా.

ఆంధ్ర నాటక కళాపరిషత్ వారి పోటీలలో కొన్ని నిబంధనలకు తగినట్లుగా, తెలుగు నాటికా రచన మొదట తన రూపుదిద్దుకున్నదని కూడా చెప్పక తప్పదు. అందులో ఒకటి ఒక గంట కాలపరిమితి. నిజానికి నాటిక 5 నిమిషాలనుండి—రెండు గంటల వరకు కూడా వుండవచ్చు. ఈ కాలపరిమితి ఉత్సవ నిర్వహణకు ఉపయోగించేదేగాని, నాటికా లక్షణాన్ని నిశ్చయించేది కాదు. నిర్వాహకుల సౌకర్యం కోసం కాదు ఇది ఏర్పడింది. దీనిని జడ్జీలు పరిగణించాల్సినది కాదు. అయినా కొన్ని నాటికా ప్రదర్శనల కాలం గంట పరిమితిక మించి వుండటం వల్లా, ఆ కారణంగా బహుమతి నివ్వక పోవటంవల్లా - నాటిక ప్రదర్శనకాలం గంటకు ఏమాత్రం మించరాదన్న దురభిప్రాయం ఏర్పడింది.

పరిషత్ ప్రదర్శనా పోటీలకు పూర్వం-'నాటిక' అంటే ఏదో చిన్న ప్రహసనం అన్నదే బహు జనాభిప్రాయం. విశ్వనాథ కవిరాజు, భమిడిపాటి కామేశ్వరరావుగార్ల రచనలు ఎక్కు ప్రచారంలోనికి రావటమే దీనికి కారణం కావచ్చును. పరిషత్ ప్రదర్శనలవల్ల ఈ దురభిప్రాయం తొలగిపోయి-మంచి వరవడి ఏర్పడింది.

నటీమణుల కొరతవల్లా, నాటికకు చాలా సమాజాలు ఎక్కువ ఖర్చు పెట్టలేక పోవడం వల్లా— 'స్త్రీ పాత్రలులేని' నాటికా రచనలు ఎక్కువ వచ్చాయి. ఇందులో పొరపాటేమీ లేదు. కథలో కావాల్సిన పాత్రలు

BRAOU

మాత్రమే ప్రవేశ పెట్టటం అవసరం గూడా. ఈ సౌలభ్యం వల్ల ఔత్సాహికుల్లో పెరిగిన ఉత్సాహం అంతా ఇంతా అన వీలుగాదు. ఈ ఒక్క సౌలభ్యం వుండటం వల్ల వందలాదిగా నటులు ఉద్భవించి, రాణించారనటం గూడా సత్య దూరంగాదు.

రచనా కాలం 5 సంవత్సరాల వెనకటిదై వుండకూడదు, అనేది మరొక నిబంధన. దీనివల్ల చాలా సమాజాలవారు ఏ సంవత్సరానికి ఆ సంవత్సరం 'నాటిక' రాయించుకోవాల్సిన అవసరం ఏర్పడింది. అంటే కొత్త రచయితలకు ప్రోత్సాహం లభించినదన్నమాట. నేను—నటకుణ్ణి—రచయిత కావటానికి ముఖ్య కారణం ఇదే—నిజానికి నాలాంటి వారే ఇంకెంతమందో— ఈ కారణం వల్లనే వెలుగులోకి వచ్చారు – వస్తున్నారు. పరిషత్ పౌరాణిక నాటికలను ప్రోత్సహించక పోలేదు. "చేసిన పాపం"; "ఆ నాడు" మొదలైనవి పౌరాణికాలే, కాని ఔత్సాహికు లెక్కువగా సాంఘిక ఇతివృత్తాల్నే చేపట్టటం వల్లనూ, పౌరాణిక నటులు ఉత్సాహం చూపక పోవటం వల్లనూ ఆ విధమైన నాటక నాటికలు పోటీలకు ఎక్కువగా రాలేదు.

కనుక ఒక విధంగా—పరిషత్ నిబంధనలే, నేటి మన నాటిక స్వరూపాన్ని ఈ విధంగా తీర్చిదిద్దాయి— అనటం అతి శయోక్తి కాదు. ఈ కాల పరిమితి నాటికకు ఒక గంటా, నాటకానికి రెండు గంటలకూ పరిమితం చేయటం వల్ల చాలా వరకూ ఇప్పుడు వస్తున్న మన 'నాటకాలు'నిజానికి- నాటికలే-కథా వస్తువు దృష్ట్యా, దీనికి-ఈ రెండింటికీ-తేడా సామాన్య రచయితకూ—ప్రేక్షకులకూ తెలియక పోవటమే, ఇది ఒక్క తెలుగు నాటకా నాటికల విషయంలోనే రాదు; ప్రపంచంలో అన్ని భాషా ప్రాంతాలకు వర్తిస్తుంది.

**ఏకాంకికల విశిష్టత**

నాటక ప్రక్రియలోంచే నాటిక పుట్టినా—నాటిక తనొక విశిష్ట ప్రక్రియగా ఈనాడు రూపొందింది. రచయితలూ, నటీ నటులు, దర్శకులూ, ఇతర కార్యకర్తలూ గూడా దీనిని గుర్తుంచుకోవాలి.

నాటికలో కాలపరిమితి తక్కువ. సుమారు 40-60 నిమిషాలలో రచయిత తన అభిప్రాయాన్ని స్పష్టంగా వ్యక్తం చెయ్యాలి. అంటే నాటికా రచయిత-ఒక్క నిమిషంగాని, ఒక్క మాటగాని వృధా చేయగూడదు, అల్లా అన్నాంగదా అని, ఏదో ఒక చిన్న సన్నివేశ మో—అల్పమైన సందేశ మో తీసుకుని సరిపుచ్చుకోగూడదు. నాటిక ప్రధానోద్దేశ్యం ఎంత తీవ్రమైన సన్నివేశమైనా కావచ్చు. ఉదా :- "ప్రగతి", "ప్రార్థన". ఈ నాటికలలో చాలా పెద్ద విషయాలే చర్చించబడ్డాయి. కాని రచయితలు ఆ పెద్ద విషయాన్నే తమ అదుపులోనికి తెచ్చుకున్నారు. తమ ముఖ్యోద్దేశాన్ని ఒక చిన్న జీవిత సంఘటనలోనికి తెచ్చుకున్నారు. ఒక సంపూర్ణ జీవితాన్ని నాటికగా వ్రాయటం అసాధ్యమే. నిజానికి—నాటికలో వున్న సన్నివేశం ఒక గంట కాలంలో జరిగితే—సుమారుగా అంతే కాలంలో నిజ జీవితంలోనూ, అదే సన్నివేశం జరగటానికి పట్టాలి.

నాటకంలో ఎక్కువ రంగాలు వుండకూడదు. రంగం మారినప్పుడల్లా—తెర జారినప్పుడల్లా రక్తి భంగం జరుగుతుంది. ఈ రోజుల్లో "Lights off and on"తో కూడా-ఈరక్తి భంగం జరిగి తీరుతుంది. ఎక్కడో స్వల్పకాల వ్యవధి సూచించటానికి తప్ప—తెర వాలటం గాని, Lights ఆరటంగాని జరగకూడదు. 'నా బాబు'. 'కళ్ళు' రెండు రంగాల నాటికలయినా నాటికలుగానే పరిగణించబడినాయి. ఇది తప్పనిసరి అయినప్పుడు కూడా, తెరవేసి ఎంత తొందరగా తెర తీయగలిగితే అంత మంచిది. తెర వాలినప్పుడల్లా రక్తి భంగం, కథా క్రమ భంగం జరుగుతుంది. ప్రేక్షకులు అన్యాసక్తులవుతారు. నాటక వాతావరణం మారిపోవాల్సి వస్తుంది. ఇవన్నీ జరగకుండా కాల వ్యవధి కావల్సివస్తే—మరేదో సన్నివేశాన్ని కల్పించి— ప్రేక్షకుల శ్రద్ధా సక్తుల్ని నిలిపి వుంచటం మంచిది.

'నాటికల పోటీల'లోనే గాదు—ఎక్కడ ఎప్పుడైనా, నాటికలను మరి 2-3 ఇతర నాటికల ప్రదర్శనతో కలిపి ప్రదర్శిస్తారు. అంటే పెద్ద పెద్ద సెట్లు కట్టే రంగాలంకరణలకు కాల వ్యవధి చాలినంత వుండదు. ఇది కూడా రచయిత తన దృష్టిలో వుంచుకుని, కాలహరణ లేకుండా, రంగస్థల నిర్మాణం చేసుకునేట్లు అతి సామాన్యపు 'సెట్' మీద జరగగలిగే ఇతి వృత్తాన్నే తీసుకోవటం మంచిది. [ఉదాహరణకు బంగారు సంకెళ్ళు] సెట్స్‌గాని— ఇతర టెక్నిక్‌గాని—స్పాట్‌లైట్ వగైరాలు గాని-ఇతి వృత్తానికీ రక్తికి అవసరమైనంతవరకే ఉపయోగించాలి—

ఏ ప్రదర్శనలోనైనా, నాటికలో-దీనిని మరింత తేలికగా నిర్వహించవచ్చు. ఉదా:- రైల్వేస్టేషన్ చూపటానికి బదులు—"రైల్వేస్టేషన్" అన్న బోర్డుతో సరిపుచ్చవచ్చు. బ్రిటిష్ డ్రామాలీగ్ నాటికల పోటీలో-అన్ని ప్రదర్శనలూ "వేలాడే తెరల"మీదేగాని, 'సెట్స్‌ను'ను Prohibit చేశారు—ఈ కాలహరణం జరగకుండానే

నాటికల రచనలోనేగాదు—నాటక రచనలో గూడా కొందరు రచయితలీమధ్య రాజకీయ సిద్ధాంతాల ప్రచారం చొప్పిస్తున్నారు. అసలు నాటక ప్రదర్శనే ఒక ప్రచార సాధనం—అది పౌరాణికమైనా సరే. కనక దీనిలో తప్పు పట్టటానికి ఏంలేదు. కాని ఆ ప్రచార భాగం ప్రదర్శనలోగల (Drama) నాటకీయతగల సన్నివేశాలను మింగివేయగూడదు. నాటికలో గూడా నాటకీయతే ప్రధానం.

నాటకంలో గూడా 'క్లుప్తత' ముఖ్యమే. కాని నాటికలో ఇది మరీ ముఖ్యం. ఆ భావం ఎంత చిన్నది అయినా సరే—నేరుగా— ఇతర అనవసర విషయాలు చొప్పించకుండా— చిలవలూ పలవలూ అల్లకుండా వుండి తీరాలి నాటికలో. నాటకానికీ—నాటికకూ వున్న భేదాలలో ఇదే అతి ముఖ్యమైనది. నాటకంలో ప్రధానోద్దేశ్యానికి తోడ్పడుతూ, కథ ఎన్నో మలుపులు తిరుగుతూ కథ గమ్యానికి చేరుతుంది. నాటికలో నేరుగా—చెప్పదలుచుకున్న విషయాన్ని నిర్మొహమాటంగా—మొహం మీద విసిరికొట్టినట్లు వుంటుంది. కనకనే నాటిక మరింత శక్తివంతమైనది. ప్రేక్షకులకు అన్యాసక్తి కలగనివ్వదు. ఆలోచనను ప్రధానోద్దేశ్యాన్నుంచి చెదరనివ్వదు.

ఒక్కమాటలో చెప్పాలంటే—

'నాటిక'—క్లుప్తీకరించిన 'నాటకం' గాదు.

నాటికలో గూడా "విషయం"—ప్రధానోద్దేశ్యం-ఏదైనా కావచ్చు. చరిత్ర కావచ్చు. సాంఘిక కథా సన్నివేశం కావచ్చు. మరేదైనా కావచ్చు. ప్రేక్షకులు ప్రదర్శన చూసి లేచి వెళ్ళేటప్పుడు, తామొక మంచి ప్రదర్శన— సమగ్రమైన దాన్ని—చూశామన్న "తృప్తి" కలగటం ముఖ్యం.

నాటికలో-"కథ"—"సన్నివేశాలూ" చక చక నడవాలి. ఏ ఒక్క విషయాన్ని—ఒక్కసారి కంటే ఎక్కువసార్లు నొక్కి చెప్పక్కరలేదు. సంభాషణలు చిన్న చిన్నవిగా వుండాలి. పాత్ర పోషణా చిత్రణలో కూడా-ఏ మాత్రం సందేహాస్పదంగా వుండగూడదు. ఒక్క [మొదటి] వాక్యంలోనే ఆ పాత్ర తీరు తెన్నులు అర్థమయిపోవటం మంచిది. ప్రతి పాత్రా—ఎంత చిన్నదైనా—వచ్చిన కాసేపట్లోనే ప్రాముఖ్యం వహించాలి. ప్రేక్షకులు గుర్తు పెట్టుకోగలిగేట్లుండాలి. అనవసరంగా ఏ పాత్రా రాగూడదూ—పోకూడదు. ప్రదర్శనలో కదిలికలు వడివడిగా వుండాలి. వేషధారణ ఆకర్షణీయంగా వుండాలి. నాటకంలో ఒక్కొక్క రంగంలో క్రమంగా రక్తి పెరిగి—అంతిమ రంగంలో పతాకస్థాయికి చేరుకుంటూపోతే, నాటికలో—ముందు రంగాలన్నింటి వివరాలు మొదటి కొలది నిముషాలలోనే ఇమిడి—కేవలం పతాక సన్నివేశం ప్రధానంగానే మిగతా భాగం నడుస్తుంది.

నాటిక చిన్నది గనుక—క్లుప్తంగా వుంటుంది గనక, కొందరి అభిప్రాయంలో కేవలం హాస్య ప్రధానం గనక, మనం చిన్న చూపు చూడనక్కరలేదు. చిన్నదైనా వజ్రాన్ని మనం భద్రంగా కాపాడుకుంటాంగానీ—పారవేసుకోంగదా?

సాహిత్యంలో కథానికలాగా, 'ఏకాంకిక' నాటకాలలో తన సుస్థిరమైన స్థానం తానే సంపాదించుకుంది."

BRAOU

సవరణ :

49వ పుటలో అనువాదం ఎందుకోసం అనే శీర్షిక కింద రెండవ వాక్యం ఇట్లా సరిదిద్దుకొని చదువుకోండి.

తెలుగు లిఖిత సాహిత్యం మహాభారతానువాదంలో మొదలైంది.

50వ పుటలో ఇచ్చిన ఈ ఉదాహరణలు ఈ విధంగా సరిదిద్దుకొని చదువుకోండి.

BRAOU

*Prasad met his friend Lalita* ప్రసాద్ తన స్నేహితురాలు లలితను కలిశాడు.

*Prasuna met her friend Ramana* ప్రసూన తన స్నేహితుడు రమణను కలిసింది.

పాఠాల్లో అక్కడక్కడ దొర్లిన అచ్చుతప్పులను మీ అధ్యయన కేంద్రంలోని తెలుగు సలహాదారుల నడిగి సరిదిద్దుకోండి.

# ఆధునిక భారతీయ భాషలు: తెలుగు మౌలిక అంశాలు

## పాఠ్య ప్రణాళిక

**ఖండిక-1** : **రాసే అలవాట్లు**
- పాఠం-1 భాష రాయటంలో వచ్చే చిక్కులు, పరిష్కారాలు
- పాఠం-2 సంధి - మాటల కలయిక

**ఖండిక-2** : **నిఘంటువు**
- పాఠం-3 నిఘంటువు మాటలకు అర్థాలు తెలిపే పుస్తకం
- పాఠం-4 నిఘంటువును ఉపయోగించే పద్ధతి

**ఖండిక-3** : **పదాలు, అర్థాలు**
- పాఠం-5 పదాలు, అర్థభేదాలు

**ఖండిక-4** : **నానార్థాలు, పర్యాయపదాలు**
- పాఠం-6 నానార్థాలు, పర్యాయపదాలు

**ఖండిక-5** : **నుడికారాలు**
- పాఠం-7 జాతీయాలు
- పాఠం-8 సామెతలు

**ఖండిక-6** : **పదాలు ఏర్పడే పద్ధతులు, సంబంధాలు**
- పాఠం-9 పదాలు, ప్రత్యయాలు
- పాఠం-10 పదాల మధ్య రూపసంబంధాలు

BRAOU

**ఖండిక-7** : **సమాసాలు**
- పాఠం-11 సమాసాలు - పదాలకలయిక, సమాసభేదాలు

**ఖండిక-8** : **వాక్యభేదాలు, ప్రయోగాలు**
- పాఠం-12 సరళవాక్యాలు
- పాఠం-13 సంశ్లిష్టవాక్యాలు
- పాఠం-14 సంయుక్త వాక్యాలు

**ఖండిక-9** : **రచనలో విరామచిహ్నాలు**
- పాఠం-15 విరామచిహ్నాలు, ఉపయోగించే పద్ధతులు

**ఖండిక-10** : **వ్యాసరచన, భేదాలు**
- పాఠం-16 వ్యాసరచన పద్ధతి
- పాఠం-17 వ్యాసరచనలో భేదాలు

**ఖండిక-11** : **పత్రికారచన, భేదాలు**
- పాఠం-18 పత్రికారచన స్వరూప స్వభావాలు
- పాఠం-19 వార్తారచనలో భేదాలు

**ఖండిక-12** : **లేఖారచన భేదాలు**
- పాఠం-20 ఉత్తరాలు రాసే పద్ధతులు
- పాఠం-21 ఉత్తరాల్లో రకాలు

**ఖండిక-13** : శైలి

పాఠం-22 శైలిలో పదాల కూర్పు

పాఠం-23 శైలిలో వాక్యాల కూర్పు

**ఖండిక-14** : శైలిలో భేదాలు

పాఠం-24 పదగుంఫనశైలి, సరళశైలి

పాఠం-25 ప్రాచీనశైలి, ఆధునికశైలి

పాఠం-26 మాండలిక శైలిలో భేదాలు

**ఖండిక-15** : శైలిలో ఏకరూపత

పాఠం-27 ప్రాచీన ఆధునిక శైలుల మిశ్రమం

పాఠం-28 ఆధునిక మాండలిక శైలుల మిశ్రమం

**ఖండిక-16** : అనువాద విధానం

పాఠం-29 అనువాదంలో సాంస్కృతిక సమస్యలు

పాఠం-30 అనువాదంలో భాషా సమస్యలు

**ఖండిక-17** : అనువాదంలో భేదాలు

పాఠం-31 మూల విధేయానువాదం

పాఠం-32 స్వేచ్ఛానువాదం

**ఖండిక-18** : ఆధునిక కవిత్వ పరిచయం

పాఠం-33 భావకవిత్వం

పాఠం-34 అభ్యుదయ కవిత్వం

పాఠం-35 గేయ కవితా పద్ధతులు

పాఠం-36 వచన కవితా పద్ధతులు

**ఖండిక-19** : కథానిక పరిచయం

పాఠం-37 కథానిక రచన : స్వరూప స్వభావాలు

పాఠం-38 కథానిక భేదాలు

**ఖండిక-20** : నాటకరచన పరిచయం

పాఠం-39 నాటకం, నాటిక - స్వరూప స్వభావాలు

పాఠం-40 నాటకాల్లో, నాటికల్లో భేదాలు

BRAOU

apou
LIBRARY

BRAOU

apou
LIBRARY

# తెలుగు

## మౌలిక అంశాలు

ఖండికలు: 8-12

BRAOU

ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

హైదరాబాదు

1983-84

# ఆధునిక భారతీయ భాషలు: తెలుగు


రచయితల బృందం

ఆచార్య చేకూరి రామారావు (సంపాదకుడు)

డా. కేతు విశ్వనాథరెడ్డి (సహ సంపాదకుడు)

డా. ఎం. వి. శాస్త్రి

డా. వి. లక్ష్మణరెడ్డి

శ్రీమతి ఏ. మంజులత



apou
LIBRARY

A.P.O.U. LIBRARY

Acc. No.......................................

Date...........................................

Call No........................................

BRAOU


ముఖచిత్రం

చంద్ర


ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

హైదరాబాదు

ప్రథమ ప్రచురణ 1984



కాపీరైటు © 1984 ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

అన్ని హక్కులు విశ్వవిద్యాలయానివి. ఈ పుస్తకంలోని ఏ భాగం అయినా ఉపయోగించుకోదలచుకుంటే, విశ్వవిద్యాలయం అనుమతి పొందాలి.



ఈ పాఠాలు సార్వత్రిక విశ్వవిద్యాలయం పాఠ్యప్రణాళికలో ఒక భాగం.

ఇతర వివరాలకు : డైరెక్టరు, ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విశ్వవిద్యాలయం,
6-3-645 సోమాజిగూడ, హైదరాబాదు-500 004.

ముద్రణ : నాట్యకళ ప్రెస్, హైదరాబాదు,

## ఖండికలు

8. వాక్యభేదాలు, ప్రయోగాలు
9. రచనలో విరామ చిహ్నాలు
10. వ్యాసరచన, భేదాలు
11. పత్రికారచన, భేదాలు
12. లేఖారచన, భేదాలు

BRAOU

BRAOU

## ఖండిక 8 పాఠం 12

# సరళ వాక్యాలు

**ఉద్దేశం**

తెలుగులో రకరకాల వాక్యాలను వేరువేరు ప్రయోజనాలకు వాడతాం. వాటి ప్రయోగంలో విశేషాలను వివరించి వాక్య రచనలో గుర్తించదగిన అంశాల వైపు విద్యార్థుల దృష్టి మళ్ళించటం. ఇందులో సరళ వాక్యాల్లో వచ్చే కొన్ని ముఖ్య భేదాలే వివరించబడినాయి. ఒకటి కన్నా ఎక్కువగా విడగొట్టటానికి వీలుకాని వాక్యాలను సరళ వాక్యాలంటారు. సరళ వాక్యాల్లో వచ్చే భేదాలన్నీ ఇతర వాక్యాల్లోనూ వస్తాయి. అందువల్ల ఈ పాఠంలో ప్రస్తావించినవన్నీ సరళ వాక్యాలు కావు.

**ప్రణాళిక**

1. వాక్యంలో పదాల మధ్య అర్థవంతమైన కూర్పు.
2. ప్రపంచంలో సంఘటనల పరస్పర సంబంధం; భాషలో అవి వ్యక్తమయ్యేతీరు.
3. వ్యాకరణ సంబంధాలు : కర్త, కర్మ, క్రియ.
4. క్రియ లేని వాక్యాలు, వాటి భేదాలు
5. కర్మ ప్రధాన వాక్యాలు, ప్రయోగ రీతులు
6. క్రియా ప్రధాన వాక్యాలు
7. విధి, ప్రశ్న నిషేధ వాక్యాల పరస్పర ప్రయోగ సంబంధాలు
8. పద క్రమంలో మార్పుకున్న ప్రాధాన్యం.

BRAOU

## వాక్యభేదాలు, ప్రయోగాలు

మన భాషావ్యవహారం (మాట్లాడేదీ, రాసేదీకూడా) వాక్యాల్లో జరుగుతుంది. రాతలో వాక్యాంతాన్ని చుక్క గుర్తుతో సూచిస్తాం. మాట్లాడే భాషలో చుక్కలుండవు కాని విరామాలుంటాయి. అందే వాక్యాంతంలో మాట్లాడటం ఆపుతాం. కొన్ని ఆవేశకర ఘట్టాల్లో వరుసగా కొన్నివాక్యాలు గుక్కపట్టనట్టు గుప్పించవచ్చు. అయితే అట్లాంటివి అసాధారణ సన్నివేశాలు.

వాక్యాలను పదాలుగా విభజింపవచ్చునని మీఅందరికీ తెలుసు. ఉదాహరణకు ఈ కిందివాక్యాలు చూడండి :

*"ఇదిగో, ఇది మనజాతి. ఇది ప్రస్తుతం తెగ వణ్కి ఉంది. దీనిలో మౌఢ్యం, అంధకారం, కల్మషం, కౌటిల్యాం, దాస్యం చిక్కగా మూగిపోయి ఉన్నాయి."*

ఈ పైన ఉదాహరించిన భాగంలో మూడు వాక్యాలున్నాయి. వాటిలో

*"అంధకారం, ఇది, ఇదిగో, ఉంది, కల్మషం, వణ్కి, కౌటిల్యాం, చిక్కగా, జాతి, తెగ, దాస్యం, దీనిలో, మన, మూగిపోయి, మౌఢ్యం,"* అనే మాటలు ఉన్నాయి. ఈమాటలు కొద్దిపాటి రూపభేదంతోగాని, మూల రూపాలతో కాని నిఘంటువుల్లోకూడా దొరుకుతాయి. ఈమాటలు పేర్చటంవల్ల వాక్యాలు ఏర్పడ్డాయి అని వెంటనే గుర్తించగలం. పై మాటలనే పేర్చిన ఈ కింది భాగాన్ని చదవండి:

*జాతి మన ఇది ఇదిగో. ఉంది వణ్కి తెగ ఇది ప్రస్తుతం. మౌఢ్యం దీనిలో అంధకారం ఉన్నాయి. మూగిపోయి కల్మషం, కౌటిల్యాం, దాస్యం, చిక్కగా.* మొదట ఉదాహరించి వాక్యాలనూ, ఈ పైవాక్యాలనూ

పోల్చిచూస్తే పదాలు క్రమం తప్పటంవల్ల చెప్పదలచుకున్న అర్థానికి విఘాతం ఏర్పడిందని తెలుస్తుంది. అయితే ఈ క్రమం తప్పిన వాక్యాలకు కూడా కొందరు అర్థం చెప్పగలిగితే చెప్పగలగొచ్చు. అయితే ఆ అర్థం మొదట ఉద్దేశించిన అర్థానికి అతిదూరమవుతుంది. అధివాస్తవిక కవితా ఖండిక అనిపిస్తుంది కాని దేవులపల్లి కృష్ణశాస్త్రి గారు ఉద్దేశించిన వాక్యాలనిపించవు. దీన్నిబట్టి నిఘంటువుల్లో వుండే పదాలను మనఇష్టంవచ్చినట్టు కూరిస్తేవాక్యాలం కావని, వాక్యంలో పదాలకు ఒక క్రమం ఉంటుందని, క్రమభంగం కావాలని చేసినా దానికి ఒక ప్రయోజనం ఉంటుందనీ తెలుస్తుంది. ఇంతేకాదు, ఇంకో విషయం కూడా ఇక్కడ తెలుసుకోవాలి.

మనం చెప్పదలచుకున్న భావానికి భాషారూపం వాక్యం. ఈ ప్రపంచంలో కొన్ని సంఘటనలూ, కొన్ని పాత్రలూ ఉంటాయి. వీటి మధ్య పరస్పర సంబంధం ఉంటుంది. ఈ సంబంధాల్ని వ్యక్తంచేసే వాక్యాల్లో పదాల మధ్యకూడా కొన్ని సంబంధాలుంటాయి. ఈ సంబంధాల్నే వ్యాకరణ సంబంధాలంటారు.

*"దేవులపల్లి కృష్ణశాస్త్రి గారు 'కృష్ణపక్షము' అనే కావ్యాన్ని రచించారు."*

అనే వాక్యంలో **రచించారు** అనేది ఒక సంఘటన. ఆ సంఘటన ఫలితం **కృష్ణపక్షము అనే కావ్యం.** దాని కర్త **దేవులపల్లి కృష్ణశాస్త్రి** గారు. వాక్యంలో వీటిని క్రమంగా క్రియ, కర్మ, కర్త అంటారు.

అట్లాగే ఇంకో వాక్యం చూడండి :

'కృష్ణశాస్త్రిగారు 1980లో మరణించారు'. ఇందులో **మరణించారు** అనేది సంఘటన. జరిగిన కాలం **1980.** ప్రధాన పాత్ర **కృష్ణశాస్త్రిగారు.** ఈ వాక్యంలో కర్మ లేదు. ఇట్లాంటి వాక్యాల్లో కూడా ప్రధాన పాత్రను వ్యక్తం చేసే పదాన్ని కర్త అంటారు. సంఘటనను సూచించేది క్రియ. **లో** అనే విభక్తి ద్వారా కాలాన్ని **సూచిస్తున్నాం.** **1980 లో** అనేది కాలాన్ని సూచించే పదం.

ఇట్లా వాక్యంలో కర్త, కర్మ, **క్రియ** అనే ప్రధాన పదాలుంటాయి. కర్మ పదం అవసరమైన వాక్యాలను సకర్మక వాక్యాలనీ, అట్లా అవసరంలేని వాక్యాలను అకర్మక వాక్యాలనీ అంటారు. ఇవి కాక వాక్యంలో కాలాన్ని సూచించేవి, ప్రదేశాన్ని సూచించేవి మాటలుంటాయి. క్రియ జరిగే విధానాన్ని సూచించే మాటలను క్రియా విశేషణాలనీ, నామవాచకాల గుణగణాలను చెప్పే మాటలను నామ విశేషణాలనీ అంటారు. ఇవి కాక భాషల్లో రకరకాల పదభేదాలుంటాయి. కొన్నిటిని అవ్యయాలనీ, మరి కొన్నిటిని అపదాలనీ, ఇంకా ఏవేవో పేర్లతో పిలుస్తాం. ఇవన్నీ కాలక్రమేణ అనుభవాన్ని బట్టి తెలుసుకోవచ్చు. కర్త, కర్మ, క్రియ, క్రియావిశేషణం, నామవిశేషణం అనే మాటలు తెలుసుకుంటే ప్రస్తుతానికి చాలు.

నామ పదానికీ క్రియా పదానికీ ఉన్న సంబంధాన్ని తెలియజెయ్యటానికి భాషలో విభక్తులుంటాయి. ఈ సంబంధాలను కారక సంబంధాలనీ, ఆ సంబంధాలను తెలియజేసే ప్రత్యయాలను విభక్తులనీ అంటారు.

కర్తను తెలియజెయ్యటానికి తెలుగులో ఏ ప్రత్యయమూ ఉండదు. సంస్కృతంలో అట్లాంటి పద్ధతి ఉంది. దాన్ని **ప్రథమా** విభక్తి అంటారు. ల్యాటిన్ వంటి ఇతర భాషల్లోనూ ఈ పద్ధతి ఉంది.

కర్మను తెలియజెయ్యటానికి **ను** లేక ని అనే ప్రత్యయాన్ని వాడతారు. కర్మగా ఉపయోగించిన మాట మానవ వాచి అయితే ఈ **ను** లేక ని తప్పని సరిగా వాడతాం. ఉదాహరణకు **"ఆమె ను మా** ***ఇంటికి భోజనానికి పిలిచాము."*** అనే వాక్యంలో ను తీసివేసి **ఆ మె** అని వాడలేము, కొన్ని కొన్నిచోట్ల మానవ వాచి కాక పోయినా **ను** / ని అనే ప్రత్యయాన్ని వాడవలసివస్తుంది.

అతను నల్లిని చంపాడు. / అతను పిల్లిని పిలిచాడు. / అతను దేశాన్ని ప్రేమిస్తాడు. / ఈ ప్రభుత్వం తెలుగును ప్రోత్సహిస్తుంది.

ఇట్లాంటి వాక్యాల్లో **ను** ప్రత్యయం అవసరం అవుతుంది.

ఏ విభక్తి ప్రత్యయాన్ని ఎప్పుడువాడాలో మాతృ భాషా వ్యవహర్తలకు సహజంగానే **తెలుస్తుంది.** ఉదాహరణకు *"ఆమె నాకు పిలిచింది"* అనే వాక్యం తప్పనీ, *"ఆమె నన్ను పిలిచింది"* అనే విధంగా ఉంటే ఒప్పవుతుందనీ ఏ పుస్తకం చదవకుండానే తెలుగు మాట్లాడేవాళ్ళకి తెలుసు. అట్లా *"ఆమె నాకు అన్నది"* తప్పనీ, *''ఆమె నాతో అన్నది''* అని ఉండాలనీ తెలుగువాళ్ళకి తెలుసు. ఈ విభక్తి వాడకం భాష భాషకు వేరుగా ఉండొచ్చు. భాషా వ్యవహర్తలకు ఈ పద్ధతులు సహజంగానే తెలుస్తాయి.

BRAOU

తెలుగులో కర్తలేని వాక్యాలు, క్రియలేని వాక్యాలు ప్రత్యేకంగా చెప్పుకోదగినవి.

ముందుగా కర్తలేని వాక్యాలను చూడండి:

నాకు చలిగా ఉంది.

నాకు తలనొప్పిగా ఉంది.

నాకు ఆకలిగా ఉంది.

నాకు విచారంగా ఉంది,

ఇట్లాంటి వాక్యాలు శరీరం, మనస్సు స్థితులను, వాతావరణాన్ని తెలిపేవిగా గుర్తించవచ్చు. **చలి, తలనొప్పి, ఆకలి, విచారం.** అనే మాటల వల్ల ఈ అర్థం వచ్చింది. ఇట్లాంటి వాటిలో **నాకు** అనే **విభక్తి** రూపంతో ఉన్న నామాన్ని కర్తగా కొందరు ఆధునికులు గుర్తిస్తారు. మామూలు అర్థంలో ఈ వాక్యాల్లో కర్త దొరకదని తెలుస్తుంది. అట్లాగే ఇంకోరకం వాక్యాలను చూడండి:

వాడికి పిచ్చెక్కింది.

నాకు తిక్కరేగింది.

వంటి వాక్యాల్లోనూ కర్త కనపడదు. **పిచ్చెక్కు, తిక్కరేగు** అనేవి క్రియలు. ఇక్కడ కూడా పైన చెప్పినట్టు **వాడికి, నాకు** అనే మాటలను కర్తలుగా కొందరు గుర్తిస్తారు. ఈ రకం కర్తలేని వాక్యాలకు వస్తుపరమైన వచనంలో అవకాశం తక్కువ. కల్పనా సాహిత్యంలో (అంటే కథల్లో, నవలల్లో) వీటి ఉపయోగం బాగా కనిపిస్తుంది. కొన్ని వినోద వ్యాసాల్లో కూడా ఈ రకం వాక్యాలుంటాయి.

తెలుగు, ఇంకా ఇతర సోదరభాషల్లో క్రియలేని వాక్యాలున్నాయి.

ఆమె తెలివైనది

అతను డాక్టరు

ఈరకం వాక్యాల్లో క్రియ ఉండదు. ఇంగ్లీషులో is అనీ, హిందీలో **"హై"**అనీ క్రియ వాడుతారు. ఆ పద్ధతిని అనుసరించి కొందరు **"*ఆమె తెలివైనది అయి ఉన్నది, అతను డాక్టరు అయిఉన్నాడు*"** అని అనటానికి ప్రయత్నించవచ్చు కాని అది అసహజమైన పద్ధతి.

BRAOU

మాట్లాడే భాషలో అంత ఎక్కువగా కనబడనివీ, రాసే భాషలో కనిపించేవి ఒక రకం వాక్యాలున్నాయి. అవి కర్మ ప్రధాన వాక్యాలు. ఈ వాక్యం చూడండి:

| **ఐన్‌స్టీన్** | **సాపేక్ష సిద్ధాంతాన్ని** | **ప్రతిపాదించారు** |
|---|---|---|
| కర్త | కర్మ | క్రియ |

ఇందులో **ఐన్‌స్టీన్** అనే మాటకి ఎక్కువ ప్రాధాన్యం ఉంది. అట్లాంటి వాటిని ఇంగ్లీషులో active sentences అనీ, తెలుగులో కర్తృ ప్రధాన వాక్యాలనీ అంటారు.

ఈ పైవాక్యాన్ని కొన్నిమార్పులతో

| **సాపేక్ష సిద్ధాంతం** | **ఐన్‌స్టీన్‌చేత** | **ప్రతిపాదించబడింది** |
|---|---|---|
| కర్మ | కర్త | క్రియ |

ఈ వాక్యంలో కర్మకున్న ని అనే ప్రత్యయం పోయింది. కర్తకు **చేత** అనే ప్రత్యయం చేరింది. క్రియలో **బడు** అనే క్రియా పదం అదనంగా చేరింది.

ఇందులో **కర్మకు** అంటే **సాపేక్ష సిద్ధాంతం** అనే మాటకు ప్రాధాన్యం వచ్చింది. ఇట్లాంటి వాటిని ఇంగ్లీషులో Passive sentences అనీ, తెలుగులో కర్మప్రధాన వాక్యాలనీ అంటారు.

కర్మ ప్రధాన వాక్యాల్లో కర్తకు ప్రాధాన్యం తగ్గుతుంది. ఆవాక్యాల్లో కర్తను వదిలేసినా వ్యవహారానికి ఇబ్బందిలేదు. ఈ రెండురకాల వాక్యాలూ చెప్పే ముఖ్యవిషయం ఒకటే అయినా, చెప్పేపద్ధతిలో తేడా వచ్చింది. కర్త వెనక్కి జరిగి కర్మ ముందుకు ఇందులో కనిపించే ఒక పద్ధతి.

ఈకర్మ ప్రధాన వాక్యాలు సంభాషణా శైలిలో సాధారణంగా ఉండవు. దైనందిన వ్యవహారంలో ఈరకం వాక్యాలు కనపడవు. "*నువ్వు అన్నం తిన్నావా?*" అంటే తిన్నాననో, తినలేదనో చెప్పటం సహజ పద్ధతి. "*నా చేత అన్నం తినబడలేదు*" అంటే అసహజంగా ఉంటుంది. అతిసాధారణ విషయాలకు సంబంధించిన వ్యవహారంలో కర్మప్రధాన వాక్యాలుండవు.

ఈరకపు వాక్యాలు ప్రాచీన సాహిత్య భాషలో ఉండేవి. ఇంగ్లీషు భాషా ప్రభావంవల్లా, నేటి రచన అవసరాలనుబట్టి ఈనాటి రచనాభాషలో కూడా ఇవి ప్రవేశించినాయి. వాటి అవసరాలను గుర్తించి వాడుకోవాలి.

అట్లాంటి కొన్ని అవసరాల్ని స్థూలంగా తెలుసుకుందాం.

1. కర్త ఎవరో తెలియనప్పుడు : ఏదైనా ఒక సుందరభవనం చూశాం అనుకోండి. దాన్ని ఎవరు కట్టించారో తెలీదు కాని కాలంతెలుసు. అప్పుడు "*ఈ భవనం 1787లో నిర్మించబడింది*" అని రాయవచ్చు.

డిటెక్టివ్ నవలల్లో సాధారణంగా హత్యలతో ప్రారంభమవుతాయి. హత్యజరిగిన స్థలానికి పోలీసులు డిటెక్టివుగా బిలబిలా వచ్చిపడతారు. "*ఫలాని సుబ్బరామయ్యగారు గుండెఆగి చనిపోయారని*" ఎవరైనా అంటే పోలీసు ఆఫీసరు "*చనిపోలేదు హత్యాచేయబడ్డారు*" అనొచ్చు. ఇక్కడ కూడా ఈ సంఘటనకు కర్త ఎవరో తెలీదు, కాని కర్తలేకుండా ఈ సంఘటన ఉండదు.

2. కర్తను చెప్పదలచుకున్నప్పుడు : ఒక్కొసారి కర్తను చెప్పటం ఇష్టంలేక పోవచ్చు. అప్పుడు ఈ కర్మవాక్యాలుపయోగించొచ్చు. "*హెచ్చరిక చేయబడింది ,వార్త పంపబడింది.*" వంటిచోట్ల కర్తను చెప్ప దల్చుకోకపోవటాన్ని గుర్తించగలం.

3. వక్తే (విషయం చెప్పేవాడు) కర్తఅయినప్పుడు : ఈ పరిస్థితి కొన్ని పరిశోధక రచనలలో రావచ్చు. ఫలానిచోట నేను ఈవిధంగా రాశాను లేక చెప్పాను అని ఎక్కువసార్లు అనటానికి రచయితకు ఎబ్బెట్టుగా ఉంటుంది. "*ముందు ముందు వ్యాసాల్లో (పేటీల్లో) వివరించబడుతుంది. ఈ విషయం ఇంతవరకుముందే ప్రతిపాదించబడింది.*" అని రాయవచ్చు. కర్తకన్న విషయానికి ప్రాధాన్యం ఇచ్చే పద్ధతి ఇది.

ఈవిధంగా కొన్ని ప్రయోజనాలను ఆశించి, ఈరకమైన కర్మప్రధానవాక్యాలు ప్రయోగించబడుతున్నాయి. ఈవాక్యాల విషయంలో గుర్తించవలసిందేమిటో ప్రతి చిన్నవిషయానికీ ఈవాక్యాలు ప్రయోగిస్తే ఎబ్బెట్టుగా ఉంటుంది. ఉదాహరణకు "*అన్నం తిన్నావా?*" అంటే "*తినబడింది*" అనేది తెలుగులో అసందర్భంగా ఉంటుంది. ఆమాటకొస్తే ఇంగ్లీషు వంటి ఇతర భాషల్లో అయినా అంతే.

కర్త ప్రాధాన్యాన్ని తగ్గించే వాక్య పద్ధతి ఇంకొకటి ఈనాటి తెలుగు రచనలోనూ, మాట్లాట్టంలోనూ కనిపిస్తుంది. ఈ వాక్యాలు చదవండి :

కొన్నివారాల కిందట వారిని ఒక క్లబ్బులో కలుసుకోటం జరిగింది.

ప్రజల క్షేమాన్ని అలక్ష్యం చెయ్యగూడదని ప్రభుత్వాన్ని హెచ్చరించటం జరిగింది.

ఈ పై వాక్యాలనే

కొన్నివారాల కిందట వారిని క్లబ్బులో కలుసుకున్నాం.
ప్రజల క్షేమాన్ని అలక్ష్యం చెయ్యకూడదని ప్రభుత్వాన్ని హెచ్చరించాం.
పై వాక్యాల్లో క్రియలను పరిశీలించండి.

| | |
|---|---|
| కలుసుకున్నాం | కలుసుకోటం జరిగింది. |
| హెచ్చరించాం | హెచ్చరించటం జరిగింది. |

ఈ వాక్యాలను కర్తను చెప్పదల్చుకోనప్పుడు గాని, క్రియా ప్రాధాన్యాన్ని చెప్పదల్చుకున్నప్పుడు గాని ఉపయోగిస్తారు. ఈ రకమైన వాక్యాలు రాజకీయ ఉపన్యాసాల్లోనూ, రచనల్లోనూ విరివిగా కనిపిస్తాయి. రాజకీయ కార్యకలాపాల్లో ఎక్కువగా పాల్గొన్నేవారి మాట్లాడేభాషలోకి కూడా ఇది పాకింది. తెలుగు రచనలో ఇట్లాంటి వాక్యాలు అనవసరంగా ప్రయోగిస్తే, లేక అదేపనిగా ప్రయోగిస్తే శైలి అస్వాభావికంగా ఉంటుంది.

*"నేను బజారుకు వెళ్ళటం జరిగింది. అక్కడ రెండు బనీన్లు కొనటం జరిగింది. తరువాత బస్సు ఎక్కటం జరిగింది. ఇంటికి వెళ్ళటం జరిగింది."* ఈ రకంగా కొన్ని వాక్యాలు రాసి చూడండి. రచన ఎంత ఎబ్బెట్టుగా ఉంటుందో తెలుస్తుంది.

ఇవికాక తెలుగులో ఒక పని చెయ్యమని అడిగే వాక్యాలు (వీటినే విధి వాక్యాలు అంటారు), ప్రశ్నార్థక వాక్యాలు, వ్యతిరేక వాక్యాలు-ఇట్లా కొన్ని రకాలున్నాయి. వాటిలో కొన్ని ప్రయోగ విశేషాలు తెలుసుకోటం అవసరం. విధి వాక్యాల్లో రా, పో, తే, తిను, చెయ్యి, చెప్పు-అనే విధంగా క్రియాపదాలుంటాయి. అయితే అన్ని సందర్భాల్లోనూ అనటం బాగుండదు గనుక కొన్ని డొంక తిరుగుడు వాక్యాలుపయోగిస్తారు. ముఖ్యంగా అభ్యర్థన చేసేటప్పుడు, బతిమిలాడినట్టుగా అడిగేటప్పుడు ప్రశ్నార్థక వాక్యాలుపయోగిస్తారు.

మీరు రేపు సాయంకాలం మా ఇంటివైపు ఒకసారి రాగలరా?

ఈ మాట ఒకసారి మంత్రిగారి చెవిన వెయ్యగూడదూ!

ఈ పై వాక్యాలు పైకి ప్రశ్నలలాగే కనిపిస్తున్నా వీటిల్లో అభ్యర్థన ఉంది.

ప్రశ్నలు సమాధానాల నపేక్షిస్తాయి. అంటే సమాధానాలు మాటల్లో ఉంటాయి. అభ్యర్థనలు చర్యల నపేక్షిస్తాయి. అభ్యర్థనాత్మకమైన ప్రశ్నలూ అంతే. చెప్పు, చెయ్యి, అనే రకపు క్రియలున్న వాక్యాల్లో ఉన్న ప్రత్యక్షత, సూటిదనం ఒక్కోసారి మొరటుగా అనిపించి అభ్యర్థనాత్మకమైన ప్రశ్నలుపయోగిస్తారు.

నిషేధార్థంలో కూడా ప్రశ్నలుపయోగించే పద్ధతి ఉంది.

*'నువ్వు అక్కడికి ఎందుకు వెళ్ళాలి?'* అంటే వెళ్ళక్కర్లేదు అని భావం. *'రేపు గుంటూరు వెళ్ళక పోతే ఏం?'* అంటే *'వెళ్ళవద్దు'* అని ఉద్దేశం. ఈ రకం ఒక వాక్యం చేసే పనిని ఇంకో వాక్యం చేస్తుంది. మామూలు విధి నిషేధాలకన్నా ఎక్కువ చెప్పదలుచుకున్నప్పుడు ప్రశ్నార్థక వాక్యాలు కూడా ప్రయోగిస్తారు

ఈ పైవికాక ఉత్తరాల్లో *"ఏ విషయమూ వెంటనే ఉత్తరం వ్రాసేది." "త్వరలో రెండువేల రూపాయలు చెక్కు ద్వారా పంపించవలసింది" "ఈ ఉత్తరం అందిన వెంటనే జవాబు వ్రాయించగలరు"*- వంటి వాక్యాలు కనిపిస్తాయి. ఈ పద్ధతికూడా సూటిదనాన్ని తప్పించటానికే ప్రయోగిస్తారు. ఉత్తరాల్లో కనిపించే ఈ వాక్య పద్ధతి ఇటీవలి కాలంలో తగ్గుతున్నట్లుంది.

BRAOU

వ్యతిరేక వాక్యాలు సాధారణంగా నిశ్చయ వాక్యాలకు విరుద్ధమైన విషయం చెపుతాయి.

తిన్నాడు - తినలేదు

అన్నాడు - అనలేదు

వస్తాడు - రాడు

అయితే ఒక్కోసారి ఈ వ్యతిరేక వాక్యాలు నిశ్చయ వాక్యాలకు వ్యతిరేకార్థాన్ని చెప్పటానికే కాక ఇతర విషయాలను చెప్పటానికి కూడా ప్రయోగిస్తారు. ముఖ్యంగా వ్యతిరేక ప్రశ్నలు అభ్యర్థనార్థంలో ఉపయోగిస్తారు.

మీరు రేపు సాయంకాలం ఒకసారి మా ఇంటిరాగూడదూ?

ఇవాళ త్వరగా ఇంటికి రారాదూ? సినిమా వెళ్దాం.

ఈ పై వాక్యాల్లో కనిపించే వ్యతిరేక క్రియలు అభ్యర్థననే సూచిస్తున్నాయి.

**పదక్రమం**

తెలుగు వాక్యంలో మాటలు క్రమనిరపేక్షంగా రావచ్చునని సాంప్రదాయిక వ్యాకర్తలంటారు. అంటే వాక్యంలో మాటలు ఏ వరసలోనయినా ఉండొచ్చునని. పద్యరచనలో ఛందస్సు కోసం, లయకోసం, మైత్రి కోసం పదాలవరస రకరకాలుగా మారుస్తారు. అక్కడ అర్థంలో ఏమంత మార్పు ఉండకపోవచ్చు. కాని వచనంలో పదక్రమం మారితే అర్థంలో కొద్ది మార్పు కలుగుతుంది.

తెలుగులో సామాన్య వాక్యంలో కర్త-కర్మ-క్రియ అనే వరసలో పదాలు ఉంటాయి. తెలుగును అందుకే క్రియాంత భాష అనికూడా అంటారు. ఇవికాక కాలాన్ని, దూరాన్ని సూచించే మాటలు కర్తకూ, కర్మకూ మధ్యలో వస్తాయి. ఈరకమైన వరుస సాధారణక్రమం అనుకుందాం. దీనికి భిన్నమైన క్రమం **అసాధారణ**క్రమం.

కుందుర్తి "*తెలంగాణా*" రచించారు.

"*తెలంగాణా*" కుందుర్తి రచించారు.

అనే రెండు వాక్యాలూ ఒకే ప్రధానార్థాన్ని చెపుతున్నా ప్రాధాన్యంలో తేడా ఉంది. మొదటివాక్యం సాధారణ వాక్యం. ఇందులో కుందుర్తి అనే మనిషి తెలంగాణ అనే పుస్తకం రచించినట్టు చెప్పుతూంది. రెండో వాక్యం తెలంగాణా అనే పుస్తకాన్ని గురించి చెపుతుంది ఆ పుస్తకం రచించిందీ ఇంకొకరూ, ఇంకొకరూ కాదు. అది రచించింది కుందుర్తి అని చెపుతుంది. కేవలం పదాల స్థానం మారటంవల్ల వాక్యాల అర్థంలో మార్పు వచ్చింది. అందువల్ల రెండో వాక్యంలో పదాల వరసను అసాధారణ క్రమం అంటాం. ఇట్లా వాక్యాల్లో సాధారణ పద క్రమాన్ని మారిస్తే వస్తు ప్రాధాన్య వివరణలో భేదం వస్తుంది. ఇట్లా భేదాన్ని గుర్తించి పదాల వరసను వాక్యంలో పాటించాల్సి ఉంటుంది.

తెలుగులో పదాల వరసకు వ్యాకరణ ప్రాధాన్యం లేదు, ఇంగ్లీషులో పదాల స్థానం **మారితే** కర్త, కర్మ తారుమారవుతాయి. అయితే తెలుగు పదాల వరసను ప్రాధాన్యం తెలియజేయుటానికి మారుస్తారు.

వాక్యంలో మొదటిమాటకు ఒక రకం ప్రాధాన్యం, చివరిమాటకు ఇంకోరకం ప్రాధాన్యం ఉంటాయి. ఏదైన ఒక వస్తువును గురించి విశేషం చెప్పదల్చుకున్నప్పుడు ఆ వస్తువును ముందు పేర్కొంటాం. ఇక్కడ వస్తువంటే జడపదార్థమని కాదు, ప్రాణ వాచకాలు కూడా.

**నాకు** డబ్బుకావాలి.

**ఆమెకు** పట్టుచీరలమీద మోజు.

**రేపు** కాలేజిలో మీటింగుంది.

**బొంబాయిలో** గుడ్డలు చౌక.

ఈ పై వాక్యాల్లో మొదటి మాటకున్న ప్రాధాన్యం గుర్తించవచ్చు. రెండోమాటను మొదటికి జరిపి చూస్తే ప్రాధాన్యం మారుతుంది.

మొదటి వచ్చిన మాట **కర్తే** కానక్కర్లేదు- పై వాక్యాల్లో మొదట వచ్చినవి పదాలు కర్తలు **కావుకూడా**.

బోధించదల్చుకున్న విషయ ప్రాధాన్యాన్ని బట్టి మాటల్ని క్రియ తరవాత జరిపే పద్ధతి ఒకటే ఉంది. అప్పుడు క్రియ తన క్రియా లక్షణాన్ని కోల్పోయి నామంగా మారుతుంది. ఉదాహరణలు చూడండి:

అతను ఎప్పుడువచ్చాడు? - అతను వచ్చింది **ఎప్పుడు?**

అతను నిన్న ఊరికి వెళ్ళాడు - అతను ఊరికి వెళ్ళింది **నిన్న**

వాళ్ళు రేపు వస్తానన్నారు - వాళ్ళు వస్తానన్నది **రేపు**

నువ్వు అబద్ధం చెప్పావు - అబద్ధం చెప్పింది **నువ్వు**

ఇట్లా వాక్యం చివరికి జరిగిన మాటలకు వచ్చిన ప్రాధాన్యాన్ని చూడండి.

ఇట్లా రకరకాల ప్రాధాన్యాలను సూచించటానికి **తెలు**గులో పదక్రమాన్ని మారుస్తాము. అందువల్ల తెలుగులో సాధారణ క్రమంకన్నా వేరుగా పదాలను కూర్చదల్చుకున్నప్పుడు వాటి ప్రయోజనాన్ని గుర్తెరిగి ఉపయోగించటం మంచిది. శైలీ భేదాన్ని కలిగించే సామర్థ్యం పదాల వరసకు ఉంది. అది గుర్తించకుండా ఇష్టం వచ్చిన వరసలో పదాలను ప్రయోగిస్తే ఉద్దేశించని అర్థాలు రావచ్చు. అందువల్ల పదాల వరసకున్న ప్రాధాన్య భేదాలమీద దృష్టి అవసరం.

తెలుగులో ఇంకా రకరకాల వాక్య భేదాలు ఎన్నో ప్రయోజనాలకు వాడుతుంటాం. మరికొన్నిటిని వచ్చే పాఠంలో చూద్దాం.

BRAOU

ఈ వ్యాసంలో నేర్చుకున్న ముఖ్యాంశాలివి.

1. వాక్యాల్లో పదాలుకాని, పదబంధాలుకాని ఒక అర్థవంతమైన కూర్పులో ఉంటాయి.
2. ప్రపంచంలో వస్తువులకు సంఘటనలకు మధ్య పరస్పర సంబంధాలు ఉన్నాయి. ఇవి భాషలో విభక్తులద్వారా వ్యక్తమవుతాయి. ఈ సంబంధాల్లో కర్త, కర్మ, క్రియ ముఖ్యమైనవి.
3. శరీరస్థితి, మనస్థితి, వాతావరణం, మొదలైనవి వాటిని సూచించే వాక్యాల్లో కొన్ని కర్తలేని వాక్యాలున్నాయి.
4. తెలుగులో క్రియలేని వాక్యాల్లో ఇంగ్లీషువంటి భాషలననుసరించి క్రియ చేర్చకూడదు.
5. ఇంగ్లీషులో passive అనే పద్ధతి వాక్యాలవంటివి తెలుగులో కర్మ ప్రధాన వాక్యాలున్నాయి. ఈ రకం వాక్యాలు దైనందిన వ్యవహారంలో ఉండవు.
6. కర్మప్రధాన వాక్యాలు రచనా భాషలోనే ఉంటాయి. కర్త తెలీనప్పుడు, కర్తను చెప్పదల్చుకో నప్పుడు, కర్మ ప్రాధాన్యాన్ని తగ్గించవలసి వచ్చినప్పుడు ఈ వాక్యాలు వాడతారు.
7. కర్త ప్రాధాన్యాన్ని తగ్గించి క్రియా ప్రాధాన్యాన్ని ఎక్కువ చెయ్యటానికి క్రియా ప్రధాన వాక్యాలు వాడతారు.
8. విధి నిషేధాలు ప్రశ్న, వ్యతిరేక ప్రశ్నలద్వారా కూడా వ్యక్తమవుతాయి.
9. పదక్రమంలో మార్పు ద్వారా ఒక్కోపదానికి ప్రత్యేక ప్రాధాన్యాన్ని కల్పించవచ్చు. (దీన్ని ఇంగ్లీషులో focus అంటారు.)
10. క్రియను నామంగా మార్చి, వాక్యంలో పదాన్ని చివరికి జరపటంవల్ల కూడా ప్రాధాన్యాన్ని చూపించవచ్చు.

## అభ్యాసం (చదివేపని)

BRAOU

ఈ కింద ఇచ్చిన భాగం నాయని కృష్ణకుమారి గారు రచించిన కాశ్మీర దీపకళిక అనే పుస్తకంలో నుంచి తీసిన భాగం. విద్యార్థి బృందాన్ని వెంటతీసుకొని కాశ్మీర ప్రయాణం చేసినప్పటి అనుభవాలను ఈ గ్రంథంలో భద్రపరిచారు.

నాయని కృష్ణకుమారి గారు ప్రసిద్ధులైన ఆధునిక కవి నాయని సుబ్బారావు గారి కుమార్తె. కృష్ణకుమారి గారు రచయిత్రిగానూ, కథా రచయిత్రిగానూ, వీటన్నిటినీ మించి భాషా సాహిత్య పరిశోధకురాలుగానూ పాఠకులకు తెలుసు. జానపద సాహిత్యంపై వీరిది మౌలికమైన పరిశోధన.

ఏనుగుల వీరాస్వామిగారి కాశీయాత్ర చరిత్ర, కోలాశేషాచల కవి నీలగిరి యాత్ర అనేవి తెలుగులో చాలా ప్రసిద్ధమైన యాత్రా చరిత్రలు. ఆధునిక వచనంలో రచించిన యాత్రా చరిత్రల్లో కృష్ణకుమారిగారి కాశ్మీర దీపకళిక ప్రసిద్ధమైనది.

సాంప్రదాయికమైన నమ్మకాలు, భావ కవిత్వపు కాల్పనికత కలగలిసిన శైలి కృష్ణకుమారిగారిది. వీరి వచనంలో సంప్రదాయ సాహిత్య ప్రభావం, ఆధునిక తెలుగు నుడికారం సమపాళ్ళలో కనిపిస్తుంది. ప్రకృతి సౌందర్యానికి పరవశమైపోయే కవితాధోరణి కూడా ఈ వచనంలో గుర్తుపట్టవచ్చు.

## కాశ్మీరదీప కళిక

### నాయని కృష్ణకుమారి

వెండిరేకు నొకదాన్ని భూమి ఉపరితలాన మిక్కిలి నేర్పుతో తాపడం చేసినట్లున్న ఆ సరస్సు విస్తారంగంగా స్తబ్ధంగా శోభిస్తోంది. ఆకాశంమీద విచ్చలవిడిగా పరుచుకున్న మబ్బు ముక్కలు తెల్లవీ, నీలివీ రకరకాల ఆకారాలు కలిగి ఆ నీళ్ళలో ప్రతిఫలిస్తున్నయ్. వెండిరేకుమీద నీలాలూ, ముత్యాలూ పొదిగినట్లు అందాలు చిందిస్తోంది సరస్సు. దూరంగా కొండలవరుస! వాటి అంచుల చివళ్ళు నీళ్ళలోకరిగి వాటిమీద గుండుసూదులు

గుచ్చినట్లుగా భ్రమ కలిగిస్తున్న పైన్‌చెట్ల ఆకారాలుకూడా ప్రతిఫలించి నిటారుగా వసుంధరా వక్షస్థలంమీద నిలుపవలసిన పర్వతం దస్సు దప్పి సరస్సులోకి ఒరిగిన భ్రమ కలిగిస్తోంది. సౌందర్యఖని అయిన ఈ భూమి మీద ఎక్కడచూచినా ఇటువంటి రమణీయ దృశ్యపటలి మనస్సును ఆహ్లాదంలో ముంచెత్తుతున్నది. ఈ అందమే అన్నమూ నీళ్ళుగా మారి జీవన ధారణకు మరోవ్యాపకం అవసరం లేని స్థితిని భగవంతుడు కల్పిస్తే నేనిక్కడే ఉండిపోతాను కాబోలు.

ఈ సరస్సుపేరు 'ఊలర్ సరస్సు'. మొత్తం ఆసియా కంతటికీ ఇది పెద్ద సరస్సట! దీని వెడల్పు దాదాపు 15 మైళ్ళు. జీలం నది ఈ సరస్సులోకి ప్రవహించి దీనిని నింపి మళ్ళీ ప్రవాహ రూపంగా నిర్గమిస్తుం దట! సరోగర్భాన చిన్నచిన్న పడవలు తిరుగాడడానికి వీలులేదు. మధ్యందినాన పర్వతాగ్రాన్నుంచి దూసుకు వచ్చే వడిగల గాలుల తాకిడికి నీటి తొణికిస ఎక్కువగా ఉంటుంది. పుణ్యాత్ముడి స్వచ్ఛమైన అంతరంగంలా మెరిసే ఆ సరస్సును వదిలి కళ్ళు ముందుకు కదలవని మొరాయించాయి; కాని ఏంలాభం?

మళ్ళీ మా వాహనం మమ్మల్నందర్నీ పదిలంగా కడుపులో దాచుకుని కదిలింది. బస్సు పోతూవుండగా దారికి రెండువైపులా అక్కడక్కడగా తగిలే చిన్నచిన్న ఊళ్ళలో ఆగడమూ, వేడి, వేడి "చాయ్" రుచిని నోటి కెక్కించుకుని బజార్లలో తిరగడమూ పనిగా పెట్టుకున్నాము. అలా తగిలిన వాటిలో 'హజరత్‌బాల్' ఒకటి ఇది. చిన్న ఊరే; కాని మహమ్మదీయుల పుణ్యక్షేత్రం. మహమ్మద్ ప్రవక్త వెంట్రుక ఒకటి అక్కడ పరిరక్షింపబడి పూజలందుకోవడం వల్ల దానికి క్షేత్రత్వం అబ్బింది. దాన్ని చూడాలని అందరమూ మసీదులోకి అడుగుపెట్టాం, కాని 'హజరత్ బాల్' ఉన్న చోటికి మౌల్వీ సాబ్ మమ్మల్ని వెళ్ళనీయలేదు. ఆ స్థలమంతా మహా మురికిగా ఉంది! మసీదుకు ఒకవైపున దాల్‌లేక్ ఒడ్డు. యాత్రా సమయమప్పుడు అక్కడ అన్ని సౌకర్యాలూ కల్పింప బడతాయట! అది చూస్తుంటే, నాకు శ్రీకాకుళం దగ్గర అరసవిల్లి సూర్యనారాయణమూర్తి దేవాలయం జ్ఞాపకం వచ్చింది. క్రిందటి సారి నేను వెళ్ళినప్పుడు అంతకు రెండురోజుల కిందట ఉత్సవం జరిగిందట! ఆలయంచుట్టూ టెంకాయ చిప్పలు, పీచు, రొచ్చు, ఈగలు, తిని పారేసిన విస్తరాకులు. వీటితో నానా భీభత్సంగా కనిపించింది. ఈ హజరత్ బాల్ కూడా సరిగ్గా అలాగే ఉంది. మనుషులూ, వీళ్ళల్లో అలసత్వమూ ఒక్కటైనప్పుడు ఏ మతా నికి సంబంధించిన స్థలమైనా ఒక్కలాగే ఉంటుంది మరి!

BRAOU

అక్కడ నుంచి గంధర్ బాల్‌కు దగ్గరగా 'తులాముల్లా' అనే చోటఉన్న '*ఖీర్ భవానీ*' ఆలయాన్ని చూచాము. ఈవిడ క్షీరాధి దేవత. నీళ్ళు నిండిన నలుచదరపు చవికె మధ్యగా ఓ మంటపంలో ఆసీన అయివుంది దేవి. ఆ నీళ్ళు అక్కడికి అదృశ్యమైన 'జల' వల్ల వస్తూ ఉంటాయట. అవి ఎప్పుడూ తరుగూ పెరుగూ లేక ఉంటాయి. ఒక్కొక్క ఋతువు మారుతున్న కొద్దీ ఒక్కోరంగును సంతరించుకునే ఆ నీళ్ళు, సంవత్సరంలో ఎక్కువభాగం తెల్లగా పాలల్లా ఉంటాయట! అందుకే ఆ నీళ్ళమధ్య నెలవుకొన్న అంబిక 'క్షీర భవాని'గా పేరుపొందింది.

తర్వాత, బందీపూర్, సోపూర్, హాజీపీర్, బారాముల్లా మొదలైన ప్రదేశాలు తిరిగి చూచాము. 'బారాముల్లా' బెంగాలులోని '*నవకాళీ*'లాంటి ప్రదేశం. అక్కడలాగే ఇక్కడకూడా దేశ విభజన జరిగిన కొత్తలో హింసాకాండ ముమ్మరంగా చెలరేగిందట. ఇప్పటికీ కాశ్మీరంలో ఏమూల ఎటువంటి చిన్నకలహం తలఎత్తినా ఆ '*మూల*'తోపాటు బారాముల్లా కూడా ఉండి తీరుతుందన్న ప్రసిద్ధి ఉంది. ఆ గ్రామానికి టీ తాగ డానికి ఒక కాశ్మీరీ టీ దుకాణంలోకి పోయి కూర్చున్నాం. ఆ దుకాణదారుడు దూరంనుండి వచ్చిన చుట్టాలకు సంభ్రమంతో ఆతిథ్యం నెరపినంత పనిచేశాడు. తన దగ్గరున్న కేకులూ, రొట్టెలూ, బిస్కట్లూ తెచ్చి మాముందు పరిచాడు. అప్పటికప్పుడు వేడివేడి టీ తయారుచేసి ఇచ్చాడు. మేము వస్తుంటే ఎదుటనిలబడి స్వాగతం చెప్పడమూ, కూర్చోబోతుంటే గుడ్డలో కుర్చీల దుమ్ము దులిపి పెట్టడమూ, ఆ పళ్ళాలు సర్దినతీరూ, చెంచాలు అందించిన వైనమూ అన్నీ చూస్తుంటే ఏదో డబ్బుకోసమూ వ్యాపారంకోసమూ చేస్తున్న హంగామాలాగా కని పించలేదు. అతిథి బాంధవుడైన గృహస్థు ఇంటికి వచ్చిన చుట్టాలను చూసి సంబరపడి సౌకర్యాలమర్చే తత్తర పాటుతో అటూ ఇటూ కదం తొక్కినట్లుగా ఉంది అతగాడి వైఖరి. కుర్చీమీద కూర్చోగానే ఎదురుగా ఒక తమాషా నోటీసులాంటి హెచ్చరిక కనిపించింది. 'దయచేసి *ఇక్కడ రాజకీయాలు చర్చించకండి*' అన్నదాన్ని

చూసి నేను విస్తుపోయాను. ఎందుకని అడిగితే ఆ దుకాణదారుడు బారాముల్లా పేరు ప్రతిష్టలు వర్ణించి చెప్పాడు. అభిప్రాయభేదాలు వస్తే తలకాయల్ని కొబ్బరిపుచ్చెల్లా ఎగరగొట్టడానికి వెనుదీయని అభిమాన ధనులట అక్కడి వాళ్లు. ఏ విషయాన్నయినా చర్చించడమెందుకు, ఘర్షణ పడడమెందుకు, అనే శాంతికాముకుడు మా దుకాణదారుడు.

కాశ్మీరంలో నేను తిరిగినచోటల్లా ఒక విచిత్రం కొట్టవచ్చినట్లుగా కనపడుతుంది. కాశ్మీర్ తాను ఇండియాలో అంతర్భాగాన్ననే స్పృహ కలిగిఉన్నట్లు తోచదు. హిందూదేశ నాయకుల పటాలుకానీ, అభివృద్ధి కార్యక్రమాల సమాచారాలుకానీ ఎక్కడా కనిపించవు. ప్రణాళికల వివరాలు, కుటుంబనియంత్రణ వంటి విషయాలను గూర్చిన ప్రచారాలు కనీసం ఇవైనా కనిపించవు. ఎక్కడో "State Bank of India", "India Coffee house" వంటి బోర్డులమీదతప్ప 'ఇండియా' అనే మాటేలేదు. ఆఖరికి రేడియోకూడా, 'రేడియో కాశ్మీర్' అంటుందిగాని ఆలిండియా రేడియో అనదు. నెహ్రూజీ కాశ్మీర్ మనుగడకు ఎంత స్వతంత్ర ప్రతిపత్తిని కలిగించినా ఇది ఇండియాలో భాగమేకదా! ఇండియాలో భాగం కాదని నేపాల్, భూటాన్, సిక్కింలాగా అది స్వతంత్ర రాజ్యమని మనం అనుకొంటున్నామా? హైదరాబాదు హిందూదేశంలో కలిసిపోయినట్లుగా కాశ్మీరం కూడా ఈపాటికి కలిసిపోయి ఉండ వలసిన మాట! శ్రీనగర్‌లో విహారయాత్రికులకు వసతిసౌకర్యాలు కలిగించా లనీ భారతదేశానికంతటికి అందాల నగరమైన దాని శోభ ప్రతీ భారతీయుడికి గర్వకారణం కావాలనీ ప్రభుత్వం కోట్లకు కోట్లు వెచ్చిస్తోంది. అది కేవలం వ్యాపార కేంద్రంగా మారి దాని కళాస్వరూపం వికృతం కాకుండా ఉండడానికి తగినన్ని చర్యలు తీసుకుంటూనే ఉంది. ఇంతచేస్తున్నా తాను భారత దేశాంతర్భాగాన్ననే తీవ్ర స్పృహ కాశ్మీరానికి కలిగినట్లు సామాన్యులమైన మా బోంట్ల దృష్టికి తోచదు మరి!

అక్కడ నుంచి ఇంకా చుట్టుపక్కల గ్రామాలు కొన్ని పర్యటించాం. బస్సులో పోతుంటే దోవకు రెండు పక్కలా, బాగా దున్ని తయారుచేసి పెట్టుకున్న నేల కనిపించింది. అది కుంకుమపువ్వుకోసం చేసిన మళ్ళట. అప్పుడు పంట లేనందువల్ల ఆ కాశ్మీరజమైన కుంకుమ పువ్వును చూసే భాగ్యం మాకు కలగలేదు. మేము తిరిగిన చోట్లలో "పాంపూర్" అనే ప్రదేశం కుంకుమ పంటకు ప్రసిద్ధి. దీని పేరే పూర్వకాలంలో పద్మపురం.

ఇంటి కొచ్చేసరికి సాయంత్రం ఆరు గంటలు. మళ్ళీ పిల్లలంతా మొహాలు కడుక్కొని అందంగా అలంకరించుకొని, ఊరు చూడ్డానికీ వస్తువులు కొనడానికీ బయటికి వెళ్ళిపోయారు. అంత ఓపిక నాకు లేదు. కాలం పొరలు ఒకదానివెంట ఒకటి మన మీద కప్పబడుతున్న కొద్దీ జీవితంలో బాల్య సహజమైన ఉత్సాహమూ, శ్రమ కోర్చే శక్తి ఉండవుకదా! అందర్నీ ఎవరిదారిన వారిని పంపించి ఎనిమిది గంటలవరకూ చీకట్లకు లొంగకుండా కాంతి రేఖల్ని నింపుతున్న సాయంత్రాన్ని అనుభవిస్తూ నా గుడారంలో నేనుండిపోయాను. సూర్యాస్తమయ సమయంలో మనస్సులో చెలరేగే ఊహలు చిత్రంగా ఉంటయ్. గుండ్రంగా అందంగా ఉన్న ఓ బంతిని అదిమి వికృతం చేసిన రీతిగా పగలంతా తుళ్ళుతూ పరవళ్ళుతొక్కే మనస్సుని సాయం సంధ్య నొక్కిపట్టి పెత్తనం చేస్తుందనుకొంటాను. అయినవాళ్ళూ ఆప్తులూ దగ్గరవుండి రోజంతా సంతోషంగా తృప్తిగా గడిపిన వ్యక్తి కయితే సాయంవేళ, అర్థంకాని, మనఃపీడనకారకమైన ఆలోచనా స్రవంతి ప్రవహిస్తుంటుంది. వెలుగు రేఖల్ని మేస్తూ, బలిసి నలుదిక్కుల నుండి ఆకాశాన్ని ఆక్రమిస్తున్న చీకటి, లయబద్ధంగా రెక్కలాడించుకుంటూ తమ తమ గూళ్ళు వెతుక్కుంటూ పోయే పిట్టలూ, ఒకచోట బడితేర్చి గుండెలు గుబులుకునేటట్లు అదేపనిగా అరిచే కాకులగుంపూ ఇవన్నీ మనిషి మనస్సును దిగులుతో నింపేందుకే. జీవన సమాప్తి సమయాన ఒకవ్యక్తికీ, అతనికి సంబంధించిన వారికీ ఇట్లాగే ఆత్మవేదన కలుగుతుందిసుమా అని కాలపురుషుడు ప్రతి రోజూ మనల్ని హెచ్చరిస్తుంటాడు కాబోలు. ఈ విధంగా మనస్సు పరిపరివిధాల ఇంటిమీదికి పరిగెత్తుతోంది. దీనివేగం కొనియాడ దగిందికదా! ఇన్ని వేలమైళ్లు గడిచి ఇంతత్వరగా ఇల్లు చేరుకోగలిగిన మనస్సుతో శరీరాన్ని సహకరించకుండా ఎందుకు ఏర్పాటు చేశాడా పరమేశ్వరుడు?

మర్నాడు 20వ తారీకు. కార్యక్రమాన్నిబట్టి మేమంతా సోనామార్గుకు పోవలసి ఉంది. శ్రీనగర్‌కు దాని దూరం యాభైమైళ్ళు కాశ్మీరీల ఉచ్చారణలో అది "సోనమరగ్" అనగా అర్థం బంగారపు దారి అని కాబోలు! దీని ఎత్తు సముద్రపు మట్టానికి 7350 అడుగులు. రెండు మైళ్ళ దూరంలో ఉన్న హరముఖ పర్వత శిఖరం

హిమకిరీటాలంకృతమై నగాధిరాజంలా కనపడుతుంటుంది. అక్కడ ఏళ్ళ తరబడి కప్పబడ్డ మంచుదిమ్మలు కరిగిపారిన ప్రవాహమే సింధునది.

బస్సు షోయలు కురిసే సింగారిలా కులుకుతూ పర్వతారోహణం చెయ్యసాగింది. అది ముందుకుసాగే ప్రతి అంగుళమూ అధిరోహమే. చుట్టూ పర్వత శిఖరాలు! శిఖరాగ్రాన తెల్లగా సున్నం పూసినట్లు ఎండపడి మిలమిలలాడే మంచుపొరలు! కొండ శరీరంమీద తల్లి వక్షాన్ని అంటిపెట్టుకున్నట్లు అతిమెల్లగా మెత్తగా జరిగే బస్సు పసిపాపలా అనిపించింది. ఒకవైపు తలఎత్తి నిటారుగా చూడవలసిన మనోహర శిఖరదృశ్యం. మరోవైపు లోతుగా ఏదో పాతాళలోకంలో దృశ్యంలా భ్రమకొలిపే ప్రకృతి. ఆ లోయలోనే సింధునది పారుతుంది. బస్సు నడిచినంతమేరా మమ్మల్ని అనుసరిస్తున్న ప్రియాభిసారికలా కనిపించే సింధు శరీర సౌందర్యాన్ని ఎలా వర్ణించడం? దానికి పైగ, కొండల్లో, వాళ్ళల్లో ఆకాశాన్ని చీల్చుకుపోతున్నంత కోసుగా పెరిగి చ్రరున పైకి దూసుకుపోతున్న స్ప్రింగ్ కత్తుల్లాంటి పైన్ చెట్లు. చెట్టుమొదట ఒత్తుగా గుమ్మటంలా మొదలైన ఆకుల గుబురు పోనుపోను క్రమపద్ధతిలో సన్నబడి చివరకు సూదీగా తేలుతోంది. ఈ చెట్లన్నీ భూమంటపంమీద నీలిరంగు షామియానా నిలబడడానికి విశ్వకర్త అమర్చిన దన్ను కర్రల్లా శోభిస్తున్నయ్. నదీశయ్యనిండా ఎక్కడ చూసినా రాళ్ళు. ఉత్త ఒడుదుడుకుతనమే కాని లోతు తెలియని ప్రవాహశయ్య కర్కశంగా కనిపిస్తోంది. సగం నీటిలోమునిగి సగం తేలుతూ, తేలిన ఉపరితలం నీటి ఒరిపిడికి నున్నబడి మెరుస్తూ, పరమేశ్వరుడు ఉదారంగా అన్ని చేతులా విరజల్లిన మరకత మణుల్లా అనిపించసాగాయి రాళ్ళు. మెలికలు తిరుగుతూ నురుగులు కక్కుతూ, అడ్డుపడ్డ ప్రతిశిలాఖండాన్ని కసిగాట్లు కరుస్తూ, పగబట్టిన గోధుమవన్నె త్రాచులా భాసిస్తోంది ఏరు. అది అధోగతి ప్రసరణ కలదీ, మేము ఊర్ధ్వగాములమూ కాబట్టి సరిపోయింది గాని, లేకపోతే అది మామీదే పగబట్టి మా వెంటనే పడ్డదేమో అనిపించి ఉండేది.

(కాశ్మీర దీప కళిక, రచయిత సొంత ప్రచురణ, హైదరాబాదు, 1978. పేజీలు 68-75)

BRAOU

## అభ్యాసం (రాసేపని)

1. ఈ కింది వాక్యాల్లో క్రియలేని వాక్యాలను ముందు విడివిడి వాక్యాలుగా రాయండి. అందులో క్రియలేని వాక్యాలను మళ్ళీ వేరుగా రాయండి.

   *'రాజ్యలక్ష్మమ్మకారు మూడోరకం వారు; రాజ్యలక్ష్మమ్మగారు బ్రాహ్మ మహిళ. మానవ సమాజంలో యదార్థ 'బ్రాహ్మ' మూడవ తరగతికే ఎలా చెందాలో అతని జీవితంలో యదార్థ బ్రాహ్మ మహిళ అలాగే నిలవాలి.'*

   *"అంతేకాదు పాశ్చాత్యలోకం పురుషుడు; ప్రాచి స్త్రీ. అది పౌరుష శాలులొనర్చే లౌకిక సంగ్రామం. ఇది క్షమాత పస్వులు పరచే పరమపదం. అది పగలు; ఇది రాత్రి. పగలు పైకి చూస్తాం. రాత్రి లోపలున్న దాన్నే అన్వయించుకుంటాం."*

2. ఈ కింది వాక్యాల్లో కర్మ ప్రధాన వాక్యాలున్నాయి. వాటిని ఏ ప్రయోజనం కోసం రచయిత్రి ప్రయోగించి ఉంటారో ఊహించండి.

   అ) మహమ్మద్ తలవెంట్రుక ఒకటి అక్కడ పరిరక్షింపబడి పూజలందుకోవడం వల్ల దానికి క్షేత్రత్వం అబ్బింది.

   ఆ) యాత్రిసమయమప్పుడు అక్కడ అన్ని సౌకర్యాలూ కల్పింపబతాయట.

   ఇ) కాలం పొరలు ఒకదాని వెంట ఒకటి మనమీద కప్పబడుతున్నకొద్దీ జీవితంలో బాల్య సహజమైన ఉత్సాహమూ, శ్రమకోర్చేశక్తి ఉండవుకదా.

   ఈ) అక్కడ ఏళ్లతరబడి కప్పబడ్డ మంచు దిబ్బలు కరిగి పారిన ప్రవాహమే సింధునధి,

3. ఈ కింద కొన్ని ప్రశ్నార్థకవాక్యాలు ఉదహరించబడుతున్నాయి. అవి సమాధానాన్ని ఆశించి వేసిన ప్రశ్నలుకావు. అవి నిర్వహించే కార్యమేమిటో ఊహించండి.

(అ) బస్సు నడిచినంతమేరా మమ్మల్ని అనుసరిస్తున్న ప్రియాభిసారికలా కనిపించే సింధు శరీర సౌందర్యాన్ని ఎలా వర్ణించడం?

(ఆ) ఏ విషయాన్నైనా చర్చించడమెందుకు? ఘర్షణపడడమెందుకు? అనే శాంతి కాముకుడు మా దుకాణదారుడు.

(ఇ) నేపాల్, భూటాన్, సిక్కింలాగా అది (కాశ్మీర్) స్వతంత్ర రాజ్యమని మనమను కొంటున్నామా?

4. కాశ్మీర దీప కళికలో అట, కదా, మరి అనే పదాలు చివరవచ్చిన వాక్యాలు కొన్ని ఉన్నాయి. వాటిని అన్నీ ఏరి ఒకచోట రాయండి. వాటిని ఈ మాటలు లేకుండా చదవండి. తరవాత ఈ మాటలు చేర్చి చదవండి. అప్పుడు ఈ మాటలు చేర్చటంవల్ల ఆ వాక్యాల అర్థాల్లో కలిగిన మార్పు తెలుస్తుంది. ఆ మార్పును వివరించండి.
ఈ రకం మాటలు చేర్చటంవల్ల రచనా పద్ధతికి ప్రయోజనం ఏమైనా కలిగిందా?

5. "సాంప్రదాయికమైన నమ్మకాలు, భావ కవిత్వపు కాల్పనికత కలగలిసిన శైలి కృష్ణకుమారి గారిది" అన్నాము. అందుకు ఒక ఉదాహరణ ఈ కింది వాక్యం.
"పుణ్యాత్ముడి స్వచ్ఛమైన అంతరంగంలా మెరిసే ఆ సరస్సు వదిలి కళ్ళు ముందుకు కదల నని మొరాయించాయి."

పాపం-పుణ్యం అనేవి సాంప్రదాయికమైన భావనలు. అంతరంగం కంటికి కనిపించదు. కాని దానికి మెరుపు కాల్పనిక ప్రపంచంలోనే సాధ్యం. అందువల్ల ఈ పైవాక్యంలో సాంప్రదాయిక మైన నమ్మకమూ, కాల్పనికతా కనిపిస్తాయి. ఇట్లాంటివి ఇంకా ఈ పాఠంలోనుంచి ఏరి ఈ పద్ధతిలో వివరించండి.

6. కృష్ణకుమారి గారిలో ప్రకృతికి పరవశమైపోయే కవితా ధోరణి ఉందన్నాము. అందుకు ఈ కింది వాక్యం ఉదాహరణ.
''వెండి రేకు నొకదాన్ని భూమి ఉపరితలాన మిక్కిలి నేర్పుతో తాపడం చేసినట్లున్న ఆ సరస్సు నిస్తరంగంగా, నిశబ్దంగా శోభిస్తోంది"
తరంగాలు లేకుండా, కదలకుండా ఉన్న ఆ సరస్సు అందంగా ఉంది అని పైవాక్యం భావం. అయితే దాన్ని కవితామయం చేసే పోలిక ఒకటి ఉంది. భూమిమీద వెండిరేకు పరచినట్టుంది అనడం. తెల్లదనానికి పోలిక వెండి. తాపడంచేసిన స్థితి నిశ్చలస్థితికి సూచకం. ప్రకృతి సౌందర్యానికి పరవశమైపోయి కవితాత్మకంగా దృశ్య చిత్రణ చేసిన ప్రయత్నం. ఈ రకం వాక్యాలు కాశ్మీర దీపకళికలో ఇంకా ఉన్నాయి ఏరండి, వివరణ కూడా రాయండి.

7. కృష్ణకుమారిగారి రచనలో సంప్రదాయ సాహిత్య ప్రభావం కనిపిస్తుందన్నాం. దీన్ని పద ప్రయోగంలో తేలిగ్గా గుర్తుపట్టవచ్చు.
"దృశ్యపటల్లి, మధ్యందినాన, అతిథి భాంధవుడు,"- వంటి ప్రయోగాలు ఈనాటి వచనంలో అంత ఎక్కువగా కనపడవు. సంప్రదాయ సాహిత్యంతో మంచి పరిచయం ఉన్నవారి రచ నల్లోనే ఈ రకం పదప్రయోగం కనిపిస్తుంది. ఇట్లాంటి పదాలను ఇంకా ఏరి, వాటి అర్థా లనుకూడా రాయండి.

8. కృష్ణకుమారి రచనలో ఈనాటి తెలుగు భాషా నుడికారం (పలుకుబడి) కనిపిస్తుంది. దాన్ని సూచించే పదాలు, పదబంధాలూ ఏరండి:

9. ఈ రచనలో ఇప్పుడు చెప్పినవి కాక మీకు కనిపించే ఇతర విశేషాలను చూపించండి.

## ఖండిక 8 పాఠం 13

# సంశ్లిష్ట వాక్యాలు

**ఉద్దేశం**

ఒక వాక్యంలో ఇంకో వాక్యం ఇమడటంవల్ల సంశ్లిష్ట వాక్యం ఏర్పడుతుంది. ఈ రకపు వాక్యాలు తెలుగులో చాలా ఉన్నాయి. వాటిల్లో కొన్నిటిని పరిచయం చేసి వాటిని ఉపయోగించే పద్ధతులను గురించి సూచన లియ్యటం ఈ పాఠం ఉద్దేశం.

**ప్రణాళిక**

1. సంశ్లిష్ట వాక్యం ఏర్పడే పద్ధతి.
2. సంశ్లిష్ట వాక్యంలో వాక్యాల మధ్య విశేషణ, విశేష్య సంబంధం.
3. అసమాపక, సమాపక క్రియల స్థితి.
4. సంబంధబోధక వాక్యాలు-వాటిలో రకాలు, వాటి ప్రయోగ భేదాలు.
5. ఇదంత క్రియా రూపాలతో వచ్చే వాక్యాలు.
6. అనుకరణ వాక్యాలు, ప్రత్యక్ష పరోక్ష అనుకరణ భేదాలు.

BRAOU

## సంశ్లిష్ట వాక్యాలు ఏర్పడే పద్ధతి

ఒక వాక్యం ఇంకో వాక్యంలో ఇమిడిపోతే ఆ మొత్తాన్ని సంశ్లిష్ట వాక్యం అంటారు. ఒక వాక్యంలో ఎన్ని వాక్యాలైనా ఇమిడిపోవచ్చు. దానికి పరిమితి లేదు. అయితే ఇట్లా మరీ వాక్యాల్ని ఇమిడ్చి పెద్దపెద్ద వాక్యాలురాస్తే అర్థం చేసుకోటం కష్టం అవుతుంది. అట్లా అని అన్నీ చిన్న వాక్యాలే అప్రయత్నంగా రాయలేము. అందుకని సంశ్లిష్ట వాక్యాలు అవసరమైనప్పుడు మాత్రమే, అవసరమైనంత పెద్దవిగా రాయాలి.

సంశ్లిష్ట వాక్యాల్లో ఒక ప్రధాన వాక్యం ఉంటుంది. దాన్ని చుట్టుకొని ప్రధాన వాక్యపు అర్థానికి చేర్పులూ మార్పులూ కలిగిస్తూ కొన్ని వాక్యాలుంటాయి. ప్రధాన వాక్యాన్ని విశేష్య వాక్యమనీ, తతిమ్మా వాటిని విశేషణ వాక్యాలనీ అందాం. మంచి పిల్లవాడు అనే సమాసంలో మంచి విశేషణమనీ, పిల్లవాడు విశేష్యమనీ పూర్వం తెలుసుకున్నారు. ఇది పదాలకు సంబంధించిన విచారణ. వాక్యాల్లోకూడా ఇట్లాంటి సంబంధాన్నే, విశేషణ విశేష్య వాక్యాలమధ్య గుర్తించగలం.

ఒక్కోసారి విశేషణ వాక్యంలో సాధారణంగా అసమాపక క్రియ ఉంటుంది. విశేష్య (ప్రధాన) వాక్యంలో సమాపక క్రియ ఉంటుంది. ప్రధాన వాక్యం ఇంతకు పూర్వం పాఠంలో చెప్పుకున్న క్రియలేని వాక్యం అయితే సమాపక క్రియ ఉండదు.

ఒక్కోసారి విశేషణ వాక్యాల్లో సమాపక క్రియ ఉండవచ్చు. తెలుగులో కొన్నిచోట్ల విశేషణ వాక్యానికి వాక్యస్థాయి ఉండదు. ఉదాహరణకు ఈ కింది వాక్యాలు చూడండి:

"నిన్న మీరు నిన్న సినిమాహాల్లో ఎవర్ని చూశారో అతను మా తమ్ముడు" పైవాక్యంలో "చూశారో" అనే పదంతో "చూశారు" అనే సమాపక క్రియ ఉంది. అయినా అది విశేషణ వాక్యంలో భాగమే. "అతను మా తమ్ముడు" అనే ప్రధాన వాక్యానికి విశేషణంగా వర్తిస్తున్నది. ప్రధాన వాక్యం క్రియలేని వాక్యం గనుక సమాపక క్రియ లేదు.

"మీరు నిన్న సినిమాలో చూసిన
అబ్బాయి మా తమ్ముడు"

అనే వాక్యం చూడండి, ఇందులో అబ్బాయి అనే నామానికి విశేషణంగా వచ్చిన "మీరు నిన్న సిని మాలో చూసిన" అనే భాగానికి వాక్యస్థాయి లేదు. చదివేటప్పుడు అక్కడ విరామం కూడా ఇయ్యలేము. పద స్థాయి కూడా లేదు, రెంటికీ మధ్యస్థంగా ఉంది. అయినా కర్త, కర్మ వంటి సంబంధాలను గుర్తించగలం కాబట్టి, దీన్ని వాక్యంగానే గుర్తించి మాట్లాడుకుంటున్నాం.

(వాక్యాల్ని గురించి మాట్లాడేటప్పుడు కొద్ది కొద్దిగా వ్యాకరణపు మాటలు రాకుండా మాట్లాడుకోటం కష్టం గనక ఈ పాఠంలో కొన్ని సాంకేతిక పదాలు కనిపిస్తాయి. అయితే అవసరమైనంత వరకే ఈ మాటలు వాడు తున్నాం. ఇక్కడ ఈ మాటలు అంత ప్రధానం కాదు. ఈ మాటల సాయంతో చెప్పదల్చుకున్న విషయం ముఖ్యం.)

**సంబంధ బోధక వాక్యాలు**

ఒక వాక్యంలో నామం కర్తగానూ ఉండవచ్చు, కర్మగానూ ఉండవచ్చు. ఈ నామానికి విశేషణ పదాలు చేరతాయి. మంచి, చెడ్డ, కొత్త, పాత, తెల్ల, నల్ల - అట్లాంటివి నామ పదాలకు ముందు వచ్చి వాటిగురించి విశేషాలు చెపుతాయి. ఇట్లాంటి వాటిని విశేషణాలంటాం. అయితే ఈ విశేషణాలకు బదులుగా ఒక వాక్యమే రావచ్చు. అట్లా విశేషణంగా వచ్చిన వాక్యంలో కొన్ని మార్పులు జరుగుతాయి. ఈ మార్పుల తరవాత, అట్లా నామ పదానికి విశేణంగా వచ్చిన వాక్యాన్ని ఇంగ్లీషులో రిలెటివ్ క్లాజ్ (reletive clause) అంటారు. ఈ రకమైన క్లాజులు ప్రపంచంలో దాదాపు అన్ని భాషల్లోనూ కనిపిస్తాయి. తెలుగులో అట్లాంటి పద్ధతులు మూడు కనిపిస్తున్నాయి. వాటి ప్రయోజనాన్ని, ప్రయోగాన్ని తెలుసుకోటం అవసరం:

1. *"మొన్న నీకో పుస్తకం చూపించానే ఆ పుస్తకం ఎక్కడుంది?"*
2. *"మొన్న నీకు చూపించిన పుస్తకం ఎక్కడుంది."*
3. *"మొన్న నీకు ఏ పుస్తకం చూపించానో ఆ పుస్తకం ఎక్కడుంది?"*

ఈ మూడు వాక్యాలకూ అర్థం ఒకటే అయినా మూడు రకాలను ఒకదాని బదులు ఇంకొకటి వాడలేం. ఆ మాటకొస్తే, ఈ పై వాక్యాల్లో మూడోది కొంచెం ఎబ్బెట్టుగానూ ఉంది. అట్లాంటి వాక్యాలు ఇంకా చూడండి:

*"ఏ అగ్గిపెట్టె నిన్న బజార్లో కొన్నానో ఆ అగ్గిపెట్టె చాలా కొత్తరకం."*
*"ఏ పత్రిక నిన్న నా చేతిలో చూశావో అది మానపత్రిక."*

ఈ రకం వాక్యాలు వ్యాకరణ ప్రకారం సరిగ్గానే ఉన్నాయి. అయినా వాటి ఆ సందర్భాల్లో అనం, రాయం, ఈ రకం ఏ-ఆ వాక్యాలు మామూలు దైనందిన విషయాలకు తెలుగులో వాడరు. కొన్ని ప్రత్యేక స్థితుల్లోనే ఈ వాక్యాలు కనిపిస్తాయి. రాజకీయోపన్యాసంలో ఉండటానికి వీలున్న ఈ వాక్యాన్ని గమనించండి:

*"స్వాతంత్ర్యం కోసం, భారత ప్రజలు అనల్పమైన త్యాగాలు చేశారో, ఏ స్వాతంత్ర్యం కోసం కళ్ళల్లో వత్తులు పెట్టుకొని ఎదురు చూశామో, ఆ స్వాతంత్ర్యం ప్రజల ఆశలు తీర్చలేక పోయింది"*

ఈ పై వాక్యం ఇంతకుముందు వాక్యాలతో పోల్చుకుంటే సహజంగా ఉంది. వక్త లేక రచయిత ఆవేశం వ్యక్తమయినచోట ఈ రకపు ఏ-ఆ వాక్యాలు సహజంగా ఉంటాయి. అందుకే కవిత్వంలో ఈ రకపు వాక్యాలు ఇమిడిపోతాయి. ఉదాహరణకు స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా శ్రీశ్రీ గారు రచించిన ఈ పద్యం చూడండి.

*"ఏ స్వాతంత్ర్యం నిమిత్తం ఎవరెవ్వారో ఎందరో దేశ సేవా*
*భాస్వంతుల్ బాల, వృద్ధుల్, సతితులధికుల ప్రాజ్ఞులు తృజ్ఞులంతా*
*అస్వాశల్ వీడి లాఠీహతులయి ఉరికొయ్యల్ కవుంగింట చేర్చా*
*రా స్వాతంత్ర్యం లభించెందని హృదయం హ్లాదసంపుష్టమైతే"*



BRAOU

మొదటిరకం వాక్యం మాట్లాడే వాడు వినేవాడు ఎదురుగా ఉన్నప్పుడు గాని, ఉన్నట్టు ఊహించిన సాహిత్యంలో కాని కనిపిస్తుంది. **'మొన్న నీకో పుస్తకం చూపించానే'** అనటం వల్ల వ్యక్తి తను చెప్పదలచిన విషయానికి వినేవాడి (లేక చదివేవాడి) ఆమోద ముద్రకోరుతున్నాడు. ఇట్లాంటివి కథల్లో, సంభాషణల్లో రావచ్చు కాని వస్తుగతమైన విషయ విమర్శలో వచ్చే అవకాశం చాలా తక్కువ. పాఠకులను తనతో లాక్కుపోయే రకపు శైలిలో ఇట్లాంటి వాక్యాలుండే వీలుంది.

**'మొన్న నీకు చూపించిన పుస్తకం'** అనే రకపు వాక్యాలు సాధారణ స్థితిలో వాడేవి. ఈ పద్ధతిని నామ్నీకరణ పద్ధతిగా వాక్య నిర్మాణ చర్చలో భావిస్తారు. ఒక వాక్యపు నామపదం స్థానంలో ఇంకో వాక్యం ఇమిడే పద్ధతిని నామ్నీకరణం అంటారు. (అంతకన్నా ఎక్కువ వివరాలు మీకీ దశలో అక్కరలేదు) ఈరకపు వాక్యాల్లో ఒకటికన్నా ఎక్కువ వాక్యాలు చొప్పిస్తే రచనలో ఒక్కొసారీ అర్థ క్లేశం రావచ్చు.

*''నువ్వు చూసిన అమ్మాయి చెప్పిన సినిమా హిందీదా? తెలుగుదా?''* ఈ వాక్యంలో ''నువ్వు చూసిన, అమ్మాయి చెప్పిన'' అని అర్థంకావచ్చు. అంటే నువ్వు సినిమా చూశావు. అమ్మాయి ఆ సినిమా గురించి చెప్పింది అని అర్థంకావచ్చు, *"అమ్మాయిని నువ్వు చూశావు (సినిమా చూడలేదు) ఆమె సినిమా గురించి చెప్పింది"* అనే అర్థం కావచ్చు. ఇట్లాంటి సందర్భాల్లో వాక్యాలు విడదీసి రాయటమే మంచిది.

ఈరకపు వాక్యాల్లో ప్రాచీన భాషలో *"నా చేసిన పని"* అని ఉంటే ఈనాటి భాషలో నేను చేసిన పని అని ఉంటుంది. ఇప్పటి భాషలో ఇప్పటి వాడుకను రాయటమే మంచిది. అట్లాగే ప్రాచీనభాషలో *"నా ఈ చేసిన కార్యము"* అని ఉండవచ్చు. ఇప్పటి భాషలో *"నేను చేసిన ఈ కార్యము (పని)"* అనే క్రమంలోఉంటుంది. ఇవి రాసేటప్పుడు కష్టంలేకుండానే గ్రహించేవిషయాలు.

### ఇదంత క్రియారూపాలతో వచ్చే వాక్యాలు

ఇత్ + అంత అనేది ఇదంత అయింది. ఇత్ అంటే ఇకారాంతం. అది చివరలోవచ్చే క్రియారూపాలువచ్చి, చేసి, చూసి, తిని, తాగి, చదివి – వంటివి. వీటికి ప్రాచీనవ్యాకరణ సంప్రదాయంలో **క్త్వార్థకం** అనీ, **ఇ-ప్రత్యయాంతావ్యయం** అనీ వ్యవహారంలో ఉన్నాయి.

పూర్వం వాక్యంలో కర్త, కర్మ, క్రియ- సంబంధాల్ని గురించి తెలుసుకున్నాం. కర్త అంటే కార్యం నిర్వహించేవాడు అని అర్థం. అయితే ఈపాఠంలో కర్త అంటే ఇంగ్లీషులో Subject అనేఅర్థంలో వాడుకుందాం.

కాలంలో క్రమంగా జరిగిన కొన్ని సంఘటనలు చెప్పడానికి అసమాపక క్రియలను ఉపయోగిస్తారు. సంఘటనలకు ఒకేవ్యక్తి (లేక ప్రాణి) బాధ్యుడయితే పూర్వాపూర్వ సంఘటనలు ఇ-ప్రత్యయంతో ముగిసే క్రియల ద్వారా వ్యక్తమవుతాయి. చివరి క్రియ సమాపక క్రియ.

*"అతను కాఫీ తాగి బయటికి వెళ్ళాడు"*

*''కాఫీ తాగటం, బయటికి వెళ్ళటం''*

అనే రెండు పనులు ఒకరే ఒకదాని తరవాత ఒకటి చేసినప్పుడు ఈ రకమైన క్రియ వాడతారు, ఈ క్రియవాడినప్పుడు ఒక్కొసారి తరవాత క్రియకు కారణాన్ని సూచిస్తుంది,

*''ఆమె పనిచేసి అలిసిపోయింది.''*

అలిసి పోవటానికి కారణం పని చెయ్యటం అని ఈ వాక్యం ద్వారా అర్థమవుతున్నది. ఈ అర్థం ఎప్పుడు వస్తుందని ఇదమిద్ధంగా చెప్పలేము. ఆ క్రియల అర్థాల్ని బట్టి ఈ కార్యకారణ సంబంధం ఏర్పడుతుంది. ఒక్కొసారి ఇట్లాంటి వాక్యాల్లో ఆనుపూర్వీక సంబంధం (ఒకదాని తరవాత ఒకటి జరిగిందని చెప్పే సంబంధం కార్య కారణం సంబంధం- రెండూ ఉండవచ్చు.

*"ఆమె మందు తాగి నిద్రపోయింది"*

ఇందులో మందు తాగటం, నిదరపోవటం కేవలం ఒక వరసలో జరిగిన కార్యాలు కావచ్చు. లేక మందు తాగటం నిద్రపోవటానికి కారణం కావచ్చు.

ఇట్లాంటి వాక్యాల వ్యతిరేక రూపాల్ని ఇట్లా అర్థాలు కలిసిపోవు.

*"ఆ అమ్మాయి అన్నం తినకుండా బడికి వెళ్ళింది"*

*''ఆ అమ్మాయి అన్నం తినక చిక్కిపోయింది''*

ఈ పై రెండు వాక్యాల్లో రెండోదాంట్లో కార్యకారణ సంబంధం ఉంది. ''ఆ అమ్మాయి అన్నం తినకుండా చిక్కిపోయింది" అన్నా, ''అన్నంతినక బడికి వెళ్ళింది'' అన్నా ఇప్పటి వాడుకకు విరుద్ధమవుతుంది.

(ఈ రకం అసమాపక క్రియకు చాలా ప్రయోజనాలున్నాయి. అవన్నీ ఈ పాఠంలో చెప్పటానికి కుదరదు).

మరికొన్ని వాక్యాలో కాలబోధకు ఈ అసమాపక క్రియ ఉపయోగిస్తారు:

'భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 36 ఏళ్లు అయింది'

అనే వాక్యం 'భారతదేశానికి 36 ఏళ్ళ కిందట స్వాతంత్ర్యం వచ్చింది' అనే వాక్యంతో సమానం అయితే రెండోదాన్ని కథన శైలిలో మాత్రమే ఉపయోగిస్తారు. అంటే కేవలం స్వాతంత్ర్యం వచ్చింది అన్న విషయానికే ప్రాధాన్యం. మొదటి వాక్యంలో 36 ఏళ్ళ కాలానికి ప్రాధాన్యం ఉంది. 36 ఏళ్ళు అయింది. ఇంకా ప్రజల ప్రాథమిక అవసరాలు తీరలేదని ఇంకా ఏవేవో ఆశించినవి జరగలేదు అని చెప్పబోయే ఇతర విషయాలకు భూమికగా ఉపయోగిస్తుంది. వాక్య ప్రయోగంలో ఈ రకమైన ప్రయోజనాలను గమనించి ఈ వాక్యాలను వాడుకోవాలి.

వీటి వ్యతిరేక క్రియలతో కూడా ఇట్లా కాలాన్ని సూచించే ప్రయోగాలున్నాయి. నిశ్చయ, వ్యతిరేక క్రియలతో వాక్యాలను పోల్చి చూస్తే ఒక విచిత్రం కనిపిస్తుంది. చూడండి.

'నేను సినిమా చూసి 6 నెలలయింది'

'నేను సినిమా చూడక 6 నెలలయింది'

రెండు వాక్యాలకు ప్రధానమైన అర్థంలో భేదం ఉన్నట్టు కనపడదు. మొదటి వాక్యంలో సినిమా చూసిన తరవాత జరిగిన కాలానికి ప్రాధాన్యం ఉంది. రెండో వాక్యంలో సినిమా చూడకుండా జరిగిన కాలానికి ప్రాధాన్యం ఉంది. రెండో వాక్యంలో సినిమా చూడాలన్న కోరిక ఎక్కువ కనిపిస్తుంది. పదే పదే జరగటానికి వీలున్న సంఘటనలే ఈ వాక్యాలో వస్తాయి.

"ఆమె బావిలో పడి పది రోజులయింది'' అనే వాక్యం బాగానే ఉంటుంది కాని

"ఆమె బావిలో పడక పది రోజులయింది'' అంటే ఎబ్బెట్టుగా ఉంటుంది. ప్రతిరోజూ బావిలో పడాలని ఎవరూ కోరుకోరు కదా !

సంఘటనలకు వేరు వేరు కర్తలున్నప్పుడు ఇదంత క్రియలతో ఒక వాక్యంగా చెప్పటానికి వీలులేదు.

"సుజాత బజారుకు వెళ్ళి సుబ్బారావు కాలేజికి వెళ్ళాడు" అనకూడదు. అట్లాంటిసందర్భాల్లో "సుజాత బజారుకు వెళ్ళితే సుబ్బారావు కాలేజికి వెళ్ళాడు" అనాలి. వేరు వేరు కర్తల వేరు వేరు పనులు ఒక వాక్యంలో చెప్పే పద్ధతి ఇది.

ఈరకం వాక్యాల్లో- తే చివరలో వచ్చే అసమాపక క్రియ ఉన్నవాక్యాలు- చివరిక్రియ జరిగినవిషయాన్ని చెప్పేది కాక జరగని లేక ఇంకాజరగు విషయాన్ని చెప్పినప్పుడు కార్యకారణ సంబంధం వ్యక్తమవుతుంది.

*"సుబ్బారావు కాలేజికి వెళ్తే సుజాత సినిమాకి వెళ్తుంది"*

పైవాక్యంలో సుబ్బారావు కాలేజికి వెళ్లకపోతే సుజాత సినిమాకు వెళ్ళదు అనే అర్థం ఉంది.

**అనుకరణ వాక్యాలు**

ఒకరు అన్న మాటలను ఇంకొకరికి చెప్పేపద్ధతిని అనుకరణం అంటారు. దీంట్లో ప్రత్యక్ష అనుకరణం-పరోక్ష అనుకరణం అని రెండు రకాలు. ఒకరు అన్నమాటలను వాళ్ళు అన్నట్టుగానే అదే మాటలో చెపితే

BRAOU



apou
LIBRARY

ప్రత్యక్ష అనుకరణం అంటారు. ఒకరు అన్న మాటల సారాంశం చెపితే పరోక్ష అనుకరణం అంటారు. ఈ రెండు పద్ధతులు దాదాపు అన్ని భాషలలోనూ ఉంటాయి. ఇంగ్లీషులో వీటిని direct speech and indirect speech అంటారు.

ప్రత్యక్షానుకృతిలో వాక్యాలుకాని ధ్వనులు అనవచ్చు. పరోక్ష అనుకృతి అంతా ఒక వాక్యమే అయి ఉండాలి.

వెంకయ్యగారు వాళ్ళబ్బాయిని *"ఏంరా! ఇంతవరకు నీకు బుద్ధి రాలేదా! ఎన్నిసార్లు పరీక్షలు రాస్తావ్"* అని తిట్టారు.

ఇది ప్రత్యక్ష అనుకృతి. దీన్నే పరోక్ష అనుకృతిలో చెపితే

*'వెంకయ్యగారు వాళ్ళబ్బాయిని సరిగ్గా చదువుకోటంలేదని తిట్టారు'* అని ఉంటుంది.

సంభాషణ శైలిలో ప్రత్యక్ష అనుకరణ ఉంటుంది. ముఖ్యంగా కథలో, నవల్లో ఇట్లాంటివి ఎక్కువ ఉంటాయి. వారాపత్రికలో పరోక్ష అనుకరణలు ఎక్కువ ఉంటాయి. ఏదైనా ఒక ఉపన్యాసం పత్రికల్లో ప్రచురించినప్పుడు మొత్తం ప్రత్యక్ష అనుకరణలో ప్రచురిస్తే చదివే వాళ్ళకు విసుగు కలుగుతుంది. అందుకని కొంత ప్రత్యక్ష అనుకరణలోనూ, మిగతాది పరోక్ష అనుకరణలో చెపుతారు. వార్తా పత్రికలో దొరికే చోటును బట్టి ఉపన్యాసాన్ని కుదించాల్సి ఉంటుంది. పరోక్ష అనుకరణలో సాధ్యమవుతుంది.

ప్రత్యక్ష అనుకరణ శబ్ద ప్రధానం. విపులం అన్నది అన్నట్టు చెప్పటానికి చేసే ప్రయత్నం. ఇది సంభాషణ శైలిలో అవసరం.

పరోక్ష అనుకరణ భావప్రధానం. కుదించే వీలుంది. కథన శైలిలో దీని అవసరం ఎక్కువ.
పరోక్ష అనుకరణలో అనుకరించిన భాగం అంతా ఒక వాక్యమే అయి ఉండాలి.
ఈ కింది ఉదాహరణ చూడండి:

BRAOU

**ప్రత్యక్ష అనుకరణ**

ఆమె ఇలా అన్నారు *"నేను అమెరికా అధ్యక్షుణ్ణి కలుసుకున్నాను. మన విదేశాంగ విధానాన్ని వివరించాను. ఉభయదేశాల సమస్యలను చర్చించుకున్నాము."*

**పరోక్ష అనుకరణ**

"తాను అమెరికా అధ్యక్షుణ్ణి కలుసుకొని మన విదేశాంగ విధానాన్ని వివరించి ఉభయదేశాల సమస్యలను ఆయనతో చర్చించానని ఆమె అన్నారు."

మొత్తం ఉపన్యాసం ఇట్లా ఒకే వాక్యంలో కుదించటం ప్రయాసతో కూడినపని. పైగా పాఠకులకు విసుగెత్తిస్తుంది. అందుకని దీన్ని చిన్న చిన్న వాక్యాలుగా విడగొడతారు.

"తాను అమెరికా అధ్యక్షుణ్ణి కలుసుకొని మన విదేశాంగవిధానాన్ని చర్చించామని చెప్పారు. ఉభయదేశాల సమస్యలను ఆయనతో చర్చించామన్నారు."

ఒక పెద్దఉపన్యాసాన్ని చిన్నచిన్న వాక్యాలుగా విడగొట్టి రాసినపుడు ప్రతీసారి **అన్నారు, చెప్పారు** అంటే చదివేటప్పుడు విసుగుపుడుతుంది. ఈ అర్థంలో రకరకాల క్రియలు ప్రాచీన భాషనుంచి కూడాగ్రహించి పత్రికలో వాడుతున్నారు. వాటిలో కొన్ని ఇవి: ఉద్ఘాటించు, తెలియజేయు, నొక్కిచెప్పు. పేర్కొను, ప్రకటించు వక్కాణించు వివరించు, వెల్లడించు, వ్యక్తంచేయు.

అనుకరించిన భాగానికి **అని** అనే శబ్దాన్ని తగిలించటంవల్ల అది అనుకరణ వాక్యం అనితెలుస్తుంది. అయితే ఈ అని వాక్యాలు మరికొన్ని ఇతర ప్రయోజనలకోసం వాడుతారు. "నాకు సినిమాకు వెళ్ళాలని (వెళదామని) ఉంది." ఇక్కడ **అని**– వాక్యం కోరికను సూచిస్తున్నది.

"నేను సరిగ్గా చదవనని మానాన్నకు కోపం" అన్నప్పుడు **అని** కారణాన్ని సూచిస్తుంది. **కాబట్టి** అనే మాటను కూడా కారణం చెప్పటానికి వాడుతారు. "నేను సరిగ్గా చదువను కాబట్టి మానాన్నకు కోపం" అని **అని**కి బదులు **కాబట్టి** వాడవచ్చు. అయితే **అని**తో ఉన్న అనుకరణ వాక్యంలో చెప్పింది నిజం కావాలని లేదు. కాని **కాబట్టి** వాడితే అది నిజమేనని చెప్పినట్టు అవుతుంది. అందువల్ల నిశ్చయంగా నిజమని చెప్పదాల్చుకున్నప్పుడే **కాబట్టి** వాడాలి. ఇతరులు అనుకున్నారు అని చెప్పినప్పుడే **అని** ఉపయోగిస్తారు.

ఈ సందర్భంలో తెలుగులో **అట** అనే శబ్దంగురించి తెలుసుకోటం ఉపయోగం. ఈ వాక్యాలు చూడండి:

"ఆ అమ్మాయికి పెళ్ళి అయిందట.
ఉద్యోగుల సమ్మెవల్ల యూనివర్సిటీ మూసివేశారట.
అతనికి స్కూటరుమీద నుంచి కిందపడితే దెబ్బతగిలిందట."

వక్తకు (మాట్లాడేవాడికి) ఒక విషయం గురించి ప్రత్యక్ష జ్ఞానం లేనప్పుడు ఇంకెవరో చెప్పిన విషయాన్ని ఆధారం చేసుకొని చెప్తున్నప్పుడు **అట** అనే మాటను వాక్యం చివర తగిలిస్తారు. వాక్యంలో చెప్పిన విషయం సత్యాసత్యాలకు వక్త బాధ్యత వహించదల్చుకోనప్పుడు ఈ **అట** శబ్దాన్ని వాడతారు.

ఇట్లా తెలుగులో ఎన్నో వాక్య భేదాలు రకరకాల ప్రయోజనాలకు వాడతాం. అన్నిరకాల భేదాలను ఒక పాఠంలో డిగ్రీస్థాయిలో తెల్పటానికి వీలుకాదు. అందువల్ల కొన్నిటిని గురించే ఈ పాఠంలో ముచ్చటించుకున్నాం. అయితే ఈ విధంగా వాక్యభేదాలను ప్రయోజన దృష్టితో చూడటం అలవాటు చేసుకుంటే వాక్యాలను అర్థవంతంగా ప్రయోగించటం నేర్చుకోవచ్చు. ఒకసారి అట్లాంటి అలవాటు నేర్చుకుంటే చాలా వాక్యాల ప్రయోజనాలు ఎవరికివారే గ్రహించవచ్చు.

ఈ పాఠంలో నేర్చుకున్న విషయాలివి :

1. ఒక వాక్యంలో మరో వాక్యం ఇమిడిస్తే సంశ్లిష్ట వాక్యాలు ఏర్పడతాయి.
2. సంశ్లిష్ట వాక్యంలో విశేషణ వాక్యం విశేష వాక్యం అని ఉంటాయి. వాటిమధ్య సంబంధం విశేషణ విశేష్య పదాల మధ్య ఉన్నట్టే ఉంటుంది.
3. సంబంధ బోధక వాక్యాలు తెలుగులో మూడు రకాలున్నాయి. అందులో **ఏ-ఆ** అనే రకపు వాక్యాలు ఉపన్యాస ధోరణిలో, ఆవేశంతో చెప్పినపుడు వాడతారు. సాధారణ విషయాలకు వాడరు.
4. ఒకే వ్యక్తి నిర్వహించిన వాక్యాల మధ్య ఆనుపూర్వీసంబంధం చెప్పవలసివచ్చినప్పుడు **ఇదంత** క్రియ వాడతారు.
5. సంఘటనల మధ్య కార్యకారణ సంబంధమున్నప్పుడు కూడా **ఇదంత** క్రియ వాడతారు.
6. ఇదంత క్రియ (పాత వ్యాకరణాల్లో క్త్వార్థకం అంటారు) కాల ప్రాధాన్యాన్ని సూచించటానికి కూడా వాడతారు.
7. కార్యాల కర్తలు వేరు వేరయినప్పుడు **తే-** చివరలో వచ్చే క్రియ వాడతారు. (సాంప్రదాయిక వ్యాకరణాలో దీన్ని చేదర్థక క్రియ అంటారు).
8. అనుకరణలో ప్రత్యక్ష పరోక్ష భేదాలున్నాయి.
9. ప్రత్యక్ష అనుకరణ సంభాషణ శైలిలోనూ పరోక్ష అనుకరణ కథన శైలిలోనూ వాడతారు.
10. వాక్య విషయ సత్యా సత్యాల బాధ్యత వక్త తీసుకోదల్చుకోనప్పుడు ఆ వాక్యానికి **అట** చివర తగిలిస్తారు.

## అభ్యాసం (చదివేపని)

ప్రస్తుత సమాజంలో ఉన్న స్త్రీల బానిసస్థితిని గురించి వారు ఎదుర్కొంటున్న వివిధ సమస్యల గురించి రాసే రచయితలు తెలుగులో చాల తక్కువ. చలం తరవాత వారిలో రంగనాయకమ్మగారిది విశిష్టమైన మార్గం.

BRAOU

ఈ నాటి వైవాహిక సంబంధాల్లో స్త్రీలకు ఏ విధంగా అన్యాయం జరుగుతున్నదీ ఆమె తమ నవలల్లో వ్యాసాల్లో చిత్రించారు. ఇటీవల రచనల్లో స్త్రీ విముక్తిని ప్రబోధించారు. పేక మేడలు, బలిపీఠం, రచయిత్రి, అంధకారంలో, స్వీటిహోం, అనితర సాధ్యుడు, జానకి విముక్తి - ఇవి వీరి నవలల్లో ముఖ్యమైనవి.

రంగనాయకమ్మగారి రచనలో పునరుక్తి అనిపించేంతగా విషయ స్పష్టత ఉంటుంది. వాక్యాల్లో డొంక తిరుగుడు ఉండదు. సూటిగా పదునుగా ఉంటాయి. మధ్య మధ్యలో వ్యంగ్య పూర్వకమైన హాస్యధోరణి తొంగి చూస్తుంటుంది.

స్త్రీలను వ్యక్తిత్వంలేని మూసబొమ్మలుగా తెలుగు సినిమాలు చిత్రించే పద్ధతిని రంగనాయకమ్మగారు ఈ వ్యాసంలో విమర్శించారు.

## సినిమాలలో స్త్రీ పాత్రలు

**రంగనాయకమ్మ**

సినిమాల్ని 4 రకాలుగా విభజించవచ్చును.

1. పౌరాణికాలు
2. చారిత్రకాలు
3. జానపదాలు
4. సాంఘికాలు

పౌరాణికాలలోనూ, చారిత్రకాలలోనూ కథంతా నిర్ణయమై పోయివుంటుంది. పాత్రల స్వభావాలూ, దుస్తులూ, మాటలూ అన్నీ నిర్ణయమైపోయివుంటాయి.

BRAOU

సీతతో కాబరే డ్యాన్సుచేయించడం కుదరదు. కృష్ణదేవరాయలకి "సూట్" వెయ్యడమూ కుదరదు.

సతీసావిత్రి- భర్తపోయాక, ఇంకో పెళ్ళి చేసుకుంటే, మనకి చాలా కోపం వచ్చేస్తుంది- సినిమా తీసిన వాళ్ళమీద. సుమతి భర్త వేశ్య దగ్గరికి వెళ్తున్నప్పుడు ఆవిడ చాలా వినయంగా, భక్తిగా- "మీ ఆనందమే నా ఆనందం నాథా! తప్పకుండా మీకోరిక నెరవేరుస్తాను." అనాలిగానీ, భర్త కోరిక వినగానే మండిపడిందంటే ఆ పాత్రని ఖూనీ చేశారని గోలపెట్టేస్తాం.

అలెగ్జాండరూ, అశోకుడూ, అక్బరూ ప్రజల్ని మహాచక్కగా పరిపాలించారు- అని చెప్పాలిగానీ, "తెగ యుద్ధాలు చేసి ప్రజల్ని చావగొట్టారు" అని చెప్పే చరిత్ర మేష్టార్లకి చాలా కోపాలొస్తాయి.

ఈవిధంగా పురాణకథలూ, చరిత్రకథలూ, వొక్కముక్కన్నా మార్చడానికి వీల్లేనంత పక్బందీగా నిర్ణయమైపోయివుంటాయి. వున్న కథనే ఎంత అందంగా చూపించారు- అని ఆలోచించాలిగానీ, వాటిలో స్త్రీపాత్రగానీ, ఏపాత్రనిగానీ కొత్తస్వభావంతో చిత్రించడానికి వీలుండదు.

ఇలాగే జానపద సినిమాల్నికూడా వొదిలెయ్యాలి. వాటిలో ఏపాత్రా నేలని అంటుకుని వుండదు. చీమలు ఎగురుతాయి. పాములు మాట్లాడతాయి. మనుషులు దేవుళ్ళ దగ్గరికో, రాక్షసుల దగ్గరికో వెళ్ళి వొస్తూ వుంటారు. స్త్రీ పాత్రలూ, పురుష పాత్రలూ, దేవకన్యలూ, చిలుకలూ, కాకులూ, అన్నీ 'కామన్ సెన్స్' ని (లోకజ్ఞానాన్ని) ధిక్కరించి తమాషా వ్యవహారాలు చేస్తూవుంటాయి.

ఈ 'కల్పన'ని మనం నిజంగానే ఆనందిస్తాంగానీ విమర్శించం. (చాలాసార్లు దీన్ని నిజంగానే నమ్ముతాం కూడా- సైన్సు జ్ఞానం తగినంతగా లేక)-

ఎట్టొచ్చీ మనం సాంఘికమైన కథలు చెప్పే సినిమాలలోనే మంచి చెడ్డలు వెతుక్కోవాల్సి వుంటుంది. (సాంఘికాలంటే ఈనాటి సంఘానికి సంబంధించిన విషయాలు.)

మళ్ళీ ఈరకం సినిమాల్లో రెండు రకాలు-

1. కుటుంబ చిత్రాలు
2. బజారు చిత్రాలు

'బజారు చిత్రాల'కి ఈ పేరు పెట్టడం తప్పు కాదనుకుంటాను. వీటినే "క్రయిమ్ చిత్రాలు" అంటారు. వీటిలో చట్టవిరుద్ధమైన నేరాలు చేసే "పెద్ద" మనుషుల్ని పోలీసులు జెయిలో పడెయ్యడమో, విదేశీ గూఢచారుల్ని మన డిటెక్టీవ్‌లు పట్టి బంధించడమో, విలన్‌మీద హీరో పది తరాల్నాటి పగ తీర్చుకోవడమో లాంటి కథలు వుంటాయి. ఇలాంటి సినిమాలలో స్త్రీ పాత్రలు గానీ వుంటే, అవి సి.ఐ.డీకి అసిస్టెంట్లుగానో, దొంగలకు ప్రియురాలుగానో,క్లబ్బులో డాన్సర్లుగానో వుంటాయి. ఈపాత్రల చిత్రణ బాగుందా లేదా అని ఆలోచించడం పిచ్చిపని.

ఈ పాత్రల చిత్రణ గురించి తలలు బద్దలుకొట్టుకోవడం కన్నా, ఆ దొంగ లెక్కే గుర్రాల పరుగులూ, డిటెక్టివ్‌లు పేల్చే తుపాకీల మోతలూ విని ఆనందించి రావడం కొంతన్నా ఆరోగ్యం కాబట్టి ఈ '*బజారు*' చిత్రాల గురించి.వొదిలేద్దాం.

ఇక '*కుటుంబ చిత్రాల*' సంగతి. వీటిలో కథలు ఏ కుటుంబాలకి, ఏ సంఘాలకి సంబంధించినవో గానీ-మన ఇష్యూ, మన కష్టసుఖాలూ, మన సమస్యలకు పరిష్కార్కాలూ ఏమీ వుండవు వీటిలో. భయంకరమైన అబద్ధాలతోటీ, సిగ్గుచేటు సమస్యలతోటీ తయారుచేస్తారి కథల్ని.

సాధారణంగా ఈ రకం చిత్రాల్లో వుండే స్త్రీ పాత్రలు - హీరో ప్రియురాలూ (లేకపోతే భార్య), హీరో తల్లీ, హీరో చెల్లెలూ, హీరో వదినగారూ వగైరాలు.

'సినిమా' అన్న దాంట్లో (అది ఏ రకం సినిమా అయినా)-కథ అనేది ఎప్పుడూ, హీరోని గొప్ప చేసే పద్ధతిలోనే నడుస్తూ వుంటుంది-అతను ముప్పైఏళ్ళ వయసులో మెట్రిక్ పాసైనా సరే.

హీరో ప్రియురాలైతే-ఆమె పనంతా హీరోని ప్రేమించినట్టు పాటలు పాడుతూ, గంతులువేస్తూ వుండడమే. (ఇంత వ్యాయామం చేస్తోన్నా మన హీరోయిన్లు దినదిన ప్రవర్ధమానమవుతూనే వుంటారు-ఎంచేతో గానీ).

కొంతకాలం కిందటి సినిమాలో హీరో, హీరోయినూ-వుగ్గులుతాగే వయసుల్నించీ ప్రేమించుకుంటూ వుండేవారు. ఇది ఇంకా నయమే. కొన్ని సినిమాలో అయితే కిందటి జన్మల నించీ కూడా. కానీ, ఇప్పుడు కథలు కొంచెం మారాయి. ఇప్పటి కథలో హీరో హీరోయిన్లు బాగా పెద్దవాళ్ళయ్యాకే, ఏ పిక్నిక్‌లోనో; హీరోయిన్ కారో, హీరో స్కూటరో చెడిపోయి సహాయం అవసరమయ్యే సమయాల్లోనో ఆ ఇద్దరూ కలుస్తారు. కలిశాక మొదట పశువుల్లా పోట్లాడుకుని, జీవితాంతం మొహమొహాలు చూసుకోలేని తిట్లు తిట్టుకుని, మరుక్షణం లోనే-విచిత్రంగా, గాఢంగా ప్రేమించుకుని మనల్ని ఫూల్స్‌చేసేస్తారు. రెండు ప్రేమ పాటలు అయ్యాక ఇద్దరిదీ ఒక కులం కాదనితెలుస్తుంది. లేకపోతే కట్నం సమస్యో, హీరోకి కారులేని సమస్యో వొస్తుంది. లేకపోతే హీరోనాన్న వూసిపోక పొరుగూరెళ్ళి ఒ లక్షాధికారికి మాటిచ్చేసి,కొడుకు పెళ్ళికి లగ్నాలు పెట్టేసుకుని బాజాల్తోసహా వొచ్చేస్తాడు. అదీగాకపోతే హీరో పి.యు.సి. చదువుకి ఎవరో మురిసిపోయి అమెరికా పంపించేస్తారు. హీరోయిన్ పూర్వం పాడిన పాటలన్నీ బాణీలు మార్చి విచారంగా పాడుకుంటూ వుంటుంది. క్లైమాక్స్ సీన్స్‌లో మళ్ళీ హీరో వొచ్చి నప్పుడు, హీరోయిన్ ఏమూలనించో పరిగెత్తుకొచ్చి, హీరోమీద పడి బావురు మంటుంది. అదీ ప్రియురాలి పాత్ర. అంతే ఈ పాత్రపని.

హీరో తల్లి అయితే- భర్త మధ్యా, కొడుకు మధ్యా నలిగిపోతూ వుంటుంది, ప్రతీ సీనుతోనూ. ఎవరి పాయింటు కరక్టో, ఎవర్ని తను సమర్థించాలో ఆలోచించి, అలా చేసే సత్తా ఆవిడకి వుండదు.

"తప్పు బాబూ! నాన్నగారి మాటకు ఎదురు చెప్పకు బాబూ"- అని యిటు తిరిగి కాస్సేపు కొడుకుని ప్రాధేయపడి ఏడుస్తుంది. ఆ కొడుకు కూడా, తండ్రి ముందు పీనుగుమల్లె పడివుండాలని బోధిస్తుంది.

ఆ కొడుకు- "క్షమించమ్మా!..."అని సినిమాటిక్‌గా క్షమాపణ కోరతాడు. తను చేసేది రైటైతే క్షమాపణ కోరడమెందుకో!

ఇక, ఈతల్లి, భర్తగారి వేపు తిరిగి- "మీరన్నా నా మాట వినండీ"-అని అటు తిరిగి ఆయనకు చెప్పబోతుంది- జీవితంలో ఎన్నడూ ఆయన తన మాటని ఖాతరు చెయ్యడనే జ్ఞానం లేకుండా.

"నా మాట వినండీ"- అని భార్య అన్నందుకు ఆ పురుషుడికి పెద్ద అవమానమైపోయి- "ఏడిశావులే. నీమాట వినాలా నేను? నువ్వు లోపలికి పో ముందు. వాడు బయటికిపోతాడు"-అని ఇద్దరికీ తలో దారీ చూపించి సమస్యని చిటికెలో తేల్చేసాడు. ఆ భార్య ఏడుస్తూ లోపలికి పోవటంతో మనకి న్యూసెన్స్ తప్పుతుంది.

సాధారణంగా, ఈ తల్లి పాత్ర ఎప్పుడూ ఇలాగేవుంటుంది. ఇంతకన్న వ్యక్తిత్వాలూ, శక్తి సామర్థ్యాలూ ఆ పాత్రకి వుండవు. భర్తదగ్గిర కాస్సేపూ, కొడుకు దగ్గిర కాస్సేపూ ఏడుస్తూ వృత్త పనికి మాలిన మనిషిలా పడివుండడమే తన కర్తవ్యంగా భావిస్తూ వుంటుంది ఈ పాత్ర.

ఇక హీరో 'చెల్లెలు' పాత్ర అయితే, సినిమా మొదలుపెట్టిన దగ్గిర్నించీ ఈ చెల్లెలు పెళ్ళో పెళ్ళో అని వొకటేగోల! అన్నగారిమీద తెగపాటలుపాడి, వాణ్ణి వుబ్బేసి, చీరలు కొనిపించుకుని, నగలు చేయించుకుని, చివరికి ఇల్లూ వాకిలీ అమ్మించేసి పెళ్ళి చేయించుకుంటుంది. అంతేగానీ- ''నువ్విన్ని కష్టాలుపడి, నాకీ నగలూ చీరలూ తేవడం ఏమిటీ? నువ్వింత బికారివై నాకు పెళ్ళిచెయ్యడం ఏమిటీ? పెళ్ళీవొద్దు, గిళ్ళీవొద్దు, ఏదోఒక పని చేసుకుని నా బతుకు నేను బతుకుతాను''-అని మాత్రం బొందిలో ప్రాణం వుండగా అనదు. అన్న ఎంత బీదవాడైనా సరే, అతని దగ్గిరవున్న చిల్లర డబ్బుల్తోసహా, వదినగారి పుస్తెలతోసహా దోచుకోవడమే ఈ చెల్లెలి పాత్ర.

ఇక, హీరో వదినగారైతే- మరిదిని వుయ్యాల్లో చంటాణ్ణి ముద్దుచేసినట్టు ముద్దుచేస్తూ వుంటుంది. తన పిల్లల్ని చిన్నచిన్న వాళ్ళనికూడా నిర్లక్ష్యం చేసి. ''వొదినా, నువ్వు దేవతవి!'' అని ఆ మరిది పచ్చి అబద్ధాలాడుతోంటే నమ్మేసి, ఎప్పుడూ ఆ మరిది తిండీ, ఆమరిది చదువూ, ఆ మరిది పెళ్ళీ, ఆ మరిది సౌఖ్యం- అంటూ ఎప్పుడూ ఆమరిది పిచ్చితో, మనం సినిమాలోంచి బైటపడేప్పటికి, మనంవరికీ, పిచ్చెత్తించేస్తుంది.

మనలాగే కాస్త ఇంగితజ్ఞానం గల ఆ మరిది భార్య ఈ జిడ్డు వ్యవహారం భరించలేక-''నా మొగుడి సంగతి నీకెందుకూ? నీ పనేదో నువ్వు చూసుకో"-అనేస్తుంది. (ఈ పాత్రని చాలా చెడ్డ పాత్రగా సినిమాలో చెపుతారనుకోండీ). తోటి కోడలి ఈసడింపుకి మన "వొదినగారు" ఘోరావమానంపాలైనట్టు (అవమానాలన్నీ తనకి తనే చేసుకున్నాననే సంగతి తెలుసుకోక)-కుమిలిపోతూ, తిండీ తిప్పలూ మానేసి, 'దేవుడి గది' అనే ఆవకాయ జాడీలూ, కారం జాడీలూ, పడియాలూ వగైరా వుండే ఒక ఇరుకు చీకటికొట్టులో పడివుండి, ఆ సాయంత్రానికి జ్వరం తెచ్చుకుంటుంది. (ఈ వొదినగారి దుఃఖంచూస్తే మనకికూడా కొంచెం కొంచెం జాలి ప్రారంభమవుతుందనుకోండి. ఆ జాలి మరీ ఎక్కువైతే కళ్ళనీళ్లు కూడా వచ్చేస్తాయి.) వొదినగారి జబ్బు ఎంతవరకూ పెరుగుతుందంటే, తోటి కోడలు వొచ్చి ఈమె కాళ్ళమీద పడి "నన్ను క్షమించు అక్కా! నోటి దురుసు మనిషిని నేను. నువ్వు జబ్బుపడ్డప్పటి నించీ మీ మరిది గారు నాతో మాట్లాడ్డంలేదు. పచ్చి మంచినీళ్ళయినా తాగడంలేదు. నా కాపరం సరిచెయ్యి అక్కా" అని భోరున ఏడ్చేవరకూ. మళ్ళీ వదినా మరుదుల 'తల్లీ-బిడ్డల ప్రేమ' యథా ప్రకారం కొనసాగేలా పరిస్థితులు చక్కబడితేనే గానీ మన వదినగారి జబ్బు మళ్ళదు. ఇదీ వదనగారి పాత్ర.

ఈ రకం కథలో హీరో భార్య కొంచెం 'పెంకి మనిషి'గా కాస్సేపైనా వుంటుంది గానీ, మిగతా రకం కథలో అయితే హీరో భార్యకి నోట్లో నాలికే వుండదు. ఆవిడ ఎప్పుడూ మణుగుల కొద్దీ శాంతమూ, కడవల కొద్దీ కన్నీరూ మోస్తూవుంటుంది.

ఈ రకంగా - సినిమాలోని స్త్రీ పాత్రల్లో కాస్తోకూస్తో అభ్యుదయ ప్రవర్తన గానీ, ఆత్మాభిమానం గానీ మచ్చుకన్నా వుండవు. వీటికి చీమూ, నెత్తురూ వుండవంటే ఆశ్చర్యపడక్కరలేదు. ఇక ఈ పాత్రలో ఆదర్శాల గురించి వూహించనేలేము. ఖరీదు గల చీరలు ఫేషన్‌గా కట్టడాలూ, రకరకాల జుట్టుముళ్లూ మాత్రం బాగా చూడవచ్చు ఈ పాత్రల ద్వారా.

"మనుషులు మారాలి" లోనూ, "దేవదాసు" లోనూ స్త్రీ పాత్రలు గొప్పవి! సినిమా కథలు సాహిత్యపు విలువలమీదా, నూతనత్వం మీదా ఆధారపడకపోతే వాటిలో ఏ పాత్ర చిత్రణా ప్రజలకు చెప్పేదేమీ వుండదు.

[ 1973 జూన్‌లో 'రేడియో' లో ప్రసారమయింది ]

## అభ్యాసం (రాసేపని)

1. ఈ కింది వాక్యాల్లో ఇదంత క్రియచేసే పనిని గురించి రాయండి.
   'ఏ మహా ముహూర్తమందో నా అంతర చక్షువు వికసించి వికసించి ఏ పార లౌకిక దృశ్యమో చూస్తుంది.''
   ''వెనకాతే నా వృద్ధ జనని, నా జీవితేశ్వరి పొంచిఉండి ఎన్నిసార్లు నా స్వర్ణ స్వప్నాలను చిన్న శకలాలుగా చేసి నన్ను ధూళిలోకి లాగలేదు?''

2. ఈ కింది వాక్యాలు మీ తెలుగు కోర్సు మొదటి పుస్తకం 49వ పేజీనుంచి తీసినవి. వీటిలో అట ఉపయోగించటంవల్ల వాక్యం అర్థంలో జరిగిన మార్పేమిటో సూచించండి.
   "ఆమె జీవితకాలంలో అయిదుగుర్ని అలా రక్షించారట! ముగ్గురికి తరవాత వివాహాలు అయ్యాయి! తక్కిన ఇద్దరికీ శిశుహత్యాదోషము రాకుండా కాపాడారుట! గర్భవతియై వచ్చిన ఒక బ్రాహ్మణ వితంతువుని ప్రసవ వైద్యశాలకి పంపారట!...''

3. ఈ కింది వాక్యాల్లో అని ఏ అర్థంలో వాడారో వివరించండి.
   (అ) "అలెగ్జాండరూ, అశోకుడూ, అక్బరూ ప్రజల్ని మహా చక్కగా పరిపాలించారు" అని చెప్పాలిగానీ, 'తెగ యుద్ధాలుచేసి ప్రజల్ని చావగొట్టారు' అని చెప్తే చరిత్ర మేష్టార్లకి చాలా కోపాలొస్తాయి.
   (ఆ) ''తప్పు బాబూ నాన్నగారి మాటకు ఎదురు చెప్పకు బాబూ" అని యిటు తిరిగి కొడుకుని ప్రాధేయపడి ఏడుస్తుంది.
   (ఇ) వొదినగారు జబ్బు ఎంతవరకూ పెరుగుతుందంటే తోటికోడలు వొచ్చి ఈమె కాళ్ళ మీదపడి "నన్ను క్షమించు అక్కా! నోటి దురుసు మనిషిని నేను. నువ్వు జబ్బు పడ్డప్పటినుంచీ మీ మరిదిగారు నాతో మాట్లాడ్డం లేదు. పచ్చి మంచినీళ్ళయినా తాగడం లేదు. నా కాపురం సరిచెయ్యి అక్కా" అని భోరున ఏడ్చేవరకూ.

4. పై వాక్యాల్లో (ఆ) (ఇ) అనే వాక్యాలను పరోక్ష అనుకరణలోకి మార్చి చూడండి.

5. ఈ కింది వాక్యాల్లో నామ్నీకరణాలు అనే రకపు సంబంధ బోధక వాక్యాలున్నాయి. వాటిని ఏ-ఆ అనే రకపు వాక్యాలుగా మార్చి దానివల్ల ఏం జరిగిందో చూడండి.
   (అ) మనకి చాలా కోపం వచ్చేస్తుంది-సినిమా తీసిన వాళ్ళమీద.
   (ఆ) వెలుగురేకల్ని మేస్తూ, బలిసి నలుదిక్కులనుండీ ఆకాశాన్ని ఆక్రమిస్తున్న చీకటే, లయబద్ధంగా రెక్కలాడించుకుంటూ తమతమ గూళ్లు వెతుక్కుంటూ పోయే పిట్టలూ, ఒకచోట ఒడితీర్చి గుండెలు గుబులుకునేటట్లు అదే పనిగా అరిచే కాకుల గుంపూ- ఇవన్నీ మనిషి మనస్సును దిగులుతో నింపేందుకే.

6. రంగనాయకమ్మగారి రచనలో హాస్యం తొంగి చూస్తుంటుందన్నాం. అందుకు ఉదాహరణగా ఈ కింది వాక్యం చూడండి.
   ''ఇంత వ్యాయామం చేస్తోన్న మన హీరోయిన్లు దినదిన ప్రవర్ధ మానమవుతూనే ఉంటారు."
   ఇట్లా హాస్యం కనిపించే వాక్యాలు వెతకండి. వాటివల్ల రచనకు చేకూరిన మేలు ఏమైనా ఉందా?

BRAOU

7. పునరుక్తి అనిపించేంత స్పష్టత రంగనాయకమ్మగారి రచనలో కనిపిస్తుందన్నాం. అందుకు ఈ కింది వాక్యాలు ఉదాహరణ.

''ఎటొచ్చీ మనం సాంఘికమైన కథలు చెప్పే సినిమాలలోనే మంచి చెడ్డలు వెతుక్కోవాల్సి వుంటుంది. 'సాంఘికాలంటే ఈనాటి (సంఘానికి సంబంధించిన విషయాలు)''

పైన బ్రాకెట్లలో ఉన్న వాక్యం లేకపోయినా విషయం అర్థమవుతుంది. కాని స్పష్టతకోసం బ్రాకెట్లో సాంఘికాలంటే ఏనాటి సాంఘికాలో వివరించారు. ఈ రకంగా స్పష్టతకోసం అదనంగా చేరిన వాక్యాలేమన్నా ఉంటే వెతకండి.

8. రంగనాయకమ్మగారి వాక్యాలు సూటిగా పదునుగా ఉంటాయన్నాం. అందుకు ఈ ఉదాహరణ గమనించండి.

''భయంకరమైన అబద్ధాలతోచే, సిగ్గుచేటు సమస్యలతోటీ తయారుచేస్తారీ కథల్ని.''

ఈ పైవాక్యం మొహమాటంతో రాస్తే 'సినిమాల్లో అబద్ధాలుంటా'యని అనం. అవాస్తవికంగా ఉంటాయంటాం. నిజంకాని సమస్యలనవచ్చు. కాని 'సిగ్గుచేటు సమస్యల'నటంవల్ల సూటిదనం, పదును వచ్చాయి. ఇట్లాంటి పదునైన సూటి వాక్యాల్ని ఏరండి.

9. తెలుగు మౌలిక అంశాలు మొదటి పాఠం (7వ పేజీ)లో అచ్చులకు బదులుగా హల్లులు రాసే పద్ధతిని గురించి చెపుతూ రంగనాయకమ్మగారి పద్ధతిని గురించి ప్రస్తావించాం. అక్కడ గుర్తించిన విశేషాలు ఎంతవరకు ఈ రచనలో కనిపిస్తాయో పరిశీలించండి.

10. రంగనాయకమ్మగారు సినిమాల్లో స్త్రీ పాత్రల గురించి రాసింది 1973లో. ఇప్పటికి పదేళ్ళు గడిచినాయి. ఈనాటి సినిమాల్లో స్త్రీ పాత్ర చిత్రణ ఏమైనా మారిందా? చర్చించండి.

BRAOU

## ఖండిక 8 పాఠం 14

# సంయుక్త వాక్యాలు

**ఉద్దేశం**

సంయుక్త వాక్యాల నిర్మాణాన్ని పరిచయం చేయటం. వాక్యాల మధ్య సంయోజన సంబంధాలను-సంకలన, వికల్ప, వైరుధ్య సంబంధాలను-ఉదాహరణ పూర్వకంగా వివరించటం.

**ప్రణాళిక**

1. సంయుక్త వాక్యాలు ఎలా ఏర్పడతాయి?
2. సంకలన సంబంధం
3. వికల్ప సంబంధం
4. వైరుధ్య సంబంధం
5. ముఖ్య విషయ క్రోడీకరణ
6. అభ్యాసాలు, ప్రశ్నలు

## సంయుక్త వాక్యాలు ఎలా ఏర్పడుతాయి?

BRAOU

రెండు సమాన ప్రతిపత్తిగల వాక్యాలు ఒకదాని పక్కన ఒకటి వస్తే ఆరెండూ కలిపి ఒక వాక్యమవుతుంది. ఆ వాక్యంలో భాగాలయిన వాటి వాక్యప్రతిపత్తి అట్లానే ఉంటుంది. అట్లాంటిదాన్ని సంయుక్త వాక్యం అంటాం. సంయుక్త వాక్యాన్ని విడదీస్తే కొన్ని వాక్యాలు వస్తాయి. కలిసినప్పుడు కూడా విడివిడి వాక్యస్థితిపోదు:

సుశీలా సుజాతా కలసి బజారు వెళ్లారు, బట్టలు కొనుక్కున్నారు, మంచి హోటల్లో భోజనం చేశారు, సాయంకాలం సినిమా వెళ్ళారు.

ఈ పై సంయుక్త వాక్యంలో స్వతంత్ర ప్రతిపత్తిగల నాలుగు వాక్యాలున్నాయి. నాలుగింటికి కర్త పదం (పదబంధం) ఒకటే. అయితే ఇది మొదటి వాక్యభాగంలోనే ఉంది. మిగతా వాటికి అదే కర్త అని అర్ధమవుతుంది. పై పెద్ద వాక్యంలో కామాలు పెట్టినచోట చుక్కలు పెట్టామనుకోండి. అప్పుడవి నాలుగు ప్రత్యేక వాక్యాలు అవుతాయి. మొదటి వాక్యంలో తప్ప, మిగతా వాటిలో కర్త లేదుగదా అనే సందేహం రావచ్చు. నిజమే. అయితే తెలుగు వాక్యంలో కర్త తప్పనిసరిగా వ్యక్తం కావాలని నియమంలేదు. (కర్త అసలే లేనివాక్యాల సంగతి అట్లాఉంచండి. కర్త అంటూ ఒకటి ఉన్నదని ఒప్పుకుంటున్న వాక్యాలసంగతే మనం ఇక్కడ మాట్లాడుకుంటున్నాం). వాక్యంలో స్పష్టంగా కర్త లేకపోయినా సందర్భం నుంచి కర్తను గ్రహించే పద్ధతి తెలుగులో ఉంది. అంతేకాదు. విడివిడి వాక్యాలుగా రాసినా, మొత్తం కలిపి ఒకే వాక్యంగా రాసినా కర్తను అన్ని వాక్యాలోనూ రాస్తే ఆ వాక్య సమూహం పరమ కృత్రిమంగా తయారవుతుంది.

అప్పుడు ఇక్కడ ఒక సందేహం రావటానికి వీలు ఉంది. "కొన్ని సరళవాక్యాలు కలిపితే సంయుక్త వాక్యంగా తయారవుతుంది. ఆ సంయుక్త వాక్యాన్నే ముక్కలుగా చేస్తే సరళ వాక్యాలు వస్తున్నాయి. కామాలు, చుక్కలు, ఒకదానికి బదులు ఇంకొకటిపెట్టటం తప్ప వేరే తేడా ఏం కనిపించటం లేదుగదా" అని. నిజమే. లోతుగా ఆలోచిస్తే చాలా చోట్ల ఇట్లాంటి సందేహాలు రావటానికి వీలున్నది. ఈ సందేహాలున్నిటికి అన్ని వేళలా స్పష్టమైన సమాధానాలు ఇయ్యటం కూడాకష్టం (అంటే ఉండవన్నమాట). క్రియ తప్ప మిగతా ఏ శబ్దాన్నైనా వాక్యంలో వ్యక్తం చెయ్యక్కర్లేదు కాబట్టి ఈ స్థితి వచ్చింది. భేదం ఉచ్చారణ ద్వారా గుర్తించవచ్చు. రాతలో కామాలో, చుక్కలో వాటి తేడా చూపిస్తున్నాం. అంతకు మించి పద స్వరూపంలో మార్పులేదు.

వాక్యాలు ఒకదానితో ఒకటి విడదీయలేనంతగా కలిసిపోతే ఆ కూర్పును సంశ్లేష అన్నాం (సంశ్లేష వల్ల సంశ్లిష్ట వాక్యాలు వచ్చినాయి) వాక్యాలను కేవలం ఒకదానితో ఇంకోకటి చేరిస్తే ఆ కూర్పును సంయోజన అంటాం (సంయోజన వల్ల సంయుక్త వాక్యాలు ఏర్పడ్డాయి). వాక్యాల మధ్య కొన్నిరకాల సంయోజన సంబంధాలున్నాయి. వీటిని స్థూలంగా సంకలన, వికల్ప, వైరుద్ధ్య సంబంధాలు వేరుచెయ్యవచ్చు. సంకలనం అంటే కూడిక, చేర్పు. అంటే ఒకదానికి ఇంకొకటి అధికం కావటం. వికల్పం అంటే ఒక రాశిలో ఏదో ఒకదానినే అస్తిత్వం ఉన్నట్టు చెప్పటం. వైరుద్ధ్యమంటే రెండు విషయాల మధ్య విరుద్ధత ఉన్నట్టు చెప్పటం.

ఈ కింది వాక్యాలు ఉదాహరణలు చూస్తే విషయం బోధపడుతుంది :

1. సుశీల పాటలు పాడుతుంది, గేయాలు రాస్తుంది.
2. సుజాత ఉద్యోగం చేస్తుందో, పెళ్ళిచేసుకుంటుందో (తెలీదు).
3. సుబ్బారావు కథలు రాస్తాడు కాని, భాషాజ్ఞానం తక్కువ.

పై మూడు వాక్యాలూ క్రమంగా సంకలన, వికల్ప, వైరుద్ధ్యాలకు ఉదాహరణలు, వీటిని గురించి క్రమంగా ముచ్చటించుకుందాం.

**సంకలన సంబంధం**

కొన్ని వస్తువులను ఒకచోట పోగువేస్తే ఆ వస్తువుల మధ్య సంబంధాన్ని సంకలన సంబంధం అంటాం. వాక్యాల మధ్య-అంటే అవి చెప్పే విషయాల మధ్య సంబంధం కూడా అంతే. సంకలనార్థం బోధించటానికి కొన్ని భాషల్లో ప్రత్యేకమైన పదాలుంటాయి. ఇంగ్లీషులో and, హిందీలో 'ఔర్' అట్లాంటివి. తెలుగులో అట్లాంటిదేమీ లేదు. అయినా వాక్యాల క్రమం వల్ల సంకలనంగానే అర్థంచేసుకుంటాం. ఈ సంకలనార్థాన్ని పురస్కరించదల్చుకున్నప్పుడు చివరివాక్య భాగానికి కూడా అనే శబ్దాన్ని చేర్చవచ్చు. ఉదాహరణానికి పైవాక్యంలో 'కూడా' శబ్దాన్ని చేర్చి-

సుశీల పాటలు పాడుతుంది,
గేయాలు రాస్తుంది కూడా.

BRAOU

అని రాయొచ్చు.

ఒక్కోసారి క్రియలు ఒకటే అయి ఉండి కర్మల మధ్య కాని, కర్తల మధ్య కాని సంకలనం చెప్పదల్చుకున్నప్పుడు ఆయా పదాలకు కూడా చేర్చవచ్చు.

సుశీల కథలు రాస్తుంది, గేయాలు కూడా రాస్తుంది.
సుశీల కథలు రాస్తుంది, సుజాత కూడా రాస్తుంది.

ఇట్లాంటి సందర్భాల్లో-అంటే క్రియేతర శబ్దాల మధ్య సంకలనం చెప్పతున్నప్పుడు వాటిని ఒకచోట చేర్చి ఒకటే వాక్యం చెయ్యవచ్చు. ఉదాహరణకు చూడండి :

సుశీల కథలూ, గేయాలు రాస్తుంది.
సుశీలా, సుజాతా కథ రాస్తారు.

క్రియలు వేరు వేరుగా ఉన్నప్పుడు వేరు వేరు వాక్యాల అస్తిత్వం సంయుక్త వాక్యంలో కనపడుతుంది. ఒకే క్రియ ఉన్నప్పుడు ఆ అస్తిత్వం పోయి ఒకటే అవుతుంది. వేరువేరుగా ఉన్న ఈ క్రియల పరస మారినా పై వాక్యాల అర్థాల్లో భేదం రాదు. ఉదాహరణకు :

సుశీల పాటలు పాడుతుంది, గేయాలు రాస్తుంది.
సుశీల గేయాలు రాస్తుంది, పాటలు పాడుతుంది.

ఈ పై వాక్యాలు గమనించవలసిన ఒక చిన్న విశేషముంది. ఉపయోగించిన కాలం (tense) వల్ల 'సుశీల' అనే వ్యక్తి లక్షణాలను గురించి చెప్పినట్టయింది. అందువల్ల పదాల క్రమం మారినా అర్థం భేదం రాలేదు. అదే భూతకాలంలో (జరిగిపోయిన కాలంలో) అయితే ఆ భేదం వస్తుంది.

సుశీల గేయాలు రాసింది, పాటలు పాడింది
సుశీల పాటలు పాడింది, గేయాలు రాసింది.

అనే వాక్యాలో సుశీల నిర్వహించిన కార్యాల క్రమం కూడా తెలుస్తుంది. అంటే పదాల పరస మారితే అర్థం కూడా మారింది. అదే కాలాన్ని తెలిపే పదాన్ని వాడితే ఈ చిక్కు ఉండదు.

కాలేజిలో చదువుకునే రోజుల్లో సుశీల గేయాలు రాసింది, పాటలు పాడింది.

కాలేజిలో చదువుకునే రోజుల్లో సుశీల పాటలు పాడింది, గేయాలు రాసింది.

పై రెండు వాక్యాల్లో అర్థం ఒకటే.

భాషలో వ్యక్తమయిన క్రమానికీ, సంఘటనలు జరిగిన క్రమానికి ఆనుపూర్వి (ఒకదాని తరువాత ఒకటి జరిగే) సంబంధం సహజమయింది. ఇతర ఆధారాలులేనప్పుడు ఆ అర్థమే వస్తుంది. ఈ రకమైన సంబంధం ఉద్దేశించినప్పుడు పై వాక్యాల మాదిరి కాల సంబంధాన్ని స్పష్టపరచటం మంచిది. ఆనుపూర్వీసంబంధాన్ని ఉద్దేశిస్తే ఇదంత క్రియా వాడకం ఉద్దేశాన్ని స్పష్టపరుస్తుంది.

సుశీల స్నానం చేసి అన్నంతిన్నది.

సుశీల అన్నంతిని స్నానం చేసింది.

అనే వాక్యాలురెండూ అర్థంలో స్పష్టంగా వేరువేరు. ఇంగ్లీషులో and అనే పదం ద్వారా వాక్యాల్ని కలిపేటప్పుడు ఈ భేదాలు తెలుసుకునే మార్గం లేదు.

తెలుగులో మాత్రం కాలక్రమం ఉద్దేశించినప్పుడు ఇదంత క్రియ వాడితే స్పష్టంగా తెలుస్తున్నది. అవసరాన్ని బట్టి పూర్తి క్రియ వాడాలా? ఇదంత క్రియవాడాలా అనేది రచయిత నిర్ణయించుకుంటాడు. ఈ వాక్యాల అర్థ విస్తృతి తెలిస్తే ఏది ఎప్పుడు వాడుకోవాలో నిర్ణయించుకోవటం తేలికవుతుంది.

సంకలనార్థంలో అక్కడక్కడ **మరియు** అనే మాట కనిపిస్తుంది. ముఖ్యంగా పద సంకలనంలో ఈ మాట కనిపిస్తుంది.

'ఆయన తెలుగు, సంస్కృతం మరియు ఇంగ్లీషు భాషలలో పండితుడు.'

వంటి వాక్యాలు అక్కడక్కడ కనపడతాయి. ఇంగ్లీషు వంటి భాషల ప్రభావం వల్ల ఈ మాట ప్రయోగంలో ఉన్నట్టుంది. ఈ మాట భాషకు కలిగించే సౌకర్యం ఏమీ లేదు గనుక దాని వాడకం అంత ప్రచారం కాలేదు. దాని అవసరమూ కనిపించదు.

BRAOU

### వికల్ప సంబంధం

కొన్ని వస్తువులు ఒకచోట ఉంటే వాటిల్లో ఏదో ఒకదాన్ని మాత్రమే ఎన్నుకునే పద్ధతి వికల్ప పద్ధతి.

"సుజాత పెళ్ళి చేసుకుంటుందో, ఉద్యోగం చేస్తుందో" అన్నప్పుడు సుజాత రెండింట్లో ఒకటే చేస్తుంది, రెండూ చెయ్యదు అనే సూచన ఉంది. అయితే ఇందులో అనిశ్చితత్వం ఉంది. దాన్ని వ్యక్తంచేసే వాక్య భాగాలు తరవాత ఉండొచ్చు. 'నాకు తెలీదు, ఎవరికి తెలుసు, ఎవరికీ తెలీదు, ఎవరికైనా తెలుసా?- ఇట్లాంటి వేవైనా ఆ సందర్భాలనుబట్టి రావచ్చు. అట్లాకాకుండా ఏదో ఒకటి చేస్తుంది అని చెప్పినప్పుడు లేక అనే శబ్దాన్ని రచనా భాషలో ఉపయోగిస్తారు.

సుజాత పెళ్ళి చేసుకోవచ్చు లేక ఉద్యోగం చెయ్యవచ్చు.

రెండు ప్రశ్నార్థక శబ్దాల మధ్య వికల్పాన్ని చెప్పదల్చుకున్నప్పుడు లేక శబ్దాన్ని ఉపయోగించక పోయినా వికల్పార్థం వస్తుంది.

సుజాత పెళ్ళిచేసుకుంటుందా? (లేక) ఉద్యోగం చేస్తుందా? లేక అనే శబ్దాన్ని ఉపయోగించటంవల్ల పైవాక్యంలో అధిక స్పష్టత ఏర్పడింది.

ఈ వికల్ప బోధలో ఈ క్రియల మధ్య వికల్ప సంబంధం ఉండాలి. లేకపోతే, వాక్యాలు ఎబ్బెట్టుగా ఉంటాయి.

అతను అన్నం తింటాడా? (లేక) ఉద్యోగం చేస్తాడా? అనే వాక్యం వ్యాకరణం ప్రకారం రైటేకాని, అర్థం లేని వాక్యం.

అట్లాగే

అతను ఎప్పుడు వసాడు? లేక ఎందుకు వసాడు?

అనే వాక్యాలమధ్య వికల్పం సరిగ్గా పొసగదు. వికల్పం ఎప్పుడు పొసుగుతుంది అనేదాన్ని గురించి భాషలో సూచనలులేవు. అర్థాన్నిబట్టి, ప్రయోగాన్నిబట్టి, వ్యవహారాన్నిబట్టి గ్రహించాల్సిందే.

## వైరుధ్య సంబంధం

రెండు వాక్యాలు ప్రతిపాదించే విషయాల మధ్య వైరుధ్యమున్నప్పుడు రెండు వాక్యాల మధ్య **కాని** అనే శబ్దం చేర్చవచ్చు.

సుశీల కవిత్వం రాస్తుంది కాని అచ్చువెయ్యదు.

సుబ్బారావు సంపాయిస్తాడు కాని ఖర్చుపెట్టడు.

ఈ పైవాక్యాలను గమనించండి.

సుశీల కవిత్వం రాస్తుంది. కవిత్వం రాసేవాళ్లు ఏదోవిధంగా అచ్చువెయ్యటం ఇప్పటి అలవాటు. దానికి భిన్నమైన అలవాటును చెప్పటంవల్ల **కాని** అనివాడాం.

అట్లాగే సుబ్బారావు సంపాయిస్తాడు. సంపాయించేవాళ్ళు ఖర్చుపెట్టాలని సమాజంలో ఎక్కువమంది అనుకుంటారు. అందుకు విరుద్ధమైన అభిప్రాయం చెప్పడంవల్ల **కాని** అనేపదం అవసరం అయింది.

అయితే ఒక్కసారి **కాని** పదం లేకుండానే ఆ అర్థం సందర్భాన్ని బట్టి రావచ్చు.

అతను బాగా అనుభవమున్న డాక్టరు. ఇంజక్షను చెయ్యటంరాదు. ఇక్కడ **కాని** లేకపోయినా విషయాన్ని బట్టి గ్రహించవచ్చు. ఇట్లాంటిచోట్ల స్పష్టతకోసం **కాని** ఉపయోగించటం ఎక్కువ సౌకర్యం.

BRAOU

ఆయితే శైలీ వైవిధ్యం కోసం ఉపయోగించాల్సిన పదాలను వదిలేయవచ్చు. **పునరుక్తి** అనిపించినా ప్రాధాన్య వివక్షకోసం ఉపయోగించనూవచ్చు.

సందర్భమూ, భాషా విజ్ఞానమూ మాత్రమే ఇట్లాంటి విషయాల్లో సాయపడాలి.

ఈపైన చెప్పినవే కాక ఉపయోగించిన క్రియలమధ్య సంబంధాన్నిబట్టి వాక్యాలమధ్య ఇంకా ఎన్నో సంబంధాలుండవచ్చు. ఉదాహరణకు పరీక్షలో మంచి మార్కులు తెచ్చుకొన్న విద్యార్థి నుద్దేశించి ఈవాక్యాలు అనవచ్చు.

"సుబ్బారావు కష్టపడ్డాడు, ఫలితం దక్కింది." పైవాక్యంలో **కాబట్టి** అనే పదం చేరిస్తే కార్యకారణ సంబంధం ఇంకా స్పష్టమవుతుంది. వాక్యాలమధ్యఉన్న ఈరకపు సంబంధాల్ని గ్రహించటానికి ప్రపంచానుభవమే ముఖ్యాధారం.

ఈపాఠంలో నేర్చుకున్న ముఖ్యవిషయాలు :

1. సంయుక్త వాక్యంలో రెండు సమాన ప్రతిపత్తిగల వాక్యాలు పక్కపక్కనే వస్తాయి. వాక్యాన్ని విడదీస్తే కొన్నివాక్యాలు వస్తాయి. కలిసినా విడివిడివాక్యాల వాక్యస్థితి పోదు.
2. వాక్యంలో స్పష్టంగా కర్తలేకపోయినా, కర్తను సందర్భాన్నిబట్టి గ్రహించవచ్చు.
3. వాక్యాలమధ్య కొన్ని రకాల సంయోజన సంబంధాలున్నాయి. అవి : 1. సంకలన సంబంధం 2. వికల్పసంబంధం 3. వైరుధ్యసంబంధం. సంకలనం అంటే కూడిక - ఒకదానికి ఇంకొకటి ఎక్కువగా రావటం. వికల్పం అంటే ఒక రాశిలో ఏదోఒకదానికే ఉనికి ఉండటం. వైరుధ్యం అంటే రెండు విషయాలమధ్య విరుద్ధత ఉందని చెప్పటం.
4. క్రియలమధ్య సంబంధాన్నిబట్టి కూడా వాక్యాలమధ్య రకరకాల నిర్మాణ సంబంధాల ఏర్పడుతాయి. వాక్యాల మధ్య కార్యకారణ సంబంధం రెండు సరళ వాక్యాలమధ్య కాబట్టి చేర్చడం ద్వారా స్పష్టమవుతుంది.
5. ఈ రకమైన సంబంధాలను గ్రహించటానికి పుస్తకజ్ఞానం, లోకజ్ఞానం తోడ్పడుతుంది,

## అభ్యాసం (చదివేపని)

తెలుగు పత్రికా నిర్వహణలో ఉన్నత ప్రమాణాలను, ఉత్తమ సంప్రదాయాలను స్థాపించి, నిర్వహించిన ఇద్దరు ముగ్గురిలో గోరాశాస్త్రి (గోవింద రామశాస్త్రి 1919-1982) గారొకరు. ఇంగ్లీషు, తెలుగు స్వతంత్ర పత్రికలలో సంపాదక బాధ్యతలు నిర్వహించారు. సికిందరాబాదు నుంచి తెలుగులో 'స్వతంత్ర' అనే వారపత్రికను ముఖ్య సంపాదకుడుగా నడిపారు. దక్కన్ క్రానికల్, ఆంధ్రభూమి అనే ఇంగ్లీషు, తెలుగు దినపత్రికలకు సంపాదకులుగా ఉన్నారు. ఆయన్ని గురించి నార్ల వెంకటేశ్వరరావుగారు "శాస్త్రిగారు సూటిగా ఆలోచిస్తారు, ఘాటుగా వ్రాస్తారు" అని అన్నారు. గోరాశాస్త్రి గారికి నాటక రచయితగాకూడా ప్రసిద్ధి ఉంది. ఆశ ఖరీదు అణా, సెలవుల్లో, ఆనందనిలయం అనే నాటకాలు ఎక్కువమంది చదివినవి. తెలుగు స్వతంత్రలో "వినాయకుడి వీణ" శీర్షిక కింద ఆయన రాసిన వ్యాసాలు వ్యాసరచనలో ఎన్నదగినవి.

# పత్రికా రచనలో అనుభవాలు, జ్ఞాపకాలు

—గోరాశాస్త్రి

రాత్రి రెండోజాము గడిచిందనుకుంటాను. గాఢనిద్ర అనలేనుగాని, మొత్తమ్మీద నిద్రపోతున్నాను. సమయం నడిరేయి కనుక, గదినిండా నిశ్శబ్దం. తలవైపు మంచం పక్కనేవున్న టెలిఫోన్ అదేపనిగా మోగుతూ నిద్రలేపింది. అందుకని హలో అన్నాను. అలాంటి వేళగాని వేళలో ఫోన్ పిలుపు వచ్చేది ఆఫీసులోని ఎడిటోరియల్ డెస్కు నుండి మాత్రమే. అసాధారణం ఏదయినా జరిగిందా ? ఘోరమైన రైలు ప్రమాదాలు, విమాన ప్రమాదాలు, ఎవరో మహావ్యక్తి మరణం-అలాంటిదుర్వార్త ఏదయినా వినిపిస్తారా డెస్కు సహచరులు, క్షణంలో సగంలో బుర్రనిండా ఏవేవో ఆలోచనలు తిరిగాయి. దినపత్రిక ఎడిటర్‌కి ఇలాంటి ఫోన్ పిలుపులు పరిపాటే.

నేను హలో అనగానే అవతలివ్యక్తి, ఎవరు మాటాడుతున్నది ? అని అడిగాడు. పిలుపు వచ్చింది ఆఫీసు నుండి కాదని గ్రహించాను. సరే, ఫలానా అని విన్నవించుకున్నాను. జంటనగరాల్లో యిదొక విడ్డూర సంప్రదాయం. ఆమాటకొస్తే అపసవ్య సంప్రదాయం. టెలిఫోన్ చేసినవాళ్ళు తామెవ్వరో చెప్పరు. అవతల వ్యక్తిని నువ్వెవ్వరు ? అంటారు. టెలిఫోన్ ఎత్తితేచాలు, కష్టమేతప్ప కోహమ్ ఉండదు.

ఫోన్‌లో అవతలవ్యక్తి చాలా కటువుగా ముక్తసరిగా చూడండీ, నేను వయోజన పాఠశాలనుండి మాటాడుతున్నాను. ఒరిస్సా గవర్నర్ పేరు చెప్పండి అన్నాడు. ఒక లిప్తపాటు నోట మాటరాలేదు. అర్ధరాత్రి నిద్రపోతున్న వాడిని లేపి, ఉన్నపాటున వేసే ప్రశ్న అదా ? అప్పటికీ తమాయించుకుని, తెలియదండీ అన్నాను. అజ్ఞాత టెలిఫోన్ మిత్రుడు వెంటనే చికాకుపడి "ఒరిస్సా గవర్నర్ పేరు తెలియనివాడివి నువ్వేం దినపత్రిక ఎడిటర్‌వయ్యా? పోనీ, యింకెవరికి ఫోన్ చెయ్యమంటావ్ చెప్పు ?" అన్నాడు. అలాంటి వ్యక్తితో ఏం చెప్పగలను ? "ఒరిస్సా గవర్నర్‌కి ఫోన్‌చేసి కనుక్కోండి" అని ఫోన్ పెట్టేశాను.

అప్పుడు ఒరిస్సా గవర్నర్ పేరు జ్ఞాపకం రాలేదుగాని స్వర్గీయ ఖాసా సుబ్బారావుగారు జ్ఞాపకం వచ్చారు. ఇందుకా మహానుభావా, నన్ను జర్నలిజంలోకి లాక్కొచ్చారు! విన్నారా ఈ అర్ధరాత్రి సంభాషణ. గమనించారా ఏకవచన ప్రయోగం ? యిదేమికర్మ అనుకున్నాను. అర్ధరాత్రి నిద్ర లేపి, ఒరిస్సా గవర్నర్ పేరడిగితే తపీమని చెప్పాలా ? లేకపోతే చీవాట్లా ? రాత్రి పాఠశాలవ్యక్తి ఆపోహ తలచుకొని బాధగా నవ్వుకున్నాను. స్వర్గీయఖాసా సుబ్బారావుగారి మీద ఒక్క క్షణం విసుక్కున్నాను. జర్నలిజంలో ఆయననాకు గురుదేవులు. ఈ వృత్తిలోకి నన్ను ప్రవేశపెట్టింది ఆయన బలవంతంగా కాదనుకోండి, ఖాసాపేరు దేశంలోని మేధావివర్గాలకూ, రాజకీయ వర్గాలకూ అందరకూ సుపరిచితం. ప్రముఖ పత్రికా సంపాదకుడేకాక, ఆయన ప్రముఖ స్వాతంత్ర యోధుడు కూడా, జర్నలిజంలో ప్రవేశం నాకు స్ఫూర్తి నివ్వడమేగాక, ఒక దశాబ్దానికి పైగా ఆయనతో కలిసి పనిచేయడానికి అవకాశం కల్పించాడాయన.

BRAOU

జర్నలిజమ్‌లో నేను అడుగుపెట్టిన రోజులు స్వాతంత్ర్యానికి పూర్వం. అప్పట్లో పత్రికారచన అనగా జర్నలిజం ఒక వ్యాపారంకాదు, వృత్తికూడా అనలేము, ఎందుచేతంటే ఖాసావంటి స్వాతంత్రయోధులకూ, ఆదర్శపరులకూ, ఆయనపిలుపు నందుకొని జర్నలిజంలోచేరిన నాకూ, అదొక పవిత్రమయిన ఉద్యమం, మేమెవ్వరం కేవలం భుక్తికోసం జర్నలిజంలో ప్రవేశించలేదు. ఉత్తరాదిన రైల్వేలలో సుఖమయిన ఉద్యోగం చేసుకుంటున్న నాకు జర్నలిజంలో ప్రవేశించాలన్న కోర్కె ఆనాడులేదు. ఐతే, విద్యార్థి దశనుండి నేను సాహిత్యోపాసకుడిని. ఆంగ్ల సాహిత్యమంటే వల్లమాలిన అభిమానం. తెలుగువాడిని కనుక తెలుగు సాహిత్యమంటే ప్రాణం. అప్పట్లో సాహిత్యమే ఊపిరిగా జీవించాను. కాలేజీ రోజులనుండి తెలుగులో రచనలు సాగించేవాడిని. అప్పటికే ఉద్ధండులైన సాహిత్య విరాట్ పురుషులతో సన్నిహితంగా మెలిగేవాడిని. ఇటు స్వాతంత్ర యోధులతో సైతం చిన్నతనంనుండి సన్నిహితత్వం. నాతరం యువకుల్లో ఆనాడు జాతీయతాభావం మెండుగా ఉండేది. నాతరుణవయస్సులో గోదావరి మండలంలో బ్రాహ్మసమాజ సాహిత్యం అధికం, కాకినాడలో రఘుపతి వేంకటరత్నం నాయుడుగారు ఒక మహోన్నత హిమగిరి, కాకినాడ కాలేజీలో బ్రాహ్మసమాజ సంస్కరణ వాయువులు బలీయంగా వీచేవి. యువతరాన్ని సంఘసంస్కరణోద్యమాలకు ఉత్తేజపరిచేవి. మహాకవి దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు విద్యార్థుల్ని అయస్కాంతం వలె ఆకర్షించేవారు. సాహిత్యాభిరుచి పెంచేవారు. ఆరోజుల్లో ఆయన వేసవిగృహం సరస్వతీ నిలయంగాభాసించేది. మరొకవంక స్వాతంత్ర్యయోధులకృషి. స్వర్గీయ బులుసు సాంబమూర్తి, టంగుటూరు ప్రకాశం, అల్లూరి సత్యనారాయణరాజు మొదలయినవారు యువతరాన్ని ప్రభావితంచేసేవారు, పనికట్టుకుని వారందరితోనూ సన్నిహితత్వం ఏర్పరచుకున్నాను. ఒకవంక సాహిత్య అధ్యయనం, మరొకవంక వేసవిరాజకీయ పాఠశాలల్లో అధ్యయనం. ఉభయరంగాల పెద్దలతోనూ సాంగత్యం.

రెండు రంగాల ప్రభావమూ నామీద అమితంగా పడింది. కొంతకాలంపాటు ఏవేవో ఉద్యోగాలు భుక్తికోసం చేసినా, అవి సుఖజీవనానికి తోడ్పడినా, మానసికమైన తృప్తి మాత్రం యివ్వలేకపోయాయి. పత్రికలకు కథలూ, వ్యాసాలూ వ్రాస్తూండే వాడిని. మద్రాసు వెళ్ళిన ప్రతిసారి పత్రికల కార్యాలయాలు పనికట్టుకుని సందర్శించే వాడిని. అప్పట్లో జర్నలిజంతో అంతకంటే మించిన పరిచయంలేదు. మద్రాసులో ఒక వారపత్రిక సంపాదకునికి నేను ఇంగ్లీషులో వ్రాసిన డజన్లకొద్దీ ఉత్తరాలు ఒకానొక సందర్భంలో ఖాసా సుబ్బారావుగారు చదివారు. ఆ సమయంలో ఆయన ఒక ఆంగ్ల దినపత్రిక సంపాదకత్వాన్ని విడిచిపెట్టాడు. కారణం ఆ పత్రిక యజమానితో సిద్ధాంత విభేదం. ఖాసా నూటికి నూరుపాళ్లూ ఆదర్శవాది. ఆయన విశ్వాసం ప్రకారం పత్రికా రచన అసిధారావ్రతం. తాను నమ్మిన సిద్ధాంతాల కోసం ఎంతటి త్యాగానికైనా ఆయన వెనుదీసేవారు కాదు. అలా రాజీనామా చేసిన తరువాత, తానే ఒక ఇంగీషు వారపత్రిక పెట్టాలని నిశ్చయించుకుని, ఆ ప్రయత్నంలో ఉన్న సమయంలో నా ఇంగీషు ఉత్తరాలు చదివారాయన. ఎందుకో గాని ఆ ఉత్తరాలలోని ఇంగ్లీషు ఆయనను అమితంగా ఆకర్షించింది. వెంటనే నాకు టెలిగ్రాం యిచ్చి మద్రాసు రమ్మన్నారు. అంతవరకు ఆయనతో నాకు పరిచయంలేదు. ఆయన రచనలు చదవడమే గాని, ఎన్నడూ ఆయనను చూడనుకూడా చూడలేదు. నాకూ ఆయనకూ మిత్రుడైన తెలుగు వారపత్రిక సంపాదకుడి ద్వారా పంపించిన టెలిగ్రాం నాలో ఆసక్తి రగిల్చింది. వెంటనే మద్రాసు వెళ్ళాను. ఎక్కడనుండి? తూర్పు కోస్తా ఉత్తరకోనలో ఉన్న ఖుర్దా రోడ్డునుండి.

ఖాసా, నేనూ, ఒకరోజంతా మాట్లాడుకున్నాము. నా జీవితంలో అది మరపురానిదినం. అంతే, ఒక నిశ్చయానికి వచ్చేశాను. ఆయనదగ్గర పని చెయ్యాలి. ఆయన తలపెట్టిన ఉద్యమంలో పాల్గొనాలి. అలాచేస్తే ఆర్థికంగా జీవించడానికి భద్రత ఉండదు. ఐనా పర్వాలేదు. దేశస్వాతంత్ర్యంకోసం కలంద్వారా పోరాడాలి. ఆయనస్థాపించ దలుస్తున్నది ఇంగ్లీషు వారపత్రిక. అంతవరకూ నేను ఇంగ్లీషులో ఎన్నడూ రచనలు చెయ్యలేకపోవటం అటుంచి అసలు జర్నలిజం, పత్రికారచన అంటే ఏమిటోతెలియదు.అలాంటినన్ను ఖాసా ప్రత్యేకించి ఎన్నుకున్నారు.ఆయన ఎందుకలా చేశారో యిప్పటికి నాకు తెలియదు. ఈతరానివాణ్ణి అమాంతం నదిలో పడేసినట్లయింది. ఖాసావంటి ఆంగ్లభాషా నిష్ణాతునివద్ద పనిచేయడం అదొక అసిధారా వ్రతం. ఆ రోజుల్లో మద్రాసులో ఖాసా సంపాదకత్వాన వెలువడే స్వతంత్ర అనే పేరుగల ఇంగ్లీషు వారపత్రిక కార్యాలయం రాజకీయ నాయకులకూ, మేధావులకూ, సాహితీవేత్తలకూ ఒక యాత్రాస్థలంగా ఉండేదనడంలో ఎంతమాత్రం అతిశయోక్తిలేదు. అక్కడే నాకు

BRAOU

మొదటిసారి రాజాజీతో పరిచయం. సంపాదకవర్గంలో నా సహచరులు మంజేరీ ఈశ్వరన్, జి.ఎస్.ఎస్. రాఘవన్, శ్రీమతి శాంతా రంగాచారి, స్వర్గీయ మంజేరి ఈశ్వరన్ అప్పటికే ఇంగ్లీషులో ప్రముఖ కవి, కథారచయిత.

రెండు సంవత్సరాల తరువాత కేవలం నా ప్రోద్బలం మీద, ఆమాటకొస్తే నా పోరుపడలేక 'తెలుగు స్వతంత్ర' నెలకొల్పి, దాని సంపాదకత్వ బాధ్యతను నాకప్పగించారు. రెండు వారపత్రికలూ వాటి వాటి రంగాల్లో చరిత్ర సృష్టించాయని నిష్పాక్షికులందరూ అంగీకరించారు. అలా పన్నెండు సంవత్సరాలు మద్రాసులో స్వతంత్ర కార్యాలయంలో, కృష్ణశాస్త్రి కవిత్వ భాషలో చెప్పాలంటే, ఆకులో ఆకునై పూవులో పూవునై గడిపాను. ద్వాదశాబ్దాల అనుభవాలనూ, జ్ఞాపకాలనూ క్లుప్తంగా వివరించడం సాధ్యం కాదు. ఒకటా ? రెండా ? సహస్ర అనుభవాలు, తదుపరి ఆ రెండు పత్రికలూ ఆగిపోయాయి. నేను హైదరాబాద్ చేరుకున్నాను. నాలుగు సంవత్సరాలు 'తెలుగు స్వతంత్ర' స్వంతంగా నడిపాను. ఆ తరువాత ఆర్థికంగా నాకు సాధ్యం కాలేదు. పిమ్మట "ఆంధ్రభూమి'' సంపాదకుడిగా ఉద్యోగంలో చేరాను. పద్ధెనిమిది సంవత్సరాలు గడిచాయి, అనగా పత్రికా రచనలో యిప్పటికి మొత్తం 34 సంవత్సరాలు గడిపాను. జీవితాంతం ఈ వృత్తిలో ఉండాలనేదే నా ఆశయం. అది ఎంతవరకూ నెరవేరుతుందనేది విషయాంతరం. వారపత్రిక సంపాదకుడిగా ఒక రకం అనుభవాలు గడించాను. దినపత్రిక సంపాదకుడిగా నా అనుభవాలు మరొక రకానివి. ఐతే వాటి మార్గాలలో రెండూ నా మట్టుకు అమూల్యమైనవి. విజయగర్వ రేఖతో మెరిసిపోయిన ఘట్టాలూ ఉన్నాయి. నిరాశతో కృంగిపోయిన తరుణాలూ ఉన్నాయి. స్వర్గీయ ఖాసా స్వాతంత్ర్య పోరాట సమయంలో ఇంగ్లీషు దిన పత్రిక సంపాదకుడిగా జర్నలిజంలో ప్రవేశించి, చివరిదశలో వారపత్రిక సంపాదకుడిగా చరిత్ర సృష్టించారు. ఆయన పర్యవేక్షణలో నేను వారపత్రిక సంపాదకుడిగా జర్నలిజం ప్రారంభించి, అనంతరం దినపత్రిక ఎడిటర్‌గా పనిచేస్తున్నాను. పత్రికారంగం లోతుపాతులు తెలియనివారికి జర్నలిజంలో ఒకానొక గ్లామర్ కనిపించవచ్చు. దిగితేగాని లోతు తెలియదు. మనస్ఫూర్తిగా అంకితమయిన వారికి ఇది చాలా కఠోరమయిన వృత్తి. అందులోనూ రాగద్వేషాలకు అతీతంగా ఉంటూ చిత్తశుద్ధిగా నమ్మినది నమ్మినట్లు వ్రాస్తే పత్రికా రచయితలకు, ముఖ్యంగా సంపాదకులకు, ఎన్నెన్నో కష్టాలు ఎదురవక తప్పదు. ఒకనాడు సాహిత్య, రాజకీయ రంగాలు రెండింటిలోనూ ఒక హుందాతనం, సహృదయత కానవచ్చేవి. సిద్ధాంత విభేదాలు ఎన్ని ఉన్నప్పటికీ, వ్యక్తిగత స్నేహాలకూ గౌరవాభిమానాలకూ విఘాతం కలిగేది కాదు. నేడు విలువలన్నీ కలగాపులగమై, దిగజారిపోయి, అవినీతి, స్వార్థం, ధనతృష్ణ విపరీతంగా పెరిగాయి. తక్కిన రంగాలలోని దౌర్బల్యాలే జర్నలిజంలో కూడా ప్రవేశించాయి. అలనాడు ఖాసా వంటి వారికి పత్రికా నిర్వహణ ఒక పవిత్రమయిన ఉద్యమం. క్రమంగా అదొక వృత్తిగా మారింది. కాలంతోపాటు అలా మారక తప్పదు. కాని, ఇవాళ లాభార్జన ఒక్కటే ధ్యేయంగా పెట్టుకున్న వ్యాపారస్థితికి దిగజారింది. అధికారంలో ఉన్నవారికి పొగడ్తలు మినహా మరేదీ అక్కరలేదు. సహృదయతతో చేసిన విమర్శ కూడా సహించలేరు.

వృత్తిలో ఎంత అనుభవజ్ఞుడయిన పత్రికా రచయిత, సంపాదకుడు అయినప్పటికీ సర్వజ్ఞుడు మాత్రం కాడు. అర్ధరాత్రివేళ నిద్రలేపి, ఒరిస్సా గవర్నర్ పేరు అడిగితే ఠపీమని చెప్పలేడు. కాని, వృత్తికి చిత్తశుద్ధితో అంకితమయిన పత్రికారచయిత అనునిత్యం లోకావలోకనం చేస్తారు. నిరంతర అధ్యయనం అతడికి తప్పనిసరి. అతడి జగత్తు నిత్య పల్లవ శీలమైనది. సంపాదకీయం వ్రాసిన ప్రతీసారీ నేను పరీక్షకు కూర్చున్నట్లు భావిస్తాను. వేలాది పాఠకులు దాన్ని చదివి మార్కులు వేస్తారు. అందుచేత నేను నేటికి విద్యార్థిగానే, భావించుకుంటాను. నావాఖ్యలు చదివి నా ప్రాణం తీస్తానని కొందరు బెదిరించిన ఘట్టాలూ ఉన్నాయి. బ్రహ్మాండంగా అభినందించిన ఘట్టాలూ ఉన్నాయి. 34 సంవత్సరాల జర్నలిస్టు జీవితాన్ని ఒక్కసారిసింహావలోకనం చేసుకుంటే, కలిగే అనుభూతి మాటలతో వర్ణించడానికి అలవికానిది. సమకాలీన చరిత్రను చేరువ నుండి గమనించడమే కాక, ఆ చరిత్ర మంచిదో, చెడ్డదో, సృష్టిస్తున్న పరిణామాలను తిలకించడమే గాక, వాటిపై వ్యాఖ్యానించడం నామట్టుకు నాకు ఆత్మశోధనకు చక్కని అవకాశం. అలాంటి అవకాశాన్ని పత్రికా రచన కల్పిస్తుంది. దాన్ని ఎలా వినియోగించుకోవాలనేది ఆ వ్యక్తి ప్రవృత్తి మీద ఆధారపడి ఉంటుంది.

(ఆకాశవాణి, హైదరాబాదు కేంద్రం నుండి ప్రసంగం, గోరాశాస్త్రి సన్మానసంచిక, 1982, పేజీలు 21-24)

BRAOU

## అభ్యాసం (రాసేపని)

I) ఈ కింది వాక్య సమూహాల్లో వాక్యాల మధ్య సంబంధాన్ని గుర్తుపట్టండి. అర్థం మారకుండా ఎట్లా కలపవచ్చునో? ప్రయత్నించండి. కలపటానికి వీల్లేకపోతే ఎందుకు వీల్లేదో రాయండి.

1. కాకినాడ కాలేజీలో బ్రహ్మసమాజ సంస్కరణ వాయువులు బలీయంగా వీచేవి. యువతరాన్ని సంఘ సంస్కరణోద్యమాలకు ఉత్తేజపరిచేవి.
2. మహాకవి దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు విద్యార్థుల్ని అయస్కాంతం వలె ఆకర్షించేవారు. సాహిత్యాభిరుచి పెంచేవారు.
3. ఆయన దగ్గర పనిచేయాలి. ఆయన తలపెట్టిన ఉద్యమంలో పాల్గొనాలి.
4. పిమ్మట ఆంధ్రభూమి సంపాదకుడిగా ఉద్యోగంలో చేరాను. పద్దెనిమిది సంవత్సరాలు గడిచాయి.
5. విజయగర్వ రేఖతో మెరిసిపోయిన ఘట్టాలు ఉన్నాయి. నిరాశతో క్రుంగిపోయిన తరుణాలు ఉన్నాయి.
6. నా వ్యాఖ్యలు చదివి నా ప్రాణం తీస్తానని కొందరు బెదిరించిన ఘట్టాలు ఉన్నాయి. బ్రహ్మాండంగా అభినందించిన ఘట్టాలు ఉన్నాయి.

II) ఈ వాక్యాలను చిన్న వాక్యాలుగా విడగొట్టండి అందువల్ల అర్థం మారుతున్నదేమో చూడండి.

1. అప్పటికే తమాయించుకొని తెలియదండీ అన్నాను.
2. ఆమాటకొస్తే పోరుపడలేక తెలుగు స్వతంత్ర నెలకొల్పి దాని సంపాదకత్వ బాధ్యత నా కప్పజెప్పారు.
3. స్వర్గీయ ఖాసా స్వాతంత్ర్య పోరాట సమయంలో ఇంగ్లీషు దిన పత్రిక సంపాదకుడిగా జర్నలిజంలో ప్రవేశించి చివరి దశలో వారపత్రిక సంపాదకుడిగా చరిత్ర సృష్టించారు.
   ఆయన పర్యవేక్షణలో నేను వారపత్రిక సంపాదకుడిగా జర్నలిజం ప్రారంభించి అనంతరం దినపత్రిక ఎడిటర్‌గా పని చేస్తున్నాను.
4. నేడు విలువలన్నీ కలగా పులగమై దిగజారిపోయి, అవినీతి, స్వార్థం, ధనతృష్ణ విపరీతంగా పెరిగాయి.

III) ఈ క్రింది వాక్యాలను విడగొట్టండి కనుక కాని అనే మాటలను తీసివేయవచ్చేమో చూడండి. వాక్యాల మధ్య సంబంధం వివరించండి.

1. సమయం నడిరేయి కనుక గది నిండా నిశ్శబ్దం.
2. అప్పటికి ఒరిస్సా గవర్నరు పేరు జ్ఞాపకం రాలేదు గాని స్వర్గీయ ఖాసా సుబ్బారావుగారు జ్ఞాపకం వచ్చారు.
3. విన్నారా ఈ అర్థరాత్రి సంభాషణ? గమనించారా ఏక వచన ప్రయోగం.
4. ఒకటా? రెండా?

iv) గోరాశాస్త్రి పదునైన పదప్రయోగానికి, చురుకైన వాక్య ప్రయోగానికి సున్నితమైన హాస్యానికి ఉదాహరణలు వెతకండి.

BRAOU

ఖండిక 9 పాఠం 15

# రచనలో విరామ చిహ్నాలు

**ఉద్దేశం**

ఆధునిక తెలుగు రచనాభాషలో వాడుతున్న కొన్ని విరామ చిహ్నాలను పరిచయం చేయడం.

**ప్రణాళిక**

1. విరామ చిహ్నాలు ఎట్లా ఉంటాయి ? అవి ఏవి ?
2. విరామ చిహ్నాల ప్రయోజనం
3. విరామచిహ్నాల్లో భేదాలూ, వాటిని వాడే పద్ధతులూ
4. ముఖ్యవిషయ క్రోడీకరణ
5. అభ్యాసాలూ, ప్రశ్నలూ

## విరామ చిహ్నాలు ఎట్లా ఉంటాయి ? అవి ఏవి ?

ఈ కింది గళ్లలో కొన్ని గుర్తులున్నాయి. గళ్ళపక్కనే గళ్ళలోని గుర్తుల పేర్లు ఉన్నాయి. వీటిని ఒకటి రెండుసార్లు గుర్తుంచుకోండి. ఈ పాఠంలో వీటినన్నిటినీ మీకు పరిచయం చేయడంలేదు. అయినా, గుర్తుంచుకోవడం వల్ల నష్టం లేదు :

| | | | |
|---|---|---|---|
| . | ముగింపు చుక్క లేదా బిందువు (Full Stop or Period) | - | పొట్టిగీత (Hyphen) |
| ... | మూడు చుక్కలు (Ellipses) | ----- | పొట్టిగీతల వరుస |
| : | కోలన్ (Colon) | — | పొడుగుగీత (Dash) |
| , | కామా (Comma) | ___ | కిందిగీత (Under Scoring) |

BRAOU

| | | | |
|---|---|---|---|
| ; | సెమికోలన్ (Semi Colon) | । | ఒంటి నిలువుగీత (Single Slash) |
| :— | కోలన్ డాష్ (Colon Dash) | ॥ | జంట నిలువుగీతలు (Double Slash) |
| ,, | సదరహీ చిహ్నం/డిటో (Ditto) | ! | రాగచిహ్నం లేదా ఆశ్చర్యచిహ్నం (Exclamation) |
| / | ఛేదచిహ్నం (Virgule or Bar or Slash Mark) | ( ) | కుండలీకరణం (Paranthesis) |
| ' | సంక్షేప చిహ్నం (Apostrophe) | [ ] | నిలువు కుండలీకరణం (Brackets) |
| ' ' | ఒంటి ఉల్లేఖన చిహ్నాలు (Single Quotation marks) | } | బంధన చిహ్నం (Brace or Flower Bracket) |
| " " | జంట ఉల్లేఖన చిహ్నాలు (Double Quotation marks) | * | నక్షత్ర చిహ్నం (Asterick) |
| ? | ప్రశ్న చిహ్నం (Question mark) | ***** | నక్షత్రాల వరుస |

BRAOU

ఈ గుర్తులు మాట్లాడే భాషలో ఉండవు. రాసే భాషలో కన్పిస్తాయి ; రాసినట్లే అచ్చువేస్తారు కాబట్టి, అచ్చులో కూడా కన్పిస్తాయి. వీటిలో కొన్నిటినైనా మీరు ఏ వ్యాసమో, కథో, నవలో, నాటికో చదువుతున్నప్పుడు గమనించి ఉంటారు; ముందు పాఠాల్లో చూసి ఉంటారు; ఇప్పుడు చూస్తున్నారు. కానీ వీటిని పెద్దగా పట్టించుకొనక పోయి ఉండవచ్చు; వీటి ప్రయోజనం కూడా మీకు కచ్చితంగా తెలిసి ఉండకపోవచ్చు. రాసే భాషలో వీటికి నిర్దిష్టమైన ప్రయోజనాలున్నాయని ఈ పాఠం ద్వారా మీరు తెలుసుకుంటారు.

## విరామ చిహ్నాల ప్రయోజనం

మాట్లాడేటప్పుడు కేవలం మాటల మీదనే ఆధారపడము ; భుజాలు ఎగరవేస్తాము ; కనుబొమలు ముడుస్తాము ; తల ఊపుతాము; ముందుకూ, వెనక్కీ వంగుతుంటాము; చేతులు ఆడిస్తాము; పాదాలతో నేలను తాడిస్తాము-చిన్నపిల్లలకు కోపం వచ్చినపుడు, వాళ్ళు మారాం చేస్తున్నపుడు మాట్లాడుతూ, ఏడుస్తూ, కోపం ప్రకటిస్తూ, ఎగురుతూ ఎగురుతూ నేలకు తాడిస్తారు చూడండి, అట్లా, మన గొంతు పెంచుతాము, తగ్గిస్తాము. గొంతులో జీర పలుకుతుంది. కోపం వచ్చినపుడు, ఆనందం వేసినపుడు, బాధ కలిగినపుడు, దుఃఖం ముంచుకొచ్చినపుడు మన మాటలమీద ఆయా భావాల ప్రభావం ఉంటుంది. మాట్లాడుతూ, మాట్లాడుతూ ఆగుతాము. మనం మాట్లాడే వాక్యాలు ఎక్కడో ఒకచోట ముగుస్తాయి ; ఎప్పుడో ఒక సమయంలో ముగుస్తాయి ; మళ్ళీ మొదలవుతాయి. మధ్య మధ్య ఊపిరంటూ పీల్చుకోకుండా వాక్యాలు ఏకధాటిగా సాగవు. వాటికి పరిమితి ఉంది.

రాసేభాషలో, అచ్చులో అక్కడక్కడ ఆపడం సూచించే మాటలను మధ్య మధ్య వాడటం వ్యవహార రీత్యా కుదరదు. ఇక్కడ వాక్యం ముగిసింది, ఇక్కడ రవంత నిలపాలి, ఇక్కడ ప్రశ్న అంటూ రాతలో రాసే వాక్యాల తర్వాత సూచన లివ్వడం అసాధ్యం. అందువల్ల ఆపడం (విరామం) సూచించడానికి కొన్ని సంకేతాలను భాషా వ్యవహర్తలు ఏర్పరచుకుంటారు. అటువంటి సంకేతాలను విరామచిహ్నాలు అని అంటారు. ఇంగ్లీషులో వీటిని punctuation Marks అని అంటారు. పైన గళ్ళలో చూపినవి అవే.

BRAOU

విరామ చిహ్నాలు అనే సమాసంలో రెండు మాటలున్నాయి. ఈ సమాసానికి అర్థం విరామాన్ని సూచించే గుర్తులు అని. రాతలోని విషయంగానీ, అచ్చులోని విషయం గానీ సులభంగా గుర్తించడానికి, మనసు కెక్కడానికి వాక్యాలుగా, ఉపవాక్యాలుగా విభజిస్తారు. అట్లా విభజించిన భాగాలను విరామంతోనూ, గుర్తులతోనూ సూచించే పద్ధతిని విరామచిహ్నాలు ఉపయోగించే పద్ధతి అని అంటారు. విరామ చిహ్నాలను వాడడంలో నైపుణ్యం అలవడితే భావబోధ స్పష్టంగా సాగుతుంది. రచన చేసేవ్యక్తి అనుకునే రీతిలో భావవ్యక్తీకరణ అప్పుడే బలంగా సాగుతుంది.

రాతలోనూ, అచ్చులోనూ విరామాలను సూచించడానికి రెండు రకాలు మార్గాలున్నాయి. అవి :

1. పదాల చివర కొంత ఖాళీ స్థలాన్ని వదలి, ఆ రకంగా వదలిన ఖాళీ స్థలాలను విరామాలుగా సూచించే మార్గం.
2. పదాల చివరా. వాక్య భాగాల చివరా, వాక్యాల చివరా గుర్తులు వాడి, వాటిని విరామాలుగా సూచించే మార్గం

మొదటి మార్గం ఎందుకు అవలంబిస్తారో, కింద ఇచ్చిన రెండు ఉదాహరణలకు సంబంధించిన మూడు భేదాలను పరిశీలిస్తే తెలుస్తుంది:

1. రమణయ్యతోకనకయ్యమాట్లాడడంమానివేశాడు
   సుబ్బయ్యతనకొడుకునూతనభార్యనూతనకూతురునూతనకొత్తఇంటికితీసుకవెళ్ళాడు.
2. రమణయ్య తోక నకయ్యమా ట్లాడడం మానివేశాడు.
   సుబ్బయ్య తనకొడుకు నూతనభార్య నూతనకూతురు నూతన కొత్త ఇంటికి తీసుకవెళ్ళాడు
3. రమణయ్యతో కనకయ్య మాట్లాడడం మానివేశాడు.

సుబ్బయ్య తన కొడుకునూ, తన భార్యనూ, తనకూతురునూ తన కొత్త ఇంటికి తీసుక వెళ్ళాడు.

మొదటి రకంలో ఖాళీ స్థలాలంటూ లేకుండా అక్షరాల కూర్పుఉంది. రెండోరకంలో అర్థవంతం కాని పదాల కూర్పు ఉంది. ఈ రెండు రకాల్లో మాదిరి ఎవరూ మాట్లాడరు. కాబట్టి, ఎవరూ రాయరు. అచ్చులో పొరపాట్లు దొర్లితే దొర్లవచ్చు. అట్లా రాస్తే, అట్లా అచ్చు అయితే వాక్యంలోని పద స్వరూపం తెలియదు; పద క్రమం తెలియదు; పద సంబంధాలు (వ్యాకరణ సంబంధాలు) తెలియవు. పరిచితంకాని పదాలున్నప్పుడు వాక్యం అసలు బోధపడదు. కళ్ళకూ శ్రమే, మనసుకూ అలసటే. ఈ రకమైన వాక్యాల స్థానంలో పెద్ద పెద్ద వాక్యాలు ఉన్నాయనుకోండి. ఒక రెండువందల పేజీల గ్రంథం అట్లా అచ్చు వేశారనుకోండి. అప్పటి స్థితినీ, శ్రమనూ మనం ఊహించలేము. అందువల్ల మూడోరకం కింద ఇచ్చినట్లు విరామాలు పాటిస్తూ, రాసినా, అచ్చువేసినా భాషా వ్యవహారానికి సహజంగా, అనుగుణంగా ఉంటుంది. విరామాలను సూచించే ఖాళీ స్థలాలను, అచ్చులో స్పేస్ (**Space**) ఇవ్వటమంటారు.

మన పూర్వపురాతలో మాటకూ మాటకూ విరామాన్ని సూచించే అలవాటులేదు. అచ్చుయంత్రాలూ, పత్రికలూ వచ్చిన తరవాతనే ఆ అలవాటు వచ్చింది. తెలుగులో కానీ, యితర భారతీయ భాషల్లో కానీ పదాన్ని నిర్వచించటం కష్టం. కొన్ని పదాలను కలిపి చేసిన సమాసాలను కూడా పదం అని వ్యవహరించేవారు. విడిగా వాడదగిన మూల రూపాలూ, ప్రత్యయాలు చేర్చిన మూల రూపాలూ పదాలుగా గుర్తించవచ్చు. అక్కడే వస్తుంది చిక్కు. ప్రత్యయాలంటే ఏవి? వీటిని గుర్తించటం కూడా అంత తేలిక కాదు. విభక్తులు తీసుకోండి. ను/ని, కు/కి, తో, లో, వంటివి ప్రత్యయాలు అని అందరూ ఒప్పుకుంటారు. కాని, నుంచి, వల్ల, బట్టి, తోటి, కూడా, మీద, పైన, పక్క, కింద, గురించి, చేత మొదలైన వాటిని ఏమనాలి?

శాస్త్ర సంబంధమైన నిర్వచనాల మాట ఎట్లా ఉన్నప్పటికీ, రాతకూ, అచ్చుకూ సంబంధించినంత వరకు వీటిని పదాలుగానే గుర్తించటం మంచిది. విరామానికి సంబంధించినంతవరకు ఈ కింది సూచనలు పాటిస్తే సౌకర్యంగా ఉంటుంది. విరామం ఈ కింది చోట్ల ఉండాలి:

BRAOU

1. ఏ ప్రత్యయమూ లేని పదాల మధ్య :
2. మూల రూపానికి ఒకే అక్షరం ఉన్న ప్రత్యయంచేర్చినప్పుడు మొత్తం ఒకటే పదం అవుతుంది. ఆ పదం తరువాత:

   ఇంటిలో, వాడిని, బడికి, దేశాలు, గదులు, దేశంలో, నాతో

3. విశేషణానికీ, నామానికీ మధ్య:

   మంచి మనిషి, నల్లబల్ల
   మంచివాడు, వచ్చేవాడు లాంటి చోట్ల విరామం అక్కర్లేదు.
   *మంచిది, వచ్చేది* అనే మాటల వంటివే ఇవీ. విరామం ఇస్తే నష్టం లేదు.

4. నామానికి ఒక అక్షరం కన్నా ఎక్కువ ప్రత్యయం చేర్చినప్పుడు, వాటి మధ్య:
   ఇంటి పక్క, బల్ల కింద, నిన్ను గురించి, వాళ్ళను బట్టి. అయితే ఒకే అక్షరంఉన్న సర్వనామ రూపాల తర్వాత ఈ ప్రత్యయాలు వస్తే కలిపి రాయడం మంచిది. నా కోసం, మీ చేత
5. క్రియల్లో సమాపక క్రియ అంతా ఒక పదంగా రాయటం మంచిది:
   చెప్పుకోలేకపోయాడు, చెప్పలేదు, చెప్పడంలేదు.
6. అసమాపక క్రియ తర్వాత:

   అన్నం తిని బజారుకు వెళ్ళాడు.
   రేపు రమ్మని చెప్పి, నిద్రపోయాడు.

తెలుగులో విరామాల విషయమై స్థిరమైన అలవాట్లు ఏర్పడలేదు. అందాకా ఇట్లాంటి నియమాలు కొన్ని పెట్టుకుంటే, ఇవే కొన్ని ఉపయోగకరమైన సంప్రదాయాలుగా తరువాత తయారు కావచ్చు.

రెండో మార్గంలో విరామ చిహ్నాలను వాడతారు. విరామ చిహ్నాల ప్రధాన ప్రయోజనాలు రెండు :

1. వాక్యం ముగింపును సూచించడం.
2. అదే వాక్యంలో ఉన్న పదాలనూ, పద బంధాలనూ, వాక్య భాగాలనూ ఇతర పదాలనుంచి, పదబంధాల నుంచి, వాక్య భాగాలనుంచి వేరుచేసి స్పష్టతను పెంచడం.

## విరామ చిహ్నాల్లో భేదాలూ, వాటిని వాడే పద్ధతులూ

ఆధునిక వచన రచన ప్రచారానికి వచ్చిన తర్వాతనే, రకరకాల విరామచిహ్నాలను వాడే పద్ధతులు ఏర్పడ్డాయి. విరామచిహ్నాలను వాడటంలో, రచయితలందరి మధ్య ఏకరూపత కన్పించకపోవచ్చు. ఒకే రచయిత రాసిన రచనల్లో కూడా, ఒక రచనకూ మరొక రచనకూ ఈ గుర్తుల వాడకంలో తేడా లుండవచ్చు, తికమక లుంటే ఉండవచ్చు. వార్తాపత్రికల్లో తేడాలూ, తికమకలుకూడా గమనించదగినవి అయినప్పటికీ, తెలుగు భాషానిర్మాణాన్ని, గుర్తుల అధిక వ్యాప్తినీ దృష్టిలో ఉంచుకొని విరామచిహ్నాలను ఉపయోగించడం సమంజసం.

ఈ పాఠంలో కిందివాటిని వాడే పద్ధతులు తెలుసుకోండి :

1. ముగింపుచుక్క లేదా బిందువు
2. కామా
3. సెమికోలన్
4. పొట్టిగీత (హైఫన్)
5. పొడుగుగీత (డాష్)
6. ప్రశ్నచిహ్నం
7. రాగచిహ్నం
8. జంట ఉల్లేఖన చిహ్నాలు
9. కుండలీకరణం
10. నూడుచుక్కలు

ఇవి సర్వసాధారణంగా మనం చదివే రచనల్లో ఎదురయ్యే విరామ చిహ్నాలు.

### [ . ] ముగింపుచుక్క లేదా బిందువు

BRAOU

సి. పి. బ్రౌన్ కూర్చిన *ఇంగ్లీష్ తెలుగు నిఘంటువు* ఒకసారి చూడండి. Full Stop అనే మాటకు *వాక్యముయొక్క ముగింపు, గీటు* అనే రెండు అర్థాలు ఆ నిఘంటువులో కన్పిస్తాయి. చాలా భాషల్లో వాక్యం యొక్క ముగింపును బిందువుతోనే సూచిస్తున్నారు. తెలుగులోనూ అంతే. అయితే, ఒకప్పుడు తెలుగు పద్యాంతాలనూ, శ్లోకాంతాలనూ, వాటి భాగాలను గీట్లతో సూచించేవాళ్ళు ; రెండుగీట్లతో కూడా సూచించే వాళ్ళు. ఇప్పుడు బిందును వాడుతున్న స్థలాలు:

1. నిశ్చయార్థక వాక్యం (declarative Sentences) చివరలో
   - సినిమా పుట్టుకతోనే వ్యాపారం. (రా. రా.)
   - చాలా మతాలు పరిణామ వాదాన్ని ప్రతిఘటిస్తాయి (కొ. కు.)
   - మోనలిజా చిరునవ్వు అద్భుతంగా ఉంటుంది.
2. మర్యాదపూర్వకమైన అభ్యర్థన చివరలో, ఆజ్ఞచివరలో
   - కావలసినంత వ్యవధిని మీరు తీసుకోవచ్చు.
   - ఈ ఉత్తరానికి ప్రత్యుత్తరం రాయండి.
3. ప్రామాణికమైన సంక్షిప్తరూపాల మధ్యలో, చివరలో

| | |
|---|---|
| కి. కిలో | క్రీ. పూ. క్రీస్తుపూర్వం |
| మీ. మీటరు | క్రీ. శ. క్రీస్తుశకం |
| రూ. రూపాయి | డా. డాక్టరు (డా.జి. రాంరెడ్డి) |
| గం. గంటలు | |

UNO, AICC, BJP, లాంటి మాటలలో (సంక్షిప్తరూపాల్లో) ఇంగ్లీషులో బిందువులు వాడడం మానేశారు. కాబట్టి తెలుగులో కూడా ఐరాస, బిజెపి, ఎఐసిసి అనే మాటల్లో బిందువులు అక్కర్లేదు.

UNESCO, UNICEF, NATO, ASEAN అనే మాటలను తెలుగులో యునెస్కో, యూనిసెఫ్, నాటో, ఆసియన్ అని రాస్తాము. కాబట్టి వాటిలో బిందువులు వాడే అవకాశమేలేదు.

4. ఇంటిపేరులోని మొదటి అక్షరాన్ని మాత్రమే రాస్తే, ఆ మొదటి అక్షరం చివరిలో

శ్రీ. శ్రీనివాసరావు (శ్రీరంగం శ్రీనివాసరావు)

ఇట్లా ఇంటిపేరును వేరుపరిచేటప్పుడు, ఇంటిపేరులోని మొదటి అక్షరం తర్వాత జంటనిలువుగీట్లు (॥) రాసేవాళ్ళు. ఇప్పుడు బిందువునే ఎక్కువగా వాడుతున్నారు. బిందువును పెట్టే పద్ధతిని ఇంగ్లీషు సంప్రదాయాన్ని బట్టి మనం అలవాటు చేసుకున్నాము. చాలా అరుదుగా తప్పితే, తెలుగువాళ్ళకు ఇంటిపేరు ముందు వస్తుంది. ఇంటి పేరును పూర్తిగా రాయడం మన పద్ధతి. ఇంటిపేరును పుటాక్షరంలోరాసినప్పుడు ఇంగ్లీషు అక్షర క్రమం తెలుగు లిపిలో పాటిస్తారు. అట్లాగే ఇంటి పేరునూ. అసలుపేరులోని మొదటి భాగాన్ని రాసినప్పుడు కూడా.

కె. సభా వి. ఆర్. నార్ల నార్ల వెంకటేశ్వరరావు

జి. యన్. రెడ్డి జె.వి. సోమయాజులు

ఇంటిపేరులోని మొదటి అక్షరాన్ని, అసలుపేరులోని మొదటి అక్షరాన్ని కలిపి పేరుగా వాడుకునే పద్ధతి ఒకటి ఉంటుంది. అటువంటి సందర్భాల్లో :

కా. రా. (కాళీపట్నం రామారావు)
రా. రా. (రాచమల్లు రామచంద్రా రెడ్డి)
చే. రా. (చేకూరి రామారావు)
బూ.రా. (బూదరాజు రాధాకృష్ణ)
పా. ప. (పాలగుమ్మి పద్మరాజు)
కొ. కు. (కొడవటిగంటి కుటుంబరావు)

సినారె (సి. నారాయణరెడ్డి), బంగోరె (బండి గోపాలరెడ్డి), గిరాంపంతులు (గిడుగురామమూర్తి పంతులు రావిశాస్త్రి (రాచకొండ విశ్వనాథశాస్త్రి), గోరా (గోపరాజు రామచంద్రరావు), జరుక్‌శాస్త్రి (జలసూత్రం రుక్మిణీ నాథశాస్త్రి), గోరాశాస్త్రి (గోవిందురామశాస్త్రి), మాగోఖలే (మాధవపెద్ది గోఖలే), ముసునా (మల్లాది సూర్య నారాయణ), అరసం (అభ్యుదయ రచయితల సంఘం,) విరసం (విప్లవరచయితలసంఘం)-వీటిలో బిందువు లేకపోవడం గమనార్హం. పుటాక్షరాలలో రాస్తే వేరు అర్థాలు వచ్చేచోట బిందువు విధిగా ఉండాలి. బూ.రా;పా.ప వంటిచోట్ల. ఇంటిపేరు పూర్తిగా రాసి, ఆ తర్వాత అసలు పేరు రాస్తే ఇంటిపేరు చివరలో బిందువు అవసరంలేదు. విరామం ఉంటుంది.

త్రిపురనేని రామస్వామి చౌదరి
మధురాంతకం రాజారాం
కాళోజి నారాయణరావు
భద్రిరాజు కృష్ణమూర్తి
వాసిరెడ్డి సీతాదేవి
యద్దనపూడి సులోచనారాణి
అచంట శారదాదేవి
నాయని కృష్ణకుమారి

5. ఒకవిషయం కింద కారణాలు వరసగా చెప్పవలసి వచ్చినపుడు వాటివరుసను సూచించే అంకెలు, అక్షరాలు వాడతారు. వాటిచివరలో

పుస్తకాలెందుకు చదువుతానంటే

1. వినోదం లభిస్తుంది.
2. ప్రపంచజ్ఞానం సమకూరుతుంది.

| , | కామా

చదవడంలో రవంత నిలపవలసిన చోట్ల వాడే గుర్తు ఇది. విరామచిహ్నాల్లో బిందువు తర్వాత ఎక్కువగా వాడే గుర్తు ఇది. రచనలో స్పష్టత సాధించడానికి ఈగుర్తు తోడ్పడుతుంది. మితిమీరి ఈ గుర్తును వాడినా, పొర

BRAOU

పొటుగా వాడినా స్పష్టత దెబ్బతింటుంది. మిగతా గుర్తులకంటే, దీని విషయంలో జాగ్రత్త వహించడం అవసరం. ఈ ఎనిమిది స్థలాల్లో కామా వాడతారు:

1. ఉత్తరం మొదలు పెడుతూ, సన్నిహితులను సంబోధించేటప్పుడు సంబోధన చివరలో
   ప్రియమైన రాజశేఖరం,
   ప్రియమైన సులోచనా,

2. ఉత్తరం చివరలో

   మీ, మీ స్నేహపాత్రుడు, మీ అభిమానపాత్రుడు, భవదీయుడు,

స్నేహపాత్రుడైన, అభిమానుడైన, భవదీయుడైన అని రాసినప్పుడు అవి విశేషణాలుగా పనిచేస్తాయి కాబట్టి, వాటిచివరలో కామా వాడనవసరంలేదు.

3. తేదీని సూచించే అంకె తర్వాత నెలపేరు అక్షరాల్లో రాస్తే, మధ్యలో కామా వాడుతారు.

   1, జనవరి, 1984

   తేదీని సూచించే అంకెకూ, సంవత్సరాన్ని సూచించే అంకెకూ మధ్యలో కామా వాడుతారు.

   జనవరి 1, 1985

ఒకటవతేదీ జనవరి 1984 అన్నప్పుడు ఎక్కడా కామా అక్కరలేదు. అట్లాగే 1984 జనవరి ఒకటవ తేదీ అన్నా కూడా

4. సంబోధన చివరలో
   కొమురయ్యా, మీ చేతో పశువులు పడ్డాయి.
   అమ్మా, బయటికి వెళుతున్నా.

5. వ్యక్తి పేరు తర్వాత చేర్చే డిగ్రీ చివరలో, బిరుదుకూ, పదవికీ ముందు
   కోట విజయలక్ష్మి, బి.ఏ.
   చింతా వెంకటేశ్వర్లు, కార్యదర్శి

6. అంకెల్లో వేలనూ, లక్షలనూ, కోట్లనూ దశాంశ పద్ధతిలో వేరుచేసి చూసినప్పుడు:
   5,327   4,76,848   56,27,93,436
   వీటిని మిలియన్లలో, బిలియన్లల్లో సూచిస్తున్నప్పుడు:
   7,436,743
   ఇట్లాగే ఉష్ణోగ్రతనూ, తూకాలనూ, కొలతలనూ దశాంశమానంలో రాస్తారు.

7. అవును, లేదు, కాదు, అసలు, రెండవది, మూడవది లాంటి పదాలతో వాక్యం మొదలయితే, వాటి చివరలో:
   అవును, రంగనాయకమ్మ రచనల్లో చిత్తశుద్ధి ఉంటుంది.
   మొదటిది, అవినీతి అంటే నాకు మంట.

8. విశేష్యాలూ, విశేషణాలూ, పద బంధాలూ, ఉపవాక్యాలూ వరస వరసగా వచ్చినప్పుడు గానీ, సముచ్చయం తర్వాతగానీ, చివరదానికి తప్ప ప్రతిదాని చివరలో కామా ఉంటుంది.
   విశేష్యాలు వరసగా వచ్చినపుడు
   గురజాడ కవి, కథకుడు, నాటకరచయిత, వ్యాసకర్త, భాషా శాస్త్రజ్ఞుడు, సంస్కర్త, అన్నిటికీ మించి, గొప్ప మేధావి.

విశేషణాలు వరసగా వచ్చినపుడు

ఆ సన్నగా, నాజుకుగా ఉన్న ఆ రెండుజడల అమ్మాయి ఎవరు ?



BRAOU

పదబంధాల చివరలో

సింహగర్జనతో, ప్రభంజనవేగంతో, సర్వమానవ కల్యాణ కాంక్షతో, నూతన యుగనిర్మాణం కోసం ప్రజ కదిలింది.

ఉపవాక్యాల చివరలో

నేరుగా వెళ్ళి, కుడివైపుకు తిరిగి, పార్కు దాటండి.

సముచ్చయాల చివరలో(కొన్ని ఒకేరకపు పదాలు వరసగా కలిపే ప్రత్యయాన్ని సముచ్చయం అంటారు) దీక్షితులు గారు చిన్నపిల్లల కథలనూ, "కరుణకుమార" గ్రామీణజీవితాన్నీ, గోఖలే క్షుద్రజీవులనూ చిత్రించి తమ తమ ప్రత్యేకతలను చాటుకున్నారు (కొ. కు.)

## ; సెమికోలన్

ఇది సమన్వయ చిహ్నం. సమాపక క్రియలతో కూడిన చిన్న చిన్న వాక్యాలు వరుసగా వచ్చినపుడు వాటిని కలిపి ఒకే వాక్యంగా రాయడం వల్ల చిన్న వాక్యాలమధ్య ఉన్న సంబంధం బాగా వ్యక్తమవు తుంది. అట్లాగే రెండుమూడు వాక్యాల మధ్య గాఢమైన సంబంధం ఉన్నపుడు కూడా కలిపి రాస్తారు. సమాపక క్రియలతో కూడిన చిన్న చిన్న వాక్యాలు ఈరకమైన వాక్యంలో ఉప వాక్యాలుగా వరసవరసగా వస్తాయి. ఉపవాక్యాల మధ్య సంబంధాన్ని తెలుపుతూ, వాటిని ఒకదాని నుంచి మరొక దానిని విడదీయ డానికి సెమికోలన్ వాడతారు.

సాహిత్యం వర్తకమైనప్పుడు జీవిత వాస్తవాన్ని చిత్రించదు; కృత్రిమ అనుభూతులనే సృష్టిస్తుంది (రా.రా.).

మేము ప్రాధేయపడ్డాము; వాదించాము; చివరకు విసిగిపోయాము.

నిజానికి జీవితేచ్ఛలేకపోతే సృష్టిలేదు; స్థితిలేదు; లయంలేదు (నార్ల).

BRAOU

ఇలాంటి చోట్ల బిందువూ, కామా కూడా వాడుతుంటారు.

మరొక ఉదాహరణ చూడండి :

ఈ ఏడాది శీతాకాలంలో చలిగాలి విపరీతంగా వీచింది; కాని, సిరుటికంటే, అంతకుముందు సంవత్సరం కంటే చలి తక్కువే.

## : కోలన్

ఇది రెండు నిలువు చుక్కల గుర్తు. వాక్యంలో పట్టిక ఇచ్చేటప్పుడు ఆ పట్టికకు ముందు కోలన్ వాడతారు.

విద్యార్థులు క్లాసుకు వచ్చేటప్పుడు విధిగా తెచ్చుకొనవలసినవి: పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, నిఘంటువు, పేనా.

న్యాయమూర్తులకు రెండు బాధ్యతలున్నాయి: నేరస్థులను శిక్షించడం. అమాయకులను రక్షించడం.

## - పొట్టిగీత (హైఫన్)

ఇది చిన్న అడ్డగీత. పెద్ద అడ్డగీత అయిన డాష్‌తో తరచు పొరపాటు పడుతుంటారు. రెండిటినీ ఉపయో గించడంలో తేడా ఉంది. నిజానికి తెలుగుభాషలో, తెలుగుమాటల్లో హైఫన్‌లేదు. ఇంగ్లీషులో సమాసా ల్లాంటి పదాల్లో (Compound words) హైఫన్ ఉంది. first-class, self-reliant, vice-president, pre-history, sub-inspector, co-operation, Indo-Aryan. proto-Dravidian-ఇలాంటి మాటలు తెలుగులోలేవు. కంపోజిటర్లకూ, ప్రూఫు రీడర్లకూ (కొందరు

ప(త్రికా రచయితలకు కూడా) తెలియక పోవడంవల్ల ఇట్లాంటి మాటలను తెలుగులిపిలో ఇంగ్లీషులో లాగే రాస్తున్నారు. భారత-ఫ్రాన్స్ సహకారం, ఇండో-పాక్ సంబంధాలు. ఈరెండు ఉదాహరణలను సీతారాముల పెళ్ళి, కురుపాండవ యుద్ధం అనే సమాసాలతో పోల్చండి. ఈ సమాసాల్లో హైఫన్‌లేదు. ఇండో పాక్ సంబంధాలు వంటి మాటలకు న్యాయంగా తెలుగుచేసి భారత పాకిస్తాన్ సంబంధాలు అనిరాయాలి. సబ్ ఇన్స్పెక్టరు, ఇన్స్పెక్టర్ జనరల్ వంటి మాటలను కూడా హైఫన్ లేకుండా తెలుగులో రాయవచ్చు, రాస్తూనే ఉన్నారు. ఒకమాటలో చెప్పాలంటే, హైఫన్ తెలుగులో వాడనవసరంలేదు. 1983-1984 వార్షిక బడ్జెటు వంటి వాక్యాలలో తప్ప. 1983-84 అన్నప్పుడు రెండేండ్లను కాక పండ్రెండు నెలల వ్యవధిని మాత్రమే సూచిస్తాయి. (విద్యా సంవత్సరం, ఆర్థిక సంవత్సరం లాగా)

## — పొడుగుగీత (డాష్)

ఇది పెద్ద అడ్డగీత. ఆలోచనల్లో అంతరాయం ఏర్పడినపుడూ, ఆలోచన మారినపుడూ, ఆ మానసిక స్థితిని సంకేతించడానికి ఈ గుర్తు తోడ్పడుతుంది. టైపులో డాష్‌ను సూచించాలంటే, రెండు హైఫన్లు కొట్టాలి. రాతలో అది ఒక పెద్ద అడ్డగీత. ముద్రణలో దీన్ని ఎమ్ డాష్ (em dash) అంటారు. ఇది వచ్చే సందర్భాలు :

1. ఒక వాక్యంలోని ప్రయోగాన్ని తిరిగి కొంత మార్పుతో వాడే ముందు

—

రామయ్య—సుబ్బయ్య మూడో కొడుకు—అమెరికా వెళ్ళాడు.
ఇలాంటి వాక్యాల్లో మొదటి డాష్ స్థానంలో అంటే ఉపయోగిస్తే డాష్ అక్కరలేదు.

2. ఒక వాక్యంలోని ప్రత్యేక భాగాన్ని కానీ, ప్రధాన విషయాన్ని కానీ నొక్కి చెప్పే సందర్భాల్లో

—

కన్యాశుల్కం — మహత్తరమైన ఆధునిక నాటకం— 1897లోనే వచ్చింది.

3. సంభాషణలో పదంకానీ, వాక్యంకాని హఠాత్తుగా సంకోచంతోనో, బిడియంతోనో, భయంతోనో, నవ్వుతోనో, నత్తితోనో, దుఃఖంతోనో, మూర్ఖత్వంతోనో ఆగినపుడు, ఆలోచనలు తెగిన మానసిక స్థితిని సూచించినపుడు

మీరన్నది నిజమేనండీ, కానీ—
సు-సు-లో-లో-చన

4. వరసగా మాటలనువాడి, వాటి నుంచీ భావాన్ని పూర్తిచేసే తుది ఉపవాక్యాన్ని వేరుచేయడానికి

డబ్బు, కీర్తి, అధికారం —ఇవి అతని జీవితలక్ష్యాలు.

## ? ప్రశ్న చిహ్నం

అడిగే వాక్యాలను [విధ్యర్థక వాక్యాలు] గురించీ, వాక్యాలను గురించీ పండ్రెండవ పాఠంలో తెలుసుకున్నారు. ప్రశ్నలు భాష మాట్లాడేటప్పుడు వేసినంత ఎక్కువగా, రచనలో వేయము. రచనలో ఎక్కువ ప్రశ్నార్థకాలు కొట్టవచ్చినట్లు కన్పిస్తాయి. పరిమితంగా ఉపయోగించడం మేలు.

ఈ కింది సందర్భాల్లో ప్రశ్న చిహ్నం వాడతారు:

1. ప్రత్యక్ష ప్రశ్న చివరలో; ఒకే వాక్యంలో వరుస వరుసగా ప్రశ్నలుంటే, ఒక్కొక్క ప్రశ్న చివరలో

నాగమణి సర్గిగా చదువుతుందా ?
నాతోవస్తారా ? మీ మిత్రునితో వెళ్తారా ? మరొకరితోనా ?
అక్కడుండి ఎవరు ? రమేషా ? శివాజీనా ?

2. ఒక విషయం చెప్పి, దానిని గురించి ప్రశ్నవేస్తే, ప్రశ్న చివరలో

మనదేశంలో నూటికి నలభై మంది దారిద్ర్యరేఖకు దిగువ ఉన్నారు, కాదంటారా?

3. వాక్యమంతా ఒకే మాటలో అడిగితే

ఎక్కడ ? ఎప్పుడు ? దేనికి ?

4. ఒక అంశానికి సంబంధించి అనుమానం కలిగినపుడు, అదినిజమో కాదో తెలియనపుడు దాని చివరలో.

రాష్ట్ర మంత్రి వర్గ విస్తరణ?

ఆశ్రమంలో అవినీతి?

నేను జూలై 10 (?), 1939లో పుట్టానని మా అమ్మ జ్ఞాపకం.

మొదటి ఉదాహరణల వంటివి పత్రికల శీర్షికల్లో తరచు కన్పిస్తాయి. నిజానికి ఇది మంచి తెలుగు కాదు. రాష్ట్ర మంత్రి వర్గ విస్తరణా? ఆశ్రమంలో అవినీతా? అని రాయడమే సరైన తెలుగు వాడుక. రెండవ ఉదాహరణలో ప్రశ్నార్థకం కుండలీకరణంలో ఇస్తారు- వాక్యం మధ్యలో కాబట్టి.

## ! రాగచిహ్నం

దీనిని ఆశ్చర్యార్థక చిహ్నం అని కూడా అంటారు. వివిధ అనుభూతులను ప్రకటించడానికి ఈ చిహ్నం తోడ్పడుతుంది. అందుకే ఇది రాగచిహ్నం. పత్రికల ప్రకటనల్లో, కథల్లో, నాటకాల్లో, నవలల్లో అవసరాన్ని మించి, రచయితలు ఈ గుర్తును వాడుతుంటారు.

1. ఆకస్మికంగా కలిగిన తీవ్రమైన అనుభూతిని ఒక మాటలోనూ, పదబంధంలోనూ, వాక్యంలో తెలిపినపుడు, వాటి చివరలో

అమ్మో! నాయనో! నా కొంప కూల్చాదర్రో!

2. గట్టిగా పిలుస్తున్నపుడూ, బలంగా చెబుతున్నపుడు, వాక్యాంతంలో

రజనీ, వెంటనే ఇట్రా!

ఈ విషయం చర్చించం!

3. వ్యంగ్యం, సరదా, హాస్యం స్ఫురింపచేసే సందర్భాల్లో, చివర

అపర హరిశ్చంద్రుడు!

నువ్వు హనుమంతుడి లాంటి వాడివి!

నిరుద్యోగులు కావలెను!

4. ఆశ్చర్యం ప్రకటించేటపుడు, నొక్కిచెప్పేటపుడు, చివర

ఎంత మూర్ఖుడు! ఎంత అన్యాయం!

ఎంత అదృష్టవంతుడివి! ఎంత దుర్మార్గం!

## " " జంట ఉల్లేఖన చిహ్నాలు

ఈ గుర్తులు కథల్లో, నవలల్లో ఎక్కువగా కన్పిస్తాయి. కల్పనాసాహిత్యంలో పాత్రలుంటాయి. అవి మాట్లాడుతుంటాయని మీకు తెలుసు. రచయిత కథను తన మాటల్లో చెబుతాడు; పాత్రలచేత మాట్లాడిస్తాడు. కథ చెప్పడమనే మాటేలేకుండా, కేవలం నాటక పద్ధతిలో పాత్రల చేత కథ నడిపించే పద్ధతిని శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి, కొడవటిగంటి కుటుంబరావు వంటి కొద్ది మంది రచయితలు తమకథల్లో మాత్రం అనుసరించారు. పాత్రల మాటలు ఈ గుర్తులలో సూచిస్తారు. వ్యాసాల్లో ఐతే, ఏదైనా ఉల్లేఖించడానికి ఈ గుర్తులు వాడతారు.

1. వక్తమాటలు యథాతథంగా ఇస్తున్నప్పుడు, వాక్యం మొదట్లో, వాక్యం చివరలో

రామారావు అన్నాడు : "నాకు సార్వత్రిక విశ్వవిద్యాలయం పాఠాలంటే ఇష్టం."

2. ప్రఖ్యాతి చెందిన పద్యాల పేర్లు, పాటల పేర్లు ప్రస్తావిస్తున్నపుడు వాటి మొదట్లో, చివరలో

మా తాతగారికి "వెల్లియో చెల్లకో" చాలా ఇష్టం.

మా తమ్ముడికి "మహాప్రస్థానం" గేయం అంటే ప్రాణం.

3. ఉపన్యాసాలు, కరపత్రాలు, చిన్న చిన్న పుస్తకాలు, ఒక పుస్తకంలోని అధ్యాయాలు, ఒక పత్రికలోని వ్యాసాలు - వీటి శీర్షికలను ప్రస్తావిస్తున్నప్పుడు

చివరకు మిగిలేది అనే నవలలో "*గడ్డిపోచ విలువెంత*" అనే అధ్యాయం నాకు నచ్చలేదు.

పురాణం సీత ఇటీవల రాస్తున్న "**ఇల్లాలి ముచ్చట్లు**" చాలా సంచలనాన్ని కలిగిస్తున్నాయి.

4. పాఠకుల దృష్టికి తేవాలనుకున్న మాటకూ, సామెతకూ మొదటిలో, చివరిలో

ఆ గోడమీద "విద్యార్థులు" అని లేనిచోట వత్తు ఇచ్చి రాశారు.

మూడేళ్ళ నుంచీ ఇంకా మూడోక్లాసులోనే మిటకరిస్తున్నాడు. "*అన్నం చొరవే కాని, అక్షర చొరవలేదు.*"

5. సాంకేతికనామమో, వాణిజ్యనామమో వాడుతున్నప్పుడు

సినిమాతారలు తమకు "లక్స్" ఇష్టమని ప్రకటనల్లో చెబుతారు.

6. మనం రచనలు చేసేటప్పుడు, ఇతరుల వ్యాసాల్లోంచీ గ్రంథాల్లోంచీ కొన్ని వాక్యాలనో, పేరాలనో వాడుకుంటున్నప్పుడు, విధిగా మొదట్లో, చివరలో ఈ గుర్తులివ్వడం మర్యాద.

7. జంట ఉల్లేఖన చిహ్నాలు వాడుతూ, మధ్యలో ఒంటి ఉల్లేఖన చిహ్నాలు వాడతారు. ఇది ఉల్లేఖనలో ఉల్లేఖన.

"*మీరు 'మేము తొమ్మిదిన్నరకే వస్తాము' అన్నారు. మరి రాలేదు*" అని మా ఉపాధ్యాయులు అడిగారు.

## ( ) కుండలీకరణం

1. వాక్యంలో ఏదైనా మాటకు వివరణ కావలసినపుడూ, ఆ వివరణ వాక్య నిర్మాణంలో ఇమడనప్పుడు, ఆ వివరణకు ముందూ, చివరా

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ ప్రచురించిన "వెర్సెస్ ఆఫ్ వేమన" (బ్రౌన్ ఇంగ్లీషు అనువాదంతో) గ్రంథం ఆ మధ్య వచ్చింది.

కాంతికంటే వేగంతో (సెకండుకు ఒక లక్ష ఎనభై ఆరువేల మైళ్ళు) ఏదీ ప్రయాణం చేయలేదని ఐన్‌స్టైన్ విశ్వసించాడు.

2. వాక్యంలో ఇతర భాషా పదాన్ని తెలుగు లిపిలో రాస్తున్నప్పుడు కుండలీకరణంలో ఆ ఇతర భాష ఉంటుంది. అట్లాగే పరిభాష ఉపయోగిస్తున్నప్పుడు దాని ఇంగ్లీషు మాట -

బౌడ్రిల్ (Bowdril), హోమోనిడ్స్ (Homonids), రేఖాగణితం (geometry), ప్రాక్చరిత్ర (Prehistory), ఉద్దేశపూరితవృత్తి (Teleological).

3. డబ్బు మొత్తాన్ని అక్షరాల్లో రాసినప్పుడు, కుండలీకరణంలో అంకెల్లో ఇస్తారు. అట్లాగే అంకెలు ముందు రాసినప్పుడు కుండలీకరణాల్లో అక్షరాలు రాస్తారు. ప్రామిసరీ నోట్లలో ఈ పద్ధతి కనిపిస్తుంది.

నాలుగు వందలు (రూ. 400)

రూ. 400 (అక్షరాలలో నాలుగు వందలు)

## ... మూడు చుక్కలు

ఇది మూడు చుక్కల గుర్తు. సి. పి. బ్రౌన్ రాసిన ఇంగ్లీషు తెలుగు నిఘంటువులో ఈ మాటకు "శబ్దలోపము, వాక్యలోపము అనగా అధ్యాహారము చేసికొనవలసినది, ఆ మాటను ఇక్కడ తెచ్చుకొనవలసినది" అనే అర్థం కనిపిస్తుంది. మాటలోపించినచోట్ల వాక్యం మొదట్లోగానీ, మధ్యలోగానీ అయితే మూడు చుక్కలు వాడుతారు. వాక్యం చివరలో బిందువుతోసహా నాలుగుచుక్కలు వాడుతారు. సంభాషణల్లో సమాధానం

రాసేటప్పుడు, కొన్ని క్షణాలు మౌనంగా ఉన్నప్పుడు, ఆ స్థితిని సూచించేందుకు ఈ గుర్తులు వాడుతారు. వీటిని అమితంగా ఉపయోగించడం మంచిదికాదు.

1. మాట లోపించిన చోట్ల
   కార్మిక, కర్షక, విద్యార్థి, మహిళా... ఇంకా అనేకమంది ప్రజల క్షేమంకోసం.
2. సంభాషణలలో సమాధానం రాసప్పుడు
   "నిన్న క్లాస్ ఎగగొట్టి సినిమాకు వెళ్ళావు కదూ?
   ...
   "పోనీ, పాఠాలు చదివావా?"
   "చదివానండీ, కానీ..."
3. కొన్ని క్షణాలు మౌనం సూచించడానికి
   ''ఉద్యోగం కోసం తన్నతిప్పలు పడుతున్నాను"
   "...నేనూ అంతే."
4. బుద్ధి పూర్వకంగా కొన్ని మాటలను వదిలి వేసినప్పుడు (ముఖ్యంగా రచనలో అనరానిమాటలు, తిట్లు వచ్చినప్పుడు)
   "దొంగలం..."అని రామయ్య భార్యను తిట్టాడు.

**ముఖ్య విషయ క్రోడీకరణ**

BRAOU

1. విరామచిహ్నాలు మాట్లాడే భాషలో ఉండవు; రాసే భాషలోనూ, అచ్చులోనూ ఉంటాయి.
2. రాతలోనూ, అచ్చులోనూ విరామాలను సూచించడానికి రెండు మార్గాలున్నాయి. అవి: 1. పదాల చివర కొంత ఖాళీ స్థలాన్ని వదలడం. 2. పదాల చివరా, వాక్యాల చివరా గుర్తులు వాడడం.
3. విరామాలు లేకపోతే చదవడం, గ్రహించడం శ్రమ. చదివేటప్పుడు పదస్వరూపం, పదాలమధ్య వ్యాకరణ సంబంధాలూ, అర్థ సంబంధాలూ స్పష్టంగా గ్రహించడానికి విరామాలు పాటించడం అవసరం.
4. విరామ చిహ్నాలవల్ల వాక్యాల్లోని వివిధ భాగాల మధ్య ఉండే భాషా సంబంధాలు త్వరత్వరగా గ్రహించవచ్చు.
5. విరామ చిహ్నాలు వాడడంలో నైపుణ్యం సంపాదించడం రచనా శైలికి మేలు.
6 విరామ చిహ్నాల్లో ఇరవైనాలుగు రకాలు ఇచ్చినా, ఈ పాఠంలో పరిచయం చేసినవి పది మాత్రమే. అవి: 1. బిందువు 2. కామా 3. సెమికోలన్ 4. పొట్టిగీత 5. పొడుగు గీత 6. ప్రశ్న చిహ్నం 7. రాగచిహ్నం 8. జంట ఉల్లేఖనచిహ్నం 9. కుండలీకరణం 10. చుక్కల వరుస.

## అభ్యాసాలూ, ప్రశ్నలూ

1. ఇంత వరకు చదివే పని కింద ఇచ్చిన అభ్యాసాల్లో నుంచి, ఈ పాఠంలో చెప్పిన పది విరామ చిహ్నాలకు ఒక్కొక్కదానికి రెండు ఉదాహరణ వాక్యాలు పాఠాలు చూసి రాయండి.
2. చదివే పని కింద ఇచ్చిన అభ్యాసాల్లో, ఆయా రచయితలు వాడిన కామాలు, ప్రశ్నార్థక చిహ్నాలు, ఆశ్చర్యార్థక చిహ్నాలు, జంట ఉల్లేఖన చిహ్నాలు, కుండలీకరణ చిహ్నాలపై మీ వ్యాఖ్యలు రాయండి.

3. ఈ పాఠంలో నేర్చిన పది విరామ చిహ్నాలను వాడుతూ, ఒక కథో, వ్యాసమో ఇరవై అయిదు పంక్తుల్లో రాయండి.

4. ఈ కింది వ్యాక్యాలను విరామాలతో రాయండి.

   1. తెలుగుసినిమాలువాస్తవజీవితంలోయెక్కడాలేనిఅద్భుతప్రణయాలనుఅభూతసాహసకృత్యాలనూచిత్రిస్తాయిఅధమతరగతిసెక్సుమీదాబఫూనరీమీదాప్రధానంగాఆధారపడతాయి.

   2. ఉత్తమసాహిత్యంలౌకికజీవితానికివెలిగావిడిగామడిగట్టుకున్నప్రత్యేకప్రపంచమేమీకాదుఆదిసమాజజీవితంలోఒకభాగం.

5. దిగువ ఒక ప్రసిద్ధ విమర్శకుని సమీక్షలో నుంచి కొన్ని వాక్యాలను విరామ చిహ్నాలు లేకుండ ఇస్తున్నాము. అవసరమైనచోట తగిన విరామ చిహ్నాలను వాడుతూ తిరగ రాయండి.

   యీ కొత్త నవల స్వయంవరణంలోనూ తిరుగుబాటే యితివృత్తం కానీ రంగం పరిమితం యిందుతో తిరుగుబాటును ప్రబోధిస్తున్నది యువతీ యువకులకు అనగా వివాహం చేసుకోదలచిన వాళ్ళకు వివాహం ద్వారా సుఖపడదలచిన వాళ్ళకు వివాహం తమ సుఖం కొరకు కాదనుకునే వాళ్ళుంటే అది పరలోకం కొరకో పితృదేవతల కొరకో అనుకునే వాళ్ళుంటే వాళ్ళకీ తిరుగుబాటు అక్కర లేదు. భార్యాభర్తృ సంబంధమంటే భరించడమూ భారం కావడమూ కాదనీస్వామిభృత్య సంబంధం కాదనీ కేవలం పడకగదికీ ప్రసూతి ఆస్పత్రికీ పరిమితంకాదనీ అదొక మైత్రి అనీ హృదయబంధమని మధురమైన సాహచర్యమనీ పూర్ణ మానవ జీవితమనే స్వర్గానికి నిచ్చెన అనీ యెంచే వాళ్ళకు యెంచగల సంస్కారం వున్నవాళ్ళకుమాత్రమే యీ తిరుగుబాటు ప్రబోధించబడింది తిరుగుబాటు యెవరి మీద యువతియువకుల వివాహ నిర్ణయాలలో తమ పెత్తనం సాగాలని కోరే తల్లిదండ్రుల మీద కులమనీ మతమనీ ధనమనీ హోదా అనీ సంప్రదాయమనీ ఆచారమనీ తమ పిల్లల ప్రేమ వివాహాలకు ఆటంకాలు కల్పించి అడ్డుపడే తల్లిదండ్రుల మీద.

BRAOU

## ఖండిక 10 పాఠం 16

# వ్యాసరచన పద్ధతి

### ఉద్దేశం

కాంపోజిషన్‌కూ, ప్రత్యేకరచనాపద్ధతి గల వ్యాసానికీ తేడా తెల్పడం. వ్యాసంలోని భాగాలను పరిచయం చేయడం.

### ప్రణాళిక

1. వ్యాసం, వ్యాసరచన పదాల వివరణ
2. వ్యాసంలోని భాగాలు
3. రచనా ప్రక్రియగా వ్యాసం
4. ముఖ్యవిషయ క్రోడీకరణ
5. అభ్యాసాలూ, ప్రశ్నలూ

## వ్యాసం, వ్యాసరచన

BRAOU

ఇంగ్లీషులో ఎస్సె [Essay] అన్న దానికి పర్యాయంగా తెలుగులో వ్యాసం అని వాడుతున్నాం. వ్యాస రచన, వ్యాసం అన్న పదాలను పాఠశాల, కళాశాల విద్యార్థులకు ఉద్దేశించబడ్డ కాంపోజిషన్‌కు పరిమితంగానూ, రచనా ప్రక్రియ [ప్రత్యేక రచనా విధానం]గానూ వాడుతున్నారు. ఈ రెండింటి నిర్మాణంలో తేడాలు ఎక్కువగా ఉన్నట్లు గమనించవచ్చు. 'వ్యాసం' అనే పదం మొదట తెలుగులో విద్యాలయాల్లో విద్యార్థులు విషయం విభజించుకోవటం నేర్పే ఉద్దేశంతో ప్రయోగించబడింది. తర్వాత రచనా ప్రక్రియకు 'వ్యాసం' అన్న పేరువచ్చింది. ఆ పైన సారస్వత శాఖగా పరిణమించింది.

వ్యాసం అంటే భావాలను వివరించి చెప్పటం అని అర్థం. రచయిత ఏదో ఒక విషయం గురించిన తన ఆలోచనలను క్రమబద్ధంగా కార్యకారణ సంబంధం ఉండేట్టు అమరుస్తారు. ఇది రచనకు పునాదీ, తగిన చట్రమూ అవుతుంది. పేరా విభజన పద్ధతి కూడా వ్యాసరచనలో ముఖ్యం. పేరా అంటే ఒక సంపూర్ణ భావాన్ని ప్రతిపాదించే వాక్య సముదాయం. పేరాల మధ్య తర్కబద్ధత ఉంటుంది.

వ్యాసంలో మూడు భాగాలు ఉంటాయి. అవి ప్రారంభం, విషయ వివరణం, ముగింపు అనేవి. విషయ వివరణం విస్తృతంగానూ, తక్కిన రెండు భాగాలు సంగ్రహంగా ఉంటాయి.

### ప్రారంభం

ప్రారంభం తక్కువగా ఉండాలని చెప్పుకున్నాం. ఒక వాక్యంగా గానీ, ఒకటి రెండు పేరాలుగా గానీ ఉండవచ్చు. ఈ ప్రారంభం శీర్షికకు నిర్వచనంగా గానీ, వివరణగా గానీ ఉండవచ్చు. వ్యాసం చదవటం ప్రారంభించగానే, పాఠకులను ఏకబిగిన చదివించేటట్టు చేయాలి.

### ప్రారంభ పద్ధతులు

వ్యాస ప్రారంభాలు పెక్కు విధాలుగా ఉంటాయి.

1. కొందరు ఒక కథతో గానీ లేదా, జరిగిన ఒక విషయంతో గానీ తమ వ్యాసాలు ప్రారంభిస్తారు:

**ఉదాహరణకు :**

నార్ల వెంకటేశ్వరరావు గారు "శుద్రవిన్యాసాలు" (మాటామంతీ - వ్యాస సంపుటి) అనే వ్యాసాన్ని ఈ విధంగా ప్రారంభిస్తారు :

"దండు నడిపిస్తున్న మాసిడోనియన్ దండనాయకుడు ఫిలిప్‌కు మార్గమధ్య ప్రదేశ మొకటి మజిలీ చెయ్యడానికి మహా ప్రశస్తమైందిగా కనబడిందట. వెంటనే అతడు "*నిలుడహో*" అన్నాడట. ఈ మాట కాక పోతే, తమ గ్రీక్ భాషలో "*ఖడేరావ్*" అన్నప్పటికీ సైన్యాలన్నీ "*హాల్ట్*" కావలసిందే. అయినా, ఫిలిప్ ఉత్తరువు ప్రకారం అక్కడ మజిలీ చెయ్యడం జరగనే లేదు. కారణం: సైన్యాలకు కావలసిన సంభారాన్ని మోసుకువస్తున్న గాడిదలకు అక్కడ మేత లేకపోవడం. అంతట ఫిలిప్ "*గాడిదల సౌకర్యం ప్రకారం బ్రతకవలసిన బ్రతుకు, ఇదేమి బ్రతుకయ్యా! వెధవ బ్రతుకు!!*" అని విసుక్కున్నాడట."

2. మరికొందరు ఉల్లేఖన వాక్యంతోగానీ, సూక్తితోగానీ ప్రారంభిస్తారు:

**ఉదాహరణకు :**

నార్లవారే '*పరధ్యాన*' (మాటామంతీ) అనే వ్యాసాన్ని "*ఏమ్మాత్రైనను పుట్టును రిమ్మతెగులు*" అనే సూక్తితో ప్రారంభించారు.

3. ఒక చర్చనీయాంశంతో వ్యాసాన్ని ప్రారంభించేవారూ ఉన్నారు:

**ఉదాహరణకు :**

శ్రీ పుచ్చా పూర్ణానందం "వార్ధక్యానికి స్వాగతం" (వాణి, మార్చి 1981) అనే వ్యాసం ఇలా ప్రారంభిస్తారు:

"వృద్ధుడు అనగా ఎవరు? మాజీ యువకుడు. కాగి చల్లారిన పాలు. జీవితంలో ఢక్కామొక్కీలు తిన్నవాడు. లోకం పోకడ చూచినవాడు. అనేక యుద్ధముల్లో ఆరియు తేరిన వృద్ధమూర్తి. సరసుడు, రసికుడు, అనుభవశాలి."

4. కొందరు సూటిగా వ్యాసం ప్రారంభిస్తారు:

**ఉదాహరణకు :**

వాకాటి పాండురంగారావ్‌గారు "*శారద! సుశీల*" [ఆంధ్రజ్యోతి వారపత్రిక 27 మార్చి 70] అనే వ్యాసాన్ని ఇలా ప్రారంభించారు:

"శ్రీమతి శారద తెలుగు చలనచిత్ర నటీమణి. తమ మధ్య వున్న ప్రతిభావంతులను గుర్తించి గౌరవించే గుణం తెలుగువారికి తక్కువయినందున శారద ఇతర భాషా చిత్రాలలో ముఖ్యంగా మలయాళ చిత్రాలలో నటించడం ప్రారంభించింది. ఒకానొక మలయాళ చిత్రంలోని ఆమె అపూర్వ నటనా కౌశలానికి మెచ్చి భారత ప్రభుత్వం వారు శ్రీమతి శారదను 1969 సంవత్సరంలో భారతదేశంలో కెల్లా అత్యుత్తమ నటిగా ఎన్నుకుని ఆమెకు "ఊర్వశి" పతకాన్ని బహూకరించారు. దక్షిణాదిని ఈ పురస్కారం పొందిన మొట్టమొదటి నటి శారద. దేశంలో ఈ గౌరవాన్ని పొందిన రెండవ నటీమణి శారద."

ఇలా అనేక పద్ధతుల్లో వ్యాసాలు ప్రారంభిస్తారు. మచ్చుకు మాత్రమే కొన్ని పద్ధతులు పేర్కొనటం జరిగింది.

**విషయ వివరణం**

దీన్నే వ్యాస శరీరం అని కూడా అంటారు. తగినరీతి అంగపరిమాణంతో వ్యాసశరీరం ఉంటేనే వ్యాసం మనోరంజకంగా ఉంటుంది. ఇదే వ్యాసంలోని పెద్ద భాగం. ఈ భాగంలో ముఖ్య విషయ విస్తరణం ఉంటుంది,

BRAOU

ఇందులో రచయిత విషయాంతర్గతాలైన వివిధ భావాలను వేరు వేరు పేరాలలో తీర్చిదిద్దుతాడు. వ్యాస శరీరం ఒక్కొక్క వ్యాసం, ఒక్కొక్క వస్తువు కారణంగా సామాన్య లక్షణబద్ధం కాకుండా భిన్నంగా ఉంటుంది.

**ముగింపు**

వ్యాసాన్ని పూర్తి చేయటాన్ని ముగింపు అంటారు.

**ముగింపు పద్ధతులు**

ప్రారంభంలాగే ముగింపుకూడా పెక్కు విధాలుగా ఉంటాయి.

1. వ్యాసం ముఖ్యాంశం సూచించే మాటలతో కొందరు వ్యాసం ముగిస్తారు.

**ఉదాహరణకు :**

అమరేంద్రగారు ''అనువాద సాహిత్యం'' [తెలుగు రచయితల మహాసభలు: కొన్ని ప్రసంగాలు, 1971] అనే వ్యాసం ఈ విధంగా ముగిస్తారు:

"ఏమైనప్పటికీ మూలం మల్లెపువ్వు; అనువాదం అత్తరు. సువాసన వుండవచ్చు కాని పుష్పానికున్న మెత్తదనం, అందం ఎక్కడినుంచి వస్తాయి? ఆచార్య పింగళి లక్ష్మీకాంతం గారు అన్నట్లు అనువాదం అనేది ఒక ఉజ్వల వజ్రాన్ని ఫొటో తీయటం వంటిది. సూచన మాత్రంగా వజ్రపు రూపం స్ఫురిస్తుంది కాని దాని నిగనిగలూ ధగధగలూ కళ్ళారా చూడవలసిందే కాని బొమ్మలో కనిపించవు. అసలు చూడకపోవటం కంటే బొమ్మనైనా చూసి సంతోషపడటం మంచిదికదా?"

2. కొందరు వ్యాస విషయానికి సంబంధించిన ఒక కొత్త భావం సూచిస్తూ వ్యాసం ముగిస్తారు.

BRAOU

**ఉదాహరణకు :**

కుందుర్తి ఆంజనేయులుగారు "సాహిత్యంలో మారిన విలువలు-కవిత' ['రచన'' వ్యాస సంకలనం యువభారతి వారి ప్రచురణ] అనే వ్యాసం ఇలా ముగిస్తారు:

"ఏ విలువలైనా దేశకాల పరిస్థితులను అనుసరించుకునే వుంటాయి, కాని వాటికి అతీతంగా వుండలేవు. ప్రపంచ పరిస్థితులలో నేడు సోషలిస్టుయుగం నడుస్తున్నది. కనుక ఆ ఆర్థిక, సామాజిక వ్యవస్థకు అనుగుణంగా మన ఆలోచనా రీతిలో విశ్వాసాలలో మార్పులు వచ్చాయి. మరి మానవుడు యింతకంటే మేలైన ఆర్థిక, సామాజిక వ్యవస్థను ఏర్పాటుచేసుకుంటే ఏమవుతుంది? ఇప్పటి విలువలూ, విశ్వాసాలూ పాతబడిపోయి కొత్తవి ఏర్పడతాయి."

3. కొందరు వ్యాసవిషయానికి సంబంధించిన ఒక కొత్తభావం సూచిస్తూ వ్యాసం ముగిస్తారు.

**ఉదాహరణకు :**

డాక్టర్ సి. నారాయణరెడ్డి ''భవిష్యత్తులో కవిత'' (వ్యాసవాహిని, 1965 ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్, సికింద్రాబాదు వారి ప్రచురణ) అనే వ్యాసం ఈ విధంగా ముగిస్తారు:

"కవిత్వం ఏ కొందరికో కాక సమస్తజనులకు అత్యవసరమైన వస్తువుగా కావచ్చు - అని సాహసించను గాని- కావాలి. నేను సదా మననం చేసే Rupert Brooke వాక్యాలతో ఈ వ్యాసం ముగిస్తాను.

"There are only three things in the World. One is to read poetry; another is to write poetry; and the best of all is to love Poetry."

4. వ్యాసం ముఖ్యాంశాన్ని పురస్కరించుకుని హెచ్చరికతో కొందరు వ్యాసాన్ని ఉపసంహరిస్తారు.

**ఉదాహరణకు :**

కొడవటిగంటి కుటుంబరావుగారు "రచనలలో సామాజిక స్వరూపం" ('రచన' వ్యాస సంకలనం, యువభారతి ప్రచురణ) అనే వ్యాసాన్ని ఈ విధంగా ముగిస్తారు:

"నాకో జాలి లేదనుకోకండి. నేనూ జాలిపడుతున్నాను - కాలదోషం పట్టిన వర్గాలను గురించి. పాపం వాళ్ళు తమ రాజకీయపుపెత్తులూ, తమకు అండగా ఇంతకాలమూ ఉన్న శాసనాలూ, విచ్చలవిడిగా తామ సాగించే జులుమూ, సమష్టి సమాజం పట్ల వాళ్ళకు గల అలుసూ - ఇవన్నీ శాశ్వతమనుకుంటున్నారు. ఇవి శాశ్వతం అనిపించడానికి కారణం ఏదన్నా ఉంటే అది అవసాన దశే! ఆరిపోయే దీపం మహా వెలుగుతుంది. ఇంత విషం పుచ్చుకునేముందు హిట్లరు విజయగర్వంతో డాన్సుచేశాడు. ఈనాటి మన సాంఘిక వ్యవస్థలకు చావు తెలివి పుట్టుకొస్తున్నది"

5. కొందరు దృష్టాంతకథతోబాటు చమత్కారమైన ప్రశ్నతో వ్యాసాన్ని ముగిస్తారు.

**ఉదాహరణకు :**

నార్లవారు 'మామిడిపండు' (మాటామంతీ, వ్యాస సంపుటి, 1051) అనే వ్యాసాన్ని ఇలా ముగిస్తారు:

"అది చిన్న రసమైనా, మరొక మామిడి పండైనా దాని రుచితెలిసేది తిన్నవారికే. తిననివారికి ఎంత చెప్పినా దాని మజా తెలియదు. ఎలాగైనా తెలియజెప్పాలని ఏదైనా ఉపాయం ఆలోచించినా ఫలితం అంతంత మాత్రమే. వెనకటికి పర్షియా నుంచి మనదేశం వచ్చిన ఒక పెద్దమనిషి స్వదేశానికి తిరిగివెళ్ళి తమ షా దర్బార్‌లో మామిడి పండును మహా మెచ్చుకున్నాడుట. ఆ పొగడ్తను విని విని "సరే కాని, ఆ పండు రుచి *మాకు ప్రదర్శించి చూపించగలవటయ్యా!*" అని షా అడిగాడట. వెంటనే ఏమీ తోచక "*రేపటి వరకు ప్రభువులవారు గడువివ్వండి*" అని భారత యాత్రికుడు మనవిచేసుకున్నాడట. నాటి రాత్రి అతడు దీర్ఘా లోచనలో మునిగి చిట్టచివరికి ఒక ఉపాయం కనిపెట్టాడట. మర్నాడు దర్బారుకు వెళ్ళి "*ప్రభూ ఇప్పటికీ దేవరవారికి మామిడిపండు రుచిని ప్రదర్శించి చూపలేను. కాని, వజీర్లలో ఎవరికైనా చూపవలసిందిగా సెలవైతే ఈ గులాం తయ్యార్‌గా వున్నాడు*" అని వినతి చేసుకున్నాడట. "*షేష్! కానివ్వు*" అని ప్రభువు సెలవయ్యేసరికి చింతపండు, పంచదార తెప్పించి, ఆ రెండింటిని పల్చగా కలిపి, ఒక వజీర్‌గడ్డానికి పట్టించి, మరొక వజీర్‌ను ఆ గడ్డాన్ని చీకమన్నాడుట. ఈ దృశ్యానికి విరగబడి నవ్వుతూ, "*ఎలా వున్నది మామిడి పండు?*" అని షా తన రెండవ వజీర్‌ను ప్రశ్నించగా అతడు తియ్య తియ్యగా, పుల్ల పుల్లగా, పీచు పీచుగా వున్నది స్వామీ! అని జవాబిచ్చాడట. "*అదే, దేవరా! అచ్చంగా అదే మామిడిపండు రుచి*" అని భారత యాత్రికుడు తన ప్రదర్శన విజయానికి పొంగిపోతూ అన్నాడట. కాని, మనం అదే మామిడిపండు రుచి అంటే ఒప్పుకుంటామా ?"

6. కొందరు వ్యాసం సారాంశాన్ని ముగింపులో సూచిస్తారు. విజ్ఞాన ప్రధాన వ్యాసాల్లో ఈ రకం ముగింపు ఉంటుంది.

**ఉదాహరణ :**

డా॥ పోరంకి దక్షిణామూర్తి "*తెలుగు రచన ; మాండలికాలు*" (The All-India Telugu Writer's Conference, 1981, Souvenir) అనే వ్యాసం ఇలా ముగిస్తారు.

"పై చర్చ సారాంశం ఏమిటంటే, ఈనాటి తెలుగు రచనల్లో సార్వత్రికంగా కనిపించేది ఆధునిక ప్రమాణ భాష. కొన్ని ప్రత్యేక ప్రయోజనాల దృష్ట్యా ప్రయోగంలోకి వస్తున్న మాండలిక రూపాలు దానికి తోడై సమగ్ర భాషా స్వరూపానికి అద్దం పడుతున్నాయి."

ఈ విధంగా అనేక పద్ధతుల్లో రచయితలు వ్యాసాలు ముగిస్తారు. ముఖ్యమైన కొన్ని పద్ధతులు పేర్కొనటం జరిగింది.

BRAOU

వ్యాసాన్ని రచనా దృష్టితో విభజించే ప్రయత్నం చాలా ప్రాథమిక మైంది. అలాంటి విభజన స్థూలంగా ఉచితమైనట్లు కనిపించినా, సమగ్రమైంది కాదు. ఏ రచనకైనా ఆద్యంతాల మధ్య విషయ విస్తరణ సహజంగా ఉంటుంది. అలాంటప్పుడు వ్యాసానికి మాత్రమే అవి లక్షణాలని చెప్పడంలో సబబులేదు.

## రచనా ప్రక్రియగా వ్యాసం

వ్యాసం రచనా ప్రక్రియగా రూపొందిన తర్వాత, వర్తమానాంధ్ర వచన ప్రక్రియల్లో అధిక వ్యాప్తి పొందింది. ఆంగ్ల వాఙ్మయ ప్రభావం వల్ల తెలుగులో పుట్టిన అనేక నూత్న ప్రక్రియల్లో ఒకటైన వ్యాసం లక్షణాలు విస్పష్టంగా విడగొట్టి చెప్పడం కష్టం. అయితే స్థూలంగా వ్యాస లక్షణాలు చెప్పవచ్చు.

### వ్యాస లక్షణాలు

వ్యాసం పరిమితమైన వచన విన్యాసం. కావ్యంలాగా కాకుండా, వ్యాసం సంగ్రహంగా ఉండి సూక్ష్మంలో మోక్షం చూపుతుంది. ఒక వ్యాసం పెద్ద పుస్తకంగా ఉండదు. అయితే వ్యాస సంపుటి ఒక పెద్ద పుస్తకంగా ఉండవచ్చు. వ్యాసం కొద్ది సమయంలో చదివి ముగించటానికి తగిందిగా ఉంటుంది. వ్యాసంలో పాఠకుడూ, వ్యాస రచయిత-ఇద్దరూ తమకు తెలిసిన సంగతులు ముచ్చటించుకుంటున్నట్లు ఉంటుంది. వ్యాసంలో హాస్యం ఉండటం ఆరోగ్యదాయకం. వ్యాసంలో విషయం సంపూర్ణంగా ఉండక్కర్లేదు. అయితే అప్పటికి అవసరమైన భాగంలో సమగ్రత ఉండాలి. బహు పరిశ్రమ ఫలితంగా విషయం వివరిస్తే అది పరిశోధనమో, శాస్త్రరచనమో అవుతుంది. రచయితకు ఒక ప్రత్యేకమైన శైలి ఉన్నప్పుడు వ్యాసాల్లో అతని ముద్ర కనిపిస్తుంది.

ఈ లక్షణాలన్నీ ప్రతి వ్యాసంలోనూ ఉండాలన్న నిర్బంధం ఏమీలేదు. ఏ కొన్నయినా ఉండవచ్చు. కొన్ని లేకపోవచ్చు.

BRAOU

### వ్యాస పరిణామం

కాలంతో పాటు వ్యాసం అనేక విధాలుగా మార్పుచెందుతూ వచ్చింది. వైజ్ఞానిక వ్యాసాలు, తాత్విక వ్యాసాలు, సమీక్షా వ్యాసాలు, పత్రికా వ్యాసాలు, చారిత్రక వ్యాసాలు లాంటివి వెలుగుచూశాయి. విస్తృతంగా పరిణమించి అత్యాధునిక రచనా సాధనమై, వర్తమాన భావవాహిగా రూపొందింది వ్యాసం. ఏ విషయం వివరించటానికైనా సమర్థమైంది. ఇతర రచనా విధానాల్లో ఇమడని ఏ విషయమైనా రాయటానికి అనుగుణంగా రూపొందింది. ప్రపంచం మీద ఉన్న సర్వ విషయాలు వ్యాస విషయం కావచ్చు. అందే సర్వాలోచనల వాహికగా వ్యాసం పరిణమించింది. తెలుగు వచనం వ్యాస ప్రక్రియవల్ల వ్యక్తీకరణ సామర్థ్యం పెంచుకుంది.

తెలుగులో వ్యాసం రచనా ప్రక్రియగా నామరూపాలతో ఈ శతాబ్ది మొదటి దశకం నుంచి స్థిరపడింది. అంతకు పూర్వం సామినేని, ముద్దు నరసింహ నాయుడు, పరవస్తు వేంకటరంగాచార్యులు, వియ్యూరుసూరి, కందుకూరి వీరేశలింగం మొదలైనవాళ్ళు ప్రమేయాలు, సంగ్రహాలు, వచన కావ్యాలు, ఉపన్యాసాలు మొదలైన పేర్లతో వ్యాసతుల్య రచనలు చేశారు. అయితే గురజాడ అప్పారావు గారు తన రచనలను వ్యాసాలన్నారు. గురజాడ నుంచే తెలుగులో వ్యాసం రచనా ప్రక్రియ (రీతి)గా స్థిరపడింది.

ఈ పాఠంలో నేర్చుకున్న ముఖ్య విషయాలు:

1. రచయిత ఒక విషయం గురించి తన ఆలోచనలను వివరించి చెప్పే సాధనం వ్యాసం.
2. వ్యాసంలో పేరాల మధ్య తర్క బద్ధత ఉంటుంది. ఒక సంపూర్ణ భావాన్ని ప్రతిపాదించే వాక్య సముదాయం పేరా.
3. వ్యాస ప్రారంభ పద్ధతులు అనేకం ఉన్నాయి.
4. వ్యాసం ముగింపు పద్ధతులు కూడా అంతే.

5. వ్యాసంలో విషయ వివరణ భాగం పెద్దది. ఈ భాగంలో ముఖ్యవిషయ విస్తరణం ఉంటుంది.
6. రచనా ప్రక్రియగా వ్యాసంలో సంగ్రహంగా ఉండటం, రచయిత-పాఠక మిత్రత్వం, హాస్యత మొదలైన లక్షణాలు ఉంటాయి.

## అభ్యాసం (రాసేపని)

1. *"సంధి ; మాటల కలయిక"* (ఖండిక 1, పాఠం 2) పాఠంలో చదివే పదికోసం ఇచ్చిన అభ్యాసంలో *"హోమ్ స్వీట్ హోమ్"* అనే వ్యాసం ఉంది. అట్లాగే *"నిఘంటువును వాడు కోవటం ఎట్లా"* (ఖండిక 2, పాఠం 4) పాఠంలో *"రాజ్య లక్ష్మమ్మ గారు, "వీరేశలింగం"* అనే వ్యాసాలు ఉన్నాయి. ఆ మూడు వ్యాసాలు ఆధారంగా చేసుకుని వ్యాస ప్రారంభ పద్ధతులు వివరించండి. అట్లాగే వ్యాసం ముగించే పద్ధతులు గూడా ఆ వ్యాసాలు ఆధారంగా వివరించండి. ఈ పాఠంలో ఇచ్చిన ప్రారంభ పద్ధతులూ, ముగింపు పద్ధతులు కాక కొత్త విధానాలు ఉంటే వాటిని పేర్కొనండి.

2. వ్యాసానికి సంబంధించిన సామాన్య లక్షణాలను కొన్నిటిని వివరించండి.
3. వ్యాకరణ శాస్త్రం, అలంకార శాస్త్రం మొదలైన వాటికి సంబంధించిన గ్రంథాలు ఎందుకు వ్యాసాలుగా పరిగణించ కూడదో వివరించండి.
4. సమగ్రమైన వచన గ్రంథం వ్యాసం ఎందుకు కాదో వివరించండి.

BRAOU

ఖండిక **10** పాఠం **17**

# వ్యాసరచనలో భేదాలు

**ఉద్దేశం**

వివిధ వ్యాస రీతులను స్థూలంగా పరిచయం చేయడం. విషయ ప్రధాన, వినోద ప్రధాన, సామయిక వ్యాసాల లక్షణాలను విద్యార్థులకు వివరించడం.

**ప్రణాళిక**

1. విషయ ప్రధాన వ్యాసాలు
2. వినోద ప్రధాన వ్యాసాలు
3. సామయిక వ్యాసాలు
4. ముఖ్యవిషయ క్రోడీకరణ
5. అభ్యాసాలూ, ప్రశ్నలూ

విషయాన్ని బట్టి, అవి కలిగించే అనుభూతిని బట్టి, రాసే విధానాన్ని బట్టి, వ్యాసాలను రకరకాలుగా విభజించుకోవచ్చు. ఈ పాఠంలో ప్రధానమైన మూడు వ్యాస భేదాలను మాత్రమే మీకు పరిచయం చేస్తున్నాము. అవి : 1. విషయ ప్రధాన వ్యాసాలు 2. వినోద ప్రధాన వ్యాసాలు 3. సామయిక వ్యాసాలు.

BRAOU

## విషయ ప్రధాన వ్యాసాలు

విజ్ఞాన ప్రబోధకమైనవి విషయ ప్రధాన వ్యాసాలు. ఇవి ఆలోచన ప్రధానాలు. ఇలాంటి వ్యాసాల్లో రచయిత ఒక విషయాన్ని పూర్వాపరాలతో పరిశీలించి విషయం వివరిస్తాడు.

స్థూలంగా శాస్త్ర విషయ సంబంధమైన వ్యాసాలూ, విమర్శ వ్యాసాలు మొదలైనవన్నీ విషయ ప్రధాన వ్యాసాల పరిధిలోకి వస్తాయి.

**శాస్త్రవిషయ వ్యాసాలు**

శాస్త్ర విషయాల్లో ఇమిడి ఉన్న మూల సూత్రాలు అందరికీ తెలిసేవిధంగా చెప్పటానికి ఈరకం వ్యాసాల్లో రచయిత ప్రయత్నిస్తాడు. ఆయా విషయాల ప్రయోజనాలను గురించి వివరిస్తాడు.

శాస్త్ర దృష్టి పెరిగిన తర్వాత మానవుల ఆలోచనారీతిలో మార్పు వచ్చింది. ప్రతి విషయానికి హేతువు పరిశీలించటం ఆరంభమైంది. అయితే తెలుగులో శాస్త్ర సంబంధమైన వ్యాసాలు తక్కువ సంఖ్యలోనే వెలువడ్డాయి. ఇటీవలే శాస్త్ర విషయాలు తెలుగులో చదవటం, ఆలోచించటం ప్రారంభమైంది. భారతి, తెలుగు, ప్రసారిత మొదలైన పత్రికలు తెలుగులో విజ్ఞాన శాస్త్ర, సామాజిక శాస్త్ర సంబంధమైన వ్యాసాలు ప్రచురిస్తున్నాయి.

**విమర్శ వ్యాసాలు**

విమర్శ వ్యాసాలు కూడా చాలాభాగం విషయ ప్రధాన వ్యాసాలే. ఏదైనా విషయాన్ని సహేతుకంగా చర్చిస్తే అది విమర్శ వ్యాసం అవుతుంది. తెలుగులో వెలువడిన విమర్శ వ్యాసాలు ఎక్కువగా సాహిత్య విషయాలకు సంబంధించినవిగా ఉన్నాయి. సాహిత్యేతర విషయ సంబంధులుగా ఉన్న విమర్శ వ్యాసాలు తక్కువగా ఉన్నాయి. ఇప్పుడిప్పుడే అవి ఎక్కువగా వెలువడుతున్నాయి.

## వినోద ప్రధాన వ్యాసాలు

ఈ రకం వ్యాసాల్లో కాల్పనికతతో బాటు రచయిత వ్యక్తిత్వం అంతర్లీనంగా ఉంటుంది. దానికి తోడు కొంత వరకు హాస్యం అంతర్వాహినిగా ఉంటుంది. మొత్తం మీద ఈ వ్యాసాలు చదువరులకు వినోదం కల్గిస్తాయి.

హాస్యం, వ్యంగ్యం, విమర్శ ఉన్న వ్యాసాన్ని వినోద ప్రధాన వ్యాసంగా భావించవచ్చు. పాఠకులను మెప్పించే విషయంలో విషయ ప్రధాన వ్యాస కర్తలకన్నా, వినోద ప్రధాన వ్యాస కర్తలకే ఇబ్బందులు ఎక్కువ. విషయ ప్రధాన వ్యాసంలో చర్చించవలసిన విషయం నిర్దిష్టంగా ఉంటుంది. వినోద ప్రధాన వ్యాసంలో అలా ఉండదు. అణువులో అనంత విశ్వాన్ని దర్శించే వారు వినోద ప్రధాన వ్యాస కర్తలు. శ్రీరామ చంద్రుడు మొదలుకొని చీపురు పుల్ల వరకూ దేనిమీదనయినా చర్చించ గల చతురత వారిది.

## సామయిక వ్యాసాలు

పత్రికా వ్యాసాలు ప్రధానంగా సామయిక వ్యాసాలు. విషయ వైవిధ్యాన్ని బట్టి పత్రికలు ప్రత్యేక రంగాలకు అంకితమవుతాయి. రాజకీయం, సాంఘికం, వైజ్ఞానికం, సారస్వతం, మతం, లైంగికం, స్త్రీలు, బాలలు, హాస్యం, అపరాధ పరిశోధనం, వైద్యం, సినిమా మొదలైన రంగాలకు సంబంధించి ప్రత్యేక పత్రికలు ప్రచురితమవుతున్నాయి. వీటిని బట్టి వ్యాస సృష్టిలో వైవిధ్యానికి అవకాశం ఏర్పడుతుంది. ఆయా పత్రికల రచయితలు ఆ ప్రత్యేక విషయంకోసం రచనలు చేస్తారు. కాబట్టి ఆ విషయవిన్యస్త వ్యాసాలు వాటిలో చోటు చేసుకుంటాయి.

పత్రికలలో సంపాదకీయాలు, ప్రత్యేక శీర్షికలు, పుస్తక సమీక్షలు మొదలైనవి వ్యాసాల పరిధిలోకి వస్తాయి. వీటిలో ప్రత్యేక శీర్షికా (ఫీచర్) వ్యాసాలు వినోద వ్యాసాల పరిధిలోకి వస్తాయి. తక్కిన రెండూ సామయిక వ్యాసాలకు చెందుతాయి.

BRAOU

### సంపాదకీయ వ్యాసాలు

సంపాదకుడు ఒక ముఖ్య సంఘటనో, వార్తో, సమస్యో తీసుకుని సంపాదకీయ వ్యాసంలో వ్యాఖ్యానిస్తాడు. రాజకీయార్థిక సాంఘిక విషయాలు లాంటి వాటిలో ఏ అంశం అయినా గ్రహించి సంపాదకీయం రాస్తాడు. అందే ప్రభుత్వ పాలనా విధానం తదితర విషయాలపై సంపాదకుడు అభిప్రాయాలను పత్రికా ముఖంగా వ్యక్తం చేస్తాడు. ప్రజాభిప్రాయాన్ని సంపాదకీయం సాధారణంగా ప్రతిబింబిస్తుంది. కొందరు సంపాదకులు రాసే సంపాదకీయాలు పాఠకులతో మాట్లాడుతున్నట్లు గానే ఉంటాయి. అలాంటి సంపాదకీయాలు పాఠకులను ఆకర్షిస్తాయి. మొత్తం మీద మంచి చెడుల చర్చకు సంపాదకీయం ఒక వేదిక.

సంపాదకీయంలో ఒకరి విషయానికి సంబంధించిన పూర్వాపరాలూ, ప్రస్తుత పరిస్థితుల ప్రస్తావనలూ ఉంటాయి. సంపాదకుడు ఏది ప్రజోపయోగకరమో, ఏదికాదో, సంపాదకీయంలో సూచిస్తాడు. ఏ పత్రిక ఆశయాలు ఎలాంటివో ఆ పత్రిక సంపాదకీయాలు చదివి పాఠకులు గ్రహిస్తారు. ప్రజల అభిప్రాయాలను ప్రజలకే వాఖ్యానంచేసి సంపాదకీయం చెబుతుంది. ప్రజల భావాలను మార్చగల శక్తి సంపాదకీయానికి ఉంది. ఒక్కొక్కప్పుడు ప్రజలను తీవ్రంగా విమర్శిస్తుంది; పొగడుతుంది; బతిమాలుతుంది.

సంపాదకుడు "ఇది నాకు సమ్మతం కాదు. ఆ అభిప్రాయంతో నేనేకీభవించలేను" అనే విధంగా ఏక వచనం ఉపయోగించి సంపాదకీయాల్లో రాయడు. "మేము పూర్వం సూచించిన విధంగా" అంటూ ఉత్తమ పురుష బహువచనంలో రాస్తాడు. కానీ, ఇటీవల ఈ విధమైన ధోరణి మారింది.

నడుస్తున్న చరిత్రకే మరొక పేరు జర్నలిజం కాబట్టి సంపాదకీయాలను తాత్కాలిక సన్నివేశాలపై తక్షణ సమస్యపై రాస్తారు. అందుకే సుప్రసిద్ధ పత్రికా రచయిత నార్ల వెంకటేశ్వరరావు గారు సంపాదకీయం గురించి రాస్తూ ''అప్పుడే వండి, వార్చి, వడ్డించిన అన్నం వంటిది దినపత్రికలోని సంపాదకీయం. వంటచేతకాక, దాన్ని సరిగా యిగరనివ్వకపోయినా, తోపచేసినా, మాడ్చినా, అది గొంతు దిగదనుకోండి. కాని, నేర్పుగా

పండితే, మెతుకు మెతుకు ఒక మంచి ముత్తెంలా మిలమిల మెరుస్తుంది; ఆవిరులు కక్కుతూ నోరూరిస్తుంది. కాని, అదే మర్నాటి పొద్దుటికి చద్దివాసన కొడుతుంది" అని అంటారు [మూడు దశాబ్దాలు పీఠిక].

కాని దైనందిన సంపాదకీయాల చద్ది వాసన ప్రమాదాన్ని తప్పించుకొనగలిగిన సంపాదకీయ వ్యాసాలు కొన్ని ఉంటాయి. అవి జీవితపు విలువల దృష్టినుంచి దీర్ఘ కాలీనతను సంతరించుకుంటాయి. ముఖ్యంగా భాష సాహిత్యం, కళలు, వ్యక్తులను గురించిన సంపాదకీయాలు ఆ కోవలోకి చేరతాయి.

నేటి తెలుగు పత్రికలలో సంపాదకీయాలు రాజకీయ సాంఘికాది సమస్యలకు ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. వాటికి పరిష్కార మార్గాలు చూపుతున్నాయి. వికాసోన్ముఖంగా పరిక్రమిస్తున్న సమాజం అభిరుచులకూ, ఆవేశాలకూ, ఆకాంక్షలకూ, అభ్యుదయోద్యమాలకూ, సజీవ వాఖ్యానంగా నేటి తెలుగు పత్రికల సంపాదకీయాలు రూపొందుతున్నాయి. నేటి సమాజంలో ప్రజాభిప్రాయానికి రూపకల్పన చేయడంలో నేతృత్వం వహిస్తున్నాయి. పరిస్థితులకు ప్రతీకగా నిలిచే ఆ రచన పఠితకొక సవ్యాలోకాన్ని అందిస్తుంది. ఆలోచనను రేకెత్తిస్తుంది.

### పుస్తక సమీక్షా వ్యాసాలు

పుస్తక సమీక్షా వ్యాసాలు కొత్తగా వెలువడ్డ పుస్తకాలను, పత్రికలను పరిచయం చేస్తాయి. ఈ వ్యాసాల్లో పుస్తకంలోని విషయం, రచయిత వుద్దేశాలు- వాటిని అతనెంత వరకు నిర్వహించగలిగిందీ, రచయిత భాష, రచనా శైలి, వ్యుత్పత్తి మొదలైన అంశాలు చర్చించబడతాయి. సమీక్షకుడు గ్రంథంలోని మంచి చెడ్డలు పేర్కొంటాడు. అందే లోపాలు ఎత్తిచూపుతాడు. గుణాలను ప్రశంసిస్తాడు. పుస్తకంలోని కొన్ని భాగాలు అవసరాన్ని బట్టి ఉదాహరిస్తాడు. 'గ్రంథ స్వీకారం' శీర్షిక కింద పుస్తకం ధర, దొరికే చోటు మొదలైన అంశాలకు పరిమితమైన పరిచయం సమీక్షా వ్యాసం పరిధిలోకి రాదు. ఒక పుస్తకంపై సమీక్షకుడి అభిప్రాయ ప్రకటన సరసంగా జరిగితే అది సమీక్షా వ్యాసం అవుతుంది.

కథల సంపుటి, నవల మొదలైన వాటిని సమీక్షించేటప్పుడు కథా వస్తువు, పాత్రపోషణ, పూర్వ చరిత్ర, శైలి- ఇలాంటివన్నీ దృష్టిలో పెట్టుకుని సమీక్షకుడు ఆ గ్రంథానికి విలువకడతాడు. పూర్వ చరిత్రను ఆధారంగా తీసుకుని రాసి నవలలు, కథలు మొదలైన వాటిలో దేశకాల పరిస్థితులను రచయిత సరిగా చిత్రించాడా లేదా అన్న విషయం సమీక్షకుడు అంచనా వేస్తాడు.

BRAOU

ఈ పాఠంలో నేర్చుకొన్న ముఖ్య విషయాలు :

1. విషయ ప్రధాన వ్యాసాలను స్థూలంగా శాస్త్ర విషయ సంబంధమైన వ్యాసాలూ, విమర్శ వ్యాసాలూ అని విభజించవచ్చు. తెలుగులో విమర్శ వ్యాసాలు ఎక్కువగా సాహిత్య విషయాలకు సంబంధించి వెలువడ్డాయి.
2. హాస్యం, వ్యంగ్యం, విమర్శ ఉన్న వ్యాసాలు వినోద ప్రధాన వ్యాసాలు. వినోద ప్రధాన వ్యాస రచన కష్ట సాధ్యం.
3. పత్రికలలో వెలువడే సంపాదకీయాలు ప్రజల అభిప్రాయాలను ప్రజలకే వాఖ్యానం చేసి చెబుతాయి. సాహిత్యం, కళలు మొదలైన వాటిని గురించి రాసిన సంపాదకీయాలు దీర్ఘకాలీనతను సంతరించుకుంటాయి.
4. పుస్తక సమీక్షా వ్యాసాలలో కొత్తగా వెలువడ్డ పుస్తకంలోని విషయం; రచయిత ఉద్దేశాలు మొదలైన అంశాలు చర్చించబడతాయి.

## అభ్యాసం (చదివేపని)

కింద ఇచ్చిన సంపాదకీయ వ్యాసం చదవండి. దీన్ని నార్ల వెంకటేశ్వరరావు గారు రాశారు. నార్ల తెలుగులో సంపాదకీయ రచనకు కొత్త మలుపునిచ్చారు. వీరు సుమారు మూడు దశాబ్దాలు [1944-1974] పాటు ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి పత్రికల్లో సంపాదకీయాలు రాశారు.

సంపాదకీయ రచనల్లో నార్ల తాను చెప్పదలచుకున్న అభిప్రాయాలను ఎంతో ఉత్తేజకరంగా, భావస్ఫోరకంగా చెబుతారు. వారి సంపాదకీయాలు వివేచనా దృష్టిని కలిగించే విధంగా ఉంటాయి. నార్ల సంపాదకీయాలు చిన్న చిన్న వాక్యాలతో చిన్న చిన్న పేరాలతో పొంకంగా ఉంటాయి. తెలుగు వచనంలో, పలుకు బడిలో అరుదైన పనితనం కనిపిస్తుంది. ఏ మాత్రం చదువుకున్న వ్యక్తికైనా అర్థమయ్యే రచనా శైలి ఉంటుంది. నార్ల వారి శైలిలో పరిశోధించి చూచినా 'యొక్క' ప్రయోగం కనిపించదు. అలాగే *'చేయబడింది' 'వ్రాయబడింది'* అలాంటి ప్రయోగాలకు ఆయన వ్యతిరేకి.

(నార్ల వారి సంపాదకీయ వ్యాసాల్లో కొన్నిటిని *"మూఢ విశ్వాసాలు"* అనే పేరుతో పుస్తక రూపంలో నవోదయ పబ్లిషర్స్, విజయవాడ-2 వారు ప్రచురించారు).

## దుష్టగ్రహాలు

**నార్ల వెంకటేశ్వరరావు**

అష్టగ్రహ కూటమట, అందువల్ల ప్రపంచానికి ఘోరారిష్టాలు తప్పవట, జల ప్రళయమే రావచ్చునట, ప్రపంచాన్నే అది తుడిచి పెట్టవచ్చునట : ఇట్టి పరమ మూఢ విశ్వాసాలతో భయవిహ్వలులౌతున్న వారి ప్రపంచం నిజంగానే సర్వనాశమైపోతే, అంతకంటె వాంఛించదగు శుభపరిణామాన్ని మాపుట్టుకు మేము ఊహించలేము:

వైజ్ఞానిక శాస్త్రాలు ఎంతగా పురోగమిస్తే నేమి ? ఎన్నెన్ని సృష్టి రహస్యాలను సహ్యమానవుడు ఛేదిస్తే నేమి ? చంద్రమండలయాత్రకై సన్నాహాలు సాగుతుంటే మాత్రమేమి ? అంగారక గ్రహంలో అడుగుపెట్టడం సుసాధ్యమైన సమయం ఆసన్నమైతే మాత్రమేమి ? పాత పంచాంగాలనే ప్రామాణిక శాస్త్రాలుగా పరిగణించే వారున్నారు; మంత్రాలతో చింతకాయలు రాలగలవని విశ్వసించేవారున్నారు. వారే అష్టగ్రహశాంతులను చేయిస్తున్నారు; ముప్పొద్దుల కడుపునిండుగ కూటికైనా నోచుకోని ఈ పేదదేశంలో ఎంతో డబ్బును హోమ గుండాలలో మసి చేస్తున్నారు. ఇందువల్ల అష్టగ్రహశాంతి జరిగినా, జరగకపోయినా, ప్రజామౌఢ్యాల పరిపోషణనే వృత్తిగా చేసుకొన్న దుష్టగ్రహ శాంతి జరగడం మాత్రం ముమ్మాటికీ నిజం !

దీన్ని నిశితవిమర్శగా భావిస్తుంటే, "కాదు" అని మా మనవి. గాంధిని పోలిన మహాపురుషుడు "జ్యోతిషం ఒక శాస్త్రమైతే, అది సందేహించదగు ప్రాధాన్యంతో కూడిన శాస్త్ర" మని ఉద్ఘాటించాడు. ''అంతటి గొప్ప గ్రహాలకు మనవంటి అల్పజీవులపై విశేషమైన ఆసక్తి దేనికి ?" అని జవహర్‌లాల్ ఎగతాళితో కూడిన ఒక ప్రశ్న వేశాడు. అయినా, విద్యావేత్తగా విజ్ఞానవంతుడుగా (మన దౌర్భాగ్యంవల్ల) చెల్లుతున్న శ్రీ సంపూర్ణానంద్ అష్టగ్రహకూటం వల్ల ప్రపంచానికి ఘోరారిష్టాలు విస్తృతంగా వాటిల్లనున్నవనే వారిని బలపరచడానికి ముందుకు వస్తున్నాడు !

అయినప్పుడు మనకు వేదశాలలు దేనికి? ఖగోళశాస్త్ర పరిశోధనలు దేనికి? ఇతర వైజ్ఞానికశాస్త్ర పరిజ్ఞానం దేనికి? ఇక "సైన్సు" పుస్తకా లన్నిటిని చించి పారవేయవచ్చు; నేషనల్ లాబొరేటరీ లన్నింటికి నిప్పుపెట్ట వచ్చు; మంత్రాల మహిమతో బొందితోనే కైలాసానికి వెళ్ళవచ్చు.

ఏమైనా, రేపు ఫిబ్రవరి 5వ తేదీని (ఖగోళశాస్త్రజ్ఞులు చేస్తున్న ప్రకటనల ప్రకారం) సంపూర్ణ సూర్య గ్రహణాన్ని మించిన పెద్ద విడ్డూరం జరగబోవడం లేదు. కాని,రాహుకేతువులు రాక్షసులని, వారు సూర్యచంద్రులకు తాత్కాలికంగా కలిగించే ప్రమాదాలే గ్రహణాలని నమ్మేవారికి ఎవరేమి చెప్పినా ప్రయోజనం **శూన్యమే!**

అష్టగ్రహ కూటం దుష్టఫలితాలమాట అటుండగా, ఖగోళశాస్త్రజ్ఞులు కొందరు పేర్కొంటున్నట్టు, ఫిబ్రవరి 5వ తేదీని ఎనిమిది గ్రహాలు ఒకచోట సమావేశం కాబోవడంలేదు. ఆనాడు రెండే రెండు గ్రహాలు సూర్యచంద్రులకు కొంత చేరువగా వస్తాయి; మరి మూడు ఆ రాశిలో వుంటాయి. ఇంతేకాక, మన జ్యోతిశ్శాస్త్రం గ్రహాలుగా పేర్కొంటున్నవన్నీ గ్రహాలు కావు. ఉదాహరణకు, రవి ఒక గ్రహం కాదు; అది నక్షత్రం. భూమి, కుజుడు, అంగారకాది గ్రహాలవలె చంద్రమండలం గ్రహం కాదు. ఉపగ్రహం మాత్రమే. ఇంతటితోనైనా సరిపోలేదు. మన పంచాంగకర్తలు సృష్టించిన గ్రహాలలో కొన్ని ఎంతటి దూరదర్శిని యంత్రసాధనాలకైనా అందనట్టి ఊహాజనిత గోళాలు, కొత్త ఖగోళశాస్త్రం దారి ఒకటికాగా, పాత పంచాగం నమ్మకాల దారి మరొకటి!

BRAOU

పోనీ, పాతపంచాగాన్ని నమ్మేవారందరు ఒకేవిధమైన ఫలితాలను చెబుతున్నారాఅంటే, అదీలేదు. ఎందరు పంచాగకర్తలుంటే, ఎందరు జ్యోతి శ్శాస్త్రవేత్తలుంటే, అన్ని విభిన్నాభిప్రాయాలు వినవస్తున్నాయి. ఇదెంత హాస్యాస్పద విషయమో తెలియజెప్పడానికే—"టైమ్స్ ఆఫ్ ఇండియా" పత్రిక నిన్న తన సంపాదకీయంలో ఉదహరించినట్టు—పంచాగకర్తలు ఎనిమిది దుష్టగ్రహాలను సృష్టిస్తే, తాను పద్దెనిమిది శుభగ్రహాలను సృష్టించగలనని ఖగోళశాస్త్రంలో మహా పండితుడు, సింహళం ఖగోళ శాస్త్రజ్ఞుల సంఘానికి ప్రెసిడెంట్ ఆర్థర్ సి. క్లార్క్ అన్నాడు!

ఈ విషయాలన్నింటిని మేము వ్రాయడం ఆగ్రహంతో కాదు, ఆవేదనతో; ఆవేశంతో కాదు, అన్యదేశాల వారు మనలను చూచి నవ్వవచ్చునన్న సిగ్గుతో, బాధతో! కాశమ్మకథలనే ఇంకా మనం నమ్మితే, పుక్కిటి పురాణాలనే ఇంకా మనం శాస్త్రగ్రంథాలుగా పరిగణిస్తే, ఎప్పటికైనా మన ఇండియానుంచి ఒక "లూనిక్ గ్రహాంతర యానానికి బయల్దేరగలదా? ఎన్నటికైనా మన ఇండియాకు చెందిన ఒక గగారిన్, లేదా ఒక టిటోవ్ రోదసీ గర్భంలో భారతీయ శేముషీ పతాకను ప్రతిష్ఠాపించగలదా?

(జనవరి, **30, 1962**)

## అభ్యాసం (రాసేపని)

1. సాధారణ వ్యాస రచనకు, సంపాదకీయ వ్యాస రచనకు భాషా దృష్టిలో తేడాలను వివరించండి.
2. మీకు నచ్చిన ఏదైనా ఒక పుస్తకాన్ని పది వాక్యాల్లో సమీక్షించండి.
3. "దుష్టగ్రహాలు" సంపాదకీయంలోని కొన్ని సరళ వాక్యాలను, సంశ్లిష్ట వాక్యాలను, సంయుక్త వాక్యాలను ఏరండి.
4. "దుష్టగ్రహాలు"లో వాడిన విరామ చిహ్నాలు ఏవేవి ? వాటిని రచయిత తమ రచనలో ఎక్కడెక్కడ వాడారు ?
5. ''దుష్టగ్రహాలు'' సంపాదకీయం ద్వారా నార్ల ప్రజాభిప్రాయాన్ని ఏ రకంగా మార్చ దలచుకున్నాడు.

BRAOU

## ఖండిక 11 పాఠం 18

# పత్రికా రచన స్వరూప స్వభావాలు

**ఉద్దేశం**

ఆధునిక ప్రసార సాధనాల్లో వార్తల ప్రాముఖ్యాన్నీ, పత్రికల ప్రాచుర్యాన్నీ గుర్తింపచేయడం. వార్తల స్వరూపాన్ని తెల్పడం. పాత్రికేయ పరిభాషను పరిచయం చేయడం.

**ప్రణాళిక**

1. ఆధునిక ప్రసార సాధనాల్లో వార్తలూ, పత్రికల ప్రాముఖ్యం
2. వార్త అంటే ఏమిటి ?
3. వార్తల కూర్పు
4. వార్తల సంక్షిప్త రచన
5. వార్తల విపులీకరణ
6. పాత్రికేయ పరిభాష
7. అభ్యాసాలూ, ప్రశ్నలూ

## ఆధునిక ప్రసార సాధనాల్లో వార్తలూ, పత్రికల ప్రాముఖ్యం

*వార్తయందు జగము వర్తిలు చున్నది*
*యదియ లేని నాడ యఖిల జనులు*
*అంధకార మగ్నులగుదురు గావున*
*వార్త నిర్వహింపవలయు బతికి*

—ఆంధ్ర మహాభారతం

*పత్రి కొక్కటున్న పదివేల సైన్యము*
*పత్రి కొక్కటున్న మిత్ర కోటి*
*ప్రజకు రక్షలేదు పత్రిక లేకున్న*

—నార్ల

పత్రికలకున్న ప్రబల స్థానాన్ని వివరించడానికి పై రెండు ప్రవచనాలు చాలు. నిజానికిది పత్రికాయుగం. కాబట్టే ప్రఖ్యాత అమెరికన్ జర్నలిస్టు జేమ్స్ రెస్టెన్ ఇలా అన్నాడు :

"The nineteenth century was the era of the novelist. The twentieth is the era of the journalist."

ముద్రణ యంత్రాలూ, సాధారణ విద్యా వ్యాప్తి పత్రికల విశేష ప్రాచుర్యానికి ఎక్కువ దోహదం చేశాయి. ప్రజాభిప్రాయాన్ని దిద్ది తీర్చడంలో పత్రికల పాత్ర ముఖ్యమైంది.

"పత్రికలులేని ప్రభుత్వం కావాలా, ప్రభుత్వంలేని పత్రికలేకావాలా అని నన్ను ఎవరన్నా ప్రశ్నిస్తే ప్రభుత్వంలేని పత్రికలే కావాలని నిస్సందేహంగా చెప్తాను" అన్నాడు. పత్రికలు ప్రజాస్వామ్యంలో చాలా ప్రధానమైన పాత్ర వహిస్తాయి. ప్రజా స్వామ్యంలో అంతిమ నిర్ణయాధికారం ప్రజలకే ఉంటుంది. అందువల్ల విషయాలన్నీ వాళ్ళకు సాకల్యంగా తెలియడం ఎంతో ముఖ్యం. సత్యదూరమైన విషయ పరిజ్ఞానంతో ప్రజలు వ్యవహరిస్తే అనేక అనర్థకాలు ఉత్పన్నమవుతాయి. అసలు విషయ పరిజ్ఞానమే లేకుండా వ్యవహరిస్తే కలిగే అనర్థకాలను



BRAOU

గురించి వేరే చెప్పనక్కరలేదు. ఇక్కడే పత్రికలు ప్రజలకు ప్రభుత్వాలకు మధ్య వారధిలా తమ పాత్ర నిర్వ హిస్తున్నాయి. ప్రజలకు వాస్తవమైన వార్త అందించడం తమ కర్తవ్యంగా భావిస్తున్నాయి.

**'వార్త' అంటే ఏమిటి ?**

లార్డ్ నార్త్ క్లిఫ్ (Lord North Cliffe) అనే ఆయన *"కుక్క మనిషిని కరిస్తే అది వార్త కాదు. మనిషి కుక్కను కరిస్తే అది వార్త"* అన్నారు. అసాధారణ విషయాలు తెలియజేయడం వార్త. వర్షా కాలంలో వర్షాలు పడ్డాయి. పంటలు ఏపుగా వచ్చాయి. ఇందులో కొత్త విషయాలు ఏమీ లేవు గనుక వార్త కాదు. విపరీతంగా వర్షాలు పడడం వల్ల పంటలకు నష్టం కలిగింది. వరదల మూలంగా రోడ్లూ, ఊళ్ళూ జల మయం అయ్యాయి. ఇవి సాధారణ విషయాలు కావు కాబట్టి వార్తలు అవుతాయి. వర్షా కాలంలో వర్షాలు పడక పోవడంవల్ల పంటలు పండక పోవడం, కరువు కాటకాలు సంభవించడం వార్తలవుతాయి. సాధారణంగా సంభ వించేవి కావు కాబట్టి సూర్యచంద్రగ్రహణాలూ, భూకంపాలూ, విమానాలు కూలిపోవడం, రైళ్ళుపట్టాలు తప్పి ప్రమాదాలు సంభవించడం లాంటివి వార్తలవుతాయి. మనకు ఆశ్చర్యం కలిగిస్తూ మనం అనుకోకుండా సంభవించే విషయాలే వార్తలు. సంపన్నులూ, నిజాయితీపరులు అనుభవించే ఆనందప్రదమైన జీవితం వార్త లకు విషయాలు కావు. అందుకే జీవిత పోరాటంలో ఓడిపోయిన వ్యక్తుల గాథలే పత్రికలకు విషయాలంటారు. ప్రార్థనా సమావేశానికన్నా, హత్యా నేర విచారణ అతిముఖ్యమైన వార్త. ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి కాలు జారి కింద పడ్డారంటే అది పత్రికలకు వార్త. ముఖ్యమంత్రి కారు డ్రైవరుకు అలాంటిది సంభవిస్తే అది వార్తకాదు. వ్యక్తి ప్రాముఖ్యాన్ని బట్టి వార్తా ప్రాధాన్యం ఉంటుంది. పాఠకుడికి అభిరుచి కలిగించే విషయమో సంఘటనో వార్త అవుతుంది.

వార్తా పరిగణనకు ఈ కింది అంశాలు ప్రాముఖ్యం వహిస్తాయి :

1. వర్తమానానికి చెంది ఉండటం
2. చర్చనీయంగా ఉండటం
3. తాజాగా ఉండటం
4. ప్రముఖంగా ఉండటం
5. గుర్తింపు పొందదగినవిగా ఉండటం
6. అసాధారణంగా ఉండటం
7. వార్తలో విషయం కచ్చితమైంది గానూ, సంగ్రహం గానూ ఉండడం

వార్తలు రెండు రకాలు :

1. నిరీక్షత వార్తలు
   - సార్వజనీన సమావేశాలు
   - సాంస్కృతిక కార్యక్రమాలు
   - క్రీడా రంగానికి సంబంధించిన వార్తలు

ఇలాంటి వాటికి సంబంధించిన కార్యక్రమాలు అనుకున్న ప్రకారం పూర్వమే నిర్ణయించబడుతాయి. ముందుగా ఫలానా సంఘటన, సభ జరుగుతుందని తెలియ జేసిందల్లా నిరీక్షిత వార్తల కిందకే వస్తాయి.

2. ఆకస్మిక వార్తలు
   - రైలు, బస్సు ప్రమాదాలు
   - కరువు కాటకాలు
   - అగ్ని ప్రమాదాలు
   - దోపిడీలు
   - వరదలు రావడం

మనకు తెలియకుండా హఠాత్తుగా వచ్చే వార్తలన్నీ ఆకస్మిక వార్తలు.

BRAOU

ఒకప్పుడు ఎదురు చూచిన విషయాల్లో ఎదురు చూడని సంఘటనలు జరుగుతుంటాయి.

అనుకున్న ప్రకారం ఉపన్యాస కార్యక్రమానికి వక్త రాకుంటే అది ఎదురు చూడని వార్త అవుతుంది.

## వార్తల కూర్పు

వార్తలు సేకరించడం, ఒక ఎత్తయితే, వార్తలు కూర్చడం మరో ఎత్తు. సమకాలీన జర్నలిజంలో ఏది వార్త అని కాక, "రాసేతీరు వార్త" అనే ధోరణి ప్రచారంలోకి వచ్చింది. అంటే సంఘటన కాక రాసేపద్ధతి అనేది ఈనాడు జర్నలిజానికి జీవంపోస్తోంది. వార్తా పత్రికలలో సగటున ప్రతివాక్యానికి పందొమ్మిదికి మించి పదాలు ఉండరాదంటారు. బ్రిటన్‌లో జర్నలిజాన్ని కొత్తపుంతలు తొక్కించిన లార్డునార్త్‌క్లిఫ్ తన 'డెయిలీ మెయిల్' పత్రికలో పనిచేస్తున్నవారికి తమ పత్రికలో ఏ వార్త కూడా మూడువందల పదాలకు మించి ఉండరాదన్న ఉత్తరవు జారీచేశాడు. అంతేకాదు సుదీర్ఘమైన వార్తా రచనలను స్వయంగా సంక్షిప్త పరిచి రాసి చూపించేవాడు. 1942లో జోథ్‌పూర్‌లో కొన్ని సంఘటనలు జరిగాయి. వాటిని దర్యాప్తుచేసి శ్రీ శ్రీప్రకాశ పదిహేను టావుల రిపోర్టు రాసి పంపారు. గాంధీజీ ఆ రిపోర్టులోని అంశాలు జీరుపోకుండా క్లుప్తీకరించి హరిజన్ పత్రికలో అర 'కాలము' తో ప్రచురించారు. రాసిన దానిలో ఉన్న సంగతులకంటే 'రాసిన తీరు'ను బట్టి వార్తకు విలువ పెరుగుతుంది. వార్తల ఎత్తుగడ, అంశాలను గుదిగుచ్చే పద్ధతి, విపులీకరణ ధోరణి వగైరాలు జర్నలిజంలో పెంపొందిన శిల్పం. ఆ తర్వాత శీర్షిక ఇవ్వడం, 'లీడ్' ఇవ్వడం, అవసరాన్ని బట్టి విషయాన్ని కుదించడం-ఇవన్నీ కూడా ఎడిటింగ్‌కు సంబంధించిన పనిలో భాగాలు.

పత్రికలలో స్థానిక వార్తలు, దేశవార్తలు, విదేశవార్తలు, వాణిజ్యవార్తలు, వరదలు, అగ్నిప్రమాదాలు, సాంస్కృతికోత్సవాలు మొదలైన రకరకాల వార్తలు ప్రచురితమవుతాయి. ఇలాంటి వార్తలు కూర్చడంలో ప్రత్యేకమైన పద్ధతులు పాటిస్తారు. కొన్ని పత్రికలు ఈ కూర్పు విషయంలో కొన్ని సంప్రదాయాలు పాటిస్తాయి. ఉదాహరణకు రెండో పేజీలో సంగ్రహ ప్రకటనలు ప్రచురిస్తాయి. చివరి పేజీలో క్రీడలకు సంబంధించిన వార్తలు వేస్తాయి.

BRAOU

పత్రికా కార్యాలయానికి అందిన వార్తలను కూర్చి పాఠకుణ్ణి ఆకర్షించే విధంగా ప్రచురించడం ఒక శిల్పం. ఒక్కొక్కప్పుడు విలేఖరులు పంపే వార్తలు నిస్సారంగా సాధారణ వ్యాసాల లాగా ఉంటాయి.అలాంటి వార్తా కథనాల్లో ఉండే హృదయస్పందన కల్గించే అంశాలు బయటకు తెచ్చి నాటకీయంగా వార్తారచన సాగిస్తారు. అప్పుడే ఆ వార్త పాఠకులను ఆకర్షిస్తుంది :

| సాధారణ రచన | నాటకీయ రచన |
|---|---|
| విచారించాడు | హృదయ విదారకంగా విలపించాడు |
| ఏడ్చాడు | కుయ్యో, మొర్రోఅని ఏడ్చాడు |
| హత్య | దారుణ హత్య |

వర్ణనలు చేసేటప్పుడు ఉచితమైన పదాలను, పదబంధాలను ఉపయోగిస్తారు :

**ఉదాహరణకు :**

మహత్తరమైన స్వాగతం
లేదా
బ్రహ్మాండమైన స్వాగతం

అని రాయవచ్చు. అంతేకాని కోలాహలమైన స్వాగతం అని రాస్తే ఎబ్బెట్టుగా ఉంటుంది.

చాలా దినపత్రికల్లో అతిశయోక్తులు ప్రచురించరు. వార్తను ఉన్నది ఉన్నట్లుగా ప్రచురిస్తారు. ఉదాహరణకు ఒక సమావేశానికి సంబంధించిన వార్తలో '*సభా ప్రాంగణం జనంతో నిండింది*' అని రాయవచ్చు. అలా

కాక *'సభా ప్రాంగణం జనవాహినితో పొంగి పొరలింది'* అని రాయటం సమంజసం కాదు. అట్లా రాస్తే అతిశయోక్తి అవుతుంది.

"సభ్యులు కేకలు వేశారు" అని రాయవచ్చు. అది Fact. "సభ్యులు కోపావేశంతో కేకలు వేశారు" అని రాస్తే అది వాఖ్య అవుతుంది. 'కోపావేశంతో' అనేది పత్రిక అభిప్రాయం అవుతుంది. వార్తలలో ఉన్నవి ఉన్నట్లు రాస్తారు. వార్తలలో యధార్థ విషయాలు ఉంటాయి. సంపాదకీయాలలో పత్రిక సంపాదకులు వార్తలకు తమ వ్యాఖ్యలు జోడిస్తారు.

"ఫలానా వ్యక్తి" జన్మదినోత్సవ వేడుక భారీ ఎత్తున జరిగింది అని రాయకూడదు. ఇందులో *'భారీ ఎత్తున జరిగింది'*- అనేది వ్యాఖ్య (Comment). ఇలా పత్రికవాళ్ళు పాక్షిక బుద్ధితో రాశారని పాఠకులు అనుకునే ప్రమాదం ఉంది. కాబట్టి ఆ ఉత్సవం జరిగిన సభాస్థలి, అలంకరణ, వచ్చిన జనసమూహం మొదలైన వాస్తవ విషయాలు రాయాలి.

ఒక అంశాన్ని ఎక్కువచేసి చెప్పాలనుకుంటే మరొకరు చెప్పినట్లు రాసే పద్ధతి అనుసరిస్తారు.

ఉదాహరణకు *'ఊరేగింపులో మూడు లక్షల మంది పాల్గొన్నారు'* అని రాసే దానికన్నా, *'ఊరేగింపులో మూడు లక్షలమంది పాల్గొన్నారని ప్రతిపక్షానికి చెందిన ప్రముఖులొకరు చెప్పారు'* అని రాస్తే సరిపోతుంది

కర్త మనుష్యవాచి అయినప్పుడు ఆ వ్యక్తికి సంఘంలోఉన్న గౌరవాన్నిబట్టి గౌరవ సూచకమైన బహువచన క్రియ ఏకవచనంలో ఉంటుంది. ఏకవచన ప్రయోగం గౌరవం ఇవ్వకపోవడాన్ని సూచిస్తుంది.

**ఉదాహరణలు:**

మంత్రి శ్రీ రామయ్య చెప్పారు.

ముద్దాయి సోమయ్య చెప్పాడు.

న్యాయ స్థానాలను నిందిస్తూ వచ్చిన వార్తలను ప్రచురించకూడదు. అది కోర్టు ధిక్కరణ కిందికి వస్తుంది. అలాగే పరువునష్టం, గౌరవం భంగం కలిగించే వార్తలు ప్రచురించరాదు. వేర్పాటు ధోరణులను సమర్థిస్తూ రాయడం సరికాదు.

సమ్మెలను గురించి రాసేటప్పుడు ఇన్నివేల మంది సమ్మెలో పాల్గొంటున్నట్లు ప్రకటించారు అనే విధంగా రాస్తారు. ఇన్ని వేలమంది సమ్మె చేస్తారు అనే విధంగా పత్రిక చెబుతున్నట్లు రాయరు.

మతకలహాలను రెచ్చగొట్టే విధంగా రాయకూడదు.

అశ్లీల విషయాలు వార్తలలో ఉండటం చట్టరీత్యా దోషమవుతుంది. ప్రేమ విషయాలకు సంబంధించిన వార్తలు రాసేటప్పుడు ఎక్కువచేసి రాయకూడదు. సందిగ్ధ భావాలు కలిగేలా వాక్యాలను రాయకూడదు. ఊత పదాలూ, పునరుక్తులూ, కర్ణ కఠోర శబ్దాలు వాడకూడదు. సూటిగా, సూక్ష్మంగా చిన్నచిన్న పేరాగ్రాఫుల వార్తలు రాయాలి. విరామ స్థానాలను గుర్తించడంకూడా చాలా అవసరం. సందేహాస్పదమైన వార్తలను వదలి వేయడం మంచిది.

వార్తలు ప్రజలలో ఉద్రేకం రెచ్చగొట్టేవిగా ఉంటే, పదాలలో బిగువును సడలిస్తారు. ఒక్కొక్కప్పుడు వార్తలలోని విషయాలను కుదిస్తారు. అలాగే అనవసరమైన వాక్యాలను తీసివేస్తారు. ముఖ్యంగా పత్రికా నీతికి భిన్నంగా ఉన్న విషయాలు తీసివేస్తారు. ఒక్కొ పత్రికకు ఒక సొంత అభిప్రాయం కూడా ఉంటుంది. అందువల్ల కొన్ని విషయాల్లో అవి తమ అభిప్రాయం చెదరకుండా ఉండేందుకు వార్తలను అందుకు అనుగుణంగా వంచుకునే అవకాశం ఉంది. కాబట్టి సాధారణంగా ఏ ఒక్క వార్తాపత్రిక వార్తలనన్నింటిని ఉన్నవి ఉన్నట్లు ప్రచురిస్తుందంటే నమ్మశక్యంకాదు. వివిధ పత్రికలు వివిధ అంశాల మీద దృష్టి కేంద్రీకరిస్తాయి. మొత్తంమీద పత్రికా ప్రపంచం వార్తా నిజస్వరూపాన్ని మనకు అందిస్తుంది.

BRAOU

ఇలా వార్తలను తగ్గించడం, పెంచడం మొదలైనవి పత్రికకు ఖాళీస్థలం కావలసిన అవసరం ఏర్పడ్డప్పుడు కూడా జరుగుతుంది. అనుకోకుండా పత్రిక అచ్చుకు వెళ్ళే సమయంలో ఒక ముఖ్యమైన వార్త రావచ్చు. అప్పుడు ఆ వార్త ప్రచురించేందుకు గాను, ప్రాముఖ్యం లేని వార్తలను లోపలి పేజీలకు తరలిస్తారు. మొదటి పేజీలో కొన్ని వార్తలలోని చివరి భాగం తీసివేస్తారు. ఆ తాజావార్తకు ప్రాముఖ్యమిచ్చి మొదటి పుటలో ప్రచురిస్తారు. ఈ పద్ధతిని *'ట్రిమింగ్, కటింగ్, బాయిలింగ్ డౌన్'* అంటారు. ఇలా తీసివేసిన వార్తలలో ముఖ్య సారాంశం పోకుండా చూస్తారు. వార్తల ప్రాముఖ్యాన్ని అనుసరించి టైపు సైజులు మారుతాయి. అసాధారణ వార్తలకు పెద్ద సైజు టైపులు వాడుతారు. అతి ముఖ్యమైన చిన్న వార్తకు ప్రాధానం ఇవ్వదలచుకుంటే 'బాక్స్' పెడతారు.

## వార్తల సంక్షిప్త రచన

విలేఖరులు, వార్తా సంస్థలు అందించే వార్తలను పత్రికల స్థలాభావాన్ని అనుసరించి సంక్షేపించి రాస్తారు. పత్రికకు ఖాళీ స్థలం సమస్య ఎప్పుడూ ఉంటూనే ఉంటుంది. అది కాకుండా పత్రిక అచ్చుకు వెళ్ళే సమయంలో అనుకోకుండా ముఖ్యమైన వార్త రావచ్చు. ఆ వార్త ప్రచురించడానికి వీలుగా తక్కిన వార్తలను ముఖ్యమైన సారాంశం పోకుండా సంక్షేపించి రాస్తారు. ఆ రచన సమగ్రార్థ బోధకంగానూ, సంక్షిప్తంగానూ ఉంటుంది. అలాంటి రచనలో అప్రధానమైన వివరాలను విడిచి పెడతారు. ముఖ్యాంశాలను మాత్రం ఇస్తారు.

వార్తలను సంక్షేపించి రాసేటప్పుడు గుర్తుంచుకోవలసిన విషయాలు :

1. అందిన వార్తా పాఠాన్ని ఒకటిరెండు సార్లు శ్రద్ధగా చదివి ప్రధాన విషయాన్ని అవగాహనచేసుకోవడం.
2. వార్తలోని ముఖ్యాంశాలను ఒక చోట గుర్తించుకోవడం.
3. సారాంశాన్ని మొదట చిత్తుగా రాయడం.
4. మూలంలోని ముఖ్యవిషయాన్ని విడవకుండ సంగ్రహ రచన చేయడం.
5. ఆ సంగ్రహ రచన స్వయం సంపూర్ణంగా ఉండేటట్లుచూడడం.
6. మూలంలో లేని విషయాన్ని సంగ్రహ రచనలో రాయకుండడం.
7. చిత్తుగా రాసిన రచనకు మూలంతో పోల్చి ముఖ్యాంశాలు వచ్చాయా? లేవా? చూడడం.
8. వర్ణక్రమం మొదలైన దోషాలు సవరించి, విరామ చిహ్నాలుంచడం.
9. భాష సరళంగా ఉండడం.
10. సంక్షిప్త రచనలు పరోక్ష భాషణలో ఉండడం.
11. సంగ్రహ రచన నిర్దుష్టంగా ఉండడం.
12. వార్తా విషయానికి పొందికైన శీర్షికనివ్వడం.
13. చిత్తు ప్రతికి శుద్ధప్రతి రాయడం.

BRAOU

తిరుమల తిరుపతి దేవస్థానం ఇంజనీరింగ్ విభాగంలో జరిగినట్లు భావించిన కుంభకోణానికి సంబంధించిన వార్తను ఈనాడు, ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభలు ప్రచురించిన పద్ధతిని పరిశీలిస్తే, వార్తలను ఎలా సంక్షేపించి రాస్తారో అవగతమౌతుంది:

### ముగ్గురు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ల సస్పెన్షన్

తిరుపతి, జులై 20: అక్రమ లావాదేవీలకు ఒడిగట్టారన్న ఆరోపణపై తిరుమల తిరుపతి దేవస్థానానికి చెందిన ముగ్గురు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లను, ఒక అసిస్టెంట్ ఇంజనీరును, ఒక హెడ్ డ్రాఫ్ట్సమన్‌ను, ఒక సూపర్‌వైజర్‌ను నేడు సస్పెండు చేశారు. ఒక కాంట్రాక్టర్‌కు ఇకమీదట ఎట్టి కాంట్రాక్టు ఇవ్వరాదని నిర్ణయించారు.

సుమారు మూడు సంవత్సరాల క్రితం జరిగిన అక్రమాలను ఆడిటర్లు కనిపెట్టారు. ఇదే కాంట్రాక్టరుకు ఇచ్చిన మరికొన్ని కాంట్రాక్టులను రద్దుచేశారు. అయనకు రావలసిన నిధులను స్తంభింపజేశారు. ఈ వ్యవహారంలో దేవస్థానం నుంచి అక్రమంగా తీసుకున్న రూ. 7.54 లక్షలు తిరిగి చెల్లించాలనికోరుతూ నోటీసు జారీచేశారు. ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీ జి. కుమారస్వామి రెడ్డి ఈ చర్య తీసుకున్నారు. ఆడిట్ విభాగంలో ఈ అక్రమాన్ని ప్రోత్సహించిన మరి కొందరు ఉద్యోగులపై కూడా చర్యతీసుకుంటున్నారు.

(ఆంధ్రప్రభ 21-7-1988)

## 7 కొండల మలుపుల్లో రు. 7 లక్షల సమాధి

తిరుపతి, జులై 20 (న్యూస్‌టుడే):

తిరుమల తిరుపతి దేవస్థానాల ఇంజనీరింగ్ విభాగంలో సుమారు లక్షలరూపాయల కుంభకోణంఒకటి వెలుగులోకి వచ్చింది. గత పది రోజులుగా ఈ అంశానికి సంబంధించిన సమగ్ర నివేదిక టి.టి.డి. ఉన్నతాధికారుల పరిశీలనలో ఉందని దీనిపై ఇంకా ఎటువంటి చర్యను అధికారులు తీసుకోలేదని విశ్వసనీయంగా తెలుస్తున్నది. సుమారు మూడున్నర సంవత్సరాల క్రితం తిరుపతి తిరుమల రెండవ ఘాట్ రోడ్‌లో ఒక బస్ ప్రమాదం జరిగినప్పుడు ఆ ఘాట్ రోడ్డుకి మలుపులలో బలమైన రెయిలింగ్‌లుఏర్పాటు చేయాలని టి.టి.డి. నిర్ణయించింది. తదనుగుణంగానే ఇనుప కమ్మీలతో ఈరెయిలింగ్‌ల ఏర్పాటుకు టెండర్లు పిలిచారు. రెయిలింగ్‌లను పటిష్టంగా నిర్మించే నిమిత్తం రైల్వే వారినుండి రైలుపట్టాలు కొనుగోలు చేయాలని టి.టి.డి. తలపెట్టింది. తదనుగుణంగా అప్పటి ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీ పి.వి.ఆర్.కె. ప్రసాద్ తమ పలుకుబడిని వినియోగించి రైల్వేవారినుండి రైలుపట్టాల రద్దును టి.టి.డి.కి విక్రయింపజేశారు.

టి.టి.డి. కొనుగోలుచేసిన రైలు పట్టాల విలువ మూడున్నర లక్షల రూపాయలుకాగా ఈ రైలుపట్టాల రవాణా వ్యయం సుమారు 20 వేల రూపాయలు (అంచనాల ప్రకారం) కావలసివుంది. ఆ మేరకు టెండర్లు ఖరారుచేసి, కంట్రాక్టరును నియమించారు. ఈరెయిలింగ్‌ల నిర్మాణం పూర్తయి కూడా చాలాకాలమైపోయింది. కంట్రాక్టరుకి బిల్లులన్నీ చెల్లించి వేయడం జరిగిపోయింది.

కానీ, ఇటీవల ఆ బిల్లులన్నీ ఇంజనీరింగ్ అడిట్ శాఖలో వరుస క్రమంలో తనిఖీకి గురయ్యేసరికి సదరు రైలుపట్టాల రవాణా కింద చెల్లించింది 20 వేల రూపాయలు కాదనీ, ఏడు లక్షల రూపాయలకు పైగా చెల్లింపు జరిగిపోయిందని వెల్లడైంది.

ఇంజనీరింగ్ విభాగంలో కంట్రాక్టరుకి చెల్లింపబడే ప్రతిబిల్లు చెల్లింపుకుముందు సూపర్‌వైజర్, అసిస్టెంట్ ఇంజనీర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ల స్థాయిలో చెక్ మెజర్‌మెంట్లకు గురయి ఆ తర్వాతే చెల్లింపుకు ఆమోదం పొందుతుంది. అటువంటి పరిస్థితుల్లో అసలుకన్నా దాదాపు నలభైరెట్లు అదనపు చెల్లింపు జరిగింది. కనుక, బిల్లు తయారయ్యే ప్రాథమిక స్థాయినుండి ఉన్నత స్థాయి వరకు ఎంతమందికి ఈ "కుంభకోణంలో" పాత్ర ఉంటే ఉండవచ్చును అన్న అంశాన్నికూడా టి.టి.డి. ఉన్నతాధికారులు ఇప్పుడు నిశితంగా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.

(ఈనాడు 21-7-1983)

## టి.టి.డి. కుంభకోణంలో 8 మంది సస్పెన్షన్

తిరుపతి, జులై 20 (న్యూస్ టుడే) : తిరుమల తిరుపతి దేవస్థానాల ఇంజనీరింగ్ విభాగంలో జరిగిన ఏడు లక్షల రూపాయల కుంభకోణానికి సంబంధించి అయిదుగురు ఇంజనీర్లను, మరో ముగ్గురు ఉద్యోగులను టి.టి.డి. అధికారులు నేడు సస్పెండ్ చేశారు. ఈ కుంభకోణం ఇటీవలే వెలుగులోకి వచ్చింది. ఈ విషయానికి సంబంధించిన సమగ్ర నివేదిక గత పదిరోజులుగా టి.టి.డి. ఉన్నతాధికారుల పరిశీలనలోవుంది.

ఈ కుంభకోణంలో భాగస్వాములుగా అనుమానింపబడుతున్నముగ్గురు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు; ఒక అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు, ఒక డిప్యూటీ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు, ఒక సూపర్‌వైజరు, ఒక డ్రాఫ్ట్సుమన్,ఒక క్లర్క్‌నుసస్పెండ్ చేస్తున్నట్లు నేటి సాయం కాలానికి ఉత్తర్వులు సిద్ధం అయ్యాయని ఒక అధికార ప్రతినిధి తెలిపారు. వీరికి నేటి రాత్రికే సస్పెన్షన్ ఉత్తర్వులు అందించనున్నట్లు తెలుస్తోంది. ఒకవేళ ఈ సస్పెండ్ ఉత్తర్వులనుతీసుకోడానికి వారు నిరాకరించినా ఇంటి తలుపులకైనా సస్పెన్షన్ నోటీసులను అతికించాలని టి.టి.డి. నిర్ణయం తీసుకొన్నట్లుతెలిసింది. ఇది ఇలావుండగా ఈ కుంభకోణంలో మూలస్తంభమైన కాంట్రాక్టరును బ్లాక్‌లిస్ట్‌లో చేర్చి ఆ కాంట్రాక్టరు ప్రస్తుతం చేస్తున్న పనులను తక్షణం నిలుపుదలచేస్తూ ఉత్తర్వులు జారీఅయ్యాయి. కాంట్రాక్టరు నుంచి ఈ కుంభకోణంలో చెల్లించిన మొత్తాన్ని రాబట్టడానికికూడాటి.టి.డి. అధికారులు చర్యలు తీసుకొంటున్నారు.

తిరుమల రెండవ ఘాట్ రోడ్డులో నిర్మించిన రైలింగ్ నిర్మాణాలను టి.టి.డి. కొనుగోలుచేసిన రైలుపట్టాలను వర్క్‌స్పాట్‌కు (సుమారు పదిహేను కిలోమీటర్లు) రవాణా చేయడానికి ఒక మెట్రిక్‌టన్నుకు ఇరవైఐదు రూపాయలకు ఆ కంట్రాక్టరు టి. టి. డి.తో ఒప్పందం కుదుర్చుకొన్నట్లు తెలిసింది. ఐతే బిల్లులో వర్క్‌స్పాట్ దూరాన్ని విభజించి ప్రతి పందమీటర్ల దూరానికి మెట్రిక్ టన్నుకు ఇరవై ఐదు రూపాయలు రవాణా చార్జిగా కాంట్రాక్టరు బిల్లు పెట్టి సొమ్ము చేసుకొన్నట్లుతెలిసింది. కాంట్రాక్టరు టి.టి.డి.ని తప్పుదారిని పట్టించినందుకుగాను అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకోడానికి టి.టి.డి యోచిస్తున్నట్లు తెలిసింది.

(ఈనాడు 22-7-83)

BRAOU

## టి.టి.డి. ఇంజనీరింగ్ శాఖలో
## రు. 7 లక్షల కుంభకోణం

తిరుపతి, జులై 20 : తిరుమల తిరుపతిదేవస్థానం ఇంజనీరింగ్ విభాగంలో ఏడు లక్షల రూపాయల వరకు కుంభకోణం జరిగినట్లు ఆడిటింగ్ అధికారులు వెల్లడిస్తున్నారు.

రెండవ ఘాట్ రోడ్డు మలుపులలో బలమైన రెయిలింగ్‌లుఏర్పాటు వేయడానికి గతంలో టి.టి.డి నిర్ణయించి ఆమేరకు చర్యలను కూడా తీసుకుంది.

మూడున్నర లక్షల రూపాయల విలువ చేసే రైలుపట్టాలను టి.టి.డి కొనుగోలుచేసింది. వాటి రవాణా ఖర్చుకు 20 వేల రూపాయలు అవుతుందని అంచనా కూడా వేయడం జరిగింది. కేవలం రవాణాఖర్చులకే ఏడు లక్షల రూపాయలు వ్యయం చేసినట్లు తెలుస్తోంది. ఈ కుంభకోణంలోసూపర్‌వైజర్ మొదలు కొన్ని అధికారుల స్థాయివరకు పాత్రలు వున్నట్లు ఆడిటింగ్ అధికారులు అభిప్రాయ పడుతున్నారు. ఈ కుంభకోణంపై ప్రస్తుతం ఎంతో పకడ్బందీగా దర్యాప్తు జరుగుతోంది.

(ఆంధ్రపత్రిక 21-7-83)

# వార్త - వివిధ అంగాలు

వార్తకు సంబంధించి అయిదు ముఖ్యాంగాలు ఉంటాయి.

1. శీర్షిక (హెడ్‌లైన్)
2. తేది
3. లీడ్ (విషయ పరిచయం)
4. బాడీ (విషయ వివరణ)
5. ఉప శీర్షికలు

**శీర్షిక**

BRAOU

వార్తలోని సారాంశాన్ని శీర్షికలో చెబుతారు. శీర్షిక ఉద్దేశం వార్తలోని ముఖ్యాంశాన్ని తేలికగా పాఠకులకు అందించడం. ప్రతి వారికి పత్రికంతా చదివే తీరిక ఉండదు. కాబట్టి పత్రికలోని వార్తల సారాన్ని శీర్షికలు చదివి గ్రహించే పాఠకులుంటారు.అలాంటి వారిని దృష్టిలో పెట్టుకుని శీర్షికలు రాస్తారు. శీర్షికలో ఒకటి రెండు వాక్యాల కన్నా ఎక్కువ ఉండవు. ఆ వాక్యం కూడా క్రియలు లేకుండా ఉంటుంది. ఒక్కొక్కప్పుడు క్రియా సహితంగానూ ఉంటుంది. తెలుగు పత్రికలలో కన్పించే కొన్ని శీర్షికలు :

1. ఆస్తికోసం ఆలిన చంపిన భర్త
2. చేజారిన దోపిడి ముఠా
3. మురికి కాల్వ త్రవ్వకంలో బైట పడిన నిధి
4. బస్సు బోల్తాపడి ప్రయాణికుల దుర్మరణం
5. ఏడాది పసిపాప క్షేమంగా బైటపడిన వైనం.

తెలుగు దినపత్రికలలో ప్రతిరోజూ ఎనిమిది కాలముల వెడల్పున ఒక పతాక శీర్షిక (బానర్ హెడ్‌లైన్) ఇస్తారు. ఈ పద్ధతి ఇంగ్లీషు పత్రికల్లో కనబడదు. వార్తల ప్రాముఖ్యంలో తరతమ భేదాలు సూచించడానికి శీర్షికలు ఉపయోగపడతాయి. ప్రముఖమైన వార్తలు ఏవీ రాని రోజున కూడా ఎనిమిది కాలముల వెడల్పున పతాక శీర్షికనిచ్చే పద్ధతి వల్ల శీర్షికల్లో వైవిధ్యం లోపిస్తుంది. నిజంగా మంచివార్త వచ్చిన రోజున దాన్ని ప్రముఖంగా ప్రచురించే అవకాశం ఉండదు. అను ప్రాసలతో శీర్షికలివ్వడం వల్ల శీర్షికలు ఆకర్షణీయంగా ఉంటాయి. 16-7-83 నాటి 'ఈనాడు' దినపత్రిక పతాక శీర్షిక 'బడిలో టీచర్లు బరిలో ఎన్జీవోలు'. ఈ శీర్షికలో 'బరి' అనే మాట ఎక్కువమంది చదువరులకు అర్థం కాదు. ఈ శీర్షికలో వార్తలోని పూర్తి వివరాలు చొప్పించారు.

వార్తలలో లాగే, హెడ్డింగులలో కూడా సొంత వ్యాఖ్య చొప్పించకుండా ఉంటే మంచిది. ఒకే సంఘటనను గురించి రోజుల తరబడి వార్తలు వస్తూఉంటే వాటికి శీర్షికలు ముందురోజు జరిగిన సంఘటనల అర్థం బోధించే విధంగా రాస్తారు. మొదటిరోజు ఇచ్చిన శీర్షికను ఇవ్వనవసరం లేదు.

గుడివాడలో దారుణహత్య హంతకుడికోసం పోలీసుల గాలింపు. మరుసటిరోజు హంతకుడు పట్టుబడితే హంతకుడు పోలీసుల కైవసం అనే శీర్షిక రాస్తారు. శీర్షిక వీలైనంత సంగ్రహంగా రాస్తారు.

రాష్ట్రపతి హైదరాబాదుకు వచ్చారు అనే విధంగా శీర్షిక ఉండదు. హైదరాబాదులో రాష్ట్రపతి అని గానీ, రాష్ట్రపతి హైదరాబాదు రాక అని గానీ శీర్షిక రాస్తారు.

**తేదీ**

ఆంగ్లంలో డేట్ లైన్ అంటారు. వార్తకు సంబంధించిన స్థలం, తేదీలను పేర్కొనడం ఈ భాగంలో జరుగుతుంది.

**ఉదాహరణకు:**

హైదరాబాద్, జులై 16 :
జైపూర్, జులై 17 :

వార్త ప్రచురించే తేదీనే ఈ భాగంలో పేర్కొంటారు. సంఘటన ఎప్పుడు జరిగిందనే అంశాన్ని వార్త వివరణలో పేర్కొంటారు.

శీర్షికలో గానీ, వార్తలో గానీ 'నేడు' అంటే వార్త ప్రచురితమయ్యే తేదీనే సూచిస్తుంది. 'నేడు' అని రాసినప్పుడు బ్రాకెట్లలో వారం పేరు రాయవచ్చు.

**ఉదాహరణకు:**

నేడు (బుధవారం) అర్జీ విచారణ ప్రారంభం అవుతుంది.

## లీడ్ (విషయ పరిచయం)

BRAOU

వార్తా సారాంశాన్ని శీర్షికలో క్లుప్తంగా చెప్పిన తర్వాత, దాన్ని కొద్దిగా వివరించి చెప్పడం లీడ్. పాఠకుడికి వార్తా సారాంశం అందివ్వడమే లీడ్ ఉద్దేశం. ఈ సారాంశం ఎవరు, ఏమిటి, ఎప్పుడు, ఎక్కడ, ఎందుకు, ఎట్లా అనే ప్రశ్నలకు సమాధానం చెబుతుంది. కొన్ని సందర్భాల్లో కొన్నిటికి సమాధానం అవసరం లేక పోవచ్చు. ఈ సారాంశం అసలు విషయాన్ని పట్టి చూపిస్తుంది. అతి ముఖ్యాంశాలను పాఠకుడికి అందిస్తుంది. ఒక విధంగా లీడ్ అంటే వార్తలకు పరిచయం చెప్పడం. వార్తలో ఏ భాగం ముఖ్యమైందయితే దాన్ని తీసుకుని లీడ్ రాస్తారు. జులై 15, 1983నాటి ఈనాడు పతాక శీర్షిక తర్వాత రాసిన లీడ్ చూడండి. ఆనాటి పతాక శీర్షిక:

## చర్చలు విఫలం ఇక తప్పదు యుద్ధం

*జరగకూడనిదే జరిగింది. ప్రభుత్వం, ఉద్యోగులు పరస్పరం విశ్వాసం కోల్పోయారు. గోదాలోకి దిగి ద్వంద్వ యుద్ధానికి తలపడ్డారు. ఉద్యోగులు నిరవధిక సమ్మెను ఆయుధంగా స్వీకరించారు. సమ్మెను స్వాభావరీత్యా ప్రోత్సహించే రాజకీయపక్షాలు, కుటిల రాజకీయ శక్తుల కుహకాలు ఉద్యోగ శ్రేణి వెనక పొంచివున్నాయి. అపార ప్రజాభిమానం వెల్లువపై అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి సహజంగానే ప్రజలలోకి వెళ్ళి ప్రదర్శనలు, బంద్ లతో జలోపేతం కానున్నారు. సంక్షేమ కార్యక్రమాలు తేగదూడల్లా పడికిపోతున్నాయి. జులై 15 అర్ధరాత్రి యుద్ధభేరి మ్రోగనున్నది. అది వేలాది ఉద్యోగుల గొంతుకలలో ప్రతిధ్వనించనున్నదో, ప్రజల నిరసనలతో పేలవం కానున్నదో.*

ఒక ముఖ్యమైన వార్త పత్రికలో వస్తే ఆ వార్తను గురించి మరుసటి రోజు కూడా తెలుసుకోవాలని పాఠకుడితో ఆసక్తి ఉంటుంది. అందువల్ల మరుసటి రోజు మొదటి రోజు లీడ్ కాక కొత్త లీడ్ రాస్తారు. కొత్తగా

దొరికిన వివరాలతో లీడ్ ప్రారంభిస్తారు. నిన్నటి దానికి ఈ రోజు దానికి భేదం ఉండేటట్లు రాస్తారు. ఇలాంటి లీడ్‌ను సెకండరీ లీడ్ అంటారు. జులై 16, 1983 'ఈనాడు' పత్రిక రాసిన సెకండరీ లీడ్ చూడండి.

*అర్ధరాత్రి సమ్మెభేరీ మ్రోగింది. ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ప్రప్రథమంగా ఆంధ్ర-తెలంగాణా ఉద్యోగులు కలిసి కట్టుగా సమ్మె రంగంలో ప్రవేశించారు. సమ్మె విజయానికి ప్రభుత్వ సిబ్బంది సర్వశక్తులూ ఒడ్డుతున్నారు. సంప్రదింపుల్లో సహనంతో వ్యవహరించి యన్జీఓ కోర్కెలపై ఓ మెట్టు దిగివచ్చిన ప్రభుత్వం ఇక ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో పట్టుదల చూపుతున్నది. ప్రభుత్వానికి అండగా పాలకపక్షం రంగంలోకి దిగుతూ సమ్మె భగ్నానికి వ్యూహం పన్నటంతో ఓ వినూత్న పరిస్థితి ఏర్పడుతున్నది. సమ్మె ఉద్యమంనుండి ఉపాధ్యాయులు, కొన్ని యూనియన్లు నిష్క్రమించాయి. ఉచితానుచితాలు పరిశీలించి నిర్దేశించవలసిందిగా ప్రజలకు ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు.*

**బాడీ** [విషయ వివరణ]

వార్తకు సంబంధించిన వివరాలన్నీ ఈ భాగాంలో ఉంటాయి.

వార్తా విషయ వివరణలో కొన్ని నియమాలు పాటిస్తారు.

కొన్ని రోజుల బట్టి ధారావాహికగా వచ్చే వార్తలలో పూర్వం జరిగిన వివరాలు సంగ్రహంగా ఇస్తారు.

చిన్న సంఘటనలు వివరించేటప్పుడు 'ఊపు' ఇవ్వడం కోసం ఉపోద్ఘాతంతో ప్రారంభిస్తారు.

**ఉదాహరణకు:**

వెళ్తున్న బస్సులో ఎక్కడం అపాయకరం అనే విషయం వివరించే సంఘటన ఒకటి జరిగింది.

ఒక సంఘటనను ప్రత్యక్షంగా చూచిన వ్యక్తి చెబుతున్నట్లుగా వార్తలు రాస్తారు.

BRAOU

**ఉదాహరణకు:**

ఒక దేవాలయానికి వచ్చిన సినిమా నటిని ప్రత్యక్షంగా చూచిన వ్యక్తి ఆ నటిని గురించి ఎలా చెబుతాడో అట్లా- అంటే ఆమె ఏరంగు చీర ధరించింది, ఏయే ఆభరణాలు వేసుకుంది, చేతిలో ఉన్న వస్తువేమిటి, ఆమెతో బాటు ఎవరెవరు వచ్చారు. మొదలైన విషయాలు రాస్తారు.

ఒక వార్తకు సంబంధించిన ముఖ్య వ్యక్తిని గురించి రాసేటప్పుడు ఆ వ్యక్తి వయస్సు, వృత్తి మొదలైన వివరాలు ఒక పేరాలో రాస్తారు.

## కాలవ్యత్యయం (Anti-Chronological)

ముందు జరిగిన సంఘటనలను వెనుకకు, తర్వాత జరిగిన సంఘటనలను ముందుకు తెచ్చిరాస్తే, దాన్ని Anti-Chronological పద్ధతి అంటారు.

**ఉదాహరణకు:**

పడకపై పడుకున్న వ్యక్తి సిగరెట్టు కాల్చారు. సిగరెట్టు నిప్పు పడకపై పడి మంటలు లేచాయి. ఇల్లు కాలిపోయింది. ఆ కారణంగా అయిదుగురు వ్యక్తులు మరణించారు- ఇది ఒక వార్త.

ఇలాంటి వార్తలో పడుకునే సిగరెట్టు కాల్చాడు అని ప్రారంభించరు. ఇంటికి నిప్పు అంటుకుని అయిదుగురి మరణంఅనే విషయాన్ని ముందుకు తెస్తారు. ఆ తర్వాత ఏవిధంగా నిప్పు అంటుకుందో వివరిస్తారు.

**వక్తల ఉపన్యాసాలు**

ఒక సమావేశంలో చాలామంది ఉపన్యసిస్తే, ముఖ్యమైన వక్త ప్రసంగాన్ని మాత్రం వార్తగా ప్రచు

రిస్తారు. చివరిలో "...మొదలైనవారు కూడా మాట్లాడారు" అని తక్కిన వక్తల పేర్లు కూడా ప్రస్తావిస్తారు.

ఒక వక్త ప్రసంగంలో అనేక అభిప్రాయాలు ఉంటే, ఉచితమైన దాన్ని శీర్షికగా ఇచ్చి ఆ అభిప్రాయాన్నే వివరించి, చివరిలో ఆ వక్త చెప్పిన తక్కిన అభిప్రాయాలను గురించి సంగ్రహంగా రాస్తారు.

ఒకే సమావేశంలో మాట్లాడిన ఇద్దరి ఉపన్యాసాలను ప్రచురించదలిస్తే, రెండు ప్రత్యేక వార్తలుగా ప్రత్యేక శీర్షికలతో ప్రచురిస్తారు.

శాసనసభ, సదస్సులు మొదలైన వాటిలో ప్రసంగించిన వక్తల ఉపన్యాసాలనుగూడా పై పద్ధతిలోనే ప్రచురిస్తారు.

పరువునష్టం, గౌరవ భంగానికి సంబంధించిన వార్తలు ప్రచురణకు పూర్వమే నిజమైనవో కావో ధ్రువపరచుకుంటారు. లేకపోతే న్యాయ సంబంధమైన ఇబ్బందులకు గురికావలసి వస్తుంది.

వివాహాలు, మరణాలు మొదలైన వాటికి సంబంధించిన వార్తలు ప్రచురించేటప్పుడు వయస్సు పేర్కొంటారు. శిశు ప్రసవం గురించి రాసేటప్పుడు తల్లి వయస్సు పేర్కొంటారు. వయస్సును బ్రాకెట్లతో సూచిస్తారు.

**ఉపశీర్షికలు**

వివరిస్తున్న విషయంలో కొద్ది మార్పు ఉన్నప్పుడు ఉపశీర్షిక ఇస్తారు. ఒక విషయం మరీ పెద్దదైనప్పుడు కూడా ఉపశీర్షికలు ఇస్తారు.

## వార్తల విపులీకరణ

BRAOU

పత్రికలు వార్తలను విపులీకరించి ప్రచురించటం ఒక పద్ధతి. అదే కాకుండా పాఠకుల సౌకర్యార్థం కొన్నిరోజుల బట్టి ధారావాహికగా వచ్చే వార్తలలో పూర్వం జరిగిన వివరాలు సంగ్రహంగా ఇస్తారు. ఒక్కొక్కప్పుడు చిన్న సంఘటనలు వివరించేటప్పుడు 'ఊపు' ఇవ్వడం కోసం ఉపోద్ఘాతంతో ప్రారంభిస్తారు. వార్తల సందర్భాలకూ, సాంకేతిక విషయాలకూ వివరణలివ్వడం అనే పద్ధతి ననుసరించి వార్తలను విపులీకరిస్తారు. ఈ పద్ధతికి ఉదాహరణ :

### ఈ రు. 20 లక్షలు ఎవరివి? విడుదలకై దేనికీ తహతహ ?

(ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి)

హైదరాబాద్, జులై 9 : గుప్త ధనస్వాములు, మరానాలు, మాన్యులు, సామాన్యులు-అందరికీ స్వాగతం పలికే బ్యాంకుల మెట్లు ఎక్కి అందరిలోఎందరు నిజాయితీపరులో ఎవరికి తెలుసు? ఎవరి వూహ ఎలా వుందో ఎవరి కెరుక !!

బ్యాంకు ప్రాంగణంలో అడుగిడిన ప్రతి వ్యక్తి డబ్బు సంచులు తెచ్చి తమవద్ద దాచుకోవాలనీ, తమ బ్యాంకు పెరిగి పెద్దది కావాలనీ బ్యాంకుల నిర్వాహకులు కోరుకుంటారు. ఆ దృష్టితోనే ఆహ్వానిస్తారు. ఆదరిస్తారు. ఆ సమయంలో తెచ్చిన ధనం ఎక్కడిదో ఎందుకో ఆరా తీయడం బ్యాంకులు చేయకూడని పని! అందుకే రకరకాల మోసాలు రకరకాల వేషాలు.

చెప్పబోయే నిజానికి ఇంత ఉపోద్ఘాతం అవసరమే మరి-

ఈ ఏడాది మే 25న హైదరాబాద్‌లో చిత్రం జరిగింది. ఆరోజున కొందరు వ్యక్తులు హడావుడిగా ఒక "వైశ్యా బ్యాంకు" బ్రాంచికి విచ్చేశారు. ఇరవై లక్షలు తెచ్చామన్నారు. సేవింగ్స్ అక్కౌంట్లు తెరవాలన్నారు. బ్యాంకు మేనేజరుకు అంతకంటే కావలసిందేముంది! సరేనన్నారు. క్షణాలమీద ఏర్పాట్లన్నీ పూర్తయిపోయాయి. బాలాగౌడ్, రాజాగౌడ్, రాజమ్మ, అంజయ్య వగైరా వగైరా ఇలా 19 మంది పేర్లతో 4236 నుంచి 4255 వరకు వరుస నంబర్లతో అకౌంట్లు తెరిచారు. ఒక్కొక్కరి పేరిట సుమారు లక్ష రూపాయల పైనే జమచేశారు. ఏవో తెలిసీ తెలియని సగం సగం వివరాల చిరునామాలు ఇచ్చారు. ఏ బ్యాంకులో అయినా కొత్తగా అక్కౌంట్ తెరవాలంటే "పరిచయం" చేసే వ్యక్తి ఒకరు కావాలి కదా. పరిచయస్తుణ్ణి చూపించకపోతే అక్కౌంటు ఇవ్వరుకదా! కాని వీరి విషయంలో ఆ పరియస్తుల

పేర్లు కూడా చాలా గమ్మత్తుగా రికార్డులలో చేరిపోయాయి. అంతేకాదు, అన్ని అకౌంట్లమీద ఆకుపచ్చని సిరాతోనే సంతకాలు కొన్ని ఇంగ్లీషులో కొన్ని తెలుగులో ఉండడం మరో విశేషం. కొంచెం జాగ్రత్తగా చూస్తే అన్ని సంతకాలు ఒకే వ్యక్తి రకరకాలుగా చేసి ఉండవచ్చునన్న అనుమానం కలుగవచ్చు. సరే అంతవరకు కథ సజావుగానే సాగిపోయింది.

నెలరోజులు హాయిగా గడిచిపోయాయి. కానిజూన్ 28న కథ ఆసక్తికరమైన మలుపు తిరిగింది. ఆరోజున ఆదాయం పన్నుశాఖ హైదరాబాద్ జోన్ గూఢచారి విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ ఆకస్మికంగా బ్యాంకుపై దాడిచేసి, ఈ అకౌంట్లకు సంబంధించిన రికార్డులన్నీ స్వాధీనం చేసుకున్నారు.

ఇంకేముంది! హడావుడి పెరిగింది. రాజకీయం ప్రవేశించింది. గడచిన కొద్దిరోజులుగా ఢిల్లీలో ఉన్న ఎవరో పెద్దలవద్దకు రాయబారాలు, వైశ్యా బ్యాంకు బోర్డు డైరెక్టర్లను, చైర్మన్‌ను ఆకట్టుకోడానికి ఎడతెగని ప్రయత్నాలు - అలా సాగిపోతూనేఉన్నాయి. ఏదో విధంగా బ్యాంకులో దాచిన సొమ్ము వెంటనే తీసుకోడానికి అనుమతించాలని ఒత్తిడి తీసుకువచ్చారు కాని నేటివరకు ఈ ప్రయత్నాలేవీ ఫలించలేదు.

కాని ఈ ఉదంతంలో ఎవరికైనా ఎదురయ్యే కొన్ని ప్రశ్నలు ఉన్నాయి: రాజకీయవాదులు బ్యాంకులలో ఇటువంటి అకౌంట్లు పెట్టుకోరు. నల్లడబ్బు ఉన్నవాళ్లు సేవింగ్స్ అకౌంట్లు తెరవరు. వ్యాపారస్థులు కోరేవి కరంట్ అకౌంటేగాని, సేవింగ్స్ అకౌంట్లు కాదు కదా. ఇక సామాన్యుడు లక్ష రూపాయలు ఎలా తేగలడు? మరి ఇది ఎవరిపని అనుకోవాలి? బ్యాంకులో వేసిన డబ్బును ఇప్పుడు ఈ సమయంలో తొందరగా తీసుకోవలసిన అత్యవసరం ఎవరికి ఎందుకు కలిగింది? ఎన్నికలేవీ లేవే? రాష్ట్రంలో ఎవరైనా ఉద్యమాలు తలపెట్టారా? లేక ఆ ఉద్యమాలను కొన్నాళ్ళపాటు పోషించడానికి నోట్ల కట్టలు అవసరమయ్యాయనుకోవాలా? ఏమో...! చెప్పలేం...

ఒక స్వార్థ ప్రయోజనం కోసం, వూరూ పేరూ లేని వారి పేరుమీద ఇలా ఇరవై లక్షలు దాచి, ఏ క్షణంలోనైనాతీసివాడుకోడానికే సేవింగ్స్ఆకౌంట్లు తెరిచారా? అలా కాకపోతే ఇంత పెద్ద మొత్తాన్ని "ఫిక్సెడ్ డిపాజిట్" లో ఎందుకు వేయలేదు?- ఇది చిత్రాతిచిత్రమైన విషయం!

ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొని ఉన్న పరిస్థితుల నేపథ్యంలో ఈ ఉదంతం ప్రజలలో రకరకాల వూహాగానాలకి, అనుమానాలకు దారితీయవచ్చు. అంతేకాక, రాష్ట్ర ప్రభుత్వోద్యోగులు తలపెట్టిన సమ్మెను మూడు నెలలపాటు అవిచ్ఛిన్నంగా నడిపించడానికి ఒక రాజకీయ పక్షం డబ్బు సంచులు గుమ్మరిస్తున్నట్లు ఇటీవలే అక్కడక్కడ కొన్ని ఆరోపణలు కూడా వచ్చిన విషయం తెలిసినదే కదా! ఇందుకు తగినట్లుగానే ఒక పి. సి. సి. ప్రముఖుడు మూడు రోజుల క్రితం ఢిల్లీలో ప్రధానమంత్రిని కలుసుకుని రాష్ట్ర రాజకీయ పరిస్థితిని గురించి చర్చలేవో జరిపి రావడాన్ని కొందరు పరిశీలకులు ఈ సందర్భంలో ప్రస్తావించడం గమనించవలసిన మరొక విశేషం. ఈ నిజానిజాల నిగ్గు తేలవలసిన అవసరం ఉంది.

(ఆంధ్రప్రభ, జూలై 10, 1983)

BRAOU

పై వార్తాఖండికలో మొదటి రెండు పేరాలూ, చివరి పేరాలేకుండా ప్రచురించినా సరిపోతుంది. వార్తా సందర్భానికి ఉపోద్ఘాతం ఇవ్వడంవల్ల ఇక్కడ విపులీకరణ జరిగింది. రెండో పేరాలో "తెచ్చిన ధనం ఎక్కడిదో ఎందుకో ఆరాతీయడం బ్యాంకులు చేయకూడని పని"— అనేది సాంకేతిక వివరణ.

ఉదాహరణలివ్వడం ద్వారా వార్తను విపులీకరించడం మరొక పద్ధతి. ఉదాహరణకు:

## అడవితల్లి బిడ్డలకు ఆకాశమే పాఠశాల

వెంకటాపురం, జులై 9 (న్యూస్ టుడే) పాఠశాలలు తెరిచి ఇరవై రోజులు దాటింది. చదువుకునేందుకు పాఠశాలలు ఏవి? పోనీ చెట్టు క్రింద కూర్చొని పాఠాలు వల్లె వేద్దామంటే పంతుళ్ళు రారాయె. ఎందుకొచ్చిన తంటాలు గానీ హాయిగా గొడ్లు కాయడానికి అడవికి పోయి రోజంతా అక్కడే గడిపితే పోలా? ఇలాంటి పరిస్థితుల్లో ఖమ్మం జిల్లా నూగూరు తాలూకాలో గిరిజనులు తమ పిల్లలకు అక్షరజ్ఞానాన్ని కూడా అందివ్వలేని నిస్సహాయస్థితిలో కాలం వెళ్ళబుచ్చుతున్నారు. గిరిజనాభ్యుదయం పేరుతో ప్రచారంలో ఉన్న పథకాలేవీ ఈ అడవి తల్లిబిడ్డలకు నాలుగు ముక్కల అక్షరజ్ఞానాన్ని అందించలేక పోతున్నాయి. అందుబాటులోలేని చదువుల తల్లి ఊసుమానేసి ఈ అడవి తల్లి బిడ్డలు ఆకాశమే పాఠశాలగా, అడవులే ఉపాధ్యాయులుగా విజ్ఞానానికి, వికాసానికి దూరంగా కాలం వెళ్ళబుచ్చుతున్నారు.

వెంకటాపురం పంచాయతీ సమితి పరిధిలోగల మొత్తం 68 ప్రాథమిక పాఠశాలల్లో ఎక్కువ పాఠశాలలకు భవనాలు లేవు. ఫలితంగా ఎండ కాలంతోపాటు వర్షాకాలం కూడా ఈ పాఠశాలలకు సెలవే. ఈ సమితిలోని చిన్నమిడిసిలేరు, పులిబోయినపల్లి, సింగసముద్రం, చేకులబోరు, అయ్యవారిపేట గ్రామాలలోనిఏకోపాధ్యాయ పాఠశాలలకు కనీసం గడ్డి ఇల్లయినా

లేకపోవడంవలనచెట్లకిందేతరగతులు నడుపుతున్నారు. దేవరపల్లి, కుర్న పల్లి, గన్నవరంకాలనీ, కొత్తూరు, లింగాపురంపాడుసుబ్బంపేట, ఎదిర, సూరవీడుకాలనీ, ముర్రంవానిగూడెం, వీరభద్రవరం, ప్రాత్తాపురం, రంగ రాజపురం, పెద్దగొల్లగూడెం గ్రామాలలో గతంలోనిర్మించినరేకులషెడ్‌లు ఐదుతరగతులు నడపడానికి సరిపోవ డంలేదు. వీటిలో కొన్ని శిథిలావస్థలో నున్నాయి. కొన్నింటికి గచ్చులు పగిలిపోయి విద్యార్థినీ విద్యార్థులు కూర్చోవడానికి అనువుగాలేవు. కొన్నింటికి వర్షంకురుస్తోంది. అయ్య వారిపేట, చంద్రుపట్ల, సింగసముద్రం గ్రామాలలోని పూరిగుడిసెలు కూడా కూలి పోవడంతో చెట్లక్రిందో, ఆశ్ర యం ఇచ్చినవారిఇంట్లోనో పాఠశాలలు నడుస్తున్నాయి.

మామిడిగూడెం, కుడుసూరు, దాస వాయి పేట, ధర్మసరం, టేకులగూడెం పెద్దగంగారం, చింతకుంటరాంపురం మొదలైన 40కి పైగా గిరిజనగ్రామా లలో పూరిపాకలే పాఠశాలలు. వీటిలో అధికభాగం పగలు పాఠశాలలు, రాత్రిపూట పశువులశాలలు. ఎండా కాలంలో వీచిన ఈదురు గాలులకి ఈ పాకలపై గడ్డి తాటాకులు లేచిపోయి నప్పటికి ఇంతవరకూ పునర్నిర్మాణం జరుగలేదు. పూరిపాకల నిర్మాణానికి కానీ, మరమ్మతులకుకానీ పంచాయతీ సమితిలో నిధులు లేవని తెలిసింది. సమితిసాధారణ నిధినుంచి పాఠశాల లకుఖర్చుపెట్టడం కుదరదని, కేవలం ప్రభుత్వం ఇచ్చే నిధులతోనే ఆ పనులు చేపట్టాలనీ వెంకటాపురం పంచాయతీసమితిఅధికారులుచెప్పారు. అధ్యాపకులే ఆయాగ్రామ పెద్దలతోటి పూరిపాకలు నిర్మించడం, మరమ్మ తులు చేయడం జరగాలని అధికారులు చెప్పారు. సూరవీడు గ్రామంలో పం చాయతీ సమితివారు పాఠశాల భవన నిర్మాణం చేయించాలని రెండు సంవ త్సరాల క్రితమే పునాదివేసి నప్పటికీ ఇంతవరకూ నిర్మాణం జరుగలేదు. కొంగాల కాలనీలో పాఠశాల భవస నిర్మాణం చేపట్టి 4 సంవత్సరాలైనా పూర్తికాలేదు. ఇప్పగూడెం, కృష్ణా పురం, చంద్రుపట్లగ్రామలలో కూడా సమితివారు 2 సంవత్సరాల క్రితం చేపట్టిన పాఠశాల భవన నిర్మాణాలు ఇంతవరకూపూర్తి కాలేదు. పంచాయతీ సమితి అధికారులనిర్లక్ష్యమే అందుకు కారణమని తెలిసింది. పంచాయతీ సమితి పాఠశాల నుండి 5తరగతులు దాటి పై చదువుకు ఎక్కువ మంది రావడంలేదు.

వివిధ గ్రామాలలోని గిరిజనులు తమ పాఠశాల పూరిపాకల నిర్మాణా నికికానీ, మరమ్మతులకు కానీ, శ్రద్ధ వహించడంలేదని అధ్యాపకులు వాపో తున్నారు. తమ పాఠశాలల్లో విద్యా ర్థులు కూర్చోవడానికి బల్లలు కానీ, తాము కూర్చోవడానికి కుర్చీలుకానీ లేవనిఅధ్యాపకులుచెప్పారు. ఫర్నిచర్ కొనుగోలుకు కూడా ప్రభుత్వమే నిధులు కేటాయించాలని విద్యాశాఖాధి కారి చెప్పారు. వివిధ గిరిజన గ్రామా లలో అధ్యాపకులు రోజు పాఠశాలకు రావడం లేదని గ్రామస్థులు ఆరో పించారు. పంచాయతీ సమితిలోని అనేక పాఠశాలలను తాను తనిఖీచేసి హాజరు కాని అధ్యాపకులపై చర్య తీసుకోవలసిందిగా వ్రాశానని అయినా ప్రయోజనం లేకపోయిందని పంచా యతీ సమితి విద్యావిస్తరణాధికారి శ్రీఎస్.జె.ఎస్. ఆచార్యులు చెప్పారు. పంచాయతీ సమితిలోని రాజకీయాల వత్తిడికిఅధ్యాపకులు నష్టపోతున్నారని పాఠశాలలకు కనీసం పూర్తిపాకలైన లేనందున చెట్లక్రింద కూర్చునేందుకు కుర్చీలు లేనందున గ్రామస్థులు వేసే నులకమంచాల పైన అధ్యాపకులు కష్టపడవలసివస్తోందని, కనీస సౌక ర్యాలు లేకుండా పాఠాలు చెప్పడం సాధ్యం కావడంలేదని వెంకటాపురం పంచాయతీ సమితి టీచర్స్ చెప్పారు.

(ఈనాడు జూలై 10, 1983)

BRAOU

ముందు జరిగిన విషయాలను ప్రస్తావించడం, తర్వాత జరగబోయే విషయాలను పేర్కొనడం ద్వారా కూడా వార్తలను విపులీకరించవచ్చు. ఉదాహరణగా ఈ కింది వార్తా ఖండిక చూడండి:

## విప్లవ భూమిలో అహింస ప్రవక్త

మాస్కో, జులై 21 : విప్లవానికి పుట్టినగడ్డ సోవియట్ యూనియన్‌లో శాంతిదూత మహాత్మాగాంధీ నిన్న రాత్రి సాక్షాత్కరించారు. అయితే ఈ సాక్షాత్కారానికి గాంధీ, నిజ రూపాన్నిగాక బెన్‌కింగ్స్లేని ఎన్ను కొన్నారు. ప్రస్తుతం అంతర్జాతీయ చలనచిత్రోత్సవం జరుగుతున్న మాస్కో ఎర్రచౌకిలోని కన్‌సర్ట్ హాలులో నిన్న రాత్రి, సర్ రిచర్డ్ అటెన్‌బరో నిర్మించిన "గాంధీ"చిత్ర ప్రదర్శన జరిగింది. ఈ చిత్రాన్ని తిలకించిన ప్రేక్షకులలోకమ్యూనిస్టు, కమ్యూనిస్టు వ్యతిరేక, కమ్యూనిస్టే తర రాజ్యాలవారు వున్నారు. అయి నప్పటికీ "సత్యం-అహింస" అనే తృతీయ మార్గాన్ని బోధించి, ఆచ రించిన మహాత్ముని జీవితగాథ అంద రినీ మంత్రముగ్ధులుగా చేసింది. ఈ సినిమా సాగిన మూడుగంటలసేపూ, ప్రేక్షకులు తమసీట్లకు అంటిపెట్టుకు కూర్చొని మహాత్మునిగాథను అత్యంత శ్రద్ధాసక్తులతో తిలకించారు. ప్రస్తుత చలన చిత్రోత్సవంలో మరే చలన చిత్రానికీ ఈ గౌరవం దక్కలేదు. 'గాంధీ' చిత్రం ముగిశాక కొంత మంది చప్పట్లు కొట్టారు కానీ అత్య ధిక భాగం ప్రేక్షకులు, సినిమా ముగింపులో 'వైష్ణవ జనతో' భక్తి గీతం వినవస్తున్నప్పుడు, మహాత్ముని స్మృతిని గౌరవిస్తూ లేచి నిలబడి మౌనం పాటించడం విశేషం. సినిమా అయిపోయాక, ప్రేక్షకులు దాని మంచి చెడ్డలపై చర్చించుకుంటూ బయటకునడవడం సర్వసామాన్యంగా కనిపించే దృశ్యం. కానీ 'గాంధీ'

సినిమా ముగిశాక కనిపించే దృశ్యం ఇందుకు భిన్నంగా వుంటోంది. మాస్కోలోకూడా ఇలాగే జరిగింది. గాంధీచిత్రం ప్రేక్షకులను అమితంగా కదల్చివేయడంతో వారు మహాత్ముని ఆత్మ తమను ఆవహించినట్లుగా మౌనంగా హాలు బయటకు నడిచారు. మాస్కో చలన చిత్రోత్సవం సమాచార విభాగంలో గాంధీ సినిమాను ప్రదర్శించారు. చిత్రదర్శకుడు అటెన్ బరో ఇందుకోసం నిన్నరాత్రే లండన్ నుంచి మాస్కోకు వచ్చారు. చిత్ర ప్రదర్శనకు ముందు ఆయన్ను వేదిక పైకి పిలిచి సత్కరించారు. ప్రేక్షకుల కరతాళ ధ్వనులమధ్య, అటెన్ బరో భారతీయ శైలిలో చేతులు జోడించి "నమస్తే" చెపుతూ, ఈ గౌరవాన్ని స్వీకరించారు. హాలులోకి వచ్చే ప్రేక్షకులకు భారతీయ మహిళలు సాంప్రదాయ పద్ధతిలో అత్తరు జల్లి, పూలనిచ్చి సత్కరించారు. మాస్కోలోని అమెరికా రాయబారి ఆర్థర్ హార్ట్‌మాన్ నుదుట "చందన తిలకం" ధరించి, హాలులో ప్రవేశించారు. చిత్ర ప్రదర్శనకు ముందు మాస్కోలోని భారత బ్రిటిష్ రాయబారులను వేదికపైకి ఆహ్వానించి ప్రేక్షకులకు పరిచయం చేయడం జరిగింది. ఇక టికెట్లు లభించని మాస్కో-వాసులు కన్సర్ట్‌హాలు వెలుపల కిక్కిరిసిపోయి వున్నారు. విడి టికెట్లు ఏమైనాలభిస్తాయేమోనని వారు అందర్నీ అడగటం కనిపించింది.

'గాంధీ' సినిమాను యుగోస్లావియా, బల్గేరియా, హంగరీ దేశాలలో ప్రదర్శించడానికి ఒప్పందం కుదిరిందని ఎన్.ఎఫ్.డి.సి. మేనేజింగ్ డైరెక్టర్ శ్రీమతి మాలతీవైద్య ఇక్కడ చెప్పారు. సోవియట్, తూర్పు యూరప్ దేశాలలో 'గాంధీ' సినిమా ప్రదర్శన హక్కులు భారతదేశానివే.

(ఈనాడు 22-7-82)

రష్యాలో జరిగిన విప్లవం, అహింసామార్గంద్వారా గాంధీజీ సాధించిన విజయాలు మొదలైన గత విషయాలు ఈ వార్తలో ప్రస్తావించారు. *'గాంధీ'* సినిమాను యుగోస్లావియా, బల్గేరియా, హంగరీ దేశాలలో ప్రదర్శించబోతున్నారనే జరుగబోయే విషయాలు ఈ వార్తా ఖండికలో పేర్కొన్నారు. ఆ విధంగా వార్తను విపులీకరించారు.

## పాత్రికేయ పరిభాష

BRAOU

అన్ని ముఖ్యవృత్తుల్లో ఉన్నట్లే పత్రికారంగంలో కూడా ఆ రంగానికి సంబంధించిన పరిభాషఉంది. ఈ పారిభాషిక శబ్దాల సంగ్రహ రూపాలుకూడా ఉన్నాయి. మచ్చుకు కొన్ని పరికించండి:

ఎ.బి.సి. : ఆడిట్ బ్యూరో ఆఫ్ సర్క్యులేషన్. ఈ సంస్థ పత్రిక అమ్ముడుబోయే సంఖ్యను బేరీజువేసి, సర్క్యులేషన్ సర్టిఫికేటు ఇస్తుంది. దానిబట్టి ఎక్కువ సర్క్యులేషన్ ఉన్న పత్రిక ఎక్కువ వ్యాపార ప్రకటనలు పొందుతుంది.

బ్యానర్ : పతాక శీర్షిక అని తెలుగులో అంటారు. కాని బ్యానర్ అనే మాటకూడా తెలుగులో బాగా వాడుకలో ఉంది. దీన్నే బ్యానర్‌లైన్ అనికూడా అంటారు. ఈ బ్యానర్ ఎనిమిది కాలముల వెడల్పున ఉంటుంది. తెలుగు దిన పత్రికలు మొదటి పేజీలో ప్రతిరోజూ పతాక శీర్షిక ఇస్తుంటారు. ఈ పద్ధతి ఇంగ్లీషు పత్రికల్లో కనబడదు. వార్తల ప్రాముఖ్యతలో తరతమ భేదాలు సూచించడానికి శీర్షికలు ఉపయోగపడతాయి. ప్రముఖమైన వార్తలు వచ్చిన రోజున ఇంగ్లీషు పత్రికల్లో పతాక శీర్షిక ఇస్తారు.

ఉదా॥ (1) గాంధీజీ, నెహ్రూ మొదలైనవారి మరణ వార్తలు
(2) బడ్జెట్ నాటి వార్తలు
(3) యుద్ధ సమయంలో వార్తలు బ్యానర్‌లో ఉంటాయి.

బాక్స్ : నాలుగువైపుల గీతలుంచి వార్తలు ప్రచురిస్తే బాక్స్ అంటారు. ఇలాంటి బాక్స్‌లోని వార్తలు పాఠకుల దృష్టిని తొందరగా ఆకర్షిస్తాయి.

బులిటన్ : ప్రాధాన్యత ఉండి, ఆలస్యంగా అందిన వార్తలను బులిటన్ అంటారు. ఇంగ్లీషు పత్రికల్లో 'లేట్ న్యూస్' అనే శీర్షికకింద ప్రచురిస్తారు. తెలుగు పత్రికల్లో 'తాజావార్త' అనే శీర్షికకింద ప్రచురిస్తారు.

కేప్షన్ : రేఖాచిత్రాలూ, ఫొటోలూ, కార్టూన్లు మొదలైన వాటికి ఇచ్చే శీర్షికలను కేప్షన్ అంటారు.

క్లిప్ ; ఇతర వార్తా పత్రికలనుంచి గ్రహించే కత్తిరింపులకు క్లిప్ అంటారు.

కాలమ్ : వార్తా పత్రికల పుటల్లోని నిలువు (Vertical) విభాగాన్ని కాలమ్ అంటారు. ప్రామాణికమైన దిన పత్రికల్లో పుటకు ఎనిమిది కాలములు ఉంటాయి. సాధారణంగా ఒక కాలము 2 1/6'' వెడల్పుగలిగి ఉంటుంది. వ్యాపార ప్రకటనల విషయంలోగూడా ఈ కాలమును కొలమానంగా గ్రహిస్తారు.

కాపి : వార్తా పత్రికల్లో ముద్రణకు ఇవ్వబడిన ఏ విషయానైయినా కాపి అంటారు.

క్రెడిట్ లైన్: వార్త ఎక్కడనుంచి లభించిందో పేర్కొనే భాగాన్ని క్రెడిట్ లైన్ అంటారు. వార్తాసంస్థలనుంచి సమాచారం లభించి ఉంటే పి.టి.ఐ., యు.ఎన్.ఐ., ఏ.పి. మొదలైన వాటిని పేర్కొంటారు.

డేట్‌లైన్ : వార్తా ప్రారంభంలో వార్త ఏ ప్రదేశంలో ఏ తేదీన సంభవించిందో పేర్కొనే భాగాన్ని డేట్‌లైన్ అంటారు.

ఉదా॥ మద్రాసు, నవంబరు 4:

డెడ్‌లైన్ : వార్తల కూర్పు ముగిసి ముద్రణకు వెళ్ళే సమయాన్ని డెడ్‌లైన్ అంటారు.

ఇయర్ : దినపత్రికల మొదటి పుట పైభాగంలో చిన్నచిన్న బాక్సుల రూపంలో ఉండే భాగాన్ని ఇయర్ అంటారు. సాధారణంగా వ్యాపార ప్రకటనలు ఈ భాగంలో ఉంటాయి.

ఫ్లాగ్ : వార్తాపత్రికల మొదటి పుటలో వార్తాపత్రిక పేరు, పేపరు ధర, సంపుటి, సంచిక మొదలైన వివరాలు, పత్రిక ప్రచురించబడే స్థలం, తేదీ మొదలైన విషయాలు ఉండే విభాగాన్ని ఫ్లాగ్ అంటారు.

లీడు : వార్తలను పరిచయం చేసే భాగం

స్కూప్ : సమకాలీన పత్రికల్లో ఎందులోనూ ప్రచురించబడని వార్తను ఏ పత్రికైనా మొదటగా ప్రచురిస్తే దాన్ని స్కూప్ అంటారు.

BRAOU

## వార్తాసంస్థల సంగ్రహ రూపాలు

| | | |
|---|---|---|
| పి.టి.ఐ. | : | ప్రెస్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా |
| యు.ఎన్.ఐ. | : | యునైటెడ్ న్యూస్ ఆఫ్ ఇండియా |
| ఇ.ఎన్.ఎస్. | : | ఎక్స్‌ప్రెస్ న్యూస్ సర్వీస్ |
| ఏ.పి. | : | అసోసియేటెడ్ ప్రెస్ |
| రాయిటర్ | : | రాయిటర్ న్యూస్ ఏజన్సీస్ |
| ఏ.ఐ.ఆర్. | : | ఆల్ ఇండియా రేడియో |
| బి.బి.సి. | : | బ్రిటిష్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్ |

(వీటి ఇంగ్లీషు రూపాలను ఏదైనా ఇంగ్లీషు నిఘంటువును చూసి తెలుసుకోండి)

ఈ పాఠంలో నేర్చుకున్న విషయాలు :

1. పత్రికలు ప్రజలకు ప్రభుత్వాలకు మధ్య వారధిలా తమ పాత్ర నిర్వహిస్తాయి.
2. అసాధారణ విషయాలు తెలియజేయడం వార్త అవుతుంది. అంటే మనకు ఆశ్చర్యం కలిగిస్తూ మనం అనుకోకుండా సంభవించేవి వార్తలు.
3. అనుకున్న ప్రకారం జరిగిన కార్యక్రమాలకు సంబంధించిన వార్తలు నిరీక్షిత వార్తలు.
4. ఎదురు చూడని వార్తలు ఆకస్మిక వార్తలు- అంటే రైలు ప్రమాదాలూ దోపిడీలూ మొదలైనవి.
5. వార్తా కథనాలు రాసేటప్పుడు హృదయ స్పందన కల్గించే అంశాలు వెలికి తేవడం ముఖ్యం.
6. వార్తా కథనాల్లో అతిశయోక్తులు రాయకూడదు.
7. న్యాయ స్థానాలను నిందించే వార్తలు ప్రచురణ యోగ్యాలు కావు. అశ్లీల విషయాలు వార్తలలో ధ్వనించకూడదు.

8. వార్తలను సంక్షేపించి రాయడం ఒక శిల్పం.
9. శీర్షిక, తేదీ, లీడ్, బాడీ, ఉపశీర్షికలు అనేవి వార్తకు సంబంధించిన వివిధ అంగాలు శీర్షికా రచన కూడా ఆకర్షణీయంగా ఉండడం ముఖ్యం.
10. శీర్షికలో చెప్పిన అంశాన్ని కొద్దిగా వివరించి చెప్పేది లీడ్.
11. వార్తకు సంబంధించిన వివరాలన్నీ 'బాడీ'లో ఉంటాయి.
12. వార్తల విపులీకరణ కోసం ఉపోద్ఘాతంతో ప్రారంభిస్తారు. జరుగబోయే విషయాలను పేర్కొనడం ద్వారా కూడా వార్తలను విపులీకరిస్తారు.

## అభ్యాసం

1. 'వార్త' అంటే ఏమిటో నిర్వచించి, నిరీక్షిత వార్తలు ఆకస్మిక వార్తల తేడాలను వివరించండి
2. వార్తలను కూర్చేటప్పుడు అనుసరించే పద్ధతులను సోదాహరణంగా వివరించండి.
3. వార్తలను సంక్షేపించి రాసేటప్పుడు గుర్తుంచుకోవలసిన అంశాలను వివరించండి.
4. ఈ కింది వార్తను సంక్షేపించి రాయండి.

### దొరికిపోయారు బందిపోటు స్వాములు

ఖమ్మం, జులై 25 (న్యూస్‌టుడే): ఉత్తర భారతదేశానికి చెందిన ఒక అంతర్ రాష్ట్రీయ దొంగల ముఠాను ప్రాణాలకు సయితం తెగించి మధిర పోలీసులు అరెస్టుచేసి చరిత్ర సృష్టించారు.

హరిద్వారకు చెందిన సదానంద స్వామి అనే పేరుతో సాధువేషంలో ఉన్న బందిపోటు నాయకత్వంలోని నలుగురు బందిపోటు దొంగలను గత రాత్రి రెండుగంటలకు మధిర రైల్వే స్టేషన్‌లో పోలీసులు వలపన్ని అరెస్టు చేశారు. వారివద్ద గల మారణాయుధాలను, ఆస్తిని స్వాధీనం చేసుకొన్నారు. ఖమ్మం జిల్లా పోలీసు సూపరింటెండెంట్ శ్రీ వి. దినేష్‌రెడ్డి కథనం ప్రకారం, బందిపోటు దొంగలకు నాయకత్వం వహిస్తూ సాధువేషంలో ఉన్న వ్యక్తిపేరు సదానందస్వామి. మిగిలిన నలుగురిలో ముగ్గురు ఢిల్లీకి చెందినవారు. మరొకరు కాశ్మీర్‌కు చెందినవాడని తెలిసింది. నాటు పిస్తోళ్ళు, సైన్యంలో ఉపయోగించే రివాల్వర్లు, సిక్కులు, గూర్ఖాలు ఉపయోగించే కత్తులు, కృపాణాలు తీసుకొని ఈ దుండగులు కొద్దిరోజుల క్రితం ఢిల్లీ నుంచి బయలుదేరారు. ఢిల్లీ నుంచి వస్తూ వీరు భోపాల్‌లో దిగారు. అక్కడ నుంచి మహారాష్ట్రలోని అమరావతి పోయి అక్కడ ఒక ఫియట్ కారు అపహరించారు. అనంతరం మహారాష్ట్రలోని నాందేడు జిల్లామీదుగా హైదరాబాదు చేరారు. మూసీనది ఒడ్డున పడుకొన్నారు. తర్వాత ఈ నెల 23వ తేదీన దుండగులు తాము అపహరించిన కారులో విజయవాడకు బయలుదేరారు. దుండ

ఫొటో

గులు విజయవాడ వైపు పోతున్న సమయంలో ఆదేరోజు సాయంత్రం నల్గొండజిల్లా చిట్యాలదగ్గర రిక్షాలో పోతున్న ముగ్గురు స్త్రీల మెడలో వున్న మంగళసూత్రాలను తెంచుకొని పారిపోయారు. అనంతరం కోదాడకు వచ్చి కారులో పెట్రోలు అయిపోవడంతో ఒక పెట్రోలు బంకు దగ్గర తను కారు నిలిపి, పెట్రోలు పోయించుకొని తమ దగ్గరవున్న ఆయుధాలతో పెట్రోలు బంకు సిబ్బందిని బెదిరించి పారిపోయారు. అనంతరం ఈ సంఘటన గురించి కోదాడ పోలీసులు నందిగామ పోలీసులకు తెలియపరిచారు. నందిగామలో దుండగులు తమ కారును నిలపబోయిన పోలీసులపై రెండు రౌండ్లు కాల్పులు జరిపి కారులో పారిపోయారు. ఆ తరువాత వాళ్ళు ఇబ్రహీంపట్టణం వచ్చి తిరిగి తమ కారును అటకాయించ ప్రయత్నించిన పోలీసులపై ఒక రౌండు కాల్పులు జరిపి మైలవరం రోడ్డు మీదుగా కొండపల్లి చేరుకొని అక్కడ మహారాష్ట్రలో అపహరించి తాము ప్రయాణిస్తున్న కారును వదిలేశారు. ఆ రాత్రికి దుండగులు సమీపంలోని కొండలపై నిదురించారని పోలీసు సూపరింటెండెంటు శ్రీ దినేష్‌రెడ్డి తెలిపారు. నిన్న పొద్దుపోయిన తరువాత విజయవాడ సమీపంలోని గంగినేని రైల్వేస్టేషన్‌లో జమ్ము తావి ఎక్స్‌ప్రెస్ రైల్లో ఎక్కారు.

గంగినేని స్టేషన్‌లో జమ్ముతావి ఎక్స్‌ప్రెస్ అవాంతర కారణాల వల్ల నిలిచిందని, అందువల్లనే వారుదానిలో

BRAOU

ఎక్కగలిగారని ఎస్. పి. చెప్పారు. అంతకు ముందురోజు కోదాడ, నందిగామ వద్ద జరిగిన కాల్పుల గురించి తెలిసిన రైల్వే స్టేషన్ మాస్టరు ఈ నలుగురిని బందిపోటు దొంగలని అనుమానించి మధిర రైల్వేస్టేషన్‌కు రాత్రి ఒంటిగంటన్నరకు టెలిఫోన్ చేసి చెప్పారు. మధిర రైల్వేస్టేషన్‌కు రైలు వచ్చేసరికి రాత్రి రెండు గంటలైంది. ఆ సమయానికే మధిర సి.ఐ. శ్రీ లోచన్‌సింగ్, ఎస్. ఐ. శ్రీ తాజుద్దీన్ తమ సిబ్బందితో దుండగులు ఫలానా పెట్టెలో వుంటారని ఊహించి, ఖచ్చితంగా ఆ పెట్టె నిలిచే ప్రదేశంలో తమ సిబ్బందితో దుండగులపైదాడిచేసేందుకు సిద్ధంగా వున్నారని తెలిసింది.

జమ్ముతావి రైలు ఖచ్చితంగా రెండుగంటలకు మధిర స్టేషనుకు రాగానే ప్రథమంగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రైలు పెట్టెలోకి ప్రవేశించి కిటికీ పక్కన కూర్చునిఉన్న వ్యక్తి వీపుకు తన రివాల్వరును ఆనించి కదలరాదని ఆదేశించారు. ఆ వ్యక్తి తన వద్దనున్న ఆయుధాన్ని తీసే ప్రయత్నంలో వుండగా సి.ఐ. అతని మెడమీద కొట్టి ఆ ప్రయత్నం నుంచి అతనిని వారించారు. అదే సమయంలో అవలి కిటికీ వైపున సాధువు వేషంలో కూర్చుని వున్న బందిపోటు నాయకునికి ఎస్.ఐ. శ్రీ తాజుద్దీన్ పిస్టల్ గురిపెట్టి కదలరాదని అతనిని ఆదేశించారు.

కాని సాధువు వేషంలో ఉన్న దుండగుడు తన రెండు జేబుల్లో ఉన్న పిస్టళ్ళ కోసం చేతులు పోనిచ్చే సమయంలో అయిదుగురు పోలీసులు అతనిని బంధించారు. మిగిలిన పోలీసులు బోగినిండాచేరి తుపాకులు గురిపెట్టి ఎవరూ కదలరాదని హెచ్చరించారు. సినిమా ఫక్కీలో ఆకస్మికంగా ఈ తతంగం అంతా రెప్పపాటులో జరిగింది. రైలుపెట్టెలో పరిస్థితి ఏ మాత్రం అదుపు తప్పినా పెట్టెలోని పోలీసులకు, ప్రయాణికులకు పెద్ద ప్రమాదం జరిగి ఉండేది. దుండగులు ఎంతటి దారుణానికయినా ఒడిగట్టేవారే కాని మధిర పోలీసుల చాకచక్యం సాహసం మూలంగా పెద్ద ప్రమాదం తప్పిపోయిందని శ్రీ దినేష్‌రెడ్డి తెలిపారు.

ఉత్తర భారతదేశానికి చెందిన వారి పోలికలు అనుసరించి దుండగులను మధిర పోలీసులు కనిపెట్టారని ఎస్. పి. చెప్పారు. దుండగులను అరెస్టుచేసి వారివద్ద గల మారణాయుధాలను పోలీసులు స్వాధీనం చేసుకొన్నారు.

(ఈనాడు జూలై 26, 1983)

5. వార్తకు సంబంధించిన ముఖ్యాంశాలను వివరించండి.

6. వార్తలను విపులీకరించి రాసేటప్పుడు అనుసరించే పద్ధతులను సోదాహరణంగా వివరించండి.

7. ఈ కింది వాటికి సంగ్రహ వివరణ లివ్వండి.

1) బ్యానర్ (పతాక శీర్షిక) 2) కాలమ్ 3) ఇయర్ 4) స్కూప్

8. ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభ, ఆంధ్రభూమి, ఈనాడు - ఈ దినపత్రికల్లో ఏదైనా ఒకరోజు ఒకే విషయంపై వచ్చిన వార్తా రచనపై సంపాదకీయాలపై మీ వ్యాఖ్య రాయండి.

BRAOU

## ఖండిక 11 పాఠం 19

# వార్తారచనలో భేదాలు

ఉద్దేశం

రకరకాల వార్తారచన పద్ధతులను పరిచయం చేయడం. వార్తా రచనలో ఉపయోగించే భాషను గురించి వివరించడం.

ప్రణాళిక

1. వార్తారచన పద్ధతులు
2. కథనాత్మక పద్ధతి
3. ప్రాధాన్య పద్ధతి
4. ఉత్కంఠ కలిగించే పద్ధతి
5. ఉపన్యాస వార్తారచన
6. నేర వార్తారచన
7. న్యాయస్థాన వార్తారచన
8. క్రీడారంగ వార్తారచన
9. భేటీ (ఇంటర్వ్యూ)
10. వార్తారచనలో భాష
11. ముఖ్యవిషయ క్రోడీకరణ
12. అభ్యాసాలూ, ప్రశ్నలూ

BRAOU

## వార్తా రచన

వార్తా విషయాలను పొందుపరిచి రాయడం ఒక శిల్పం. దీన్నే ఆంగ్లంలో techniques of News reporting అంటారు. ఒక ప్రసిద్ధ అమెరికా దేశపత్రిక ఆ శిల్పాన్ని కింది విధంగా నిర్వచించింది :

"The qualities most to be desired and striven for in news papers writing are accuracy of statement...simplicity, directness and point. Never attempt fine writing for the sake of fine writing, never use big words where small words are possible. Go right to the heart of the subject without flourish of trumpets or introduction. Stop when the story is told without conclusion or moral tag."

వార్తా రచన పరాశ్రయంగా ఉంటుంది. వ్యక్తిగత అభిరుచులకూ, ఆత్మాశ్రయ విషయాలకూ పత్రికా రచనలో స్థానంలేదు.

వార్తలలో ఎవరు, ఏమిటి, ఎందుకు, ఎప్పుడు, ఎలాగు, ఎక్కడ అనే ఆరు ప్రశ్నలకు సమాధానం ఉంటుంది. ఒక్కొక్కప్పుడు కొన్నిటికి సమాధానం అవసరంలేకపోవచ్చు.

వార్తా రచనకు సంబంధించి మూడు పద్ధతులున్నాయి :

## 1. కథనాత్మక పద్ధతి

హత్యలు, అగ్నిప్రమాదాలు, రైలు ప్రమాదాలు మొదలైన వాటిని వివరించేటప్పుడు ఈ విధానం అనుసరిస్తారు. ప్రమాదాలను గురించి రాసేటప్పుడు విలేఖరి చాలా జాగ్రత్త వహిస్తాడు. లేకుంటే తీవ్ర పరిణామాలకు దారితీసే అవకాశం ఉంది. ఉదాహరణకు ఈ కింది వార్త చూడండి:

బస్సు డ్రైవరు తాగిన మత్తులో అశ్రద్ధగా నడిపించడంవల్ల నేటి ఉదయం బస్సు కాలువలో పడింది గాయాలు తగిలిన పదిమందిని ఆస్పత్రిలో చేర్చారు. వారిలో ఇద్దరు మరణించారు.

బస్సు డ్రైవరు తాగిన మత్తులో అశ్రద్ధగా నడిపించడంవల్ల అని రాయడంవల్ల ప్రమాద కారణం విలేఖరి నిర్ధారించినట్లవుతుంది. కోర్టు విచారణానంతరం ప్రమాద కారణం నిర్ణయిస్తుంది.

మరొక వార్తా రచన చూడండి:

ఒక ఇంటి స్థలాన్ని గురించి మరో కుటుంబ సభ్యులతో జరిగిన తగాదాలలో కామంచి వీరయ్య అనే వ్యక్తి తన చేతి బాకుతో ఆరుగురిని పొడిచాడు. ఇద్దరు అక్కడికక్కడే మరణించారు. తక్కిన వారిని ఆస్పత్రికి తరలిస్తుండగా మరో ఇద్దరు దారిలో మరణించారు. ఇద్దరిని మాత్రం ఆస్పత్రిలో చేర్చారు. పోలీసువారు ముద్దాయి వీరయ్యను అరెస్టు చేశారు.

ఇలా వార్తా రచన సాగితే వీరయ్య నేరస్థుడని విలేఖరే నిర్ధారించినట్లవుతుంది. పోలీసులు పెట్టిన కేసును సరైన సాక్ష్యం లేదని కోర్టువారు ముద్దాయిని నిర్దోషిగా నిర్ణయించవచ్చు; లేదా శిక్షించవచ్చు. అపీలులో మరో విధమైన తీర్పు రావచ్చు. కాబట్టి విలేఖరి నేరస్థుడని అర్థం వచ్చే విధంగా వార్తా రచన సాధారణంగా (ఋజువు లుంటే తప్ప) సాగించరాదు ఈ వార్తను,

ఇంటి స్థలం గురించిన కొట్లాటలో ఆరుగురు మరణించారు. ఈ సందర్భంలో వీరయ్య అనే వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు-అనే విధంగా రాస్తే సరిపోతుంది.

BRAOU

## 2. ప్రాధాన్య (Scanted) పద్ధతి

ఈ విధానంలో ఏదో ఒక విషయంపై ప్రాధాన్య మిస్తారు. వార్తా రచనలో వ్యక్తులకు కాకుండా విషయాలకు ప్రాముఖ్యం ఇస్తారు. అందులోనూ తరతమ భేదాలు పాటిస్తారు.

ఉదాహరణకు లోక్‌సభ, రాజ్యసభలలో జరిగే చర్చలూ, ఆమోదించబడే శాసనాలూ, రాష్ట్రశాసన సభల్లో వాటికంటే ఎక్కువ ప్రాధాన్యం వహిస్తాయి. పార్లమెంటు చేసే శాసనాలు దేశానికంతా వర్తిస్తాయి. రాష్ట్ర శాసన సభలు చేసేవి ఆయారాష్ట్రాలకేవర్తిస్తాయి. అందువల్ల పార్లమెంటులొ శాసనాలూ,చర్చలూ ప్రాముఖ్యం వహిస్తాయి

జిల్లా, తాలూకా విలేఖరులు స్థానిక విషయాలను సంక్షిప్తంగా రాస్తారు. జిల్లా పరిషత్, పురపాలక సంఘం, ఇతర సంస్థలు, బహిరంగ సభలూ మొదలైన వాటి కార్యక్రమాలకు సంబంధించిన ముఖ్య విషయాలను సంక్షిప్తంగా రాస్తారు. అయితే అధ్యక్షుడిపై అవిశ్వాస తీర్మానం, సభలో అల్లర్లులాంటి విశేషాలను కొంత వివరంగా రాస్తారు. జిల్లా పరిషత్ ఈ సంవత్సరం రోడ్ల మరమ్మత్తుకు ఇంత, విద్యావిషయాల కింత మొత్తం కేటాయించారు అనే మామూలు విషయాల్లో విశేషాలేమీలేవు. అలాంటి వార్తలకు వార్తావిలువ ఉండదు. వక్తల ఉపన్యాసాలను రిపోర్టు చేసేటప్పుడు ముఖ్య విషయాన్ని మొదటి పేరాలో రాస్తారు. తక్కిన విషయాలను తర్వాత పేరాల్లో రాస్తారు.

## 3. ఉత్కంఠ కలిగించే పద్ధతి

ఇందులో తర్వాత ఏమి జరుగుతుందో అనే విధంగా రచనను ప్రారంభించి విషయాన్ని పరాకాష్ఠ స్థితికి తీసుకు వెళ్తారు. విస్మయాత్మక ముగింపు కల్గిన వార్తల విషయంలో ఈ విధానాన్ని ఎక్కువ పాటిస్తారు:

జూలై 22, 1983 నాటి 'ఆంధ్రప్రభ' దిన పత్రికలో ప్రచురితమైన ఈ వార్త చూడండి ;

## బోర్డు చూసి మోసపోకుమా !

(ఆంధ్రప్రభ ప్రతినిధి)

తెనాలి, జూలై 21 : తెనాలి పట్టణంలోని గాంధీనగర్‌లో ఒక ఇంటి ముందు ఒక బోర్డు వ్రేలాడబడియున్నది. దారిన పోయేవారెవరైనా ఆ బోర్డును చూస్తే వారికి ఆశ్చర్యం కలగడమేగాక, ఆ బోర్డు అంతరార్థం తెలుసుకోవాలని కూడా వుంటుంది. ఇంతకీ ఆ బోర్డు మీద ఇలా వ్రాసి వున్నది. 'ఈ ఇంటిలో కాపురాలు వుంటున్నారు. ఇతరులు లోనికి రాకూడదు, ఇళ్ళలో కుటుంబాల వారే వుంటుంటారు కదా మరి ఈ బోర్డులో ఇలా ఎందుకు వ్రాసి వున్నది అని ఆ బోర్డు చూసినవారు అనుకోవడం సహజం. ఆంధ్రప్రభ ప్రతినిధి కూడా ఈ బోర్డును చూడటం తటస్థించింది. ఇంతకీ ఆ బోర్డు గురించి, ఆ ఇంటిని గురించి చుట్టుప్రక్కల వుండేవారిని విచారించగా అసలు కథ బయటపడింది.

గతంలో ఈ ఇల్లు చాలాకాలంపాటు వ్యభిచార గృహంగా వుండేదని, రేయింబవళ్ళు ఇక్కడ వ్యభిచార వృత్తి జరుగుతూండేదని దీనివల్లనే ఆ ఇంటికి గుర్తింపు లభించిందని తెలిసింది. ప్రస్తుతం ఆ ఇంట్లో వుంటున్న వారు తరచు ఇబ్బందులకు గురికావడమే కాక వేధింపబడుతున్నారని కూడా తెలిసింది. గతంలో ఈ ఇంటికి వచ్చి తమ కామదాహాన్ని తీర్చుకునే వ్యక్తులు అలవాటు ప్రకారం అర్ధరాత్రిపూట వచ్చి ఇంట్లో వుంటున్నవారిని ఇబ్బంది పెడుతున్నారని, ఈ కారణంగానే ఇంట్లో కాపురం వుంటున్నవారు అందరికి కనిపించేలా ఆ బోర్డు పెట్టారని తెలిసింది.

అయితే కొందరు ఈ బోర్డు గురించి మరోలా చెబుతూంటారు. పోలీసుల దాడులను నివారించడం కోసమే ఈ బోర్డు పెట్టారని, ఇదివరలో ఆ ఇంట్లో వున్నవారిలో కొందరు ఇప్పటికి అక్కడే వుంటున్నారని, వ్యభిచారవృత్తి ఇదివరలో లాగే సాగిపోతున్నదని వారు అంటున్నారు. ఇంటి రహస్యం గురించి, బోర్డు అంతరార్థం గురించి పోలీసులకు, "కస్టమర్ల"కు మాత్రమే నిజం తెలిసి వుంటుంది.

ఒక సంఘటనను గురించి వార్తలు సేకరించేటప్పుడు ఎంతో నేర్పు అవసరం. (పరిశోధనాత్మక వార్తా సేకరణకు ఈ నేర్పు మరింత అవసరం). వార్తలు కచ్చితమైనవిగా ఉండటంకూడా అవసరం. అబద్ధాలూ, అతిశయోక్తులు ఉండకూడదు. ఒక వ్యక్తి ఇత్తడిని పుత్తడిచేశాడంటే అతను ఆ రహస్యాన్ని ఎవరికీ తెలియపరచకుంటే అది వార్త కాదు. జాతీయ భద్రతా దృష్టితో కొన్ని వార్తలు ప్రచురణార్హాలుకావు. అలాంటి ఒంటి విషయంలో విలేఖరులు జాగ్రత్త వహిస్తారు. వ్యక్తుల ఆంతరంగిక జీవితాలకు సంబంధించిన విమర్శలను రాసి పంపే హక్కు సాధారణంగా విలేఖరులు ఉపయోగించుకోరు. వ్యక్తులు వారి న్యాయ సమ్మతమైన ఆంతరంగిక జీవితాలకు సంబంధించిన వివరాలను రహస్యంగా ఉంచుకోవచ్చు. ఒక వ్యక్తికి ఫలానా వ్యాధి ఉందని అనుమానిస్తున్నారులాంటి వార్తలకు వీలైనంత వరకు దూరంగా ఉండాలి. వ్యక్తుల దొంగరవాణా, వ్యాపార విషయాల్లాంటి వాటిని బహిర్గతమైనప్పుడు ప్రకటించడం తప్పుకాదు. కానీ రాజకీయవేత్తలు, సినిమా నటీనటులు, ప్రసిద్ధ గాయకులు, ప్రఖ్యాతమైన ఆటగాళ్ళు మొదలైన వాళ్ళను ప్రముఖులుగా పరిగణిస్తారు. వీళ్ళను గురించిన వ్యక్తిగత వివరాలు విలేఖరులు రాసి పంపుతారు. ఎందుకంటే ప్రజలకు వాళ్ళను గురించి తెలుసుకోవాలనే కాంక్ష ఉంటుంది.

కొందరు తమ పేర్లను బయటపెట్టకుండా ఉండే షరతుపై వార్తలు అందిస్తుంటారు. కొందరు న్యాయాధిపతులు, సైనికాధికారులు, రాయబార కార్యాలయాలవాళ్ళు పేర్లను బయటపెట్టకుండా వార్తలందిస్తూ ఉంటారు. పేర్లను బయటపెట్టకూడదని కోరే హక్కు వారికుంది. ఇలాంటి వాటిని "అధికార ప్రతినిధి" (Spokes man) ద్వారా ఈ వార్త అందిందని రాస్తుంటారు. అనధికార వర్గాలనుంచి కూడా వార్తలు సేకరించబడతాయి. కొన్ని "అధికార వర్గాలనుంచి", "అనధికార వర్గాలనుంచి", "విశ్వసనీయ వర్గాలనుంచి" ఈ వార్తలందాయి అని రాస్తుంటారు. "అధికార ప్రతినిధి" (Spokes man) ద్వారా ఈ వార్తలందాయి అనే పద్ధతి రెండో ప్రపంచ యుద్ధానికి పూర్వం ఉండేదికాదు. అప్పటి సంపాదకులు వార్తల ఆధారాన్ని గురించి రాయాలని పట్టుబట్టేవారు. కాని ఈ విషయంలో తర్వాత కాలంలో సడలింపు జరిగింది.

విశ్వవిద్యాలయ స్నాతకోత్సవ ఉపన్యాసాల్లాంటి వాటిని ముందుగానే పత్రికా కార్యాలయాలకు పంపి ఫలానా తేదీన ప్రచురించండని కోరతారు. ఇలాంటి పద్ధతిని ఆంగ్లంలో ఎంబర్‌గో (embergo) అంటారు. పౌర సంబంధాధికారులవల్లకూడా వార్తలు అందుతుంటాయి. ఈ మధ్య "పూల్ రిపోర్టింగ్" అనే పద్ధతి బాగా

BRAOU

ప్రచారంలోకి వచ్చింది. అన్ని పత్రికల తరఫున ఎవరో కొందరి ప్రతినిధులను పంపి, పోలీసు స్టేషన్లు, న్యా స్థానాలు, మున్సిపల్ కార్యాలయాలు మొదలైనచోట్లనుంచి వార్తలు సేకరించే విధానాన్ని "పూల్ రిపోర్టింగ్ అంటారు.

**ఉపన్యాస వార్తా రచన**

వక్తల ఉపన్యాసాలను వార్తా రచనలుగా మార్చటం కూడా గొప్ప శిల్పం. ఉపన్యాసాన్ని ప్రత్యక్షం వినని పాఠకులకు ఉపన్యాస సారం జారిపోకుండా రచించటానికి మంచి నైపుణ్యం కావలసి ఉంది. వక్త ప్రముఖులైనప్పుడు ఆ ఉపన్యాస కార్యక్రమాన్ని గురించి ముందుగానే వార్తా పత్రికల వాళ్ళకి తెలియజేస్తా దాంతో విలేఖరులు ఆ కార్యక్రమాన్ని గురించి, వక్తలను గురించి కొంత పూర్వరంగం తయారుచేసుకుంటార ముఖ్య వక్తకు సంబంధించిన విషయాలు ఎక్కువగా ఉండేటట్టు చూస్తారు.

వక్తల ఉపన్యాసాలను వార్తా రచనలుగా మలిచేటప్పుడు ఈ కింది విధాలుగా ప్రారంభిస్తారు:

1. వక్త ఉపన్యాసంలోని ముఖ్య విషయాన్ని పరోక్ష ఉల్లేఖనం (indirect quotation) ద్వా వివరించటం.
2. వక్త ఉపన్యాసంలోని ముఖ్య అంశాన్ని ప్రత్యక్ష ఉల్లేఖనం (direct quotation) ద్వా వివరించటం (వక్త ఉపయోగించిన శబ్దాలను యథాతథంగా ఉపయోగించి).
3. ఉపన్యాస సార సంగ్రహంతో ప్రారంభించటం.
4. సభ ప్రారంభమైన సమయ సందర్భాలతో ప్రారంభించడం.
5. వక్త పేరుతో ప్రారంభించడం.
6. ఉపన్యాస అంశం లేదా శీర్షికతో ప్రారంభించడం.

సభలో పాల్గొన్న శ్రోతలు, సభాలంకరణ మొదలైన వాటిని గురించి సంగ్రహంగా వివరించాలి. అప్పు స్థానిక ముద్ర వార్తా రచనలో ఉంటుంది.

BRAOU

వక్త ముఖ్య విషయ ఉల్లేఖనంతో వార్తా రచన ప్రారంభమైతే తర్వాతి పేరా మొత్తం ఉపన్యాస సారాన్ని సంగ్రహిస్తారు. ఇలాంటి వార్తారచనలలో క్రియా పదాలను మార్చి రాస్తే పాఠకులకు విసుగులేకుండా ఉంటుంది ఉద్ఘాటించారు అని ఒకమారు రాస్తే, మరో మారు ఉపన్యసించారు అని రాస్తారు. విషయ ప్రాధాన్యాన్నిబట్ట వార్తా రచన సాగుతుంది గాని, విషయానుక్రమణికను బట్టి సాగదు. వార్తా రచనలో తీర్మానాలు లాంటి వాటి విడువక రాస్తుంటారు. వ్యవస్థకు సంబంధించిన కార్యకర్తలు, వ్యవస్థల పేర్లు రాస్తుంటారు. సభకు హాజరై ప్రజల సంఖ్య, ముఖ్యవ్యక్తుల పేర్లు పేర్కొంటారు. ఈ విషయాల్లో అతిశయోక్తులు రాయకూడదు.

**నేర వార్తారచనలు**

నేర వార్తా ప్రాతికేయులు నిందితులు తమ పేర్లు పత్రికల్లో కనిపించటానికి ఇష్టపడరు అనే విషయ గుర్తిస్తారు. నేర వార్తారచనలు చేసే విలేఖరులకు న్యాయశాస్త్ర పరిజ్ఞానం బాగా ఉండటం అవసరం. నేరాన్ని గురించిన పూర్వాపరాలు కూడా బాగా వాకబుచేసి భోగట్టా తెలుసుకోగలిగిన సామర్థ్యం అవసరం. విలేఖ నేరాన్ని ప్రత్యక్షంగా చూసే అవకాశం ఉండదు. కాబట్టి నేరస్థుల నుంచి గానీ, బాధితుల నుంచి గాని సాక్షు నుంచిగానీ, పోలీసుల ద్వారా గానీ, ఇతర విధాలుగా గానీ, నేరానికి సంబంధించిన భోగట్టా రాబట్టవలసి ఉంది. ఈ విషయంగా అతను చాలా కాలాన్ని వెచ్చించవలసి ఉంటుంది. అంతేకాదు అతను గొప్ప పరిశోధకుడు కావ లసి ఉంది. నేరానికి సంబంధించిన పూర్తి వివరాలు సేకరించాలనుకుంటే అతను పై పేర్కొన్న కారందరితో మంచిగా ప్రవర్తించాలి.

నేర పరిశోధనలో పోలీసులు ప్రదర్శించిన సాహస కృత్యాలను ప్రశంసించాలి. విలేఖరులు పోలీసుల నేరస్థులను అరెస్టుచేయడాన్ని, జైలుశిక్ష విధించడం మొదలైన విషయాలను నాటకీయంగా రాయవచ్చు. నే పర్యవసానానికన్నా, కారణాలకు ఎక్కువ ప్రాధాన్యమిస్తూ రాయటం వల్ల భవిష్యత్తులో అలాంటివి జరుగకుండా

నిరోధించవచ్చు. నేరవార్తా రచనలు చేసే విలేఖరులు కల్పనంకు చోటివ్వకూడదు. అది నవల కాదు. కథ అంత కన్నా కాదు. కాని నిజ జీవిత చిత్రణ అనేది గుర్తించుకోవాలి. వినోదం కల్గించడం కాదు. సాధారణ వార్తా రచనల్లో అనుసరించే సూత్రాలన్నీ నేర వార్తా రచనలకు వర్తిస్తాయి. కచ్చితంగా ఉండటం, పక్షపాతరాహిత్యం సత్యసమ్మతంగా ఉండడం లాంటి సూత్రాలు ఈ రచనలలోనూ అనుసరణీయాలే. అయితే కొన్ని సమయాల్లో కొంత నాటకీయంగా రచన సాగవచ్చు. న్యాయస్థాన నిర్ణయం కాక పూర్వం పేరుపెట్టి ఒక వ్యక్తిని ముద్దాయిగా పేర్కొనడం తప్పు. నేరవార్తలు ఉద్వేగపూరితంగా రచించకూడదు. పాఠకులకు ఉద్రేకం కలిగేటట్టు లైంగిక విషయాలూ, హత్యలూ, రక్తపాతం మొదలైన వాటిని వర్ణించకూడదు. నేరస్థుణ్ణి ధీరోదాత్తుడుగా వర్ణించకూడదు. నేరవార్తలు ప్రజల ధన, మాన, ప్రాణాలను రక్షించేందుకు దోహదం చేయాలి. అంతేకాదు నేరస్థులను పట్టుకోవటంలో తోడ్పడే విధంగా ఉండాలి. భవిష్యత్తులో అలాంటి నేరాలను ప్రజలు చేయకుండా ఉండేందుకు తోడ్పడాలి. నేరపరిశోధనలో పోలీసులు, న్యాయస్థానాలు తమ బాధ్యతలు నిర్వహిస్తున్నదీ, లేనిదీ తెలియజేయాలి. ప్రజలు బాధ్యతెరిగి చట్టసమ్మతంగా ప్రవర్తించేటట్టు చేయడానికి నేరవార్తా రచన తోడ్పడాలి.

## న్యాయస్థాన వార్తా రచనలు

న్యాయస్థాన వార్తా రచనలు చేసే విలేఖరికి న్యాయ శాస్త్ర విషయాలన్నీ కరతలామలకంగా ఉండాలి. న్యాయ స్థానాలలో హాజరు కావటానికి విలేఖరికి చట్ట బద్ధమైన హక్కులేదు. అయితే వాళ్ళు ఏ విధమైన అనుమతి పొందకుండానే సహజంగా న్యాయ స్థానాలకు హాజరవుతుంటారు. న్యాయాధిపతికి ఎవరినైనా న్యాయస్థానం నుంచి పంపివేసే హక్కు ఉంది. న్యాయ స్థానానికి సంబంధించిన వార్తా రచన కచ్చితంగా ఉండాలి. న్యాయ శాస్త్ర పరిభాషనువివరణ సహితంగా ఉపయోగించాలి. పరిభాషను సాధ్యమైనంత వరకు వాడకుండా ఉండాలి. తప్పనిసరి అనుకున్నచోట వివరణ ఇవ్వాలి. ఎందుకంటే సామాన్య ప్రజలకు వార్తారచన అర్థంకావాలి. న్యాయానికి సంబంధించిన నిజాన్ని తెలియజేసేటట్టు వార్తారచన సాగాలి.

BRAOU

## క్రీడారంగ వార్తా రచనలు

క్రీడారంగ వార్తలు ప్రతి పత్రికలోనూ ప్రముఖ స్థానాన్ని ఆక్రమిస్తున్నాయి. పత్రికలో దీనికోసం కొంత స్థలాన్ని కేటాయిస్తున్నారు. పందొమ్మిదో శతాబ్దం ఉత్తరార్థంలోనే అమెరికన్ పత్రికలు క్రీడారంగ వార్తలు ప్రచురించటానికి పూనుకున్నాయి. క్రీడారంగ వార్తా రచనలో ప్రత్యేక శైలీ విధానాలు కూడా అభివృద్ధిలోకి వచ్చాయి. ఈ రకం వార్తలు రచించే విలేఖరులు క్రీడారంగంలోనూ, దాని వివిధ శాఖల్లోనూ నిష్ణాతులై పత్రికా రచనలోనూ నిపుణులై ఉండాలి.

## క్రీడారంగ వార్తా రచనలలో పద్ధతులు

ఇందులో ప్రసిద్ధమైన రెండు విధానాలు అనుసరించ బడుతాయి:

1. ఆటల పోటీలను గురించిన రచన.
2. క్రీడారంగానికి సంబంధించిన ఇతర ముఖ్యవిషయాలను గురించిన చర్చ.

మొదటిది కథనాత్మక లేదా వ్యాఖ్యాన పద్ధతిలో సాగుతుంది. ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, హాకీ, టెనీస్, చదరంగం మొదలైన ఆటలపోటీల వివరణ వాఖ్యానాత్మకంగా జరుగుతుంది. రెండో దానిలో రకరకాల ఆటల గురించిన చర్చకొనసాగుతుంది. పోటీలకు సిద్ధమైన జట్టుల బలాబలాలు, ఋతువు, వాతావరణం మొదలైనవాటి అనుకూలానుకూలతలు, ఇలాంటి విషయాలపై వర్ణనాత్మక రచన సాగుతుంది.

క్రీడారంగం రచనలలో యథార్థమైన సంఖ్యా వివరాలు ఇవ్వాలి. చాలామంది క్రీడారంగం రచయితలు ఈ విషయాన్ని విస్మరిస్తుంటారు. క్రీడావార్తలు చదివే పాఠకుడికి క్రీడకు సంబంధించిన సాధారణ వార్తలకన్నా, క్రీడాకారుల పేర్లు, జట్ల సంఖ్యా వివరాలు మొదలైన విషయాలపై ఆసక్తి ఎక్కువగా ఉంటుంది. ఆ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ రంగానికి సంబంధించిన విలేఖరులు రచనలు చేస్తుంటారు.



LIBRARY

క్రీడారంగ వార్తా రచనలో ముఖ్యాంశాలతో కూడిన సంగ్రహరూపమైన పరిచయ భాగం ఉంటుం దానికి తర్వాత క్రీడకు సంబంధించిన వివరణాత్మక రచన ఉంటుంది. సంగ్రహరూపమైన పరిచయ భా (లీడ్) సాధారణ పాఠకుడికోసం ఉద్దేశించబడుతుంది. వివరణాత్మక భాగం క్రీడాభిరుచి ఉన్న పాఠకుడికో ఉద్దేశించబడుతుంది. ఈ రెండు భాగాలుకూడా ప్రత్యేక విభాగాలుగా ప్రదర్శించబడతాయి. ఆట ప్రారంభ పూర్వమే దానికి సంబంధించిన వివరాలు విలేఖరి సేకరించుకుంటాడు. క్రీడాకారుల పేర్లు మొదలైన వివర అతను సేకరిస్తాడు. లీడును క్రీడకు సంబంధించిన ఫలితంతో ప్రారంభిస్తారు. తర్వాత ఎప్పుడు, ఎక్క ఎవరెవరి మధ్య పోటీ మొదలైన వివరాలు వివరిస్తారు.

క్రీడారంగం రచనల్లో అనుసరించబడే కొన్ని పద్ధతులు:

1. పాశ్చాత్య దేశాల్లో గ్రామ్య (Slang) భాష ఈ రచనల్లో ఎక్కువ ఉపయోగిస్తారు. కాని తెల పత్రికల్లో ఆధునిక ప్రామాణిక భాషే వాడుతున్నారు.
2. క్రీడలకు సంబంధించిన పరిభాషను వీలైనంత వరకు పరిత్యజిస్తారు. బాగా ప్రచారంలో ఉ పరిభాషలు వాడతారు. సామాన్యులకు అర్థం అయ్యేటట్టు రాస్తారు.
3. విలేఖరి ఆటలపై తన సొంత అభిప్రాయాలు ప్రకటించడు. ఉన్న విషయాలను ఉన్నట్ల రాస్తాడు. పాఠకులే నిర్ణయించుకుంటారు.

క్రీడారంగం రచనల్లో ఈ కింది విషయాల్లో జాగ్రత్త వహిస్తారు :

1. రెండు జట్ల విషయంలోనూ నిష్పాక్షిక వైఖరి పాటించడం
2. క్రీడాకారుల పూర్తి పేర్లు రచనలలో ఉదాహరించడం
3. జట్ల పేర్లను జాగ్రత్తగా రాయడం

## భేటి (ఇంటర్వ్యూ)

BRAOU

ఈ ఇంటర్వ్యూ ప్రత్యక్ష సంభాషణ రూపంగా ఉంటుంది. ఇలాంటి రచనలు అనేక రకాలుగా చేయవచ కాని విషయాన్ని బట్టి శైలి విభేదిస్తుంటుంది. దీనికి గూడా లీడ్ ఉంటుంది. ఇందులో సంగ్రహంగా విషయా పరిచయం చేస్తారు. మొత్తం రచనకు సంబంధించిన సారం ఇందులో ఇముడ్చుతారు. లీడు ఇంటర్వ్యూ చేయబ వ్యక్తి వైశిష్ట్యాన్ని వివరిస్తూ, విషయ ప్రాధాన్యాన్ని ఉగ్గడిస్తుంది. అతని అభిప్రాయాలకున్న విలువను కు వక్కాణిస్తారు.

విషయ (body) వివరణలో భాషా సారళ్యం ఉంటుంది. అభిప్రాయాల పునరుక్తి రాకుండా జాగ్ర వహిస్తారు. స్థానిక ముద్రపడే విధంగా వర్ణనలు అవీ ఉంటాయి. ప్రశ్నలు తక్కువగా ఉంటాయి. సమాధా ఎక్కువగా ఉంటాయి. ఎందుకంటే పాఠకులు సమాధానాలకోసం జిజ్ఞాస వెలిబుచ్చుతారు. ప్రెస్ కాన్ఫరెన్ కూడా ఒక విధమైన ఇంటర్వ్యూలే. ఇంటర్వ్యూలో తరచుగా వచ్చే ప్రశ్న ఫలానా సంఘటనపై తమ అభిప్రా ఏమిటి? అనేది. ఈ ప్రశ్నకు వచ్చే సమాధానంపై ఆధారపడి ఉంటాయి తతిమ్మా ప్రశ్నలు. ఆ ప్రశ్న ముందుగానే తయారుచేసుకోవలసిన బాధ్యత విలేఖరిది. ఒక్కొక్క పర్యాయం ప్రశ్నలోనే సమాధానం వు ప్రశ్నలు వేయడం కద్దు. వాటికి జవాబు 'అవును' 'కాదు' అని తప్పితే మరో విధంగా ఉండదు.

## వార్తారచన - భాష

పత్రికలు ముఖ్యంగా ప్రజాసామాన్యం కోసం అనే విషయం మరిచిపోకుండా ఉంటే వార్తా భాష స్థాయిలో రాయాలో చెప్పనక్కరలేదు. పాత్రికేయుడు తన పాండిత్యం చూపడంకాదు కావలసింది. భాషా పాత్రికేయుడి అదుపు ఆజ్ఞలలో ఉండాలి. పాఠశాలల్లో నేర్చుకున్న వ్యాకరణం, వాటి సూత్రాలూ వార్తారచన అంతగా పని చేయవు. రెండు తరాలకు పూర్వం ఇంగ్లీషు జర్నలిజంలో ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయ పట్టభద్రులకు స్థానం ఉండేదికాదు. వాళ్ళు పాండిత్య ప్రదర్శనకు అనవసర ప్రయత్నం చేస్తారనీ, సామ

పాఠకులకు అర్థంకాని పదజాలాన్ని వాడతారనీ భావించి వాళ్ళని ఫ్లీట్ స్ట్రీట్‌లో అడుగు పెట్టనిచ్చే వారుకాదట! (లండన్‌లో ముఖ్యమైన పత్రికలన్నీ ప్రచురితమయ్యే వీథిపేరు ఫ్లైట్ స్ట్రీట్).

ముద్రణకు వెళ్ళే ప్రతి విషయం దోష రహితమైన భాషలో రచించ బడాలి. దోషాలు అనేక రకాలుగా ఉంటాయి. కొన్ని వ్యాకరణ సంబంధమైనవి. మరికొన్ని విరామ చిహ్నాలకు సంబంధించినవి. ఇలాంటి దోషాలు లేకుండా రచన సాగడం మంచిది. ఇవి ప్రాథమిక నియమాలు.

ప్రతి ఆటకు కొన్ని నియమాలుంటాయి. ఆ నియమాలు తెలిసినంత మాత్రాన క్రీడాకారుడు కాలేడు. అభ్యాసం వల్లె ఆటగాడు అవుతాడు. రచనా విషయం కూడా అంతే.

ప్రతి పదాన్ని దాని అర్థం తెలిసి పాత్రికేయుడు ప్రయోగించాలి. ప్రయోగించేటప్పుడు రూఢిని గుర్తించి పదాలను వాడాలి. ఉదాహరణకు 'నూరేండ్లు నిండిన' అనే ప్రయోగంలో పదాల అర్థాలు వేరు. రూఢిలో అర్థం వేరు.

పత్రికా రచనలో వాక్యాలు చిన్నవిగా ఉండాలి. మహా వాక్యాలూ సంశ్లిష్ట వాక్యాలూ ఈ రచనలో పనికిరావు. చిన్న చిన్న సామాన్య వాక్యాలు వార్తా రచనకు అనువుగా ఉంటాయి.

వార్తా రచనలో పేరాలు చిన్న చిన్నవిగా ఉండటమే మేలు. 75 పదాల కంటే ఎక్కువ ఒక్క పేరాలో ఉండకూడ దంటారు. పుస్తకాల్లో, సంచికల్లో అయితే ఒక పేరాలో 250 పదాల వరకు ఉండవచ్చు. పేరాలోని సారాంశాన్ని మొదటి వాక్యంలో సూచించడం మంచిది. ప్రతిపేరాలో కనీసం రెండు వాక్యాలైనా ఉండాలంటారు.

ఒక అమెరికన్ పత్రిక తన విలేఖరుల ఉపయోగార్థం ప్రచురించిన పుస్తకంలో ఇలాఉంది:

"We do not Commence, we begin, we do not purchase, we buy. We do not pass away, we die. We are not all gentlemen, but we are all men. All Women are not ladies, but all women are women. We do not reside in residences. We live in homes. All fires are not conflagrations......"

BRAOU

ఈ పాఠంలో నేర్చుకున్న ముఖ్య విషయాలు:

1. వార్తా రచన పరాశ్రయంగా ఉంటుంది.
2. హత్యలు, అగ్నిప్రమాదాలు మొదలైన వాటిని వివరించేటప్పుడు వార్తా రచనలో కథనాత్మక విధానాన్ని అనుసరిస్తారు.
3. సభల్లో జరిగే అల్లర్లు మొదలైన విషయాలకు ప్రాధాన్యమిచ్చి వార్తా కథనం చేయడం ప్రాధాన్య పద్ధతి. ఈ పద్ధతిలో మామూలుగా జరిగే రోడ్ల మరమ్మత్తు మొదలైన వాటికి సంబంధించిన కేటాయింపులులాంటి విషయాలకు ప్రాముఖ్యముండదు.
4. ఉత్కంఠ కలిగించే విధంగా వార్తా రచన కొన్ని సందర్భాల్లో అవసరం.
5. రాజకీయవేత్తలు, సినిమా నటీనటులు, ప్రఖ్యాతమైన క్రీడాకారులు మొదలైన ప్రసిద్ధుల గురించిన వ్యక్తిగత వివరాలు విలేఖరులు రాసి పంపవచ్చు.
6. వక్తల ఉపన్యాసాలను వార్తా రచనలుగా మార్చడం మంచి శిల్పం.
7. నేర వార్తా రచయితలు నిందితులు తమ పేర్లు పత్రికలలో కనిపించటానికి ఇష్టపడరు-అనే విషయం గుర్తిస్తారు.
8. న్యాయస్థాన వార్తా రచనలు చేసే విలేఖరికి న్యాయశాస్త్ర విషయాలు తెలిసి ఉండాలి.
9. క్రీడారంగం వార్తా రచనలో ముఖ్యాంశాలతో కూడిన సంగ్రహరూపమైన పరిచయం ఉంటుంది.
10. ఇంటర్వ్యూ ప్రత్యక్ష సంభాషణ రూపంగా ఉంటుంది.
11. వార్తా రచనలో భాష సరళంగా ఉంటుంది, ఉండాలి.

# అభ్యాసం

1. వార్తా రచనకు సంబంధించిన మూడు ముఖ్య పద్ధతులను సోదాహరణంగా వివరించండి.
2. మీ గ్రామంలో ఒక బట్టల దుకాణానికి అగ్నిప్రమాదం సంభవించినట్లు ఊహించి 25 వాక్యాల లోపు వార్తా రచన చేయండి.
3. వక్తల ఉపన్యాసాలను వార్తా రచనలుగా మలిచేటప్పుడు పాటించే పద్ధతులను వివరించండి.
4. నేర వార్తా రచనలో విలేఖరి అనుసరించవలసిన మెలకువలు వివరించండి.
5. ఈ క్రింది వాటికి సంగ్రహంగా వివరణలివ్వండి.
   1) పూల్ రిపోర్టింగ్ 2) న్యాయస్థాన వార్తారచనలు 3) క్రీడారంగ వార్తారచనలు 4) ఇంటర్వ్యూ 5) వార్తారచన-భాష
6. పాఠం 18లో ఇచ్చిన వార్తల రచనలో పాటించిన పద్ధతులపై మీ వ్యాఖ్య రాయండి.
7. పాఠం 18లో ఇచ్చిన ఆయా పత్రికల వార్తారచనలోని భాషపై మీ వ్యాఖ్య రాయండి. ఆ వార్తలలో వాడిన జాతీయాలు ఏవి ?

BRAOU

ఖండిక 12 పాఠం 20

# ఉత్తరాలు రాసే పద్ధతులు

**ఉద్దేశం**

లేఖారచన ప్రాధాన్ని తెలిపి, ఉత్తరాలు రాసేటప్పుడు అనుసరించవలసిన పద్ధతులను పరిచయం చేయడం.

**ప్రణాళిక**

1. లేఖారచన ప్రాధాన్యం
2. లేఖలోని భాగాలు
   - (అ) ఉత్తరంరాసేవారి చిరునామా, తేదీ
   - (ఆ) పిలుపు (సంబోధన)
   - (ఇ) చెప్పదలచుకున్న విషయం
   - (ఈ) ముగింపు
   - (ఉ) సంతకం
   - (ఊ) ఉత్తరం ఎవరికి రాస్తున్నామో, వారి చిరునామా
3. ముఖ్య విషయక్రోడీకరణ
4. అభ్యాసాలూ, ప్రశ్నలూ

BRAOU

## లేఖారచన ప్రాధాన్యం

పూర్వం పావురాలు మొదలైన వాటిద్వారా ఉత్తరాలు పంపే పద్ధతి గురించి విన్నాం. అంచెటపా వ్యాప్తిలోకి వచ్చిన తర్వాత గుర్రపురౌతులు అంచెలంచెలుగా టపా అందించేవాళ్ళు. ఆ తర్వాత టపాపద్ధతి (Postal System) వ్యాప్తిలోకి వచ్చింది. దాంతో లేఖారచన సర్వవ్యాప్తమైంది. లేఖల బట్వాడా కూడా ఒక ప్రత్యేక యంత్రాంగంగా రూపొందింది. ఖండాంతరాల్లో ఉన్నవారుకూడా ఉత్తరాల ద్వారా సన్నిహితులౌతున్నారు. వ్యక్తుల మధ్యనేకాదు, సామాజిక జీవితంలోని వివిధరంగాల మధ్యనే కాదు దేశాల మధ్యకూడా ఉత్తర ప్రత్యుత్తరాలు జరుగుతున్నాయి.

లేఖారచనలో అన్నింటికి ఒకే పద్ధతి అనుసరించరు. కాబట్టి ఎవరెవరికి ఏఏరీతిగా ఉత్తరాలు రాయాలో ఆ రకంగా ఉత్తరాలు రాసేపద్ధతిని అలవరచుకోవడం అవసరం.

**లేఖలోని భాగాలు**

1. ఉత్తరం రాసేవారి చిరునామా, తేది.
2. పిలుపు (సంబోధన)
3. చెప్పదలచుకున్న విషయం (ప్రధాన విషయం)
4. ముగింపు
5. సంతకం
6. ఉత్తరం ఎవరికి రాస్తున్నామో వారి చిరునామా

**ఉత్తరం రాసేవారి చిరునామా, తేది.**

ఉత్తరం రాసేవారు లేఖ కుడివైపు పైభాగంలో తమ చిరునామా, తేదిని రాస్తారు. ఇలా రాసేటప్పుడు వీధి పేరుకు తర్వాత కామా, ఊరి పేరు తర్వాత మరో కామా ఉంచుతారు. తేది తర్వాత ముగింపుచుక్క (Full stop) ఉంచుతారు. ఈవిధంగా విరామ చిహ్నాలకు సంబంధించిన నియమాలు లేఖారచనలో పాటిస్తారు.

**ఉదాహరణ**

56, కాశేశ్వరరావు వీధి,<br>
విజయవాడ,<br>
జూన్ 6, 1983

ఉద్యోగాల కోసం పెట్టే దరఖాస్తులు, ఆఫీసులకు రాసే ఉత్తరాలు మొదలైన వాటిల్లో ఉత్తరం రాసేవారి పేరు, చిరునామాను ఉత్తరం ఎడమవైపు పై భాగంలో రాస్తారు.

**ఉదాహరణ**

వి. ఆర్ శేఖర్,<br>
65, పోర్లవీధి,<br>
తిరుపతి.

వ్యవహారలేఖల్లో ఊరిపేరూ, తేదీనీ ఉత్తరం ఎడమవైపు కింది భాగంలో రాస్తారు. ఈరకంలేఖల్లో వీటిని ఉత్తరం కుడివైపు పైభాగంలోనైనా ఉండవచ్చు. ఇవి ఏదో ఒకచోటే ఉంటాయి. రెండు చోట్లలోనూ ఉండవు. సాంఘిక లేఖల్లో కూడా ఈ పద్ధతి పాటిస్తారు.

BRAOU

**పిలుపు**

తల్లిదండ్రులు. బంధువులు, పెద్దలు, పరిచయస్తులు మొదలైన వారికి రాసే లేఖల ప్రారంభంలో<br>
పూజనీయులైన<br>
పూజ్యులైన<br>
మహారాజశ్రీ

మొదలైన విశేషణాలు పిలుపులో ఉపయోగిస్తారు. కొందరు బ్రహ్మశ్రీ, వేదమూర్తులులాంటి విశేషణాలు కూడా రాస్తారు. ఆచారపరులైన మరికొందరు స్త్రీలకు రాసే సందర్భాలల్లో 'మహాలక్ష్మీ సమానురాలైన' అనే విశేషణాన్నీ, వైధవ్యం ప్రాప్తించిన వారిని సంబోధించేటప్పుడు 'గంగాభాగీరథీసమానురాలైన' అనే విశేషణాన్ని ఉపయోగిస్తారు. ఈరోజుల్లో ప్రాచీన సంప్రదాయాలను పాటించని వారు డియర్ బ్రదర్, సిస్టర్ లలిత, డియర్ ఫాదర్ అనే పద్ధతిలో రాస్తున్నారు.

'మిత్రుడా', 'స్నేహితుడా', మొదలైన వాటిని విశేషణాల తర్వాత సాధారణంగా రాయరు. అక్కడ ఆ మిత్రుడి పేరు రాయడం ఉత్తమం.<br>
ఇలా:

**ఉదాహరణ**

ప్రియమైన ప్రసాద్,<br>
ప్రియమైన మిత్రుడా,

అని రాయడంలో, ఆత్మీయత మొదటిదానికంటే తక్కువ. అంతగా పరిచయంలేని మిత్రులకు రాసేటప్పుడు పేరుకు ముందు శ్రీ/శ్రీమతి/కుమారి లాంటివి చేరుస్తారు.

బంధువుల విషయంలో బంధుత్వాన్ని పిలుపులో పేర్కొంటారు.

ఉదాహరణ

ప్రియమైన అన్నయ్యకు,
పరిచయం లేని వారికి రాసేటప్పుడు

అమ్మా,

అయ్యా,

ఆర్యా,

మహాశయా,

అంటూ పిలుపు ప్రారంభిస్తారు. మనం ఉత్తరం రాస్తున్న వారికి మనతో ఉన్న సంబంధాన్నిబట్టి ఈ పిలుపులు మారుతూ ఉంటాయని ఇంతకుముందే చెప్పుకున్నాం.

పెండ్లైన స్త్రీలకు "శ్రీమతి" అనీ, పెండ్లికాని స్త్రీలకు "కుమారి" అనీ పేర్లకు ముందు ఉపయోగిస్తారు. పిన్నలకు "చిరంజీవి" అని పేర్లకు ముందు చేరుస్తారు. పిన్నలైన ఆడవారికి సౌభాగ్యవతి అనే మాట కూడా చేరుస్తారు. పెద్దలైన పురుషుల పేర్లకు పూర్వం 'శ్రీ' అనీ, 'శ్రీయుతులు' అనీ చేరుస్తారు. శ్రీమతి, శ్రీ లాంటి వాటిని పేర్లకుపూర్వం చేర్చిన తర్వాత పేర్ల చివర 'గారు' ఉంచనవసరంలేదని 'నార్ల' లాంటి ప్రాతికేయుల అభిప్రాయం. శ్రీమతి, శ్రీ లాంటివి పేర్లకు పూర్వం లేనప్పుడు పేరు చివర 'గారు' చేర్చవచ్చు. డాక్టర్, ప్రొఫెసర్, మేజర్ మొదలైనవి సముచితమైనప్పుడు పేరుకుముందు చేరుస్తారు. పేర్లకు మునుపు ఇవి ఉన్నప్పుడు చివర "గారు" అవసరం లేదు.

అధికారులకు రాసే లేఖల్లో

మాన్యశ్రీ

మహోదయులైన

గౌరవనీయులైన

లాంటి విశేషణాలు పిలుపులో ఉపయోగిస్తారు.

BRAOU

వ్యాపార, వ్యవహార లేఖల్లో

మహాశయా,

అయ్యా,

అమ్మా,

అనే విధంగా పిలుపులు ఉంటాయి.

గమనిక

పిలుపు ఉత్తరం ఎడమవైపు ఉంటుంది. పిలుపు తర్వాత కామాను ఉంచుతారు.

# ప్రధాన విషయం

పిలుపుకు కింద కొంచెం కుడివైపుగా విషయం ప్రారంభిస్తారు. తెలుగువారి సంప్రదాయాన్ని అనుసరించి వ్యక్తిగత లేఖల్లో తమకంటే పెద్దలైన వారికి నమస్కారాలు; వందనాలు మొదలైనవి చెబుతారు. తమకంటే చిన్నవారికి ఆశీస్సులు; దీవెనలు మొదలైనవి చెబుతారు. తర్వాత ఉత్తరం రాసేవారు తమ క్షేమాలు సంగ్రహంగా చెప్పి ఉత్తరం రాస్తున్న వారి క్షేమాలను కాంక్షిస్తూ రాయడం తెలుగువారిలో ఆచారంగా ఉంది.

ఉదాహరణ

1) ఇక్కడ నేను క్షేమంగా ఉన్నాను. తమ క్షేమ సమాచారాలు తెలియజేయ ప్రార్థిస్తున్నాను.
2) అనేక నమస్కారాలు. ఉభయ కుశలోపరి.

ఈ పద్ధతులు వ్యక్తిగత లేఖలకు సంబంధించినవి. ఈ విధంగా రాసిన తర్వాత రాయదలచుకున్న విషయాన్ని వివరిస్తారు.

ఆయా లేఖల ననుసరించి విషయ వివరణ సాగుతుంది. విషయం విస్తారమైనప్పుడు పేరాల విభజన అవసరం. విరామ చిహ్నాలుంచడం మరవరాదు. (15వ పాఠంలో విరామ చిహ్నాలుపయోగించే పద్ధతులను గమనించండి) మన మెవరికి రాస్తున్నామో వారికి మన భావం అర్థమయ్యేటట్లు రాయడం అవసరం. తక్కువలో ఎక్కువ భావం స్ఫురించాలి. జాబులో సులభశైలిని ఉపయోగించాలి. పదగత, వాక్యగత, భావగత అన్వయాలు పాటించడం అవసరం.

## ముగింపు

లేఖ చివరి భాగంలో సంతకం చేయటానికి పూర్వం ప్రధాన విషయానికి కింద కుడివైపుగా వ్యక్తిగత లేఖల్లో చిన్నవారు పెద్దవారికి రాసేటప్పుడు

చిత్తగించవలయును,
ఇట్లు,
విధేయుడు,

అని రాస్తారు.

పెద్దలు పిన్నలకు రాసే సందర్భాల్లో అయితే

గ్రహింపవలయును,
ఇట్లు,
శ్రేయోభిలాషి,

అని రాస్తారు.

**గమనిక**

వీటి చివర కామా ఉంటుంది.

వ్యాపార, వ్యవహార, సాంఘిక లేఖల్లో "విశ్వాసపాత్రుడు", "భవదీయుడు", "విధేయుడు" లాంటి పదబంధాలు, పదాలు ఉపయోగిస్తారు.

**సంతకము**

ముగింపుకు కింద కొంచెం కుడిపైపుగా ఉత్తరం రాసేవారు తమ సంతకం చేస్తారు. కొత్తవారికి ఉత్తరం రాసేటప్పుడు వివరణ కోసం సంతకం కింద కుండలీకరణాల మధ్య ఉత్తరం రాసేవారి పూర్తిపేరు విడి అక్షరాలతో రాయడం ఉత్తమం.

**ఉదాహరణకు :**

చిత్తగించవలయును,
ఇట్లు,
భవదీయుడు,

సం॥
[ఆర్. సుధాకరబాబు.]

**చిరునామా**

ఎవరికి ఉత్తరం రాస్తున్నామో వారి పూర్తిపేరు, చిరునామా ఉత్తరం లోపలకూడా రాయడం అవసరం. వ్యక్తిగత లేఖల్లో ఈ పేరూ, చిరునామా ఉత్తరం కిందిభాగాన ఉంటుంది. వ్యాపార, వ్యవహారలేఖల్లో ఉత్తరం పై భాగాన ఉంటుంది.

BRAOU

చిరునామా ఉత్తరంపైన కుడివైపుగా ఒక పంక్తి కింద మరో పంక్తిగా రాస్తారు. ఒక్కొక్క పంక్తి చివర కామా ఉంచడం ఒకపద్ధతి. పేరుకు ముందు గౌరవసూచక విశేషణం (శ్రీ/శ్రీమతి/కుమారి మొదలైనవి) రాస్తారు. చిరునామా చివర పిన్‌కోడ్ (పోస్టల్ ఇండెక్స్ నంబర్) రాయడం మంచిది.

ఉత్తరం ఎవరికి రాస్తున్నామో వారికి జాబు తిన్నగా చేరాలంటె వారి చిరునామా వివరంగా రాయడం తప్పనిసరి

ఈ పాఠంలో నేర్చుకున్న ముఖ్యవిషయాలు.

1. లేఖా రచన వ్యక్తిగత, సామాజిక జీవితాలలో ప్రాముఖ్యం కలిగి ఉంది.
2. ఉత్తరం రాసేవారి చిరునామా; తేది, పిలుపు, చెప్పదలచుకున్న విషయం, ముగింపు, సంతకం మొదలైనవి లేఖలోని భాగాలూ వాటిని కొన్ని నియమాల ననుసరించి రాయడం.

## అభ్యాసం

1. లేఖలో ఉండే వివిధ విభాగాలేమిటి ?
2. ఈ కింది విషయాలను గురించి సంగ్రహంగా వివరించండి.
   i) పిలుపు
   ii) ముగింపు
   iii) పిన్‌కోడ్
3. ఈ కింది లేఖలో విరామ చిహ్నాలు గుర్తించండి.

తెనాలి
13 మార్చి 1983

ప్రియమైన అన్నయ్యా

ఇట్లు
నీ ప్రియమైన తమ్ముడు
రవికుమార్

చిరునామా
ఆనందకుమార్
73 పాటిబండ వారి వీధి
గుడివాడ
కృష్ణాజిల్లా ఆం. ప్ర.

BRAOU

ఖండిక 12 పాఠం 21

# ఉత్తరాల్లో రకాలు

ఉద్దేశం

నమూనా లేఖలను పరిచయం చేస్తూ, ఉత్తరాలలోని రకాలను వివరించటం.

ప్రణాళిక

1. ఉత్తరాల్లో రకాలు
   (అ) వ్యక్తిగత లేఖలు (Personal letters/Prirate letters)
   (ఆ) వ్యాపార లేఖలు (Business letters)
   (ఇ) వ్యవహారిక లేఖలు (Official letters)
   (ఈ) సాంఘిక లేఖలు (Public letters)
2. ముఖ్య విషయ క్రోడీకరణ
3. అదనపు సమాచారం
4. అభ్యాసాలూ, ప్రశ్నలూ

ఇంతకు ముందు పాఠంలో ఉత్తరాలు రాసే పద్ధతులను గురించి తెలుసుకున్నారు. ఈ పాఠంలో ఉత్తరాల్లోని రకాలను తెలుసుకుంటారు.

ఉత్తరాల్లోని నాలుగు రకాలను ఈ పాఠంలో పరిచయం చేస్తున్నాం. అవి :

1. వ్యక్తిగత లేఖలు 2. వ్యాపార లేఖలు 3. వ్యవహార లేఖలు 4. సాంఘిక లేఖలు

BRAOU

## వ్యక్తిగత లేఖలు - నమూనాలు

గుంటూరు,
6 జూన్, 1983.

పూజ్యులైన నాన్నగారికి,

మీ కుమారుడు సుబ్బారావు నమస్కరించి వ్రాసేలేఖ. ఉభయకుశలోపరి.

మాకు సంవత్సరాంత పరీక్షలు జరుగుతున్నాయి. నేను సెలవుల్లో హైదరాబాదు రావడానికి ప్రయాణపు ఖర్చులకు నలభై రూపాయలు పంపవలసిందిగా ప్రార్థిస్తున్నాను.

చిత్తగించవలెను,
ఇట్లు,
మీ ప్రియమైన కుమారుడు,
మాదిరాజు సుబ్బారావు.

చిరునామా

శ్రీ మాదిరాజు రంగారావు,
334, ఎర్రమంజిల్ కాలనీ,
హైదరాబాదు (ఆం. ప్ర.)
పిన్‌కోడ్ : 500 004.

# సెలవు దరఖాస్తు

విజయవాడ,
ఆగస్టు 8, 1983.

ప్రధానాచార్యులు,
ఎస్. ఆర్. ఆర్ & సి. వి. ఆర్. ప్రభుత్వ కళాశాల,
విజయవాడ - 4.

అయ్యా,

నేడు మా యింటికి బంధువులు వచ్చారు. మా అమ్మగారు ఊళ్ళోలేరు. కాబట్టి మా నాన్నగారు నన్ను రెండు రోజులు సెలవు పెట్టమన్నారు.

దయతో 8, 9 తారీకులకు నాకు సెలవు ఇప్పించవలసిందిగా ప్రార్థిస్తున్నాను.

ఇట్లు,
తమ విధేయురాలు,
ఆర్. లలిత,
మొదటి బి. ఏ. తరగతి.

# వ్యాపార లేఖా రచన

వ్యాపార లేఖల్లో అవసరమైన వివరణ మాత్రమే ఉంటుంది. అదైనా సుబోధకంగా, సంగ్రహంగా ఉంటుంది. వర్తకులు అనేక వ్యాపకాల్లో తల మునకలవుతూ ఉంటారు. సుదీర్ఘమైన లేఖలు చదివే తీరికవారికి ఉండదు. కాబట్టి అప్రస్తుత విషయ ప్రస్తావన వ్యాపార లేఖల్లో ఉండదు. ఒక సంస్థ వ్యాపార అభివృద్ధికి అది రాసే లేఖల నాణ్యమూ, నైపుణ్యమూ ఎంతో తోడ్పడుతాయనటంలో సందేహం లేదు. ఉత్తమమైన వ్యాపార లేఖకు స్పష్టత, సందర్భశుద్ధి, పరిపూర్ణత, పొందిక, సౌజన్యత, ఆత్మీయత, యథార్థత, సంక్షిప్తత అనేవి ముఖ్యలక్షణాలు.

BRAOU

వ్యాపార లేఖల్లో ఈ కింద పేర్కొన్న భాగాలుంటాయి :

1. ముద్రించిన వ్యాపార సంస్థ చిరునామా
2. రిఫరెన్స్, తేదీ
3. ఎవరికి ఉత్తరం రాస్తున్నారో వారి పేరు, చిరునామా
4. పిలుపు
5. ప్రధాన విషయం
6. ముగింపు
7. రాసేవారి సంతకం, హోదా
8. జతపర్చే పత్రాల వివరాలు

### 1. ముద్రించిన వ్యాపార సంస్థ చిరునామా

వ్యాపార సంస్థ పేరు, చిరునామా పెద్ద అక్షరాలతో లేఖపై భాగంలో మధ్యగా మంచి డిజైన్‌తో, ఆ సంస్థ చిహ్నంతో సహా ముద్రిస్తారు. ఒక సంస్థ తయారు చేసే వస్తువుల సంగ్రహ వర్ణన, డైరక్టరు లేదా యజమాని పేరు, టెలిఫోన్ నంబర్లు మొదలైనవి శీర్షికలో ఉంటాయి.

### 2. రెఫరన్స్, తేదీ

వ్యాపార లేఖకు రెఫరెన్స్ నంబరు ఇస్తారు. దీని సహాయంతో ఏ లేఖ ఏ ఫైలుకు సంబంధించిందో తెలుస్తుంది. వ్యాపార లేఖల్లో శీర్షిక కింద మూడు నాలుగు పంక్తుల తరువాత ఎడమవైపున రెఫరన్స్ నంబరు ఇస్తారు.

రెఫరన్స్ నంబర్లు ఇవ్వడంలో పద్ధతులు ఏమీ లేవు. ఎవరి సౌకర్యాన్ని బట్టి వారు కొన్ని సూత్రాలు ఏర్పరుచుకుని రెఫరన్స్ నంబర్లు ఇచ్చుకుంటారు.

రిఫరెన్సు : ఎఫ్. టి. ఎఫ్/ 64/77

కె II డి. హెచ్/93/83

తేదీని ఈ విధంగా రాస్తారు :

మే 20, 1983.

3. ఎవరికి ఉత్తరం రాస్తున్నారో వారి పేరు, చిరునామా

లేఖ అందుకునే వారి పేరు, చిరునామా లేఖ ఎడమవైపు రెఫరన్స్ నంబరు కింద పిలుపుకు పైన రాస్తారు.

4. పిలుపు

వ్యాపార లేఖల్లో ఒక వ్యక్తి (మేనేజరు, వ్యవస్థాపకుడు మొదలైన వారిని) సంబోధిస్తున్నప్పుడు 'మహాశయా' అనీ, భాగస్వామ్య సంస్థను సంబోధిస్తున్నప్పుడు 'మహాశయులారా' (Sirs )అనే సంబోధిస్తారు.

లోపలి చిరునామాకు మూడు పంక్తుల కింద పిలుపు ప్రత్యేక పంక్తిలో ఉంటుంది. పిలుపు తర్వాత కామా (,) తప్పనిసరిగా పెడతారు.

5. ప్రధాన విషయం

ఇందులో ఒక విషయానికి సంబంధించి అంతకు పూర్వం ఉత్తర ప్రత్యుత్తరాలు జరిగి ఉంటే దానిని గురించి సంగ్రహంగా మొదటి పేరాలో పేర్కొంటారు. లేకుంటే విషయం పరిచయం చేస్తూ మొదటి పేరా రాస్తారు. వ్యాపార లేఖల్లో ప్రారంభ వాక్యాలు చాలా ఆకర్షణీయంగా ఉంటాయి.

తర్వాతి పేరాలో ముఖ్య విషయం గురించి స్పష్టంగా చెబుతారు.

BRAOU

6. ముగింపు

వ్యాపార లేఖల్లో 'భవదీయుడు' ఎక్కువ ప్రాచుర్యం పొందిన ముగింపు వాచకం. 'మీ విశ్వాస పాత్రుడు' 'తమ విధేయుడు' లాంటివి కూడా వాడుకలో ఉన్నాయి.

ముగింపు లేఖకు కుడివైపు చివర రాస్తారు.

7. సంతకం

ముగింపు కింద లేఖ రాసిన వారు సంతకం చేస్తారు. సంతకం కింద వివరణ కోసం విడి అక్షరాలతో సంతకం చేసిన వారి పేరు రాస్తారు. సంస్థ తరపున సంతకం చేస్తే, దాని కింద ఆ వ్యక్తి హోదాను పేర్కొంటారు. సంస్థ పేరు కూడా రాయవచ్చు.

8. జతపర్చే పత్రాల వివరాలు

వ్యాపార లేఖకు అదనంగా ఏమైనా కాగితాలు జతపర్చదలిస్తే, ఆ జతపర్చే కాగితాల వివరాలు లేఖ కింద ఎడమ వైపున తెలియ చేస్తారు.

## ఇతర అంశాలు

1. తాజాకలం (Post Script)

లేఖా రచన పూర్తి అయిన తర్వాత మరేమైనా అదనంగా చెప్పదల్చుకుంటే లేఖ చివర 'తాజాకలం' అని దాని విషయం వివరించి కింద సంతకం చేస్తారు. (తాజాకలం (తా. క.)అని ఉత్తరాల్లో లేఖ చివర రాస్తారు).

2. ఉత్తరాల నకళ్లు పంపడం (Copy to c.c.)

లేఖ నకళ్ళను వివిధ వ్యక్తులకు పంపుతూ ఉంటే ఆ విషయాన్ని లేఖ చివర ఎడమవైపు సూచిస్తారు.

3. ఉత్తరం చెప్పిన వ్యక్తి, టైపు చేసిన వ్యక్తి గుర్తింపు చిహ్నాలు (Identification marks)

లేఖ కింద ఎడమవైపు లేఖా పాఠాన్ని చెప్పినవారి పేరు, టైప్ చేసిన వ్యక్తి పేరు పొడి అక్షరాలతో గుర్తిస్తారు.

టి. ఎస్. ఆర్/వై. ఆర్

దీని వివరణ ఏమిటంటే టి. సుబ్బారావు అనే ఆఫీసరు ఉత్తరం చెప్పగా వై. రామచంద్ర అనే వ్యక్తి టైప్ చేశాడు.

# రకరకాల వ్యాపార లేఖలు

వ్యాపార లేఖలు అనేక విధాలు. కొటేషన్లు అడిగే లేఖలు, వాటికి సమాధానాలు ; ఆర్డర్లకు సంబంధించిన లేఖలు, వాటికి సమాధానాలు ; ఉద్యోగానికి దరఖాస్తులు, సమాధానాలు ; ఫిర్యాదులు, వాటికి సమాధానాలు - ఇలా ఎన్నో రకాల వ్యాపార లేఖలున్నాయి. ఈ కిందివి కొన్ని వ్యాపార లేఖల నమూనాలు.

కొటేషన్లు అడిగే లేఖలు

నారాయణరావ్ & బ్రదర్స్
(బట్టల వ్యాపారం)

BRAOU

ఫోన్ : 85-263

చిన్నబజారు,
నెల్లూరు.
మే 9, 1983.

రెఫ : ఇన్. 44/83

సర్వశ్రీ జమన్‌లాల్ & సన్స్,
45, గాంధీరోడ్డు,
అహమదాబాదు.

మహాశయులారా,

మీ దగ్గర లభించే నాణ్యమైన బట్టలకు సంబంధించిన వివరణలతో కూడిన ధరల పట్టీని మాకు త్వరగా పంపండి. మీరిచ్చే కమీషన్ వివరాలను గూడా తెలపండి.

మీరు ప్రకటించిన ధరలూ, కమీషన్ షరతులూ మాకు అందుబాటులో ఉంటే మేము వెంటనే ఆర్డర్లు పంపుతాము.

భవదీయుడు,
నారాయణరావ్ & బ్రదర్స్ తరపున,
ఎన్. విశ్వేశ్వరరావు,
మేనేజరు,

పై లేఖకు సమాధానం

జమన్‌లాల్ & సన్స్
(బట్టల టోకు వ్యాపారం)

ఫోన్ : 4480
గ్రామ్స్ : జమన్

45, గాంధీరోడ్డు,
అహమదాబాదు,
మే 20, 1983.

మీ రెఫరన్స్ : ఇన్ 44/83
మా రెఫరన్స్ : ఎ ఆర్/352
మేనేజరు,
నారాయణరావు & బ్రదర్స్,
చిన్నబజారు,
నెల్లూరు.

మహాశయా,

మీరు మే 9, 1983 నాడు రాసిన ఉత్తరం అందింది. చాలా సంతోషం. మీరు కోరినట్లే మా సచి[త్ర] ధరల పట్టీని ఈ ఉత్తరంతోపాటు జతచేర్చి పంపుతున్నాం.

మా సరుకులు నాణ్యమైనవి. మేము నిర్ణయించిన ధరలు అందరికీ అందుబాటులో ఉంటాయి.

మీకు కూడా మా సరుకులు బాగా నచ్చుతాయని ఆశిస్తున్నాం. త్వరగా మీ వద్ద నుంచి ఎక్కువ సరుకుల[ కో]గాను ఆర్డర్లు వస్తాయని ఆశిస్తున్నాం.

భవదీయుడు,
జమన్‌లాల్ & సన్స్ తరపున
కృష్ణకిశోర్,
మేనేజరు.

BRAOU

జత పర్చింది : ఒక ధరల పట్టీ

ఆర్డర్లకు సంబంధించిన లేఖలు

పుస్తకాల కోసం పుస్తక విక్రేతకు లేఖ

56, తిప్పరాజువారి వీధి,
నెల్లూరు,
జూన్ 29, 1983.

మేనేజరు,
నవోదయ పబ్లిషర్స్,
ఏలూరురోడ్డు,
విజయవాడ.

మహాశయా,

దయతో ఈ కింద పేర్కొన్న పుస్తకాలను వి.పి.పి. ద్వారా వీలైనంత త్వరగా పై పేర్కొన్న చిరునామా[కు] పంపగోరుతాను.

1. స్మృతి బింబాలు (రచన : సంజీవదేవ్) 2 కాపీలు
2. ఆంధ్రసాహిత్య చరిత్ర సంగ్రహం (రచన : ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనం) 2 కాపీలు

ఇట్లు,
మీ విశ్వాసపాత్రుడు,
ఎస్. సుధీర్,

పైలేఖకు సమాధానం

నవోదయ పబ్లిషర్స్

ఫోన్ :633
మా రెఫరెన్స్ ఇ. ఎల్/733

ఏలూరురోడ్డు,
విజయవాడ,
జూలై 7, 1983.

ఎమ్. సుధీర్,
56, తిప్పరాజువారివీధి,
నెల్లూరు.

మహాశయా,

మీరు జూన్ 29, 1982 నాడు పంపిన ఆర్డర్లకు ధన్యవాదాలు. అయితే మీరు కోరిన పుస్తకాలు మావద్ద రెడీస్టాకు లేవని తెలపటానికి చింతిస్తున్నాము.

ఇతర ప్రచురణ కర్తలవద్ద వాటిని సేకరించటానికి ప్రయత్నిస్తాము. అవి అందిన వెంటనే మీకు తెలుపుతాము.

భవదీయుడు,
నవోదయ పబ్లిషర్స్ తరపున,
ఎం. రామమోహనరావు,
మేనేజరు.

ఉద్యోగానికి దరఖాస్తులేఖ

విశాఖపట్నం,
జూలై 23, 1983.

ఎస్. రాజశేఖర్,
23-7-11 దూడావారి వీధి,
విశాఖపట్నం.

BRAOU

మేనేజరు,
కొఠార్ మిల్స్,
ఆదోని (కర్నూలు జిల్లా).

మహాశయా,

నేటి ''ఆంధ్రప్రభ'' దిన పత్రికలో అకౌంటెంట్ ఉద్యోగం కోసం మీరు వేయించిన ప్రకటన చూశాను. నేను అభ్యర్థిగా దరఖాస్తు పంపుకుంటున్నాను.

నేను 1977లో విశాఖపట్నం వాసిరెడ్డి కృష్ణ ప్రభుత్వ కళాశాల నుంచి బి. కాం. ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణుడయ్యాను. ఇంగ్లీషు టైపు హైయర్ పాసయ్యాను. వెంటనే విశాఖపట్నం సమీపంలోని విజయ స్పిన్నింగ్ మిల్స్‌లో గుమస్తాగా చేరాను. కాని ఆ సంస్థ చిన్నది. కాబట్టి నాకు ప్రమోషన్ ఇచ్చే స్థితిలో లేదు. మీ కంపెనీ చాలా పెద్దది. కాబట్టి నాకు ప్రమోషన్ అవకాశాలుంటాయని భావించి మీకు దరఖాస్తు చేస్తున్నాను.

నా వయస్సు 29 సంవత్సరాలు. నాకు ఏ విధమైన దురలవాట్లు లేవు. నా సామర్థ్యాన్ని గురించి విజయా స్పిన్నింగ్ మిల్స్ వారిని వాకబు చేయవచ్చు.

నాపై దయఉంచి మీ కంపెనీలో పని చేసే అవకాశం కల్పించండి. నా విధులను అధికారుల సంతృప్తిమేరకు చక్కగా నిర్వర్తిస్తానని మనవి చేసుకుంటున్నాను.

ఈ దరఖాస్తుతో బి. కాం. సర్టిఫికేట్ నకలు, యోగ్యతా పత్రాల నకళ్ళు జత పరుస్తున్నాను.

ఇట్లు,
తమ విధేయుడు,
ఎస్. రాజశేఖర్.

ఉద్యోగానికి పెట్టుకున్న దరఖాస్తుకు జవాబు

కొఠారీ మిల్స్

ఫోన్ : 25362
మా రెఫరన్స్ : పి. ఎ./135

ఆదోని,
(కర్నూలు జిల్లా, ఆం. ప్ర.)
ఆగస్టు 16, 1983.

ఎస్. రాజశేఖర్,
23-7-11, దూడావారి వీధి,
విశాఖపట్నం.

అయ్యా,

మా కంపెనీలో అకౌంటెంట్ ఉద్యోగం కోసం మీరు జూలై 23,1983న పెట్టుకున్న దరఖాస్తుని పరి లించాము. ఆ ఉద్యోగానికి మిమ్మలను నియమించడానికి నిర్ణయించామని తెలియజేయడానికి సంతోషిస్తున్నాము.

అయితే మొదట ఒక సంవత్సరం పాటు మిమ్మలను తాత్కాలిక ప్రాతిపదిక మీద నియమిస్తున్నాము. మీ విధుల నిర్వహణ మాకు సంతృప్తికరంగా ఉంటే మీ నియామకాన్ని ఖాయం చేస్తాము. తాత్కాలిక కాలంలో మీ జీతం రూ. 1000/-. ఖాయం అయిన తర్వాత రెగ్యులర్ స్కేల్ ఇస్తాము. మీరు ఒక్క నెలలోపుగా ఉద్యోగంలో చేరతారని ఆశిస్తున్నాము.

వెంటనే మీ సమ్మతి తెలపండి.

భవదీయుడు,
కొఠార్ మిల్స్ తరపున
ఆర్. విజయ కిశోర్‌లాల్,
మేనేజరు.

BRAOU

ఫిర్యాదు లేఖలు

పంపిన వస్తువులు పాడైనవని ఫిర్యాదు చేయడం

76, బజారువీధి,
అనంతపురం,
జూన్ 20, 1983.

మేనేజరు,
ఓరియంటల్ కంపెనీ,
14, సామరంగం చౌక్,
విజయవాడ.

అయ్యా,

మీరు గత వారం రైల్వే పార్శిలులో పంపిన మూడు సీలింగ్ పంకాలు అందాయి. పార్శిలును ఊడదీసి చూశాను. మూడు పంకాలూ బాగా దెబ్బ తినిన స్థితిలో కనిపించాయి. వాటిని ఉపయోగించి చూశాను. అవి పని చేయడంలేదని తెలియజేయడానికి విచారిస్తున్నాను.

కాబట్టి మూడు పంకాలను మీకు తిప్పి పంపటానికి మీ అనుమతి కోసం ఎదురు చూస్తున్నాను. నాకు మంచి స్థితిలో ఉన్న మూడు వేరే పంకాలను సరియైన పద్ధతిలో పార్శిలు చేసి దయతో పంపవలసిందిగా అభ్యర్థి స్తున్నాను. ఈ విషయంగా మీరు అంగీకరిస్తారని ఆశతో ఎదురు చూస్తున్నాను.

ఇట్లు,
భవదీయుడు,
వీరం వెంకటేశ్వరరావు.

పై ఉత్తరానికి సమాధానం

ఓరియంటల్ కంపెనీ

ఫోన్ : 6543
మా రెఫరన్స్ : 435/83

14, సామరంగం చౌక్,
విజయవాడ,
జూలై 2, 1983.

శ్రీ బీరం వెంకటేశ్వరరావు,
76, బజారు వీధి,
అనంతపురం.

అయ్యా,

మీరు జూన్ 25న రాసిన ఉత్తరం అందింది. మీకు పంపిన మూడు పంకాలూ పాడైన స్థితిలో మీకు అందాయని తెలుసుకోవటానికి చింతిస్తున్నాము. ఈ విషయంగా దయతో రైల్వే అధికారులకు ఫిర్యాదు చేయండి. వారి తనిఖీ అయిన తర్వాత మీరు ఆ పంకాలను మాకు తిప్పి పంపండి. మీ పార్సిల్ అందిన వెంటనే వేరే పంకాలు మూడు పంపుతాము.

భవదీయుడు,
ఓరియంటల్ కంపెనీ తరపున,
సం॥ ఏ. నటరాజశేఖర్,
సేల్స్ మేనేజరు.

BRAOU

విచారణలు, సర్క్యులర్లు, క్లెయిమ్‌లు, సరుబాట్లు మొదలైన ఎన్నో విషయాలకు సంబంధించిన రకరకాల వ్యాపార లేఖలు ప్రాచుర్యంలో ఉన్నాయి. బాంకింగ్, ఇన్సూరెన్స్ మొదలైన రంగాలకు సంబంధించిన వ్యాపార లేఖలు కూడా ఉన్నాయి. వాణిజ్యశాస్త్రం చదివే విద్యార్థులు వాటి సూక్ష్మపరిశీలన చేస్తారు. వ్యాపార లేఖల లక్షణాలే గాక వాటి స్వరూప స్వభావాలను స్థూలంగా పరిచయం చేయడం ఈ పాఠం ఉద్దేశం.

## వ్యవహార లేఖా రచన

ప్రభుత్వ సంబంధంగా జరిగే ఉత్తర ప్రత్యుత్తరాలను వ్యవహార లేఖా రచన అంటారు. వ్యాపారలేఖల్లో మల్లే యథార్థత, పరిపూర్ణత, స్పష్టత, సంక్షిప్తత, సౌజన్యత, సరళత_అనేవి వ్యవహార లేఖల ముఖ్యమైన లక్షణాలు. ప్రభుత్వ పరంగా జరిగే వ్యవహారిక లేఖలు ముఖ్యంగా పన్నెండు రకాలు.

**1.** అధికారిక లేఖలు (Official letters), **2.** అర్ధ అధికారిక లేఖలు (Demi-offciial letters) **3.** మెమోరాండం (Memorandum) **4.** ఎండార్స్‌మెంట్ **5.** నోటిఫికేషన్ **6.** సర్క్యులర్ **7.** విజ్ఞప్తులు (Communiques) **8.** Resolutions **9.** Despatch **10.** టెలిగ్రాములు **11.** Memorials **12.** Proclamation

వ్యవహార లేఖల ముఖ్యభాగాలు

1. లేఖరాసేవారి కార్యాలయం పేరు లేదావిభాగం పేరు లేఖపై భాగంలో మధ్యలో ఉంటుంది.

2. రెఫరన్స్ నంబరు. దీన్ని మూడు విధాలుగా రాస్తారు.

కొందరు లేఖ పైభాగం మధ్యగా కార్యాలయం పేరు పైన రాస్తారు. మరికొందరు కార్యాలయం పేరు కింద మూడు నాలుగు పంక్తుల తరువాత ఎడమ వైపు రాస్తారు. ఇంకా కొందరు పిలుపు రాయటానికి పూర్వం దానిపైభాగంలో రాస్తారు. చివరి రెండు పద్ధతుల్లో రెఫరన్స్ నంబరుకు ఎదురుగా కుడివైపున తేదీ వేస్తారు. మొదటి పద్ధతిలో కార్యాలయం స్థానం కింద కుడివైపున తేదీ వేస్తారు.

ఉదాహరణలు: మొదటి పద్ధతి

1) సం. ఎఫ్ 1-1/83-84/ ఎన్ టి ఎస్ యు-11/ +2 (4)

జాతీయ ప్రతిభాన్వేషణ శాఖ,
జాతీయ విద్యా పరిశోధన మండలి,
శ్రీ అరవిందో మార్గ్, న్యూ ఢిల్లీ-16,
తేదీ............

రెండో పద్ధతి

ఆంధ్ర విశ్వవిద్యాలయం

2 సం. సి డి సి/6566 (ఎ)/81

వాల్తేరు,
మే 16, 1983.

మూడో పద్ధతి

ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ బోర్డు

పరీక్షల నిర్వహణాధికారి,
ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ బోర్డు ఆంధ్రప్రదేశ్,
నాంపల్లి,
హైదరాబాద్-500 001.

శ్రీ ఆర్. సుబ్బారావు
ప్రభుత్వ కళాశాల
నల్గొండ

BRAOU

ఆర్ సి. నం. 6804/బి2/1983 తేదీ 20-3-83.

అయ్యా/అమ్మా,

గమనిక : అధికారిక లేఖలలో పిలుపు తర్వాత రెఫరన్స్ నంబరు ఇచ్చే పద్ధతికూడా ఉంది.

3. లేఖ రాసే వారి పేరు, హోదా

లేఖ ఎడమవైపు లేఖరాసే వారిపేరు, డిగ్రీలు రాస్తారు. దానికింద హోదా రాస్తారు. తర్వాత ఊరి పే రాస్తారు.

ఎమ్. శ్రీధర్, ఎం.ఎ., బి.ఎల్.,
కార్మిక కమీషనర్, ఆంధ్రప్రదేశ్,
హైదరాబాద్

4. లేఖ అందుకునే వారి పేరు, చిరునామా

అనేక సందర్భాల్లో హోదా పేరు మాత్రం రాస్తారు. వ్యక్తి అసలు పేరు ప్రస్తావించరు.

5. పిలుపు

అధికార ఉత్తర ప్రత్యుత్తరాల్లో ఆర్యా, అయ్యా/అమ్మా, అనేవి ఎక్కువ ప్రాచుర్యంలో ఉన్నాయి అర్ధ అధికార లేఖల్లో ప్రియమైన శ్రీరావ్, ప్రియమైన డాక్టరు గారూ, ప్రియమైన శర్మాజీ, ప్రియమైన రమేష్ ఇలాంటి సంబోధనలుంటాయి.

6. విషయ సూచన

పిలుపు తర్వాత విషయానికి సంబంధించిన సంగ్రహ సూచన రాస్తారు. అర్ధ అధికారిక లేఖలో విషయ సూచన ఉండదు. పిలుపు తర్వాత కామా ( , ) తప్పక ఉంటుంది.

7. ప్రధాన విషయం

విషయానికి సంబంధించి అంతకుముందు ఉత్తర ప్రత్యుత్తరాలు జరిగిఉంటే ఆ లేఖ సంఖ్య, తేదీ మొదలైన వాటని పేర్కొని, మీ ఫలానా సంఖ్య గల లేఖలోని విషయంగా ......అనే విధంగా తొలి పేరాలో రాస్తారు. లేకుంటే విషయాన్ని పరిచయం చేస్తూ ప్రధాన విషయంలోని మొదటి పేరా సాగుతుంది తరువాతి పేరాలలో చెప్పదల్చుకున్న విషయం చెబుతారు.

8. ముగింపు

ముగింపులో 'భవదీయ' శబ్దం ఎక్కువ ప్రాచుర్యంలో ఉంది. అయితే అర్ధఅధికారిక లేఖల్లో "మీ విశ్వాస పాత్రుడు" అనే ముగింపు ఉంటుంది.

9. సంతకం

'భవదీయ' శబ్దం కింద లేఖా రచయిత తన సంతకం చేస్తారు. సంతకం కింద విడి అక్షరాలతో సంతకం చేసిన వారి పేరు రాస్తారు. అప్పుడప్పుడు అసలు అధికారికి బదులు మరో అధికారి సంతకం చేస్తాడు. అలాంటి పరిస్థితుల్లో హోదాకి తరువాత 'తరపున'_ అని రాస్తారు.

10. లేఖ చివర ఎడమ వైపున 'జతపర్చే కాగితాల' వివరాలు ఇస్తారు. ఇంకా కింద ఎడమ వైపున టైప్ చేసిన వ్యక్తి పేరును పొడి అక్షరాలతో పేర్కొంటారు.

BRAOU

అధికారిక లేఖ

ఉదాహరణకు

సంఖ్య.........

ఉపకార్యదర్శి,
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం,
హైదరాబాదు.

పోలీసు ఇన్స్పెక్టర్ జనరల్,
ఆంధ్రప్రదేశ్,
హైదరాబాద్.

హోం (పోలీసు-క) విభాగం          హైదరాబాదు, తేదీ.........

విషయం          ఇన్స్పెక్టర్ల ప్రమోషన్ గురించి

ఆర్యా,

పై పేర్కొన్న విషయం గురించి మీ లేఖ సంఖ్య......,తేదీ......ని పురస్కరించుకుని, ఆ విషయం ఇంకా ప్రభుత్వం పరిశీలనలో ఉందని ఆదేశానుసారం మీకు తెల్పడమైంది.

భవదీయ,

................. ...

ఉపకార్యదర్శి.

## అర్ధ అధికారిక లేఖ

ప్రభుత్వ కార్యాలయాలకు వ్యక్తిగత లేఖలాగా రాసే లేఖను అర్ధ అధికారిక లేఖ అంటారు. ఇలాంటి లేఖ ఈ కింది పరిస్థితుల్లో రాస్తారు.

1) రహస్యంగా ఉంచదలచిన విషయాలు ఉన్నాయనుకున్నప్పుడు
2) త్వరగా జరగాలనుకున్న ప్రభుత్వ విషయాలున్నపుడు

అర్ధ అధికారిక లేఖలు రాసేటప్పుడు కింద పేర్కొన్న విషయాలను గుర్తించుకోవాలి.

1) ఊరిపేరు, తేదీ కుడివైపు పై భాగంలో రాస్తారు.
2) పిలుపులో 'ప్రియమైన' లేదా 'ప్రియమైన(శ్రీ)' ప్రయోగిస్తారు.
3) అర్ధ అధికారిక లేఖల్లో రెఫరన్స్ నంబరు, ఎడమవైపు పై భాగంలో రాస్తారు.
4) అధికారి స్వయంగా సంతకం చేస్తారు. ఇతర ఉద్యోగుల సంతకాలుండవు.
5) అధికారి తన సంతకం కింద హోదా మొదలైన వాటిని రాయరు.
6) అర్ధ అధికారిక లేఖలను అధికారిక లేఖల్లో ఉదహరించరు.
7) ముగింపులో 'భవదీయ' లేదా 'శుభాకాంక్షి' లాంటివి రాస్తారు.
8) ఉత్తరం అందుకునేవారి పేరూ, అడ్రసు లేఖ ఎడమవైపు కిందభాగంలో రాస్తారు.

### అర్ధ అధికారిక లేఖ

BRAOU

హోమ్ (పోలీసు శాఖ) విభాగం,
హైదరాబాదు,
ఫిబ్రవరి, 1983.

అర్ధ అధికారిక లేఖ సంఖ్య.........

ఉపకార్యదర్శి

ప్రియమైన శ్రీ ప్రసాద్,

భారత ప్రభుత్వ లేఖ

సంఖ్య ... , తేదీ .... , లో పోలీసు అధికారులను భారతప్రభుత్వ సర్వీసులో నియమించడాన్ని గురించి మీరు ఒక లేఖ పంపారు. దీనికి సంబంధించిన భారత ప్రభుత్వ ఉత్తరువును దయతో త్వరగా పంపండి ఈ విషయంగా మీ అభిప్రాయాన్నిగూడా తెలియజేయండి.

మీ విశ్వాస పాత్రుడు,
............

శ్రీ ఎమ్. ఆర్. ప్రసాద్,
పోలీసు ఇన్స్పెక్టర్ జనరల్,
ఆంధ్రప్రదేశ్,
హైదరాబాద్.

మెమోరాండం

ఈ కింది పరిస్థితులలో మెమోరాండం ఉపయోగిస్తారు.

1) విషయం సర్వసాధారణమైనది అయినప్పుడు

2) కొన్ని సూచనలు అందివ్వదలచినపుడు

పిలుపుగానీ ముగింపుగానీ మెమోరాండంలో ఉండదు. మెమోరాండం ప్రథమ పురుషలో ఉంటుంది. సాధారణంగా మెమోరాండంలో ఎక్కువ పేరాలుండవు. విషయం సంక్షిప్తంగా ఉంటుంది.

సాధారణంగా మెమోరాండంలో ఆఫీసరు సంతకం చేయరు. ముఖ్యగుమస్తాగానీ మరో ముఖ్యవ్యక్తిగానీ సంతకం చేస్తారు. అధికారిక లేఖల్లోమల్లే ఇందులో రెఫరన్సు నంబరు, తేదీ ఉంటాయి. ఉత్తరం అందివలసిన వ్యక్తి పేరూ, అడ్రసూ లేఖ కింద ఎడమవైపున ఉంటుంది.

ఉన్నత విద్యా శాఖ డైరక్టరు కార్యాలయం,
ఆంధ్రప్రదేశ్, హైదరాబాద్.

నెం.

మెమోరాండం

విషయం : పనికి ఆటంకం

కొందరు బయటివ్యక్తులు ఈ కార్యాలయానికివచ్చి గుమస్తాల పక్కనకూర్చొని గంటల తరబడి ప్రసంగాలు సాగిస్తూ పనికి ఆటంకం కలిగిస్తున్నట్లు గమనించడమైంది. భవిష్యత్తులో ఇలాంటి వ్యక్తులు రాకుండా నిరోధించవలసిందిగా కోరడమైంది.

BRAOU

సం॥............
ఉన్నత విద్యాశాఖ డైరక్టర్ తరపున,
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం,
హైదరాబాదు.

ఎండార్స్‌మెంట్

ఇతర అధికారుల సూచనలు లేదా అంగీకారంకోసం అధికారులు పంపే లేఖలను ఎండార్స్‌మెంట్ అంటారు. ఎండార్స్‌మెంటు ప్రథమ పురుషలో ఉంటుంది. ఇందులో ఆర్యా, భవదీయులాంటివిఉపయోగించరు. అయితే రెఫరన్సు నంబరు, తేదీ మొదలైనవి రాస్తారు :

సంఖ్య 325 హైదరాబాదు,
మార్చి 6, 1983.

విషయం :—

రిఫెరెన్సు :—

నకలు విజయవాడ పోస్టు మాస్టరుగారికి సూచనకోసం పంపడమైంది

సంతకం............
సూపరింటెండెంట్,
ఆంధ్రప్రదేశ్ సర్కిల్,

శ్రీ గారికి

నోటిఫికేషన్

గెజిట్‌లోగానీ, వార్తాపత్రికల్లోకానీ వీటిని ప్రచురిస్తారు. ప్రజానీకానికి సూచనలివ్వటం, లేదా విషయా తెలపటం వీటి ఉద్దేశం. ఇది ప్రథమ పురుషలో ఉంటుంది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం,
హైదరాబాదు, జనవరి 4, 1983.

సంఖ్య ఎచ్. 11430/నియుక్త/83 శ్రీ క॥ఖ॥గ॥ ఉన్నత విద్యాభ్యాసానికి వెళ్ళిన కారణంగా శ్రీ..... గ॥ గారిని తాత్కాలికంగా సిటీకాలేజీ, హైదరాబాదులో ఆర్థికశాస్త్రాధ్యక్షులుగా జనవరి 6, 1983నుంచి నియమించ మైంది.

సంతకం............
ఉన్నత విద్యా శాఖ డైరక్టరు.

సర్క్యులర్లు

అధికారులకుగానీ, ప్రభుత్వకార్యాలయాలకుగానీ కొన్ని సూచనలూ, ఆదేశాలూ ఇవ్వవలసి వచ్చినప సర్క్యులర్లు పంపుతారు. ఒకే విషయం గురించి చాలా మంది అధికారుల, వ్యక్తుల అభిప్రాయాన్ని తెలుసుకోవ వచ్చినపుడు సర్క్యులర్లు జారీ చేస్తారు. భారతప్రభుత్వం రాష్ట్రప్రభుత్వాలకు, రాష్ట్రప్రభుత్వాలు తమ అధీనం ఉండే శాఖాధిపతులకు సర్క్యులర్లు జారీచేస్తూ ఉంటాయి. సర్క్యులర్లు ప్రథమ పురుషలో ఉంటాయి.

సర్క్యులర్ లేఖకూ, మామూలు అధికారిక లేఖకు ఉన్న తేడా ఏమిటంటే అధికారిక లేఖను నిర్దిష్టమైన అ కారికి రాసారు. సర్క్యులర్ లేఖను ఎక్కువ మందిని ఉద్దేశించి రాసారు.

సర్క్యులర్ లేఖలను సాధారణంగా సైక్లోస్టైల్ చేయిస్తారు. సంఖ్య ఎక్కువగా ఉంటే అచ్చువేయించట కూడా కద్దు. సర్క్యులర్‌ను అందుకునేవారి అడ్రసు లోపల సైక్లోస్టైల్ చేయరు. సర్క్యులర్‌ను కవరులో పె సప్పుడు ఒక వేళ లోపలి అడ్రసు రాసినా చేతితో రాస్తారు లేదా టైప్ చేస్తారు. పిలుపు విషయంలోకూడా సర్క్యు లర్ లేఖలకూ, మిగతాలేఖలకూ వ్యత్యాస ముంటుంది. సర్క్యులర్ లేఖలలో స్త్రీలకూ పురుషులకు వర్తించే పిలు ఉపయోగిస్తారు. ఉదా॥ అర్యా; సర్క్యులర్ రాసేవారి సంతకం సిరాతో ఉండనవసరం లేదు.

ఇవి కాక Communiques, Resolutions, Despatch, Telegrams, Memoriol Proclamation—అనే వివిధ రకాల అధికార లేఖలు కూడా ఉన్నాయి.

BRAOU

వీటి సంగ్రహ వివరణ

## Communiques

ప్రముఖమైన వార్తాపత్రికలలో ప్రజోపయోగం కోసం ప్రచురించే విజ్ఞప్తులే Communiques.

## Resolutions

ప్రభుత్వం ఒక ముఖ్యమైన విషయంలో సూచన ఇస్తే, లేదా నిర్ణయం చేస్తే దాన్ని Resolutic అంటారు. ఇది కూడా ప్రథమ పురుషలో ఉంటుంది. దీన్ని రాసేటప్పుడు లేఖ పై భాగాన ప్రభుత్వం పేరు శా శాఖపేరు, దాని తర్వాత Resolution, ఆ తర్వాత రెఫరన్స్ నం. తేదీ ఉంటాయి. దానిపై ఆ శాఖ కార్ దర్శి సంతకం చేస్తారు.

## Despatch

భారతప్రభుత్వం, రాష్ట్రప్రభుత్వాలకు మధ్య జరిగే ఉత్తర ప్రత్యుత్తరాలను Despatch అంటా ఇందులో 'మేము' అనేశబ్దాన్ని ఉపయోగిస్తారు. 'నేను' అనే శబ్దం వాడరు.

## Telegrams

అతి ముఖ్యమైన విషయాలకు ప్రభుత్వకార్యాలయాలలో Telegrams పంపుతారు. పిలుపు సౌజన్య పూరితమైన ముగింపు ఇందులో ఉండవు. ఈ Telegrams నకళ్ళు ఆఫీసులో భద్రపరస్తారు.

## Memorials

అప్పుడప్పుడు కొందరు ప్రముఖ వ్యక్తులు రాష్ట్రపతి లేదా గవర్నరుకు కొన్ని ముఖ్య విషయాలపై తమ అభిప్రాయాలు నివేదిస్తారు. వాటిని Memorials అంటారు.

## Proclamation

కొన్ని అత్యవసర పరిస్థితుల్లో రాష్ట్ర ఉన్నతాధికారి ప్రకటించే ప్రకటన.

# సాంఘిక లేఖలు

వార్తాపత్రికల్లో ప్రచురిత మయ్యే సంపాదకీయ లేఖలు, వినతి పత్రాలు, ఆహ్వానలేఖలు - ఇలాంటివన్నీ సాంఘిక లేఖల కిందికి వస్తాయి. సాంఘిక ప్రయోజనాన్ని ఆశించేవి సాంఘిక లేఖలు.

సంపాదకీయ లేఖలు (letters to editor)

ఈ లేఖల్లోని విషయం ఏ ఒక్కరికో సంబంధించిగాక సర్వసామాన్యంగానో కనీసం ఒక వర్గం ప్రజల అభిప్రాయానికి సంబంధించిందిగానో ఉంటుంది. విషయం సాధ్యమైనంత సంగ్రహంగా ఉంటుంది. అంటే దాదాపు "కాలం"లో ఏ నాల్గో భాగానికో సరిపోదగిందిగా ఉంటుంది 'కాలం' అంటే పేజీలోని కొంత భాగం. పత్రికా లేఖలో 'మహాశయా" అనో "అర్యా" అనో పిలుపు ఉంటుంది. లేఖ చివరిలో రాసినవారి పేరు,ఊరు,తేది రాస్తారు. సాధారణంగా పత్రికలకు పంపే లేఖల్లోని విషయాలు ఆహార సమస్య, భాషా విషయం, రాకపోకలు మొదలైన సమస్యలు. లేఖలోని భాష సర్వజన పఠనార్హమై ఉండాలి. భాష, శీర్షిక మొదలైన వాటిని మార్చి ప్రచురించే హక్కు సంపాదకులకు ఉంటుంది. విషయాన్ని మార్చే హక్కులేదు.

రాసిన ఉత్తరాన్ని పరిచయించేసే ఉత్తరం (covering letter) లో కుడివైపు పంపబడే స్థలం, తేదీ రాస్తారు. దీనికి అనుబంధంగా లేఖా విషయాన్ని జత పరస్తారు. లేఖా విషయం చివర పంపేవారి పూర్తి చిరునామా రాస్తారు. ఈ లేఖలను బుక్‌పోస్టులో పంపవచ్చు. కవరుపై 'FOR PRESS' అనీ 'BOOK-POST' అనీ రాస్తారు. వీటి కింద పత్రిక చిరునామా రాస్తారు. కింద కొన్ని నమూనాలున్నాయి. వీటిని ఆధారంగా తీసుకుని లేఖా రచన చేసి పత్రికలతో పరిచయం చేసుకోవచ్చు.

రాసిన ఉదంతాన్ని పరిచయంచేసే ఉత్తరం

ఠి, పిధి,

సంపాదకులు,
దిన పత్రిక

మహాశయా,

దయతో దీంతో జతచేర్చిన విషయాన్ని తమ ప్రముఖదినపత్రికలో లేఖల శీర్షిక కింద ప్రచురించవలసిందిగా అభ్యర్థిస్తున్నాను.

భవదీయుడు,

BRAOU

# సంపాదకీయ లేఖలు

## రైల్లో చోటు దొరకాలంటే

సాధారణంగా పదహారు బోగీలుండే మెయిల్ ఎక్స్‌ప్రెస్ రైళ్లలో ఒకటో రెండో, రెండవ తరగతి మామూలు కంపార్ట్‌మెంటులుంటాయి. మిగిలినవన్నీ రిజర్వుడు పెట్టెలే. రిజర్వేషన్ లేని బోగీలలో జల, మల, మూత్ర స్తంభన విద్యలు తెలిసినవారే ప్రయాణం చేయగలరు. కూర్చోడానికో నించోడానికో రవంత చోటు దొరికితే అదే పదివేలు. దోవకడ్డంగాను, టాయిలెట్లలో సైతం జనం కిక్కిరిసిపోయి వుంటారు. కాస్త సుఖంగా కూర్చోవాలంటే రిజర్వుడ్ బోగీల్లోనే అది సాధ్యం. అందుకోసం కండక్టర్లను సంతృప్తిపరచాలి. అలా కూడా ఎక్కువ మందికి వీలుకాదు. రైల్వేలో ఈ పక్కదారులరికట్టాలంటే రైళ్ళలో ప్రయాణించేవారిలో ఎక్కువ మందికి కనీసం కూర్చోనయినా ప్రయాణంచేసే వీలుకల్పించాలి. అన్నిబెర్తులుండే స్లీపరు కోచ్ లేకుండా కూర్చునే వీలుకలిగిన చైరుకారుబోగీలను ప్రవేశపెట్టాలి. కేవలం ముగ్గురు కూర్చోడానికే వీలు కల్పిస్తున్న ప్రస్తుత టూటైరుబోగీలు త్రీటైరు బోగీలలో సీట్ల ఏర్పాట్లను పునర్వ్యవస్థీకరించినట్లయితే ప్రతి బోగీలో వందమందికి పైగా ప్రయాణించవచ్చు. వారందరినుంచి సిటింగు చార్జీలు యథాప్రకారం వసూలుచేయవచ్చు. తద్వారా రైల్వేలకు ఆదాయమూ వస్తుంది. ప్రయాణికులకు సౌకర్యంకూడా లభిస్తుంది. కేవలం రైల్వే ఉద్యోగులేకాక కొన్ని ప్రజాసేవసంస్థల తోడ్పాటు తీసుకున్నట్లయితే రైళ్ళలో టిక్కెట్‌లేని ప్రయాణం, సిబ్బంది అవినీతి కార్యకలాపాలను నిరోధించవచ్చు.

ఆర్. వి. రమణ,
రాజాం,
శ్రీకాకుళంజిల్లా
['ఈనాడు' 29_6_83]

## చిల్లర డబ్బుల కొరత

BRAOU

చిల్లర కొరత దేశమంతటా ఒకేవిధంగా వ్యాపించి ఉన్నది. బస్సులో చిల్లరకొరత కారణంగా కండక్టర్ చిల్లర పైసలు ఇవ్వడంలేదు. హోటళ్ళలో కాఫీ, టీలకు తగిన చిల్లర లేనిచో వాటిని సేవించే వీలులేదు. ఇంకా అనేక సందర్భములలో ఈ చిక్కు నేడు ప్రతీ మనిషికి ఎదురవుతున్నది. ఇటీవల నరసాపురంలో రైల్వే టికెట్లు కొనుటకు చిల్లర లేనిచో టికెట్లు లేవని ఒక వార్త ప్రచురితమయింది. ఈ విధంగా చిల్లర కొరతను గురించి పత్రికలలో వార్తలు చూస్తున్నాము. ఇదే అదనుగా తీసుకొని కొంతమంది కమీషన్ పై చిల్లర వ్యాపారము చేస్తూ ఉన్నారు. ఇది చిన్న సమస్యగా కనిపించినప్పటికీ, ప్రతి మనిషి ఈ చిల్లర యిబ్బందికి గురి కావడం తప్పటంలేదు. అందుచేత రిజర్వుబ్యాంక్ నుండి తగుపాళ్ళలో చిల్లర నాణముల విడుదలకు ప్రభుత్వము తగుచర్య తీసుకొంటుందని ఆశిస్తున్నాను.

తిమ్మాపురము (విశాఖపట్నంజిల్లా) జి. సత్యనారాయణ.
[ఆంధ్రప్రభ దినపత్రిక 26_6_83]

## విభిన్న నిబంధనలు

నాగార్జున విశ్వవిద్యాలయం బి. ఇడి కామన్ ఎంట్రన్స్ పరీక్షకు హాజరవడానికి డిగ్రీలో 40 శాతం మార్కులు వచ్చినవారే అర్హులు కాగా, ఆంధ్ర విశ్వవిద్యాలయంవారి ఎంట్రెన్స్ పరీక్షకు హాజరుకావడానికి డిగ్రీ ఉత్తీర్ణతచాలు. ఒకేరాష్ట్రంలో వున్న ఆంధ్ర, నాగార్జున విశ్వవిద్యాలయాలు బి. ఇడి. ఎంట్రన్స్‌పరీక్షకు ఈ విధంగా విభిన్న నిబంధనలు పెట్టుట అనుచితం. నాగార్జున విశ్వవిద్యాలయం కూడా డిగ్రీ పాసయిన వారందరూ ఎంట్రన్స్ పరీక్షకు హాజరుకావడానికి అర్హులుగా నిర్ణయించి తిరిగి పరీక్షలు జరపాలని కోరుతున్నాను.

ఆవుల రామమోహనరావు
మురళీపురం, కృష్ణాజిల్లా.
[ఆంధ్రజ్యోతి దినపత్రిక,
12_6_1983]

## వరకట్నం నేరాలు.

జూన్ ఏడవతేదీ "ఆంధ్రజ్యోతి దినపత్రికలో వరకట్నం నేరాలకు ఉరిశిక్ష సమంజసమేనా ? అన్న వ్యాసం పి. వి. మీనాక్షి చాలా సమంజసంగా వ్రాశారు.

నిజమే. ప్రభుత్వదృష్టికి వచ్చే కేసులు అతి తక్కువ. ఎన్ని లేత బ్రతుకుల నిండు ప్రాణాలు ఇలా బలై పోతున్నాయో తల్చుకొంటే మనమెంత బార్బేరియన్లమో నన్న జుగుప్స, అసహ్యం కలుగుతుంది మన సంఘంమీద. ఈ దురాచారం భారతదేశ మంతటా హిందూ, ముస్లిం, క్రైస్తవ, సిక్కు, పార్శీ మొదలుగాగల ప్రతి మతం లోను బాగా వేళ్ళూనుకుపోయింది.

వ్యాసం చివర్న మీనాక్షిగారు "సంఘ సంస్కరణా రంగంలో చైతన్యం రావాలి. మహిళా సంఘాలు కృషి చెయ్యాలి" అన్నారు. అదంత సులభంగా వచ్చేదేనా ?

తీరా పెళ్ళయ్యాక ముఖ్యంగా ఇలాంటి హత్యలకు గురిఅవుతుం దేది అమాయకులైన లేతకన్నెలు. కాబట్టి పెళ్ళాడే ప్రతి కన్నెలోను వరకట్నం పేరెత్తితే అందుకు తగు ప్రతీకారం కర్రుగ్గా పూనుకొనే వీరత్వం అలవడాలి. అరిచి, నలుగురికీ (వీలైతే ప్రభుత్వానికి) తెలియచేసి యాగీచేసే గయ్యాళితనం తెచ్చుకోవాలి. కనీసం ఆత్మరక్షణ కోసమైనా;...

—బలిజేపల్లి శశికళ, కడప

[ఆంధ్రజ్యోతి దినపత్రిక, 12_6_83]

వినతి పత్ర రచన

టంగుటూరు,
మే 7, 1973

పోస్టుమాస్టర్ జనరల్
హైదరాబాద్ సర్కిల్,
హైదరాబాద్, ఆం.ప్ర,

BRAOU

అయ్యా,

విషయం :- ఇన్‌లాండ్ కవర్ల కొరత

ప్రకాశం జిల్లా టంగుటూరు అను మా గ్రామంలోవున్న సబ్ పోస్టాఫీసులో గత ఆరు నెలలుగా ఇన్‌లాండ్ లెటర్లు దొరకడంలేదు. పోస్టల్ సిబ్బందిని విచారించగా వారు తగినంత స్టాకుకొరకు ఆర్డర్లు పెడుతున్నామని పైనుంచి నెలకొకసారో లేక రెండుసార్లో సాకు కొద్దిగామాత్రమే వస్తున్నట్లు చెబుతున్నారు. ఆ వచ్చిన కొద్ది స్టాకును కొంతమంది ముందుగానే కొని ఇన్‌లాండ్ లెటరు ఒకటికి 40 పైసలచొప్పున అమ్ముతున్నట్లు తెలుస్తోంది. పోస్టాఫీసులో ఇవి దొరకని కారణంగా సామాన్య ప్రజలు వీటిని హెచ్చురేట్లకు ఇతరులవద్ద కొనవలసిన దుస్థితి పట్టింది.

కనుక తమరు దయతో ఈ విషయంలో శ్రద్ధవహించి వెంటనే తగిన చర్యలు గైకొని మా గ్రామంలో ఉన్న పోస్టాఫీసుకు తగినన్ని ఇన్‌లాండ్ కవర్లు సప్లయిచేయించి ప్రజల ఇబ్బందులను తీర్చవలసిందిగా కోరుతున్నాము.

ఇట్లు
గుండ్లపల్లి వెంకట నరసింహం,
కార్యదర్శి, ఐ.యల్.టి.డి.కం. స్టాఫ్ అసోసియేషన్.

రాజమండ్రి,
సెప్టెంబర్ 10, 1978.

వి. ఆర్ శేఖర్,
అడ్వొకేట్,
ఇన్నీసుపేట, రాజమండ్రి.

విద్యాశాఖ డైరెక్టరు
ఆంధ్ర ప్ర. ప్రభుత్వం,
హైదరాబాదు, ఆం. ప్ర.

అయ్యా,

విషయం—ఏడవ తరగతి పుస్తకాల కొరత

ప్రభుత్వం ప్రచురించిన పాఠ్యపుస్తకాలలో ఈ సంవత్సరం ముఖ్యంగా ఏడవ తరగతికి సంబంధించిన సైన్సు, సోషల్ స్టడీస్, లెక్కలు, తెలుగు పుస్తకాలు చాలాచోట్ల దొరకడం లేదు. విద్యార్థులు, తల్లిదండ్రులు చాలా ఆందోళన చెందుతున్నారు. అవి ఎక్కడైనా దొరికినా, చాలా హెచ్చింపు రేట్లకు దొరుకుతున్నాయి. దీని వలన బీద విద్యార్థులకు మరీ దెబ్బ తగులుతున్నది. కనుక ఈ విషయంలో తాము తగు శ్రద్ధ వహించి పైపుస్తకాలు త్వరగా అన్ని చోట్లకు పంపిణీ అయ్యే విధంగా చూడవలసిందని కోరుతున్నాను.

ఇట్లు,
భవదీయుడు,
వి. ఆర్. శేఖర్.

కడపజిల్లా జమ్మలమడుగు డిప్యూటీ కలెక్టరుగారి దివ్యసముఖమునకు
మద్దెన రామయ్య కుమారుడు మద్దెన చెన్నయ్య వ్రాసుకొన్న అర్జీ విన్నపము.

అయ్యా,

నేను చాలా వెనుకబడినవాణ్ణి. నాకు ఏ విధమయిన పత్రార్జితం లేదు. కూలిపని చేసుకొని జీవిస్తున్నాను. నాకు ముగ్గురు కొడుకులు, ఇద్దరు ఆడపిల్లలున్నారు. ఒకచోట స్థిరంగా నివాసం ఏర్పరచుకొనడానికి ఎచ్చటను నాకు స్థలం లభించలేదు. కనుక ఈ బీదవాడిమీద దయఉంచి సర్వే నెం. 216గల ప్రభుత్వ బంజరు భూమిలో ఒకచోట పాక వేసుకొనడానికిగాను 300 గ॥లు భూమి నాకు ఇప్పించవలసిందిగా ప్రార్థిస్తున్నాను.

చిత్తగించవలెను,

జమ్మలమడుగు,
జనవరి 10, 1982.

ఇట్లు,
మద్దెన చెన్నయ్యవ్రాలు.

BRAOU

నల్గొండ,
అక్టోబరు 7, 1966

బి. కిషన్‌రావు,
రిటెయిల్ మర్చెంట్,
నల్గొండ.

జిల్లా కలెక్టరు,
నల్గొండ.

అయ్యా,

విషయము-నల్గొండలో కిరసనాయిల్ కొరత

దాదాపు 15 రోజులనుండి నల్గొండ పట్టణంలో కిరసనాయిల్ కొరత ఎక్కువైనది. దీనివలన పట్టణ ప్రజలు చాలా ఆందోళన పడుచున్నారు. మొదతే విద్యుచ్ఛక్తి కొతవల్ల పట్టణంలో వ్యాపారసంస్థలు స్థంభించి పోవుచున్నవి. దానికితోడు ముఖ్యంగా సామాన్య ప్రజానీకానికి కిరసనాయిల్ అందుబాటులోలేక ప్రజలు, వ్యాపారస్తులు గూడా చాలా ఇబ్బందిపడుచున్నారు. తహసీలు ఆఫీసునుండి మంజూరు అగుచున్న 1, 2 లీటర్లు నూనె ప్రజల అవసరాలను తీర్చటంలేదు. కనుక ప్రజలయొక్క ఈ కష్టపరిస్థితులను దయతో గుర్తించి ఈ పట్టణానికి కిరసనాయిల్ విరివిగా సరఫరా అగుటకు తగుచర్యలు తీసుకొని ప్రజల అవసరాలను తీర్చవలెనని ప్రార్థిస్తున్నాను.

ఇట్లు,
వినయ పూర్వకముగా
............

ఫిర్యాదులు (Complaints)

BRAOU

**1**

విజయవాడ,
జులై 10, 1973,

ఆర్. సత్యనారాయణ,
10వ తరగతి "బి" శ్రేణి,
సి. వి. ఆర్. ఉన్నత పాఠశాల,
విజయవాడ-2.

సబ్ ఇన్‌స్పెక్టరు
పోలీసుస్టేషన్,
విజయవాడ-2.

అయ్యా,

నిన్నటిరోజు నేను పాఠశాల ప్రాంగణంలో నా సైకిల్‌వదలి, తరగతికి వెళ్ళాను. తరగతి పూర్తి అయిన తర్వాత నా సైకిల్‌పెట్టిన స్థలానికి వెళ్ళిచూతగా అది కన్పించలేదు.

నా సైకిలు పచ్చనిరంగు కల్గిన రాలీబండి. దాని నెంబరు 35943. నా సైకిలుకు డైనోమో ఉంటుంది.

మీరు దయతో ఈ విషయంలో తగుచర్య తీసుకొని నా సైకిలు కనుగొని నాకు తెలుపవలసిందిగా ప్రార్థిస్తున్నాను.

ఇట్లు,
విధేయుడు,
ఆర్. సత్యనారాయణ.

# ఆహ్వానాలు

## 1

సుస్వాగతం

మహాశయులారా,

జనవరి 10వ తేదీ సాయంకాలం 5-00 గంటలకు ఆంధ్రప్రదేశ్ గవర్నర్ గౌరవనీయులు శ్రీ కె. అబ్రహాంగారిచే విజయవాడ వస్తు ప్రదర్శనశాలకు ప్రారంభోత్సవం జరుగుతుంది. అందరూ విచ్చేయ ప్రార్థన.

విజయవాడ, ఇట్లు,
జనవరి, 1983. ఆహ్వాన సంఘం

## 2

ఆంధ్రభాషాభి రంజని సమితి

మద్రాసు క్రైస్తవ కళాశాల, తాంబరం

ఆర్యా,

మా సమితి ప్రథమ వార్షికోత్సవం అక్టోబరు 15వ తేదీ సాయంత్రం 4 గంటలకు మా కళాశాల మా ఆంధ్ర శాఖాధ్యక్షులు ప్రొఫెసర్ పి.ఆర్.పి. ఫ్రాన్సిస్, ఎం.ఏ, అధ్యక్షతన జరుగుతుంది.

శ్రీ బులుసు వెంకట రమణయ్యగారు ప్రాచీనాంధ్ర సాహిత్య విశిష్టత అనే అంశంపై ఉపన్యసిస్తారు. అందరూ విచ్చేయ ప్రార్థన.

BRAOU

తాంబరం, ఇట్లు,
అక్టోబరు 10, 1982. ఎన్. నరసింహం,
కార్యదర్శి.

## 3

# 'జాషువ కవిత్వ తత్వం'

## అభ్యుదయ వేదిక ప్రథమ వార్షికోత్సవంలో ఆవిష్కరణ

సమయం: ఈ నెల 30వ తేదీ ఆదివారం సాయంత్రం సరిగ్గా ఆరు గంటలనుంచి
సభాస్థలి: ఇక్కడి గవర్నరు పేటలోని హోటల్ నటరాజ్ రూఫ్‌గార్డెన్‌లో
సభాధ్యక్షులు: జస్టిస్ అవుల సాంబశివరావు (ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జడ్జి)
గ్రంథం ఆవిష్కర్త: శ్రీ నార్ల వెంకటేశ్వరరావు ("ఆంధ్రజ్యోతి" సంపాదకులు)
జాషువ కవిత్వ తత్వం: డాక్టరు జి.వి. కృష్ణారావు ప్రసంగం (ఆకాశవాణి-విజయవాడ కేంద్రం)
నేటి వ్యవస్థలో సాహిత్య, సాంస్కృతిక, సాంఘిక సంస్థల బాధ్యతలు:
వక్త: శ్రీ చెరుకుపల్లి పట్టాభిరామయ్య (సుప్రసిద్ధ న్యాయవాది)
మీరు, మీ మిత్రులతోసహా తప్పక రావలసిందిగా ఆహ్వానిస్తున్నాము

ప్రధానకార్యదర్శి,

'అభ్యుదయ వేదిక', ప్రజాశక్తి నగరం, విజయవాడ-10, 24-4-'72.

పెండ్లి పిలుపు

ఆర్యా,

స్వస్తిశ్రీ చాంద్రమాన రుధిరోద్గారినామ సంవత్సరం బహుళ అష్టమి ఆదివారం అనగా 3-7-83 తేది రాత్రి గం॥ 11-21 ని॥లకు రేవతీ నక్షత్రయుక్త మీనలగ్న పుష్కరాంశమందు

కావలి వాస్తవ్యులు

మా జ్యేష్ఠ పుత్రుడు — శ్రీ మేడ వరపు వెంకటరావు గారి

ప్రథమ పుత్రిక

చి॥ శేషాచలపతికిని — చి॥ సౌ॥ సూర్య కుమారికిని

నెల్లూరు కస్తూరిబా విద్యాలయంలో వివాహము జరపడానికి పెద్దలు నిశ్చయించినారు. కాన తామెల్లరు బంధుమిత్ర సమేతంగా విచ్చేసి వధూవరులను ఆశీర్వదించి మదర్పిత చందనతాంబూలాది సత్కారములు స్వీకరించి మమ్మానందింపజేయ ప్రార్థన.

వరిగొండ, — మంగళం మహత్ — ఇట్లు,

20-6-83. — శ్రీశ్రీశ్రీశ్రీ — కోటగిరి వెంకటరామారావు

వజ్రమ్మ

పెండ్లి పిలుపు నమూనాలు ఈనాడు పైన ఇచ్చిన సంప్రదాయ పద్ధతిలో కాక, కొత్త కొత్త పద్ధతుల్లో వస్తున్నాయి. ఈ పద్ధతుల్లో గమనించదగిన ముఖ్యమైన మార్పులు :

1. తిథివార నక్షత్ర లగ్నాలను పేర్కొనకపోవడం 2. పెండ్లి పిలుపులో సహజత్వం ఉట్టిపడడం 3. ఆహ్వానించే వారెవరైనా, వారు సూటిగా, ఈనాటి భాషలో ఆహ్వానించడం.

BRAOU

ఒక అభ్యుదయ వివాహ ఆహ్వాన పత్రికను చూడండి :

1-9-1983 గురువారం
సాయంత్రం 6-30 గం॥
ప్రెస్‌క్లబ్ (బషీర్‌బాగ్)లో
మా పెళ్ళి...

మీ సన్నిధి మాకు పెన్నిధి
మీ ఆశీస్సులు మా భావికి దీపాలు
మీ అభినందనలు అవిశ్రాంత వసంత సంకేతాలు...
—శాంతీగౌస్, హైదరాబాద్.

ఈ పాఠంలో నేర్చుకున్న ముఖ్యాంశాలు :

1. సెలవు దరఖాస్తులు మొదలైన వ్యక్తిగత లేఖలు రాసేటప్పుడు కూడా పిలుపు, విరామ చిహ్నాలు మొదలైన వాటికి సంబంధించిన నియమాలు అనుసరించడం అవసరం.
2. వ్యాపార లేఖల్లో అవసరమైన విషయ వివరణ మాత్రమే ఉంటుంది. వ్యాపార లేఖలు సుదీర్ఘంగా ఉండవు. సందర్భ శుద్ధి, సౌజన్యం, ఆత్మీయత, యథార్థత అనేది వ్యాపార లేఖల్లో అవసరం,

3. ముద్రించిన వ్యాపార సంస్థ చిరునామా, రెఫరెన్స్, తేదీ, ఎవరికి ఉత్తరం రాస్తున్నారో వారి పే
చిరునామా, పిలుపు, ప్రధాన విషయం, ముగింపు, రాసేవారి సంతకం, హోదా, జత పర్చేప
వివరాలు అనేవి వ్యాపార లేఖల భాగాలు.

4. ప్రభుత్వ సంబంధంగా జరిగే ఉత్తర ప్రత్యుత్తరాలు వ్యవహార లేఖలు. యథార్థత, పరిపూర్ణ
స్పష్టత, సంక్షిప్తత అనేవి వ్యవహార లేఖల్లో అవసరం.

5. సాంఘిక ప్రయోజనాన్ని ఆశించేవి సాంఘిక లేఖలు. ఈ రకమైన లేఖల్లో విషయం ఎక్కు
మందికి సంబంధించి ఉంటుంది. సంపాదకీయ లేఖలు, వినతిపత్రాలు, ఫిర్యాదులు, పెండ్లి పి
పులు, సభలకు ఆహ్వానాలు మొదలైనవి సాంఘిక లేఖలు.

ప్రముఖులైన వ్యక్తులు ఇతరులకు రాసిన లేఖలుగానీ వారికి ఇతరులు రాసిన ఉత్తరాలుగానీ పు
రూపంలో వెలువడ్డ సందర్భాలున్నాయి. ఉదాహరణకు సి.పి. బ్రౌన్‌లేఖలు, వీరేశలింగం లేఖలు, గురజాడ లేఖ
చలం మిత్రులకు రాసిన ఉత్తరాలు మొదలైనవి. ఇలాంటివి స్థానిక గ్రంథాలయాల్లో లభించవచ్చు. వాటి
పరిశీలించండి.

అదనపు సమాచారం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంవారి జనరల్ అడ్మినిస్ట్రేషన్ (అధికార భాష) డిపార్టుమెంటువారు ప్రచురించి
"సాధారణంగా ఉపయోగించే లేఖలు మెమోలు వగైరా వాటి తెలుగు అనువాదము" అనే గ్రంథం నుం
ఇచ్చిన నమూనాలు ఇవి :

BRAOU

L. Dis /60 OFFICE OF THE
Dated

ENDORSEMENT

Sub :-
Ref :-
He may seek "redress in a Court of Law.

Signature
Designation.

To,
Sri

వి. వరి/ /60 కార్యాలయమ
తేది

ఎండార్సుమెంటు
విషయము :-
రిఫరెన్సు :-
ఆయన న్యాయస్థానములో నివారణ కోరుకొనవచ్చును.

సంతకము.
హోద్దా.

శ్రీ

గారికి

# OFFICE OF THE AUTHORITY UNDER PAYMENT OF WAGES ACT, GOVERNMENT OF ANDHRA PRADESH, HYDERABAD.

No. Dated :

## MEMORANDUM.

Sub : Payment of Wages Act, 1936—

An application under section 15 (2) of the Payment of Wages Act should be presented with this Court within six months from the date on which wages become payable. The application cited includes wages for periods prior to the prescribed period of six months. The petitioner is required to explain the delay in respect of the time barred claim and show cause why it should not be dismissed as time barred. This statement should be in duplicate and in the form of an affidavit.

*Authority under Payment of Wages Act,*
*Andhra Pradesh.*

To,

..........................................................................

..........................................................................

BRAOU

వేతనాల చెల్లింపు చట్టాధికారి కార్యాలయము,
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము, హైదరాబాదు.

తేది......................

నెం.

## మెమోరాండం

విషయము : 1936, వేతనాల చెల్లింపు చట్టము.

వేతనాల చెల్లింపు చట్టము యొక్క 15 (2)వ విధానము విభాగము క్రింద ఒక అర్జిని వేతనాలు చెల్లించవలసిన తేదీ నుండి ఆరు నెలల లోపల ఈ కోర్టుకు సమర్పించుకొనవలెను. పైన పేర్కొన్న అర్జీ నిర్ణయింపబడిన ఆరునెలల గడువుకు పూర్వపు గడువు వేతనాలు కూడా చేర్చబడినవి. అర్జీ కాలదుష్టమైనది కావున ఆలస్యము జరుగుటకు కారణములను వివరించుచు కాలదుష్టమైనదిగా దానిని ఎందుకు త్రోసి పుచ్చరాదో సంజాయిషీ చెప్పుకొనవలెను. ఈ వివరణ రెండు ప్రతులుగాను, ఎఫిడవిట్టు రూపములోను ఉండవలెను.

వేతనాల చెల్లింపు అధికారి,
ఆంధ్రప్రదేశ్.

Office of the Asst. Director of
Industries and Commerce,

L. O. No. /196-196 dated.................196

NOTICE

Sub :- Repayment of loan instalment/arrears--requested.

A sum of Rs.........................was granted as loan with interest at............... percent under..........................on........................for repayment in.................. ............................equal annual instalments.

You have not paid the....................instalment/arrears relating to............... instalment so far and have thus contravened the conditions laid down for sanction of the loan.

You are hereby requested to pay the amount of Rs..................towards principal and Rs............................towards the interest on or before........................ failing which coercive steps will be taken to recover the same.

Sd.
*Assistant Director.*

ఎల్. ఓ. నెం............

పరిశ్రమలు, వాణిజ్య శాఖ,
అసిస్టెంటు డైరెక్టరు కార్యాలయము,
తేది................

నోటీసు

విషయం :— అప్పు వాయిదా/బాకీ తిరిగి చెల్లింపు—కోరడమైనది.

BRAOU

..................క్రింద మీకు ....... ...........కాలం వడ్డీతో.......రూ...... .............
మొత్తం..........................తేదీన మంజూరు చేయబడింది దానిని మీరు.......................
సమాన వాయిదాలతో చెల్లించవలసి వున్నది.

కాని మీరు......... ....................వాయిదా/బాకీ మొత్తాన్ని యింతవరకు చెల్లించివుండరు ఆ విధంగా మీరు అప్పు మంజూరుకు నిర్ణయించిన షరతులను వుల్లంఘించడం జరిగింది.

అసలు క్రింద రూ........................వడ్డీ క్రింద రూ............................ ........................తేదీన గాని అంతకు ముందుగా గాని చెల్లించవలసిందిగా మిమ్ము కోరడమైనది ఆ విధంగా మీరు చెల్లించనట్లయితే ఆ మొత్తాన్ని రాబట్టుకోవడానికి నిర్బంధ చర్యలు తీసుకోబడగలవు.

అసిస్టెంటు డైరెక్టరు.

## అభ్యాసాలు (రాసేపని)

1. ఊహించిన పేర్లతో, చిరునామాలతో కింది విషయాలకు సంబంధించిన వ్యక్తిగత లేఖ రాయండి.

   (అ) అన్నయ్య పెండ్లికి ఆహ్వానిస్తూ స్నేహితుడికో, స్నేహితురాలుకోలేఖ.

   (ఆ) సార్వత్రిక విశ్వ విద్యాలయ పాఠ్యాంశాలు, బోధనను గురించి వివరిస్తూ మీ కిష్టమై వ్యక్తికి ఉత్తరం రాయండి.

   (ఇ) మీ అధ్యయన కేంద్రంలోని అనుభవాల గురించి మీ స్నేహితుడికో, స్నేహితురాలు ఉత్తరం రాయండి.

2. వ్యాపార లేఖలో ఉండే వివిధ భాగాలేమిటి? ఆ భాగాలు ఏయే ప్రదేశాలలో ఉంటాయో చూపుతూ ఒక వ్యాపార లేఖ రాయండి.

3. పుస్తకాల కొనుగోలు, ఉద్యోగం కోసం అర్జీ, ఫిర్యాదు-ఈ మూడింటికి సంబంధించి వ్యాపార లేఖలను సోదాహరణ పూర్వకంగా రాయండి.

4. ఈ కింది లేఖకు సమాధానం రాయండి,

15, పూలబజారు,<br>
తాడేపల్లిగూడెం,<br>
మార్చి 4, 19. 83

ఆంధ్రా పేపర్ మిల్స్,<br>
రాజమండ్రి.

మహాశయులారా,

మీ కంపెనీ కార్యాలయంలో ఒక గుమస్తా ఉద్యోగం ఖాళీగా ఉందని తెలిసింది. ఆ ఉద్యోగ నియామకానికి కావలసిన యోగ్యతలూ, మీరిచ్చే జీత భత్యాలు మొదలైన వివరాలు దయతో తెలియజేయండి.

భవదీయుడు,<br>
ఎమ్. సుబ్బారావు.

BRAOU

5. అధికారిక లేఖల్లో రెఫరన్స్ నంబరు ఎక్కడ రాస్తారో సోదాహరణంగా వివరించండి.

6. అధికారిక లేఖకు, అర్ధ అధికారిక లేఖకు ఉన్న తేడాలను వివరించండి.

7. మెమోరాండం లక్షణాలను సోదాహరణంగా వివరించండి.

8. నోటిఫికేషన్, సర్క్యులర్-వీటి లక్షణాలను వివరించండి.

9. ఈ కింది వాటికి సంగ్రహ వివరణ ఇవ్వండి.

   1) ఎండార్స్‌మెంట్ 2) Resolution 3) Despatch 4) Proclamation.

10. అదనపు సమాచారంలో ఇచ్చిన ఇంగ్లీషు మూలాన్నీ, తెలుగు అనువాదాన్నీ అధ్యయనం చేయండి. అందులో వాడిన భాషమీద మీ వాఖ్య రాయండి.

LIBRARY

BRAOU

apou
LIBRARY

# తెలుగు

## మౌలిక అంశాలు

ఖండికలు 5-7

BRAOU

ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

హైదరాబాదు

1983

# ఆధునిక భారతీయ భాషలు: తెలుగు


**రచయితల బృందం**

ఆచార్య చేకూరి రామారావు (సంపాదకుడు)

డా. కేతు విశ్వనాథరెడ్డి (సహ సంపాదకుడు)

డా. ఎం. వి. శాస్త్రి

డా. వి. లక్ష్మణరెడ్డి

శ్రీమతి ఏ. మంజులత



apou
LIBRARY

A.P.O.U. LIBRARY
Acc. No. ..................
Date..............................
Call No...............................

BRAOU


ముఖచిత్రం

చంద్ర


ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

హైదరాబాదు

ప్రథమ ప్రచురణ 1983



కాపీరైటు © 1983 ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

అన్ని హక్కులు విశ్వవిద్యాలయానివి. ఈ పుస్తకంలోని ఏ భాగం అయినా ఉపయోగించుకోదలచు కుంటే, విశ్వవిద్యాలయం అనుమతి పొందాలి.


ఈ పాఠాలు సార్వత్రిక విశ్వవిద్యాలయం పాఠ్యప్రణాళికలో ఒక భాగం.

పాఠ్యప్రణాళిక మొత్తం వివరాలు ఈ పుస్తకం చివరలో ఉన్నాయి.


ఇతర వివరాలకు : డైరెక్టరు, ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విశ్వవిద్యాలయం,
6-3-645 సోమాజిగూడ, హైదరాబాదు-500 004.

---

ముద్రణ : నాట్యకళ ప్రెస్, 6-3-684 ఖైరతాబాదు, హైదరాబాద్.

ఖండికలు **5-7**

5. సందికార్యాలు

6. పదాలు ఏర్పడే పద్ధతులు, సంబంధాలు

7. సమాసాలు

BRAOU

BRAOU

## ఖండిక 5 పాఠం 7

# జాతీయాలు

**ఉద్దేశం**

జాతీయాలు అంటే ఏమిటో, వాటి స్వరూప స్వభావాలు ఎట్టివో అవగాహన కలిగించటం.

**ప్రణాళిక**

1. జాతీయాల నిర్వచనం, వివరణ
2. జాతీయాంలో కొన్ని రకాల వర్గాలు
3. ముఖ్యవిషయ క్రోడీకరణ
4. అదనపు సమాచారం
5. అభ్యాసాలూ, ప్రశ్నలూ

**జాతీయాలు అంటే...**

చెప్పదల్చుకున్న అభిప్రాయాల్ని ఇతరులకు స్పష్టంగా హత్తుకునేట్లు చెప్పటానికే అందరూ ప్రయత్నం చేస్తారు. ఆ ప్రయత్నంలో ఒక భాగమే జాతీయాల, సామెతల వాడుక. ఇప్పుడు ఈ వాక్యాలను గమనించండి:

1. *నేనంటే వాడికి గిట్టదు లెండి.*
2. *నా పేరు వింటేనే వాడు మండిపోతాడు.*
3. *నన్ను చూస్తే వాడు కళ్ళలో కారం పోసుకుంటాడు.*

BRAOU

మొదటి వాక్యంలో ఒక విషయం సాదాగా చెప్పటం జరిగింది. గిట్టదు అన్నాను బాగానే ఉంది. ఆ గిట్టక పోవటం ఎంత వరకు? కొలిచి చెప్పవచ్చునా? వీలుకాదు కనుకనే వర్ణనలోకి దిగటం.

ఆ 'గిట్టకపోవటాన్ని' గురించి నా మనసులో ఉన్న భావం లేదా భావ గాఢత మీకూ అర్థమయ్యేటట్లు చెయ్యాలంటే, ఆ విషయాన్ని వివరించటంలో ఒక పద్ధతి అసలు గిట్టదు, పొత్తిగా గిట్టదు, ఏ మాత్రము గిట్టదు ఇట్లాంటి శబ్దాల సహాయం తీసుకోవటం. ఈ పద్ధతి అన్ని భాషలలోనూ దాదాపుగా ఒకే రకంగా ఉండే పద్ధతే.

కాదంటే, ఆ విషయాన్ని అలంకార శైలిలో చెప్పవచ్చు. ఆ ప్రయత్నమే రెండో వాక్యంలో ఉన్నది. పేరు విన్నా, ప్రస్తావన వచ్చినా మండిపోతాడు, భగ్గుమంటాడు-ఇట్లా వివరించవచ్చు. భావస్పష్టత కోసం అలంకార శైలి వాడటం కూడా అన్నిభాషలలోనూ ఉంటుంది. అయితే ఆ అలంకార శైలిలోని కొన్ని రకాల భావప్రకటనల తీరు తెన్నులు ఒక భాషకు మరొక భాషకు వేరువేరుగా ఉంటాయి.

ఆ భావంలోని గాఢతలో ఎక్కువ తక్కువలను హత్తుకొనేటట్లు చెప్పటంలో ఇంకొక మార్గం కూడా అనుసరించవచ్చు. అది కూడా అలంకార శైలిలో భాగమే. వర్ణనకు వినియోగపడేదే. అయితే ఇట్లాంటిదే మరొక ఘటనో, ఉదాహరణో, తార్కాణమో ఉపమానమో అట్లాంటిది ఏదో వాడుక చెయ్యటం. దీనిని గూర్చి ఒక్క వాక్యంలో తేల్చివేయటం కష్టం. ఎక్కువ ఉదాహరణల ద్వారా తెలుసుకోవాలి. అయితే ఒక్కమాట మాత్రం చెప్పుకోవచ్చు. మొదటిసారిగా ఆ భావవ్యక్తీకరణ పద్ధతి విన్నప్పుడు చమత్కారంగా ఉన్నది అని పిస్తుంది. సమాజంలో మాటిమాటికి దాన్ని వాడుతూ ఉండటం వల్ల ఆ చమత్కారం ఇప్పుడు గుర్తించలేక పోవచ్చు. మూడో వాక్యం అట్లాంటిది.

*'కండ్లల్లో కారం పోసుకుంటాడు'* అంటే నిజంగా కళ్ళలో కారం తెచ్చిపోసుకుంటాడని కాదుగదా, కళ్ళల్లో కారం పోసుకుంటే ఏవిధంగా ఉంటుందో ఆ విధంగా నన్ను చూస్తే వాడు ఉంటాడని అభిప్రాయం. మొదటిసారిగా ఆ విధమయిన భావవ్యక్తీకరణం ఎవరు చేశారో మనకు తెలియదు. అది బాగుంది ; గాఢమయిన భావాన్ని చెప్పేటందుకు పనికి వచ్చింది. ఇప్పుడు అల్లాంటి సందర్భాలు వచ్చినప్పుడు అందరమూ దాన్ని ఉపయోగిస్తాము. చివరకు అది నిఘంటువులలోకి కూడా ఎక్కింది :

*కండ్లలో కారం పోసుకొను :* అసూయపడు.

"ఎవరు కాస్త పచ్చగా కనబడినా వాడు కండ్లలో కారం పోసుకుంటాడు." (వాడుక)

(పదబంధ పారిజాతము. ప్రథమ సంపుటము. సంపాదక వర్గం : నార్ల వెంకటేశ్వరరావు, విద్వాన్ విశ్వం, తిమ్మావజ్ఝల కోదండ రామయ్య; ప్రచురణ : ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, హైదరాబాదు ఆగస్టు 1959)

'కండ్లలో కారం పోసుకొను' అనే పలుకుబడి (expression)లో మూడుమాటలు ఉన్నాయి. ఆ మాటికీ దేనికుండే అర్థం దానికి ఉన్నది. అయినా పలుకుబడి యొక్క అర్థం ఆ మూడు మాటల మీద ఆధారపడి లేదు. కలిపి మొత్తం అర్థం వేరేవచ్చింది. దీనిని మరే భాషలోకైన అనువాదం చేయవలసి వస్తే, ఏ మాటకు ఆ మాటగా మరోభాషలోకి అనువాదం చేస్తే అవతలి భాషవాడికి అర్థం కాదు. ఆ మొత్తం పలుకుబడిని ఒకటిగా తీసుకొని మాత్రమే అనువాదం చేసి చెప్పగలము. అంటే *ఇది తెలుగు భాషకు పరిమితమై ప్రత్యేకమై ఉన్న పలుకుబడి అన్నమాట.*

ఇటువంటి వాటిని 'జాతీయాలు' అని అంటారు. ఇంగ్లీషులో వీటిని idioms అంటారు. (ముఖ్యంగా విద్యాలయాలలో ఇంగ్లీషు నుంచి మాతృభాషకు అనువాదం చేయమనే ప్రశ్న ఇచ్చినప్పుడు Translate into idiomatic language అనటం మీకు పరిచితమైన విషయమే).

Idiom అంటే ఆంగ్లనిఘంటువు ఇట్లా చెపుతుంది :

1. an expression whose meaning cannot be derived from its constitutent elements, as kick the bucket in the sense 'to die'
2. a construction or expression Peculiar to a language.

*'ఒక జాతికి సంబంధించినది'* అని *జాతీయానికి అర్థం*. ఇక్కడ ఒక భాష యొక్క ప్రత్యేకత, విశిష్టమయిన పలుకుబడి అనే అర్థంలో మనం వాడుతున్నాము.

జాతీయాలంటే ఏమిటో ఇంతవరకు తెలుసుకొన్నదానిని మనసులో ఉంచుకొని ఈ కింది ఉదాహరణలను చదివి, ఆ లక్షణాలు ఎట్లా సరిపోతున్నాయో కాస్త లోతుగా ఆలోచించండి:

1. వాడికి *కళ్లు నెత్తికి వచ్చినాయి.*
2. *కళ్ళలో వత్తులు వేసుకొని* ఎదురు చూస్తున్నాడు.
3. దూరాభారాన ఉన్న కొడుకు వచ్చిన దాకా *కళ్ళలో ప్రాణాలు పెట్టుకొని* కాచుకు కూర్చున్నాడు.
4. ఏం. మాట్లాడితే *నోటి ముత్యాలురాలుతాయా ?*
5. *మాటా మాటా పెరిగి* పోట్లాడుకున్నారు.
6. *మోకాలికి బట్టతలకు ముడి.*

**జాతీయాలలో కొన్ని రకాల వర్గాలు**

జాతీయాలు అనేక విధాలుగా ఏర్పడినాయి; ఏర్పడుతుంటాయి. కొన్నికొన్ని వ్యవహారంలోనుంచి జారి

BRAOU

పోతుంటే మరికొన్ని కొత్తవి వస్తూ ఉంటాయి. జాతీయాలనే (విశిష్ట) పదబంధాలని, నుడికారాలని, పలుకుబళ్ళని కూడా అంటూ ఉంటారు. వీటిని కొన్ని వర్గాలుగా గుర్తించే ప్రయత్నం చేద్దాము.

(అ) శరీరావయవాలను పేర్కొంటూ వచ్చినవి కొన్ని:

1. తలలో నాలుక వంటివాడు
2. చెవి నిల్లు కట్టుకొని పోరటం
3. నెత్తీనోరూ కొట్టుకొని చెప్పటం
4. కాలికి బలపం కట్టుకొని తిరగటం
5. పొట్ట కొట్టటం
6. చెయ్యి విరిగినట్లు ఉంది

(ఆ) పరిసరాలలోనుంచి వచ్చినవి కొన్ని:

1. దున్నపోతు మీద వాన కురిసినట్లు
2. ఏనుగు పాటి
3. గోడమీది పిల్లి
4. గొర్రె తోక
5. కాకిగోల
6. చీమ కుట్టినట్లు (లేదు)

(ఇ) ఆచార వ్యవహారాలనుంచి వచ్చినవి కొన్ని:

1. గుండు పెట్టి గంట వాయించటం
2. పెద్ద పీట వెయ్యటం
3. బొట్టుకాటుక పెట్టి పిలవటం
4. పప్పన్నం పెట్టటం

BRAOU

(ఈ) పురాణ కథలు ఆధారంగా వచ్చినవి కొన్ని:

1. శల్య సారథ్యం చెయ్యటం
2. సుగ్రీవాజ్ఞ
3. రామరాజ్యం
4. ఉడతాభక్తి
5. లక్ష్మణరేఖ

(ఉ) జనశ్రుతిగా చెప్పుకునే కథలనుబట్టి వచ్చినవి కొన్ని:

1. పుల్లయ్య వేమారం
2. రెంటికీ చెడ్డ రేవడు
3. బాదరాయణ సంబంధం
4. రేగు చెట్టుకింద భాగోతం

(ఊ) అతిశయోక్తులు ఆధారంగా వచ్చినవి కొన్ని:

1. ఇద్దరిమధ్యా పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుంది
2. ఇసకేస్తే రాలని జనం
3. ఈ యింటి మీద కాకి ఆ ఇంటి మీద వాలదు

(ఎ) విశ్వాసాలు ఆధారంగా వచ్చినవి కొన్ని:

1. నోట్లో పురుగులు పడి చావటం
2. వచ్చి నీ కడుపున పుడతా
3. కళ్ళు పోతాయి

(ఏ) అనుభవం ఆధారంగా వచ్చినవి కొన్ని:

1. కృత్యాద్యవస్థ
2. మొదటికి మోసం
3. గుమ్మడికాయల దొంగ
4. నడుము కట్టడం

(ఐ) అనుకరణ శబ్దాలను ఉపయోగించేవి కొన్ని:

(ధ్వనిని సూచించే పదాలు + అను = కొట్టు, ఆడు మొదలైనవి)

పకపకలాడు, కిసుక్కుమను, జైకొట్టు, కిలకిలలాడు, గుటుక్కుమను, గబగబలాడు, భగ్గుమను, పెటపెటలాడు, కిటకిటలాడు మొదలైనవి

ఇప్పటికీ అన్ని వర్గాలు చేసి చెప్పినట్లు కాదు. ఒక అభిప్రాయం రావటానికి మాత్రమే ఇక్కడ ప్రయత్నం చేసింది.

ఒకే అర్థం ఇచ్చే జాతీయాలు అనేకం ఉండవచ్చు. అయితే సందర్భాన్నిబట్టి జాతీయాన్ని ఉపయోగించే వాడి మనస్తత్వంబట్టి ఒక్కొక్క దానిని వాడుకకు ఎన్నిక చేసుకోవటం జరుగుతుంది. శైలి దృష్టితో చూస్తే వీటిలో కొన్ని గౌరవప్రదంగా, కొన్ని హీనపరిచేవిగా ఉండి వక్తయొక్క సంస్కారాన్ని వెల్లడి చేస్తాయి.

ఒక ప్రధాన శబ్దాన్ని గ్రహించి, ఆ అర్థంలో పర్యాయాలుగా వాడటానికి వీలయిన జాతీయాలను ఒక్కచోట చేర్చేటువంటి రూపమయిన నిఘంటువు తెలుగులో ఇంతవరకు రాలేదు. 'థిసారస్' (Thesaurus) అనే పేరిట ఇటువంటి ప్రచురణలు ఆంగ్లంలో ఉన్నాయి. ఉదాహరణగా ఒక తెలుగు శబ్దం తీసుకొని దాని స్వరూపం ఎట్లా ఉంటుందో ఈ కింద ఇస్తున్నాము:

BRAOU

**చచ్చు, చావు**

*పోవటం, వెళ్ళిపోవటం, కాలం చెయ్యటం, కాలధర్మం పొందటం, అస్తమించటం, కీర్తిశేషుడు కావటం, జీవయాత్ర ముగియటం, ప్రాణం పోవటం, ప్రాణవాయువు అనంత వాయువులో కలిసి పోవటం, పంచత్వం పొందటం, బుగ్గి అయిపోవటం, గుప్పెడు మన్ను కావటం.*

*నిర్యాణం పొందటం, కైలాసం వైకుంఠం చేరటం, పరలోకగతుడు కావటం, దివంగతుడు కావటం, హంస లేచిపోవటం, ప్రభువులో నిద్రించటం, స్వర్గస్థుడు కావటం, లింగైక్యం పొందటం, శివ విష్ణు సాయుజ్యం పొందటం, భగవత్సన్నిధి చేరుకోవటం, పెద్దల్లో కలిసిపోవటం, మక్కాల్లో చేరిపోవటం, పైకి పోవటం, నూకలు చెల్లటం, నూరేళ్ళు నిండటం, ఆయుస్సు తీరటం, వెళ్ళదీసుకొని పోవటం, హరీ మనటం, గోవింద కొట్టడం, బాల్చి తన్నటం, బుడుంగుమనటం.*

*గొంతు మూగపోవటం, కన్ను మూయటం, అంతిమశ్వాస విడవటం.*

*భార్య విషయంలో: పసుపు కుంకుమ తుడవటం, ముండమోయటం, తాడు తెగటం.*

తల్లిదండ్రుల విషయంలో: *కడుపున చిచ్చుపెట్టడం*

(చెప్పేవాడి ధోరణిని బట్టి, ప్రవృత్తినిబట్టి, ప్రకృతినిబట్టి, మృతిచెందిన వ్యక్తి స్థితి, స్థాయి, పరిస్థితుల బట్టి, ఆ వ్యక్తితో చెప్పేవాడి సంబంధాన్నిబట్టి ఇందులో పదాలనో పదబంధాలనో ఎన్నుకోవటం జరుగుతుంది.

జాతీయాల వంటివే ఒక్కొక్క భాషకు ప్రత్యేకంగా ఉండే పదసంపద సామెతలు (Proverbs). జాతీయాలకు, వాటికి కొన్ని సమాన లక్షణాలు ఉన్నాయి. అయినా సామెతలకు ప్రత్యేకంగా ఉన్న లక్షణాలు ఉన్నాయి. సామెతలను గూర్చి ఎనిమిదో పాఠంలో చూద్దాము.

(అదనపు సమాచారం కోసం ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ప్రచురించిన 'పదబంధ పారిజాతము' (1959) అనే జాతీయాల నిఘంటువు సంపాదకవర్గం రాసిన పీఠికను చూడండి. ఈ పీఠికలో జాతీయాలను గూర్చిన వివరణ ఉంది).

**ఈ పాఠంలో నేర్చుకొన్న ప్రధాన విషయాలివి:**

1. ఉన్న విషయాన్ని స్పష్టంగా చెప్పటానికీ, మనస్సుకు హత్తుకునేట్టు చెప్పటానికీ, అందంగా చెప్పటానికీ జాతీయాలు, సామెతలు ఉపయోగిస్తారు.
2. అందంగా, హత్తుకునేట్టు చెప్పే తీరులు ఒక్కో భాషకు ఒక్కో రకంగా ఉంటాయి.
3. జాతీయాలు సాధారణంగా పదబంధాలు.
4. ఒక్కో మాటనున్న విడిమాటల అర్థాలు కలిపితే జాతీయాల అర్థం తెలీదు. జాతీయం మొత్తానికి కలిపి అర్థం నిర్ణీతంగా ఉంటుంది. ఈ కారణంవల్ల జాతీయాలను అనువాదం చెయ్యటం కష్టం.
5. జాతీయాలు ఒక్కో భాష లక్షణాన్నిబట్టి, ఆ భాష మాట్లాడుకునేవాళ్ళ ఆలోచనలనుబట్టి, నమ్మకాల్నిబట్టి, ఆచారాల్నిబట్టి ఏర్పడతాయి. అందువల్ల అవి ఆ భాషకు ప్రత్యేకం.
6. జాతీయాల్ని కొన్నిరకాలుగా విభజించవచ్చు. వాటిల్లో కొన్ని (అ) శరీరావయవాల ప్రమేయం ఉన్నవి. (ఆ) పరిసరాలనుంచి వచ్చినవి. (ఇ) సాంఘికమైన ఆచారాలనుంచి, అలవాట్లనుంచి వచ్చినవి. (ఈ) పురాణ కథలనుంచి వచ్చినవి. (ఉ) జనశ్రుతిగా చెప్పుకునే కథలనుంచి వచ్చినవి. (ఊ) అతిశయోక్తులు ఆధారంగా వచ్చినవి. (ఎ) విశ్వాసాలు (నమ్మకాలు) ఆధారంగా వచ్చినవి. (ఏ) అనుభవం ఆధారంగా వచ్చినవి. (ఐ) అనుకరణతో కూడినవి.

BRAOU

# అభ్యాసం (చదివే పని)

ముందుగా ఈ దిగువ ఇచ్చిన కథ 'ఉత్తరం' చదవండి. ఈ కథ రాసింది మునిమాణిక్యం నరసింహారావు గారు (1898-1973). ఆయన కథకులుగా, హాస్యరచయితగా ప్రసిద్ధులు. మనం రోజూ చూసే సంసార సన్నివేశాల్లో కథలు చూసిన చతురుడు. ఆయన కథల్లోని హాస్యం అసభ్యమైనదికాదు, అశ్లీలమైనది కాదు. అది నాజూకయిన హాస్యం. నవ్వుకుంటూ జీవించడానికి మధ్యతరగతి జీవులకు తోడ్పడే హాస్యం. ఆయనకు కథ చెప్పడంలో ఒక నేర్పుఉంది. శైలి ఉంది. వాడే భాషలో, కల్పించే పాత్రల్లో, సన్నివేశాల్లో, వాతావరణంలో తెలుగుతనం, జాతీయత కన్పిస్తాయి. వీరి 'కాంతం కథలు' ప్రసిద్ధమైనవి.

కాపురానికి వెళ్ళిన కూతురికి కాంతం భర్తచేత ఉత్తరం రాయించటం ఇందులోని ఇతివృత్తం.

# ఉత్తరం

## మునిమాణిక్యం నరసింహారావు

అమ్మాయికి ఉత్తరం వ్రాయమని ఆవిడ వారం రోజులు గోలపెట్టిన తరువాత ఒక ఆదివారం తీరిక చేసుకొని కూర్చుని "ఏమి వ్రాయమంటావు కాంతం" అని అడిగాను. కాంతం వచ్చి నా కుర్చీపక్కన నుంచున్నది. ఇక చెప్పు' అన్నాను. "చెప్పేదేమిటి, వ్రాయండి" అన్నది.

"ఏమి వ్రాసేది?"

"ఏమి వ్రాయాలో నేను చెప్పాలా? సముద్రస్నానానికి రమ్మని వ్రాయండి."

"నేను సరేనని వ్రాశాను. "నీవు వ్రాసిన ఉత్తరం అందినది. సంతోషం. ఇక్కడ అంతా క్షేమం. నీవు కార్తీక పౌర్ణమికి రావలసినది. ఏ బండికి వచ్చేది ముందుగా తెలియజేస్తే ఎవరో ఒకరం స్టేషనుకు వస్తాము."

ఇల్లా వ్రాసి ఉత్తరం పూర్తి చేసి, ఆవిడకు చదివి వినిపించాను. ఆవిడ అరచేతిని నోటికి అడ్డం పెట్టుకొని "అవ్వ ఇదేం ఉత్తరం వ్రాయటం అండి." అని ఆశ్చర్యపోయింది.

ఉత్తరం వ్రాయటం అసలు నాకు తెలియనట్లే ఆమె తేల్చుకొన్నది. నా తెలివి తక్కువ తనం నాకు తెలిసి వచ్చేటట్లు ఒక్క చురుకైన చూపు చూచింది. నేను చాలా సిగ్గుపడి ఆ కాయితం అక్కడ పెట్టేసి, వేరే కాగితం తీసుకొని "నీవు చెప్పు, చెప్పినట్లు వ్రాస్తాను." అన్నాను.

ఇంత తెలివి తక్కువ మొగుడు ఉంటే ఏమి చేస్తాను, చెప్పుకోక అన్నట్లు చూచి, సరే వ్రాయండి అన్నది.

"చి॥ సౌ॥ మంగతల్లిని దీవించి వ్రాయునది. ఉభయ కుశలోపరి. ఇక్కడ అంతా క్షేమం. మీ క్షేమం వ్రాయించవలెను."

నేను మాట్లాడకుండా వ్రాశాను.

"వ్రాశారా ?"

"ఆఁ"

"చి॥ రాధిగాడు బాగా అల్లరి చేస్తున్నాడు."

"గంగాళంలో నీళ్ళు పార పోస్తున్నాడని కూడా వ్రాయాలా !" తమ్ముడు ఇంతింత ఘనకార్యాలు చేస్తున్నాడని అది సంతోషిస్తుందా ? ఏమిటి నీ ఉద్దేశం. తరుచు పడిశెం పడుతూ ఉంటుంది అని కూడా వ్రాసేదా ?"

"మీ కెందుకు, నేను చెప్పినట్లు వ్రాయండి." "తమ్ముడు గుమ్మాలు దాటుతున్నాడు."

"తమ్ముడు గుమ్మాలు దాటటం కూడా వ్రాయాలటండీ కాంతంగారూ! ఇంకా నాలుగు రోజులకు వీధిలోకి వెళ్ళుతాడు. ఆ తరువాత వాళ్ళ గుమ్మాలూ, వాళ్ళ గుమ్మాలు కూడా దాటుతాడు."

"మా చిట్టి బాబు గోపాలకృష్ణుడండీ, మా తండ్రి గడపలుదాటాడు. ఇవ్వాళ గారెలు వండుతున్నాను. మీరు మధ్యాహ్నం ఎక్కడికీ వెళ్ళకండేం?" అంటూ కాంతం రాధిగాడిని ఎత్తుకొని రొమ్ముకు అదుముకొని ముద్దాడింది. వాడు కిలకిలా నవ్వుతూ అక్క అక్క అని చిలకలాగా పలికాడు. కాంతం నా వంక చూచింది. ఆమె హృదయంలో ఆనందం పొంగి పోతున్నది. ఆమె కళ్ళల్లో క్షీర సముద్రోద్భూత తరంగ శిరోపరి భాగస్థిత ఫేన పుంజ వినిర్గత ధావళ్య రేఖలు తళతళ మెరిసినై. "విన్నారా ?" అన్నది.

'ఆఁ' అన్నాను నేను మామూలు గొంతుకతో. కాంతం నాలో ఆనందం పొంగులేకపోవటం చూచి, చాలా నిరుత్సాహపడి, చప్పరించి, "ఎందుకండీ మీరు పద్యాలు చదువుతారు." అని అడిగింది. నేను మాట్లాడక ఊరుకునే సరికి ఆవిడ నిరసనగా అన్నది. "ఎందుకు కవిత్వం-పసిపిల్లల ముద్దుపలుకుల్లో ఉండే మాధుర్యం గ్రహించలేని వారు కవిత్వం చదివి ఏమి ఆనందిస్తారండీ?"

ఆ మాటలు విని నేను కాస్త ఆలోచనలోకి దిగాను. నిజమే ఆ మాట. అప్పుడు నాకు తెలిసింది, కవులు కోవిల కూజితాన్ని ఎందుకు మధురమైంది అన్నారో; రాధిగాడు, అక్కపైన ఒక రసవంతమైన పద్యం చెప్పి నట్లు నాకు తెలిసి, ఆనందాన్ని పొంది, తల్లి చంక నెక్కి కూర్చున్న వాడి లేత బుగ్గలను ముద్దెట్టుకొన్నాను. ఇంకా ఆవిడ కొడుకును ముద్దాడుతూనే ఉంది. అందుకని ఇంకా ఏమి వ్రాయమంటావో చెప్పు అని అడిగాను.

"అక్క, అక్క అని అంటున్నాడు."

"అని వ్రాయమంటావా?"

"వ్రాయండి"

వ్రాశాను. ఆవిడ చెప్పినట్లే వ్రాశాను. ఆవిడ విని, "ఏమిటండీ పొడిముక్కలు వ్రాస్తారూ? అన్నీ విడదీసి చెప్పాలె, కాస్త అంది స్తే అల్లుకు పోలేరు. తమ్ముడు నీకోసం బెంగపెట్టుకొన్నాడు. కార్తికపౌర్ణమి నాటికి రమ్మని వ్రాయండి-ఇక్కడ నుంచుని మీకు చెపుతూ ఉంటానికి నాకు తీరికలేదు." ఇల్లాని ఆవిడగారు లోనికి వెళ్ళిపోయింది. వెళ్ళిపోతూపోతూ, "*గబగబ గీకెయ్యక*, చక్కగా అన్ని సంగతులు బాగా వ్రాయండి" అని గట్టిగా చెప్పి వెళ్ళింది.

బాగా వ్రాయటం అంటే ఏమిటి! వర్ణనలను చేర్చి వ్రాయటం కాదాయె! పెద్దపెద్ద మాటలు వేసి వ్రాయటమూ కాదు. శబ్దాలంకారాలు వాడటమూ కాదు. ఇంక బాగా వ్రాయటం ఏమిటి, అర్థం లేనిమాట అనుకొని ఇట్లా వ్రాశాను.

"తమ్ముడు అక్క అక్క అంటున్నాడు. రెండక్షరాల మాటలు వస్తున్నాయి!"

ఆ వాక్యం వ్రాసి ఇక్కడ కొంచెం బాగా వ్రాద్దామా అనిపించింది. అంటే వాడు నేర్చిన మాటలన్నీ వ్రాయటమా? లేక వాడి భాషా జ్ఞానాభివృద్ధిని గురించి ఒక చిన్న వ్యాసము వ్రాయటమా! నిజానికి ముందుముందు వాడు భాషను అంతా పాడుచేస్తున్నాడు. పదాలను వర్ణలోప, వర్ణాగమ, వర్ణ ప్రత్యయాలతో వాడుతాడు. రాయికి బహువచనంగా రాయిలు వాడుతాడు. వాళ్ళ అన్నయ్య అట్లాగే చేసినాడు. ఇల్లాంటి పనిని గూర్చి నేను ఏమంత మెచ్చుకోనేది!

అందుకని ఆ ప్రయత్నం మాని, "కార్తిక పౌర్ణమికి రావలసినది. సముద్ర స్నానానికి వెళ్ళవచ్చు" అని వ్రాసి కాంతాన్ని పిలిచాను-ఉత్తరం పూర్తి అయింది విందువుగాని రా అని.

ఆవిడ వచ్చి ఉత్తరం పూర్తిగా విని నోటనొక్కుకొని, "నాబొంద, మిమ్మలను రాయమంటే అంతే! కాయితం అట్లాగే ఉండె! ఏమి వ్రాయటం అది!" అని విసుక్కొన్నది.

చెప్పు వ్రాస్తానని నేను మళ్ళీ అన్నాను.

"వ్రాయండి. పెద్ద అక్కయ్యా, దాని మొగుడూ హైదరాబాద్‌లో ఉన్నారు. దానికి వంట్లో ఏదో, *ఇదిగా ఉంది*. గట్టిగా చెప్పలేము."

నాకేమీ అర్థం కాలేదు. ఏమిటి ఈ భాష! "ఇదిగా ఉండటం ఏమిటి - గట్టిగా చెప్పలేకపోవటం ఏమిటి! -" అని నేను అడిగాను. ఆవిడ నవ్వి "మీకు తెలియకపోతే మానె. దానికి తెలుస్తుందిలెండి వ్రాయండి. శాస్త్రి, రాధా, విజయలు అంతా కులాసాగా ఉన్నారు. తెనాలిలోనూ, గుంటూరులోనూ మనవాళ్ళ అందరి క్షేమం వ్రాయించవలెను".

వ్రాశాను. అక్కడికి ఒక విధంగా ఉత్తరం పూర్తి అయినట్లే తోచింది. "అయినట్లే కదూ?"

ఈ ప్రశ్న విని ఆశ్చర్యపోతూ, "మీకింత మాత్రం తెలియదేమండీ, మీకు తోస్తుందేమోనని నేనూ ఇందాకటినుంచి కనిపెట్టి చూస్తున్నా. మీ బుర్రలో తట్టందే?"

నిజానికి ఇంకా ఏమి వ్రాయాలో నాకు తెలియలేదు. ఆలోచించినా తోచలేదు. "ఊహూఁ ఇంకా ఏమి వ్రాయాలో నాకు తోచటంలేదు."

కాంతం నా తలపై చెయ్యివేసి మునివ్రేళ్ళతో రెండుసార్లు కొట్టి- "ముఖ్యమైన విషయమండీ!" అన్నది.

"ఉహుం! లాభంలేదు"- అన్నాను.

ఆవిడ నా తలపైన పలయాకారంగా చేతిని త్రిప్పి మృదువుగా నొక్కి "అల్లుడు మాట ఏదండీ ఈ ఉత్తరంలో" అన్నది. "అమ్మాయికి వ్రాసే ఉత్తరంలో అల్లుడి సంగతి ఏముంటుంది?'' "నా బొంద, మీకు చెప్పినా తెలియకపోతే, మొగుడుమాట లేకపోతే పిల్లమనస్సు కష్టపెట్టుకోదూ! అల్లుణ్ణి గురించికూడా ఒక్క ముక్క వ్రాయండి.''

కొంతసేపు ఆలోచించినమీదట ఆ మాట నిజమే అని తోచింది. ఏమి వ్రాద్దామా అన్న ఆలోచనలో కలం చివరభాగం సగం నమిలి చివరకు- మా అల్లుడు కులాసాగా ఉన్నట్లు వ్రాయవలసినది- అని వ్రాశాను. చదివి వినిపించాను. కాని వినిపించుకొన్నట్లు లేదు. తరువాత సంగతి చెప్పమన్నట్లు చూశాను.

ఆవిడ ఇల్లాగ అన్నది. ''వాళ్ళ కాంతకు పెండ్లిఅయింది కదండీ. పెద్దమనిషి అయిందా" అని వ్రాయండి

"మనకెందుకే ఆ విషయం. అల్లుడు చెల్లెలు పెద్దమనిషి అయితే మనకేం, కాకపోతే మనకేం?"

"అవ్వా, మీ కెందుకూ ఆ గొడవ అంతా, వ్రాయండి.''

ఆ ముక్కకూడా వ్రాశాను. ఉత్తరం మొదటినుంచీ చదివి వినిపించమంది. చదివి వినిపించాను. కాంతం ముక్కి అన్నది. "నా బొంద, ఒక ఉత్తరం వ్రాయమంటే, ఇంత అవకతవకలుగా వ్రాసి నన్నేడిపిస్తారాయే, యెల్లాగ మిమ్మును పెట్టుకొని కాపురం చెయ్యటం!"

ఆవిడ ఎందుకు విసుక్కుంటున్నదో నాకు అర్థంకాక నేను తెల్లబోయి చూశాను. నాకు విషయం స్పష్టంగా చెప్పందే తెలియదని గ్రహించి ఇల్లాగ అన్నది. ''అమ్మాయిని రమ్మని వ్రాస్తిరిగదా, ఆయనను కూడా రమ్మని వ్రాసుకోరటండీ ! ఎన్నని నేను దగ్గరుండి చెప్పేది!"

నాకు కొంచెం విసుగుగా ఉంది. ఆవిడమాటను నేను కాదనలేదు. అల్లుణ్ణికూడా రమ్మని కోరుతున్నాను- అని మరోముక్క వ్రాశాను.

ఈ తఫా కాంతం విసుక్కుని-ఎవ్వ ఎన్ని చెప్పినా ఇంతే మీరు. అల్లా వ్రాయకూడదు. కొట్టేసి, మీరు భార్యాభర్తలు ఇద్దరూ బయలుదేరి రావలసింది, అని వ్రాయండి.

నేను మాట్లాడకుండా వ్రాస్తున్నాను. ఆవిడ ఇల్లాగ చెప్పింది. ''నీవూ అల్లుడూ తప్పక రావలసినది. దశమినాడే బయలుదేరండి, నాలుగురోజులు ముందుగా వస్తారు."

''ఆయన ఆఫీసు ఉందాయె. సెలవలు లేవాయెను, ఎట్లా వస్తాడే!" అన్నాను నేను.

"అదంతా మనకెందుకండీ, రాదల్చుకొంటే సెలవు పెట్టి వస్తాడు. రాకపోయినా రమ్మన్నారని సంతోషిస్తాడు-'' అన్నది కాంతం.

''అయిపోయిందా?"

"అయిపోక ఏముందిలెండి. 'ఏమో వ్రాశామని అనుకోవద్దు. తప్పక రావలెను' అనండి".

''పైన వ్రాసావుగా!"

"వ్రాస్తే ఏం? మళ్ళీ వ్రాయండి.''

"వ్రాశారూ! 'మీ కోసం ఎదురుచూస్తూ ఉంటాము. తప్పక దశమినాడే రండి'. వ్రాశారా?

"ఆఁ!"

''ఇంకా స్థలం ఉన్నట్లుందే !"

"స్థలానికేం ! స్థలం చాలా ఉంది."

"అయితే చూడండి, సూరమ్మ అత్తయ్యను, నాగమ్మ పిన్నిని కూడా సముద్రస్నానానికి తీసుకు రావలసినది.''

"ముసలమ్మలు వాళ్ళేం వస్తారే, ఊరికే వ్రాయటం కాని!"

BRAOU

"పాపం పెద్దవాళ్ళు ఓపిక చేసుకొని వస్తే రంగడి ఉత్సవాలు చూస్తారు. లేకపోతే రమ్మన్నందుకు సంతోషిస్తారు." నోరెత్తకుండా ఆవిడగారు చెప్పినట్లు వ్రాశాను. "ఒక్కసారి చదవండి మొదటి నుంచీ" అన్నది. నాలుగోసారి చదివి వినిపించాను

"పూర్తి అయిందా!"

"అయినట్లే గాని ఆ పూళ్ళో గోంగూర చౌక. నాలుగు వీసెలు గోంగూర, రెండువీసెల పచ్చిమిరప కాయలు తెమ్మని వ్రాయండి."

నేను మాట్లాడవల్సిరాలేదు. చెప్పినదల్లా వ్రాద్దామనుకొని వ్రాశాను. మళ్ళీ ఇంకోసారి చదవమంది. చదివితే విన్నది. సంతోషించినట్లే కనపడి ఇలా అన్నది. "బాగానే వ్రాశారు. ఇక చాల్లెండి. స్థలం లేనట్లుందే. ఉత్తరం కొసలలో కొంచెం చోటుందిగాని అక్కడ వ్రాయండి. మీరు ఇద్దరూ తప్పక రావలసినది అని."

"మళ్ళీనా ."

"వ్రాయండి" అని బతిమిలాడింది.

"ఏదే ఒక్కసారి వినిపించండి నేను వెళ్ళుతాను" అన్నది. చి॥ సౌ॥ మంగతల్లిని దీవించి వ్రాయునది. ఉభయకుశలోపరి. ఇక్కడ అంతా క్షేమం. మీ క్షేమం వ్రాయించవలెను. నీవు వ్రాసిన ఉత్తరం అందినది. సంగతులు తెలిసినవి.

చి॥ రాధిగాడు బాగా అల్లరి చేస్తున్నాడు. గంగాళంలో నీళ్ళు పారపోస్తున్నాడు. వాడు గుమ్మాలు కూడా దాటుతున్నాడు. గడపలు దాటినందుకు ఇవ్వాళ గారెలు వండు తాము. అక్క అక్క అంటున్నాడు. నీ కోసం బెంగపెట్టుకున్నాడు.

నీవు కార్తిక పౌర్ణిమ నాటికి ఈ వూరు రావలసినది. సముద్ర స్నానానికి రావలసినది. పెద్ద అక్కయ్య దాని మొగుడూ హైదరాబాద్‌లో ఉన్నారు. దాని ఒంట్లో కొంచెం ఇదిగా ఉంది. గట్టిగా చెప్పలేము. చి॥ శాస్త్రి, రాధా విజయలు అంతా కులాసాగా ఉన్నారు. తెనాలిలోనూ, గుంటూరులోనూ మన వాళ్ళ అందరి క్షేమం వ్రాయించవలెను. మా అల్లుడు కులాసాగా ఉన్నట్లు వ్రాయవలసినది. చి॥సౌ॥ శాంత పెద్దమనిషి అయిందా.పౌర్ణిమి నాటికి అల్లుణ్ణి కూడా రమ్మని కోరుతున్నాను. అంటే మీరు భార్యాభర్తలు ఇద్దరూ రావలసినది. నీవూ అల్లుడూ రావలసినది. దశమినాడే బయలుదేరండి. నాలుగురోజులు ముందుగారండి. ఏమో వ్రాశామని అనుకోవద్దు. తప్పక రండి. మీ కోసం ఎదురు చూస్తుంటాము. తప్పక దశమినాటికే రండి. సూరమ్మఅత్తయ్యను, నాగమ్మ పిన్నిని కూడా సముద్రస్నానానికి తీసుకొని రావలసినది. వచ్చేటప్పుడు నాలుగు వీసెల గోంగూర, రెండు వీసెల పచ్చి మిరపకాయలు తేవలసినది. మీరు ఇద్దరూ తప్పక రండి."

ఇట్లా ఉత్తరం పూర్తిగా వినిపించాను. కాంతం సంతోషించి పోస్టులో వెయ్యడానికి పంపే ముందు ఒక్క ముక్క వ్రాయమన్నది. అబ్బాయికి వాళ్ళ బావ ఒక కోతిని తెచ్చి యిస్తానన్నాడట. ఆయన వచ్చేటప్పుడు తెమ్మని వ్రాయండి. నేను కొంటాలేపోసి అన్నాను. ఆయన లేకపోతే అట్లాగే కొనవచ్చులెండి అన్నది ఆవిడ, ఆయన రాడేమో అసలు! అన్నాను! కాంతం వెళ్ళిపోయింది అవతలకు.

నేనుమటుకు "అబ్బాయికి కోతి కావాలట. నేను కొనేదా, నీవు వచ్చేదాకా ఉండేదా" అని వ్రాసి ఉత్తరం పోస్టుకు పంపాను.

[ఈ సంఘటనకు రంగస్థలం బందరు-మచిలీపట్నం. కార్తిక పౌర్ణమినాడు- దాన్నిపర్వదినం అంటారు- సముద్రస్నానంచెయ్యటం ఒక ఆచారం. కథలో 'రంగడి' ఉత్సవాలు బందరును అనుకొనివున్న చిలకలపూడి లోని పాండురంగ దేవాలయానికి సంబంధించినవి.]

# అభ్యాసం (రాసే పని)

1. కథలో (ఇటాలిక్) అక్షరాలతో వున్న జాతీయాల అర్థం వివరించండి.

2. ఈ క్రింది జాతీయాలను సందర్భోచితంగా ఉపయోగించి ఒక వాక్యమో, అవసరమయితే రెండు మూడు వాక్యాల్లో రాయండి:

*ఆట ఆడించు, ఆట కట్టు, ఆట పట్టించు, ఆట సాగు.*

*కళ్ళుమూసుకొను, కన్నుపడు, కన్నులకద్దుకొను, కళ్ళకుకట్టినట్టు, కళ్ళుపొరలుగమ్ము, కళ్ళలో వత్తులువేసుకొను, కళ్ళుకాయలుకాచు, కళ్ళొత్తుకొను, కళ్ళలోనిప్పులుపోసుకొను, కన్నులపండుగ, కళ్ళునెత్తికివచ్చు, కళ్ళుచల్లబడు, కన్నువేయు, కన్నెఱ్ఱ.*

*ఫక్కుమను, భగ్గుమను, ఉస్సూరుమను, మిసమిస, కళకళ, ధగధగ, చిటపట.*

*నోరుకొట్టు, నోరుచేసుకొను, నోరుతెరచుకొని కూర్చొను, నోరుతెరచు, నోరునొక్కుకొను, నోరు పారేసుకొను, నోరుమూయించు, నోరులేని, నోరూరు.*

3. ఈ కథలో కొన్ని పదాల, వాక్యాల ప్రయోగంవల్ల తెలుగువాళ్ళ సంప్రదాయ జీవనం తెలుస్తున్నది. ఉదాహరణకు (1) కార్తీక పూర్ణిమకు సముద్ర స్నానాలు చేయటం : ఇది మత సంబంధమైన విశ్వాసాన్ని సూచిస్తుంది. ఆ సంబంధమైన అలవాటు తెలియజేస్తున్నది. (2) నాలుగు వీసెల గోంగూర, రెండు వీసెల పచ్చి మిరపకాయలు: దీనివల్ల ఆ కాలంలో (సుమారు ముప్ఫయ్యేళ్ళ కిందటి వరకూ) వీసెలు అనే తూకాలు ఇప్పటి కిలోగ్రాముల బదులుండేవని తెలుస్తుంది. ఇట్లాంటివి ఇంకా కనిపిస్తాయేమో ఏరండి.

4. మామూలు భాషకూ ఉత్తరాల్లో శైలికి కొన్ని భేదాలుంటాయి. సాంప్రదాయికంగా ఉత్తరాల్లో పేర్లముందు కొన్ని విశేషణాలు వాడతారు.

చిన్నవాళ్ళలో మగవాళ్ళకి చి॥ అంటే 'చిరంజీవి' అనీ, చి॥సౌ॥ అంటే 'చిరంజీవి సౌభాగ్యవతి అయిన' అనే అర్థాల్లో వాడుతారు. ఇది అవతలి వాళ్ళపట్ల ప్రేమ, గౌరవం, తెలిపే ఒక సంప్రదాయం. ఇట్లాంటివి కొన్ని మీ పెద్దల దగ్గర్నుంచి గాని, పాత ఉత్తరాలనుంచిగాని సేకరించండి.

5. ఉత్తరాల్లో ఎక్కువగా కనిపించే కొన్ని రకాల క్రియా రూపాలున్నాయి. ఇవి ఉత్తరాల శైలిని సూచిస్తాయి. ఉదాహరణకు : రావలసినది, వ్రాయించవలెను, వ్రాయవలసినది. సంప్రదాయికంగా రాసే ఉత్తరాల్లో ఇట్లాంటి క్రియలు కనిపిస్తాయి. కుశల ప్రశ్నలూ, క్షేమసమాచారాలడగటం కూడా ఉత్తరాల్లో ఉంటాయి. మీకు తెలిసిన ఇట్లాంటి విశేషాలను మరికొన్నిటిని రాయండి. తెలియకపోతే సేకరించండి.

6. మీ తమ్ముడినో, చెల్లెలినో, మేనల్లుడినో మేనగోడలినో ఉద్దేశించి ఇట్లాంటి సాంప్రదాయిక ధోరణిలో ఉత్తరాల్లో కనిపించే శైలిని అనుకరిస్తూ ఒక ఉత్తరం రాయండి. క్రిస్మస్ పండగకో, సంక్రాంతి పండగకో ఆహ్వానిస్తూ రాయండి [ఈ ఉత్తరంలో కనిపించే సంప్రదాయాలకన్నా వేరైన సంప్రదాయాలుకూడా ఉండవచ్చు].

7. సంప్రదాయికమైన ఉత్తరాల్లో తెలుగు తిథులు వాడటం అలవాటు. ఇప్పటికీ పల్లెటూళ్ళలో ఇంగ్లీషు నెలలు, తారీకుల బదులు, సాంప్రదాయికమైన చైత్ర, వైశాఖాది నెలలూ, దశమి, ఏకాదశివంటి తిథులు వాడతారు. ఇవి ఏ బాలశిక్షలో అయినా, ఎక్కాల పుస్తకంలో అయినా దొరుకుతాయి. ఈ నెలలూ తిథులతో పరిచయం ఏర్పర్చుకోండి.

8. మునిమాణిక్యం నరసింహారావుగారి భాషా శైలి ఈనాటి తెలుగు అయినా కొంచెం పాతది అనిపిస్తుంది. అట్లా అనిపించటానికి కారణాలేమిటో ఉదాహరణలతో చూపించండి. ఉదాహరణకు: "వ్రాశాను, మిమ్ములను" వంటి మాటలు వాడటం ఒక కారణం.

9. మునిమాణిక్యం నరసింహారావు గారికి తమ సమకాలికులైన నవ్య కవులతో బాగా పరిచయం ఉంది. ఆ పరిచయ ప్రభావంవల్ల "క్షీర సముద్రోద్భూత తరంగ శిరో పరిభాగ స్థితి ఫేన పుంజ వినిర్గత ధావళ్య రేఖలు" అని పెద్ద సమాసం వాడారు. నిఘంటు సహాయంతో ఈ వాక్యానికి అర్థం రాయండి.

BRAOU

# ఖండిక 5 పాఠం 8

# సామెతలు

### ఉద్దేశం

సామెతలంటే ఏమిటో, భాషలో వాటి ప్రాముఖ్యం ఏమిటో అవగాహన కలిగించటం

### ప్రణాళిక

1. సామెతల వివరణ
2. సామెతలు, లోకోక్తులు
3. సామెతల ప్రాముఖ్యం
4. ముఖ్యవిషయ క్రోడీకరణ
5. అభ్యాసాలూ, ప్రశ్నలూ

### సామెతలు అంటే

సామ్యం అంటే పోలిక. దాని నుంచి 'సామెత' (సామెత < సామ్యత) పుట్టిందని పెద్దలు భావిస్తారు. అయితే మనం ఇప్పుడు 'సామెతలు'గా గ్రహించే అన్నింటిలో ఇట్లా సామ్యం ఉండదు. మరి వాటిని సామెతలని ఎందుకు అంటున్నారు?

ప్రకటించదలుచుకొన్న ఆలోచన అంతా వివరంగా చెప్పవలసిన పనిలేకుండా ఒక్క వాడియైన వాక్యంతో కొద్దిలో తేల్చివేసేటందుకు అవకాశాలు ప్రతి భాషలోను ఉంటాయి. అట్లాంటి సందర్భాలలో అవే వాక్యాలను తరచు ఆ భాష మాట్లాడే వాళ్లు వాడుతూ ఉండటం వల్ల అటువంటి చలామణీ ఆ వాక్యాలకు వచ్చింది. ప్రస్తుత సందర్భానికి సరిపోయే విధంగా, అటువంటి అనేక సందర్భాలకు కూడా సరిపోయేటట్లుగా సమాజంలో చలామణీకి వచ్చిన ఆ వాక్యాలు సూటిగా, చమత్కారంగా ఉండి ఆకర్షకంగా ఉంటాయి. మన సందర్భానికి పోలిన (సామ్యంగల) మరొక సందర్భం తెలిపే వాక్యం అనే అర్థంలో అటువంటి వాక్యాలను సామెతలు అంటున్నాము.

*'రుచి మరిగిన కుక్క చావగొట్టినా పోదు'.* అని ఒక సామెత.

కుక్కది దొంగతిండి. వండి పెట్టి ఉంచింది దాని కోసం కాదుగదా. అయినా వచ్చి రుచి చూసింది. ఆ రుచి మరిగిన కుక్క మాటిమాటికి వస్తుంది. ఛీ అన్నా పోదు. కొట్టినా పోదు. అది సందర్భం.

కాని ఈ సామెత ఉపయోగించేవాళ్ళు అన్ని వేళలా కుక్కను గురించే చెప్పరు. అట్లాంటి ప్రవర్తనగల మనుషుల గురించి చెపుతూ ఈ సామెత చెప్తారు. ఒక లంచగొండి ఉద్యోగి, అట్లాగే తప్పుడు పనులకు అలవాటు పడిన మరొకడు అటువంటి వాళ్ళ గురించి, వాళ్ళ స్వభావం గురించి ఈ ఒక్క వాక్యంతో ఎంతో అర్థవంతంగా వివరించగలుగుతాము.

సామెతలలో చమత్కారం ఉంటుంది. చమత్కారం, పోలిక అవి ఏవీ లేకపోయినా సామెత గొప్ప అర్థాన్ని ఎట్లా కొద్దిలో సూటిగా ఘాటుగా చెప్పగలిగిందో అదేవిధంగా ఆ ప్రయోజనం సమకూర్చగల వాక్యాలు-ముఖ్యంగా ఒక జీవితానుభవాన్ని లేదా ఒక ధర్మాన్ని, ఒక నీతిని ముచ్చటగా చెప్పే వాక్యాలు-కూడా సామెతలుగా చలామణీ అవుతున్నవి. నిజానికి వాటిని లోకోక్తులు అనాలి.

సామెతలు ఎక్కువగా ప్రజల నోళ్ళలో పుట్టినవే. అయితే ఏ కవిగాని, రచయితగాని ఎప్పుడయినా ఒక అందమైనవాక్యం సృష్టిస్తే అదికూడా సామెతగా (లోకోక్తిగా) ప్రచారంలోకి రావచ్చు.

BRAOU

సామెతలలో ఈ కింది లక్షణాలు ఉంటాయని విమర్శకులు చెప్పిన సారాంశం:

1. సంక్షిప్తంగా ఉండటం
2. ప్రచారంలో ఉండటం
3. చెప్పదలుచుకున్నదానిని ప్రభావవంతంగా చెప్పటం
4. చెప్పిన విషయం అందరూ గుర్తించే సత్యాన్ని లేదా ప్రయోజనకరమైన ఒక ఆలోచనను వెల్లడించేది కావటం
5. విస్తృతంగా పదిమందికి తెలిసినది, పదేపదే పదిమందీ వాడేది అయివుండటం
6. ఒక భావాన్ని లేదా అంశాన్ని సుబోధకంగా, దృష్టాంత పూర్వకంగా చెప్పటం
7. ఆ అంశం చెప్పటంలో అలంకార చమత్కృతి (తరచు) ఉండటం
8. అట్లా చెప్పిన అంశం లోకజ్ఞానానికీ జాతి అనుభవానికీ సరిపడి ఉండటం.

తెలుగు సామెతలలో అధికంగా మరో లక్షణం కూడా కనిపిస్తుంది. అది సామెతలో 'యతి, ప్రాసలు' ఉండటం.

1. *కాకిపిల్ల కాకికి ముద్దు*
2. *ఎంత చెట్టుకు అంత గాలి*

పైనున్న రెండు ఉదాహరణలను ఈ లక్షణాల దృష్టితో విమర్శించి చూద్దాం.

కాకి నల్లటి పక్షి. అందవికారంగా ఉంటుందనేది సామాన్య అభిప్రాయం. అటువంటి కాకికి కూడా తన పిల్లమీద ముద్దు వుంటుంది. కాకిపిల్ల తక్కినవారికి అందంగా, ముద్దుగా కనబడకపోయినా తల్లి కాకికి ముద్దుగానే ఉండటం సహజం గదా;

'తన' అన్న భావం ఉన్నచోట ఆ విధమయిన ప్రేమపుట్టుకువస్తుంది. తన పిల్లలే కానక్కర్లేదు. తనవాళ్లు, తన మాట, పాట, తను చేసిన పని ఇవన్నీ వ్యక్తులకు ప్రేమస్థానాలే. ఆ విషయాన్ని గూర్చి వ్యాఖ్యానించవలసి వచ్చినచోట ఈ సామెత ఉపయోగిస్తారు. ఒకడొక బొమ్మ గీశాడు-మురిసిపోతున్నాడు; లేదా ఒకపని చేశాడు-మురిసిపోతున్నాడు. ఒకడికి కావలసినవాళ్ళు ఏదో చేశారు- అతడు అందుకు మురిసిపోతున్నాడు, ఇట్లాంటి సందర్భం వచ్చినప్పుడు 'కాకిపిల్ల కాకికి ముద్దు' అంటారు.

ఈ వాక్యంలో ఆ భావమంతా ఇమిడిఉండటం చేత ఇందులో సంక్షిప్తత ఉంది. ఇది ప్రచారంలో ఉన్న వాక్యం. ఇదే అర్థాన్ని కోతిపిల్ల కోతికి ముద్దు; గాడిద పిల్ల గాడిదకు ముద్దు అనే రకం వాక్యాలద్వారా వెల్లడించే ప్రయత్నం చెయ్యవచ్చు. కాని అవి ప్రచారంలో లేవు; ఇది ప్రచారంలో ఉన్నది. ఈ వాక్యం ద్వారా చెప్పదలుచుకున్న అంశాల్ని అతికినట్లు చెప్పవచ్చు. ఈ వాక్యం లేదా సామెత వెల్లడించే సత్యం అందరూ గుర్తించేదే. అందరి అనుభవంలోనూ ఉన్న విషయమే ఇది. అందువల్ల పదిమందీ అటువంటి సందర్భం వచ్చినప్పుడు ఈ వాక్యాన్ని పదేపదే వాడుతూ వస్తున్నారు. ఈ వాక్యంలో 'తన' అన్నచోట ఉండే ప్రేమ 'కాకి' మీద పెట్టి చెప్పటం జరిగింది. కాకిని దృష్టాంతంగా తీసుకొన్నామన్నమాట. అట్లా చెప్పటం వల్ల ఆయా సందర్భాలలో మనకు కాకి, కాకిపిల్ల మనసుకు ప్రత్యేకం తట్టవు. ఆ మొత్తం వాక్యం యొక్క భావమే స్ఫురిస్తుంది. ఇది అలంకారశైలికి ఒక లక్షణం. ఈ విధంగా ఇది 'సామెత'; 'లోకోక్తి' అనిపించుకుంటుంది.

'ఎంత చెట్టుకు అంతగాలి' అన్నప్పుడు గాలి చెట్టును కదిలించి ఊపివేసేది. చెట్టు స్థిరత్వానికి గాలి ప్రతిబంధకం. చెట్టు పెద్దదైనకొద్దీ గాలితాకిడి కూడా ఎక్కువే అవుతుంది. ఏ స్థాయిలో ఉన్నవాడికి ఆ స్థాయిని బట్టి ఏవో ఇబ్బందులు ఉంటూనే ఉంటాయి అనే సకల మానవ అనుభవాన్ని ఈ లోకోక్తి వ్యక్తీకరిస్తుంది.

'కాకి పిల్ల కాకికి ముద్దు' అన్నప్పుడు కా, కా అని రెండు సార్లురావటంలో ధ్వని సంబంధమైన అందం వచ్చింది. ఒకే అక్షరాన్ని మళ్ళా కొంత దూరంలో తిరిగి వాడినా, లేదా ఆ అక్షరానికి ధ్వనిసామ్యం (ఉచ్చార

ఐలో దగ్గరితనం) ఉంటే అక్షరాన్ని కొంత దూరంలో వాడినా దానిని 'యతి' అంటారు. ఇది ఛందస్సులో ఒక నియమం ఒకొక్కసారి ఈ విధమైన మైత్రి ఆ స్థానంలో మొదటి అక్షరంగా కాక రెండవదిగా ఉంటుంది. ఉదాహరణకు రెండవది "ఎంత చెట్టుకు అంత గాలి." దీనిని ఛందస్సులో 'ప్రాస' అంటారు. ఈ విధంగా యతిగాని ప్రాసగాని ఉండటం చాలా తెలుగు సామెతలలో కనబడే ఒక పెద్ద విశేషం, మరికొన్ని ఉదాహరణలు:

| | |
|---|---|
| 1. పెళ్ళికి వెళ్తూ | పిల్లిని చంకన బెట్టుకు వెళ్ళాడట. |
| 2. మెరిసే దంతా | మేలిమి కాదు |
| 3. ఐతకని బిడ్డ | బారెడు |
| 4. అయినవారికి ఆకుల్లో; | కానివారికి కంచాల్లో |
| 5. ఊరంతా ఒక దారి | ఉలిపికట్టెది ఒక దారి |
| 6. అదుగో పులి అంటే | ఇదుగో తోక |
| 7. ఈ ఊరి కరణం | ఆ ఊరి వెట్టి |
| 8. నోరు మంచిదైతే | ఊరు మంచిదౌతుంది. |
| 9. బెండ్లు మునిగి | గుండ్లు తేలినట్లు |
| 10. మాటకు మా ఇంటికి | కూటికి మీ ఇంటికి |

జాగ్రత్తగా పరిశీలిస్తే జాతీయాలలో కనబడే కొన్ని లక్షణాలు సామెతలలోనూ కనబడతాయి.

జాతీయంలో ఉన్న మాటల విడివిడి అర్థాలు కలిపితే వచ్చే అర్థం కాక మొత్తం మీద వేరే అర్థమేదో రావటం ఒక ప్రధానలక్షణమని తెలుసుకున్నాం. ఉదా॥ వాడే చేతులు కాల్చుకొంటున్నాడు. చేతులుఅంటే మనకు తెలుసు. కాల్చుకోవటం అంటే తెలుసు, కాని చేతులుకాల్చుకోవటం అంటే మొత్తం మీద "వంట చేసు కోవటం".

ఇదే లక్షణం 'లోకోక్తి'లో కూడా గమనించాము. కాకిపిల్ల కాకికి ముద్దు అన్నప్పుడు కాకుల ప్రస్తావన లేకుండా భిన్నమైన మరో అర్థాన్నే ఆ వాక్యం ఇస్తున్నది.

జాతీయాలలో మాదిరిగానే సామెతలలో కూడా సమాజం యొక్క అనుభవమూ, ఆచార వ్యవహారాలూ, నమ్మకాలూ మొదలయినవి ప్రతిఫలిస్తాయి.

BRAOU

'పెళ్ళికి వెళ్తూ పిల్లిని చంకన బెట్టుకొని వెళ్ళాడట'. అన్న దానిలో పిల్లి ఎదురు రావటం అశుభమని భావించే విశ్వాసం కనబడుతుంది. 'పరిగెత్తి పాలు తాగేకన్నా నిలబడి నీళ్లు తాగటం మేలు' అన్నప్పుడు కలిగున్న దానితో సంతృప్తిపడే సమాజం యొక్క అనుభవమూ, వివేకమూ అర్థమౌతాయి. "విదియనాడు వెదకినా కనబడని చంద్రుడు తదియనాడు తానై కనబడతాడు." ఇటువంటి సామెతలన్నీ నిత్యసత్యాలనూ, జీవితానుభవ సారాన్నీ కాచివడపోసి సూక్తసరిగా చెప్పిన ముత్యాల పంక్తులు.

కొన్ని సామెతల వెనక చిన్నచిన్న జానపద కథలు, ఘటనలూ, అతిశయోక్తులూ కూడా ఉన్నాయి. "తాటిచెట్టు ఎందుకెక్కావురా అంటే దూడమేతకు అన్నట్టు." "దొందూ దొందే." "బొంకరా బొంకరా పోలిగా అంటే టంగుటూరి మిరియాలు తాటికాయలంతేసి అన్నాడట".

సామెతలు చెప్పేటప్పుడు రెండుమూడు గమనించదగిన పద్ధతులు తెలుగువాళ్ళలో ఉన్నాయి. "వెనకటి కెవడో చెప్పినట్టు" "సామెత చెప్పినట్టు"అని మొదలు పెట్టటం, 'అట, అన్నాట్ట, అన్నట్లు' అంటూ ముగించటం. ఒక్కొక్కసారి ఆ సన్నివేశానికి సంబంధించిన సామెత ఏదో చెప్పకుండానే *"నీ వ్యవహారమంతా ఏదో సామెత చెప్పినట్టుంది."* ఇట్లా అనటం.

*1. మా తాతలు నేతులు తాగారు. మా మూతులు వాసనచూడండి అన్నాట్ట వెనకటికి నీవంటివాడే ఒకడు.*

*2. సామెత చెప్పినట్టు, అడగనిదే అమ్మయినా పెట్టదు.*

*3. కదిలెవెడంత గుమ్మడికాయ కత్తిపీటకు లోకువని...*

*4. కడుపు చించుకుంటే కాళ్ళమీద పడుతుందన్నారు.*

లోకోక్తి కనక ఎవడో, ఎవరో అన్నాడట అనే పద్ధతిలో వీటిని వాడుతుంటారు.

జాతీయాలు ఎక్కువగా పదబంధాలే; సామెతలు అత్యధిక భాగం పూర్తి వాక్యాలు. ఒక్కొసారి సామెతల్లో రెండు భాగాలు సమతూకంలో పడి ఉండటమూ గమనించవచ్చు, చూడండి:

*1. మంచివాడు - మంచివాడంటే - మంచమెక్కి గంతులేశాట్ట*

*2. వాయులమేసే స్వాములకు పచ్చగడ్డి ఫలహారం*

*3. ఉప్పులేని కూర - పప్పులేని భోజనం.*

*4. మింగమెతుకు లేదు - మీసాలకు సంపంగి నూనె.*

*5. ఇంటిపేరు కస్తూరివారు - ఇంట్లో గబ్బిలాల కంపు*

**ఈ పాఠంలో మీరు నేర్చుకొన్న విషయాలివి :**

1. చాలా సందర్భాలకు సరిపోయేట్టుగా సూటిగా, చమత్కారంగా చెప్పే ఒక రకం వాక్యాలను సామెతలు అంటున్నాం.
2. కొన్ని సామెతలు జీవితానుభవాన్ని, నీతిని కూడా చెపుతాయి.
3. సామెతలు ఎక్కువగా ప్రజలవాడుకలో తయారయినవి. ఎప్పుడయినా ఒక కవి, రచయిత సృష్టించిన వాక్యం కూడా సామెతగా చెలామణి కావచ్చు.
4. సామెతలలో ఈ కింది ముఖ్యలక్షణాలను గుర్తించవచ్చు :

   అ) సంక్షిప్తత, ఆ) ప్రజల్లో ప్రచారం, వ్యాప్తి ఇ) లోక సత్యాలను చెప్పటం, ఈ) దృష్టాంతంతో ఉండటం. ఉ) అలంకారం కాని చమత్కారం కాని ఉండటం, ఊ) సాధారణంగా యతి ప్రాసలతో కూడి ఉండడం.
5. జాతీయాల్లో మాదిరి సామెతల్లోనూ జనుల నమ్మకాలూ, ఆచారాలు, అలవాట్లు కనిపిస్తాయి. కొన్ని సామెతలు కథల మీద ఆధారపడి ఉంటాయి.
6. సామెత చెప్పినట్టు, వెనకటికెవరో చెప్పినట్టు అనే మాటలు ప్రతి సామెతకూ చేర్చవచ్చు.
7. సాధారణంగా జాతీయాలు పదబంధాలు. అంటే వాక్యభాగాలు-సామెతలు సంపూర్ణ వాక్యాలు.

**అభ్యాసం [చదివేపని]**

ఈ దిగువ ఇచ్చిన 'శకునపక్షి' అనే నాటికను శ్రద్ధగా చదవండి. ఈ నాటిక కొత్త గడ్డ అనే నాటికల సంపుటిలోది. రచన నార్ల వెంకటేశ్వరరావుగారు.

శ్రీ నార్ల ప్రఖ్యాత పత్రికారచయిత, సంపాదకులు, వ్యాసకర్త, కవి, నాటకరచయిత. తెలుగులో, ఇంగ్లీషులో అనేక గ్రంథాలు రచించారు. నమ్మిన దృక్పథాన్ని శక్తిమంతమైన భాషలో, చక్కని తెలుగు పలుకుబడిలో సూటిగా చెప్పే నేర్పు ఆయనది. సొంత ముద్ర గల శైలి ఉన్న తెలుగు వచన రచయితలు కొద్ది మందిలో నార్ల ఒకరు.

శకున పక్షిలో నాటికా శిల్పం అటుంచి, చెప్పుకోదగినది తెలుగువారి సామెతల సంపదను ఆయన ప్రతిభావంతంగా ఇందులో రుచి చూపించిన తీరు. నాటికలోని తెలుగు వాతావరణ చిత్రణను కూడా గమనించండి.

BRAOU

# శకునపక్షి

## నార్ల వెంకటేశ్వరరావు

పాత్రలు

| | |
|---|---|
| రామయ్య: ఒక పల్లెటూరి గృహస్థు | మహాలక్ష్మమ్మ: అతని భార్య |
| వెంకట్రావు: అతని కుమారుడు | సీతాపతి: అతని వేలువిడిచిన బావమరిది |
| స్థలం: రామయ్యగారి ఇంటిచావడి | కాలం: వర్తమానం |

పల్లెటూరి ఆసామి ఇంటిచావడి. కుడివైపున సింహద్వారం; ఎడమవైపున పెరటిలోకి ద్వారం. ఈ రెండు ద్వారాలకు ఒక్కొక్క పార్శ్వంలో ఒక్కొక్క కిటికీ. ఎదురుగా మరి రెండుద్వారాలు; మొదటిది పడకగదిలోకి, రెండవది వడమటింటిలోకి. ఈ రెండు ద్వారాలమధ్య పసుపు కుంకుమలతో ఇనపపెట్టె. దానిపైన గోడ కొన్ని ధనలక్ష్మి పటం. దానికి ముద్దబంతిపూలదండ. వీధితల గోడ మూలకూ, పడకగది ద్వారానికీ మధ్యగా ఒక పెద్ద బీరువా. చావడిమధ్య ఒక పడకకుర్చీ; దానిచెంత ఒక బెంచీ.

రామయ్య: పడకకుర్చీలో కూర్చుని, బెంచీపైవున్న దస్త్రంలోనుంచి వరసగా దస్తావేజులు తీసి, వాటి పేజీలు తిరగవేస్తూ వుంటాడు. అతడు యాభయ్యోపడిలో పడినవాడు. కురచగా, బొద్దుగా, గుమ్మటాన్ని పోలినవాడు. గుండుముఖం, గుండ్రని పెద్ద కళ్ళు. నుదురుకూడా పెద్దదే. అంట కత్తిరించిన క్రాపు. మీసం గడ్డాలు లేవు. కొంచెం బొంగురుగొంతు. మాటతీరులో "వ్యవహర్తను సుమీ!" అనే భేషజం కనబడుతూ వుంటుంది. నీర్కావిధోవతి కట్టి, తెల్లలాల్చీ వేసుకున్నాడు.

మహాలక్ష్మమ్మ: చావడిలోనే ఒక ప్రక్కగా కూర్చుని, కందిపప్పు చేట ముందు పెట్టుకుని, రాళ్లు ఏరివేస్తూ వుంటుంది. వయస్సు నలభై ప్రాంతం. అశుభం శుభం యెరగని పల్లెటూరి ఇల్లాలు.

ముక్కుపైకి జారిన కళ్ళజోడును సరిగా తోసి, కొత్తదస్తావేజును అందుకోబోతూ, "కాసిని మంచినీళ్ళు తేవే!" అని రామయ్య అంటాడు. పప్పుచేట చావడిలోనే వదలిపెట్టి, మహాలక్ష్మమ్మ వడమటింటి గుమ్మం గుండా లోపలికి వెడుతుంది.

ఇంతలో సీతాపతి వస్తాడు. వయస్సు నలభై లోపు. పొడుగ్గా, కాయలాంటి శరీరంతో, తనాబిలాంటివాడు. సంస్కారంలేని చొత్తుక్రాపు; మాసిన గడ్డం; రొయ్యమీసం. పైకి వెర్రిబాగులవాడివలె కనపడినా, జిత్తులలో నక్కను మించినవాడు. నీర్కావి ధోవతి కట్టి, నీర్కావి బనియన్ వేసుకున్నాడు. భుజంపై తుండుగుడ్డ, చేతిలో వెదురుకర్ర.

రామయ్య: [అలికిడి కాకుండా వచ్చిన సీతాపతినిచూడగానే]. ఏం సీతాపతీ! ఇంతపొద్దుపోయాక ఇలా వొచ్చావ్?

సీతాపతి: [తెచ్చిపెట్టుకొన్న నవ్వుతో]. "పొద్దున్నే వచ్చిన వాన, పొద్దోయి వచ్చిన చుట్టం పోయేది లే"దని మా రామయ్య బావయ్యకు అప్పుడే దిగులుపుట్టిందేమిటి ?

రామయ్య: నీ సామెతలకేమిలే, అయినదానికీ, కానిదానికీ ఒక సామెత విసురుతూ వుంటావ్. ఇప్పు డెందు కిలా ఊడిపడ్డట్టు?

సీతాపతి: అం! ఏమీ లేదు, వూరికేనే.

రామయ్య: నువ్వూరికే రావే!

సీతాపతి: నీ కొకరి అంటూ సొంటూ గిట్టదు. "నన్ను ముట్టుకోకు నా మాలకాకి" అంటావ్. మరి అందర్లం అలా వుండగలమా?

రామయ్య: సర్లే! ఇంతకూ నువ్వొచ్చిన పనేమిటో చెప్పరాదూ? దాపరికం దేనికి?

apou
LIBRARY

సీతాపతి: *"పల్లొచ్చి ముంతడా స్తున్నా"*ననే నీదంతా చోద్యం, రామయ్య బావా!

రామయ్య: నువ్వు వెయ్యి చెప్పు; లక్ష చెప్పు. వూరికేనే వచ్చావంటే నేను నమ్మలేను.

సీతాపతి: [నవ్వుతూనే బెంచీపై కూర్చుంటూ]. *"లాభంలేని సెట్టి వరదను పోడంటావ్"* — అంతేనా? ఇఖ ఒక చుట్టం, పక్కం, రావడం, పోవడం, మంచీ, చెడ్డా ఏమీ లేదన్నమాటే!

రామయ్య: మాటలు నేర్చావులే! ఇంతకూ ఏమిటి సంగతి?

సీతాపతి: ఆఁ మరేమీ లేదు. మా లక్షువమ్మకు సుస్తీ చేసినట్టు విని, వుండబట్టలేక చూచిపోదామనొచ్చా! *"పిలిచి వస్తే మేనమామ కూతురు వరసకా"*దనే రకం నీది. నువ్వు నన్నెంత పరాయివాణ్ణిగా చూసినా, అది నాకు వేలిడిచిన చెల్లెలు. [పశమటింటి గుమ్మంగుండా మంచినీళ్ళ గ్లాసుతో మహాలక్ష్మమ్మ వస్తుంది]. నీ మాటే అంటున్నానమ్మా! నీకు నూరేళ్ళాయుస్సు. ఏమమ్మా?—కొంచెమేమో సుస్తీ చేసిందట!

మహాలక్ష్మమ్మ: ఔనన్నయ్యా! అసలే కొన ఊపిరిదాన్ని. ఈ గాడ్పులకు ప్రాణం మరింత బేజారై పోతున్నది. [ఈ మాటల్ని అంటూ భర్తకు మంచినీళ్ళు అందించి, తను వెళ్ళి పప్పు చేటముందు తిరిగి కూర్చుంటుంది.

సీతాపతి: కాదూ, మరి? *"రోహిణీ కార్తెలో రోళ్ళు బద్దలౌతా"*యని ఊరికే అన్నారూ? ఈ యేడు మరీ నిప్పుల్ని చెరుగుతున్నది. ఈ పడమటి గాడ్పులికి మా పిల్లలు అవిటిల్లి పోతున్నారు. చల్లబొట్టుకూడా లేదేమో, యెండి వొరుగై పోతున్నారంటే నమ్ము.

[వంగి కాసిని కందిపప్పు తీసి నోట్లో వేసుకుంటాడు.]

మహాలక్ష్మమ్మ: మీకిప్పుడు పాడి లేదేమే, అన్నయ్యా?

సీతాపతి: లేదమ్మా! నల్లపడ్డ యెండిపోయింది; పెద్ద గేదేమో యెత్తడి పోయింది; బోదావు పాలు దూడకే చాలడం లేదు. *"పాడిలేని ఇల్లు పాతాళలోకం"*. ఒక్కనీళ్ళయినా లేక నానా శెరా పడుతున్నాం.

మహాలక్ష్మమ్మ: పోనీ, యెక్కడైనా అణా పెరుగు వాడిక పెట్టుకోకపోయారా, అన్నయ్యా?

సీతాపతి: ఏమోనమ్మా! *"అమ్మబోతే అడివి; కొనబోతే కొరివి"*. అణా పెరుగన్న పేరే కాని, యిల్లు గడుస్తుందా, పెడుతుందా? అక్కడికీ ఈ మధ్య చిన్నల్లుడు పండక్కి వచ్చాడని ఆ ముసిలిముండలేదూ? -కాపు వీధి కామమ్మ- దాని దగ్గిర వారం రోజులు పెరుగు పోయించుకుంటే, లొటలొట నీళ్ళు పోసింది. అయితే అమ్మాయ్! మన పాలెం పడ్డ ఈనిందటగా?

మహాలక్ష్మమ్మ : ఈనింది. కాని, ఏం లాభం? నిన్న దూడ నిడుస్తూవుంటే, ఆ పాడుముండ - చెరువుగట్టు శేషమ్మ - కన్నుపడింది. దాంతో ఇఖ ఒక్క జీరైనా రాలిస్తే వొట్టు.

సీతాపతి : ఆ మాయదారిముండ మనకెక్కడ దాపరించిందమ్మా! *"నరుడి కంట నల్లరాయి పగులుతుంది"* పాటిమీది సాయబును పిలిపించి దిష్టితాడు వేయించక పోయావా?

మహాలక్ష్మమ్మ : మా చిన్న పాలేర్ని వెళ్ళిరమ్మంటే, ఆ వెధవ తలాయించాడు.

సీతాపతి : *"తిండికి తిమ్మరాజు, పనికి పోతురాజు."* ఈ పిదపకాలంలో పాలేళ్ళు తిన్నగా మాట వింటారుగాఁ! వాళ్ళకళ్ళు నెత్తికొచ్చాయ్. *"వత్తిగింజలు తింటావా బసవన్నా అంటే, ఆహా అన్నాడట; గంత కట్టనా బసవన్నా అంటే, ఊఁహు అన్నాడట."* అలావుంది వాళ్ళపనిప్పుడు. రేపునే వెళ్ళి ఆ సాయబును పిలుచుకొస్తాలే! ఇబ్బందో, సబ్బందో నువ్వురోజూ కాసిని మజ్జిగ నీళ్ళు పంపకపోతే మేం బతకడం కష్టం.

రామయ్య : [అప్పటి వరకు పడక కుర్చీలో వాలి, దస్తావేజుల్ని చూచుకుంటున్నవాడు చప్పున నిటారుగా కూర్చుని]. అదీ వరస; నేను ముందే అన్నాగా? ఏదో పని పడకపోతే నువ్వురానే?

సీతాపతి : వినవమ్మా, విను-మాబావగారి మాటలు! *"అయిన వాళ్ళకు ఆకుల్లోను; కానివాళ్ళకు కంచాల్లోను"*

మొన్న రెవెన్యూ ఇనస్పెక్టరుగా వస్తే, పెద్దడబ్బానెయ్యి సమర్పియామీ చేశాడు. కాని, కాసిని కుండ కడిగిన నీళ్లు నేనడిగితే, ఎన్ని చదువుతున్నాడో!

రామయ్య : నాకు తెలుసులే నీ సంగతి! కాలికి వేస్తే మెడకి, మెడకి వేస్తే, కాలికి, ఇంతకీ మాటలు నేర్చావ్, మజ్జిగకోసం వచ్చినవాడివి ముందే ఆ మాట చెప్పరాదూ? పరామర్శ, గిరామర్శ అంటూ ఈ నాటకమంతా దేనికి?

సీతాపతి : వెనకటి కెవడో *"కడుపులో లేంది కావిలించుకుంటే వొస్తుందా?"* అన్నాట్ట. నీకు నా వాళ్ళన్న మాటే లేనప్పుడు నేనెందుకోసంమొచ్చినా, ఏదో బాముకోడాని కొచ్చినట్టే వుంటుంది. అసలు నీ చెల్లెలు కూడా "మా వొదినకు సుస్తీగా వుందట, చూచొద్దా" మంటూ బయల్దేరింది. కాని, "పొద్దుపోయిందిలేవే, ఇప్పుడేమొస్తావ్?" అని నేనొక్కణ్ణే చక్కా వొచ్చా.

మహాలక్ష్మమ్మ : బావన్నయ్యా! పొద్దుపోయింది. [భర్తతో] ఏమండీ! అబ్బాయి ఇంతా భోజనానికి రాలేదు. పొద్దున్నెప్పుడో రెండు మెతుకులు తినెళ్ళాడు. లైబ్రరీలో వున్నాడేమో అటొక అడుగేసి రండి.

రామయ్య : వాడేమి చిన్నవాడా? చితకవాడా? వాడికి ఆకలైతే వాడే వొస్తాడు. సంసారం సంగతి సుతరామూ పట్టించుకోకుండా వాడు ఊరిమీద బలాదూర్ తిరుగుతుంటే వాడి వెనక నేను పరుగులెత్తలేను.

సీతాపతి: *"సముద్రం ఈదవచ్చు గాని సంసారం ఈదరాదు."* ఈ కాలపు నాగమ్మలకేం తెలుస్తాయ్, సంసారంలోని సాధక బాధకాలు? అన్నదమ్ముల్లో పంచుకున్నది నాలుగెకరాల కొండ్ర, దాన్ని నీ ప్రయోజకత్వంవల్ల నలభై యెకరాల కండ్రిక చేశావ్.

రామయ్య: [పొగడ్తకు లోలోపల సంతోషిస్తూ, పైకిమాత్రం]. ఆఁ! మన ప్రయోజకత్వ మేమున్నదిలే!

సీతాపతి: నీ ప్రయోజకత్వం కాకపోతే మరేమిటి, రామయ్య బావా? పట్టిందల్లా బంగారం చేస్తావ్. వ్యవహారాన్ని నడిపించడంలో కొమ్ములుతిరిగిన ప్లీడర్లయినా నీ తర్వాతే! నువ్వుకాబట్టి అన్ని కోర్టులూ తిరిగి, ఆ వారసత్వంవ్యాజ్యంలో నెగ్గుకొచ్చావు గాని, మరొకడైతే పేదకడిలా చతికిలబడేవాడు కాదూ?

రామయ్య: నువ్వైనా సామాన్యుడివా? ఐదుగురు ఆడపిల్లల్ని విరగడచేశావ్; అప్పూ సప్పూ లేకుండా గుట్టుగా సంసారం చేస్తున్నావ్.

సీతాపతి: ఆఁ! చెప్పుకోక, చెప్పుకోక నా మాటే చెప్పుకోవాలి! *"వాసిరెడ్డి వెంకటాద్రినాయుడు తులాభారం తూగితే; కరెడ్ల కామమ్మ పంచాయంభారం తూగిందట."* నీకంటె నాలుగెకరాలెక్కువే పంచుకున్నా. కాని, *"నానాటికీ తీసికట్టు నాగంభొట్లు"* అన్నట్టుగా వుంది నాపని. చివరికి పుగాకు పాయకైనా తికాణా లేదు. వెనకటికి నాబోటివాడెవడో *"దశాదశా రమ్మంటే, దరిద్రాన్ని పిలవమన్న"*దట. దశంటే నీదే దశ! ఏదీ, రామయ్యబావా! ఒక పుగాకుకాడిలా పారెయ్!

రామయ్య: ఇస్తాలే-కాస్త ఆగు [భార్యతో]. అయితే! ఏమే పడమటిపొలం క్రయం దస్తావేజు కనబడదేఁ?

మహాలక్ష్మమ్మ: ఏమో, నాకేం తెలుసు?- నేను వాటి జోలికీ సొంటికీ పోతాను గనకనా!

రామయ్య: [చావడిలోని బీరువా వద్దకు లేచి వెళ్ళి, దాని తలుపులు తెరచి, లోపలవున్న రికార్డులను ఒక నిమిషం ఇటూ అటూ తిప్పి]. ఈ బీరువాలోనే పెట్టిన జ్ఞాపకం. [మరొకక్షణం వెదకి]. ఊహూఁ! ఇక్కడ లేదు. గదిలో పెట్టలేదు గదా?

మహాలక్ష్మమ్మ: ఎక్కడ పెట్టుకున్నారో, ఏమో?- మీకే తెలియాలి! మీ కాగితాల కిల్లంతా చాల్డంలేదు.

రామయ్య: చాల్లే - ఇఖకట్టిపెట్టు! ఆ కాగితాల విలువ నీకేం తెలుసు. కొంపను నిలబెట్టినా, కూల్చినా వాటికే చెల్లు!

[ఈ మాటలు అంటూనే పడకగదిలోకి వెడతాడు.]

సీతాపతి: మా బావయ్యకు కాగితాలుంటేచాలు-కడుపు నింపుతుంది [చారెడు పప్పు తీసుకుంటూ]. సరేగాని, అమ్మాయ్! కాస్త మాటదక్కిస్తావుగా?

మహాలక్ష్మమ్మ: మజ్జిగమాటేనా? నువ్వింత యిదిగా అడుగుతూ వుంటే కాదనగలనా, అన్నయ్యా!

సీతాపతి: కాదన్నమాట నీనోట రావడమే! "కన్ను చూసి కాటుక; పిర్ర చూసి పీట" వ్యవహారం కాదు నీది. కలవారైనా, లేనివారైనా, చుట్టపక్కాలందర్నీ ఒక్క మాదిరిగా చూసుకుంటావ్. నువ్వు అడుగుపెట్టిన వేళావిశేషంవల్లనే ఈ యింటికింత అయిశ్వర్యమబ్బింది.

మహాలక్ష్మమ్మ: ఆఁ నాదేమున్నదిలే! అది మా అబ్బాయి అదృష్టం. వాడు కడుపున పడ్డాకే మాకు కలసొచ్చింది.

సీతాపతి: ఔనమ్మా! *"బిడ్డ పుట్టినవేళ; గొడ్డు వచ్చినవేళ"* అన్నారు. వాడి దసలు సిరిగల ముఖం. వాడి కంటె తెలివిగలవాడు ఈ వూళ్ళో వున్నాడా? వాణ్ణిమించి చదువుకున్నవాడున్నాడా? వాడి మాట, వాడి మంచి, వాడి మర్యాద—వాడికి వాడే తగు!

మహాలక్ష్మమ్మ: ఔనన్నయ్యా! ఊళ్ళో వాళ్ళందరు వాణ్ణి నెత్తినెట్టుకుంటారు. కాని, మీ బావయ్యకు మాత్రం వాడి పొడయినా గిట్టదు. అది మరి వాడి ఖర్మమో, నా ఖర్మమో!

సీతాపతి: ఆఁ మా బావయ్య మాటలకేమిలే? *నాయింటికి నేనే పెద్దను. పిల్లికి పెట్టరా పంగనామాలు"* అంటాడు. ఆయన మాటల్ని నువ్వు పట్టించుకో వద్దమ్మా! మన వెంకట్రావుకేఁ? నిక్షేపంలాంటి వాడు. *"తల్లికి తగిన బిడ్డ; ఇంటికి తగిన పందిరి"* అన్నారు. వాడివన్నీ అచ్చంగా నీ పోలికలే. కట్టుకున్న పెళ్ళాం మంచితనం మా బావయ్యకు తెలిసింది కనకనా. కన్నకొడుకు మంచితనం తెలియడానికి? పెద్దలన్నారుగా *"మూడగా, మూడగా గుర్రం గాడిదైం"*దని.

మహాలక్ష్మమ్మ : నువ్వు నిజం పలుకుతావన్నయ్యా! వాడికి వడసారం యిరవై యేళ్ళయినా లేవు. అథం ఖథం యెరగని పిచ్చిసన్నాసి. ఇప్పణ్ణుంచి వాణ్ణి సంసారం తీర్చి దిద్దమంటాడు. మీ బావయ్య.

సీతాపతి [తిరిగి కందిపప్పు అందుకోబోగా, మహాలక్ష్మమ్మ తానే బారెడు తీసి, అతని చేతిలో పోస్తుంది].

తనలా అందరూ నమలకుండా మింగాలంటాడు. ఇప్పుడేమంత పట్టించుకోకుండా తిరిగినా, నాలుగేళ్ళు పైబడితే, అంతా వాడే దిద్దుకుపోడూ? *"తుళ్ళే యెద్దే గోనె మోసేది."*

మహాలక్ష్మమ్మ : ఇప్పుడైనా ఏవో మీటింగులు, గీటింగులైతే వెళ్ళడం తప్ప. వాడైనా ఏమీ అల్లరి చిల్లరిగా తిరగడం లేదు.

సీతాపతి : అల్లరి చిల్లరిగా తిరగటానికి వాడు దద్దమ్మటమ్మా! చిన్నతనం నుంచీ చక్కగా చదువుకున్నాడు. మా దేవ్యాన్ని చూడు! మూడేళ్ళ నుంచీ ఇంకా మూడో క్లాసులోనే మిటకరిస్తున్నాడు. *"అన్నం చొరవే కాని, అక్షరం చొరవలేదు."* ఆఁ! అమ్మాయ్. అన్నమంటే చప్పున జ్ఞాపక మొచ్చింది. ఈ మండు వెంచాకాలంలో కూరా నార లేక ఏమి యిబ్బందిపడుతున్నా మనుకున్నావ్!

మహాలక్ష్మమ్మ : ఔ నన్నయ్యా! అందరికీ పెద్ద యిబ్బందిగానేవుంది.

సీతాపతి : నిజమేనమ్మా! ఇంతో అంతో అందరికీ యిబ్బందిగానే వుంది. కాని, మాకు మరీనీ! మునక సామెత చెబుతారుచూచావ్: *"మొగుడు లేకపోతే అప్పమొగుడు; కూర లేకపోతే పప్పుకూర"*—అలా వుంది మా పని. సాంబారు, కారం, మామిడికాయ పచ్చడీ పూటపూటా యెదాన వేసి కొట్టుకుంటున్నాం. నోరు చవి చచ్చిపోయిందంటే నమ్ము. అయితే, అమ్మాయ్! మా బావ బావిదొడ్డిలో కందా పెండలం పండింటా దటగా? నీకు పుణ్యముంటుంది-మాకు కాస్త పంపిద్దూ!

మహాలక్ష్మమ్మ : ఆఁ! దానికేమి భాగ్యం! రేపోమాపో అలాగే పంపిస్తాలే, అన్నయ్యా!

సీతాపతి : తోడబుట్టిందైనా అంత మాట మా మంగినోట వొచ్చింది కాదు. *"మాటలు తేటలు మాయింటను; మాపటి భోజనం మీ యింటను"* అంటుందది. సరిగాని అమ్మాయ్! నే వెళ్ళి మన వెంకట్రావును చూకేసిరానా?

రామయ్య [దస్తావేజుతో చావడిలోకి తిరిగి వస్తూ]: వొద్దులే! వాడికేం తీపరామా? వాడి కడుపు కాలితే వాడే వస్తాడు.

BRAOU

మహాలక్ష్మమ్మ : మీదంతా అడివిగోం; కాస్త వెళ్ళి పిలుచుకు రానిద్దురూ! వాడికోసం నేను కనిపెట్టుకు కూర్చున్నా.

రామయ్య (తిరిగి పడక కుర్చీలో కూర్చుంటూ) : వాడు పెత్తనాలు చేస్తుంటే, వాడికోసం నువ్వెగరడం దేనికి ? ను వెళ్ళి భోంచెయ్యి.

మహాలక్ష్మమ్మ : నా మాట కే మొచ్చె? భోంచేస్తాలెండి.

రామయ్య : వాడి కోసం కనిపెట్టుకు కూర్చుంటూ వేళకూ, పాళకూ తిండితినకపోతేనే ఈకాడి కొచ్చావ్. నువ్వు మూలబడితే ఇంటిచాకిరి నీ సవితి ఎవరొచ్చి చేస్తుంది?

మహాలక్ష్మమ్మ (కోపంగా, చేట వుచ్చుకొని లేచి) : చాల్లెద్దురూ! ఎవరైనా వింటే నవ్విపోతారు. బాగూ, ఓగూ లేదు. నోటికెంతొస్తే అంతా అనేస్తారు.

(పడమటింటిలోకి చరచర వెళ్ళిపోతుంది)

సీతాపతి (ఒక క్షణం తర్వాత) : ఏదీ, రామయ్య బావా! పుగాకు తునక.

రామయ్య (జేబులోనుంచి పొగాకు లెదర్ కేస్ తీసి, ఒక తునక అందిస్తాడు. తనకోసం ఒక తునక తీసుకొని, కేస్‌ను మళ్ళీ జేబులో పెట్టుకుంటూ) : కుర్రవాడు పెరిగొచ్చాడు గదా, ఇక చిన్నపనికీ పెద్దపనికీ ఆదు కుంటా డనుకున్నా. నేనైనా ఇంకెంతకాలం మొయ్యగలను ఈ బరువంతా?

సీతాపతి : (పొగాకు వాసన చూస్తూ) : అఁ! నీ బరువు నీకే కాని వాడికేం తెలుస్తుంది. *"మోసే వాడికే తెలును కావిడీ బరువు."*

రామయ్య : నేనైనా ఒక్కసారి బరువంతా యెత్తుకో మన్నానా? ఇప్పటి నుంచీ కాస్త కాడికింద కొస్తే మంచిదని మొత్తుకుంటున్నా.

సీతాపతి (పొగాకును పాయతీసి, ఉండచేసి, రొంటిని దోపుకుంటూ) : అదీ నిజమే! *"మొక్కై వంగనిది మానై వంగుతుందా?"* పొలం పని చేతనైనా, కాకపోయినా. ఇప్పటినుంచీ ఏదోకాస్త కలుగజేసు కుంటూ వుండాలి మరి.

రామయ్య : పొలంపని చేతకాకపోతే పోయె! కరణం లెక్కలూ, కోర్టు దస్తావేజులూ అయినా చూసుకోరాదూ? బియ్యేవరకు మిడికిన వాడికి ఆ మాత్రమైనా చేతకాదూ?

సీతాపతి : *"చదువుకున్న వాడికంటె చాకలి వాడు మేలు."* ఏమిటి ఈ కాలం చదువులు! వానాకాలం చదువులు; బియ్యే, గియ్యే సతికా మంటారుగాని, చివరికి చూదబోతే నోటిమీద పసూలెయ్యడమైనా చేత కాదు.

రామయ్య : ఏం చదువులో చట్టుబండలు: మొన్న ప్లీడరుగారి దగ్గరి కెళ్ళి, దావా వాయిదా వేయించుకు రారా అంటే. తెడ్డేమిరా కదిలాడు కాదు.

సీతాపతి : *"మాటలు కోటలు దాటతాయి; కాలు గడప దాటదు."*

రామయ్య : అబ్బె! అదీలేదు. ఇంటి పనికైతే మొండి కాని, ఊళ్ళో పనికైతే యెరిగి గంతేస్తాడు. అడ్డమైన పనికీ, అడ్డమైన వాడితో, అడ్డమైన చోటుకూ తిరిగి, కొంపకేమి చేటు తెస్తాడోనని బెంగపడి చస్తున్నా.

సీతాపతి : నిజమే రామయ్య బావా! *"పోరాని చోట్లకు పోతే రారాని మాటలు రాకమానవు"*. తనకేమి తక్కువ? మహారాజులా అనుభవిస్తూ ఇంటిపట్టున కూర్చోక, లేనిపోని గొడవలన్నీ మనవాడికెందుకో? *"కాలిది తీసి, నెత్తికి రాసుకోవడ"* మంటారు దీన్నే.

రామయ్య : అబ్బబ్బబ్బే; ఇంటిపట్టున కూర్చుండేదే ఎలా? అయితే, మరి సభలెవరు తీరుస్తారు? ఉపన్యాసా లెవ రిస్తారు?

BRAOU

సీతాపతి : "*పగటి మాటలు పనికిచేటు; రాత్రి మాటలు నిద్రచేటు.*" ఎందుకొచ్చినట్టు ఈ సభలూ, గిభలూ. (రామయ్య తుమ్ముతాడు) చూచావా, నా మాట నిజం! "*తుమ్ము తమ్ముడై చెపుతుంది*" సరిగాని, రామయ్యబావా ! నా ఆకుమడి బొత్తిగా అంటనే లేదు. "*దరిద్రుడు తలగడగబోతే, వడగండ్ల వాన వెంబడే వచ్చిం*"దట. పదిపోగుల ఆకు తక్కువ పడితే నువ్వు ఎలాగైనా కాస్త మాట దక్కించాలి.

రామయ్య : తడుపందక మా ఆకుమడి అంతంత మాత్రంగానే వుంది. మీ తమ్ముడు లక్ష్మయ్య నడగరాదూ? ఎకరం మడి పోశాడట.

సీతాపతి : *నంబీ! నంబీ! నాపెళ్ళికేమి సాయం చేస్తావంటే, నేనెదుట రాకపోవడమే సాయమన్నా*"డట అప్పే! వాడినడిగితే మాట పోతుంది. కాస్త రాలిస్తే నువ్వే రాల్చాలి.

రామయ్య : సరే! పిలుసుబట్టి చూస్తాలే!... ఏమైనా పొలంపనీ, ఇంటిపనీ, కోర్టుపనీ-అన్నీ నేనే చూచుకోవాలి. వాడేమీ పట్టించుకోడుగదా? ఇటు వ్యవసాయానికీ, అటు ఉద్యోగానికీ, కాకుండా చెడిపోయాడు. తాలూకా సభలనీ, జిల్లాసభలనీ చీటికీ మాటికీ బస్సెక్కి బస్తీలకు పరిగెత్తడం ప్రారంభించాడు కూడా.

(తనకోసం రామయ్య తీసి పెట్టుకున్న పొగాకు తునక కుర్చీ పక్కకు జారి పడుతుంది. అతడు దానిని గమనించడు)

సీతాపతి (రామయ్యదగ్గరికి జరిగి, జారిపడిన పొగాకు తునకను కాజేస్తూ) : "*చెబితే సిగ్గు, దాస్తే దుఃఖం*" వాడున్నాడే-వాడు, రామయ్యబావా! కొత్తపేట కోటయ్యగారి రెండోవాడు-వాడిపేరేదో యేడ్చింది.-ఆ వెధవ జతపట్టిన మన వాడు మరీ విధం చెడుతున్నాడు. "*మింగబోతే మెతుకులేదు, మీసాలకు సంపంగ నూనె*" అన్నట్టుగా వాడి సీటు, వాడిగోటు నువ్వెప్పుడైనా చూశావా?

రామయ్య: వాడా? వాడిపేరు గురునాథం కాదూ?

సీతాపతి: ఆఁ వాడే! "*కన్నెల పోయినోయి కనకలింగమా అంటే, వేసుకున్న ఖర్మమోయి శంభులింగమా*" అన్నాట్ట. ఆ వొంటికంటివెధవ జతపట్టాకే మనవాడిలా తయారయ్యాడు.

BRAOU

రామయ్య: మనకొక అంటా, సొంటా. వాడితో వీడికి జతలేమిటో?

సీతాపతి: అంటూ, సొంటూ కాకపోవడమేమిటి? "*వాడితండ్రీ, వీడితండ్రీ నయానా మగాళ్ళు*" కారూ?

రామయ్య: అప్పులపాలై వాడు కొంపా గోడూ తెగనమ్ముకున్నాడు. వాడితో...

సీతాపతి: కొంపాగోడూ లేకపోతేమాత్రమేం? పొద్దస్తమానం చేతిలో సంచొకటి ఉంటుంధిగా?" *ఇల్లుకాలింది జంగమయ్యా అంటే, నా జోలె, కప్పెరా నావద్దే వున్న*"వన్నాట్ట.

రామయ్య: ఆ గుర్నాథం తోడూ బొంగరంలేని సన్యాసి, సభలనీ, సంఘాలనీ రెండు, మూడు దఫాలు జెయిలు క్కూడా వెళ్ళాడు! వాడికేం? వాడెన్నివేషాలైనా వేస్తాడు.

సీతాపతి: ఔను! "*కోటివిద్యలు కూటికొరకే*". వాడికేం? వాడన్నింటికీ తెగించి కూర్చున్నాడు. ఆ గుర్నాథం గాడు "*నోరు వుంటే నవాబుసాయబు, అన్నంవుంటే అమీరుసాయబు, వీధపడితే ఫకీరుసాయబు; చస్తే పీరుసాయబు.*" ఏం జరిగినా, వాడికి పోయేదేదీలేదు.

రామయ్య [మనస్సు ఎక్కడో వున్నట్టు]: ఔనౌను.

సీతాపతి: దేశసేవ, గీశసేవ అంటూ ఆ సన్యాసి ఏమేమో పేలుతూ వుంటాడనుకో! కాని, "*చెప్పేవాడికి సిగ్గు లేకపోతే, వినేవాడికైనా వివేకం వుండొద్దూ*". పైగా, తనే బ్రహ్మాండ నాయకుడైనట్టు ఊళ్ళోవాళ్ళందరికీ పేర్లుపెడుతూ వుంటాడు. సామెత చెబుతారు చూచావా-"*కరూపి ఏమి చేస్తున్నాడంటే, పుడూపా అన్నీ లెక్కపెడుతున్నా*"డన్నట్టు వాడికి మరొక పనేలేదు.

రామయ్య: [నిట్టూరుస్తూ] ఈం బికారితో సమానంగా తిరిగితే ఇక మా వాడు ముందుకొచ్చినట్టే! చూడగా నా బ్రతుకంతా బుగ్గయిపోయేలా వుంది. వాడికోసం కాకపోతే, ఈ వేపుకాటంతా నాకు దేనికి?

సీతాపతి: ఎవరైనా రేపన్నరోజున్నదని కానాలి. "రూకలేనివాడు పోకచెయ్యడు." పోనీ, మంచో చెడ్డో తన కోసం తను ఖర్చుపెట్టుకుంటున్నాడు సరే! కాని, వాడికోసంకూడా మనవాడు ఖర్చుపెట్టడం దేనికి? అంతో ఇంతో ముట్టినంతవరకు వాడు బాగానే అంటకాగుతాడు. వెనకటికి "ఎక్కడికి పోతావు విధవమ్మా అంటే వెంటనేవస్తాను పదవమ్మా" అనిందట. వాడితో ఊతం చేస్తే మన వెంకట్రావు...

[వెంకటరావు ప్రవేశిస్తాడు. ఇరవైయేళ్ళవాడు. తల్లి పోలికకంటే తండ్రి పోలికలే ఎక్కువ. ఖద్దరు ధోవతి కట్టుకుని, రౌండ్ కాలర్ ఆఫారం వేసుకున్నాడు.]

వెంకటరావు: సీతాపతి మావయ్యా! నా ప్రశంస చేస్తున్నా వేమిటి?

సీతాపతి: ఆఁ! ఏంలేదురా బాబూ!

వెంకటరావు: ఏమీ లేకపోవడమేమిటి? ఇప్పుడే ఏమిటో అంటున్నావుగా?

సీతాపతి : అబ్బే! మరేమీ లేదు. నువ్వింకా అన్నానికి రాలేదని మీ అమ్మంటే మాటెంట మాటొచ్చింది.

వెంకట్రావు : ఏమైనా నా వూసు నీకు దేనికి?

సీతాపతి : "దూడ బర్రే వుండగా గుంజ అరిచిం"దన్నట్టు. నీవూసు నాకు దేనికిరా, బాబూ! ఇంత పొద్దు పోయింది, ఇంకా అన్నానికి రాలేదని మీ అమ్మంటే...

మహాలక్ష్మమ్మ : (పడమటింటిలో నుంచి వచ్చి) బాసురా నాయనా! ఇంత పొద్దోయేదాకా వుండకపోతే, వేళ కొచ్చి రెండు మెతుకులు తిని వెళ్ళరాదూ?

వెంకటరావు : ఏమంత పొద్దుపోయిందమ్మా?—నీ దంతా చోద్యం కాని! ఇంకా తొమ్మిదైనా కొట్టలేదు.

రామయ్య : ఊహుఁ! పొద్దుపోనేలేదు. మరి కాసేపు పెత్తనాలు మిడికీరా!

BRAOU

మహాలక్ష్మమ్మ : సర్లే మీ రూరుకుందురూ! వాడింటి కొచ్చేసరికి కసురుకుంటారు. (కొడుకుతో) రా, నాయనా! నువ్వు రా! కాళ్ళు కడుక్కో ! అన్నమెడ్డిస్తా.

(మహాలక్ష్మమ్మ పడమటింటిలోకి వెడుతుంది; వెంకట్రావు అనుసరిస్తాడు)

రామయ్య : చూశావా, వాడి వాలకం! నిజానికి దాని అలుసు చూసుకునే వాడింత నెత్తి కెక్కాడు. పనిపాటలు లేక పోయినా, వేళకు భోజనం చెయ్యడానికైనా తీరుబాటు కావడం లేదు.

సీతాపతి : "ఒక్క పనీ లేదు; తీరుబాటు లేదు" వెనకటికి నీలాటి పెద్దవాడెవడో సామెత చెప్పలేదూ, రామయ్య బావా?

వెంకటరావు (పడమటింటిలోనుంచి చరాలున తిరిగి వచ్చి) : ఏమిటది? పిచ్చిపిచ్చిగా వాగుతున్నావ్?

సీతాపతి : "మనుషులుండరు గాని, మాట లుంటా" యని పెద్దలన్నారు. కాస్త పెద్దంతరం చిన్నంతరం చూసి మాట్లాడు.

వెంకటరావు : "మంచి మనిషికొక మాట; మంచి గొడ్డుకొక దెబ్బ" అని కూడ పెద్దలన్నారు. మా గడప తొక్కొద్దని నీ కెన్నిసార్లు చెప్పలేదు? మళ్ళీ ఎందుకొచ్చావ్?

సీతాపతి : "మాటకు మాట తెగులు; నీటికి నాచు తెగులు." నీతో నాకు మాట లెందుకులే?

వెంకటరావు : నీ సామెతలు, గీమెతలు కట్టిపెట్టు. ఆ పప్పులు నాదగ్గర ఉడకవ్. జాగ్రత్తగా మసులుకోక పోతే...

(సీతాపతిపైకి ఉరకబోతాడు.)

రామయ్య : సర్లే! ఇక ఆగు! సంతోషించాం!

సీతాపతి ; కాగే కాగే పాలు, రామయ్యబావా. "పిల్లకాకి కేమి తెలుసు వుండేలు దెబ్బ."

వెంకటరావు: (ఆగిపోయి) : ఛీ, నోరుముయ్!

రామయ్య: (కోపంతో గద్దిస్తూ) : ఆఁ!

మహాలక్ష్మమ్మ: (కేక విని లోపలి నుంచి అడుగులో వచ్చి). నాకు వొక్కగాను వొక్క కొడుకు, వాడింటికి కొచ్చేసరికి ఏదో ఒక రభస ప్రారంభం!

సీతాపతి: "*ఒక కన్ను కన్నూ కాదు; ఒక కొడుకు కొడుకూ కాదు.*"

<table>
<tr><td>రామయ్య:<br>మహాలక్ష్మమ్మ:</td><td>ఒకే<br>సారిగా</td><td>ఛా ఛా! అశుభం మాట!<br>ఛీ ఛీ! వంకర కూత!</td></tr>
</table>

సీతాపతి: "*వడ్డవారు చెడ్డవారు కాదు.*" సరే అనండనండి; "*వోరిస్తే వోడుగల్లే వట్టు మాతుంది.*"

రామయ్య: [తమాయించుకుని] అంటే నీకు కోపంకాని నువ్వన్న మాటేమిటి, సీతాపతీ?

వెంకటరావు: "*శుభం పలకరా నంబెన్నా అంటే, పెళ్ళికూతురు ముండౌదన్నాడట.*" ఈ సామెత నీకు రాదేమిటి?—సీతాపతి మామయ్యా!

సీతాపతి: [దీన్ని వినిపించుకోకుండా] ఏదో నోరు జారిందిలే. రామయ్య బావా!

వెంకటరావు: [విడిచిపెట్టకుండా] కాని సీతాపతి మామయ్యా! "*కాలు జారితే తీసుకోగలంకాని; నోరు జారితే తీసుకోగలమా?*"

సీతాపతి: [దీన్నికూడా విననట్టే] రామయ్య బావా! "*బ్రహ్మకైనా పుండు రిమ్మతెగు*" అన్నారు. నేనన్నది పొరపాటే. నువ్వు దాన్ని మనస్సులో పెట్టుకోబోకు. మరి నే వెళ్ళొస్తాగాని, నారు మాట మర్చిపోబోకు సుమీ.

BRAOU

రామయ్య: అబ్బే వీల్లేదు సీతాపతి! మాది మాకే చాలదు.

సీతాపతి: "*దంచి నమ్మకు బొక్కిందే కూలి.*" సర్లే! ఇంకొక పుగాకు తునకైనా ఇలా పారెయ్.

రామయ్య: ఇందాక చెయ్యి జారింది చాల్లే.

సీతాపతి: నాకు తెలుసుగా నీ సంగతి: "*ఎక్కడైనా బావగాని, వంగతోట దగ్గిర మాత్రం బావ కాదు.*" మరి నే వెళ్ళొస్తాగాని, లక్షుమమ్మా! నీ వొళ్ళు కాపాడుకో! అసలే బక్కప్రాణం. రేప్పొద్దున్నుంచీ మజ్జిగ నీళ్ళకు పిల్లవాణ్ణి పంపుతానమ్మా!

మహాలక్ష్మమ్మ: ఒక్క గేదె పాడి. అబ్బే! మాకే తిన్నగా యిల్లు గడవడం లేదు.

సీతాపతి: పోనీలేవమ్మా! వీలులేనప్పుడు నువ్వేమి చేస్తావుగాని, కాస్త కందా పెండలమైనా పంపిస్తావుగా?

మహాలక్ష్మమ్మ: ఊఁ: కందా పెండలం మేమిక్కడ అరబెట్టుకు కూర్చోలేదు!

[వెంకటరావు పకపక నవ్వుతాడు.]

సీతాపతి: నవ్వకు. బాబూ! నవ్వకు. "*నవ్వూ నాలుగు విధాల చేటు.*" [దారిని పడుతూ] ఇలా నవ్వినవాళ్ళను చాలామందిని చూశాం. "*నడమంత్రపు సిరి నరాలమీది కురుపు.*"

<table>
<tr><td>వెంకటరావు:<br>రామయ్య:<br>మహాలక్ష్మమ్మ:</td><td>ఒకేసారిగా</td><td>నీ బొంద!<br>ఆరి భడవా!<br>నీ తల పగల!</td></tr>
</table>

[నార్ల వెంకటేశ్వరరావు, కొత్తగడ్డ, (తృతీయ ముద్రణ), మద్రాసు, డిసెంబరు 1956, పే. 85-106]

## అభ్యాసం [రాసేపని]

1. ఈ నాటికలో ప్రయోగించిన సామెతలన్నిటినీ ఏరి ఒకచోట రాయండి. ఈ పాఠంలో చెప్పిన లక్షణాలను ఆ సామెతల్లో ఒక పదింటికి అన్వయించండి. ఎంతవరకు సరిపడతాయో పరిశీలించండి.
2. ఈ నాటికలో ప్రయోగించిన సామెతలను దృష్టిలో పెట్టుకొని కొన్ని సామెతలను వివరించటానికి కొత్త లక్షణాలు అవసరమేమో పరిశీలించండి.
3. ఈ నాటికలో వచ్చిన జాతీయాలను ఏరండి.
4. జాతీయాలకూ, సామెతలకూ కనిపించే భేదాలను పోలికలనూ, ఉదాహరణం ద్వారా వివరించండి.
5. ఈ క్రింది సామెతలను ప్రయోగించే సందర్భం వివరించి మీరెట్లా ప్రయోగిస్తారో చూపించండి.

   1. చల్లకొచ్చి ముంత దాయటం.
   2. అమ్మబోతే అడివి కొనబోతే కొరివి.
   3. తిండికి తిమ్మరాజు పనికి పోతరాజు.
   4. బిడ్డ పుట్టిన వేళ గొడ్డు వచ్చిన వేళ.
   5. మింగబోతే మెతుకులేదు, మీసాలకు సంపెంగ నూనె.

6. 'శకునపక్షి' నాటికలో గ్రామీణ వాతావరణం ఉంది. ఉత్తరం కథలో అది కనిపించదు. ఈ తేడాను సూచించే అంశాలేమిటో గుర్తించండి.

BRAOU

# ఖండిక 6- పాఠం 9

# పదాలు, ప్రత్యయాలు

**ఉద్దేశం**

ఒక వాక్యంలో ఉద్దేశించిన అర్థాన్ని వెల్లడించడానికి, పదాలు ఒక పద్ధతిలో ఏపే మార్పులకూ చేర్పులకూ గురి అవుతాయో చెప్పటం. వాక్యంలో వివిధ పదాల మధ్య అన్వయం కుదరటానికి ఒక్కొక్క పదం, ఒక్కొక్క బాధ్యతను ఏ రకంగా నిర్వహిస్తుందో తెల్పటం.

**ప్రణాళిక**

1. మూలరూపం అంటే ఏమిటి? పదం రూపం ఎందుకు మార్చాలి?
2. భాషాభాగాలు
3. ప్రత్యయాలు
4. లింగ, వచన, విభక్తులు
5. క్రియా రూపాలు
6. ముఖ్యవిషయ క్రోడీకరణ

**మూల రూపం అంటే ఏమిటి? పదం రూపం ఎందుకు మార్చాలి?**

నిఘంటువుల్లో అకారాది క్రమంలో పదాలు అమర్చి, వాటికి అర్థాలు ఇస్తారని రెండవ ఖండికలో మీరు తెలుసుకున్నారు. పదాలను అన్ని సందర్భాల్లోను, అట్లాగే, అంటే నిఘంటువుల్లో ఇచ్చినట్లుగానే వాడటం మనకు వ్యవహారంలో సరిపోదు. ఆయా సందర్భాలను బట్టి వాటిని కొన్ని మార్పులతో వాడతాము. ఉదాహరణకు రాయి అన్న మాటనే తీసుకోండి. ఒకటి కంటే ఎక్కువగా ఉన్నప్పుడు లేదా ఉద్దేశించినప్పుడు రాళ్ళు అని అంటాము. *రాతిని, రాతి మీద, రాతిలో, రాతితో*— ఇట్లా రాయి అనే మాటను మార్పులతో చేర్పులతో వాడటం అవసరమవుతుంది. నిఘంటువుల్లో మాత్రం రాయి అనే మాటను లేదా రూపాన్ని ఒక ఆరోపంగా గుర్తిస్తారు. ఈ విధంగా గుర్తించిన రూపాన్ని **మూలరూపం** అని గ్రహిస్తూ ఉంటాము. సందర్భానుసారంగా ఈ రూపం మార్పులు పొందినట్లు చెప్పుకుంటాము. ఎటువంటి పదాలు ఏయే సందర్భాలలో ఏమేమి మార్పులు పొందటం గమనించామో వాటిని కొన్ని పద్ధతులుగా సూత్రాల కింద చేర్చుకొని వ్యాకరణంలో ఆ విజ్ఞానాన్ని ఒక భాగంగా చేసుకుంటాము.

BRAOU

## భాషాభాగాలు:

ఒక వాక్యంలో అన్వయం సరిగా కుదరటానికి (అంటే అర్థం సరిగా వచ్చేటందుకు) ఒక్కొక్క పదం ఒక్కొక్క బాధ్యత నిర్వహిస్తూ ఉంటుంది. కొన్ని వస్తువుల పేర్లు, గుణాలపేర్లు, జీవజాలం యొక్క పేర్లు, స్థలాల పేర్లు, కొన్ని అటువంటి వాటిని వర్ణించేవి, కొన్ని పనులను తెలిపేవి, కొన్ని పనులను వర్ణించేవి ఇట్లా వుంటాయి. వాక్యంలో ఉన్నప్పుడు ఆయా పదాలు నిర్వహించే బాధ్యతలనుబట్టి పదాలను భాషాభాగాలు (Parts of Speech) అనే పేరిట కొన్ని వర్గాలు చేసి చెప్పుకుంటాము. విశేష్యం (noun), విశేషణం (adjective), క్రియ (verb), క్రియావిశేషణం (adverb), అవ్యయం (conjunction, interjection మొ.), సర్వనామం (Pronoun) అని ఒక పద్ధతి విభాగం. మళ్ళావీటిలో రకరకాల వర్గాలు ఉంటాయి. వీటి నిర్వచనం, వివరణ ఇక్కడ ప్రస్తుతం కాదు.

## ప్రత్యయాలు:

ఒక మూల రూపం నుంచి మార్పులు చేర్పులు ద్వారా మరో రూపం లేదా రూపాలు సంపాదించే అవకాశం ప్రతి భాషలోనూ ఉంటుంది. ఆ చేర్పులనే 'ప్రత్యయాలు' అని సామాన్యంగా చెప్పవచ్చు. ఈ మాట మనకు సంస్కృతభాషా వ్యాకరణ శాస్త్రం నుంచి వచ్చింది. అక్కడ 'ప్రత్యయం' అంటే కచ్చితమయిన ఏ అర్థం ఉద్దేశించారో, తేడా లేకుండా అదే అర్థంలో మనం ఇక్కడ ఇప్పుడు ఆ మాటను వాడటంలేదు. స్థూలంగా మాత్రమే గ్రహిస్తూ ఉన్నాము.

## లింగ వచన విభక్తులు:

**లింగ వివక్ష:**

స్త్రీ పురుష వివక్ష మానవ సమాజంలో ప్రాథమికమైనవి. స్త్రీ జాతిని, పురుష జాతిని వేరుగా చెప్పటానికి అన్ని సందర్భాలలోను వేరువేరే మాటలు ఉపయోగించడం సులువుకాదు.

*మగవాడు — ఆడది*

ఈ రెండు పదాలకు రూపంలో ఎక్కడా పోలికలేదు. ఇటువంటివే- *ఆవు, ఎద్దు. బర్రె, దున్న. పుంజు, పెట్ట.*

ఇట్లా అన్ని జాతులకు వేరువేరుగా పేర్లు పెట్టుకుపోవడం సౌకర్యం కాదు. *ఆడ- మగ, పోతు - పెంటి* మొదలైన మాటలు ముందు చేరుస్తూ ఈ తేడా (వివక్ష) చూపటం తేలిక గదా! *ఆడలేడి, మగలేడి. ఆడకోతి, మగకోతి. పోతుపావురం, పెంటిపావురం.*

ముందు ఆడ-మగ అనే వివక్ష చేసే పదాలు చేర్చినట్లే పదాల చివరకూడా చేర్పులు చేసి చెప్పవచ్చు.

| | |
|---|---|
| *గుణవంతుడు* | *గుణవంతురాలు* |
| *విద్యార్థి* | *విద్యార్థిని* |
| *సొగసుకాడు* | *సొగసుకత్తె* |
| *సుందరుడు* | *సుందరి* |
| *డాక్టరు* | *డాక్టరమ్మ* |
| *చెంచు* | *చెంచెత* |
| *దొర* | *దొరసాని* |

**వచన వివక్ష:**

ఎక్కువ భాషలలో ఒకటి, ఒకటికంటె ఎక్కువ ఏక, బహువచనాల మధ్య తేడా గమనిస్తారు. (సంస్కృతం వంటి భాషల్లో ప్రత్యేకంగా 'ద్వి' (రెండు) వచనంకూడా ఉన్నది.)

తెలుగు బహువచనంలో లు, ళు, రు వంటి ప్రత్యయాలు కనబడతాయి. ఈ బహువచన ప్రత్యయం చేరే ముందు మూలరూపంతో కొన్ని మార్పులు రావటమూ గమనించవచ్చు.

| | | |
|---|---|---|
| *పలక* | — | *పలకలు* |
| *గది* | — | *గదులు* |
| *రాయి* | — | *రాళ్లు* |
| *గుడి* | — | *గుళ్లు* |
| *బండి* | — | *బండ్లు, బళ్లు* |
| *గోయి* | — | *గోవులు* |
| *వాలుడు* | — | *వాలురు* |

**విభక్తి:**

వాక్య సందర్భంలో ఇంకో పదంతో అన్వయం కుదరటానికి నామపదం కొన్ని ప్రత్యయాలను స్వీకరిస్తుంది. ఇవి అర్థాన్ని బట్టి చేరతాయి.

**వాడు** నాకు కనపడ్డాడు.

నేను **వాణ్ణి** చూశాను.

ఇక్కడ వాడు-ని ⟶ వాడిని ⟶ వాణ్ణి అనే విధంగా మార్పు వచ్చినట్లు గ్రహిస్తాము. 'ని' ద్వితీయావిభక్తి ప్రత్యయం అంటారు.

వాడు **రాముడు**

నేను **రాముడిని** చూశాను

ఈ పని **రాముడిచేత** కాదు

ఇది **రాముడి** పుస్తకం

నేను రాముడితో పనిఉంది వెళ్ళాను

**రాముడిలో** ఏం తెలివితేటలు చూసి మెచ్చుకొనేది

ఆ మాట **రాముడికి** చెప్పు

రాముడూ! ఇదిగో మాట!

ఇట్లా వివిధ సందర్భాలలో విభక్తి ప్రత్యయాలు చేర్చి మనం చెప్పదలుచుకొన్న అర్థం సుస్పష్టం చేస్తాము.

## క్రియా రూపాలు:

BRAOU

క్రియారూపాలు కూడా వీటికి అనుగుణంగానే మారుతూ వుంటాయి.

అతడు వచ్చాడు  వాళ్ళు వచ్చారు

నేను రాను  నువ్వు రావు.

తెలుగులో క్రియారూపం దాదాపు ఒక వాక్యంలాంటిది. ఉదాహరణకు 'వస్తున్నాడు' అని ఊరుకున్నా ఒకడు (ఏక వచనం, పుం లింగం) వస్తున్నట్లు తెలిసింది. 'వస్తున్నా' (నేను వస్తున్నాను). జాగ్రత్తగా చూడండి క్రియ మూల రూపం పయిన లింగ వచనాలను సూచించే ప్రత్యయం మాత్రమే కాక పని అయిపోయినదా, అవుతున్నదా, కాబోతున్నదా అనే 'కాలం'ను కూడా సూచించే ప్రత్యయం గమనించవచ్చు- వచ్చాను, వస్తున్నాను, వస్తాను (వచ్చు + 'అ' (తాటావులో వంటివి/ తు/ తా/ లలో ఒకటి కాల సూచకం).

**ఈ పాఠంలో మీరు నేర్చుకున్న ముఖ్యాంశాలివి :**

1. భాషలో కొన్ని శబ్దాలను మూలరూపాలంటారు. వాక్యంలో ఉపయోగించేటప్పుడు వానికి కొన్ని మార్పులు జరుగుతాయి.
2. వాక్యంలో కొన్ని పదాలు కొన్ని రకాల బాధ్యతలు నిర్వహిస్తాయి. వాటిని బట్టి విశేష్యం (నామం); క్రియ; నామ, క్రియా విశేషణాలు అనే భాషాభాగా లేర్పడతాయి.
3. ఒక మూలరూపం నుంచి చేర్పులు, మార్పులద్వారా కొన్ని రూపాలు ఏర్పడతాయి. ఈ చేర్పులనే ప్రత్యయాలంటారు.
4. కొన్ని మాటలకు వేరువేరు ప్రత్యయాలు చేర్చటం వల్ల స్త్రీ, పురుష బోధ ఏర్పడుతుంది. దీన్నే లింగ వివక్ష అంటారు.

5. ఒక వస్తువును తెలిపేది ఏకవచనం. ఎక్కువ వస్తువులను తెలిపేది బహువచనం. తెలుగు నామాలను (విశేష్యాలను) బహువచనంలో ఉపయోగించటానికి లు, ళు, రు, అనే ప్రత్యయాలు చేరతాయి.

6. వాక్యంలో ఒక పదానికి ఇంకో పదంతో అన్వయ సంబంధం ఉంటుంది. ఒక నామపదానికి (విశేష్యం) ఇంకో నామపదంతో కాని, క్రియతో కాని అన్వయం కుదరటానికి కొన్ని ప్రత్యయాలను చేరుస్తారు. వీటిని విభక్తి ప్రత్యయాలంటారు.

7. వాక్యంలో నామ పదాన్ని అనుసరించి క్రియా పదంలోనూ మార్పులుంటాయి.

8. తెలుగులో క్రియాపదం వాక్యంలాంటిదే. అంటే కొన్ని భాషల్లో ఒక వాక్యం బోధిస్తున్నంత అర్థాన్ని క్రియ బోధిస్తుంది. ఒట్టి క్రియాపదాన్నే వాక్యంగా ఉపయోగించవచ్చు.

9. క్రియ పదాలకు కూడా లింగ, వచనాలను, తెలిపే ప్రత్యయాలు చేరతాయి. అవే నేను, నువ్వు, అతను (అతడు), వాళ్ళు (వారు)—వంటి సర్వనామాల అర్థాలను కూడా తెలుపుతాయి.

10. క్రియా పదాలలో జరిగిన, జరుగుతున్న, జరగబోతున్న కాలాలను సూచించే ప్రత్యయాలుకూడా ఉంటాయి.

BRAOU

## ఖండిక : 6 పాఠం : 10

# పదాల మధ్య రూప సంబంధాలు

**ఉద్దేశం**

వాక్యంలో వివిధ సందర్భాలకు అన్వయం సరిపోయేటట్లుగా ఒక బాధ్యత నిర్వర్తించే పదం, మరొక బాధ్యత నిర్వర్తించడానికి అనువుగా మార్పులు, చేర్పులు పొందటం గమనించవచ్చు. అందుకు సంబంధించిన అవగాహన కలిగించటం.

**ప్రణాళిక**

1. పదాలమధ్య రూప సంబంధాలంటే?
2. నిష్పన్న రూపాలు
3. ఎరువు తెచ్చికొన్న పదాల రూపసంబంధాలు
4. ఉపసర్గలు
5. ఇంగ్లీషు నమూనాలో
6. ముఖ్యవిషయ క్రోడీకరణ
7. అభ్యాసాలూ, ప్రశ్నలూ

## పదాల మధ్య రూపసంబంధాలంటే?

BRAOU

ఈ వాక్యాలు పరిశీలించండి :

1. ఆయన చాలా *మంచి మనిషి*, కాని ఆయన *మంచితనం* ఆయనకు మేలుచేయలేదు.
2. ఈ కథ ఇట్లా *ముగిసింది*. *ముగింపు* నాకు నచ్చలేదు.
3. ఆయనే ఈ చిత్రానికి *దర్శకుడు*. ఆయన *దర్శకత్వం* కింద చాలా సినిమాలు వచ్చాయి.
4. ఆయన చాలా *నెమ్మదిగా* నడుస్తాడు. ఆ *నెమ్మది* అంతా ఇంతా కాదు.
5. గులాబిపువ్వు ఎంతో *సుకుమారంగా* ఉంటుంది ఆ *సౌకుమార్యం* మెచ్చుకో దగినది.

కింద *ఇటాలిక్‌లో* పెట్టిన పదాలు పరిశీలిస్తే మూలంగా ఉండే ఒకే రూపంతో సంబంధంగల రూపాలు ఏర్పడి వాక్యంలో వేరువేరు బాధ్యతలు నిర్వహిస్తున్న సంగతి గమనించవచ్చు. కిందటి పాఠంలో ఇటువంటి వర్గాలను భాషాభాగాలుగా గుర్తిస్తారని చెప్పుకున్నాము.

*మంచి మనిషి* — 'మంచి' నామవాచకాన్ని వర్ణించే పదం - విశేషణం

*మంచితనం* — ఆ వర్ణనకు ఆధారమైన లక్షణం - నామవాచకం

*ముగిసింది* — మూలరూపం 'ముగియు' (క్రియ)

*ముగింపు* — 'ముగియు' నుంచి వచ్చిన నామవాచకం

*దర్శకుడు* — నామవాచకం

*దర్శకత్వం* — నామవాచకం

*నెమ్మదిగా* — క్రియను వర్ణించే విశేషణం - క్రియావిశేషణం

*నెమ్మది* — నామవాచకం.

తేల్చి సారాంశంగా చెప్పుకుంటే ఒక భాషా భాగంనుంచి మరొక భాషా భాగానికి పదాలను మార్చుకునే వీలు, పద్ధతులు ఉన్నాయన్నమాట. ఇట్లా కొన్ని మార్పులు చేర్పులతో ఒక రూపంనుంచి మరొక (అర్థందృష్ట్యా) సంబంధించిన రూపాన్ని ఏర్పరచటాన్ని నిష్పత్తి ( derivation ) అనీ, అట్లా ఏర్పరచుకొన్న రూపాన్ని నిష్పన్నపదం ( derivative ) అనీ అంటారు.

ఒక నిష్పన్న రూపం ఏర్పడిన తరవాత, దాని మీదనుంచి ఇంకొకటి, దాని మీదనుంచి మరొకటి గొలుసుగా ఏర్పడటం కూడా తరుచుగా గమనించవచ్చు.

జాతి - జాతీయ - జాతీయత - జాతీయతావాదం - జాతీయీకరించు - జాతీయీకరణం -

## నిష్పన్న రూపాలు :

అన్నివిధాల నిష్పన్న రూపాలను, అవి ఏర్పడే పద్ధతులను సమగ్రంగా ఇక్కడ చెప్పటం సాధ్యంకాదు. వ్యవహారంలోనుంచి వాటిని గమనించి గ్రహించవచ్చు. అయినా కొన్ని కొన్నిటిని ఇక్కడ ఉదాహరణలుగా సూచించటం జరుగుతుంది.

| | | | |
|---|---|---|---|
| తియ్య | తియ్యన | పచ్చ | పచ్చన |
| వాడి | వాడిమి | వేడి | వేడిమి |
| మంచి | మంచితనము | గొప్ప | గొప్పతనము |
| తియ్యన | తియ్యని, తియ్యటి | పచ్చన | పచ్చని, పచ్చటి |
| తియ్య(న) | తియ్యగా | పచ్చ(న) | పచ్చగా |
| అందం | అందంగా | చేయు | చేత |
| తెలివి | తెలివైన, తెలివిగల | కాయు | కాపు |
| | | పోయు | పోత |
| | | ఎండు | ఎండ |
| | | మండు | మంట |

BRAOU

ఈ సందర్భంగా మరొక విశేషం కూడా గమనించాలి.

మన వ్యవహారంలో ఒకటి రెండు మూల పదాలను కలిపి ప్రత్యేకార్థంలో వాడటం ఉంది. వీటిని *'శబ్దపల్లవాలు'* అని అంటారు. సజీవమయిన తెలుగు వ్యవహారంలో వీటి పాత్ర చాలా ముఖ్యమైనది.

చదువు అనే పదమే ఉందనుకొండి. నామవాచకంగాను, క్రియారూపంగాను కూడా దీనిని గ్రహించవచ్చు. వాడు పట్నానికి చదువుకోసం వెళ్ళాడు (నామ); ఉత్తరం నేను చదివాను (క్రియ) 'చదువు'కు 'కొను' చేరిస్తే చదువుకొను. వాడు చదువుతున్నాడు; వాడు చదువుకొంటున్నాడు - ఈ రెండింటికి వేరువేరు అర్థాలు.

*కొను, ఆడు, పోవు, పోయు, వేయు, కొట్టు, పడు* వంటి క్రియలకు వాటి అర్థం వాటికి ఉండగా, అవి వేరేపదాలతో బాగా కలిసిపోయిన రూపాలలో ఇచ్చే అర్థాలువేరు. ఉదాహరణకు *కొను - ఆడుకొను; ఆడు - మాట్లాడు; పోవు - నిద్రపోవు; పోయు - తిట్టి పోయు; వేయు - ఎగ వేయు; కొట్టు - జై కొట్టు; పడు - సిగ్గు పడు.*

ఇట్లా సహాయ పదాలు చేరినప్పుడు రెండు పదాల చేరికలకు ఒక కొత్త అర్థస్ఫూర్తి రావటం తెలుగు జాతీయాలలో ఒక లక్షణం. *'తినిపోవు'*, *'ఎగబడు'*, *'కొట్టివేయు'*, మొదలయిన వాటిని పరిశీలించండి.

ఆడు _ ఆట, వేయు _ వేత వంటి విధంగానే ఆ సహాయక పదాలు చివరన ఉన్న రూపాలకు నిష్పన్న రూపాలు వస్తాయి. *పోట్లాడు - పోట్లాట; ఎగవేయు - ఎగవేత.*

## అరువు తెచ్చుకున్న పదాల రూపసంబంధాలు

తెలుగులో సంస్కృతంనుంచి, ఇతర భాషలనుంచి వచ్చి చేరిన పదాలు ఎన్నో ఉన్నాయి. వాటిలో

నిష్పన్న రూపాలు ఏర్పడే పద్ధతి అత్యధిక భాగం ఆయా భాషలలో ఉండే పద్ధతినే అనుసరిస్తాయి. ఈ కింది ఉదాహరణలు చూడండి:

| | |
|---|---|
| *అనుకూలం* | *ఆనుకూల్యం* |
| *ఆరోగం* | *ఆరోగ్యం* |
| *ఉన్నతం* | *ఔన్నత్యం* |
| *ఉదారం* | *ఔదార్యం* |
| *చక చక* | *చాకచక్యం* |
| *నిరాశ* | *నైరాశ్యం* |
| *కుటిలం* | *కౌటిల్యం* |
| *అర్థం* | *ఆర్థిక–* |
| *వ్యవహారం* | *వ్యావహారిక–* |
| *భారత* | *భారతీయ* |
| *గ్రామ* | *గ్రామీణ* |
| *నగర* | *నాగరక* |

వీటిలో కూడా ఒక క్రమ పద్ధతి ఉన్నది. దీనిని మంచి రచనలను చదువుతున్నప్పుడు గమనించి నేర్చుకోవచ్చు.

| | |
|---|---|
| *జమీన్* | *జమీన్‌దార్ - జమీన్‌దారీ* |
| *దివాన్* | *దివాన్‌గిరీ* |
| *పంచాయత్* | *పంచాయతీ* |
| *వకాలత్* | *వకాలత్‌నామా* |

BRAOU

అక్కడక్కడ వీటిని స్వేచ్ఛగా ప్రయోగించిన వాడుకలు కూడా తగలవచ్చు: *కలెక్టరీ, కలెక్టరుగిరీ,* బూట్సులు ఇతర భాషాపదాలను తెలుగులోకి తెచ్చుకోవటంలో, వాటిని నిష్పన్న రూపాలుగా వాడుకోవటంలో ఒక విశేషం చూడండి. డ్రైవు చెయ్యటం, టైపు చెయ్యటం, అప్లై చెయ్యటం, రిజైను చెయ్యటం ఆంగ్లంలో క్రియలుగా ఉన్నవాటినే తెచ్చి, చేయు అనే తెలుగు (సహాయక) క్రియ చేర్చి వాడటం. ఇందులో విశేషం. హిందీ, హిందీ ద్వారా వచ్చిన ఉరదూ, పర్షియన్, అరబిక్ పదాల విషయంలో (హిందుస్తానీ పదాలని ఈ మొత్తానికి పేరు) ఈ పద్ధతి లేదు.

*దబానా-దబాయించు; విలానా-విలాయించు; అట్‌కానా-అటకాయించు.*

మూలరూపంనుంచి నిష్పన్న రూపాలను సాధించినప్పుడు ఏదో కొద్ది అర్థభేదం కూడా కనపడవచ్చు:

| | |
|---|---|
| *పని* | *పనివాడు, పనివాడితనం (నేర్పరితనం)* |
| *నగరం* | *నాగరకత* |
| *సభ* | *సభ్యత* |

## ఉపసర్గలు

సంస్కృతంలో నిష్పన్న రూపాలు రూపం చివర చేరే 'ప్రత్యయాల'వల్ల మాత్రమే కాక రూపం ముందు చేరే మాట అంటే 'ఉపసర్గ'ల వల్ల కూడా సిద్ధిస్తాయి. అటువంటి వాటిలో మనకు ఎక్కువగా వచ్చేవి వ్యతిరేకార్థక రూపాలు. వ్యతిరేక అర్థం గల పదాలు ఒక్కొక్కసారి వేరువేరు పదాలు అయి ఉండవచ్చు, ఉదా: మంచి × చెడు; మేలు × కీడు. అటువంటివి అటు ఉంచండి. మూలరూపంలో మార్పు చేయటంవల్ల వచ్చేవాటినే మనం ఇక్కడ పరిశీలించాలి. ఇందులోనూ రకాలు ఉన్నాయి.

వ్యతిరేకతలో ఈ కింది రకాలు కొన్ని :

ఉన్నది × లేనిది

అయినది × కానిది

'గుణం' ఉంటే 'సగుణం' లేకుంటే 'నిర్గుణము'

ఇట్లా కొన్నిచోట్ల రెండు రూపాలకు ఉపసర్గలు చేర్చవలసి వస్తుంది.

ధర్మం (అయినది) × అధర్మం (ధర్మముకానిది)

ఇట్లా కొన్ని చోట్ల రెండింటిలో ఒక రూపంలోనే ఉపసర్గ చేరుతుంది.

ఆధునిక వ్యవహారంలో ఇటువంటి సందర్భాలలో కొన్ని ప్రత్యేక పదాంశ ముందుచేరే ప్రత్యయాల (ఉపసర్గల) వలె రూపం చివర చేరే ప్రత్యయాలవలె ఉపయోగించుకోవటం చూడవచ్చు :

ప్రమాద భరితం × ప్రమాదరహితం

చట్ట సమ్మతం × చట్టవిరుద్ధం

**ఇంగ్లీషు నమూనాలో :**

కొత్త విజ్ఞానం తెలుగులో చెప్పే అవసరం ఎక్కువైనకొద్దీ ఈ ప్రక్రియల అవసరం ఎక్కువవుతూ ఉండడమే కాకుండా అట్టి ప్రక్రియలు ఇంగ్లీషు నమూనాలో స్థిరపడుతూ ఉండటం గమనార్హం. ఇప్పుడు ఈ కింది ఉదాహరణలు పరిశీలించండి :

| | | | | |
|---|---|---|---|---|
| *–ism* | = | వాదం | జాతీయవాదం, | సామ్యవాదం |
| *–ise*<br>*–fy* | = | (ఈ)కరించు | జాతీయీకరించు, | విద్యుదీకరించు |
| *–isation*<br>*–fication* | = | (ఈ)కరణం | ధ్రువీకరణం | ఆధునికీకరణం |
| *–cracy* | = | స్వామ్యం | ప్రజాస్వామ్యం,<br>ధనికస్వామ్యం | ఉద్యోగిస్వామ్యం<br>భూస్వామ్యం |
| *–co* | = | సహ–సహోద్యోగి<br>సోదర–సోదర దేశభక్తులు | | |

శ్వేత శ్వేత + ఇతర = శ్వేతేతర

కొత్తగా వచ్చేపద్ధతులు ప్రచార మౌతున్నప్పుడు ఒకటి జరుగుతుంది. మొదట ఒక పద్ధతిని ప్రవేశ పెట్టే విద్యావంతుడు వ్యాకరణ బద్ధమైన ఒక రూపాన్ని ప్రవేశ పెడతాడు. అది వ్యాప్తిలోకి వచ్చినప్పుడు ఒక రూపాన్ని చూసి మరొక రూపం పోలిక మీద వాడతారు. అవి వ్యాకరణ బద్ధం కాకపోయినా ప్రచారంలోకి వస్తాయి.

వ్యతిరేక అర్థంలో ఒక పద్ధతి ఉన్నదానిలో ఒక భాగం పేర్కొని, ఆ భాగం కాక తక్కినవంతా అని చెప్పటం.

మనుషులు : తెల్లవారు తెల్లవారుగాని ఇతరులు

శ్వేత శ్వేత + ఇతర = శ్వేతేతర

అ + ఇ సంస్కృతంలో సంధిలో 'ఏ' అవుతుంది. దాని ముందుది 'అ, ఆ' కాకపోతే 'ఇ' 'ఏ' గా మారదు. అయితే 'ఇతర' అన్న రూపాన్ని సంధిలో ఎక్కువగా 'ఏతర' అన్న రూపంలో చూడటం అలవాటు కావటంతో పత్రికలలో హిందీ + ఇతర = హిందీ యేతర (భాషలు), ప్రాజెక్ట్ + ఇతర = ప్రాజెక్టేతర (వ్యయం) వంటి రూపాలు చలామణిలోకి వచ్చినాయి.

వ్యతిరేకతలోనే గమనించటానికి వీలయిన మరొక పద్ధతి ఆంగ్లభాషలో ఉన్నది. ఉదా॥ Official, unofficial, non-official. అఫీషియల్ అనే దానికే రెండు భిన్నార్థాలలో రెండు రకాల వ్యతిరేక పదాలు వాడుకలో ఉన్నవి. తెలుగులో చెప్పవలసివచ్చినప్పుడు వీటినే అధికార, అనధికార, అధికారేతర అన్న వాడుక వచ్చింది.

(ఇటువంటిదే legal, illegal, alegal)

ఆధునిక వ్యవహారంలో భాషలో ఇంతకు ముందు ఎరుగని కొత్తకొత్త రూపాలు, కొత్తకొత్త అర్థాలు, కొత్తకొత్త పదబంధాలు అవసరం కొద్దీ వస్తున్నాయి. ఇన్నాళ్ళూ ఇంగ్లీషులో సాగిన వ్యవహారాలు ఇప్పుడు తెలుగులో సాగవలసిన అవసరం రావటంతో రకరకాల అర్థాలను, భావాలను, వాటి ఛాయలను సమర్థతతో బోధించే ప్రయత్నాలు జరుగుతున్నాయి.

**ఈ పాఠంలో నేర్చుకున్న ముఖ్యాంశాలివి :**

1. ఒక భాషా భాగం నుంచి ఇంకో భాషా భాగాన్ని మార్చుకునే పద్ధతులు భాషలో ఉంటాయి. ఇట్లామార్చుకునే విధానాన్ని నిష్పాదన అంటారు. అట్లా ఏర్పడ్డ పదాన్ని నిష్పన్న పదం అంటారు.
2. ఇట్లా మార్చుకోటానికి ప్రత్యయాలు, ఒక్కోసారి కొన్ని మూలరూపాలు వాడతారు.
3. ఒకటి రెండు మూల పదాలను కలిపి ప్రత్యేకార్థంలో వాడితే దాన్ని శబ్దపల్లవం అంటారు. ప్రాచీన వ్యాకరణాల్లో నిష్పన్న పదం క్రియ అయితేనే శబ్దపల్లవం అనే మాట వాడేవారు.
4. మూల రూపాలకు ముందు చేరే వాటిని సంస్కృతంలో ఉపసర్గ లంటారు.
5. భిన్నార్థాల్లో నేటి తెలుగులో పదాలూ, ప్రత్యయాలు మూలరూపాలకు ముందూ వెనకా చేరతాయి.

   గుణం - స గుణం.

   ధర్మం - అ ధర్మం.

   చట్ట సమ్మతం - చట్ట విరుద్ధం.

6. ఒక్కోసారి సంస్కృతంలో వాడే రూపాల నమూనాలో కొన్ని కొత్త ప్రత్యయాల వంటివి తెలుగు భాషలో వ్యాప్తి చెందుతున్నాయి. ఆంధ్రేతర అనే రూపాన్ని ఆంధ్రా - ఇతర అని కాక ఆంధ్ర-ఏతర అని విడదీయటంవల్ల కాంగ్రెసేతర, కమ్యూనిస్టేతర వంటి మాటలు వాడుకలోకి వచ్చాయి.
7. పదాల మధ్య సున్నిత భేదాలను తెలపటంకోసం ఇంగ్లీషు భాష నమూనాలో కొత్త కొత్త రూపాలు భాషలో ఏర్పడుతున్నాయి. (ఇవి భాషను అభివృద్ధి చెందించే కొన్ని సాధనాలు)

## అభ్యాసం [రాసేపని]

1. ఈ కింద వాక్యసముదాయాలు ఉన్నాయి. ఒకదానికి తరువాతి దానికి అర్థంరీత్యా కొనసాగింపు ఉన్నది. అటువంటి వాక్యాలలోని ఖాళీలను వాక్యాల్లో కింద గీతలుంచిన మాటలనుంచి నిష్పన్నం చేసిన మాటలతో పూరించండి.

   ఉదా: ఈ యేడు మామిడి బాగా పూసింది. అయితే———అంతా రాలిపోయింది. (పూత)

   (1) అతను మాట్లాడటంలో మంచి నేర్పరి. కాని అతని———ఎందుకూ కొరగాకుండా పోయింది.

   (2) గోపి విమానం నడపగలడు. అతడు———దళంలో ఉద్యోగి తెలుసా?

(3) సభలో ప్రతికూల పక్షం వారే ఎక్కువ. వారి———తట్టుకోవటం కష్టం.

(4) తిరుగుబాటు చేసిన వారిని ప్రభుత్వం అణచివేసింది. అయితే ఆ———కొంత కఠినంగా ఉందనక తీరదు.

(5) న్యాయ మార్గాన్నే అనుసరించాలి.———మార్గాన్ని విడనాడాలి.

(6) 'సాహిత్యం' అనే రూపం——— నుంచి ఏర్పడింది.

2. నమూనాలుగా ఇచ్చిన రూపాలను చూచి ఆ పోలికమీద ఖాళీలు పూరించండి.

| | | |
|---|---|---|
| (1) కర్త - కర్తృత్వము | భోక్త——— | వక్త——— |
| (2) కర్త - కర్తవ్యము | వక్త——— | భోక్త——— |
| (3) అంగీకారము-అంగీకృతము | స్వీకారము——— | |
| (4) సుజనుడు-సౌజన్యము——— | సౌలభ్యము——— | |
| దుర్మార్గుడు——— | క్రూరుడు——— | |
| (5) విశిష్టము-వైశిష్ట్యము | వివిధము——— | |
| (6) ప్రధానము-ప్రాధాన్యము | ప్రముఖము——— | |

3. మీరు ఇంతదాకా ఈ పాఠ్యక్రమంలో చదివిన కథలు, వ్యాసాలలోనుంచి ఇటువంటి 25 పదాలు ఏరి వాటి నిష్పత్తిని చూపించండి.

BRAOU

## ఖండిక 7 పాఠం 11

# సమాసాలు, సమాస భేదాలు

**ఉద్దేశం**

ఒకటి కంటె ఎక్కువ పదాలను కలిపి వ్యవహారరీత్యా ఒక పదంగా చేసి సంక్షేప పద్ధతి సమాసాల కూర్పు గురించి తెల్పటం. వాడే సమాసాల రచన, వాటిలోని భేదాలను అవగాహన చేసుకొనేటట్లు చేయటం.

**ప్రణాళిక**

1. మాటల కుదింపు వల్ల కలిగే ప్రయోజనం
2. సమాసం అంటే ఏమిటి ?
3. సమాసాల విభజనలో సాంప్రదాయక పద్ధతులు
4. కొత్త పద్ధతి అవసరం
5. ప్రాధాన్యాన్ని బట్టి సమాసాలు
6. సమాసాల కూర్పులో పదాల్లో జరిగే మార్పులు
7. కొన్ని సమాసాల వివరణ
8. తెలుగులో కలిసిన ఇతర భాషలతో కలిపిన సమాసాలు
9. ముఖ్య విషయ క్రోడీకరణ
10. అభ్యాసాలూ, ప్రశ్నలూ

BRAOU

## సమాసాలు :

భాష వాడకంలో ప్రధానమైనది భావాన్ని ఎంత విస్పష్టంగా చెప్పగలిగితే అంత విస్పష్టంగా చెప్పటం. ఇంతవరకు మీరు చదివిన పాఠాల్లో ఒకే భావాన్ని దాని తీవ్రత, ప్రాముఖ్యం బట్టి అనేక విధాలుగా వ్యక్తీకరించ వచ్చునని గ్రహించారు. భావ వ్యక్తీకరణ పద్ధతి శైలికి సంబంధించినది. చెప్పదలుచుకున్న దానిని విడమరిచి చెప్పటమేకాదు. పొందికగా క్లుప్తంగా చెప్పటం కూడా శైలికి సంబంధించిన విశేషమే. (శైలిని గురించి రాబోయే ఖండికల్లో మరింత వివరంగా తెలుసుకుంటారు). భావ విస్పష్టత చెడకుండానే క్లుప్తంగా చెప్పగలగటం ఒక నేర్పు ; ఒక ప్రావీణ్యం ; మాట్లాడటంలో రాయటంలో కూడా ఈ నేర్పు అవసరం.

1. (అ) ఆయనకు దేశమంటే ఉన్న భక్తి గొప్పది.
   (ఆ) ఆయన దేశభక్తి గొప్పది.
2. (అ) మట్టి అంటిన చేతితో అది తాకవద్దు.
   (ఆ) మట్టి చేతితో అది తాకవద్దు.
3. (అ) వెండితో చేసిన కంచంలో అన్నం తిన్నాను
   (ఆ) వెండి కంచంలో అన్నం తిన్నాను.

ఈ ఉదాహరణలు చూస్తే మాటలను కుదించటం (వ్యాకరణ భాషలో చెప్పాలంటే, 'సమసించటం') ద్వారా వివరంగా చెప్పే కొంత అర్థం వివరించ వలసిన అవసరం లేకుండానే పని జరపవచ్చునని మీరు గ్రహిం చగలరు.

దేశమంటే ఉన్న భక్తి ⟶ దేశభక్తి
మట్టి అంటిన చేయి ⟶ మట్టిచేయి

వెండితో చేసిన కంచం → వెండి కంచం

ఇందువల్ల సమయం, ప్రయాస పొదుపు అవుతాయి.

సంప్రదాయ సిద్ధమయిన వ్యాకరణాల్లో, అర్థ వివరణను 'విగ్రహ వాక్యం' అనీ, మాటల పొందికను 'సమాసం' అనీ అంటారు.

సమాసంలో రెండే మాటలు కాదు ఎన్నైనా ఉండవచ్చు. వ్యవహారంలో మటుకు సాధారణంగా మూడు, నాలుగు పదాలకు మించిన సమాసం ఉండటం అరుదు.

సమాసానికి అర్థం చెప్పుకొనేటప్పుడు గుర్తించుకోవలసిన విశేషం ఏమంటే, సమాసంలోని ఒక పదం మరో పదంతో లేదా ఏ పదం మరే పదంతో అన్వయిస్తుంది అనే అంశం. ఈ ఉదాహరణలు చూడండి :

| | |
|---|---|
| దేశ స్వాతంత్ర్యం | దేశంయొక్క స్వాతంత్ర్యం |
| భారతదేశ స్వాతంత్ర్యం | భారతం అనే పేరుగల దేశం-<br>ఆ దేశం యొక్క స్వాతంత్ర్యం. |
| భారతదేశ స్వాతంత్ర్యం సంగ్రామం | భారతం అనే పేరుగల దేశం-ఆదేశం యొక్క<br>స్వాతంత్ర్యం-దానికోసం జరిపిన సంగ్రామం. |

కాని ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం అన్నప్పుడు - 'ప్రథమ'కు 'స్వాతంత్ర్య'కు కాదు సంబంధం- 'ప్రథమ'కు 'సంగ్రామం' కు- ఇట్లాంటివే ఈనాడు అధికంగా కనబడే పేర్లు - ఉదాహరణకు ప్రభుత్వ జ్వర చికిత్స ఆసుపత్రి – ఇందులో 'ప్రభుత్వ' అన్నది 'ఆసుపత్రి'తో అతుకుతుంది. లేదా అన్వయిస్తుంది కాని పక్కనే ఉన్న 'జ్వర'తో కాదు ; నిన్న కొన్న ఎర్ర అట్ట పుస్తకం. 'నిన్నకొన్న'ది పుస్తకం కాని ఎర్ర అట్ట కాదు గదా !

BRAOU

వ్యాకరణంలో సమాసం అంటే ఏమిటని ప్రశ్న వచ్చినప్పుడు వేరు వేరు పదాలు కలిసి ఒకే పదం మాదిరిగా వ్యవహారంలో ఉపయోగపడటం అంటారు. సమాసంలోని వేరు వేరు పదాల స్వభావమూ, వాటి పరస్పర సంబంధమూ దృష్టిలో పెట్టుకొని ఈ సమాసాలను మన సంప్రదాయసిద్ధమైన వ్యాకరణంలో కొన్ని వర్గాలుగా విభజించారు. ఆ పేర్లు కొన్ని మీకు ఇంతకుముందు పరిచయం అయితే అయి ఉండవచ్చు: ద్విగు, బహువ్రీహి, రూపక, తత్పురుష, కర్మధారయ, ద్వంద్వ సమాసాలు. ఈ విధమయిన వర్గీకరణ కొంత వరకు సమంజసంగానే కనిపించినా పూర్తిగా భాషలోని అన్ని సమసాలతత్వాన్నీ ఇది వివరించలేదు. ముఖ్యంగా తత్పురుషసమాసాలు. రెండుపదాల మధ్య విభక్తి ప్రత్యయాలను లోపింపజేసి సమాసంగా కలిపినప్పుడు ప్రత్యయం లోపిస్తుందే కాని ఆ సంబంధం అట్లాగే ఉంటుంది. ఆ సంబంధాన్నిబట్టి తత్పురుష సమాసాలకు పేర్లు పెట్టారు. ఉదాహరణకు నెలతక్కువ పిల్లడు. ఇక్కడ నెల తక్కువ అంటే సాధారణంగా నవమాసాలు మోసి కనే సమయం.కంటే ముందే పుట్టినట్లు. దీనికి నెల (చేత) తక్కువ అని అర్థం చెప్పి 'చేత' తృతీయావిభక్తి గనక నెలతక్కువ తృతీయావిభక్తి తత్పురుష అంటారు. చోరభయం-అంటే చోరుల (వలని) భయం అని అర్థం చెప్పి వలన పంచమీ విభక్తి కనుక చోరభయం పంచమీతత్పురుష అనీ అంటారు. ఏడు విభక్తులు ఉన్నాయి. సమస్తరకాల సంబంధాలు ఈ ఏడు విభక్తులలోకి సర్దివేయవచ్చు అనుకోవడం సమంజసంగా కనబడదు. కనుక సమాసాలను అర్థం చేసుకోవడానికి మరొక పద్ధతి యోచించవచ్చు.

| | | | |
|---|---|---|---|
| మట్టి బండి | మట్టి బొమ్మ | మట్టిచేయి | |
| మట్టిగంప | మట్టిరంగు | మట్టి మనిషి | మట్టిబుర్ర. |

ఈ సమాసాలను చూడండి.

మట్టిబండి — మట్టితో చేసిన బండి కావచ్చు, మట్టినింపి తీసుకువస్తున్న బండి కావచ్చు సందర్భాన్ని బట్టి తెలుస్తుంది.

| | |
|---|---|
| మట్టి బొమ్మ | మట్టితో చేసిన బొమ్మ |
| మట్టి చేయి | మట్టి అంటిన చేయి |
| మట్టి గంప | మట్టినింపిన లేదా మామూలుగా నింపటానికి ఉపయోగించే గంప |
| మట్టి రంగు | మట్టి ఏ రంగులో ఉంటుందో ఆ రంగు లేదా మట్టి యొక్క రంగు |
| మట్టి మనిషి | మట్టితో సంబంధం ఉన్న మనిషి |
| మట్టి బుర్ర | మట్టి మాదిరిగా పనికిరాని పదార్థం గల బుర్ర; అట్లాంటి బుర్ర ఉన్నవాడు |

'మట్టి'కి తరువాతి మాటకు ఉండే ఇన్నిరకాల సంబంధాలను వ్యాకరణ పద్ధతిలో వర్గీకరణ చేసిన సమాసాల పేర్లతో వివరించటం సులువు కాదు. కనుక సమాసం మనకు ఎట్లా అర్థం అవుతుందో ఆ అర్థాన్ని ఒక వాక్యంగా గ్రహించి, ఆ వాక్యం యొక్క అర్థానికి క్లుప్తీకరణగా సమాసాన్ని గ్రహించటం తేలిక.

| | |
|---|---|
| మట్టి చేయి | చేతికి మట్టి అంటింది. అట్లా అంటిన చెయ్యి |
| మట్టి బొమ్మ | బొమ్మ మట్టితో చేసినది. అట్లా చేసిన బొమ్మ |

అయితే సమాసాలను ఇంకొక విధంగా వర్గీకరించే అవకాశం ఉన్నది. రెండు పదాలు కూడి సమాసం అయినప్పుడు రెండు పదాలు కలిసి ఒకే పదంగా నిలబడతాయి. అప్పుడు వాటిలో ఒకే పదానికి ప్రాధాన్యం రావచ్చు, లేదా రెంటికీ సమ ప్రాధాన్యం ఉండవచ్చు, లేదా రెండూ కలిసిపోయి మరో చెప్పని అర్థాన్ని కూడా బోధించేది కావచ్చు. ఉదాహరణల ద్వారా ఈ విభేదాలను తెలుసుకుందాము:

*1. ప్రభుత్వ + ఉద్యోగి ⟶ ప్రభుత్వోద్యోగి*

ఈ రెండు పదాల సమాసంలో ప్రాధాన్యం రెండవ పదానికి ఏర్పడింది. ఆ సంగతి ఎట్లా తెలుస్తుంది? ఒక వాక్యంలోగాని మరికొన్ని ఇతర పదాలను సందర్భానుకూలంగా కలిపిగాని ఈ సమాసాన్ని వాడి చూడండి.

ఆయన ప్రభుత్వోద్యోగి
రిటైరయిన ప్రభుత్వోద్యోగి

'ఆయన' అన్నది ప్రభుత్వానికి చెందటానికి వీలులేదు. ఉద్యోగికి చెందుతుంది. అట్లాగే 'రిటైరయిన' అన్నది కూడా ఉద్యోగికి చెందుతుందే తప్ప ప్రభుత్వానికి కాదు. రెండు పదాలు సమాసం అయిన తరవాత కడపటికి నిలిచే భావం 'ఉద్యోగి' అన్నదే. ఉద్యోగులు చాలా సంస్థలకు చెందినవారు ఉండవచ్చు. వారిలో ఈ ఉద్యోగి ప్రభుత్వానికి చెందినవాడు. కనుక రెండు పదాలలోను ప్రధాన పదం స్థితి 'ఉద్యోగి' అన్నమాటదే.

రెండవ మాటకు ప్రాధాన్యం వచ్చినట్లే మొదటి పదానికి కూడా ప్రాధాన్యం రావచ్చు. 'గాంధీ మహాత్ముడు'. అంటే మహాత్ముడైన గాంధీ అనేదే మనం ఉద్దేశించే అర్థం. అట్లాగే శివాజీ మహారాజు. ఇట్లాటి వాటిలో మొదట ఒక వ్యక్తి యొక్క పేరు ఉంటుంది (proper noun) తరవాత వివరణ ఉంటుంది. యూరోపు ఖండం, హైదరాబాదు నగరం.

రెండు పదాలకు సమ ప్రాధాన్యం వచ్చేవి 'రామలక్ష్మణులు' వంటివి. రామలక్ష్మణులు వచ్చారు అంటే రాముడూ వచ్చాడు, లక్ష్మణుడూ వచ్చాడని అర్థం.

సమాసంలోని రెండు పదాలకూ అతీతంగా అర్థం బోధించేటువంటి సమాసాలు కూడా ఉంటాయి. ఇందాకటి ఉదాహరణ మట్టిబుర్ర: వాడుట్టి మట్టి బుర్ర. అంటే మట్టిబుర్ర ఉన్నవాడు అని అర్థం. మొత్తం అర్థం- మట్టికాదు బుర్రాకాదు. అట్లాంటిదే "ఎర్రటోపీ" ఒకప్పుడు దీని అర్థం పోలీసు. తలమీద ఎర్రటోపీ ఉన్నవాడు.

ఇట్లా పదాలను సమాసాలు కూర్చేటప్పుడు పదాల్లో కొన్ని మార్పులుకూడా వస్తాయని గమనించవచ్చు.

| | | | | |
|---|---|---|---|---|
| *గుఱ్ఱము* | + | *బండి* | → | *గుఱ్ఱపుబండి,* |
| | | | | *గుఱ్ఱబ్బండి* |
| చేయి | + | కట్టు | → | చేతికట్టు |
| ఇల్లు | + | వాకిలి | → | ఇంటి వాకిలి |
| మూడు | + | లోకాలు | → | ముల్లోకాలు |

సాహిత్యభాషలో ఇటువంటి మార్పులు బాగా కనిపిస్తాయి:

| | | | | |
|---|---|---|---|---|
| పేరు | + | ఉరము | → | పేరుటురము |
| సింహము | + | కొదమ | → | సింహపుఁ గొదమ; సింహంపుఁ గొదమ |
| రాజు | + | ఆనతి | → | రాజు నానతి |

ఈ మార్పులను టుగాగమం, నుగాగమం, రుగాగమం అని పేర్కొన్నారు. (అరసున్న రావటానికి, కకారం బదులు గకారం రావటానికి సాంప్రదాయిక వ్యాకరణాల్లో వివరణలు ఉన్నాయి. అవి ప్రస్తుతం అనవసరం).

ఇప్పుడు కొన్ని తరచుగా వచ్చే సమాసాల రూపాలను వివరణపూర్వకంగా తెలుసుకుందాం :

మొదటి పదం (పూర్వపదం) లేదా ఉత్తరపదం (రెండవది) సంఖ్యను తెలిపేది కావటం:

*ఏడేడు లోకాలు*   *చతుర్దశ భువనాలు*

*కవిత్రయము*   *దుష్ట చతుష్టయము*

మొదటిపదంకాని, రెండవ పదంగాని విశేషణం (adjective) వర్ణించే పదం కావటం:

*ఉత్తమ వ్యక్తి*   *సుందర భావము*

*నాయక శ్రేష్ఠుడు*   *అమాత్య శేఖరుడు*

BRAOU

మొదటి పదంగాని, రెండవ పదంగాని పోలికచెప్పేది 'ఉపమానం' కావటం:

*సముద్ర గంభీరుడు*   *శిలా హృదయుము*

*దయా సాగరుడు*   *(విక్రమ + ఆదిత్యుడు)*
విక్రమాదిత్యుడు

(సముద్రమువలె గంభీరమైనవాడు...ఇట్లా అర్థంచేసుకోవాలి.)

పోలిక తేవటంలో పోలికకోసం తెచ్చిన వస్తువు (ఉపమానం) దేనిని పోలుస్తున్నారో అది (ఉపమేయం) ఆ రెండింటికీ భేదంలేనట్లు చెపితే దానిని రూపకాలంకారమని అంటారు. రూపకాలంకారాన్ని ఇమిడ్చి సమాసం చెప్పవచ్చు.

*కోప + అగ్ని → కోపాగ్ని* (కోపం అనే అగ్ని)

*దుఃఖసాగర* (దుఃఖము అనే సాగరం)

తెలుగులో ఇతర భాషలనుంచి పదాలు, పదబంధాలు మొదటినుంచి చేరుతున్నాయి. మొదట్లో సంస్కృతం నుంచి, మధ్యకాలంలో హిందీ, ఉర్దూలనుంచి ఇటీవల ఇంగ్లీషునుంచి కొత్తమాటలు చేరాయి. ఇప్పటికీ అట్లాగే చేరుతున్నాయి. దానివల్ల తెలుగుభాషలో పదసంపద పెరుగుతుంది. ఈ చేరిన ఇతర భాషాపదాల మధ్యగాని, వాటికీ తెలుగు మాటలకూ మధ్యగాని సమాస సంబంధాన్ని సాంప్రదాయిక వ్యాకరణాలు అంగీకరించలేదు. అయినా ప్రాచీన రచనలో అరుదుగా అటువంటి సమాసాలు కనిపించేవి. విస్తృతమైన ఆధునిక రచనలలో ఈ రకపు సమాసాలు ఇంతకన్నా ఎక్కువగా కనిపిస్తాయి. వార్తాపత్రికా రచనలోనూ, రాజకీయ సంబంధమైన రచనల్లోను ఇట్లాంటి సమాసాలు తరచుగా కనిపిస్తాయి. ఉదా : *జనవాహుక, వర్గకసి, విప్లవచేవ, నఖాహుక్కులు.*

ఈ రకమైన సమాసాలు కొత్తగా ఏర్పడ్డప్పుడు కొత్తగా అనిపించినా అలవాటయిన తరవాత పాతబడి పోతాయి. అవసరమయినప్పుడు ఈ రకమైన సమాసాలు కల్పించుకోవటంలో తప్పులేదు.

**ఈ పాఠంలో నేర్చుకొన్న ముఖ్యాంశాలివి :**

1. భావాన్ని క్లుప్తంగా చెప్పటానికి సమాసం సాధనం
2. సమాసాల అర్థాన్ని వివరించే వాక్యాన్ని విగ్రహవాక్యం అంటారు.
3. సమాసాల్లో ఎన్ని మాటలైనా కలవవచ్చుగాని సాధారణంగా మూడు, నాలుగు మాటలకు మించిఉండవు.
4. సమాసాల్లో పదాల అన్వయం పక్క పక్కనఉన్న మాటలమధ్యనేకాక దూరంగా ఉన్న మాటలమధ్య కూడా ఉండవచ్చు. ఉదా : ప్రభుత్వ జ్వర చికిత్స ఆసుపత్రి.
5. ప్రాచీన వ్యాకరణాల్లో ఇచ్చిన ఏడు విభక్తుల తత్పురుష సమాసం, అన్నిరకాల సమాసాలను వివరించలేదు.
6. సమాసాలు కూర్చేటప్పుడు పదాల్లో కొన్ని మార్పులు జరుగుతాయి.
7. తెలుగుభాషలో కలిసిన ఇతర భాషా పదాలతో తెలుగు మాటలను కలిపి సమాసాలు కూర్చవచ్చు.

**అభ్యాసం (రాసేపని)**

1, ఈ కింద ఇచ్చిన సమాసాలు చదివి అర్థం విడమర్చి వ్రాయండి.

BRAOU

(ఉదా) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం - ఆంధ్రప్రదేశ్ అనే పేరు గల రాష్ట్రం

వ్యాపార సంస్థ - వ్యాపారం చేసే సంస్థ

రోడ్డురవాణా - రోడ్డు మార్గంగా చేసే రవాణా

మంత్రి మండలి - మంత్రుల యొక్క మండలి (సమూహం)

*1.* నూతన రచనలు *2.* శాసనసభ *3.* దక్షిణదిక్కు *4.* హోటలు భోజనం *5.* వాణిజ్య బ్యాంకు *6.* సినిమాహాలు *7.* అధిక ప్రసంగ *8.* తెలుగు సాహిత్యం *9.* పిచ్చి ఆసుపత్రి *10.* సూర్యాస్తమయం *11.* గుర్రప్పిల్ల *12.* కొయ్యబొమ్మ *13.* పంచపాండవులు *14.* నౌకాయానం *15.* గ్రంథావిష్కరణ *16* సన్మానసభ *17.* కవిసన్మానం *18.* కరువు కాటకాలు *19.* యుద్ధోన్మాదం *20.* విషాద మేఘాలు *21.* చట్ట వ్యతిరేకం *22.* నిషేధాజ్ఞలు *23.* పదేళ్ల కుర్రవాడు *24.* కూరగాయలు *25.* రెండు రోజుల ప్రయాణం *26.* ఉత్తర అమెరికా *27.* మందు సీసా *28.* హోమియోపతి వైద్యం *30.* కార్య రూపం

2. ఈ కింద విడివిడిగా మాటలను అర్థవంతంగా సమాసాలుగా కలిపి, ఏ అర్థంలో కలిపినది వివరించండి.

*1.* నోరు, మాట *2.* ఆర్థికం, అభివృద్ధి *3.* సభ, ప్రారంభం *4.* స్వాగతం, ఉపన్యాసం *5.* గానం, మాధుర్యం *6.* కావ్యం, నాటక *7.* ఉద్యోగం, ధర్మం *8.* సృష్టి, ఆది *9.* సాంఘికం, ఆచారం *10.* శబ్దం, అర్థం *11.* గురువు, శిష్యుడు *12.* వ్యవసాయం, పనులు *13.* ఆకలి మంటలు *14.* పూర్వం. పద్ధతి *15.* కథ, రచన. (సంస్కృతంలో : కథా)

3. ఈ కింద ఇచ్చిన వాక్యాలు చదివి, వాటిలోని కింద గీతలుంచిన భాగాలకు అర్థం చెడకుండా సమాసాలు కూర్చండి:

ఉదా: (1) వ్యవహారంలో వాడే భాష వ్యావహారిక భాష

(2) శ్రీనాథుడు కవులలో సార్వభౌముని వంటివాడు ⟶ శ్రీనాథుడు కవిసార్వభౌముడు.

(3) ఉద్యమం వలె వచ్చిన కవిత్వం  కవిత్వోద్యమం

ఉద్యమం గూర్చి వచ్చిన కవిత్వం  ఉద్యమ కవిత్వం

(4) పోతన భక్తుడు అయిన కవి  పోతన భక్తకవి

1) వియోగం వల్ల దుఃఖంతో కుమిలిపోయే ఆడదానికి వితంతువుగా ఉండవలసిన యోగం కల్పించింది కుళ్ళు సమాజం.

2) ఆమె జీవించిఉన్న కాలంలో అయిదుగుర్ని అలా రక్షించారట! ముగ్గురికి తర్వాత వివాహాలు అయ్యాయి! తక్కిన యిద్దరికీ శిశువులను హత్యచేయటం వల్ల వచ్చే దోషం రాకుండా కాపాడారట. గర్భవతియై వచ్చిన ఒక బ్రాహ్మణ స్త్రీ వితంతువును ప్రసవాలు చేసే వైద్యశాలకు పంపారట!

3) వీరేశలింగంగారు కార్యమే శీలంగా గల మహానుభావుడు; సంఘం తిరస్కరిస్తుందని ఆయన భయపడ లేదు.

4) వ్యాఖ్యానాలు రాయటానికి ఒక సంప్రదాయం ఉంది. అందులో ధర్మారావుగారిది సులభమయిన పద్ధతి.

5) నిఘంటువును నిర్మించటం సులభంగా సాధ్యమయ్యే పని కాదు.

6) ఇది చేనేత పనివారి వృత్తిలో వాడుకలో ఉండే పదాలకు సంబంధించిన కోశం.

7) ఇది శైవుల యొక్క సంప్రదాయం.

8) పూలు వర్షంలా కురిపించటం

9) ఇవి అనుబంధంగా ఉపయోగించే క్రియలు

10) కొన్ని దీర్ఘంగా, కొన్ని హ్రస్వంగా ఉండే అచ్చులు

11) తెలుగుభాష, తెలుగు సాహిత్యం, తెలుగు సంస్కృతి

12) ఇది విద్యకు, వినోదానికి పనికి వచ్చే కాలక్షేపం.

13) విద్యార్థులలో క్రమశిక్షణ లేకపోవటానికి ముందు వాళ్ళకి సైనికులకిచ్చే శిక్షణ ఇవ్వటమే అని కొందరి అభిప్రాయం.

14) నమస్సులనే సుమాలతో అంజలి ఘటిస్తున్నాను.

15) నివారించటానికి వీలులేని కారణాల వల్ల సభ కొంచెం ఆలస్యంగా ప్రారంభించవలసి వచ్చింది.

BRAOU

LIBRARY

BRAOU

apou
LIBRARY

# తెలుగు

## మౌలిక అంశాలు

**ఖండికలు: 1-4**

8680

BRAOU

Dr. B.R. Ambedkar Open University
University Library, Jubilee Hills, Hyd-33

T00298

ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

హైదరాబాదు

1983

# ఆధునిక భారతీయ భాషలు: తెలుగు

రచయితల బృందం

ఆచార్య చేకూరి రామారావు (సంపాదకుడు)

డా. కేతు విశ్వనాథరెడ్డి (సహ సంపాదకుడు)

డా. ఎం. వి. శాస్త్రి

డా. వి. లక్ష్మణరెడ్డి

శ్రీమతి ఏ. మంజులత

APOU
LIBRARY

A.P.O.U. LIBRARY
Acc. No. T-0298
Date 2.2.85
Call No.

T
494.827
TEL
UES. 1-20

BRAOU

ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విశ్వవిద్యాలయం
హైదరాబాదు
ప్రథమ ప్రచురణ 1983
కాపీరైటు © 1983 ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విశ్వవిద్యాలయం
అన్ని హక్కులు విశ్వవిద్యాలయానివి. ఈ పుస్తకంలోని ఏ భాగం అయినా ఉపయోగించుకోదలుచుకుంటే, విశ్వవిద్యాలయం అనుమతి పొందాలి.
ఈ పాఠాలు సార్వత్రిక విశ్వవిద్యాలయం పాఠ్యప్రణాళికలో ఒక భాగం.
పాఠ్యప్రణాళిక మొత్తం వివరాలు ఈ పుస్తకం చివరలో ఉన్నాయి.
ఇతర వివరాలకు : డైరెక్టరు, ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విశ్వవిద్యాలయం,
6-3-645 సోమాజిగూడ, హైదరాబాదు-500 004
ముద్రణ : ప్రగతి ఆర్ట్ ప్రింటర్స్, హైదరాబాదు (ఎపిఓయు కోసం)

ఖండికలు

1. రాసే అలవాట్లు

2.నిఘంటువులు

3.పదాలు, అర్థాలు

4.నానార్థాలు,పర్యాయ పదాలు

BRAOU

# ఆహ్వానం

ఆదిమ సమాజాల్లో భాష ప్రయోజనాలు పరిమితం. ఎక్కువ భాగం ఆ సమాజాల్లోని వారు నిత్య జీవితావసరాలకోసమే మాట్లాడుతారు. శ్రమలో భాగంగా కావచ్చు, ఉల్లాసంకోసం కావొచ్చు, వినోదం కోసం కావొచ్చు, అనుభవాలనూ జ్ఞానాన్నీ నలుగురితో పంచుకోవటం కోసం కావొచ్చు, బహుశా ఎప్పుడో ఒక పాటో పదమో అల్లుకోవచ్చు. ఎప్పుడన్నా కాసిని ఊకుడు కథలో, గాథలో చెప్పుకోవచ్చు. ఒక జాతి తన తరంలో నేర్చుకున్న విజ్ఞానాన్ని తరవాతి తరానికి అందించడం ఈ విధంగా నోటిద్వారానే సాధ్యంకాదు. అందువల్లనే సామాజికావసరాలు పెరిగిన ఒక దశలో మానవ జాతులవారు లిపి ఏర్పరచుకున్నారు. అంటే సమాజాభివృద్ధికీ భాషాభివృద్ధికీ విడదీయరాని సంబంధం ఉందన్నమాట.

అభివృద్ధి చెందిన అన్ని సమాజాల్లోనూ రాసే అలవాటుంది. రాసే భాష మాట్లాడే భాషనుంచి తయారయింది. మొదట మొదట రెండూ ఒకటే అయినా రాను రాను భేదాలు ఏర్పడతాయి. మాట్లాడేభాష అయినా అన్ని సందర్భాల్లోనూ ఒకటిగా ఉండదు. పిల్లలతో ముద్దు ముద్దుగా మాట్లాడే భాష, కుటుంబంతో మాట్లాడే భాష, కొత్తవాళ్లు వచ్చినప్పుడు మాట్లాడే భాష, సభల్లో మాట్లాడే ఉపన్యాసపు భాష - ఇట్లా మాట్లాడే భాషల్లో రక రకాలుంటాయి ఆదిమ సమాజాల్లో కూడా ఇట్లాంటి భాషా భేదాలను పరిశోధకులు గమనించారు. అక్కడ కూడా కథా కథనంలో ఉపయోగించే సాహిత్య భాషకూ మంత్ర తంత్రాల్లాంటి వాటికి ఉపయోగించే భాషకూ, రోజువారీ సంభాషణకుపయోగించే భాషకూ తేడాలున్నాయి.

రాసే భాషకు మాట్లాడే భాషే మూలమయినా రెంటికి కొద్దోగొప్పో తేడాలు ఉండకుండా ఉండవు. అయితే ఒక్కో సమాజం ఆ తేడాలను కొంతవరకు సహిస్తుంది. రాసేభాష ప్రధాన ప్రయోజనం సాహిత్యరచనే అయినప్పుడు, ఆ సాహిత్యం చాలా కొద్దిమంది చదువరులనే ఉద్దేశించినప్పుడు రాసే భాషకూ, మాట్లాడే భాషకూ తేడా ఎక్కువున్నా ఫరవాలేదు. ఆ గ్రంథాల్లో విషయాలు ఎక్కువ మందికి తెలియాలని సమాజంలో కొందరు భావిస్తే రాసే భాషలో పండితులైనవారు ఇతరులకు అర్థమయ్యేట్టు వివరించి చెపుతారు. మన ప్రాచీన సాహిత్య రచనా సంప్రదాయం అట్లా ఏర్పడ్డదే. పురాణ కాలక్షేపాలు, హరికథలు సంప్రదాయ సాహిత్యంలో విషయాలు ఎక్కువ మందికి అందజెయ్యాలనే ప్రయత్నంలో భాగాలే.

సమాజంలో మార్పులు ఒక దశలో అతి త్వరితంగా వస్తాయి. ఆధునిక యుగంగా మనం పిలిచే ఈ ఇరవయ్యో శతాబ్దంలో మానవ జీవితంలో అన్నిరంగాల్లోనూ వచ్చిన మార్పులు అంతకు ముందటి శతాబ్దాల్లో వచ్చిన మార్పులతో పోల్చిచూస్తే ఈ తేడాను గుర్తించవచ్చు. ఇప్పటి సంఘ జీవితం అత్యంత సంక్లిష్టమూ, విస్తృతమూ అయింది. అంతేకాక ఈ మార్పులు అంతకు ముందటికన్నా ఎక్కువమంది అనుభవంలోకి వచ్చినాయి. ఈ మార్పులు వచ్చిన అన్ని రంగాలలోనూ భాషా ప్రయోగం అవసరమయింది. ఎన్నో రకాల విజ్ఞాన విశేషాలకు భాష ప్రయోగించాల్సిన అవసరం వచ్చింది. అందువల్ల అతి పరిమిత ప్రయోజనం కలిగిన ప్రాచీన రచనాభాష, సమాజంలో కొద్దిమందికి మాత్రమే అందుబాటులో ఉన్న ప్రాచీన సాహిత్యభాష ఈనాటి అన్ని సామాజిక అవసరాలకూ సరిపోదు. ఆ భాషలో నియమాలు రాసేవారి ఆలోచనలకూ, స్వేచ్ఛకూ సంకెళ్లుగా తయారయినాయి. రాసే విషయంకన్నా, రాసే భాషలో ఎక్కడ తప్పులు పోతాయో అన్న భయమే రాసేవాళ్ల మనసులను ఆక్రమించింది. ఆ భాషలో నియమాలను కొన్నిటిని సడలించి కొత్త రచనా భాషను తయారుచేసే ప్రయత్నాన్ని కందుకూరి వీరేశలింగం, చిలకమర్తి లక్ష్మీనరసింహం, పానుగంటి లక్ష్మీనరసింహారావు, కట్టమంచి రామలింగారెడ్డి, రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ గార్ల వంటివారు ప్రయత్నించారు. అతి విస్తృతమైన ఆధునిక ప్రయోజనాలకు పై పెద్దల ప్రయత్నం కూడా సరిపోలేదు.

ఈ నాటి సామాజిక అవసరాలకు సరి పోవాలంటె ఈ నాటి రచనా భాష ప్రాచీన సాహిత్యభాష నుంచి కాక నేటికాలపు మాట్లాడే భాష నుంచి తయారు కావాలని మరికొందరు పెద్దలు భావించారు. అందులో ప్రధానమైన వారు గురజాడ అప్పారావుగారు, గిడుగు రామమూర్తిగారు.

పత్రికా రచన, వార్తా రచన, వార్తా ప్రసారం, కథ, నవల, నాటకం, వ్యాసం వంటి ఆధునిక సాహిత్యరూపాలు అధిక ప్రచారానికి వచ్చిన తరవాత ఆధునిక రచనాభాష ఇప్పటి మాట్లాడే భాష నుంచే తయారు అవుతుందన్న పెద్దల వాదం రుజువయింది. ఈనాటి ఆ రచనా భాష ఈనాటి మాట్లాడే భాష నుంచే తయారయింది. దాదాపు ఇప్పటి రచనా వ్యాసంగ మంతా ఈ నాటి భాషలోనే సాగుతున్నది.

ఈ రచనా భాష ఒకే మూసలో నుంచి తయారయిన భాషకాదు. వివిధ ప్రాంతాలవారు, అనేక ఆర్థిక సాంస్కృతిక అంతరువులవారు పాల్గొని తయారు చేసినభాష ఈనాటి రచనా భాష. అందుకని అందులో సహజంగా వైవిధ్యం ఉంటుంది. అందరూ ఒప్పుకున్నది కాబట్టి ఏకత్వమూ ఉంటుంది

ఇంత వరకూ తెలుగు పాఠ్య ప్రణాళికల్లో భాషా బోధన అంటే సాహిత్య బోధనే అనే అపోహ ఉండేది. భాషా బోధన ప్రణాళికలో అంశాలుచూస్తే ఒక్కోసారి విద్యార్థు లందరినీ సాహిత్య స్రష్టలుగా తయారుచెయ్యటానికి ఉద్దేశించినట్టు కనిపిస్తుంది. ప్రాచీన కావ్య భాషా రచనలో, లేదా ఆ రకపు భాషను అనుకరించిన ఆధునికుల రచనలో పాఠ్య పుస్తకాలుగా ఉండేవి. ప్రాచీన రచనా భాషను అర్థం చేసుకోటానికి ఉద్దేశించిన సూత్రగ్రంథాలు తప్పనిసరిగా చదవాల్సి వచ్చేది. ప్రాచీన సాహిత్య రచనకు అవసరమైన సంధులు, సమాసాలు, ఛందస్సూ, అలంకారాలు, ఇతర సాహిత్యాంశాలు పాఠ్య ప్రణాళికలో ప్రధాన భాగాలుగా ఉండేవి. ఆ పద్ధతిలో శిక్షణ పొందిన వారు మళ్లీ అవే విషయాలను పరంపరగా బోధించేవారు. ఎక్కడన్నా కొన్ని ఆధునిక ప్రక్రియలను ప్రణాళికలో చేర్చినా చాలా కొద్దిగా ఉండేవి.

BRAOU

తెలుగు చదువుకునే వాళ్లంతా కవిత్వం రాయరు. అందులో కవిత్వం ఎంతమంది చదువుతారో చెప్పలేము. వాళ్లల్లో ప్రాచీన కావ్యాలు, ప్రబంధాలు చదువుకునేవాళ్లు చాలా కొద్దిమందే ఉంటారు. కాని అందరూ ఎప్పుడో ఒకప్పుడు తెలుగు వచనం రాయాల్సిన అవసరం ఉన్నవాళ్లే. కొంత మంది ప్రభుత్వోద్యోగాల్లో ఇమిడి పోవచ్చు. మరి కొంత మంది వ్యాపార సంస్థల్లో ఉద్యోగాలు చెయ్యవచ్చు. ఇంకా కొంత మంది వివిధ పత్రికల్లో జర్నలిస్టులుగా చేరవచ్చు. అనేక మంది అనువాదకులుగా స్థిరపడాల్సి రావచ్చు. వీళ్ళందరికీ భాషా రచనలో, భాషను ఉపయోగించుకోటంలో తరిఫీదు అవసరమవుతుంది. వీళ్ళల్లో అత్యధిక భాగం వచనం రాయాల్సి ఉంటుంది. వీళ్ళకి రాసే అలవాట్లు తెలియాలి. లిపి సంప్రదాయాలు తెలియాలి. పదాలు ఏర్పడే పద్ధతులు తెలియాలి. పదాల అర్థాలు, అర్థాల్లో వచ్చే మార్పులు మొదలైనవి తెలియాలి. మాటలు కలిసే విధం తెలియాలి. ప్రాచీన భాషాగారం నుంచి తీసుకున్నమాటలకు అర్థాలు తెలియాలి. వాక్యాలు తెలియాలి. వాక్య భేదాలు తెలియాలి. వాక్య ప్రయోగ పరిమితులు తెలియాలి. వ్యాస రచన తెలియాలి. వ్యాస భేదాలు తెలియలి. లేఖా రచన సూత్రాలు తెలియాలి. ఇంతకు ముందు పాఠ్య ప్రణాళికలో లేని ఎన్నో అంశాలు తెలుసుకోవలసిన అవసరం ఈ నాటి భాషా విద్యార్థులకుంది. ఈ అవసరాలను గుర్తింప జేయటమే ఈ పాఠ్య ప్రణాళిక లక్ష్యం. అందుకు శిక్షణ ఇవ్వటమే ఈ పాఠాల ప్రయోజనం. తెలుగు వచన రచనా రీతులను పరిచయంచేసి; వాటిలో గ్రహించాల్సిన అంశాలను సూచించటం ఈ పాఠాల లక్ష్యాలలో ఒకటి.

కళాత్మకమైన భాషా ప్రయోగం సాహిత్యం.కళాత్మకతా భేదాల్నిబట్టి, ఆధిక్యాన్నిబట్టి రకరకాల సాహిత్య ప్రక్రియా భేదాలుంటాయి. మనిషికి కళాదృష్టి అతి సహజమైనది. ఆ కళాదృష్టిని పూర్తిగా వదిలి వేయటం అభిలషణీయంకాదు. అందుకే ఈ ప్రణాళికలో ఈ కాలంలో అధిక ప్రచారంలో ఉన్న సాహిత్య రూపాలను

పరిచయంచేసే ప్రయత్నంకూడా జరిగింది. అయితే ఈ పరిచయం అతి స్థూలమైనది మాత్రమే. అభిలాష ఉ వారు తమ ఆసక్తిని పెంచుకోటానికి ఈ పరిచయం కొంత ఉపస్కారకంగా ఉంటుంది. అయితే పరిధి పరిమితులవల్ల ఈ పాఠాల్లో ఎంతో జనాదరణం పొందిన నవలను పరిచయం చేయటం వీలుపడలేదు.

ఔచిత్యాన్ని మరిచిపోకుండా ఏసందర్భంలో అయినా భాషను కళాత్మకంగా ప్రయోగించవచ్చు. పద ప్రయోగంలో, సమాసఘటనలో, వాక్యవిన్యాసంలో, విషయ సంయోజనంలో - ఇంకాఎన్నో అంశాల్లో భాషను కళాత్మకంగా ప్రయోగించవచ్చు. అట్లాంటి రీతులను రకరకాల రచనలనుంచి తీసి ఈ పాఠాల్లో చూపించాం. వాటిని గ్రహిస్తే విషయ బోధన ప్రధానమైన వచనంలో కూడా కళాదృష్టిని ఎట్లా ఇమడ్చవచ్చునో కొంతలో కొంతయినా తెలుస్తుంది. సాధారణ భాషా ప్రయోగంలో కూడా విషయ గ్రహణకు అడ్డురాకుండా ఉండేంతవరకూ కళాత్మకతను ఎట్లాజోడించ వచ్చునో తెలియజేయటానికి ఈ పాఠాల్లో ప్రయత్నం జరిగింది

ఈ పాఠాల్లో పాటించిన పద్ధతి ఇది: భాషను గురించి తెలుసుకోవలసిన అంశాలు ప్రధాన పాఠ్యాంశాలుగా ఉంటాయి. పాఠం వెంటనే చదివే అభ్యాసం కోసం ప్రసిద్ధంగా ఉన్న ఒక రచయిత వచన రచన ఉంటుంది.

రచయితల బృందం తయారుచేసిన ప్రధాన పాఠంలో ఇచ్చిన అంశాలను శ్రద్ధగా గ్రహించాలి. అనుబంధంగా ఇచ్చిన వచన రచనలో శైలిని గుర్తించాలి. రాసే అభ్యాసంలో ఈరెంటి నుంచీ చెయ్యాల్సిన పనులుంటాయి. భాషను గురించి తెలుసుకోవటం, భాషా రచనా పద్ధతిలో భిన్నాంశాలను గ్రహించటం ఈ ప్రణాళికలో గ్రహించాల్సిన అంశాలు. వచన రచనకు నమూనాలుగా ఇచ్చిన ఖండికల్లో విషయాని కన్నా రచనా ధోరణికి ప్రాధాన్యం ఎక్కువ. అందుకే ఆ నమూనాలు.

ఈ నాటి తెలుగు రచనలో కనిపించే నమూనాలనన్నిటినీ ఈ పాఠాల్లో పరిచయం చెయ్యలేకపోయాం. ముఖ్యమను కున్న వాటిని మాత్రమే చూపించగలిగాం. భాషను రకరకాలుగా ప్రయోగించాల్సిన అవసరమున్న వాళ్ళు తమ అనుభవంలోనుంచి చాలా గ్రహించాల్సి ఉంది. ఏ పాఠ్య ప్రణాళికయినా మార్గం మాత్రమే సూచించగలదు. పరిసరాల నుపయోగించుకొని, స్వయంప్రతిభవల్ల రచనకో తనమార్గాన్ని ఎన్నుకోవడమే విద్యార్థి చెయ్యగలిగింది. అందుకవసర మైన వాతావరణంలో ఒక ముఖ్యభాగాన్ని సరఫరా చెయ్యటమే ఈపాఠాలు సాధించ గలిగిన ప్రయోజనం.

BRAOU

ఈనాటిచదువులూ, శిక్షణా తెలిసో తెలియకో చాలాభాగం పరీక్షల దృష్టితో జరుగుతున్నాయి. విద్యార్థుల దృష్టి చదివే విషయంమీద కాక పరీక్షాపత్రాల మీద ఉంటుంది. పరీక్షాపత్రాల్లో ఏ ప్రశ్నలు ఇస్తారు? సమాధానాలు ఎట్లారాయాలి? మార్కులెట్లా తెచ్చుకోవాలి? అనేదృష్టే ఎంతసేపూ. స్థిరీకృత పరీక్షా విధానం ఉన్నంతకాలం ఈదృష్టి పోదు ఈదృష్టిని పూర్తిగా మార్చటం ఇప్పుడప్పుడే సాధ్యంకాక పోవచ్చు. ఇందుకు ప్రయత్నం మాత్రం ఎప్పుడో ఒకప్పుడు ఎక్కడో ఒకచోట ప్రారంభం కావాలి. ఈ పాఠాల చివర ఇచ్చిన అభ్యాసాలు పరీక్షాదృష్టితో తయారు చేసినవి కావని విద్యార్థులూ బోధకులూ గుర్తించాలి. ఈఅభ్యాసాలు మాత్రమే సరిపోకపోవచ్చు. అవసరమైన అధిక అభ్యాసాలను బోధకులు సమకూర్చు కోవచ్చు. అభ్యాసాలు విషయగ్రహణకు దోహదంచేసేట్టుగా ఉండాలనే మా లక్ష్యం. బోధకులు అధికంగా సమకూర్చే అభ్యాసాలుకూడా అట్లాగే ఉండాలని మాకోరిక.

ఒక కొత్తదృష్టితో, కొత్తలక్ష్యంతో ఈపాఠ్యప్రణాళిక తయారయినట్టు గ్రహించటం కష్టం ఏమీకాదు. ఈ ప్రణాళికకు మాకు నమూనాలు లేవు. అందువల్ల ఈపాఠ్యాంశాలలో సాధించవలసినదంతా సాధ్యమయిందనిమేం అనుకోవటంలేదు. సాధించదల్చుకున్న దంతా సాధించామనికూడా అనుకోటం లేదు. ఉత్తమలక్ష్యం కోసం పందిదారి తొక్కాలని మొదటి అడుగు మాత్రమేవేశాం. ఇంకా ఎన్నో అడుగులు వేస్తేగాని దారి తయారుకాదు. అందరం కలిసి చెయ్యాల్సిన పనిఇది. అందుకే ఈ ఆహ్వానం.

BRAOU

ఖండిక : పాఠం :

# భాష రాయటంలో వచ్చే చిక్కులు పరిష్కారాలు

## ఉద్దేశం

ఉచ్చారణకు అనుకూలంగా రాయటానికి తెలుగు లిపిలో చాలా సౌకర్యాలున్నాయి. అయితే కొద్దిపాటి లేఖన సమస్యలుకూడా ఉన్నాయి. మరీ ముఖ్యంగా తెలుగు రాతరూపాలలో(స్పెల్లింగులలో) వైవిధ్యం ఎక్కువ. ఒకేరకపు స్పెల్లింగును అనుసరించటం ఎందుకు మంచిదో చెప్పటం ఈ పాఠం ప్రధానోద్దేశం.

ఇంగ్లీషు మాటలను తెలుగు లిపిలో రాయటానికి కొన్ని సూచనలుకూడా ఈ పాఠంలో ఉన్నాయి.

## ప్రణాళిక :

1. లిపిభేదాలు
2. స్పెల్లింగు విపరం
3. అచ్చులతో మొదలయ్యే మాటలు-వాటిని అచ్చులతోనే వ్రాయటం ఎందుకు మంచిది?
4. క్రియా పదాలు రాయటంలో తేడాలు
5. వచ్చు, వద్దు, వరస-వంటి మాటల్లో మొదటిహల్లు పోవటం
6. అరసున్నాలు, బండిరాలు
7. మొదటి అక్షరంలో క్రావడి ఉన్నమాటలు
8. సంయుక్తాక్షరాలు
9. చివర సున్న రాయాలా 'ము' రాయాలా?
10. ఋత్వమూ, ౠత్వమూ
11. జ్ఞ తో వచ్చేమాటలు, శ, స, ళు, వత్తు అక్షరాలు, విసర్గ, సంయుక్తాక్షరాలు
12. ఇంగ్లీషు మాటలు తెలుగు లిపిలో రాసేపద్ధతులు
13. మాండలికాలు, ప్రామాణిక భాష
14. తప్పొప్పులు
15. ముఖ్య విషయ క్రోడీకరణ
16. అభ్యాసాలూ, ప్రశ్నలూ

భాష ప్రధానంగా మనం నోటితోచేసే ధ్వనుల రూపంలో ఉంటుంది. మనుషులందరూ మాట్లాడతారు గనక మానవ సమాజాలన్నిటికీ భాష ఉంది. వాటిల్లో కొన్ని సమాజాలకు, అంటే కొన్ని భాషలకు మాత్రమే లిపి ఉంది. కొన్ని సమాజాలవారు మాత్రమే నోటితోచేసే, ధ్వనుల రూపంలో ఉన్న భాషకు చేత్తో గీసే, లేదా చేత్తో రాసే గుర్తుల రూపం భాషకు కల్పించారు.

ఇప్పటికీ లిపులులేని భాషలు చాలా ఉన్నాయి. మన దేశంలోనే వ్రాయటం అలవాటులేని భాషా సమాజాలున్నాయి. ఒక భాష మాట్లాడే మనుషుల సమూహాన్ని భాషా సమాజం అంటారు, ఉదాహరణకు నీలగిరి కొండల్లో నివసించే తొద అనే భాషా సమాజంవారికి తమ భాషను రాసే అలవాటులేదు. అట్లాగే అరకులోయకు దగ్గరలో నివసించే ' కొండ ' అనే భాషాసమాజంవారికి లిపిలేదు. అట్లాగే సంతాలీలు, గోండులు, కోయలు- ఇట్లా చాలా సమాజాలవారికి తాము మాట్లాడేభాషలను రాసే అలవాటు లేదు . ప్రపంచంలో లిపి ఉన్న భాషలే తక్కువ. చాలా సమాజాలకు రాసే అలవాటు లేదు. మానవజాతి అభివృద్ధి క్రమంలో లిపి చాలా ఇటీవలిది. అభివృద్ధి చెందిన మానవ సమాజాలన్నిటికి లిపి ఉంది. అంటే రాసే అలవాటుంది. ఇంగ్లీషు, చైనీస్, జాపనీస్, తెలుగు, కన్నడ, తమిళం - ఇట్లా చాలాభాషల వాళ్లకు లిపి ఉంది.

లిపిలేని మానవ సమూహాలకన్న లిపి ఉన్న మానవసమాజాలు అభివృద్ధికర దశలో ఉండటం మనం తేలికగా గమనించవచ్చు. అందుకు కారణం ఊహించటంకూడా తేలిక. ఒక తరంవారు తమతరంలో సంపాదించిన విజ్ఞానాన్ని తమ తరవాతి తరంవాళ్లకి అందించే ఉత్తమమైన సాధనం లిపి. కనీసం ఇప్పటివరకూ ఇదే మేలైన సాధనం. అట్లా పోను పోను తరవాత తరవాత తరాల వారికి తమ పూర్వుల విజ్ఞాన సంపద అందుతుంది. దాని ఆధారంతోతరవాత వాళ్లు ఇంకా ముందుకి పోతారు. మానవజాతి అభివృద్ధికి లిపి ఇట్లా దోహదకారి (ఉపయోగకారి) అవుతుంది.

ప్రపంచంలో లిపులు చాలా రకాలున్నాయి. ఉద్దేశించిన వస్తువుతో దగ్గరి సంబంధం ఉన్న లిపిని చిత్రలిపి అంటారు. ప్రాచీన ఈజిప్టుల లిపి, మన దేశంలోని హరప్పా, మొహంజోదారో నాగరికత వారి లిపి ఇట్లాంటిదేనంటారు. చైనావారి లిపికూడా ఆ రకపు చిత్రలిపినుంచే పరిణామం చెందిందంటారు.

భారతదేశపు భాషలకు-వాటి లిపులకు ఉన్న సంబంధం ధ్వని సంబంధమైనది. అంటే మన దేశంలో లిపులకు వస్తువులకు సహజ సంబంధంలేదు. మనిషి నోటితో చేసే ధ్వనులకు మాత్రమే అవి గుర్తులు. తేడాలున్నప్పటికీ ఐరోపా వారి లిపుల పద్ధతీ అదే.

ఏ లిపిలో అయినా ఉచ్చారణలో ఉన్న అన్ని రకాల ధ్వనులకు గుర్తులుండవు. ప్రధాన ధ్వనులకు మాత్రమే గుర్తులుంటాయి. అయితే భాషకన్నా లిపి ఆలస్యంగా మారుతుంది. అందువల్ల లిపికీ, ధ్వనికీ ఉన్న సంబంధం కాల క్రమేణా దూరమౌతుంది. అదృష్టవశాత్తు, భారతీయ భాషా లిపుల్లో ఈ వ్యత్యాసం చాలా తక్కువ. అసలు వ్యత్యాసం లేకపోలేదు. ఇంగ్లీషు వంటి భాషల్లోలాగా ప్రతి మాటకీ అక్షరక్రమం నేర్చుకోవలసినంత విపరీతంగా భారతీయ భాషలకీ, వాటి లిపులకీ వ్యత్యాసం ఏర్పడలేదు. ఇంగ్లీషు భాషలో ఒక కొత్త మాటను నేర్చుకోవటమంటే ఆ మాటలో ఏ అక్షరాలుంటాయో కూడా నేర్చుకోవాలి. దీన్నే ఇంగ్లీషులో " స్పెల్లింగు " (Spelling) అంటారు. ఇంగ్లీషులో ఒక కొత్తమాట వచ్చినప్పుడు " హౌ డూ యూ స్పెల్ ఇట్ " (How do you spell it) అనేది సాధారణమైన ప్రశ్న తెలుగులో ఇట్లాంటి ప్రశ్న మనకు వినపడదు. ఈ మాటకు స్పెల్లింగేమిటి? అని ఒక తెలుగుమాట గురించి అడిగితే ఆశ్చర్యపడతారుకూడా. తెలుగులో అక్షరక్రమం ఒకసారినేర్చుకుంటే దాదాపు ఏ కొత్త మాటనైనా రాయటం నేర్చుకున్నట్టే. అయినా దాదాపు అనటం వలన తెలుగు రాతలోకూడా కొద్ది కొద్దిగా చిన్న చిన్న చిక్కులున్నట్టు గుర్తించవచ్చు. అట్లాంటి కొన్ని సమస్యల్ని గురించి ఈ పాఠంలో నేర్చుకుందాం.

BRAOU

మాటల్ని రాయటంలో తెలుగు మాటలకి కొన్ని చిక్కులూ, సంస్కృతం మాటలకి ఇంకోరకపు చిక్కులూ, ఇంగ్లీషు మాటలకు మరోరకం చిక్కులున్నాయి-వాటిని విడివిడిగా తెలుసుకుందాం. తెలుగు లిపిలో అ,ఆ,ఇ,ఈ,ఉ,ఊ, ఎ,ఏ,ఐ,ఒ,ఓ,ఔ అనే అక్షరాలు అచ్చులకు గుర్తులు వీటిల్లో ఐ,ఔ లు ఉచ్చారణలో అయ్,అవ్ లుగా వినపడుతాయి. తెలుగులో ఏ హల్లుకైనా అచ్చు చేర్చటం అలవాటు కావటంవల్ల అయి, అవు అనికూడా రాస్తుంటారు. ఈ క్రింది మాటల జంటలను చూస్తే ఈ రాత భేదాలు తెలుసుకోవచ్చు:

అయింది - ఐంది, అవుతుంది - ఔతుంది, పయిన - పైన, అయినా - ఐనా, అయితే - ఐతే

వీటిల్లో రెండు రకాల అక్షరక్రమాలు కనిపిస్తుంటై. ఇందులో తప్పొప్పుల ప్రసక్తిలేదు గాని ఏదో ఒకటిఎన్నుకోవల్సివస్తే అట్లా ఎన్నుకోవటానికి కొన్ని కారణాలు చూపించవచ్చు. అచ్చుతో మొదలయ్యే పదాల్లో ఐ, ఔ లకన్నా అయి, అవు రూపాలు పూర్వపువి. ఈ రెండిట్లో ఏది రాసినా చదివేటప్పుడు భేదం ఏమీ రాదు గాబట్టి పూర్వపు రూపాలయిన అయి, అవు లు రాయటమే తేలిక, సౌకర్యం. కాని హల్లులతో మొదలయ్యే పదాలలో ఐత్వం, ఔత్వం ఎక్కువమంది రాస్తున్నారు. అంటే పైన, కౌలు అనే శబ్దాలను పయిన, కవులు అని రాయటం అసౌకర్యం. కవులు వంటి మాటల్లో కవి+లు అని అనుకునే ప్రమాదంకూడా వుంది. పైగా ఈ రకం మాటలు నిఘంటువుల్లో (నిఘంటు వంటే ఏమిటో తెలుసుకుంటారు) పైన, కౌలు అనే కనిపిస్తాయి.

తెలుగులో ఇ, ఈ, ఎ, ఏ లు ఒకరకం అచ్చులు. ఉ,ఊ,ఒ,ఓ, లు ఇంకోరకం అచ్చులు. ఈ రెండురకాల అచ్చులకు ఉచ్చారణ (పలికేతీరు) లో భేదం వుంది. ఇ, ఈ, ఎ, ఏ, లను పలికేటప్పుడు నాలుక ముందు భాగం పైకి కదుల్తుంది. ఉ,ఊ,ఒ,ఓ లను పలికినప్పుడు నాలుక వెనుకభాగం అంగిలివైపు కదుల్తుంది. కొంచెం జాగ్రత్తగా పరిశీలిస్తేకాని ఈ తేడా అందరూ గుర్తించలేరు. ఇంతకన్నా తేలికగా గుర్తించే తేడా ఒకటుంది. ఉ,ఊ,ఒ,ఓ, లు ఉచ్చరించినప్పుడు పెదవులు గుండ్రంగా, ముందుకు కదుల్తాయి. ఇ,ఈ,ఎ,ఏ, లు ఉచ్చరించినప్పుడు పెదవులు అట్లా

ముందుకురావు. మీరు పూర్వ వ్యాకరణాలు చదివుంటే ఇ,ఈ,ఎ,ఏ లను తాలవ్యాచ్చులనీ, ఉ,ఊ,ఒ,ఓ, లను ఓష్ఠ్యా చ్చులనీ అంటారని తెలుస్తుంది. వాటి ఉచ్చారణను బట్టే ఈ పేర్లు పెట్టారు. "తాలువు" అంటే నోటిలో పైన గట్టిగా తగిలే భాగం దగ్గర ఏర్పడే ధ్వని కాబట్టి తాలవ్యం అనే పేరు వచ్చింది. "ఓష్ఠం" అంటే పెదవి. పెదవుల కదలికను ప్రధానంగా గుర్తించటంవల్ల ఉ,ఊ,ఒ,ఓ లకు ఓష్ఠ్యాచ్చులని పేరు వచ్చింది.

ఇ,ఈ,ఎ,ఏ లతో మొదలయ్యే పదాలకు ముందు ఉచ్చారణలో 'య' కారం ఉ, ఊ,ఒ,ఓ లతో మొదలయ్యే పదాలకు ముందు ఉచ్చారణలో 'వ' కారం చేరుతుంది. (పూర్వ వ్యాకరణాలు య కారాన్ని తాలవ్యమనీ, వకారాన్ని ఓష్ఠ్యమనీ గుర్తించారు.) దాన్నే రాతలో సూచిస్తే ఇట్లా ఉంటుంది :

ఇల్లు - యిల్లు ఈత - యీత ఎక్కడ - యెక్కడ ఏరు - యేరు ఉంది - వుంది ఊరు - వూరు
ఒకటి - వొకటి ఓడ - వోడ

మొదటి వరుసకన్నా, రెండో వరుస ఉచ్చారణకి ఎక్కువ దగ్గర అని ఎక్కువ మంది అనుకుంటారు. మొదటి వరుస ఉచ్చారణకి దూరంకాదు. రాత గుర్తులకు ఉచ్చారణ మనం ఇచ్చుకున్నదే. అచ్చులతో రాసినవి హల్లులతో పలక టానికి అభ్యంతరం ఏమీలేదు. అంటే ఇల్లు ఊరు అని రాసి చదివేటప్పుడు 'యిల్లు' 'వూరు' అని చదవటానికి అడ్డు వచ్చేదేమీ లేదు. అచ్చుతో మొదలయ్యే పదాన్ని అచ్చుతోనే రాయటంవల్ల కొన్ని సౌకర్యాలున్నాయి.

తెలుగులో ఇప్పుడు దొరికే నిఘంటువులలో ఈ మాటలు అచ్చుతోనే దొరుకుతై. కొన్ని తెలియని మాటలకు నిఘంటువులు ఉపయోగించటం భాష నేర్చుకునే వారికి అవసరం

నిఘంటువుల్లోనే ఈ మాటల్ని హల్లుతో ఎక్కించకూడదా? అని అడిగే వీలుంది. అట్లాంటి నిఘంటువు తయార య్యేదాకా నిఘంటువులు చూడటం మానుకోము. పైగా మాటకున్న ప్రధాన రూపాన్ని నిఘంటువులో ఒకచోట ఇచ్చి వాటిని పలికే తీరులో భేదాన్ని అక్కడే సూచించడం ఒక సంప్రదాయం. అన్ని ఉచ్చారణ భేదాల్ని ప్రధాన భేదా లుగా ఇస్తే నిఘంటువుల పరిమాణం పెరిగిపోతుంది.

తెలుగులో సంధి ని గురించి మీరు పూర్వం కొంత నేర్చుకొనే ఉంటారు. సంధి అంటే రెండు పదాలను కలిపేసి కొన్ని మార్పుల్నిచేసి పలకటం. పలికినట్టు రాస్తే రాయటం. తెలుగు సంధిలో అచ్చులమధ్య సంధి చాలా ముఖ్యమైనది. అచ్చుతో ముగిసేమాట తర్వాత అచ్చు మొదలయ్యే మాట వచ్చినప్పుడు వెనకటి మాటలో చివరి అచ్చు పోతుంది. వాడు + ఎక్కడ అన్నప్పుడు ఉచ్చారణలో పూర్వపు మాటలో చివరి ఉత్వం జారిపోయి వాడెక్కడ అని పలుకుతారు, రాస్తారు. ఇట్లాంటి సంధిలో 'యెక్కడ' అనిరాస్తే 'య' కారం పోతుందనికూడా అధికంగా చెప్పుకోవాలి మళ్లీ నిజంగా య కారంతో మొదలయ్యే మాటలకు యకారంపోదు. కనీసం రాతలో అట్లు పోయినట్లు చూపించరు. అతడు + యోగ్యుడు అన్నచోట య కారాన్ని ఉంచాలి.

తెలుగు రచన చేసేవారిలో కూడా ఈ విషయంలో ఒక పద్ధతి అనుసరిస్తున్నట్టు లేదు. 'ఉచ్చారణ అనుస రించి రాస్తున్నాం అనుకునే రచయితల్లోకూడా కొన్నిసార్లు అచ్చుతోనూ, కొన్నిసార్లు హల్లుతోనూ రాస్తున్నారు. ఉదాహరణకి చలంగారి 'మ్యూజింగ్స్' లో నుంచి కొన్ని వాక్యాలు చూడండి:

"అందుకనే అంటాను యెన్ని మతాలు, యెన్ని సోషలిజములు మానవజాతి సమానత్వాన్ని బోధించినా, సనా తనుల తెలివి వొప్పుకోవలసి వచ్చినా సరే కాని, మీరే మనుషులయితే, నేను కాను " (పే. 110)

" ఇంతకి లేని సౌందర్యాన్ని నేను చూస్తున్నానా;, వున్న సౌందర్యానికి మీరు అంధులైనారా? ఎవరు తేల్చ గలరు? వుంటే ఆ ఈశ్వరుడు తప్ప.! ( పే 111 )

అట్లాగే రంగనాయకమ్మగారి 'పెట్టుబడి' అన్న గ్రంథంలో నుంచి: " దోపిడీ అంటే ఏమిటి? వర్గభేదాలు ఏమిటి? అవి ఎందుచేత ఏర్పడుతున్నాయి? వర్గభేదాలు నిజంగా వున్నాయా? కార్మికులంతా ఒక వర్గంగా పెట్టుబడిదారులంతా ఒక వర్గంగా ఎందుచేత వున్నారు? మంచి పెట్టుబడిదారులే వుండరా?" (పే. 2)

కారణమేమిటో తెలియదుకాని పై రచయితలు యి, యీ, యె, యే లకన్నా, వు, వూ, వొ, వో లు ఎక్కువ వాడారు.

కొన్ని అచ్చులతోనూ, కొన్ని హల్లులతోనూ ఒక మాటని కొన్నిచోట్ల అచ్చుతోనూ, కొన్నిచోట్ల హల్లుతోనూ రాసేకన్నా, ఇంతకుముందుచెప్పిన సౌకర్యాలను దృష్టిలో ఉంచుకొని అన్నిచోట్లా అచ్చులు రాస్తే రచనలో క్రమత్వం

BRAOU

ఉంటుంది. క్రమత్వం అంటే అన్నిచోట్ల ఒకే పద్ధతిని పాటించటం.

తెలుగులో తాటి + ఆకు అనేది కలిపితే వచ్చేమాటను 'తాటాకు' అని రాస్తున్నారు. కాని నిజానికి ఉచ్చారణ 'ఆ' కాదు. కానీ ఈ రెండిసీ కలిపితే వచ్చేధ్వనిని సూచించటానికి తెలుగులో గుర్తు లేదు. గుర్తు ఉంటే మంచిదే. కాని గుర్తులేనప్పుడు ఆ ధ్వనిని ఆ మాటల వాడకాన్నిబట్టి గుర్తించాల్సిందే కాని వేరే మార్గంలేదు. తెలుగు క్రియల్లో కూడా ఈ రకపు చిక్కువుంది. చెప్పు అనే క్రియకు, జరిగిన కాలాన్ని సూచించేటప్పుడు కొందరు చెప్పాడు అనీ, మరికొందరు చెప్పేడు అనీ రాస్తున్నారు. రెంటికి ఉచ్చారణ ఒకటే. లేకపోతే దాదాపు ఒకటే. గోదావరి, ఆపైన విశాఖ జిల్లాల రచయితలు చెప్పేడు అనిరాస్తే, కృష్ణా, గుంటూరు, ఇంకా ఇతర జిల్లాలవాళ్లు చెప్పాడు అని రాస్తున్నారు. ఈ రెండిట్లో ఏదిరాసినా అదనపు సౌకర్యమూలేదు. నష్టమూలేదు.

వచ్చు, వద్దు, వరస, వంటి మాటలు ఉచ్చారణలో వొచ్చు,వొద్దు, వొరస విధంగా వినిపిస్తాయి. కొంతమంది వీటిని ఒచ్చాడు, ఒద్దు అని అచ్చుతోకూడా రాస్తున్నారు. ఇక్కడకూడ ఇంతకుముందు చెప్పిన సౌకర్యాల్నిదృష్టిలో పెట్టుకొని ఒకేపద్ధతిని పాటించి వచ్చాడు, వద్దు, వరస అనే రూపాల్నే రాసి ఉచ్చారణలో తమకు వీలైన విధంగా ఉచ్చరించుకోవచ్చు. వాడు అనేమాటకు ఉచ్చారణలో <u>అడు, ఓడు, వోడు</u> అనే భేదాలు కన్పిస్తున్నై. కొంతమంది <u>మంచాడు</u> అంటే మరికొంతమంది <u>మంచోడు</u> అంటారు. మావాడు అనే రూపానికి <u>మావోడు</u> అనికూడా అంటారు. ఇక్కడకూడా ఆ మాండలికాన్ని సూచించటానికి అవసరమైతే తప్ప వాడు అని రాయటమే ఒక పద్ధతిగా ఉంటుంది. పూర్వపు భాషలో అరసున్నలు, బండి 'ఱ' లు ఉండేవి. అతి ప్రాచీన కాలంనుంచి వీటికి ఉచ్చారణ లేదు. నిన్న మొన్నటి వరకు వీటిని రాయాలని తెలుగు క్లాసుల్లో పట్టుపట్టేవారు. ప్రాచీన కావ్య భాషలో వాటి అవసరం ఉంటే ఉండవచ్చు. కాని ఈ నాటి భాషలో ఇవి ఎవరో తప్ప ఎవరూ రాయటం లేదు. ఇప్పటి భాషలో ఇవి నిర్వహించే ప్రయోజనాలు ఏమీలేవు. కాబట్టి వీటిని వదిలివేయటం మంచిది. అరసున్న ఉన్నమాటలకూ, లేని మాటలకూ ఒకప్పుడు ఉచ్చారణ భేదం, అర్థ భేదం ఉండేది. వీడు-పట్టణం, వీఁడు-ఇతను. అయితే మనకు కావ్య భాషారచన ఏర్పడేటప్పటికే అరసున్న ఉచ్చారణ పోయినట్లు పరిశోధకులు నిరూపించారు. అట్లాగే అర - సగం అఱ - గది. అనేమాటలమధ్య ఉచ్చారణ భేదం, అర్థ భేదం ఉండేవి. వీటి మధ్యన ఉచ్చారణ భేదం చాలాపూర్వమే పోయింది. ఇట్లాగా రాత భేదంద్వారా ఈ మాటల మధ్య భేదం చూపించవలసిన అవసరంలేదు. అంటే అఁట, ఈఁగ, చీఁకటి, కోఁతి, తెలుఁగు, వాఁడు వంటి మాటలను అరసున్నతో రాయక్కర్లేదు. అట్లాగే అక్కఱ, ఆఱు, ఇద్దఱు, పిఱికి, మఱ్ఱి, వెఱ్ఱి అనే మాటలలో బండిఱా రాయక్కర్లేదు.

వెనకటి భాషలో <u>క్రింద, క్రొత్త, త్రాగు, త్రోవ, ప్రక్క, బ్రతుకు</u> వంటి మాటల్లో క్రావడి సూచించే ధ్వని పోయింది. ఉచ్చారణలో, రాతలో దీన్ని వదిలి వేయవచ్చు. కాని కొందరు ఉచ్చారణలో చాలా అరుదుగా, బహుశా సంఘంలో తమ ఉన్నత స్థానాన్ని నిరూపించుకొనే ఉద్దేశంతో వాడుతుంటారు. అట్లాంటి సంభాషణని సూచించటానికి తప్ప దీనికి వేరే ప్రయోజనం లేదు. <u>వ్రాయు</u>, వ్రాత అనే మాటల్లో ర కారం పోలేదు. వ కారమే పోయింది. వ్రాశాడు అని రాస్తే శిష్టవ్యవహారికమనీ, రాశాడు అనిరాస్తే గ్రామ్యమనీ మనలో ఇంకా కొందరు అనుకుంటున్నారు. పూర్వులు అంటే సుమారు 50 ఏళ్ల క్రితం రాశాడు అని ఉచ్చరించినా వ్రాశాడు అని రాసేవాళ్లు. ఇటీవలికాలంలో చాలామంది రాశాడు అనే రాస్తున్నారు. నిఘంటువులో వ్రాయు అనే రూపమే ఉన్నా, వ్రాయు అని రాసి రాయు అని చదవటం కష్టం కనక, రాశాడు, రాత అని రాయటమే ఎక్కువ ఆమోదాన్ని పొందిన పద్ధతి. అయితే <u>చేవ్రాలు</u> అనే మాట చేరాలు అని కాలేదు.

<u>చేయి, చెయ్యి, గోయి, గొయ్యి, నేయి, నెయ్యి, పూవు, పువ్వు</u> అనే రెండు రకాల రూపాలు ఉచ్చారణలోనూ రాతలోనూ కన్పిస్తున్నాయి. వారివారి ఉచ్చారణలను అనుసరించి ఏ రకం రూపాలను రాసినా ఒకటే. కాని నిఘంటువుల్లో మొదటి వరుస రూపాలే కనిపిస్తాయి. మొదటి వరుస పదాలే రాసి రెండోరకంగా ఉచ్చరించినా అభ్యంతరం లేదు. కొందరు పండ్లు, గుడ్లు, కోళ్లు, వాళ్లు అనే వాటిని ఉచ్చారణ విధేయంగా రాస్తే, పండ్ళు, గుడ్ళు, కోళ్ళు, వాళ్ళు అని రాయాలి. కాని మొదటి విధంగా రాసినా ఇంకో రకంగా ఉచ్చరించలేం. వత్తుగా రాసిన లకారానికి ఈ మాటల్లో ళ కారంగానే ఉచ్చరించక తప్పదు. అందువల్ల ల కారమే రాసుకోవచ్చు

సంస్కృత పదాలు :

పూర్వపు అంటే తెలుగులో గ్రాంథికం అనే కావ్యభాషలో పదంచివర వచ్చే ము లో ఈనాడు ఉ కారం పోయి మ కారం మాత్రమే మిగిలింది. దాన్ని సున్నతో సూచిస్తున్నారు. చాలా కొద్దిమంది మాత్రం, ఇంకా పదం చివరలో

BRAOU

ము రాస్తున్నారు. కొన్ని మాటల్లో ముఖ్యంగా మేము, మనము వంటి మాటలలోనూ, ము కి పూర్వం దీర్ఘముంటేనూ, అంటే గులాము వంటి మాటలో మూడక్షరాల మాటల్లో నడిమి అచ్చు ఉ అయితేనూ అంటే నడుము ఉడుము వంటి మాటల్లోనూ ము రాస్తున్నారు. ఒకవేళ సున్న రాసినా బహువచనంలో గులాములు, నడుములు, ఉడుములు అని ము ఉచ్చారణ వినిపిస్తున్నది. బహువచనంలో ము వినిపించే మాటలలో ము ను అట్లాగే రాసి, మిగతా మాటలను సున్నతో రాస్తే అదొక పద్ధతి ప్రకారం ఉంటుంది. చివర సున్నతో రాసిన మాటలు తెలుగైనా, సంస్కృతమైనా ఇప్పుడు మనకున్న నిఘంటువుల్లో అవి చివర ము తో కనిపిస్తాయి. అందరి ఉచ్చారణలోనూ, దాదాపు అందరి రాతలలోనూ సున్న కనిపిస్తుంది. సున్నతో రాయడం సౌకర్యం.

ఋ, ౠ, ఌ, ౡ, ఌ, ౡ, లు తెలుగులో సంస్కృతంనుంచి మాత్రమే వచ్చినాయి. సంస్కృతం నుంచి తెలుగులోకి వచ్చిన మాటల్లో ఌౡ లు లేవనే చెప్పవచ్చు. ఒక్క క్లృప్తం అనే మాట తప్ప. కాని దీన్నందరూ క్లుప్తం అనే రాస్తున్నారు. ఋ ౠ లతో వచ్చిన మాటలు మాత్రం చాలా ఉన్నాయి. ఋషి, ఋతువు, కృష్ణుడు, దృష్టి, తృష్ణ వంటి చాలా మాటల్లో ఈ ఋత్వం కనిపిస్తుంది. కొంతమంది మాత్రం రుషి రుతువు అని రాస్తున్నారు. చాలామంది హల్లు మీద రాసే ఋత్వాన్ని, అంటే కృష్ణుడు, దృష్టి, కృషి వంటి మాటల్లో ఋత్వం రాస్తున్నారు. వీటిల్లో కూడా ఉచ్చారణని అనుసరించి ఋత్వం తీసేసి క్రిష్ణుడు, ద్రుష్టి, క్రుషి అని రాస్తున్నారు. ఉదాహరణకు వుప్పల లక్ష్మణ రావుగారి బతుకు పుస్తకంలో ఈ ధోరణి కనిపిస్తుంది, (విశాలాంధ్ర పబ్లిషింగ్ హవుస్, విజయవాడ, 1988) రాసే వాడి అవసరాన్ని బట్టి, పాండిత్యాన్ని బట్టి, చదువుని బట్టి సంస్కృతం నుంచి తెలుగులోకి కొత్తమాటలు ఎప్పటి కప్పుడు వస్తూనే ఉంటాయి. తెలియని సంస్కృతం మాటలకు నిఘంటువుల్లో అర్థాలు వెతుక్కోవలసిన అవసరం చాలా ఉంటుంది. అందువల్ల సంస్కృతం మాటల వర్ణక్రమం మార్చకుండా ఉండటమే మంచిది.

అయితే ఋత్వం లేనిచోట కొందరు ఋత్వం పెడుతున్నారు. ఉదాహరణకి శతృవు, ధృవతార అనే మాటల్లో ఋత్వం బదులు త్రావడే ఉండాలి. సంస్కృతం మాటల్లో ఆజ్ఞ, జ్ఞాపకం, ప్రజ్ఞ, యజ్ఞం, విజ్ఞానం అనే మాటలను ఆగ్న్య, గ్నాపకం, (గ్న్యాపకం), ప్రగ్న, యగ్నం, విగ్న్యానం అని ఉచ్చరించేవారున్నారు. అయినా చాలామంది ఈ మాటలను సంస్కృత పద్ధతిలో మొదటి విధంగా రాస్తున్నారు. ఒకరూ అరా పలికే పద్ధతిలో రాయాలి అనుకున్నా, అన్ని మాటలను అట్లా రాయటంలేదు. ఇక్కడకూడా సంస్కృతంలో అక్షరక్రమమే రాసి మన పద్ధతిని ఉచ్చరించు కోవచ్చు. శవర్ణం తెలుగులోకి వచ్చిన సంస్కృతం మాటల్లోనే కనిపిస్తుంది. ఈ శ, స ల భేదాన్ని ఉచ్చారణలో చాలామందిలో కనపడదు. అయినా తెలుగులో ఉదాహరణకి దురాశ, శీతాకాలం, ఆశీస్సు, వశం లో వచ్చిన శ వర్ణానికి బదులుగా స వర్ణం ఎక్కువమంది రాయటంలేదు. ఇది తెలుగు రాయటం నేర్చుకునే విద్యార్థులకు కొంత ఇబ్బంది పెట్టే సమస్య. దీన్ని జాగ్రత్తగా పరిశీలించటం ద్వారా, సందేహం వచ్చినప్పుడు నుంచి నిఘంటువులో చూడ్డంద్వారా అభ్యాసం చేసుకోవల్సిందే. శ, స ల భేదం పాటించకపోతే తెలుగు రాయడం బాగా వచ్చినట్టుగా లెక్కకట్టడం లేదు. ఇది కష్టపడి నేర్చుకోవల్సిన ఒక అంశం.

తెలుగు వర్ణమాలలో వత్తు అక్షరాల పేరుతో ఖ, ఘ, ఛ, ఝ, ఠ, ఢ, థ, ధ, ఫ, భ అనేవి ఉన్నాయి. ఇవి సంస్కృతం నుంచి వచ్చిన మాటల్లోనే ఎక్కువగా ఉంటాయి. వీటిలో ఠ, ఢ అనేవి ఎక్కువమాటల్లో వస్తాయి. ఝ తక్కువ మాటల్లో వస్తుంది. వీటి ఉచ్చారణ ఈ తరంలో సన్నగిలిపోతున్నది. అయినా తెలుగు రాసేటప్పుడు ఈ మాటల్ని సరిగ్గా చూపించకపోతే వాటిని తప్పులుగానే చాలామంది పరిగణిస్తున్నారు. వాటిని కొంచెం కష్టపడే నేర్చుకోవాల్సి ఉంటుంది. అయితే ఈ అక్షరాలను అవసరం లేనిచోట ఉపయోగించటంకూడా తప్పే అవుతుంది. ఉదాహరణకి ఖాద, ఖారం. ధారం, ఘాలి, ఖావి వంటి మాటల్లో వొల్లు ఉండకూడదు. మొదటి మాటలో ఉండవలసిన చోటలేదు. బాధ అని ఉండాలి. సంస్కృతం మాటలను తెలుగులో రాసేటప్పుడు థ,ధ లకు తెలుగువారి ఉచ్చారణలో భేదం తక్కువ. రాతలోనూ, భేదం తక్కువే. మొదటిదానికి పొట్టలో చుక్క ఉంది అంటారు. ఉదాహరణకు అతిథి, గ్రంథం, రథం, ప్రథమం, కథ వంటి మాటల్లో ఉన్నటువంటి థ కారానికి పొట్టలో చుక్క పెట్టడం మరిచిపోకూడదు. ఇదికూడా కొంచెం కష్టంతో నేర్చుకోవల్సిందే. ఇది నేర్చుకోవటానికికూడా నిఘంటువు సాయపడుతుంది. సంస్కృతంలో 'ః' అనే గుర్తును విసర్గ అంటారు. ఇది దుఃఖం, ప్రాతఃకాలం, అంతఃకరణ వంటి మాటల్లో ఉంది. దుఃఖం అనే మాటను మాత్రం కొందరు విసర్గ తీసివేసి దుక్ఖం, దుఖం అని రాస్తున్నారు. ఇంతకు ముందు చెప్పినట్టుగానే ఒక పద్ధతి ప్రకారం రాస్తే విసర్గ ఉన్న అన్ని మాటలోనూ విసర్గ రాయటమే మంచిది.

BRAOU

సంస్కృతం మాటలో వచ్చే 'త్య' అనే వర్ణాలకూర్పుకు తెలుగులో త్త అనీ చ్చ అనీ ఉచ్చారణ భేదాలు వేరువేరు ప్రాంతాలలో ఉన్నాయి. అట్లాగే 'ద్య' అనే కూర్పుకు ద్ద అనీ జ్జ అనీ జ్య అనీ ఉన్నాయి. ఈ క్రింది మాటలో భేదాలను గుర్తుపట్టవచ్చు.

సత్యం : సత్తెం, సచ్చెం

పద్యం : పద్దెం, పజ్జెం, పజ్యం.

తెలుగులో ఈ రకాల త్య, ద్య సంస్కృతం నుంచి విరివిగా వచ్చినందున వాటిని అట్లాగే మార్చకుండా ఉంచడం మంచిది. బాగా అలవాటయిన సత్యం, పద్యం వంటి మాటలకు ఎట్లా రాసినా అర్థం చేసుకోవచ్చుగాని ఇతర చోట్ల వెంటనే పదస్వరూపాన్ని గుర్తు తెచ్చుకొని అర్థం చేసుకోవటం కష్టమవుతుంది. 'అజ్ఞాతనాంధ్ర' అని రాస్తే 'అద్యాతనాంధ్ర' అని ఉద్దేశించినట్టు చప్పున బోధపడదు. 'త్స' అనే సంస్కృత వర్ణాల కూర్పుకు తెలుగులో 'చ్ఛ' అనే ఉచ్చారణ ఉంది. సంవత్సరం అనే మాటకు సంవచ్ఛరం అని ఉచ్చరిస్తారు. అయినా రాతలో మొదటిదే కనిపిస్తుంది

ఇదికాక ఇంగ్లీషు మాటలు తెలుగులో రాసేటప్పుడు కొన్ని చిక్కులు వస్తాయి. తెలుగురాతలో సూచించటానికి వీల్లేని ధ్వనులు కొన్ని ఇంగ్లీషులో ఉన్నాయి.

map bat cap అనే మాటల్లో అచ్చును తెలుగులో సూచించటం కష్టం. కొందరు మేప్, బేట్, కాప్ అని రాస్తే మరికొందరు మాప్, బాట్, కాప్ అనీ రాస్తున్నారు. మొదటి అక్షరానికి యావత్తు ఇచ్చి మ్యాప్, బ్యాట్, క్యాప్ అని రాసే మూడో పద్ధతి ఒకటి ఉంది. ఈ పద్ధతిలో యావత్తు అచ్చులో ప్రత్యేకతను చూపించటానికి వచ్చిందే కాని యావత్తులాగా పలకటానికి వచ్చిందికాదు. అంటే న్యాయం, సూర్యం, వాక్యం, సన్యాసి వంటిచోట్ల వచ్చే యావత్తులాగా ఈ ఇంగ్లీషు మాటలలో రాసే యావత్తును ఉచ్చరించకూడదు.

ఒకటికన్నా ఎక్కువ హల్లుల కూర్పుతో వచ్చే మాటల్లో అచ్చును సూచించటానికి యావత్తును రాసే అలవాటు తెలుగులో లేదు.

class glass వంటి మాటలను క్లాసు, గ్లాసు అనే రాస్తారు. క్ల్యాసు, గ్ల్యాసు అని ఎవరూ రాయరు. అయినా ఇక్కడి అచ్చు ఉచ్చారణ map, bat, వంటి మాటల్లో ఉచ్చారణలాంటిదే.

ఇంకో విషయం గుర్తుంచుకోవాలి. ఇంగ్లీషు, హిందీ వంటి భాషలలో హలంతమైన మాటలు ఎక్కువ. వాటిని తెలుగులో పొల్లు అక్షరాలతో చూపించవచ్చు.

క్లాస్ గ్లాస్ మ్యాప్ టేప్ పేపర్ హ్యాట్ నోట్ పెన్ పెన్సిల్

పై మాటలనే అజంతంగా (అంటే పదం చివర అచ్చును చేర్చి) క్లాసు, గ్లాసు, మ్యాపు, టేపు, పేపరు, హ్యాటు నోటు, పెన్ను, పెన్సిలు అని రాయవచ్చు.

చాలా మాటలకు పదంచివర 'ఉ' అనే అచ్చు చేరిస్తే రాతలో అక్షరానికి కొమ్ము చేర్చి చూపించవచ్చు. ఇది తెలుగువారి ఉచ్చారణలో సహజంగా కనిపించే విషయం. అసలు మూల భాషలో లాగా హలంతంగానూ ఉచ్చరించవచ్చు. తెలుగువారి అలవాటు ననుసరించి అజంతంగానూ ఉచ్చరించవచ్చు. రెండు పద్ధతులను రాతలో చూపించవచ్చు లేదా రాతలో ఒకే పద్ధతిని అనుసరించి, ఉచ్చారణ వారి ఇష్టానుసారం చేయ్యవచ్చు. ఇది ఎట్లాచేసినా వ్యవహారంలో వచ్చే పెద్ద చిక్కులు లేవు.

కాని శాస్త్ర విషయాలను గురించి రాసేటప్పుడు వివిధ భాషల్లోని పదాలను వాడాల్సిన అవసరం వస్తుంది. అదీ గాక శాస్త్రవిషయాల సందర్భాలలో ఉచ్చారణలోనూ, రాతలోనూ, ఏక సూత్రత (uniformity) నిర్దిష్టత (exactness) కావాలని ఆయా శాస్త్రాల్లో ఆరితేరినవాళ్లు కోరుకుంటారు. ఆ సందర్భాల్లో ఉపయోగించిన మాటలను మూల పదాల ఉచ్చారణకు సాధ్యమైనంత దగ్గరగా ఉండేటట్లు రాయటం మంచిది.

ఇంగ్లీషువంటి భాషలలోనుంచి హలంత శబ్దాలను తెలుగులోకి తెచ్చుకునేటప్పుడు తెలుగులో ఉ అనే అచ్చును చివర చేరుస్తామని ఇంతకముందు చెప్పుకున్నాం. కాని అన్ని మాటలకూ చివర ఉ చేరదు. కొన్నిటికి ఇ చేరుతుంది. ఉదాహరణకు ఈ కింది ఇంగ్లీషు మాటలను ఇంగ్లీషు, తెలుగు రాతల్లో క్రమంగా చూడండి:

చర్చ్ - చర్చి వాచ్ - వాచి కోచ్ - కోచి మేచ్ - మేచి మార్చ్ - మార్చి జార్జ్ - జార్జి
బ్రిడ్జ్ - బ్రిడ్జి జడ్జ్ - జడ్జి

ప్ - జ్ లు అంతంలో వచ్చే మాటలకు ఉ బదులు ఇ చేరటం ఇందులో గమనించవచ్చు. ఇది సకారణంగా జరిగిందే. అయితే ఈ కారణాల జోలికి పోవాలంటే వేరే కొన్ని శాస్త్రి విషయాలు తెలుసుకోవల్సి ఉంటుంది. ప్రస్తుతం వాటి జోలికి పోకపోయినా ఫరవాలేదు. కావాలంటే కింది బ్రాకెట్లలో వివరణ చూడండి.

పైన ఇచ్చిన మాటల్లో బ్రిడ్జి, జడ్జి అనే మాటలను గమనించండి. ఇంగ్లీషు స్పెల్లింగులో d అనే అక్షరం ఉన్నదానికి ఉచ్చారణలో ప్రమేయం లేదు. కాని తెలుగులో అదే అక్షరానికి సమానంగా డ అనే అక్షరాన్ని ఈ మాటల్లో వాడుతున్నాం. ఈ మాటల్ని ఈ డ అనే అక్షరం లేకుండా రాస్తే ఆమాటలుగా గుర్తించడం కష్టంకూడా. అంటే బ్రిజ్ అని రాస్తే బ్రిడ్జి అనిగాని, జజ్ అని రాస్తే జడ్జి అనిగాని చప్పున గుర్తించటం కష్టం

( ఇట్లాంటి వాటిని తెలుగు రాత ప్రకారం ఉచ్చరిస్తే ఇంగ్లీషులో spelling pronounciation అంటారు. రాసినట్టు ఉచ్చరించే పద్ధతి అని అర్థం. ఉచ్చారణకూ రాతకూ తేడా ఎక్కువుండే ఈ పద్ధతి విచిత్రంగా ఉంటుంది. దాదాపు ఉచ్చరించినట్టురాస్తే తెలుగువాళ్లకి రాసినట్టు ఉచ్చరించటంలో విచిత్రం ఏమీ కనపడదు. కాని ఇంగ్లీషు ఉచ్చారణకు రాతకూ ఉన్న విపరీతమైన తేడా అందుకు కారణం.)

ఇంగ్లీషు మాటలను తెలుగులో రాసేటప్పుడు ఎన్నో చిక్కులు ఎదురవుతాయి. కొన్ని రకాల అచ్చులకు హల్లులకు తెలుగులో గుర్తులులేవు. ఉదాహరణకు ఈ మాటలు గుర్తించండి. bottle zoology

బోటిల్, బాటిల్ జు ఆల జీ

తెలుగులో రాసే అలవాటును బట్టి వీటిని నేర్చుకోవల్సిందేకాని, అన్నిటికీ కలిపి ఒక ప్రయోజనకరమైన లక్షణం చెప్పటం కష్టం.

**మాండలికాలు :**

ఒక భాషను చాలామంది మాట్లాడేటప్పుడు అందరు మాట్లాడేది ఒకే రకంగా ఉండదు. కొందరు మాట్లాడే భాష మరి కొందరు మాట్లాడే భాషకన్నా వేరుగా ఉంటుంది. ఉదాహరణకు ఉభయగోదావరి మండలాల్లోనూ విశాఖ, విజయనగర ప్రాంతాలలోనూ అలా ఇలా, ఎలా అంటారు. కృష్ణా గుంటూరు మండలాలలో 'అట్లా ఇట్లా, ఎట్లా' అంటారు,

BRAOU

తెలంగాణా జిల్లాల్లో వచ్చిండు, అంటే రాయలసీమలో వచ్చినాడు అని, మిగతాచోట్ల వచ్చాడు అని అంటారు. ఇట్లాంటి తేడాలను మాండలికభేదాలు అంటారు.రాసేటప్పుడు వీటిలో ఏది రాయాలి? అని అడుగుతుంటారు. దీనికి చప్పున సమాధానం చెప్పటం కష్టం. మనం రాసేవిషయాన్నిబట్టి, ఎవరికోసం ఉద్దేశించాం అనేదాన్ని బట్టి సమాధానం ఉంటుంది. కవిత్వంలో ప్రాచీనభాష, మాండలిక భేదాలు, ఇంకా ఇతరమైన భేదాలు చాలా వాడతారు. కల్పనా సాహిత్యంలో అంటే- కథల్లో, నవలల్లో సందర్భాన్ని బట్టి మాండలిక భేదాలు వాడతారు. కాని, అన్నిరకాల ప్రజల్ని ఉద్దేశించి చేసిన రచనల్లో అందరికీ అర్థమయ్యే భాష వాడతారు. అట్లాంటి భాషను సామాన్య భాష అనీ, ప్రామాణిక భాష అనీ అంటారు. అందరికీ అర్థమయ్యే సామాన్య భాషను కొన్ని మార్పులతో రాస్తే ప్రామాణిక భాష అంటారు. రాసే అవసరాలున్న సమాజంలో అందరూ రాయటానికి ఒప్పుకున్న ఒకభాష ఉంటుంది. ఈ భాష కొన్ని మండలాల భాషతో దగ్గరి సంబంధమున్నా ఏ ఒక్కరి సొంతంకాదు. ప్రామాణిక రచనాభాష అనేది మాట్లాడే భాషనుంచే ఏర్పడుతుంది. ఎవరి వాడుక భాషను వారు పూర్తిగా రాస్తే ఆ భాష వాడని వారికి అభిప్రాయ గ్రహణం కష్టం అవుతుంది. సాహిత్య రచన వేరు. సాహిత్యేతర రచన ఎక్కువ ప్రాంతాలవారికి అర్థం కావలసిన అవసరం ఉంటుంది. అట్లా అందరికీ సమానంగాఅందుబాటులో ఉన్న భాషను ప్రామాణిక భాష అంటారు. అందరూ రాయటానికి ఒప్పుకున్న భాష కాబట్టి ఆభాషలో ఏకత్వం ఉంటుంది. అందరికీ అందుబాటులో ఉంటుంది కాబట్టి వారివారి అలవాట్లు చేరి భిన్నత్వమూ ఏర్పడుతుంది.

ఒక్కోసారి రెండు మాటల్ని, అవి నామాలు కావచ్చు, క్రియలూ కావచ్చు- చూపించి ఇందులో ఏది ప్రామాణికం అని అడుగుతుంటారు, ఏదో ఒకదే ప్రామాణికమయి ఉండాలన్నట్టు, రెండూ ప్రామాణికం కావచ్చు. కొందరు చెప్పారు అని రాస్తే కొందరు చెప్పినాడు అని రాస్తారు. రెండూ ప్రామాణికమే. ప్రామాణికత అనేది కొన్ని వ్యాకరణాలు గ్రంథాలు, కొందరు వ్యక్తులూ నిర్ణయించేదికాదు. సామాజికులు సమాజంలో తల ఎత్తిన కొన్ని పరిస్థితుల వల్ల పరస్పరాంగీకారంతో నిర్ణయించుకొనేది. అందరూ రాయటానికి ఇష్టపడేది, ఇతరులు రాస్తే ఒప్పుకొనేదే ప్రామాణిక భాష.

తప్పొప్పులు :

భాష రాస్తున్నప్పుడు 'ఏం తప్పు చేస్తున్నామో' అని భయపడటం సరైన పద్ధతికాదు. మనం చెప్పదల్చుకున్నది సమర్థంగా చెపుతున్నామా లేదా అని చూసుకోవటమే సరైన పద్ధతి. నలుగురూ ఒప్పుకునేది ఒప్పు. ఎవరూ ఒప్పుకోనిది తప్పు. మనం రాసే వాటిలో కొన్నిటిని గురించే పూర్తి తప్పు అనీ, పూర్తి ఒప్పు అనీ చెప్ప గలుగుతాము. చాలా వాటి విషయంలో అట్లా చెప్పలేము. ఇది తప్పుఅని నిర్ణయించేకన్నా, ఈ విధంగారాస్తే ఇంత కన్నా బాగుంటుంది అని చెప్పటం మంచి పద్ధతి.

తెలుగులో సమర్థులైన రచయితలు రాసిన రచనలు చదివితే మంచి భాషరాయటం అలవాటవుతుంది. అందు వల్ల మంచి రచనలు ఎక్కువ చదవాలి. శ్రీరంగం శ్రీనివాసరావు, దేవులపల్లి కృష్ణశాస్త్రి, గుడిపాటి వెంకటచలం, కొడవటిగంటి కుటుంబరావు, శ్రీ పాద సుబ్రహ్మణ్యశాస్త్రి, త్రిపురనేని గోపీచంద్, బుచ్చిబాబు, మొదలైన రచయితలు ఈకాలపు తెలుగును సమర్థంగా రాశారు. వాళ్ల రచనలు చదివితే మంచి తెలుగు రాయటం నేర్చుకోవచ్చు.

ఈ పాఠంలో చెప్పిన ముఖ్య విషయాలను ఈ క్రింది విధంగా పొందుపరచవచ్చు:

1. అన్నివేళలా మాట్లాడినట్టే రాయడం కుదరదు. మాట్లాడే భాషను రాసేటప్పుడు రాసే అలవాట్లను బట్టి, ఉన్న లిపిని బట్టి కొన్ని సర్దుబాట్లు చేసుకుంటాం.
2. తెలుగు లిపి తెలుగు ధ్వనులను రాయటానికి చాలావరకు సరిపోతుంది.
3. తెలుగులో చాలా మాటల్ని రెండు మూడు రకాలుగా రాస్తుంటారు. అట్లా కాకుండా ఒకే రకంగా రాస్తే రాతలో ఒక క్రమత్వం ఉంటుంది.
4. రెండు మూడు రకాల రాత రూపాలు (స్పెల్లింగులు) అమల్లో ఉంటే ఎక్కువ అమల్లో ఉన్న రూపం రాయటం మంచిది.
5. అమల్లో ఉన్న రూపాల్లో సాంప్రదాయికంగా వచ్చిన రూపం ఇప్పుడు దొరుకుతున్న నిఘంటువుల్లో కనిపిస్తుంది. అది రాస్తే నిఘంటువుల్లో వెతుక్కోవటం వీలవుతుంది.
6. రాసే వాళ్లంతా రాయటానికి ఒప్పుకొన్న భాష ప్రామాణిక భాష. ప్రామాణిక భాషలో ఏకత్వమూ ఉంటుంది, భిన్నత్వమూ ఉంటుంది.
7. రాసేటప్పుడు తప్పులు చేస్తున్నామేమో అని భయపడకూడదు. మన మనసులో అనుకున్నది సరిగ్గా రాయగల్గుతున్నామా లేదా అని మాత్రమే ఆలోచించాలి.
8. భాషలో చాలా మాటల విషయంలో ఇది తప్పు అనేకన్నా ఇంతకన్నా బాగా రాయటానికి వీలవుతుందా అని ఆలోచించాలి.
9. తెలుగులో మంచి వచనం రాసిన రచయితలను బాగా చదవటం అలవాటు చేసుకోవాలి.

BRAOU

అభ్యాసం (చదివే పని)

ఈ కింద ఇచ్చినది ఇటీవలే (1983) అచ్చయిన బతుకు పుస్తకం అనే స్వీయ చరిత్రలోనిది. ఈ చరిత్ర రచించినవారు వుప్పల లక్ష్మణరావుగారు (1898). ఈయన స్వాతంత్రోద్యమంలోనూ తరవాత ఇతర ప్రజోద్యమాలలోనూ పనిచేశారు. తెలుగు భాషా సాహిత్యాలమీద కృషి చేశారు. వీరు డైరీల రూపంలో రచించిన 'అతడు-అమె', అనే నవల (మూడు భాగాలు) జాతీయోద్యమకాలంలో మారుతున్న ఆంధ్రదేశాన్ని చిత్రించింది. లక్ష్మణరావుగారి శైలి చాలా సులభమైన వాడుకభాషా శైలి.

లక్ష్మణరావుగారికి తెలుగు 'స్పెల్లింగు' మీద కొన్ని దృఢమైన అభిప్రాయాలున్నాయి. అవి ఈ రచనలో కనపడతాయి. బతుకు పుస్తకంలోని ఈ భాగం ఇక చదవండి.

## వరప్రసాదం వాడుకభాష

ఆ సంవత్సరం నేను ఎస్. ఎస్. ఎల్. సి పరీక్షకు హాజరయాను. గురజాడ, గిడుగువారి ఆందోళన ఫలితంగా తెలుగు కాంపోజిషను పేపరు వాడుకభాషలో రాయవచ్చు అని గవర్నమెంటువారూ, సిండికేటువారూ అంగీకరించారు. అది నాకొక వరప్రసాదం అయింది. ఆ సంవత్సరం ఇంగ్లీషు కాంపోజిషను ప్రశ్నపత్రం తమాషాగా వుండెను. 'ఏ' అనువాడు 'బి' అనువ్యక్తిపైన వ్యాజ్యంవేశాడు 'బి' తాలూకు కుక్క వెంబ్రిదన్, అది తననుకరచిందనీ, అందుకు 'బి' వాడి అయిన 'ఏ'కి నష్టపరిహారం చెల్లించాల్సి వుంటుందనీ వ్యాజ్యం ! దీన్ని కోర్టులో సంభాషణ రూపంలో రాయండి అని ప్రశ్న. నాకు తెలిసిన 'లా' పదాలూ. లీగల్ లాటిన్ అంతా-రీస్ జ్యూడికేటా. సబ్ జ్యూడిస్, 'నో జ్యూరిస్‌డిక్షన్' 'నాన్ జాయిండర్' మొదలైన పదాలన్నీ వాడి కాంపోజిషను రాసేశాను. లెక్కలు మాత్రం ఏమి బాగా బాగా చెయ్యలేదు. ఫలితాలు వచ్చేసరికి నాకు ఇగ్లీషులో 72% రికార్డు మార్కులు వచ్చాయి. నాసహపాఠులిద్దరికీ 67% 62% వచ్చినట్లు గ్న్యాపకం. లెక్కల్లో కూడా నాకు 12% రికార్డు మార్కులే వచ్చాయి. తక్కిన అన్ని విషయాల్లోనూ కెమిస్ట్రి, ఫిజిక్సు, బోటనీలో మంచి మార్కులే వచ్చాయి. ఆ యేడు మాకు సైన్సు విషయాల్లో ప్రాక్టికల్ పరీక్షలు కూడా వుండేవి, అప్పట్లో ఎస్. ఎస్. ఎల్. సి, లో పాస్, ఫెయిల్ అని లేదు. కాలేజీ ప్రిన్సిపల్సుగార్ల యిష్టంపైనే ఇంటర్‌లో సీటు యివ్వడం యివ్వక పోవడం వుండేది. నాది ఇంగ్లీషులో రికార్డు మార్కు కాబట్టి నాకు క్రిస్టియన్ కాలేజీలో ఇంటర్ బోటనీ గ్రూప్‌లో సీటు దొరికింది. నా సహపాఠులిద్దరికీ కూడా క్రిస్టియన్ కాలేజీలోనే సీట్లు దొరికాయి. మేం ఇంటర్ మొదటి యేడాది వై. ఎమ్. సి. యే. హాస్టల్లో వుండేవాళ్ళం. తరువాత సంవత్సరం క్రిస్టియన్ కాలేజీ స్టూడెంట్స్ హామ్‌లో చేరాం. కాలేజీకి దగ్గర. ఆ యేడాదీ-తరువాత సంవత్సరాలమాట నాకు తెలీదు-విద్యార్థులు లైబ్రరీని బాగా వుపయోగించేందుకు వీలుగా రాత్రి 8 నుంచి 10 వరకూ తెరిచి వుండేది. విద్యార్థులు చాలామందే వచ్చేవారు.

మాకు తెలుగులో వుద్యోగ, విరాట, సభాపర్వాలు, పాఠ్యపుస్తకాలు, తెలుగు దంతుకుర్తి సూర్యనారాయణ శాస్త్రిగారు చెప్పేవారు. అప్పట్నుంచి నాకు తెలుగంటే సరదా పుట్టింది.

ఆ సంవత్సరం సెలక్షన్ పరీక్షలలో నాకు అన్ని విషయాల్లోనూ బాగానే మార్కులు వచ్చాయిగాని, ఫిజిక్సులో పాస్‌మార్కుకంటె వొక మార్కు తక్కువ వచ్చింది. ఆ వొక్కమార్కు వెయ్యండి, లేకుంటే నాకు వొక యేడాది వృధా అయిపోతుందని లెక్చరర్‌గారిని ఎంత బతిమాలుకున్నా ససేమిరా వెయ్యనన్నారు ఒక్క విషయంలో వొకేవొక మార్కుతో పోయినందున నన్ను పరీక్షకి పంపలేదు. నేను బరంపురం వచ్చేశాను.

## హోంరూలు ఉద్యమం

అప్పటికి మొదటి ప్రపంచ యుద్ధం జరుగుతూ వుంది. ప్రజాభిప్రాయం జర్మనీకి అనుకూలంగా వుంది. ఈ పరిస్థితుల్లో ఇండియాకు తక్షణమే హోంరూలు యివ్వాలని డిమాండు చేస్తూ, అనిబిసెంటుగారు ఆందోళన ప్రారంభించారు. అంతకుముందే తిలక్‌గారుకూడా వొక హోంరూలు లీగ్‌ని స్థాపించారు 1918లో రెండు లీగులూ విలీనమై ఐక్యంగా ఆందోళన సాగించారు. ఫలితంగా బిసెంటూ, అరండేల్, వాడియాగార్లను ఊటీలో యింటర్న్ చేశారు. దానితో ఆందోళన మరింత వుధృతంగా జరిగింది. నేను బరంపురం రాగానే గిరి, నాభి రామక్రిష్ణారావు గార్లతో కలిసి ఆందోళనలో పాల్గొన్నాను. ప్రతీ సాయంకాలం బారకాసులో బహిరంగ సభలే. ఈ వుద్యమాన్ని అణచివేయడానికని గవర్నమెంటు వారు "డిఫెన్సు ఆఫ్ ఇండియా" చట్టాన్ని అమలుపరచి, తమకు వ్యతిరేకంగా రాస్తూన్న వార్తాపత్రికలపై ధరావతు విధించి, ఆ ధరావతును జప్తుచేయడం, ఆందోళనకారులను అరెస్టు చేయడం మొదలుపెట్టారు. ప్రజాభిప్రాయాన్ని తమపక్షం తిప్పుకొందుకు మాంటేగ్యూ (కొత్త ఇండియా సెక్రటరీ ఆఫ్ స్టేట్) ఇండియా సందర్శించి వుదారమైన సంస్కరణలు జరుపుతాడనే ఆశ ప్రజలలో పుట్టించారు.

## జలియన్ వాలాబాగ్

ఈ ఆందోళనలో వొక భాగంగా జలియన్‌వాలాబాగ్‌లో రౌలట్ బిల్లును నిరసిస్తూ జరిపిన నిరాయుధులైన ప్రజల బహిరంగ సభ జరుగుతూ వుండగా, యెట్టి హెచ్చరిక లేకుండానే జనరల్ డయ్యరు తన సైనికులను రావించి సమావేశంపై కాల్పులు సాగించాడు. ఈ ఘాతుకం ఫలితంగా ఆందోళన మరింత బలపడి బ్రిటిష్ వారి వాగ్దానాలు

BRAOU

పట్టి బూటకమని తేలిపోయింది. మాంటేగ్యూ ఇండియాకు వచ్చినప్పుడు తక్షణమే వలస రాజ్య ప్రతిపత్తి డిమాండు చేస్తూ ఒక విజ్ఞాపనపత్రాన్ని ఆయనకి సమర్పించాలని కాంగ్రెసు ఆదేశించింది. ఆ విజ్ఞాపన పత్రంలోని వివరాలన్ని ప్రజలకు తెలియపరచి, వారి సంతకాలను సేకరించే వుద్యమం ప్రారంభమైంది. గిరిగారూ, నాళీ రామకృష్ణారావు గారూ, ఎర్రబోలు అప్పల నరసయ్య నాయుడుగారూ, నేనూ ఒక జట్టుగా కూడి, గోపాలపురం, సోంపేట, వుద్దానం, బారువా, హరిపురం మొదలైన గ్రామాలు సందర్శించి, అక్కడ బహిరంగ సభలు జరిపి, ప్రజలచేత సంతకాలు చేయించాం. ఇలా మన జిల్లా అన్ని ప్రాంతాలనుంచి కొన్ని లక్షల సంతకాలు సేకరించి, కాంగ్రెసు వర్కింగు కమిటీకి పంపగా, వారు ఆ విజ్ఞాపన పత్రాన్ని మాంటేగ్యూకి సమర్పించారు. గాంధీగారు దక్షిణాఫ్రికానుంచి 1914లో ఇండియాకు తిరిగి వచ్చేశారు, ఆయన దేశంలోని పరిస్థితులూ, ప్రజల చైతన్యమూ తెలుసుకుందుకు కొంతకాలం పాటు ఆగారు. కాని యెప్పుడైతే మాంటేగ్యూ—చెమ్స్‌ఫర్డు సంస్కరణలు వట్టి బూటకం, నాటకం అని తెలిసిపోయిందో అప్పుడు గాంధీగారు 1920లో సత్యాగ్రహోద్యమం ప్రారంభించారు.

[పేజీలు : 58-60]

## జగదీష్ చంద్రబోస్ శిష్యరికం

బి. ఎన్. ఆర్. సమ్మె సందర్భంలో గిరిగారికి మంచి స్నేహితుడైన ఇంజనీరు దంతులూరి లక్ష్మీ నరసింహరాజుగారితో నాకూ బాగా పరిచయం కుదిరింది. ఒకనాడు నేను వారి కార్ఖానాలో వుండగా ఆయనని చూడ్డానికి వచ్చిన డాక్టరు ఎస్. కె. సేన్ గారికి రాజుగారు నన్ను పరిచయం చేశారు. సేన్‌గారు అన్నారు: "మీరు డాక్టరేటు సంపాదించి వూరికే వుద్యోగం లేకుండా వుండడం బాగలేదు. మీకు అభ్యంతరం లేకపోతే నేను మిమ్మల్ని కలకత్తాలో వున్న సర్ జగదీశ్ చంద్రబోసు గారికి పరిచయం చేస్తాను. ఆయన పరిశోధనా యిన్‌స్టిట్యూట్‌లో మీకు స్కాలర్‌షిప్పుకి సిఫార్సు చేస్తాను. మీకేమైనా అభ్యంతరం వుందా?" అని అడిగారు.

BRAOU

"నాకేమీ అభ్యంతరం లేదు. ఆయన కింద పనిచేయడం ఒక గొప్ప అదృష్టంగా భావిస్తాను" అన్నాను.

"అయితే కొద్ది రోజుల తర్వాత మీరు కలకత్తా రండి. వచ్చే ముందు వ్యవధిగా నా పేర రాయండి" అన్నారు.

ఆ ప్రకారం కొద్ది రోజుల తర్వాత నేను కలకత్తా వెళ్ళి బోస్‌గారిని కలుసుకున్నాను. నాకు జర్మను భాష సరిగా వచ్చునో లేదో తెలుసు కుందుకు ఆయన ఒక చిన్న పరిశోధన వ్యాసంయిచ్చి దాన్ని అనువదించి తీసుకురమ్మన్నాడు. నేను మరునాడు ఆ అనువాదాన్ని ఆయన వద్దకు తీసుకువెళ్ళాను.

"నేను మిమ్మల్ని నా ఇన్‌స్టిట్యూట్‌లో స్కాలర్‌గా తీసుకుంటాను కాని నెలకి రూ. 50లే యివ్వగలను. వస్తారా?" అని అడిగారు.

"నేను మీ దగ్గర పుచ్చుకునే స్కాలర్‌షిప్పుతో బంగారపుమేడలు కట్టించుదామని నాకు లేదు. మీరు అంతర్జాతీయ ప్రఖ్యాతి గలవారు. వయోవృద్ధులు. మీరు సజీవులుగా వున్నపుడే మీ దగ్గిర యేమైనా నేర్చుకుందాం అనే అభిలాషతో మీ దగ్గరకి వచ్చాను" అన్నాను.

"నేను యిచ్చేది మీకు రూ. 50 లే. మీరు రికామీగా వున్నారు గనుక మీకు అది సరిపోతుంది. మీరు వివాహితులై వుంటే నూరు రూపాయలు యిచ్చివుందును" అన్నారు.

"మీరు అధికంగా యిస్తామన్న యేభై రూపాయలకి ఆశపడి నేను యే గుంటని పెళ్ళి చేసుకునేది? మీరు యిచ్చే యేభై నాకు చాలు" అన్నాను.

మరి రెండు నెలల తర్వాత నేను అడగకుండానే ఆయన నా స్కాలర్ షిప్పు 150 రూపాయలు చేసాడు.

## అసంత్రుప్తి చెందాను

బోస్‌గారి ఇన్‌స్టిట్యూట్‌లో చేరేముందు నా ఆశ యెలాగుండేదంటే సైంటిస్టుకి సైంటిఫిక్ ఆవిష్కరణకి కేవలం హేతువాదం సరిపోతుందా లేక అంతర్‌గ్యానం(ఇంట్యూయిషన్) కూడా వుండాలా? తన పరిశోధన ఫలితాలను ముందుగానే గ్రహించగల్గేశక్తి వుండాలా? సైంటిస్టుకి ఆవేశం (ఇన్‌స్పిరేషన్) అవసరమా? అవసరమైతే అది ఎక్కడ నుండిఅతనికి కల్గుతుంది మామూలుగా యూనివర్శిటీలో పరిశోధనలు చేసే విద్యార్థికి ఇంట్యూయిషను అవసరమా? ఇలాటి విషయాలను గురించి తన విద్యార్థులతో కలిసి బోస్‌గారు చర్చించుతారని అనుకున్నాను. ఆయన ప్రస్తుతం యే సమస్యపై పరిశోధనలు చేస్తున్నదీ మాతో కలిసి చర్చించుతారనే ఆశ పడ్డాను. వారి సైంటిఫిక్ క్రుషి అంతా సమిష్టిగా జరుగుతుందనే భావించాను. కాని మూడేళ్ళు పనిచేసిన తర్వాత నా భ్రమలు భ్రమలుగానే వుండిపోయాయి. అంచేత నాకు అసంత్రుప్తి కల్గింది.

ఆయన మహా పురుషుడు.

భారత్‌కి ఆధునిక విగ్యానశాస్త్ర ప్రపంచంలో వున్నత స్థానాన్ని సుస్థిరపరచిన సైంటిస్టు. గొప్ప దేశభక్తుడు.

[పుప్పల లక్ష్మణరావు, బతుకు పుస్తకం, విశాలాంధ్రి పబ్లిషింగ్ హవుస్, విజయవాడ, 1983, పేజీలు 123-124]

## అభ్యాసం (రాసేపని)

1. 'బతుకు పుస్తకం'లో నుంచి ఇంగ్లీషు మాటలను ఏరి తెలుగు రాత పద్ధతిలో అసలు ఇంగ్లీషు మాటలు ఇంగ్లీషు రాతలో రాయండి. ఇంగ్లీషు స్పెల్లింగులకోసం ఇంగ్లీషు డిక్షనరీని సంప్రదించండి.

2. 'బతుకు పుస్తకంలో నుంచి కింద గీతలుంచిన తెలుగు మాటలను సాంప్రదాయకమైన (తెలుగు నిఘంటువుల్లో దొరికేవిధంగా) రాతపద్ధతిలో రాయండి.

3. ఈ కింది సంస్కృతం మాటలను సాంప్రదాయక పద్ధతిలో తిరగరాయండి.

| | |
|---|---|
| ద్రుష్టి | రుజుమార్గం |
| శతృవు | క్రిష్ణశాస్త్రి |
| స్రిష్టి | గ్యాపకం |
| క్రిత్రిమం | విగ్నానం |
| త్రిప్తి | ఉద్యోగం |
| రుణం | సంవచ్చరం |
| రుషి | ప్రిత్యేకత |
| ఆసయం | సెరీరం |
| ప్రసంశ | సిష్యుడు |
| ఆకాషం | షాష్వతం |
| సశ్యస్యామల | సిక్ష |
| ఉద్దేషం | విషాసం |

apou LIBRARY

4. ఈ కింద సంస్కృతం మాటల్లో వత్తులు సరైన చోట్ల పెట్టండి. అవసరమైన అక్షరాలు మార్చి దత్తు అక్షరాలు రాయండి.

| | |
|---|---|
| మేగం | బాదలు |
| ఖదలు | సుబద్ర |
| మాదుర్యం | సంస్తానం |
| మహాప్రస్తానం | గందకం |
| తుంగబద్ర | పలితం |
| పాటం | ప్రస్పుటం |
| మటం | కాష్టం |

ఈ క్రింది ఇంగ్లీషు మాటలను తెలుగు లిపిలో వ్రాయండి

| | |
|---|---|
| Contribution | Lodge |
| Application | Budget |
| Irrigation | Judge |
| Education | Bridge |
| Constitution | Gadget |
| Marriage | |
| Zoological Park | |
| Measurement | |
| Pleasant | |
| Pressure Cooker | |
| March | |
| Garrage | |
| Municipality | |
| Sociology | |

BRAOU

6. మీకిష్టమైన తెలుగు రచయిత రాసిన వచన భాగాన్ని ఒక పేజీ ఉన్నదున్నట్టు ఎత్తి రాయండి. అందులో స్పెల్లింగులగురించి మీ వ్యాఖ్య రాయండి.

7. బతుకు పుస్తకంలో తెలుగు రచన మీద మీ సొంత వ్యాఖ్య చెయ్యండి.

ఖండిక 1 పాఠం : 2

# సంధి : మాటల కలయిక

ఉద్దేశం :

తెలుగులో సంధిని గురించి వివరించి సంధిలో వచ్చే ఉచ్చారణ భేదాలు సూచించి సంధి ఎక్కడ చెయ్యటం అవసరమో, ఎక్కడ చెయ్యక్కరలేదో సూచించటం.

ప్రణాళిక :

1. సంధి అంటే ఏమిటి?
2. సంస్కృత సంధులు : సవర్ణదీర్ఘ, గుణ, వృద్ధి యణాదేశ, విసర్గ సంధులు.
3. తెలుగు సంధులు, బహువచన నిర్మాణం.
4. క్రియా పదాల్లో రాయటంలో భేదాలు.
5. 'వ' కారాది పదాలలో సంధి.
6. ప్రకృతి - ప్రత్యయాల సంధులు.
7. సంధి చెయ్యాలా? అక్కర్లేదా?
8. ముఖ్యాంశాల క్రోడీకరణ
9. అభ్యాసాలు, ప్రశ్నలూ

BRAOU

## సంధి : కలయిక:

ఒకటో తరగతి, రెండో తరగతి పుస్తకాలలో ప్రతి పాఠానికి మొదట కొన్ని మాటల పట్టిక ఉంటుంది. ఆ మాటలు ఉపయోగించిన వాక్యాలు కింద ఉంటాయి. ఇంకా పేజీలు తిప్పితే మాటల పట్టిక ఉండదు. కేవలం వాక్యాలతో పాఠాలు ఉంటాయి. ఈ సారి ఎప్పుడన్నా ఆ మాటలు ఉపయోగించిన వాక్యాల్లో మాటల్ని గుర్తు పట్టే ప్రయత్నం చెయ్యండి. పట్టికలో ఇచ్చిన మాటల ఆకారానికి వాక్యాల్లో ఉపయోగించిన కలిపిరాసిన మాటల ఆకారానికి తేడా కనిపిస్తుంది. ఈ తేడా ఎందుకు వచ్చిందో ఒక్కసారి ఆలోచించండి. ఉదాహరణకు:

| | |
|---|---|
| పాలు | ఏది |
| ఆవు | ఎవరు |
| బాతు | ఎందుకు |
| కారు | లేదు |
| వారు | లేవు |
| డబ్బు | ఉంది |

ఈ మాటల్లో కొన్నిటిని అర్థవంతంగా కలిపిరాస్తే

పాల్లేవు, ఆవుంది, డబ్బుంది, వారెవరు, కారెందుకు, ఆవు పాల్లేవు
మొదలైన వాక్యాలు తయారు అవుతాయి. విడిగా రాసిన మాటలను వాక్యాల్లో మాటలతో పోల్చిచూడండి :

| 1 | | 2 | 3 |
|---|---|---|---|
| పాలు + లేవు | — | పాల్ + లేవు | = పాల్లేవు |
| ఆవు + ఉంది | — | ఆవ్ + ఉంది | = ఆవుంది |
| డబ్బు + ఉంది | — | డబ్బ్ + ఉంది | = డబ్బుంది |
| వారు + ఎవరు | — | వార్ + ఎవరు | = వారెవరు |
| కారు + ఎందుకు | — | కార్ + ఎందుకు | = కారెందుకు |
| ఆవుపాలు + లేవు | — | ఆవుపాల్ | = ఆవుపాల్లేవు. |

పై పట్టికలో 1 — 2 వరసల కింద మాటల క్రమాన్ని జాగ్రత్తగా చూస్తే జరిగిన మార్పేమిటో తెలుస్తుంది. మొదటి మాటలో చివరి అచ్చు ఇంకో మాట వచ్చినప్పుడు ఎగిరి పోయింది. మొదటి వరసలో మాటల చివర ఉన్న 'కొమ్ము' 'ఉ' అనే అచ్చును సూచిస్తుంది. '్' అని అక్షరంపైన ఇచ్చిన పొల్లు అచ్చు లేకపోవటాన్ని చూపిస్తుంది. అచ్చు లేకుండా ఇట్లా పొల్లుతో రాసేకన్నా తరవాత అక్షరంతో కలిసి రాస్తే చోటు కలసివస్తుంది. అట్లా కలిపిరాయటం చాలామందికి అలవాటు. అందుకు కారణం తెలుగులో హల్లుతో ముగిసే [హలంతమైన] మాటలు తక్కువ. ఉన్న వాటినైనా రాతలో చూపించకుండా ఉచ్చారణలో చూపిస్తారు. 'మ' కారంతమైన "అందం, చందం, కంచం. మంచం" వంటి మాటలను చివరి సున్నతో రాస్తాంగనుక పొల్లు అక్షరాలు ఇక్కడా అవసరం లేదు. అందువల్ల హల్లు - అచ్చులు క్రమంగా వచ్చినప్పుడు గాని, రెండు మూడు హల్లులు వరసగా వచ్చినప్పుడు గాని వాటిని కలిపి రాయటం అలవాటు అయింది.

పైన పట్టికలో రెండో వరసలో జరిగిన మార్పును సంధి అంటారు. పూర్వం మీరుచదివిన వ్యాకరణాల్లో "పూర్వ పరస్వరంబులకు పరస్వరం బేకాదేశంబగుట సంధి" అని గాని ఆ అర్థం వచ్చేట్టు రాసిన ఇంకో నిర్వచనం కాని చదివి ఉంటారు. ఆ సూత్రాల అవసరం లేకుండానే మనం మాట్లాడే భాషలోనూ, ఈ కాలపు రాసే భాషలోనూ జరిగే మార్పులను 'సంధి' పేరుతో గుర్తించవచ్చు. రెండు అర్థవంతమైన శబ్దాలు ఉచ్చారణలో దగ్గరగా వచ్చినప్పుడు ఆ భాష మాట్లాడేవారి అలవాట్లను బట్టి జరిగే మార్పులను సంధి అంటారు. ఈ మార్పులు అన్ని ప్రాంతాల్లోనూ ఒకటిగా ఉండక పోవచ్చు. అయితే అట్లాంటి భేదాలు స్వల్పంగా ఉంటాయి. వాటివల్ల వ్యవహారంలో వచ్చే చిక్కులు ఏమి ఉండవు.

మాట్లాడే వారి అలవాట్లనుబట్టి ఈ సంధి ఉంటుంది అన్నాం. ఒక భాష మాట్లాడేవారి అలవాట్లలో గుర్తించ దగిన సామ్యం (ఏకత్వం, పోలిక) ఉంటుంది. భాషల మధ్య ఈ అలవాట్లలో భేదం ఉంటుంది. అందే సంధి అన్ని భాషల్లోనూ ఒకటిగా ఉండదని అర్థం.

తెలుగులో అనేక చారిత్రక, సాంస్కృతిక కారణాలవల్ల సంస్కృతం మాటలు విరివిగా ప్రవేశించినాయి. సంస్కృతం ఎప్పుడో చాలా కాలం కిందట మాట్లాడేవాళ్లు. ఉత్తర భారతంలో హిందీ, పంజాబీ, బెంగాలీ, ఒరియా, మరాఠీ వంటి భాషలకు అది మూలం. వేరు వేరు భాషలుగా చీలిపోయిన తరవాత కూడా సంస్కృతం సాంస్కృతిక, విజ్ఞాన భాషగా రాతలో మిగిలిఉంది. ఆభాషలో గొప్ప గొప్ప కావ్యాలు, శాస్త్రాలు వచ్చినాయి. దేశంలోని అన్ని ప్రాంతాల పండితులూ ఈ గ్రంథాలు రచించారు. వారిద్వారా సంస్కృత భాషనుంచి ఎన్నో మాటలు దేశభాషల్లోకి వ్యాపించినాయి. అందువల్ల తెలుగురాసే వాళ్లు కాస్తో, కూస్తో సంస్కృత సంధిని గురించి కూడా తెలుసుకోవాల్సి ఉంటుంది.

## సంస్కృత సంధులు

సంస్కృత సంధులను గురించి వివరంగా తెలుసుకోవాలంటే ఈ పాఠాల్లో కుదరదు. ఈ పాఠంలో కొద్దిగా తెలుసుకుందాం:

సంస్కృతంలో అచ్చులకయ్యే సంధులను, హల్లులకయ్యే సంధులను విడివిడిగా చెప్తారు.

BRAOU

1. సవర్ణదీర్ఘ సంధి :

అ-ఆ, ఇ-ఈ, ఋ-ౠ, ఌ-ౡ, అనేవి హ్రస్వ దీర్ఘ భేదాలతో అచ్చుల జంటలు. ఉచ్చారణలో ఎక్కువ కాలం ఉచ్చరించేది దీర్ఘం, తక్కువ కాలం ఉచ్చరించేది హ్రస్వం. తెలుగు మాటల్లో చెప్పుకుంటే పొట్టి అచ్చు, పొడుగు అచ్చు అని చెప్పుకోవచ్చు. ఈ పొట్టి పొడుగు అచ్చులకు ఉచ్చారణ చాలా వరకు ఒకే రకంగా ఉంటుంది గనక వీటిని సవర్ణాలన్నారు.

సవర్ణాలయిన అచ్చులు రెండూ ఏక్రమంలో అయినా (అంటే రెండు పొట్టివిగాని, రెండు పొడుగువి కాని, పొట్టిపొడుగూ కాని, పొడుగూ పొట్టి కాని) వస్తే దీర్ఘాచ్చు అవుతుంది. రెండిట్లో ఒకటి దీర్ఘాచ్చు అయితే అదే మిగుల్తుంది.

దేశ + అటనం = దేశాటనం

ద్రాక్ష + ఆసవం = ద్రాక్షాసవం

కవి + ఈశ్వరుడు = కవీశ్వరుడు

భాను + ఉదయం = భానూదయం

పితృ + ఋణం = పితౄణం

'ఌ' కార సంధిని గురించి ఈ దశలో తెలుసుకోవాల్సినంత అవసరంలేదు. సవర్ణదీర్ఘ సంధి తెలియక పోవటంవల్ల "<u>భానోదయం</u>" అని రాస్తున్నారు. (రాస్తే తప్పేమిటని కొందరు అడగవచ్చు. తప్పు ఏమీలేదు. అందరూ అట్లాగేరాస్తే తప్పుని ఒప్పుగా అందరూ అంగీకరిస్తున్నారు గనుక అది తప్పుకాదు. కాని కొందరే రాస్తే అది ఎక్కువ మంది పద్ధతికి విరుద్ధం గనుక "తప్పు" అవుతుంది. 'తప్పు అంటేనేరం అని కాదు. అందరూ ఒప్పుకొన్న పద్ధతికి భిన్నం" అని మాత్రమే.

BRAOU

2. గుణ సంధి :

సంస్కృతంలో ఏ, ఓ, అర్' (అల్ అక్కర్లేదు) అనేవాటిని గుణాలు అంటారు. ఈ సంధి జరిగే పద్ధతి ఈ క్రింది విధంగా చూపించవచ్చు:

అ ఆ + ఇ, ఈ → ఏ

అ ఆ + ఉ, ఊ → ఓ

అ ఆ + ఋ, ౠ → అర్

ఉదా : రమా + ఈశ = రమేశ

మధుర + ఊహ = మధురోహ

మహా + ఉదయం = మహోదయం

వసంత + ఋతువు = వసంతర్తువు.

ఋ కారంతో మొదలైన మాటలకు సంధిచెయ్యకుండానే రాస్తారు. వసంత ఋతువు, గ్రీష్మ ఋతువు అనే రాస్తుంటారు. (ఋతువు, ఋణం, ఋషి, అనే మాటలను 'రుతువు, రుణం, రుషి' అనే విధంగా కొంతమంది, బహుశా చాలామంది రాస్తున్నారు. ముఖ్యంగా పత్రికల్లో <u>ఋ</u> కారాన్ని వదిలేస్తుంటారు. వదిలివెయ్యటం దోషమని అనక పోవచ్చు. కాని రాయగలిగితే మంచిదే)

3, వృద్ధి సంధి :

అ ఆ + ఏ, ఐ → ఐ

అ ఆ + ఓ, ఔ → ఔ

దేశ + ఏకత = దేశైకత

మహా + ఏకాదశి = మహైకాదశి

మహా + ఐశ్వర్యం = మహైశ్వర్యం

వన + ఓషధి = వనౌషధి

దేశ + ఔన్నత్యం = దేశౌన్నత్యం

[ఏకత అనేమాటకు తెలుగులో 'ఐక్యత' అనే రూపమే ఎక్కువ ప్రచారంలో ఉంది. పత్రికల్లో రాజకీయ గ్రంథాల్లో ఐక్యత అనే రూపమే కనిపిస్తుంది. సంస్కృతం వ్యాకరణం ఒప్పుకోకపోయినా ఎక్కువ వ్యాప్తిలో ఉన్న ఈ రూపం రాయటం వల్ల నష్టంలేదు]

4, యణాదేశ సంధి ;

ఇ, ఉ, ఋ ల తరవాత సవర్ణంకాని అచ్చువస్తే య, వ, ర లుగా మారతాయి. ఇ, ఉ, ఋలు అచ్చులు. వీటితో దగ్గర సంబంధం ఉన్న హల్లులు య, వ, ర లు (ఋ అనేది సంస్కృతంలో అచ్చు. అది ఎట్లా ఉచ్చరించే వారో తెలీదు. ఇప్పుడు సంస్కృతం ఉచ్చరించేవారెవరూ దాన్ని అచ్చుగా ఉచ్చరించటంలేదు. అచ్చుగా ఉచ్చరించట మంటే ఉచ్చారణావయవాలు ఒక దానికొకటి తాకకుండా ఉచ్చరించటం. ఇప్పటి తెలుగులో ఋకు రు కు భేదం రాతలో చూపించేది మాత్రమే)

అతి + అంత = అత్యంత

అతి + ఉక్తి = అత్యుక్తి

లఘు + అంతం = లఘ్వంతం

తరు + అగ్రం = తర్వగ్రం

పితృ + ఆర్జితం = పిత్రార్జితం

సంస్కృతం అచ్చు సంధుల్లో ప్రధానంగా తెలుసుకోవలసినవి చాలా ఉన్నై. వాటిని సూత్రాల ద్వారా తెలుసుకోవటం కన్నా అభ్యాసం ద్వారా నేర్చుకోవటం ఎక్కువ సులువు.

సంస్కృతంలో వయస్, మనస్, తపస్ వంటి మాటలున్నాయి వీటికి సంధిలో కొన్ని చోట్ల విసర్గవస్తుంది. కొన్నిచోట్ల విసర్గకు 'ఉ' వచ్చి అది 'ఓ'గా మారుతుంది. ఉదాహరణకు ఈ కింది మాటలు చూడండి :

వయస్ + భేదం = వయోభేదం

మనస్ + గతి = మనోగతి

తపస్ + ధనం = తపోధనం

కకార, పకారాది పదాలు వచ్చినప్పుడు ఈ చివరి 'స' కారం విసర్గగా (ః) మారుతుంది. దాని ఉచ్చారణ క కారం ముందు 'హ' కారంగానూ, పకారం ముందు 'ఫ' (ఉఫ్ అని ఊదినప్పుడు చేసే ధ్వనివంటిది) కారంగానూ ఉంటుందని సంస్కృత వ్యాకరణాల్లో చెపుతారు. మొదటి ఉచ్చారణను 'జిహ్వామూలీయం' రెండో ఉచ్చారణను 'ఉపధ్మానీయం' అనీ అంటారు.

అయితే తెలుగువారి ఉచ్చారణలో ఈ భేదం కనపడదు. అన్నిటికీ 'హ' కారాన్నే (జిహ్వా మూలీయ ధ్వనినే) వాడతారు. రాతలో విసర్గనే రాస్తారు. ఈ కింది ఉదాహరణలు చూడండి.

BRAOU

వయస్ + పరిమితి = వయఃపరిమితి

మనస్ + ఫలకం = మనఃఫలకం

తపస్ + ఫలం = తపఃఫలం

ఇంతకు ముందు చూపించిన ''వయోభేదం, మనోగతి, తపోధనం'' వంటి మాటల ప్రభావంతో 'వయో పరిమితి, మనోఫలకం, తపోఫలం' అని రాస్తున్నారు.

అట్లాగే తపశ్శక్తి, మనశ్శక్తి అని రాయాల్సినచోట తపోశక్తి, మనోశక్తి అని కూడా రాస్తున్నారు. ఈ రకమైన రూపాలు ప్రసిద్ధమైన రచయితలు కూడా రాస్తున్నారు. (చలంగారి మ్యూజింగ్సులోనూ, రంగనాయకమ్మగారి రామాయణ విషవృక్షంలోనూ ఇట్లాంటివి కనిపిస్తాయి, వీలును బట్టి ఒకసారి వెతికి చూడండి). పత్రికల్లో కూడా 'గుణం' రూపాలే (ఓ తో వచ్చే రూపాయి) కనిపిస్తున్నాయి.

ఈ దశలో వయోపరిమితి, తపోశక్తి అని రాయటం తప్పా, రైటా అంటే సమాధానం చెప్పటం కష్టం. రాసిన వాదిని తప్పు అనకుండా సంస్కృత వ్యాకరణం ప్రకారం ఏవి ఒప్పులో తెలుసుకొని రాయటం మంచిది. (ఈ విషయంలో దొరికితే సన్నిధానం సూర్యనారాయణ శాస్త్రిగారు రచించిన తత్సమ చంద్రిక అనే పుస్తకం ఉపయోగిస్తుంది. వెతికితే ఇట్లాంటి పుస్తకాలు ఇంకా మార్కెట్లో దొరకవచ్చు.)

కొన్ని సంస్కృత సంధులు ఉన్నవి ఉన్నట్టుగా రాస్తే అవి తప్పు లేమో అనిపించేంతగా వేరే సంధిరూపాలు వ్యాప్తికి వచ్చినాయి. ఉదాహరణకు 'అంతర్ + రాష్ట్రీయ' సంస్కృత మర్యాదను అనుసరించి అంతా రాష్ట్రీయ అని కావాలి. కాని ఆ సంధి రూపం రాస్తే అసలే అర్థం కాకుండా పోయే ప్రమాదం ఉంది 'అంతర్ రాష్ట్రీయ' అని సంధి లేకుండా రాయటమే శ్రేయస్కరం.

BRAOU

తెలుగులో కనిపించే సంస్కృత శబ్దాలు సంధిలో రకరకాలుగా కనిపిస్తున్నాయి. సంస్కృత పద్ధతికి విరుద్ధంగా తెలుగులో వ్యాప్తిచెందిన రూపాలను రాయటం మంచిదా కాదా అనే విషయం ఆయా రూపాలను బట్టి నిర్ణయించుకోవలసిందే కాని, అన్నిటికీ కలిపి ఒకే నిర్ణయం చెయ్యటం కష్టం. మార్గదర్శకంగా ఈ సూత్రాలు పాటించవచ్చు:

1. సంస్కృత మర్యాదానుసారంగానూ, విరుద్ధంగానూ రెండు రకాలుగా సంధిరూపాలు ప్రచారంలో ఉంటే సంస్కృత మర్యాదననుసరించే రూపాలు వాడటంలో ఔచిత్యం ఉంది. ముందు సంస్కృతం మర్యాద బాగా అర్థమవుతుంది. అక్కరకొస్తుంది.

2. సంస్కృత సంప్రదాయానికి విరుద్ధమైన రూపమే ఎక్కువ ప్రచారంలో ఉన్నప్పుడు, సరైన రూపం ఉపయోగిస్తే అసలు అర్థం కాకుండాపోయే ప్రమాదం ఉంది. అటువంటప్పుడు తప్పు అయినా అధిక ప్రచారంలో ఉన్న రూపాన్ని వాడటమే సరైన పద్ధతి.

(తప్పొప్పులను నిర్ణయించేది పుస్తకాలు కాదు, పండితులు కాదు, సంస్థలుకాదు, ప్రభుత్వాలు కాదు. వాడకందార్లు మాత్రమే తప్పొప్పులను నిర్ణయిస్తారు. భాషను ఉపయోగించేవారు ఒకటి తప్పు అనుకుంటే అది తప్పు. ఒప్పు అనుకుంటే అది ఒప్పు. భాషలో తప్పొప్పులను నీతి అవినీతులదృష్ట్యా సాంఘిక చట్టాల దృష్ట్యా చూడగూడదు. వ్యవహారానికి ఎంత పసందుగా పనికివస్తాయి, లేదా అర్థం వస్తాయి అనే దృష్టితోనే ఆలోచించాలి.)

## తెలుగు సంధులు

సాంప్రదాయిక వ్యాకరణాల్లో సంధిని గురించి వివరంగా విశదీకరించారు కాని అది ఈ కాలానికి అంతగా సరిపడదు. ప్రాచీన కావ్యభాషను దృష్టిలో పెట్టుకొని రాశారు వాళ్లు. ప్రాచీన కావ్య భాషా ప్రభావం ఈనాటి రచనా భాషమీద చాలా తక్కువ. ఈ శతాబ్ది మొదటి అర్థ భాగంలో రాసిన కొందరు రచయితలమీద ఆ భాషాప్రభావం ఉంది. కందుకూరి వీరేశలింగం, చిలకమర్తి లక్ష్మీ నరసింహం, పానుగంటి లక్ష్మీనరసింహారావు, విశ్వనాథ సత్యనారాయణ, నోరి నరసింహశాస్త్రి, కోరాడ రామకృష్ణయ్య మొదలైన రచయితల వచన రచనలమీద ప్రాచీన భాషా ప్రభావం

ఉంది. ఇటీవలి కాలంలో వచన రచయితలుగా పేరు పొందిన వారి రచనలమీద ఈ ప్రభావం తక్కువ. ఉదాహరణకు గుడిపాటి వెంకటచలం, కొడవటిగంటి కుటుంబరావు, త్రిపురనేని గోపీచంద్, రాచకొండ విశ్వనాథశాస్త్రి, నార్ల వెంకటేశ్వరరావు, గోరాశాస్త్రి, రాచమల్లు రామచంద్రారెడ్డి, రంగనాయకమ్మ వంటి రచయితల మీద ఈ ప్రభావం చాలా తక్కువ. ఈ కాలపు తెలుగు రచన ఈ కాలపు భాషలోనే ఉండాలి కాబట్టి ఈ కాలపు భాష రాసేవాళ్లే ఈనాటి వచన రచనకు ఆదర్శం. అంతేకాదు, ఈ పాఠంలో పేరు పేరునా చెప్పని రచయితలు చాలామంది ఉన్నారు. వాళ్లంతా ఈనాటి తెలుగు వచనాన్ని తీర్చి దిద్దటంలో భాగస్వాములే. వీళ్లందరి వచన రచనల్ని దృష్టిలో ఉంచుకొని కొన్ని విషయాలను నేర్చుకుందాం.

[ఈ పాఠాల్లో కవిత్వాన్ని గురించి ప్రస్తుతం పట్టించుకోటం లేదు. అందుకు కారణం ఒకటే. ఈ రోజుల్లో వచనం రాసే అవసరం దాదాపు అందరికీ ఉంది. కవిత్వం కొందరే రాస్తారు. పైగా కవిత్వంలో ఉపయోగించే భాష వచనంలో రాసే భాషతో చాలాచోట్ల భేదిస్తుంది. కవిత్వంలో ప్రాచీన భాషా ప్రభావం వచనం మీదకన్నా ఎక్కువ. కవిత్వాన్ని గురించి తప్పకుండా మాట్లాడుకుందాం. కాని ఇప్పుడు కాదు.]

'సంధి' అనే మాటకు ప్రాచీన వ్యాకరణాల్లోనూ, ఆధునిక భాషా శాస్త్రంలోను వేరు వేరు అర్థాలున్నాయి. వాటిని గురించి సమగ్రంగా వివరించటానికిది సమయంకాదు. తెలుగు భాషా సాహిత్యాలను ప్రత్యేక విషయంగా తీసుకుంటే అక్కడ కూలంకషంగా తెలుసుకోవచ్చు. ఇప్పుడు మనక్కావలసింది ఈ నాటి రచనా భాషలో సంధి ప్రవర్తన ఏమిటి? రాసేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్త లేమిటి? అన్నవే.

భాషలో కొన్ని మాటలకు కొన్నిఆరాల్లో కొన్ని చిన్న చిన్న శబ్దాలు చేరతాయి. అట్లాంటి వాటిని ప్రత్యయాలు అంటారు. బహువచన ప్రత్యయం, కాలబోధక ప్రత్యయం, పురుషబోధక ప్రత్యయం అనే మాటలను వినే ఉంటారు. ఇవి చేరే మాటలను ప్రకృతులనీ, ధాతువులనీ, అంటారు. (ప్రస్తుతం ఈ మాటలకు అర్థాలు వెంటనే తెలియక పోయినా పరవాలేదు). ఇట్లా ప్రకృతులకు అంటే అసలు మాటలకు, ప్రత్యయాలు చేర్చినప్పుడు కొన్ని మార్పులు జరుగుతాయి. ఆ మార్పులను గురించి ముందు తెలుసుకుందాం. అయినా అన్నీ అక్కరలేదు. రాతలో వచ్చే చిక్కులు తెలుసుకోవటానికే పరిమితమవుదాం.

BRIOU

లు అనే శబ్దాన్ని నామ పదాలకు (nouns) చేరిస్తే బహువచన నామాలు ఏర్పడతాయి. ఇట్లా లు చేరిస్తే వచ్చే మార్పులు చాలావరకు రాతలో చూపించటానికి అడ్డంకులేమీ లేవు. ఉదా:- చేతులు, గదులు, పుస్తకాలు, గేదెలు మొ॥. కాని కొన్నిటిని రాసేటప్పుడు చిక్కులువస్తాయి. వాటిలో కొన్ని ముఖ్యమైన వాటిని తెలుసుకుందాం.

1. కోడు + లు కోడి + లు అనే అక్షర క్రమంలో అచ్చుపోయి డ్లు అనే క్రమం వస్తుంది. అట్లా వచ్చిన క్రమం వెంటనే ఉచ్చారణలో ళ్ల గా మారుతుంది. దాన్ని కోళ్లు అనిగాని కోళ్ళు అనిగాని రాయవచ్చు. ఎట్లా రాసినా ఉచ్చారణ ఒకటే. అయితే చాలామంది కోళ్లు అనే విధంగా రాస్తున్నారు. అదే సరిపోతుంది.

2. గుడ్డు + లు అనే శబ్దాల వరస క్రమంగా గుడ్డ్ + లు → గుడ్ + లు అని మారుతుంది. ఇది ఉచ్చారణలో 'గుడ్ళు' అని అవుతుంది. రాతలో గుడ్లు అని మాత్రమే రాస్తున్నారు. ఇక్కడ ౢ అనే విధంగా రాసిన లకారాన్ని 'ళ' కారంగా తప్ప ఇంకో విధంగా ఉచ్చరించటం సాధ్యంకాదు గనక 'గుడ్లు' అని రాసినా 'గుడ్ళు' అని రాసినా ఉచ్చారణ ఒకటే. అందుకే చాలామంది రాస్తున్న విధంగా మొదటిదే రాయవచ్చు.

కొన్ని మాటలకు మాండలిక భేదాలనుబట్టి రెండురకాల బహువచన రూపాలుంటాయి. కింది మాటల్ని చూడండి:

ఇల్లు — ఇండ్లు, ఇళ్లు

కన్ను — కండ్లు, కళ్లు

పల్లు<br>పన్ను — పండ్లు, పళ్లు

పండు — పండ్లు, పళ్లు

బండి — బండ్లు, బళ్లు

రోకలి — రోకండ్లు, రోకళ్ల

వాకిలి — వాకిండ్లు, వాకిళ్ల

తిరగలి — తిరగండ్లు, తిరగళ్ల

నాగలి — నాగండ్లు, నాగళ్ల

కొడవలి— కొడవండ్లు, కొడవళ్ల

ఈ రెండు రకాల బహువచన రూపాల్లో మొదట రాసినవి పూర్వకాలపువి. అయినా ఇంకా నేటి భాషలో ఉన్నాయి. రెండో వరసవి ఈనాటివి. రెండురకాల రూపాలను మాటల్లోనూ రాతలోనూ చాలామంది వాడుతున్నారు. వీటితో ఏదిరాసినా ఒకటే. అయితే ఒకచోట ఒకటీ, మరొకచోట ఇంకొకటీ రాసేకన్నా అన్నిచోట్లా ఒకేరకపు రూపాలు వాడటం బాగుంటుంది.

4. కాలు, రోలు, నోరు, వెదురు వంటి మాటలకు లు చేర్చినప్పుడు కాళ్లు, రోళ్లు, నోళ్లు, వెదుళ్లు అనే రూపాలు ఏర్పడతాయి. ఇక్కడ రెండురకాల రూపాలు లేవు.

5. కోటు, నోటు, పాటు మొదలైన మాటలకు బహువచనంలో చివరి అచ్చు పోతుంది. అప్పుడు కోట్లు, నోట్లు, పాట్లు అనే రూపాలు ఏర్పడతాయి.

6. ఈ పైన బహువచన రూపాలలో గుర్తించదగిన విశేషముంది. ఏకవచనం మాటల చివర అచ్చును, లు చేర్చినప్పుడు తప్పక తొలగించాలి జరగవలసిన మార్పులు తప్పక జరగాలి. అందే కోడులు, గుడ్డులు, ఇల్లులు, ఇండులు, రోకలులు, రోకండులు, రోకళులు, రోలులు, రోళులు, నోటులు, పాటులు– వంటి రూపాలు ఈ నాటి భాషలో ఉండవు. అంటే మీరు ఇప్పుడు ఈ కోర్సుద్వారా నేర్చుకుంటున్న ఆధునిక భాషలో రాయగూడదు. [అయితే ఇండులు, రోళులు, రోకండులు, రోకళులు - వంటి రూపాలు ప్రాచీన కావ్య భాషలో ఉండేవి. సూర్యరాయాంధ్ర నిఘంటువు వంటి కోశంలోనో, ప్రౌఢ నిఘంటువులోనో వెతికితే ప్రాచీనుల ప్రయోగాలు దొరుకుతాయి. కుతూహలం ఉంటే వెతికి చూడండి ]

BRAOU

7. రెండక్షరాల మాటల్లో కొన్నిచోట్ల అచ్చు పోని రూపాలు కూడా ఈ నాటి భాషలో కాస్తా అరుదుగానైనా కనిపిస్తున్నాయి:

గుడి - గుడులు, గుళ్లు

బడి - బడులు, బళ్లు

ఇక్కడ గుళ్లు, బళ్లు అనే రూపాలు ఎక్కువగా కనిపిస్తున్నా గుడులు, బడులు అనే మాటలు తప్పని చెప్పటానికి వీల్లేదు.

8. కారు, దారి - వంటి వాటికి కూడా అచ్చు పోవచ్చు, పోకపోవచ్చు.

కారులు, కార్లు

దారులు, దార్లు.

9. ఈ పైన ఉదాహరించిన మాటల చివర ఇ, కాని, ఉ కాని ఉంది చాలాచోట్ల అచ్చు పోవటం తప్పని సరి. అట్లాపోని ఘట్టాలు కూడా చూశాం. కాని ఇతర అచ్చులు పోవచ్చు, పోకపోవచ్చు. అచ్చు ఉచ్చారణలో పోయి నప్పటికీ పోని రూపం రాయటమే మంచిది. కోటలు, కోడలు, గుడ్డలు, బిడ్డలు, కండలు, బండలు, కలలు, పలలు, పులులు, ఉలులు - వంటి మాటల్లో చివరి లు కి పూర్వం ఉన్న అచ్చును ఉచ్చారణలో వదిలెయ్యవచ్చు. రాతలో వదిలెయ్యకూడదు. వదిలేస్తే అర్థం చేసుకోవటం కష్టమవుతుంది. ఉదాహరణకు చూడండి :

కల + లు అనే మాటకు సంధిచేసి రాస్తే కల్లు అని రాయాలి. అప్పుడది కల కు బహువచనమైనా కావచ్చు. తాటిచెట్టు నుంచి తీసిన రసమైనా కావచ్చు. అట్లాగే గుడ్డలు అనే మాటకు సంధి చేస్తే గుడ్లు అని రాయాల్సి ఉంటుంది.

అప్పుడది కోడిగుడ్లు అనే అర్థమూ కావచ్చు, బట్టలు అనే అర్థమూ కావచ్చు. అందువల్ల ఉచ్చారణలో సంధిచేసినా రాతలో సంధి చెయ్యటంవల్ల కొన్నిచోట్ల అర్థం గ్రహించటం కష్టం అవుతుంది.

ఇక్కడో ప్రశ్న అడగటానికి వీలుంది. ఉచ్చారణలో సంధి చెయ్యటానికి వీలుండి రాతలో ఎందుకువీలులేదు? అని. ఉచ్చారణలో పోయిన అచ్చుపోగా ఉన్న అచ్చుల ఉచ్చారణలో భేదం చూపిస్తాం. మీరే కల+లు, కిల్లు అనే మాటల్ని, గుడ్డలు, గుడ్లు అనేమాటల్ని వేగంగా ఉచ్చరించి చూడండి. ఎదుటివాళ్ళను అడగండి భేదం వినిపిస్తుందా అని. తప్పకుండా భేదాన్ని వినగలుగుతారు. ఎప్పుడే మాట అన్నదీ చెప్పగలుగుతారు. ఇంతకు ముందే చెప్పినట్టుగా అచ్చుల ఉచ్చారణలో భేదంవల్ల ఈ మాటలు వేరు మాటలని గుర్తించ గలుగుతారు. కాని తెలుగులో ఈ భేదాలన్నిటినీ రాయటానికి గుర్తులు లేవు. అందువల్ల వేగంగా ఉచ్చరించేటప్పుడు జరిగే మార్పులన్నిటినీ రాతలో చూపించలేం. చూపించకపోతే కొంపమునిగేదేమీలేదు.

సంధిలో ఇంకో విచిత్రం ఉంది. రెండుచోట్ల సంధి జరగటానికి అవకాశం ఉన్నప్పుడు ఏదో ఒకచోటే సంధి జరుగుతుంది. అయితే మొదటిచోట జరుగుతుందా, రెండవచోట జరుగుతుందా? అంటే ఒకే సమాధానం చెప్పటం కుదరదు. ఉదాహరణలు చూడండి:

గుడ్డు + లు + లేవు → గుడ్లులేవు
గుడ్డ + లు + లేవు → గుడ్డల్లేవు
బండి + లు + లేవు → బండ్లులేవు
బండ + లు + లేవు → బండల్లేవు

ఈ పైన చూపించిన వాటిలో 1, 3 ఉదాహరణల్లో మొదటి సందర్భంలో అచ్చు పోయింది. 2, 4, ఉదాహరణల్లో రెండో సందర్భంలో అచ్చు పోయింది. అచ్చు తప్పనిసరిగా పోవల్సినచోట మొదటే పోయింది. కేవలం ఉచ్చారణ వేగం మీద ఆధారపడ్డ మార్పు రెండో సందర్భంలోనే జరిగింది. కాని కొన్ని సందర్భాల్లో రెండుచోట్ల ఎక్కడ చేసినా ఫరవాలేదు అనే ఘట్టాలు కొన్ని ఉన్నై. ఉదాహరణకు:

గుడి + లు + లేవు → గుళ్లులేవు, గుడుల్లేవు
దారి + లు + లేవు → దార్లులేవు, దారుల్లేవు.

వీటిల్లో ఉచ్చరించినట్టు రాయటానికి ఇబ్బంది లేదుగాబట్టి ఎట్లా రాసినా ఒకటే.

నామాల్లో (nouns)సున్నాతో అంతమయ్యే మాటలకు పూర్వ భాషలో ము రాసేవాళ్లు. మంచం అని మనం ఇప్పుడు రాస్తే పూర్వపు వారు మంచము అని రాసేవారు. చివరి ము అనే అక్షరంలో చివరి అచ్చుపోతే మ్ మిగులుతుంది. దాన్ని సున్నతో చూపించటం అలవాటయింది. ఇప్పుడున్న నిఘంటువుల్లో చూడాలంటే ము అనే అక్షరంతోనే చూడవలసి ఉంటుంది. నిజానికి కంచము, మంచము, అందము, చందము, కొంచెము, కళ్లెము, పళ్లెము, అని రాయవచ్చు. పదం చివర ఉన్న ము కు ఉచ్చారణలో కేవలం మ్ అని మాత్రమే అని చెప్పుకోవచ్చు. అందులో నష్టం ఏమీలేదు. కాని ఈ కాలంలో ఎక్కువ మంది సున్నతో రాయటం అలవాటు చేసుకున్నారు. సున్నా అనే గుర్తు రాయటంలో ఉన్న సౌలభ్యం కారణం కావచ్చు. సున్నా రాయటానికి భాషాతర్కం ( Lingustic logic ) కారణంకాదు. రాయటంలో ఉన్న సులువే కారణం కావచ్చు.

వీటి బహువచన రూపాలు రాయటంలో కొంత కష్టం ఉంది.

మంచం—మంచాలు, కంచం—కంచాలు అని సులభంగా రాయవచ్చు. కాని పందెం+లు, అనేదాన్ని పందేలు అని రాయాలా? పందాలు అని రాయాలా? అట్లాగే పళ్లెం+లు, కళ్లెం + లు అనే రూపాలు ఎట్లారాయాలి? రెండు పద్ధతుల్లో ఏది రాసినా ఒకటే. రెండూ ఉచ్చారణను సరిగ్గా సూచించవు. ఇంకో మూడో మార్గంలేదు. ఏకవచనంలో ఎ అనే పొట్టి అచ్చు (హ్రస్వాచ్చు) ఉంది. కాబట్టి అది దీర్ఘమైనదనటం సులువు కాబట్టి పందేలు, కళ్లేలు పళ్లేలు అని రాయటం కొంత హేతుబద్ధమైన పని. దీని ఉచ్చారణ రాసినట్టు కాదు అని చూపించటానికి కింద గీతో, ఇంకేదో చూపించుకోవచ్చు.

BRAOU

జరిగి పోయిన కాలాన్ని సూచించే క్రియల్లోకూడా కొన్ని లిపి సమస్యలున్నాయి. రాయలసీమ ప్రాంతంలో అడిగినాడు, చెప్పినాడు అనే రకంగా ఉండే తెలంగాణలో అడిగిండు, చెప్పిండు అనే విధంగా ఉంటాయి. ఈ రెండు పద్ధతులను రాయటంలోనూ, పలకటంలోనూ చిక్కులు ఏమీలేవు. కాని కోస్తా జిల్లాల్లో అడిగాడు, చెప్పాడు అంటారు. నిజానికి ఈ రాసినట్టు కూడా కాదు. బండి + ఆ? అనేది కలిపి ఉచ్చరిస్తే వచ్చే ధ్వనిని పై మాటల్లో "గా, ప్పా" అని రాసినచోట పలుకుతారు. దీన్నే కొందరు అడిగేడు, చెప్పేడు అని కూడా రాస్తారు. ముఖ్యంగా రాజమండ్రి ఆపై ప్రాంతపు రచయితల్లో కొందరు అట్లా రాస్తున్నారు [మహీధర రామమోహనరావు, ద్వివేదుల విశాలాక్షిగార్ల నవలలను చూడండి] ఈ రెండు రకాల రాతల్లోనూ మొదటిరకమే (అడిగాడు, చెప్పాడు అనేవి) అచ్చుల్లో ఎక్కువ కనిపిస్తున్నాయి. దినపత్రికలన్నీ ఇవే వాడుతున్నాయి. ఎక్కువ వాడుకలో ఉన్న ఈ పద్ధతి అనుసరిస్తే చదివేవారికి తేలిక. రెండో పద్ధతి అలవాటయినవారు అట్లాగే రాయవచ్చు. అయితే ఏదో ఒక రూపాన్నే క్రమ బద్ధంగా రాస్తే రచనలో ఏకత, నియతి (Unityand Consistency) ఉంటాయి. పైన చెప్పిన అడిగినాడు, అడిగిండు. అడిగాడు అనే మాండలిక భేదాలు విషయమైనా అంతే. రచనలో అడిగినాడు చెప్పినాడు వంటి రూపాలను రాచమల్లు రామచంద్రారెడ్డి గారి వంటి రచయితలు ఒకరిద్దరు మాత్రమే క్రమబద్ధంగా వాడారు. అడిగిండు, అడిగిన్రు, చెప్పిండు, చెప్పిన్రు వంటి రూపాలు మాండలిక వాతవరణం చూపవలసిన ఘట్టాల్లో తప్ప ఇతర రచనల్లో కనపడదు. కొందరు తెలంగాణా ప్రాంత రచయితలు తమ వచనంలో ఈ రకం క్రియలు వాడుతున్నారు.

తెలుగులో వచ్చు, వద్దు వంటి క్రియా రూపాలను ఇంకో ప్రధాన క్రియకు అనుబంధంగా కొన్ని అర్థాల్లో వాడతారు. ఉదా : చెప్పవచ్చు, చెప్పవద్దు అయితే ఉచ్చారణలో చెప్పొచ్చు, చెప్పచ్చు, చెప్పొద్దు, చెప్పద్దు అనే విధంగా వినిపిస్తాయి. అట్లా వకారంతో మొదలయ్యే మాటలకు సంధి కలిపిన చోటల్లా 'వ' 'ఒ' గా మారిపోతున్నది. ఉదాహరణకు "రేపొస్తానన్నాడు, ఇప్పుడొద్దన్నాడు" అనేచోట వచ్చు, వద్దు రూపాలు 'ఒచ్చు, ఒద్దు అనే రూపాలుగా మారినాయి. నిజానికి "రేపు వస్తానన్నాడు, ఇప్పుడు వద్దన్నాడు" అని రాసి పలకటంలో సంధి చెయ్యవచ్చు [ఇక్కడ చెయ్యవచ్చు అనేదాన్ని చెయ్యొచ్చు అని పలుకుతారు] కాని సంధి చేసి రాసే రూపాలు చాలా మందికి బాగా అలవాటు అయినాయి. అంతేకాదు ఒకే వ్యాసంలో సంధి చేసిన రూపాలూ, చెయ్యని రూపాలూ కలగా పులగంగా కలిసిపోయి కూడా కనిపిస్తాయి. ఇందువల్ల జరిగే నష్టం ఏమీలేదు గాని రచనలో క్రమబద్ధత ఉండదు. ఈ పాఠాల్లో క్రమ బద్ధత ఒక పాటించదగిన విలువగా భావిస్తున్నామని మీరి పాటికి గ్రహించే ఉంటారు. అందువల్ల మీరు ఇట్లాంటి సందర్భాల్లో మీ అభిరుచినిబట్టి ఏదో ఒక పద్ధతినే ఎన్నుకొని రాయండి.

క్రియల్లో చెప్ప-, చేయ- అనే రకంగా ఉన్నవాటికి వచ్చు, వద్దు లాగే ఇంకా కొన్ని రకాల అనుబంధ క్రియలు చేరతాయి. కలను, కూడదు, అనేవి చేర్చి వాడతాం. అప్పుడవి చెప్పగలదు, చెప్పగూడదు అనే విధంగా పలుకుతాం. కాని అరుదుగా చెప్పకూడదు అని అనే వారున్నారు. ఇక్కడ క కారం రాసినా గ కారమే ఉచ్చరించవచ్చు. కాని ఎక్కువమంది గ కారమే రాస్తున్నారు. అందువల్ల 'గ' కారం రాయటమే ఎక్కువ సమ్మతం.

ను-ని, కు-కి, తో, లో, వంటి ఏకాక్షర ప్రత్యయాలు చేర్చినప్పుడు సంధి జరుగుతుంది. రాసేటప్పుడు సంధిచేసి రాస్తారు కూడా. అయితే చెయ్యకుండా రాయవచ్చు. పదస్వరూపం గురించి గాని, అర్థం గురించిగాని సందేహం వచ్చేట్టుంటే సంధి చెయ్యకుండా ఉండటమే మంచిది:

అతనిని → అతన్ని
పిడుగుకి → పిడుక్కి
చేతితో → చేత్తో
తలలో → తల్లో

పాల్లో అని రాస్తే పాలులో (భాగంలో) అని కావచ్చు, పాలలో అని కావచ్చు. అటువంటిచోట్ల సంధి చెయ్యకుండా రాయటం మంచిది.

BRAOU

అచ్చుతో కూడిన ట, డ లకు ని, సు లు కాని, లో కాని చేరితే ఉచ్చారణలో సంధి జరుగుతుంది. సంధిలో అచ్చు లోపించి ఈ కింది మార్పులు జరుగుతాయి.

(అ) ట్ + ని → ట్ని → ట్ణి
ట్ + లో → ట్లో → ట్ళో

(ఆ) డ్ + ని → డ్ని → డ్ణి
డ్ + లో → డ్లో → డ్ళో

ఇక్కడ సంధి జరిగిన రూపాలు రాయటం తప్పని సరికాదు. వాడిని అనేచోట సంధిచేసి వాడ్ని అని రాయవచ్చు. చెయ్యకుండా వాడిని అనీ రాయవచ్చు. (వాణ్ణి అని రాసినా తప్పులేదు కాని ఎవరూ రాయటంలేదు). అట్లాగే వాకిటిలో అనేదాన్ని వాకిట్లో అని రాయవచ్చు వాడిని అనేదాన్ని సంధిచేసినప్పుడు వాడ్ని, వాణ్ణి అని రెండు రకాలుగానూ రాస్తున్నారు. రెంటికీ ఉచ్చారణ ఒకటే. సంధిచేసి రాయటం తప్పని సరికాదు. చాడీలా, ఒడిలో అనే మాటలను వాళ్ళా, ఒళ్ళో అని సంధిచేసి రాయవచ్చు. పైన చెప్పినట్టు సందర్భాన్ని బట్టి సందేహం వచ్చినప్పుడు సంధి మానివెయ్యటం మంచిది.

ఈ ప్రత్యయాలకు ముందు ద్విత్వాక్షరం ఉన్నప్పుడు కూడా వేగంగా మాట్లాడేటప్పుడు సంధి జరగవచ్చు. రాతలో దాన్ని పాటించకుండా ఉంటే స్పష్టత ఉంటుంది.

గిన్నెను, పక్కకు, కత్తితో, పల్లెలో వంటి మాటల్లో సంధి చెయ్యకుండా ఉంటే పదస్వరూపం స్పష్టంగా తెలుస్తుంది.

ఆ, ఏ, ఓ, అనే ప్రత్యయాలు కొన్ని అర్థాల్లో పదాలకు చేరుస్తాం. అప్పుడు సంధి తప్పకుండా జరుగుతుంది. రాతలోకూడా అది చూపించాల్సి ఉంటుంది. తెలుగులో ఈ ప్రత్యయాల్ని సంధిచెయ్యకుండా పలకటం సాధ్యంకాదు. పద మధ్యంలో రెండచ్చులు వరసగా ఉండవు కాబట్టి రాయకుండా సాధ్యంకాదు. అందువల్ల సంధి చేసే రాయాలి. పద స్వరూపంలో కాని, అర్థంలో కాని సందేహం వచ్చినా సరే. నిజానికి ఉచ్చారణలో కొన్ని చిక్కులు వస్తాయి కూడా. అయినా ఇంకో మార్గం లేదు – అయితే తెలుగు భాష వచ్చిన వారికి అంత కష్టం కలగదు.

ఉదా : భోజనానికి రమ్మంటే అన్నం తినా (తిని + ఆ) వచ్చేది ?

ఇంటి దగ్గర చెప్పే (చెప్పి + ఏ) వస్తున్నావా ?

తెలిసో, తెలియకో తప్పు చేశాడు

బండి + ఆ ? , బండి + ఏ , బండి + ఓ అనే మాటల్ని

బండ + ఆ ? , బండ + ఏ , బండ + ఓ అనే మాటల్ని

ఒకదాని సరసన ఒకటి పలికి చూస్తే ఉచ్చారణ భేదం తెలుస్తుంది. ఉచ్చారణలో చూపించే భేదాలన్నీ రాతలో చూపించలేం. సంధి చెయ్యకుండానూ రాయలేం. (ఆ సంప్రదాయం లేదు) అటువంటప్పుడు సందేహాలు వస్తే సందర్భాన్ని బట్టి గ్రహించాల్సిందే కాని ఇంకో మార్గం లేదు.

సాంప్రదాయక వ్యాకరణాల్లో 'ఉత్తునకు సంధి నిత్యము' అనీ 'ఇకారమునకు సంధి వైకల్పికము' అని, 'అకారమునకు సంధి బహుళము' అని మీరు చదువుకొని ఉంటారు. అది కావ్య భాష సంగతి. ప్రాచీన కాలంలో సంధి చేసి మాట్లాడే వారో చెయ్యకుండా మాట్లాడే వారో తెలియదు. చెయ్యకుండా మాట్లాడేవారని అనుకోలేం. కాకపోతే రచనా భాషలో కొన్ని సౌకర్యాల కోసం ఏర్పరచుకొన్న నియమాలివి.

ఆధునిక భాషలో సాధారణ వ్యవహారంలో అన్ని అచ్చులకు సంధి అవుతుంది. రాతలో రెండు మాటల మధ్య ఏ అచ్చుకూ సంధి చూపించక్కర్లేదు. అర్థ భంగం కానంతవరకు సంధి చెయ్యవచ్చు పైన చెప్పిన పద్ధతులను గమనించి తప్పని మార్పులు చెయ్యవలసిన చోట (బహువచనం మొ॥) చేసి మిగతా చోట్ల సంధి మానివేసినా దోషం కాదు. చేసినా తప్పు లేదు.

BRAOU

ప్రధాన సూత్రం ఒకటే నేటి రచనా సంప్రదాయాన్ని దృష్టిలో పెట్టుకొని అర్థస్పష్టత చెడనంత వరకు సంధి చేసుకోవచ్చు. లేకపోతే మానివేయవచ్చు.

ఈ పాఠంలో నేర్చుకొన్న విషయాలివి :

1) మాటల ఉచ్చారణలో కలిగే మార్పులను సంధి అంటారు.

2) సాధ్యమైనంతవరకు సంస్కృత సంధుల్లో సంస్కృత మర్యాదను పాటించటం సబబు. సంస్కృత వ్యాకరణ విరుద్ధమైనా ఎక్కువ వ్యాప్తిలో ఉన్న సంధి రూపాలను వాడటంలో దోషంలేదు. నష్టమూ లేదు.

3) నేటి వాడుక భాషలో సంధి ఉంది.

4) తప్పనిసరిగా మార్పులు జరగాల్సినచోట మార్పుల్ని చేసే చూపించాలి ఉదా : గుడ్లు, కోళ్లు, కాళ్లు. మొ॥

5) ఒకే అక్షరం ప్రత్యయాలు చేరినప్పుడు పదస్వరూపం గుర్తు పట్టటానికి వీలయ్యేంతవరకు సంధి చెయ్యవచ్చు.

6) అ, ఏ, ఓ వంటి వాటిని చేర్చినప్పుడు సంధి చేసే రాయాలి.

7) రెండు మూడు రకాలు రాసే వీలున్నప్పుడు ఏదో ఒక రూపాన్ని వాడటం మంచిది.

8) సంధి చేసేటప్పుడు గుర్తుంచుకోవాల్సినవి ఇవి:

(అ) ఆధునిక రచనా సంప్రదాయం

(ఆ) ఎక్కువ ప్రచారంలో ఉండటం.

(ఇ) ఏకత్వం, క్రమబద్ధత

(ఈ) పద స్వరూపం గుర్తు పట్టటానికి వీలు.

(ఉ) అర్థ స్ఫూర్తికి నష్టం ఉండకపోవటం.

BRAOU

## అభ్యాసం (చదివేపని)

ఈ కింద ఇచ్చిన వ్యాసాన్ని చదవండి ఇది పురాణం సీతగారు రచించిన ఇల్లాలి ముచ్చట్లలో ఒక ముచ్చట - ఆధునిక సాహిత్యంలో ఇంగ్లీషులో light essays అనే రకం వ్యాసాలు కొద్దిగా వస్తున్నాయి.

వీటిని తెలుగులో వినోద వ్యాసాలు అనుకోవచ్చు. ఈ రకపు వ్యాసాల్లో సైన్సు వ్యాసాల్లోలాగా బరువైన విషయ ప్రతిపాదనలు ఉండవు మామూలు వ్యాసాల్లో ఉన్నట్టు పేరాల మధ్య తర్కబద్ధత ఉండకపోవచ్చు. చదువుకోటానికి ఆసక్తి కలిగించేవి వినోద వ్యాసాలు. [వ్యాస రచనలో భేదాల గురించి, వాటిల్లో వినోద ప్రధాన వ్యాసాల విశేషాల గురించి ముందుపాఠాల్లో ఇంకా ఎక్కువ తెలుసుకుంటారు] వినోద ప్రధాన వ్యాసాల ద్వారా విజ్ఞాన వ్యాప్తి చెయ్యవచ్చు. ఉత్తమ భావాల ప్రచారం చెయ్యవచ్చు

ఈ రకం వ్యాసాలు పూర్వం నార్ల వెంకటేశ్వర రావు, న్యాపతి నారాయణమూర్తి, తెన్నేటి హేమలత, రాపూరు సత్యనారాయణ ఆరుద్ర వంటి వాళ్ళు రాశారు. ఇటీవల కాలంలో ఆంధ్రజ్యోతి వార పత్రిక ద్వారా ప్రకటిస్తున్న పురాణం సీతగారి 'ఇల్లాలి ముచ్చట్లు' బాలా ప్రసిద్ధి చెందింది. ఎక్కువ మందిని ఆకర్షిస్తున్నది. ఈ శీర్షిక కింద వస్తున్న కొన్ని వ్యాసాలు ఇటీవలి కాలంలో వివాదానికి గురి అవుతున్నాయి.

పురాణం సీతగారి వ్యాసాలు సంభాషణా శైలిలో ఉంటాయి. సంభాషణా శైలి అంటే ఎదటి మనిషితో మాట్లాడినట్లు రాయటం. ఈ శైలివల్ల రచయితకు పాఠకులతో ఆత్మీయత ఏర్పడుతుంది. సీతగారు తమ వ్యాసాల్లో తానే పాత్ర వహిస్తారు. అందులో ఉత్తమ పురుష ('నేను' అని అర్థం వచ్చేట్టు మాట్లాడటం) లో మాట్లాడినట్లుంటుంది. పాఠకులు మధ్యమ పురుష (నువ్వు, మీరు) లో ఉంటారు. అందువల్ల సంభాషణ శైలి సాధ్యమైంది.

సీతగారి పదప్రయోగంలో స్వేచ్ఛ ఎక్కువ. ఇంగ్లీషు మాటలు, ఇంగ్లీషు వాక్యాలు చాలా తరచుగా ఉంటాయి" ఆధునికులు మాట్లాడేటప్పుడు ఈ విధంగా ఇంగ్లీషు మాటలూ, పదబంధాలూ వాక్యాలు తెలుగులో వాడుతూనే ఉంటారు. మాట్లాడే భాషకు దగ్గరగా ఉండే రచనా శైలిలో ఇట్లాంటి మిశ్రమం చాలా మందిలో కనిపిస్తుంది. గురజాడ కన్యాశుల్కం నాటకంలో గిరీశం మాటల్లోనూ, శ్రీశ్రీ గారి 'మహా ప్రస్థానం' అనే గేయాల సంపుటానికి చలంగారి పీఠికలోనూ; చలంగారి మ్యూజింగ్సులోనూ ఈ రకం మిశ్రమం చాలా ఎక్కువగా కనిపిస్తుంది.

స్త్రీ పురుష సంబంధాల్లో అసమానత ఈ వ్యాసంలో ప్రధాన ఇతి వృత్తం. హాస్యధోరణితో పాటు నేటి సమాజంలో స్త్రీల పరిస్థితికి ఆవేదనతో కూడిన స్పందన కూడా కనిపిస్తుంది.

మాట్లాడే భాషకు దగ్గరగా ఉన్న సంభాషణ శైలి గనుక మాట్లాడే భాషలో ఏర్పడే సంధులు కూడా గుర్తించవచ్చు.

పురాణం సీత పేరుతో వచ్చిన వ్యాసాలు నిజానికి పురాణం సుబ్రహ్మణ్య శర్మగారు రాసినవి. పురాణం గారు ప్రసిద్ధ రచయితలు, పాత్రికేయులు. పురాణం సీత పేరుతో వచ్చిన వ్యాసాలు మధ్య తరగతి ఇల్లాలు మనస్తత్వంలోకి ఒక రచయిత పరకాయ ప్రవేశం చేసినట్లుంటాయి.

BRAOU

## హోమ్ స్వీట్ హోమ్ 3

### పురాణం సీత

లేడీస్ అండ్ జంటిల్ ఉమెన్ !

ఈ మగాళ్ళు తిండి తినేసి విస్తరంతా నాకేసి లేచిపోయాక అందులో ఆడాళ్ళను తిండి తినమనడం అది పతివ్రతా ధర్మం అనడం చాలా ఘోరం !

అది గ్రేవు ఇన్సల్ట్ మరియు గ్రాస్ ఇన్‌జస్టిస్ టు ది ఫిమేల్ కయిండ్-

దేవుడా నువ్వెంత రోగ్‌వి (అనగా మాయా మానుష విగ్రహుడివి)

కట్నకానుకలు స్కూటర్లు సూట్లు బూట్లు మగాళ్ళకిచ్చి ఎంగిలి విస్తరాకుల్లో తినమని, కడుపుతో వుండమని, పిల్లల్ని కనమని కన్నీటితో కాపురాలు సాగించమని మా మొహాల మీదరాసేవా ?

ఏక్ థా రాజా - ఏక్ థా రాణీ అన్నట్లుండ వలసిన ఈ కపుల్సు మధ్య ''ఎంగిలికూళ్ళు'' తినే రూల్సెందుకు సృష్టించావు భగవాన్! శబరీ గిబరీ తెచ్చిన ఎంగిలికూళ్ళు నువ్వు తింటే తిన్నావు. మా కొద్దు మేం గాడ్స్ కాదు.

నాకింకా గుర్తు

చుట్టూతా మెళ్లో నగలు దిగేసుకుని పేరంటాళ్ళు కూర్చుని చెరో పీటావేసి ముందు అరిటాకు కదటాకు పరిచి అందిమీద ఎంచక్కా బంగారపు పువ్వు పొదిగినకొత్తవెండి కంచంవేసి అందులో కిస్‌మిస్ జీడిపప్పు సేమ్యాలతో

వండిన వేడివేడి పరవాణ్ణంపోసి ఆ ఘుమఘుమలాడే పరవాణ్ణంలో ఆడపడుచు ఫీజు నాలుగు యిచ్చ రూపాయలు వేసి పెళ్ళిలో మమ్మల్ని తినమన్నారు.

ఐ డోంట్ కేర్ - ఐడోంట్ వాంట్ టు ఈట్ ఇన్ వన్ ఎంగిలికంచం అన్నా, అప్పుడు అంతా నన్ను ఝాన్సీకీ రాణీలా చూసి విసుక్కున్నారు.

ఆడబడుచుకి ఆఫ్టరాల్ ఫోర్ రుపీస్ నేనిస్తాను. నేను తిన్నగాక తిన్ను అని స్ట్రయిక్ చేశాను. మీకుకూడా ఫోర్ రుపీస్ ఎక్స్ట్రాయిపిస్తాను. మరో కంచం తెప్పించుకోండి అని ఆ కంచం నా ముందుకు లాక్కున్నాను.

పేరంటాళ్ళంతా గొల్లుమని నవ్వారు.

నాకు పరవాణ్ణం అంటే బలేఇష్టం.

ఆ ఫోర్ రుపీసూ మావారి సిస్టర్ చేతిలో పెట్టి నాకంచం నాకు ఏర్పాటు చేసుకుంటే అంతా నన్నొక రవుడీనెంబర్ వన్‌గా చూసేసి గింజుకు చచ్చారు.

కలకల్లాడుతూ చుక్కల్లో చంద్రుడిలా వెలగ వలసిన మా శ్రీవారి మొహం తుమ్మల్లో ప్రొద్దు గ్రుంకి నట్లుంది.

మొగుడు ఎంగిలి పనికిరానిది రేపు దీనికి మొగుడితో కాపురం పనికొస్తుందా అని అమ్మలక్కలు దీక్సు ప్రెస్ చేసుకుంటున్నారు.

ఇది ఎప్పటి ముచ్చటో-

తర్వాత మొన్నీ మధ్య భోంచేస్తుంటే నా కంచంలోంచి గోంగూర పచ్చడిని తీసి తన కంచంలో వేసు కున్నారు మావారు కావాలనే.

ఐ అబ్జక్ట్ యువరానర్ అన్నా,

నాకు ఎంగిలిలేదు అన్నారు.

నాకుంది నే నొప్పుకోను, అని నా గోంగూర పచ్చడి మళ్ళా నేను తీసేసుకున్నా.

ప్రేమ గట్టిపడి పాతివ్రత్యం నిలబడి ఐదోతనానికి ఢోకా లేకుండా జీవితం సాగాలంటే ఆడది ముఖ్యంగా మొగుడు తిని పారేసిన ఎంగిలి విస్తట్లోనో ఎంగిలి కంచంలోనో తినాలిట.

హౌ మైగాడ్ - ఆ రూలు మొగాళ్ళే పెట్టారో ఆడాళ్ళే పెట్టారో ? నాకైతే తెలీదు కానీ - స్త్రీల దినపత్రికకు నేను ఎడిటర్నైతే "ఎంగిలితిళ్ళ" మీద ఘాటైన సంపాదకీయం వ్రాద్దును ముచ్చటగా మూడు కాలాలు.

ఈ మంగళసూత్రం పుస్తెలతాడు ఆడాళ్ళే ఎందుకు కట్టించుకోవాలి ? మొగాళ్ళుకూడా పసుపు రాసుకుని కాటుకా బొట్టూ ఎందుకు పెట్టుకోకూడదూ ? పెళ్ళికొడుకు పెళ్ళికూతురి మెళ్ళో మంగళసూత్రం కడితే - అది రైటం టున్నాం. పెళ్ళికొడుకు మెళ్ళో పెళ్ళికూతురు మంగళసూత్రం ఎందుకు కట్టగూడదు ? ఆడదానికి పెళ్ళయితే దీనికి పెళ్ళయిపోయిందని లోకానికంతా తెలుస్తుంది మొగాడికలా తెలియక్కర్లేదా ?

ఇప్పుడు ఆడపినుగులు కూడా పాంట్లు, స్లాకులు ఆ ఘోరిస్తున్నారు కదా ! ఒక మొగాడైనా మనచీరగానీ రవికగాని కట్టుకోవాలనుకోటంలేదు, ఆడాళ్ళు మొగాళ్ళ డ్రస్ అనుకరిస్తున్నారుకదా మొగాళ్ళు ఆడాళ్ళ వేష భాషలు, కట్టూబొట్టూ అంతాబానిస చిహ్నాలుగాచేసి అవే మంగళ ప్రదాలు. ఆ మేరమీరితే పతివ్రతా లక్షణాలు కావని ఆడాళ్ళను బెదిరించి పారేశారు.

పతివ్రతా లక్షణాలు ఆడాళ్ళకే కాని మగాళ్ళకు అక్కర్లేదా ?

మొగుడు చచ్చిపోతే ఆడది విధవముండట. దానికి నెత్తిమీద జుట్టుగొరిగించి ముసుగేసిమూల కూర్చో పెడతారు.

పెళ్ళాం చచ్చిపోతే మగాడు వెధవముండా కొడుకు అవక్కర్లేదా ?

మీ కన్నతల్లి అయినా మీ చెల్లెలయినా ఎవరైనాసరే నిర్దయగా ''వెధవముండ'' (ది విడో) అనేస్తారా ?

పెళ్ళాంచచ్చిపోయినా వాడిని వెధవముండా కొడుకు అని చూడండి. డొక్క చీలుస్తారు. తెలుగు డిక్షనరీలో వితంతువు అనే మాటకు పుంలింగం లేదు. ఇంగ్లీషులో విడోయర్ అనివుంది, విధురుడు అని వుందిట. కాని అది

వాడుకలో లేదు.

నిద్రలేవగానే చెల్లెలైనా, కూతురైనా కోడలైనా అప్పగారైనా ఆఖరికి తల్లియినా సరే విడో ముఖం కనపడకూడదట ఎవరికీ ఎదురుగా రాకూడదుట అపశకునంట.

మనవాళ్ళెంత రోగ్స్. ఆయుర్దాయం మూడో అకస్మాత్తుగానో కట్టుకున్న పురుషుడు హరీమంటె ఆ అభాగ్యురాలు ''దుష్ట శకునం'' అయిపోయిందా ? ఎలా అయిందిరా ఫూల్స్...

పెళ్ళాంచచ్చిన మగాడు తన కూతురివయసు పిల్లకేసైనా నోటంబట నీళ్ళుకారుస్తూ చూస్తాడే. మగాడికి పెద్దగా వావివరసా అక్కర్లేదా ? (నిజం చెప్పండ్రా) నన్నడిగితే సృష్టిలో వియోగదుఃఖం ప్రాణికోటికి సమానమే!

వియోగదుఃఖంతో కుమిలిపోయే ఆడదానికి వితంతుయోగం కల్పించిన కుళ్ళు సమాజం ఎంత అన్యాయం అక్రమం తలపెట్టింది ఆడదానికి ? (అగ్గిపుల్ల గీసెయ్యాలి ఈ సొసైటీకి) ఈ కాపురాలన్నీ మాయ నాటకాలు. ఈ ప్రేమలన్నీ దొంగనటనలు. బెస్ట్ ఏక్టర్సు మనవాళ్ళు - ఆడదంటే ఎంత ప్రేమో గౌరవమో మనవాళ్ళకి పరీక్షించేందుకు ఎంగిలికూళ్ళ ఎగ్జాంపుల్ చాలు !

ఒక ఆడది ఒకసామాన్య సంసారంలో ఎంత చాకిరీ చేస్తుంది ? (సెలవు అడక్కుండా చచ్చేదాక) ఆడాళ్ళుచేసే చాకిరీలో ఎన్నో వంతు మగాళ్ళు చేస్తారు ?

చీరెలు నగలు కాళ్ళకుపట్టాలు అన్నీ కొని సంకెళ్ళువేసి 'హోమ్ స్వీట్ హోమ్' యిల్లేకదా స్వర్గసీమ అని మీ చేతే పాడించి కాస్త యిటూ అటూ అయితే మిమ్మల్ని కూరాకులో పురుగులా తీసి పారేస్తూంటారు.

ఆడదానికి మొగుడి కవుగిట్లోకూడా సోషల్ సెక్యూరిటీ లేదు.

ఇప్పటికీ ఎప్పటికీ మగపిల్లాడుపుడితే మగ మహారాజు పుట్టాడంటారు. ఆడపిల్లపుడితే ఆడముండ పుట్టుకొచ్చిందమ్మా కొంపంతా దోచుకు తినడానికి అని మోహంమీద అనేస్తారు. ఆడపులిని అలా అనమనండి చూస్తాను.

వో పంజెరంలో చిల్లకల్లారా !
రంగుచీరలు చుట్టుకున్న రమణీమణుల్లారా !
అక్కలారా ! అమ్మల్లారా !
బంగారపు గిన్నెలారా ! వెండి కుంకుంభరిణి ల్లారా !
మీరంతా ఆటబొమ్మలు-

గడపలకు పసుపులురాసి తోరణాలుకట్టి యిళ్ళుకడిగి వాకిళ్ళలో ముగ్గులెట్టి ఆటలు ఆడీ పాటలుపాడీ సంతోషంగా వున్నామని పొంగి పోతూంటారు. (ఇడియట్స్) మీకు వ్యక్తిత్వంలేదు. మీకు గౌరవంలేదు, ఏ ఆడదైనా ఎదురు తిరిగితే మగాళ్ళేం చేయగలరో అప్పుడు మీకు తెలుస్తుంది. తల్లినైనాసరే తన్ని కూర్చోపెడతారు. పుత్ర దండన) మన దేవుళ్ళు, మనమతం, మన పురాణాలూ, శాస్త్రాలూ ఆఖరికి మనదవట సినిమాలుకూడా ఆడదాన్ని పొగిడి బుట్టలో వేసుకున్నాయి.

సృష్టిలో ప్రతి ప్రాణికీ వియోగమేకాని వైధవ్యంలేదు. ప్రతిస్త్రీ చెల్లెలో, అక్కో, కోడలో, అత్తో - అమ్మో అందరూ నిత్యసువాసినులే - మొగాళ్ళకులేని వైధవ్యం ఆడాళ్ళకు లేదు. వుండకూడదు. డబ్బెట్టి ఆడపిల్ల

మొగుడ్ని కొనుక్కుని వాడికి ఆ రాస్కెల్‌కి చెప్పలజోడు దగ్గర్నుంచి తన తండ్రి సొమ్ము పచ్చినెత్తురు కర్చుపెట్టించి ఆ మొగుడితో సుఖంగా సంసారం చేయాలనుకుంటుంది, నిజమే! పచ్చినెత్తురు తాగే మగాళ్ళతో దబ్బెట్టి కొనుక్కున్న సుఖసారంసంసారం-ఆ సంసారంలో మిథ్యాసుఖాన్ని నిజమనుకొని ఆడాళ్ళు గానుగెద్దుల్లా కాపురాలు సాగిస్తూంటారు. ఇవన్నీ పాపం మన రచయితలకు తట్టవు. కనిపించవు. ఎంతసేపూ హీరోతో లవ్వాడతారు. మేడలూ కార్లూ చీరెలూ నగలూ పిడిచుట్టూ కథలల్లుతారు. మనిషిని ఒక చర్మంపొర పూడ దీసి పరీక్షించి రాస్తేరాయాలి. ఆడాళ్ళు నవలలురాస్తే డబ్బొస్తుందని తెలిస్తే తన్ని ఆడాళ్ళచేత నవలలు రాయిస్తారు ఈ మగాళ్ళు. ఆడవాళ్ళను పంపితే సానుకూలమవుతాయంటే ఆడాళ్ళను పంపి పనులు (రాజకీయాలు) సానుకూల పరుచుకుంటారు. ఎంబాసిడర్ల కుటుంబాల్లో స్త్రీలు రాజకీయ చతురంగంలో ఆడబడే పావికలు. స్త్రీ ఒక ప్రాణంవున్న పనిముట్టు (చలంగారి దోషగుణం కథ చదవండి చాలు).

జీవితాంతం తిండి, బట్టయిచ్చి పోషించే మగాడ్ని సంపాదించుకుందుకు ఆడపిల్లవలపు సొగసు సోయగాల్ని గుమ్మరిస్తేచాలదు - థవుజండ్స్ ఆఫ్ రుపీస్ గుమ్మరించాలి! మీ వాకిలి కుక్కలాగ మీ పాదాలచెంత చోటుకోసం - మీ పక్కలోచేరి మీకు సుఖమిచ్చి మీకు పిల్లల్నికని వాళ్ళని పెంచి పెద్దచేసి మళ్ళా వాళ్ళచేత నీతులు చెప్పించుకునే దుర్దశపట్టిందా అమ్మా అక్కా చెల్లీ వదినా అత్తా మీకు...

హోఁ మైగాడ్! ఇంక నేవ్రాయలేను, రాయలేను, రాయలేను, నా కలంలో కన్నీరింకిపోయింది.

[పురాణం సీత, ఇల్లాలి ముచ్చట్లు, విజయాబుక్స్, విజయవాడ 2, 1968, పేజీలు 204-210]

BRAOU

## అభ్యాసం (రాత పని)

1. ఈ వ్యాసంలో వచ్చిన ఇంగ్లీషు మాటలను,వాక్యాలను ఇంగ్లీషులో రాయండి.

   ఉదా : జెంటిల్ ఉమెన్ = gentle women!

   హోఁ మైగాడ్ = Oh! my God!

2. ఈ వ్యాసంలో వచ్చిన "చీక్స్ ప్రెస్ చేసుకోటం" అనే మాటలు ఏ తెలుగు నుడికారానికి ఇంగ్లీషు అనువాదం ?

3. హరీమంటే - ఈ మాటకు అర్థం ఏమిటి?

4. 'తుమ్మల్లో ప్రొద్దు గ్రుంకినట్లుంది' అనే సామెతకు అర్థం ఏమిటి? ఇక్కడ ఎట్లా అర్థం చెపుతారు?

5. ఈ వ్యాసంలో కిందగీతలుంచిన మాటలను సంధులు విడదీసి రాయండి. అందులో జరిగిన సంధిని వివరించండి.

ఉదా: 1. మగాళ్లు = మగ + వాళ్లు.

ఇందులో మొదట వ కారం పోయింది. అప్పుడు మగ + ఆళ్లు అవుతుంది. ఆ తరవాత మగ లో అచ్చుపోయింది. మగ్ + ఆళ్లు మిగులుతుంది. రాతలో అది మగాళ్లు అయింది.

దీన్నే మగ + వాళ్లు → మగ + ఆళ్లు → మగాళ్లు అనికూడా చూపించవచ్చు.

2. కావాలి + అనే → కావాలనే. ఇది కావాల + అనే కూడా కావచ్చు.

3. తినను → తిన్‌ను → తిన్ను.

6. ఈ సంధుల్లో జరిగిన మార్పుల్నిబట్టి ఏదైనా ఒక విభజన చెయ్యవచ్చునేమో చూడండి:

ఉదాహరణకు మగాళ్లు, పారేశాడు ఒక విభాగం కింద చేర్చవచ్చు. రెండిట్లోను రెండోమాటలో వ కారలోపం జరిగింది.

కొన్ని విభాగాల్లో ఒకటేమాట ఉండవచ్చు.

ఉదాహరణకు హరీమంటే అనేది హరీ + అంటే అని విడదీస్తాం. మ కారం సంధి కలిపినప్పుడు వస్తుంది. దీన్ని సాంప్రదాయిక వ్యాకరణాల్లో ఆగమం అంటారు.

7. పై సంధుల్ని ఇంకో రకంగా విభజించండి:

1. సంధి తప్పని సరిగా చెయ్యవలసినవి.

2. సంధి చెయ్యకపోయినా ఫర్వాలేదనిపించేవి.

ఉదా: 1. మొగాళ్లు + ఏ = మొగాళ్లే
ఇక్కడ సంధి చెయ్యాలి.

2. పార + వేసి → పారేసి.
మాట్లాడే భాషలో కొందరు చేస్తారు. రాసేటప్పుడు పారవేశాడు అని రాయవచ్చు.
పెళ్లి + అయిపోయింది + అని.
మాట్లాడేటప్పుడు చేస్తారు
ఇక్కడ సంధి చెయ్యకపోయినా పరవాలేదు.

BRAOU

8. పురాణం సీతగారు తమ వ్యాసంలో చెప్పిన విషయాలను 5, 6 పాయింట్లుగా విడదీసి చూపించండి.

9. ఈ వ్యాసంలో వాడిన శైలి (పదాలు, వాక్యాలు మొదలైనవి) గురించి మీ సొంత వ్యాఖ్యానం రాయండి.

ఖండిక 2 పాఠం 3

# నిఘంటువు: మాటలకు అర్థాలు తెలిపే పుస్తకం

ఉద్దేశం:

నిఘంటువు అంటే ఏమిటో తెలిపి, తెలుగు నిఘంటువులను పరిచయం చేసి వాటి ప్రయోజనాలను ప్రణాళికా భేదాలను వివరించటం.

ప్రణాళిక:

1. నిఘంటువు వివరణ.
2. పద్య నిఘంటువులు.
3. అకారాది నిఘంటువులు.
4. ద్విభాషా నిఘంటువులు.
5. తెలుగు-తెలుగు నిఘంటువులు.
6. వ్యుత్పత్తి పదకోశం.
7. వృత్తి పదకోశాలు. ప్రయోగ సూచికలు.
8. నిఘంటువులో అర్థాలిచ్చే పద్ధతులు.
9. అకారాదిక్రమం
10. అభ్యాసాలు, ప్రశ్నలు.

"శ్మశానాలవంటి నిఘంటువులను దాటి
వ్యాకరణాలవంటి సంకెళ్లను త్రెంచి"

అన్న శ్రీశ్రీ గారి కవిత్వపు పాదాలు మనలో చాలామందికి గుర్తే. నిఘంటువులంటే వల్లకాడు లాంటివి, మనకు అపకారం చేసేవి, అపకారం చెయ్యక పోయినా అవేవో పనికిమాలినవి అనే భావం మీలో కొంతమందికి ఉండవచ్చు. కాని కవిత్వం పాదాలకు సామాన్య భాషలో వాక్యాలలాగా అర్థం చెప్పకోగూడదు. కొత్తరకపు కవిత్వం చెప్ప దల్చుకున్నకవి సాంప్రదాయకమైన అర్థాలను చెప్పే నిఘంటువులు. సాహిత్యభాష ఇట్లా ఉండాలి అని చెప్పే వ్యాకరణాలు శ్మశానాలలాగూ, సంకెళ్ల లాగా కనిపించటంలో ఆశ్చర్యంలేదు శ్రీశ్రీ గారు తేదల్చుకున్న కవితా విప్లవానికి ఉన్న కట్టుబాట్లను ఛేదించటం అవసరం.

BRAOU

కాని ఆ శ్రీశ్రీగారి కవిత్వంలోనే కొన్నిమాటలకు అర్థాలు తెలియకపోతే నిఘంటువు చూసుకోవాల్సి వస్తుంది. పాత అర్థాలు తెలిస్తేనే ఆయన వాడిన కొత్త అర్థాలు తెలుస్తాయి. [ఈ పాఠం అయిన తర్వాత శ్రీశ్రీగారి మహా ప్రస్థానం నుంచో, మరో ప్రస్థానంనుంచో ఒక గేయం తీసుకొని అందులో తెలియని మాటలకు అర్థాలు చూడండి. ఆ గేయానికి అన్వయించి చూడండి ]

నిఘంటువునే కోశమంటారు. నిఘంటువుల్లో చాలా రకాలు ఉన్నాయి. (వీటన్నిటిని గురించి వివరంగా తెలుసుకోవాలంటే వెలగా వెంకటప్పయ్య గారి తెలుగు నిఘంటు వికాసం (సాహిత్య అకాడమీ, హైదరాబాదు, 1976) చూడండి.) ప్రస్తుతానికి స్థూలంగా కొన్నిటిని పరిచయం చేస్తాం:

మీకన్నా ఒకటి రెండు తరాల పూర్వులు సంస్కృతంలో 'అమర కోశము' తెలుగులో 'ఆంధ్రనామ సంగ్రహము' చదివి ఉంటారు. అవి పద్యాల్లో నిఘంటువులు. ఉదాహరణకు 'ఆంధ్రనామ సంగ్రహము'లో ఈ కింది పద్యాన్ని చూడండి:

సోకుమూకల గొంగ, చుట్టుకైదువు జోదు పచ్చవిల్తుని తండ్రి లచ్చిమగడు
పులుగుతత్తడి రౌతు, పలమురి తాలుపు, వెన్నుడు కలివేల్పు వెన్నదొంగ
నునుగాడ్పు దిండి పానుపున బండెడి మేటి బమ్మదేవర తండ్రి తమ్మికంటి
పది వేసముల సామి, పసిండి పుట్టము దాల్పు కలి నెచ్చెలి తరిగట్టు దారి

యాలకాపరి వ్రేతల మేలువాడు
పాల కడలల్లుడు బకి క్రదాలు జేను
ఱేయు బవలును జేయు కందోయివాడు
మామ మా మన హరియెప్పు (శ్రీమహేశ.)

ఈ పద్యం విష్ణువు పర్యాయ పదాల పట్టిక. ఇది పైడిపాటి లక్ష్మణ కవి రచించినది. (క్రీ. శ. 17వ శతాబ్దం). దీనితోబాటు ఆడిదము సూరకవి రచించిన 'ఆంధ్రనామ శేషము', కస్తూరి రంగకవి రచించిన 'సాంబ నిఘంటువు' (పై రెండూ క్రీ.శ. 18వ శతాబ్దానివి) కలిపి నిఘంటుత్రయం అని పిలిచేవారు. వీటిని మన పూర్వులు కంఠతా పట్టేవారు. కొత్తగా కవిత్వం రాసే వారికి, ప్రాచీన కావ్యాలు చదివేవారికీ ఇవి కొంత సహాయకారులుగా ఉండేవి. దేవ, మానవ, స్థావర, జంగమ వర్గాలుగా ఈ నిఘంటువుల్లో అధ్యాయ విభాగముండేది. ఈ నిఘంటువులు పర్యాయపద నిఘంటువులు. వేంకన కవి రచించిన ఆంధ్రభాషార్ణవమూ ఇట్లాంటిదే. ఈ కవి రఘునాథ రాయలు (క్రీ. శ. 1600-1631) రాయమంటే ఈపద్య నిఘంటువు తయారు చేసినట్టు చెప్పుకున్నాడు. ఈ గ్రంథంలో స్వర్గ, వ్యోమ, దిక్, కాల, ధీ. వాక్, శబ్ద, నాట్య, పాతాల భోగి, నరక, వారి, భూమి, పుర, శైల, వనౌషధి, సింహాది, మనుష్య, బ్రహ్మ, క్షత్రియ, వైశ్య, శూద్ర, విశేష్య నిఘ్న, సంకీర్ణ, నానార్థ, అవ్యయ, క్రియావర్గాలనే పేర్లతో 26 భాగాలున్నాయి. ఈ విభాగాలను బట్టి ఇది ఎంత విస్తృతమైన గ్రంథమో తెలుస్తుంది. పోతుకుచ్చి సుబ్రహ్మణ్యశాస్త్రి గారనే ఆయన 1979లో ఈ గ్రంథాన్ని వ్యాఖ్యానంతో మూడు భాగాలుగా ప్రకటించారు.

వాగ్వర్గంలో ఈ పద్యం ఉదాహరణకోసం చదవండి :

సుడుగు, నుడువు, నుడి, నుడికారము, నొడువు
నొడి, నొడి కారము, నొడుగు, నాగ
పదమొప్పు; మాటన వాక్యమై యెసగు; వా
కొనుట యన వాక్రుచ్చుట యన
వచనంబు విలసిల్లు; పలుకరింత యనంగ
వాచన సంజ్ఞయై వఱలుచుండు
మినుకు, నాగను సూక్తి దనరును; జదువు, నా
విద్యాభిధానంబు వెలయుచుండు;

ప్రాజదువు, ప్రామినుకు, నాగపరగు వేద
మట్ల మన కాండ సంజ్ఞయై యలరుచుండు
పన్నమన ప్రశ్నయైతగు; పనసయనగ
బొల్చును తదంశమై; (మాతృమాతలింగ).

BRAOU

ఈ పద్య నిఘంటువులు ఎంత పెద్దవైనా వీటి ప్రయోజనం అతి పరిమితం. కంఠతా పట్టేతప్ప వీటి ఉపయోగంలేదు. కొత్త నిఘంటువులు ఉపయోగంలోకి వచ్చిన తరువాత వీటి వాడకం తగ్గిపోయింది. ప్రాచీన కాలంలో ఇట్లాంటి పద్యనిఘంటువులు పర్యాయ పదాలనూ, నానార్థాలనూపట్టిక వేసేవి, ఇంకా కొన్ని వాడుకలో ఉన్నట్టు తెలుస్తున్నది. కాని ఇప్పుడు అవి చూద్దామన్నా దొరకవు.

అచ్చుయంత్రం వచ్చిన తరవాత అకారాది నిఘంటువులు ప్రయోగానికి వచ్చినాయి. లిపిక్రమం ఉన్న ప్రతిభాషకు వర్ణమాల ఉంటుంది. అందులో వర్ణాలు ఒకవరసలో ఉంటాయి. భాషలో పదాలను ఆ వరసలో ఏర్పాటు చేసి మాటలు వెతుక్కోటం తేలిక. ఇట్లాంటి వరసను ఇంగ్లీషులో alphabetical order అనీ తెలుగులో అకారాది క్రమం అనీ అంటారు. (దీన్ని గురించి వివరంగా వచ్చేపాఠంలో నేర్చుకుంటారు).

ఈరకం అకారాది నిఘంటువు మామిడి వెంకయ్య అనే మచిలీపట్నం నివాసి 1816లో రచించినట్టు సి.పి. బ్రౌన్‌గారు తన నిఘంటువులో చెప్పారు. ఇందులో కావ్య భాషాపదాలే ఉన్నాయని, వాడుక భాషా పదాలులేవని బ్రౌన్ విమర్శించారు. ఇప్పుడా నిఘంటువు దొరకదు.

అట్లాగే విలియం బ్రౌన్ అనే ఆయన జెంటూ నిఘంటువు అని ఒకటి 1818లో అచ్చువేశాడు. [తెలుగు భాషను ఆ కాలంలో కొందరు ఐరోపీయులు 'జెంటూ' భాష అనేవారు.] అది తరవాత 1953 ప్రాంతంలో తిరిగి అచ్చయింది. ఈ నిఘంటువుల్లో కొన్ని విశేషాలు ఉన్నాయి. ఇ, ఈ, ఎ, ఏ, లతో మొదలయ్యే మాటలు యి, యీ, యె, యే, లకింద, ఉ, ఊ, ఒ, ఓ లతో మొదలయ్యే మాటలు వు, వూ, వొ, వో లకింద చూసుకోవాలి. వాడుక భాషాపదాలు కూడా ఉన్నాయి. ప్రత్యేకంగా ఉన్న కొన్ని మాటలరూపాలు ఇందులో దొరుకుతాయి. ఉదాహరణకు రాయి అనే మాటకు రాతి అనే విశేషణ రూపమూ రాళ్లు అనే బహువచన రూపమూ ఉన్నాయి. ఇవి ప్రత్యేకంగా నేర్చుకోవలసిన రూపాలు. ఇవికూడా ఆ నిఘంటువు ఇచ్చింది. సంస్కృతి ప్రచురణగా రెండోసారి 1953లో అచ్చయిన ప్రతికి, గిడుగు సీతాపతిగారు తెలుగు నిఘంటువుల మీద ఒక వ్యాసం సమకూర్చారు. అయితే

ఈనిఘంటువు కూడా ఇప్పుడు మార్కెట్లో దొరకటంలేదు. A. D. Campbell 1821లో అచ్చువేసిన A dictionary of the Teloogoo Language, J. C. Morris 1835, 1837 సంవత్సరాలలో క్రమంగా వెలువరించిన రెండు భాగాల A dictionary of English and Teloogoo అనేవి ఇప్పుడెక్కడా దొరకవు.

ఇక ఆతరవాత చెప్పుకోదగిన పెద్ద నిఘంటువు C. P. Brown కూర్చిన A dictionary, Telugu and English. దీనిని బ్రౌణ్య నిఘంటువు అని పిలుస్తారు. ఇది 1852లో అచ్చయింది. 1854లో మిశ్రభాషా నిఘంటువు అని ఇంకోటి అచ్చయింది. రెండూ కలిపి ఒక పుస్తకంగా 1966లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ వారు అచ్చువేశారు. దానిని మళ్లీవారే 1974లో అచ్చువేశారు. ఈ నిఘంటువు తెలుగుకి మొదటి పెద్ద నిఘంటువు. ఇందులో తెలుగు మాటలకు ఇంగ్లీషులోనూ, తెలుగులోనూ అర్థాలున్నాయి. ప్రాచీన కావ్యాల్లోని మాటలు, ఆధునిక వ్యవహారంలోని మాటలు కూడా పుస్తకంలో దొరుకుతాయి. మాటలను ఉపయోగించె పద్ధతికూడా ఇందులో దొరకుతుంది. ప్రాచీన కావ్యప్రయోగాల్లోనుంచి, నేటి వాడుకనుంచి కూడా ఉదాహరణలున్నాయి. మిశ్రభాషా నిఘంటువుకు ఉపోద్ఘాతంగా తెలుగు రాతమీద Explanation of the Telugu Alphabet అని ఒకవ్యాసం ఇంగ్లీషులో ఉంది తెలుగు లిపిని గురించి తెలుసుకోటానికి ఇది చాలా ఉపయోగం. ఈ నిఘంటువు ఉపయోగించటంలో ఒక చిక్కుంది. ఇందులో హల్లుల్లో ఒకవర్గంలో వేరు వేరు అక్షరాలతో మొదలయ్యే మాటలు వేరు వేరుగా ఉండకుండా అన్నీ ఒకచోటే ఉంటాయి. అందువల్ల మాటలు వెతుక్కోటం కాస్త కష్టమవుతుంది. [క, ఖ, గ, ఘలు -కవర్గం, చ, ఛ, జ, ఝలు -చవర్గం, ట, ఠ, డ, ఢలు -టవర్గం, త, థ, ద, ధలు -తవర్గం, ప, ఫ, బ, భలు -పవర్గం ఙ, ఞ, ణ, న, మ లు అనే అనునాసిక వర్ణాలు క్రమంగా క - చ - ట - త - ప వర్గాలకు చెందినవే అయినా వీటిలో మాటకు మొదటవచ్చే న, మ లు మాత్రమే. ఆ మాటలు ఈ నిఘంటువులో వేరుగానే ఉన్నాయి.]

ఈ వరుసలో చెప్పుకోదగిన ఇంకో నిఘంటువు A.Galletti కూర్చిన Telugu Dictionary, A Dictionary of Current Telugu. ఇది 1935లో Oxford University Press వారు అచ్చువేశారు. దీన్ని బొబ్బిలి రాజా గారికి అంకితమిస్తూ గెలెటీ "ఈ వ్యావహారిక భాషా డిక్షనరీ విద్య వ్యాపింపగలదని నమ్మి ప్రథమ మంత్రి వున్న బొబ్బిలి రాజా గారుల పాదపద్మముల సముఖమునకు అర్పించిన కానుక" అని రాశారు. ప్రథమ మంత్రి అంటే ఇప్పుడు మనం అనుకొనే ముఖ్య మంత్రి. ఈ నిఘంటువుకు R. Galletti అనే ఆయన కూర్చిన పీఠికలో తెలుగు భాషను గురించి, ముఖ్యంగా తెలుగు సంధిని గురించి చెప్పిన కొన్ని విశేషాలున్నాయి. ఈ నిఘంటువు అంతా రోమన్ లిపిలో ఉంది. చిన్న నిఘంటువైనా (484 పేజీలే) వాడుక ప్రయోగాలు, నుడికారాలు ఉదహరించటంలో చాలా విశేషమైన పరిశీలన కనిపిస్తుంది. ఉదాహరణగా మాట అనే మాటకు ఇచ్చిన అర్థం చూద్దాం.

మాట, word, command, promise, affair, concerning. ఔషధము మాట స్మరణకు వచ్చి, remembering about the medicine; నీ మాట చెప్పలేదు, he did not mention you; ఇది వేరే మాట this is another affair; రెండో మాటలేదు, there is no alternative; ఆమె తిరిగి వస్తున్నదనే మాట తెలిసి, knowing she would come back; మాటతప్పలేదు, he kept his promise; వేటుకు వేటు, మాటకు మాట, a blow for a blow, a word for a word; మాట వినుట, to obey; వెయ్యి మాటలేల, in a word; నా మాట వేరు, నీ మాట వేరు, we don't agree; వానికి నాకు మాటలు లేవు, we are not on speaking terms, కడపటి మాట యేమి, what was the result; మాటలకు పట్టుకుంటే విడువడు, once he starts talking; he never stops, ఆదెక్కడి మాట, what nonsense; మాటలురాని బిడ్డ a child that has not yet learnt to speak వానికి మాట సాగుతుంది he commands respect, మాటలకు మాత్రము పేదరికము లేదు nominally he is well off, ఆయన మాటకు యెదురు లేదు, his word is law; మాట ఇచ్చుట, give one's word.!, ఆడ దాని మాట, నీళ్ల మూట, a woman's word is a water blundle, మాటకు మాట తెగులు, నీళ్లకు నాచు తెగులు words and weed choke streams and speech, మాటలకు మల్లి, పనికి యెల్లి, in word a malli needs a yell మల్లి and యెల్లి are women's names, but మళ్లీ also means again and యెల్లి tomorrow (His Miss Bud never becomes a Mrs. Blossom.) మాటలు కోటలు దాటుతవి, కాళ్లు కడప దాటలేవు, his words breach forts, his foot does not pass, his threshold (great boaster, little doer); ఏ వెరిగిన మాట కీ రెరిగిన వాత a word in season, a brand in reason, ఎవరి కూడు తిండే వారి మాట లాడాలి, he who pays the piper calls the tune.

BRAOU

[ఇందులో తెలుగు లిపిలో ఇచ్చిన భాగం అసలు పుస్తకంలో రోమన్ లిపిలో ఉంది చదివే సౌకర్యం కోసం తెలుగు లిపిలోకి మార్చి ఇచ్చాం].

ఇంగ్లీషు వాళ్లు రాసిన నిఘంటువులు ద్విభాషా నిఘంటువులు. తెలుగు మాటలకు ఇంగ్లీషు అర్థాలిచ్చినవే ఎక్కువ. ఇంగ్లీషు మాటలకు తెలుగు అర్థాలిచ్చిన ఇంగ్లీషు-తెలుగు బ్రౌణ్య నిఘంటువొకటి ఉంది. సాహిత్య అకాడమీ దీన్ని కూడా అచ్చువేసింది. ఇవి కాక రకరకాల సైజుల్లో శంకర నారాయణ తెలుగు-ఇంగ్లీషు, ఇంగ్లీషు-తెలుగు నిఘంటువులు 1900 నుంచి మొన్న మొన్నటి వరకు ప్రచారంలో ఉన్నాయి, జి.యన్. రెడ్డి గారి సంపాదకత్వాన తెలుగు అకాడమీ ఒక పెద్ద ఇంగ్లీషు తెలుగు నిఘంటువును తయారు చేసింది. (పేజీలు 1312)

ప్రాచీన కావ్య భాషా పదాలకోసం చిన్నయ సూరి ఒక తెలుగు నిఘంటువు తయారు చేసినట్టు చెపుతారు. సూర్యరాయాంధ్ర నిఘంటువు తయారీలో దీన్ని ఉపయోగించుకున్నట్టు ఆ నిఘంటు సంపుటాలు చూస్తే తెలుస్తుంది. కాని చిన్నయసూరి నిఘంటువు ఇప్పుడేమయిందో తెలీదు. అది ఎప్పుడూ అచ్చుకాలేదు.

కావ్యభాషా పదాలకు ప్రయోగాలతో సహా ఇచ్చిన నిఘంటువుల్లో అధిక ప్రచారాన్ని పొందిన నిఘంటువు బహుజనపల్లి సీతారామాచార్యులు గారు కూర్చిన శబ్ద రత్నాకరము. 1885లో మొదలు అచ్చయింది. ఆతరవాత 1911, 1922, 1929, 1937, 1958, 1969 సంవత్సరాల్లో పునర్ముద్రణం పొందింది. 1958 సంవత్సరపు ముద్రణానికి నిడుదవోలు వెంకటరావు గారు కొన్ని కొత్త మాటలను అనుబంధంగా చేర్చారు. కావ్యభాషకు ఒకే వాల్యూములో దొరికే నిఘంటువుల్లో ఇదే ప్రశస్తమైనది అని చదువరులు భావిస్తున్నారు.

ఇంతకన్నా విస్తృత ప్రణాళికతో ఎక్కువ మాటలతో ఎక్కువ అర్థచ్ఛాయలతో ఎక్కువ కావ్యోదాహరణలతో ఆంధ్రసాహిత్య పరిషత్తువారు పిఠాపురం మహారాజావారి ధనసహాయంతో ఎన్నో ఏండ్లు చాలామంది పండితుల సహాయంతో కూర్చిన సూర్యరాయాంధ్ర నిఘంటువు ఇప్పుడు ఆంధ్రసాహిత్య అకాడమీ వారి దగ్గర దొరుకుతున్నది. ఇది 8 వాల్యూములు. ఇప్పటివరకూ కావ్యభాషకు ఇదే పెద్ద నిఘంటువు. 1936లో మొదటి సంపుటం బయటికిరాగా 8వ సంపుటం 1972లో వచ్చింది.

1949-1969 మధ్యకాలంలో శ్రీపాద లక్ష్మీపతిశాస్త్రి, బులుసు వెంకటేశ్వరులు, వేదము లక్ష్మీనారాయణ శాస్త్రిగార్ల సహాయంతో వావిళ్ల రామశాస్త్రులు సన్స్‌వారు వావిళ్ల నిఘంటువును 4 సంపుటాలలో తయారు చేయించారు. ఇందులోకూడా అర్థాలతో పాటు కావ్యప్రయోగాలు ఇచ్చారు.

ఇవికాక మహంకాళి సుబ్బారాయుడు అనే ఆయన కూర్చిన శబ్దార్థ చంద్రికను 1893 లో కూర్చిన దాన్ని పండితుల సహాయంతో పెంచి వావిళ్లవారు 1913 నుంచీ వివిధ ముద్రణలలో అమ్ముతున్నారు. ఇందులో కేవలం అర్థాలేకాని ప్రయోగాలు లేవు. 1967-70 సంవత్సరాలలో చెలమచెర్ల రంగాచార్యులు గారు ఆంధ్ర శబ్దరత్నాకరము అనే పేరుతో 3 సంపుటాల నిఘంటువు కూర్చగా వెంకట్రామ అండ్ కో వారు అచ్చేశారు. ఇందులోనూ పూర్వకవి ప్రయోగాలు లేవు. వివిధశాస్త్ర పదాలతో సహా శబ్ద సాగరమనే పేరుతో తెలుగు అకాడమీ ఒక పెద్ద నిఘంటు నిర్మాణం తలపెట్టింది. అది పూర్తికావటానికి చాలాకాలం పడుతుంది.

ఒక మాటకు వివిధ సోదరభాషలలో రూపసామ్యమూ, అర్థసామ్యమూ ఉన్నమాటలనూ, వాటి అర్థాలను ఇచ్చే పదకోశాన్ని వ్యుత్పత్తి పదకోశం అంటారు. అట్లాంటి దాన్ని A Dravidian Etymological Dictionary అనే పేరుతో టి. బర్రో, ఎమ్. బి. ఎమెనోగార్లు తయారు చేశారు దాన్ని 1960లో Oxford University Press వారు అచ్చువేశారు. ఈ నిఘంటువులో ఊహాజనిత మూలరూపాల్ని దృష్టిలో పెట్టుకొని అకారాది క్రమాన్ని తయారు చేశారు. అట్లాంటిదాన్ని తెలుగు మాటలు ప్రధానంగా తీసుకొని తెలుగు వ్యుత్పత్తి పదకోశాన్ని ఆంధ్ర విశ్వవిద్యాలయంవారు 1957 నుంచి తయారు చేయటం ప్రారంభించారు. ఈ నిఘంటు నిర్మాణంలో ఉన్నప్పుడు వివిధ దశలో క్రమంగా గంటిజోగి సోమయాజులు, భద్రిరాజు కృష్ణమూర్తి, తూమాటి దొణప్పగార్లు ప్రముఖపాత్ర వహించారు. ఈ నిఘంటువు మొదటి సంపుటం 1971లో అచ్చయింది. 4వ సంపుటం 1983లో అచ్చయింది. ఇంతవరకు త వర్గం పూర్తి అయినట్టు. ఇంకోమూడు, నాలుగు సంపుటాలలో నిఘంటువు పూర్తికావచ్చు. అచ్చు ప్రారంభించిన దగ్గర నుంచి లకంసాని చక్రధరరావు గారు నిర్వహిస్తున్నారు. అచ్చయిన ప్రతులకు సంపాదకులు ఆయనే. ఈ నిఘంటువు వల్ల దొరికినంతవరకు చాలామాటలకు పూర్వచరిత్ర తెలుస్తుంది.

BRAOU

అన్నిరకాల నిఘంటువులు అచ్చయినా విద్యార్థులకు ఉపయోగించేట్టు ఏ ఆక్స్‌ఫర్డు ఇంగ్లీషు డిక్షనరీ లాగానో, ఛాంబర్స్ 20వ శతాబ్దపు ఇంగ్లీషు డిక్షనరీ లాగానో American College dictionary లాగానో, Random House dictionary లాగానో, Webster's New World English dictionary లాగానో ఒక సంపుటంలో తెలుగు నిఘంటువు కొనుక్కోటానికి మార్కెట్లో దొరకదు. బ్రౌణ్యనిఘంటువు, సూర్యరాయాంధ్ర నిఘంటువులు మాత్రం ఇప్పుడు (1988లో) దొరుకుతున్నాయి. ఇవి అయినా విద్యార్థులకు అందుబాటు అయిన ధరల్లో లేవు.

ఇవికాక కొన్ని ప్రత్యేకమైన పదకోశాలు తయారవుతున్నాయి. అట్లాంటి వాటిల్లో సాహిత్య అకాడమీ నిర్వహించిన వృత్తి పదకోశాలు ముఖ్యమైనవి. వీటిలో భద్రిరాజు కృష్ణమూర్తిగారి సంపాదకత్వాన వచ్చిన వ్యవసాయ (1962), చేనేత వృత్తి పదకోశాలు, బూదరాజు రాధాకృష్ణ గారి సంపాదకత్వాన వచ్చి వాస్తు పదకోశం పెద్దవి. ఇంకా చిన్న చిన్న వృత్తుల గురించి కొన్ని కోశాలు తయారయినాయి, మరికొన్ని తయారులో ఉన్నాయి.

వృత్తి పదకోశాలవల్ల ఇంతవరకు కోశాల కెక్కని కొత్తమాటలు రికార్డు అయినాయి. ఒకే మాటకు వేరు ప్రాంతాల్లో ఉండే అర్థభేదాలు, ఉచ్చారణ భేదాలు, రూపాంతరాలు, పర్యాయపదాలు తెలుసుకోవచ్చు. వృత్తి పదకోశాలవల్ల కలిగిన ఇంకో ముఖ్య ప్రయోజనం మొదటి సారిగా తెలుగు మాండలికాలను గురించి తెలుసుకోవటానికి వీలయింది. తెలుగు మాటల్లో కలిగిన చారిత్రకమైన మార్పులు కూడా ఈ కోశాలద్వారా తెలిసినాయి. ప్రామాణిక ప్రామాణికేతర భాషాభేదాలను వేరుచేసే లక్షణాలుకూడ ఈ నిఘంటువుల ద్వారా తెలుసుకోగలుగుతాం.

సాహిత్య అకాడమీయే నిర్వహించిన ఇంకోపని ఇంగ్లీషులో కంకార్డెన్సులు అనే పదప్రయోగకోశాలు తయారు చెయ్యటం. నన్నయ్య, నన్నెచోడ శ్రీనాథ పద ప్రయోగకోశాలు తయారయినాయి. తిక్కన పద ప్రయోగకోశం మూడు వాల్యూములు అచ్చయినాయి. ఒక్కొ ప్రాచీనకవి పద ప్రయోగకోశం నుంచి ఆ కవిభాషా ప్రయోగ రీతులను గురించి చాలా విషయాలు తెలుసుకోవచ్చు. ఆ పదప్రయోగకోశాల ఆధారంగా ఆ కవిభాషకు వ్యాకరణం రచించవచ్చు, అయితే ఈ ప్రయోగకోశాలు కేవలం పరిశోధకులకు మాత్రమే పనికివస్తాయి. భాషా చరిత్ర రచనకు పదప్రయోగకోశాలు, శాసనశబ్దకోశాలు చాలా ఉపయోగిస్తాయి. శాసన భాషను విశ్లేషించి తయారు చేసిన నిఘంటువులను శాసన శబ్దకోశాలు అంటారు. 10వ శతాబ్దివరకు దొరికిన శాసనాలకు బూదరాజు రాధాకృష్ణ గారు రచించిన శాసనశబ్దకోశాన్ని సాహిత్య అకాడమీ ప్రచురించింది. కొట్ర లక్ష్మీనారాయణ శాస్త్రి గారి లక్ష్మీనారాయణీయము (1907) అనే అచ్చ తెనుగునిఘంటువు, కొట్ర శ్యామల కామశాస్త్రి గారి ఆంధ్రవాచస్పత్యము (1953: మొదటి సంపుటం 1934) ముసునూరి వేంకటశాస్త్రిగారి విద్యార్థి కల్పతరువు (1953: మొదటి ముద్రణం 1930), ఆంధ్ర నామసర్వస్వము (1971) వంటి నిఘంటువులు అచ్చయి కొంతకాలం ప్రచారంలో ఉండి పోయినాయి. ఆంధ్ర వాచస్పత్యములో బొమ్మలుకూడా ఉన్నాయి.

ఇంకా ఈ పాఠంలో చెప్పని నిఘంటువులు, ఇంకా కొని ఉండవచ్చు, వాటిని గురించి ఈ పాఠంలో సూచించిన పుస్తకాల నుంచి వ్యాసాలనుంచి తెలుసుకోండి. కొమర్రాజు లక్షణరావుగారి ఆంధ్ర విజ్ఞాన సర్వస్వము, తెలుగుభాషా సమితివారి తెలుగు విజ్ఞాన సర్వస్వము, ఖండవల్లి లక్ష్మీరంజనం గారిసంగ్రహాంధ్ర విజ్ఞాన కోశమువంటి గ్రంథాలు ఇంగ్లీషులో 'ఎన్‌సైక్లోపీడియా' అనే గ్రంథాల నమూనాలో తయారయినాయి. కొమర్రాజు లక్ష్మణరావు గారి ఆంధ్రవిజ్ఞాన సర్వస్వం, లక్ష్మీరంజనంగారి సంగ్రహాంధ్ర విజ్ఞాన కోశము అకారాదిక్రమంలో తయారయినాయి. తెలుగు భాషాసమితివారి విజ్ఞాన సర్వస్వం విషయాలనుబట్టి వాల్యూములు తయారయినా, వాటిల్లోని విషయాల్లో అకారాదిక్రమం ఉంటుంది. ఈ విజ్ఞానసర్వస్వం 3, 4 సంపుటాలలో భాషా, సాహిత్య, సాంస్కృతిక విషయాలు చాలా చాలా ఉన్నాయి. మూడవ వాల్యూములో పాత విషయాలను మార్చి, కొన్ని కొత్త విషయాలు చేర్చి పునర్ముద్రించారు (1983) నాలుగో సంపుటం కూడా అట్లాగే కొత్త విషయాలు చేర్చి మార్చటానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి.

నిఘంటువులో అర్థాలిచ్చే పద్ధతులు కొన్నిరకాలు ఉన్నాయి. తెలుగులో ప్రసిద్ధ నిఘంటువులు కేవలం పర్యాయపదాలు ఇచ్చి ఊరుకుంటాయి ఉదాహరణానికి ఇంతకుముందు మాట అనే మాటకు గెలెటీ డిక్షనరీలో ఇచ్చిన అర్థాలు చూశాం. వివరంగా ప్రయోగాలు అర్థచ్ఛాయలు ఉన్నాయి, ఇదేమాటకు శబ్దరత్నాకరములో ఇట్లాఉంది:

BRAOU

మాట దే. వి. 1. వచనము; 2. పదము; 3. నింద; 4. వృత్తాంతము "సీ. అప్పుపాలైన శుక్రాంబు రుచి యెంత మాట మోచిన యంచతేట యెంత" ఇది నిందకు నుదాహరణము. కా, గ, ఆ-5. ప్రతిజ్ఞావచనము (నేను వానికి మాట యిచ్చితిని).

సూర్యరాయాంధ్ర నిఘంటువులో ఈకింది విధంగా అర్థాలు, అంటే పర్యాయ పదాలు ఇచ్చారు:

[కావ్య ప్రయోగాలుకూడా ఉన్నాయి. కాని ఇక్కడ ఇయ్యటంలేదు. తెలుగు సంఖ్యలకు మారుగా అరబిక్ నంబర్లు ఇస్తున్నాం.]

మాట. వి. (త. మాట్టమ్. క. మాతు తు. మాత్రం). 1. వాక్యము, 2. పలుకు, పదము, గర్వోక్తి, 3. సందేశము, వార్త, 4. విషయము సంగతి, 5. హితోక్తి 6 చరిత్ర, కథ 7. నింద, నిందా, వాక్యము 8. వాగ్దండము 9. వివాదము 10 లోకోక్తి 11. సూక్తి, ఆర్యోక్తి 12. శాస్త్రయుక్తి 13. ఆజ్ఞ 14. ప్రతిజ్ఞ, ప్రతిజ్ఞా వచనము 15. ప్రార్థన.

ఇందులో ప్రతి అర్థానికి 1 నుండి 3 వరకూ కావ్య ప్రయోగాలు ఇచ్చారు. కొన్ని నిఘంటువుల్లోనూ వృత్తిపదకోశాల్లోను అర్థ వివరణ విస్తారంగాఉంది.

ఏ భాషలో అయినా నిఘంటువు భాషా పాటవాన్ని పెంచుకోటానికి ఉత్తమ సాధనం. ఇంగ్లీషులో thesaurus , synonyms dictionary, Usage dictionary, Pronunciation dictionary అని రకరకాల నిఘంటువులున్నాయి. కాని తెలుగులో ఇట్లాంటి రకాలన్నీ రాలేదు. ఉచ్చారణను సూచించే నిఘంటువులు తెలుగుకి అవసరంలేదు. తెలుగులో ఇంగ్లీషులాగా రాతకి ఉచ్చారణకీ విపరీతమైన వ్యత్యాసంలేదు. ఉన్న కొద్దిపాటి భేదాలుకూడా క్రమబద్ధమైనవి. రాసినట్టు చదివితే అది తప్పుకాదు.

ప్రతివారు సొంతానికి కనీసం ఒక నిఘంటువు కనుక్కోటం మంచిది. సందేహం వచ్చినప్పుడల్లా నిఘంటువును సంప్రదించటం చాలా మంచి అలవాటు భాష నేర్చుకోదలచినవాడు ఈ అలవాటు తప్పని సరిగా చేసుకోవాలి. వివిధ రంగాలలో తెలుగును ప్రవేశపెడుతున్న ఈ కాలంలో ప్రతవారింట్లోనూ ఉండవలసిన తప్పనిసరి సాధనం నిఘంటువు. తాను నేర్చుకోదలచిన భాషకు కనీసం ఒక్క నిఘంటువైనా అందుబాటులో ఉంచుకోవాలి. కొనుక్కోనేముందు తెలసిన వాళ్లను సంప్రదించండి. మీ అవసరాలకు అనుకూలమైన నిఘంటువును సంపాదించండి. రాబోయే పాఠాలకు నిఘంటువు అవసరం తప్పని సరిగా ఉంటుంది.

BRAOU

ఖండిక 2 పాఠం 4

# నిఘంటువును వాడుకోవటం ఎట్లా?

ఉద్దేశం:

తెలుగు అక్షరాలనూ, గుణింతాలనూ వివరించి వాటి ననుసరించిన అకారాది క్రమాన్ని పరిచయంచేయటం. నిఘంటువు నుంచి ఏ యే సమాచారం సేకరించగలమో తెలియ చెప్పటం. నిఘంటువును వాడుకునే పద్ధతిని తెలియ జెప్పటం. నిఘంటువును సంప్రదించే అవసరాన్ని నొక్కి చెప్పటం.

ప్రణాళిక:

1. భాషా రచనచేసే వారందరికీ నిఘంటువు అవసరం.
2. పద్య నిఘంటువులు ఈ కాలంలో ఎందుకు సరిపోవటం లేదు? గద్య నిఘంటువులు ఎందుకు అవసరం అయినాయి?
3. అకారాది క్రమం అంటే ఏమిటి?
4. తెలుగు వర్ణమాల. గుణింతాలూ, ఇతర గుర్తులు, వీటి క్రమానికీ నిఘంటువుల క్రమానికీ ఉన్న భేదం.
5. రాతలో అక్షరం అంటే ఏమిటి?
6. తెలుగు అక్షర నిర్మాణంలో ఇమిడిఉన్న నియమాలు.
7. నిఘంటువు వాడకంలో గుర్తుంచుకోవలసిన కొన్ని అంశాలు.
8. నిఘంటువుల్లో దొరికే సమాచారం.

BRAOU

## నిఘంటువును వాడుకోటం ఎట్లా ?

తెలుగులో దొరికే రకరకాల నిఘంటువులను గురించి ఇంతకు ముందటి పాఠంలో తెలుసుకొన్నాం. అన్ని రకాల నిఘంటువులు, సంప్రదింపు గ్రంథాలు ( reference works ) తెలుగులో లేకపోయినప్పటికీ ఉన్న సామగ్రి తక్కువేమి కాదు.

మీలో చాలామంది ఇంగ్లీషు డిక్షనరీని వాడటం నేర్చుకొనే ఉంటారు. కాని తెలుగు నిఘంటువును చూసి కూడా ఉండరు. ఇంగ్లీషు కొత్తభాష కావటంవల్ల డిక్షనరీని సంప్రదించే అవసరం ఎక్కువ కలిగేమాట నిజమే. అయితే మన భాషలో అయినా అన్ని మాటల అర్థాలూ మనకు తెలియవు. ప్రాచీన కావ్యాల్లో మనకు తెలియని మాటలు చాలా ఉంటాయి. మాటలు మనకు తెలిసినవే అయినా తెలియని అర్థాలుంటాయి. <u>రాజు</u> అంటే పరిపాలకుడు అనే అర్థం మనకు తెలుసు కాని నిఘంటువులో <u>చంద్రుడు</u> అనే అర్థం కూడా కనిపిస్తుంది. రంభ అంటే ఒక <u>అప్సరస</u> అని మనకు తెలుసు. <u>అరటిచెట్టు</u> అనే అర్థంకూడా నిఘంటువులో కనిపిస్తుంది. మనకు తెలియని అర్థాలు పుస్తకాలు చదివేటప్పుడు అవసరమవుతాయి. అప్పుడు నిఘంటువు చూసుకోటం అవసరం అవుతుంది. అయినప్పటికీ తెలుగు చదువుల్లో నిఘంటువుకు అంత ప్రాధాన్యం ఇంకా ఏర్పడలేదు

భాషలో రచన (రచన అంటే సాహిత్య రచనే కానక్కరలేదు, పత్రికా రచన, ప్రణాళికా రచన, వార్తా రచన మొదలైనవన్నీ భాషారచనలే.) చేసే వారందరికీ పద సంపద పెంచుకోవాల్సిన అవసరం ఉంది. రకరకాల అర్థభేదాల్లో అవసరానికి సరిపోయే పదజాలాన్ని ఎన్నుకోటం భాష నేర్చుకోటంలో ఒక భాగం. నిఘంటువుల వల్లనే ఇది సాధ్యం. అక్షర క్రమాన్ని (స్పెల్లింగు) తెలుసుకోటానికి కూడా నిఘంటువు ఉత్తమమైన సాధనం. అందువల్ల

చదువుకున్న తెలుగు వాడికి తెలుగు పదజాలం ఎక్కువ నేర్చుకోవాలంటే నిఘంటువు చాలా ఉత్తమ సాధనం. ఈ పాఠాల్లో నిఘంటువు అవసరం చాలా ఉంటుంది. నిఘంటువు అవసరాన్ని నొక్కి చెప్పటం కోసమే రెండు పాఠాలను నేర్పుతున్నాం. తరువాత పాఠాల్లో అయినా నిఘంటువును వదిలి పెట్టడానికి వీల్లేదు. చాలా పాఠాల్లో తెలియని మాటలకు నిఘంటువు చూసేపనీ, అవసరమూ రెండూ ఉంటాయి. అభ్యాసాల్లో నిఘంటువు చూసేపని కూడా ఒక భాగం.

తెలుగు నిఘంటువు చూడటం కష్టమని కొందరు అంటుంటారు. అది పొరపాటు. అలవాటు లేకపోవటం వల్ల అట్లా అనుకుంటారు. తెలుగు వారికి తెలుగు చదవటం కష్టం కానప్పుడు తెలుగు నిఘంటువు చూడటం కూడా కష్టంకాదు. తెలుగు వర్ణమాలలో అక్షరాలు ఏర్పాటయిన పద్ధతిలోనే నిఘంటువులో మాటలు ఏర్పాటు అయిఉంటాయి. ఈ వరుసనే అకారాది క్రమం అంటారు.

పూర్వం పద్యనిఘంటువుల్లో అకారాది క్రమం ఉండేది కాదు. కొన్ని రకాల అర్థ విభాగాలు ( Semantic classifications) ఉండేవి. అయితే పద్య నిఘంటువులు కంఠతా పట్టటానికి ఉద్దేశించినవి. ఒకప్పటి అవసరాలకు అప్పటి విజ్ఞానాన్ని గాని, అందులో అవసరమైన కొంత భాగాన్ని గాని కంఠతా పట్టటం సరిపోయేది. అప్పటి సాంకేతిక అభివృద్ధి దృష్ట్యా ఇది అప్పటి సమాజాలకు సరిపడి ఉండవచ్చు. కాని ఈనాటి సమాజంలో అన్ని రకాల విజ్ఞానమూ గాఢతలోనూ విస్తృతిలోనూ బహుముఖాలుగా విస్తరిల్లుతున్నది. వైజ్ఞానిక అవసరాలు కూడా అంతూ పొంతూ లేకుండా పెరుగుతున్నాయి. అందువల్ల ఆ పద్ధతి సాధ్యంకాదు. విజ్ఞానాన్నంతటినీ ఛందస్సులో బిగించటం సాధ్యమూ కాదు, ఒకవేళ సాధ్యమైనా కంఠతా పట్టటం మానవ శక్తికి మించినపని. అందువల్ల మానవ విజ్ఞానాన్ని ఇప్పుడు వచనంలో భద్రపరుస్తున్నాం.

అట్లాగే నిఘంటువులు కూడా. పాత పద్యనిఘంటువులకు కొత్త వ్యాఖ్యానాలు వస్తున్నాయి కాని, కొత్త పద్య నిఘంటువులు ఎవరూ రాయటం లేదు. 17వ శతాబ్దంలో వేంకనార్యుడు రచించిన 'ఆంధ్ర భాషార్ణవము' అనే పద్యనిఘంటువుకు పోతుకుచ్చి సుబ్రహ్మణ్యశాస్త్రిగారు రచించిన వ్యాఖ్య 1980లో అచ్చయింది. ఆ పుస్తకంలో మాటలకు కూడా చివరి సంపుటంలో అకారాది క్రమంలో పదసూచిక ఉంది.

BRAOU

అంతేకాక చాలాపుస్తకాల్లో వాడిన ముఖ్యమైన విషయాలకు, పదాలకు ఇండెక్సు ( index ) పేరుతో ఒక సూచిక ఇవ్వటం ఒక సంప్రదాయం. ఇంగ్లీషులో ఈ పద్ధతి బాగా ప్రచారంలో ఉంది. తెలుగులో కూడా పెద్ద పెద్ద పుస్తకాలకు అట్లా ఇస్తున్నారు. తెలుగు విజ్ఞాన సర్వస్వం చివర ఇట్లాంటి సూచిక ఉంది. అందువల్ల అకారాది క్రమంలో పదాలూ విషయాలు చూడటం, ఏర్పాటు చెయ్యటం నేర్చుకోటం చాలా అవసరం. అవసరం కోసమే ఈపాఠం.

అకారాది క్రమం అంటే ఏమిటి? లిఖిత వ్యవస్థ (రాసే సంప్రదాయం) ఉన్న ఏ భాషా సమాజంలో అయినా రాసే అక్షరాలను ఒక వరసలో కూరుస్తారు రాయటం, చదవటం నేర్పేటప్పుడు ఆ అక్షరాలను ఆ వరసలోనే నేర్పుతారు. ఆ వరసను అకారాది క్రమం అంటారు. అకారాది క్రమంలో ఉన్న అక్షర సమూహాన్ని అక్షరమాల అని గాని, వర్ణమాల అనిగాని అంటారు. చాలా భారతీయ భాషల్లో వర్ణమాలలు అ ఆ లతో మొదలవుతాయి. అకారం అనే అచ్చుతో మొదలవుతుంది కాబట్టి దీన్ని అకార క్రమం అంటారు.

[ఇప్పుడు ఉందో లేదో గాని పూర్వం పల్లెటూరి వీధిబళ్లలో (శ్రీ) అనే అక్షరంతో చదువు ప్రారంభించేవారు. దాన్ని సరస్వతి అనేవారు. నిజానికది శ్రీకారం. శ్రీ అనే అక్షరంతో ఒక పని మొదలు పెడితే ఆ పని విజయవంతం అవుతుందనే నమ్మకం నుంచి వచ్చిన సంప్రదాయం అది. ఆ తరవాత "ఓనమాలు" దిద్దబెట్టేవారు. అంటే ఓం నమశ్శివాయ సిద్ధం నమః' అని రాయించేవారు. ఇది శైవ సంప్రదాయం నుంచి వచ్చిన దైవ ప్రార్థన. ఇవేవీ వర్ణమాలలో భాగాలు కావు]

తెలుగు వర్ణమాలలో అక్షరాలక్రమం ఇది :

1. అచ్చులు

అ, ఆ, ఇ, ఈ, ఉ, ఊ, ఋ, ౠ, ఌ, ౡ, ఎ, ఏ, ఐ, ఒ, ఓ, ఔ.

[ఇక్కడ కొంతమంది అం, అః అని రాసేవారు, ఇవి అచ్చులుకావు. సున్నకు, విసర్గకూ గుర్తులు. అవి విడివిడిగా పలకటం కష్టమని అకారంతో చేర్చి రాసేవాళ్లు]

2. హల్లులు

క ఖ గ ఘ ఙ, చ ఛ ౘ జ ౙ ఝ ఞ ట ఠ డ ఢ ణ త థ ద ధ న ప ఫ బ భ మ య ర ల వ శ ష స హ ళ క్ష ఱ

3. ఇతర గుర్తులు

సున్న = ం, అరసున్న = ఁ, విసర్గ = ః

వలపల గిలక = ౯, నకారపొల్లు = ౝ

పదాదిన వచ్చే అచ్చులకు, హల్లులకు పై గుర్తులు రాస్తారు. వర్ణమాలలో హల్లులను ఉచ్చరించేటప్పుడు అకారాన్ని చేర్చే ఉచ్చరిస్తారు. అందువల్ల పైన హల్లులుగా చూపించిన గుర్తు అ కారంతో కూడిన హల్లుగా గుర్తించుకోవాలి. హల్లు లేకుండా చూపించాలంటే నెత్తిమీద పొల్లు గుర్తుతో చూపించాలి. క్, త్, ప్, మ్, ర్, పలక అనే మాటలో వర్ణమాలలో అక్షరాలే ఉన్నాయి. కాని వాటిని అచ్చులూహల్లులుగా విడదీసి చూపిస్తే ప్ అ ల్ అ క్ అని రాయాలి. ఇంగ్లీషు రాతలో అచ్చులు హల్లులు విడి విడిగా రాస్తారు. కాని తెలుగు రాతను అట్లా ఊహించలేం.

[అభ్యాసం కోసం మీ పాఠంలో రెండు మూడు వాక్యాలు అచ్చులు హల్లులు విడదీసి రాసి చూడండి. పక్కవాళ్లను త్వరగా చదవమనండి. కష్టమవుతుంది. అయితే విడదీసి రాయటం వచ్చిఉంటే మంచిది. అచ్చులు హల్లులు విడదీసి చూపించవలసిన అవసరాలు అప్పుడప్పుడు వస్తాయి]

తెలుగు రాతలో అక్షర నిర్మాణం ఒక ముఖ్యమైన అంశం. ఒక అచ్చు అక్షరం అవుతుంది కాని, ఒట్టి హల్లు అక్షరం కాదు. అచ్చుతో కూడినప్పుడే అక్షరం అవుతుంది. పలక అనే మాటను అచ్చులు హల్లులు విడదీసి రాసినా కలిపి రాసినా మూడక్షరాలే. అక్షరాలు లెక్కబెట్టటానికి అచ్చులే ముఖ్యం. ఎన్ని అచ్చులుంటే అన్ని అక్షరాలున్నట్టు లెక్క. ఛందస్సులో ఉత్పలమాల పద్యంలో ప్రతి పాదానికి 20 అక్షరాలుంటాయనీ, 10 వ అక్షరం యతిస్థానమనీ, ప్రతి పాదానికి రెండో అక్షరం ప్రాస అనీ మీరు చదివి ఉంటారు. ఇట్లా పద్యంలో అక్షరాలు లెక్కబెట్టటానికి అచ్చులే ముఖ్యం.

BRAOU

వర్ణమాలలో ఇప్పటి వరకూ చూపించిన అచ్చుల గుర్తులు, పదాదిన మాత్రమే రాస్తారు. పద మధ్యంలో వచ్చే అచ్చులకు దాని ముందటి హల్లుతో కలిపి రాయాలి. అంటే <u>పల్ అక</u> అని గాని, <u>దేశ్ అం</u> అని గాని, రాయరు. అట్లాగే రెండు మూడు హల్లులు వరసగా వచ్చినప్పుడు మొదటి హల్లుకు మాత్రమే వర్ణమాలలో చూపించిన పైగుర్తులు వాడతారు. వరుసలో రెండోదిగానూ మూడోదిగానూ వచ్చే హల్లులకు వేరే గుర్తులు వాడాలి. వాటి విషయం కొంచెం ఆగి తెలుసుకుందాం. ముందు అచ్చుల సంగతి చూద్దాం.

## గుణింతం : అచ్చులు

గుణింతం అనే మాటకు సూర్యరాయాంధ్ర నిఘంటువులో 'హల్లులతో అచ్చులను హల్లులను చేర్చుట.' అనే అర్థం ఉంది. అచ్చులకు వేరే గుర్తులు చేర్చరు. హల్లులకే గుణింతపు గుర్తులు చేరుస్తారు. ప్రతి అచ్చుకు వేరే గుర్తుంది. (అకారం విషయం ఇంతకు ముందే చూశాం). హల్లు తరవాత వచ్చే అచ్చుకు ఆగుర్తు వాడతారు. అప్పుడు కూడా ఆదే వరస గుర్తుంచుకోవాలి. ఉదాహరణగా కా గుణితం చూడండి: క కా కి, కీ, కు, కూ, కృ, కౄ, (ౢ ౣ లు వదిలెయ్యండి) కె, కే, కై, కొ, కో, కౌ. నిఘంటువులో వెతికేటప్పుడు 'క' అక్షరాన్ని తీస్తే 'క' తో మొదలయ్యే మాటలు ముందుంటాయి, ఆ తరవాత 'కా'తో మొదలయ్యే మాటలుంటాయి, ఆ తరవాత, కి, ఇంకా ఆ తరవాత <u>కీ</u> - చివరి వరకూ ఇదేవరస హల్లుల్లో ఏ అక్షరం తీసుకున్నా ఇదే పద్ధతి. వర్ణమాలలో అచ్చుల గుర్తులు తరవాతా వస్తాయి. నిఘంటువుల్లో కూడా అదే వరస -

## గుణింతం : హల్లులు

తెలుగు రాతలో హల్లులను అచ్చులను విడదీసి రాసే సంప్రదాయం లేదు. హల్లులు వరసగా వచ్చిన మాటల్లోనూ హల్లుల్ని విడదీసే అలవాటు లేదు. వ్యాకరణంలో శబ్దరూప సాధనను వివరించేటప్పుడే అట్లా చేస్తారు. అచ్చులేకుండా హల్లురాసే అవసరం తెలుగులో సాధారణంగా వచ్చేదికాదు. వెనకటి కాలపు రాతలో వలపల గిలక,

నకారపొల్లు అనేవి మాత్రం అట్లా ఉండేవి. మర్కటము అనిరాస్తే మర్కటము అని రాసినదానితో సమానం. అట్లాగే అచ్చులేని న కారానికి బదులు 'ౝ'తో ఒనరౝ చెలగౝ అని రాసేవాళ్లు. ఈ రెండు అలవాట్లు ఇప్పటి రాతలో కనిపించవు.

అచ్చులేకుండా రాసే సున్నాగుర్తు వాడకం పూర్వపు రాతనుంచి ఇప్పటివరకూ రావటమే గాక ఇంకా విస్తృతమయింది. ఈ సున్న హల్లులముందు, పదాంతంలోనూ వస్తుంది. హల్లులముందు వచ్చే సున్నకు ఉచ్చారణ ఆ హల్లు ఉచ్చరించే స్థానంలో ఉచ్చరించే అనునాసిక హల్లుకు సమానం. అంకె, పంచె, పంట, కంత, కంప - అనే మాటలు ఉచ్చారణ ననుసరించి అఙ్కె, పఞ్చె, పణ్ట, కన్త, కమ్ప అనే రకంగా రాసిన మాటలకు ఉచ్చారణలో సమానం, అంటే రాత మాత్రమే వేరు. ఇట్లాంటి చోట సున్న రాయటం రాతకు సులువు. పక్క హల్లును బట్టి ఉచ్చారణ నిర్ణయమవుతుంది.

ప్రాచీన భాషలో 'ము' తో అంతమయ్యే మాటలన్నిటిలోనూ చివరి 'ఉ' ఉచ్చారణలో జారిపోయింది. ఇట్లా జారిపోయిన తరవాత మిగిలిన అచ్చులేని మ కారాన్ని సున్నతో రాసే అలవాటు వచ్చింది. ఇప్పటి భాషలో అచ్చు లేకుండా చాలా విస్తృతంగా రాసే హల్లు ఒక్క సున్న మాత్రమే. సంస్కృతం మాటల్లో విసర్గ ఒకటి అట్లాంటిది. ఈ రెండూ తప్ప అచ్చు లేకుండా ఉపయోగంలో ఉన్న హల్లులేవు. ఈ రెండిటిని వదిలేస్తే రాతలో, అక్షర నిర్మాణంలో కొన్ని అంతర్నియమాలు గమనించవచ్చు.

1. ప్రత్యేకాక్షరంగా అచ్చు మాత్రమే వస్తుంది, హల్లురాదు. పలక అనే రాయాలి. ప్ అలక, పల్ అక, పలక్ అ, ప్ అ ల్ అ క్ అ అనే విధంగా హల్లులను ప్రత్యేకాక్షరంగా రాయకూడదు.

2. అచ్చు అక్షరంగా పదాదిన మాత్రమే వస్తుంది. అలక లో పదాదిన అ ఉంది. పద మధ్యంలో అల్ అక అని రాయకూడదు. నిజానికి మొదటి నియమంలోనే రెండోది ఇమిడి ఉంది. హల్లునుంచి అచ్చు విడదీస్తే అచ్చును మధ్యలో రాయాల్సి వస్తుంది.

   మీరు సంధి పాఠంలో నేర్చుకున్నారు: కొన్నిచోట్ల సంధులు తప్పని సరిగా చెయ్యాలని, వాడో, వీడో, అన్నచోట వాడు ఓ, వీడు ఓ అని రాయకూడదని. సంధి చెయ్యకుండా రాసిన ఓ పదాంతంలో వచ్చింది. ప్రత్యేక పదమూ కాదు అందువల్ల పద మధ్యంలో అచ్చులు రాయటానికి తెలుగు రాత ఒప్పుకోదు. అందు వల్ల అచ్చులో మొదలయ్యే అక, ఆ, ఏ, ఓ లు వచ్చినప్పుడు తెలుగు రాతననుసరించి సంధి చెయ్యాలి.

3. సున్ననూ అచ్చులేకుండ చూపించేహల్లు గుర్తులనూపూర్వపు అక్షరంలో భాగంగానే గుర్తించాలి. ఈ గుర్తులతో పంక్తి మొదలు పెట్టకూడదు. అందరు అనే మాటను అ - ందరు అని వేరు చెయ్యకూడదు. అం - దరు అని వేరు చెయ్యవచ్చు అట్లాగే ప్రాచీన భాషలో వచ్చెన్ అనే మాటను వచ్చె-న్ అని విడదీయకూడదు. అచ్చుకు పూర్వం వచ్చే హల్లులన్నీ కలిపి అచ్చుతో సహా ఒక అక్షరమవుతుంది.

4. వరసగా వచ్చిన హల్లుల్లో మొదటి హల్లుకే వర్ణమాలలో అక్షరం రాయాలి. తక్కిన హల్లులను వత్తులతో చూపించాలి.

5. అచ్చు గుర్తు వత్తులకు చూపకూడదు వర్ణమాలలోనిహల్లుగుర్తుకే చూపించాలి.

ఇవి తెలుగు రాతలో అక్షర నిర్మాణానికి, అక్షర క్రమానికి సంబంధించిన నియమాలు. ఈ నియమాలు ఒకరు ఏర్పరచినవి కావు. సాంస్కృతిక వికాసంలో సహజంగా ఏర్పడ్డవి

[ధ్వనుల దృష్ట్యా, ఛందస్సు దృష్ట్యా పరిగణించే అక్షరానికీ, రాతలో అక్షరానికీ కొంచెం భేదముంది. వస్త్రము అనే మాటను ఛందస్సు దృష్ట్యా వస్-త్ర-ము అని గాని వస్త్-ర-ము అనిగాని విడదీయాల్సుంటుంది. రాతలో స్త్ర అనేది విడదీయరాని అక్షరం]

తెలుగులో ్క, ్చ, ్ల, ్మ, ్స, ్శ, ్ర, ్ష, ్ట వంటి గుర్తులను వత్తులంటారు. ఈ గుర్తుకు అచ్చు గుర్తు చేర్చరు. నేటి రాతలో ఒకే ఒక్క వైరుధ్యం కనిపిస్తున్నది. తప్పు, ఒప్పు అనే విధంగా పొవత్తుకు ఉ అనే అచ్చును చేరుస్తున్నారు. కాని అన్నిటిలాగే తప్పు; ఒప్పు అనికూడా రాయవచ్చు.

BRAOU

నిఘంటువులో మాటలు వెతికేటప్పుడు ఈ అక్షర నిర్మాణం, ధ్వనుల వరస అక్షరమాలలో వీటి వరస చూసుకోవలసిన అవసరం ఉంది. వత్తుల వరస వర్ణమాలలో వరసనుబట్టే ఉంటుంది. కొన్ని భేదాలు కొద్దిసేపట్లోనే తెలుసుకుందాం. వర్ణమాలలో <u>అరసున్న</u> అని ఒకటుంది. దానికి నేటి భాషలో రాసే అవసరంరాదు. మాండలికంగా ఆను నాసిక ఉచ్చారణను చూపించటానికి <u>సింహాచలమ్</u> అనే విధంగా రాస్తున్నారు. ఇట్లాంటి మాటలు, ఈ అక్షర క్రమమూ నిఘంటువులలో ఉండవు.

ఉచ్చారణ లేకపోయినా ఈ అరసున్నను ప్రాచీన కావ్య భాషలో రాసేవారు. ఆవిధంగా రాయటం ఆ భాషా రచనలో ఒక నియమంగా ఉండేది, రాతలో చూపించటమే తప్ప ఉచ్చారణ లేకపోవటం వల్ల ఆ భాషారచన చేసే వారికి ఇదొక పెద్ద భారంగా ఉండేది అప్పకవీయం వంటి ఛందోగ్రంథాలు అరసున్న ఉన్నమాటల పట్టికలు పద్యాల్లో ఇచ్చేవారు. 'శబ్ద రత్నాకరము' అనే మంచి నిఘంటువు తయారు చేసిన బహుజనపల్లి సీతారామాచార్యులుగారు 'అర్ధ చంద్రోదయము' అనే పేరుతో ఒక పట్టిక తయారు చేసి అచ్చువేశారు. (ఇప్పుడిది దొరకదు.) ఈ అరసున్న ఉన్నమాటలను జ్ఞాపకం పెట్టుకో వలసిందే తప్పవేరే మార్గంలేదు. కొన్ని మాటల్లో అరసున్నా ఉందా లేదా అని పండితులు చర్చలు చేసేవారు. ఫలానా మాట సబిందుకమా ? (అరసున్నాతో ఉందా?) నిర్బిందుకమా? (అరసున్నాలేదా ?) అనేచర్చ ఒకకాలపు పండితులకు చక్కని విద్యా వినోద కాలక్షేపం. ఈనాడు ఇట్లాంటి చర్చలు చేసేవారు తగ్గి పోయారు. అరసున్నాలు రాసేవాళ్లుకూడా ఎక్కడో అరుదుగా కనపడతారు (బండి'ఱ' పరిస్థితికూడా ఇదే). అయితే మన నిఘంటువులు చాలావరకు కావ్యభాష నేర్చుకోటానికి ఉద్దేశించినవి కాబట్టి ఈ అరసున్నలు, బండిఱాలు కనపడతాయి. ఆమాటలన్నీ మీరుగుర్తుపెట్టుకోక పోయినా, వాటిని మీరు మీ రచనలో వాడకపోయినా (ఈ కోర్సులో మేమూ, మీరూకూడా వాడటంలేదు) ప్రాచీన భాషలో వాడేవారనీ, వాటికి కావ్యభాషలో కూడాఉచ్చారణ లేదనీ, రాతలో చూపించే గుర్తులు మాత్రమేననీ తెలుసుకోవటం అవసరం. అచ్చులలో కనిపించే ప్రాచీన గ్రంథాల్లో ఆగుర్తు లున్నాయి కాబట్టి, నిఘంటువుల్లో కూడా ఇవి కనిపిస్తున్నాయి కాబట్టి, ఈ మాత్రమయినా మీరు తెలుసు కోవాలి.

BRAOU

ఇక నిఘంటువుల్లో అక్షరక్రమం గురించి తెలుసుకుందాం:

హల్లులు, వత్తులు వర్ణమాలలో రాసిన క్రమంలోనే నిఘంటువుల్లో పాటించినా కొన్ని విశేషాలు గమనించాలి.

1. <u>ల ళ లు</u> ఒకేచోట, ర, ఱ లు ఒకేచోట వస్తాయి. వరస <u>య, ర, ఱ, ల, ళ</u> అని ఉంటుంది.

2. క్ష కారాన్ని ప్రత్యేకాక్షరంగా గుర్తించినా నిఘంటువులో <u>క</u> కారం తరువాతనే వస్తుంది.

3. ప్రతి అక్షరంలోనూ సున్నతో వచ్చేమాటల తరవాతనే సున్నాలేని మాటలు వస్తాయి.

   [ఆంధ్రా యూనివర్సిటీవారి వ్యుత్పత్తి పదకోశంలో వరసవేరు. అది తరవాత తెలుసుకోండి. లేక మీ సలహాదారును సంప్రదించండి]

4. విసర్గతో వచ్చే మాటలు అన్నిటికన్నా ముందు, తరవాత అరసున్న మాటలు, ఆ తరవాత నిండుసున్న మాటలు వస్తాయి.

5. ఇప్పటి రాతలో చివర సున్న ఉన్న మాటలు ము అని ఉన్నట్టుగా భావించాలి.

6. ఇప్పటి భాషలో స్వరూపం మారిన మాటల పూర్వరూపం తెలుసుకోవాలి. <u>రాత</u> అనే దాని పూర్వరూపం <u>వ్రాత.</u>

7. క్రియాధాతువులు ప్రాచీన వ్యాకరణాల్లో ఇచ్చిన సాంప్రదాయిక రూపాల్లోనే నిఘంటువుల్లో దొరుకుతాయి. అగు, చేయు, పోవు, వచ్చు, వ్రాయు మొదలైనవి.

ఈ విశేషాలు గుర్తుంచుకొని నిఘంటువు చూడటం అలవాటు చేసుకొంటే మిగతా వివరాలు వాటంతటవే తెలుస్తాయి. కొన్ని నిఘంటువుల్లో ఈ ఏర్పాట్లలో కొద్దిపాటి తేడాలున్నా వాటిని అలవాటుమీద తెలుసుకోటం కష్టం కాదు.

## నిఘంటువుల్లో దొరికే సమాచారం

నిఘంటువుల్లో అర్థాలు దొరుకుతాయి. ఈ అర్థాలు ప్రధానంగా పర్యాయ పదాల రూపంలో ఉంటాయి. ఒక్కొసారి వాక్యాలరూపంలో ఉంటాయి.

పై రెండురకాల పద్ధతులు తెలుగు నిఘంటువుల్లో కనిపిస్తాయి.

ఉదాహరణకు సూ. రా. నిఘంటువులో ఈకింది అర్థాలు చూడండి:

అపర్ణ - సం. వి. ఆ. స్త్రీ తపస్సు చేయునపుడు ఆకులు కూడ తిననిది, పార్వతి, దుర్గ

అభివ్యాపించు,

సం. స. క్రి వ్యాపించు, ఆక్రమించు

కొన్ని మాటల అర్థాలు బాగా వేరయినప్పుడు, ఆ మాటలు వేరు వేరు మూలాలనుంచి వచ్చినప్పుడు అవి వేరు వేరు మాటలని సూచించటానికి సంఖ్యలు వాడుతారు.

సూ. రా. నిఘంటువులోని ఈ మాటలు చూడండి:

ఈగు 1 = నీగు స. క్రి. (క. నీగు. త. నీంగు) ౧. తొలగించు, పోగొట్టు ౨. ఋణము వగ. మొ॥) తీర్చు.

ఈగు 2 అ. క్రి. ౧ చొచ్చు, ప్రవేశించు. ౨. దాగు.

ఈదు 1 అ. క్రి. (క. ఈజు, ఈసు. త. నీన్దు) ఈతకొట్టు, ఈదులాడు.

ఈదు 2 వి. ఈత చెట్టు.

ఈదు 3 వి. చల్లదనము, తడి.

అర్థాలతోపాటు కావ్యప్రయోగాలు చూపించటం ప్రసిద్ధ నిఘంటువుల అలవాటు, సూ. రా. నిఘంటువులో ఇట్లాంటి ప్రయోగాలు ఎక్కువగా దొరుకుతాయి. శబ్దరత్నాకరము, బ్రౌణ్య నిఘంటువు కూడా కావ్య ప్రయోగాలు ఇస్తాయి. సూ. రా. నిఘంటువు కొద్దిగానూ, బ్రౌణ్య నిఘంటువు ఎక్కువగానూ నేటి వాడుకలో ఉదాహరణలు ఇచ్చినాయి.

BRAOU

తెలుగు మాటల్లో తత్సమ, తద్భవ, దేశ్య విభాగం ఉంది. సంస్కృత సమాలను, తత్సమాలను సంస్కృతం మాటలు ఎక్కువగా మారి తెలుగులోకి వస్తే తద్భవాలని, తెలుగు మాటలయితే దేశ్యాలని పిలుస్తారు. ఇతర భాషాపదాలను అన్యదేశ్యాలనీ అంటారు. హిందుస్తానీ, యూరపియన్ భాషా పదాలను అన్యదేశ్యాలనీ అంటారు. ఈ సమాచారం కూడా నిఘంటువులో దొరుకుతుంది.

సం = తత్సమం, త. తద్భవం, దే. దేశ్యం.

హిం = హిందుస్తానీ, ఇం = ఇంగ్లీషు అనీ వాడుతారు.

సంస్కృత పదాలకు అంతంలో ఏ అచ్చు ఉండేదీ, ఆ పదానికి లింగం ఏమిటి అనే సమాచారం కూడా దొరుకుతుంది.

"ఆ. స్త్రీ. = ఆకారంత స్త్రీ లింగం.

అ పు. = అకారంత పుంలింగం

అ. న. = అకారాంత నపుంసక లింగం" అని పొడి గుర్తులతో సూచిస్తారు.

నామాలయితే వి = విశేష్యం, అనీ విశేషణాలయితే విశ. అనీ, అవ్యయాలయితే అవ్య. అనీ చూపిస్తారు, క్రియలను క్రి. అనే గుర్తుతో చూపిస్తారు, అ. క్రి. అంటే అకర్మక క్రియ ; స. క్రి అంటే సకర్మక క్రియ.

[ ఈ మాటల అర్థాలకు మీ సలహాదారుని సంప్రదించండి. ]

ప్రతి నిఘంటువులోనూ వాడిన సంకేతాలకు వివరణ ఉంటుంది. ఆ వివరణను జాగ్రత్తగా చూచుకోవాలి. లోప విభక్తికము. అలోప విభక్తికము (లోప. అలో,) వంటి వ్యాకరణ సమాచారంకూడా నిఘంటువుల్లో దొరుకుతుంది. నిఘంటువును ఒకరోజు ఉపయోగిస్తే సంకేతాలన్నీ తెలుసుకోవచ్చు.

ఇంగ్లీషువారు ఒకమాట అక్షరక్రమం (స్పెల్లింగు) తెలుసుకోటానికి కూడా నిఘంటువు చూసుకుంటారు. తెలుగులో అక్షరక్రమ సమస్యలు ( Spelling Problems ) అంత దారుణంగా లేవు కాబట్టి ఈ అవసరం తక్కువ.

ఇకనుంచి ప్రతి పాఠానికీ నిఘంటువు సహాయం పొందండి. ప్రతిరోజూ ఒకసారయినా నిఘంటువులో మాటలు వెతకండి. నిఘంటువు ప్రయోజనం తెలుసుకో గలుగుతారు. అంతేకాదు పొద్దున్నే వార్తా పత్రిక చూడటం వంటి అలవాటుగా కూడా మారుతుంది.

## అభ్యాసం [చదివేపని]

ఈ కింద ఇచ్చిన రెండు వ్యాసాలు చదవండి. రెండూ ఒకరు రాసినవే

తెలుగులో భావ కవిత్వం పేరిట కాల్పనిక కవితాధోరణి 1920-1940 సంవత్సరాల మధ్య వ్యాప్తి చెందింది. భావ కవిత్వానికి బలమైన సంకేతం దేవులపల్లి కృష్ణశాస్త్రి గారు (1897-1980). ఆయన పేరు భావ కవిత్వానికి పర్యాయ పదమయింది. కృష్ణశాస్త్రి గారి పద్యాలు, గేయాలు చదవని ఆధునిక కవితాభిమానులుండరు. కృష్ణపక్షము, ప్రవాసము, ఊర్వశి, వీరి ముఖ్యమైన కవితా సంకలనాలు. మూడు కలిపి కృష్ణశాస్త్రి కృతులుగా చాలా రోజులనుంచి ప్రచారంలో ఉన్నాయి. ఆ తరవాత పల్లకి అనే కవితా సంపుటి మేఘమాల అనే సినిమా పాటల సంపుటి కూడా వచ్చినాయి. ఇటీవలే ఆయన రచనలన్నీ కొన్ని సంపుటాలుగా వెలువడుతున్నాయి.

కృష్ణశాస్త్రిగారి గేయాలూ, పద్యాలూ ప్రచారమైనంతగా ఆయన వచన రచనలు ప్రచారం కాలేదు. కాని మంచి తెలుగు వచనం రాసిన రచయితల్లో కృష్ణశాస్త్రి గారొకరు. ఆయన కవిత్వంలో లాగే వచనంలో కూడా కాల్పనిక ధోరణి కనిపిస్తుంది. కృష్ణశాస్త్రిగారి శైలిలో ఆత్మీయతా గుణం కనిపిస్తుంది. ఆయన శైలి ఎదటి వారితో మాట్లాడి నట్లు ఆత్మీయంగా పలకరించినట్లు ఉంటుంది. ఆయన గేయాలలో లాగే వచనంలోకూడా లాలిత్యం, మాధుర్యం ప్రసన్నత కనిపిస్తాయి. ఆయన మాటలకు 'రంగు, రుచి, వాసన' ఉంటాయి.

BRAOU

కందుకూరి వీరేశలింగం గారు (1848-1919) తెలుగు దేశపు సాంస్కృతిక పునరుజ్జీవనానికి కృషిచేసిన మహాపురుషుడు. సాంఘిక దురాచారాలకు వ్యతిరేకంగా జీవితంలోనూ సాహిత్యంలోనూ పోరాడిన యోధుడు. స్త్రీల స్థితిని మెరుగు పరచటానికి తనవంతు ప్రయత్నం చేసిన మానవతా మూర్తి. సాహిత్య ప్రయోజనాన్ని గుర్తించిన రచయిత. కొత్త సాహిత్య రూపాలను తెలుగులో ప్రవేశపెట్టిన సాహిత్య స్రష్ట. ఆయనకు కేవలం సహకారం అందించటమే కాక ఉద్యమ కృషిలో భాగం పంచుకున్నారు రాజ్యలక్ష్మమ్మగారు. వారి జీవిత చరిత్రలు చదివి సాంఘిక సేవా స్ఫూర్తిని, చైతన్యాన్ని పొందటం తెలుగు వారి కర్తవ్యం.

ఆంధ్రదేశము

# రాజ్యలక్ష్మమ్మగారు

## దేవులపల్లి కృష్ణశాస్త్రి

నవీనాంధ్రదేశ చరిత్ర ఎవరేని వ్రాస్తే దానిని పంతులు గారికి అంకితం చేసి తీరాలి-అని మా తమ్ముడు అన్నాడు.

అలాగకాదు : రాజ్యలక్ష్మమ్మగారికే కృతి ఇయ్యాలి. సూక్ష్మదర్శివైన నీ వలా అడగడం భావ్యంగాలేదు- అన్నాను నేను.

మన దేశంలో స్త్రీలు మూడు రకాలుగా ఉన్నారు : విద్యావివేకాలు లేకో, పాశ్చాత్య సంఘజీవితంలోని పైపూతలే పట్టించుకుని ఉత్తమ సంస్కారం అలవరచుకోలేని వెకిలితనం వల్లనో కార్యరంగంలో దూకే మగవాళ్ళ కాళ్ళకి కన్నెతాడులా అడ్డుపడే జాతి ఒకటి '' అది జనకుండు. పిమ్మట నధిపు, దపల తనయుడును శాసకుల్ గదా వనిత'' కని తన పని నోరు మూసుకుని కాళ్ళొత్తుకుంటూ కూడా కూడా రావడమే అనే రకం రెండోది. ''నేను అవనతముస్తకనై అనుసరించేదాన్ని కాను; తోడు నీడగా ప్రయాణం చేసేదాన్ని; అంతేకాదు, నవకవి వ్రాసినట్లు, 'తోవ చదునుచేసేదాన్ని', అసలు ఈ అనంతప్రస్థానం జైత్రయాత్రగా జేగీయమానంగా సాగించడానికి పటిమా, ప్రతిభా ఇచ్చేదాన్ని; వాకిలీ వాడా, సమాజమూ జాతీ సంస్కరించేదాన్ని'' అని సరస్వతై, లక్ష్మియై, సతియై విజ్ఞాన ప్రేమైశ్వర్య సంగమస్థానము, ప్రయాగ ప్రతిగ్రహమూ అనే శ్రేణి మూడోది.

BRAOU

రాజ్యలక్ష్మమ్మగారు మూడవ రకంలోవారు; రాజ్యలక్ష్మమ్మగారు బ్రాహ్మ మహిళ. మానవ సమాజంలో యథార్థ 'బ్రాహ్మ' మూడవ తరగతికే ఎలాగ చెందాలో, అతని జీవితంలో యథార్థ బ్రాహ్మ మహిళ అలాగే నిలవాలి. పంతులుగారి 'తోవ చదునుచేసిన దా తల్లి. పంతులుగారి దుర్వార కర్మ వాహినికి కాలువలు తవ్వి గట్లను కట్టిన దా వీరనారి తనుక నవీనాంధ్ర చరిత్ర ఆమెకే అంకితం చెయ్యాలన్నాను.

పోనీ! ఇంకోలాగ అను. వాగర్థాలని విడదీయలేనట్లు వారినీ విడదీయలేము కనుక, ఇద్దరికీ కృతి ఇస్తానను, నిజానికి ఏ మహాపురుషుడు ఉత్తమ మహిళా ప్రభావం లేకుండా లోకోత్తరకార్యాలు చేశాడయ్యా ?

ఏభై సంవత్సరాల క్రితం స్థూల దృగావరణం దాటి జ్యోతిర్లోకంలో విలీనమైన ఆత్మేశ్వరిని అంతరాంతరాకాశంలో ధ్రువతారలాగ ప్రతిష్ఠించుకుని, మొదట వియోగక్లేశంగా ఉన్న అనుభవాన్ని వివేకంవల్లా, విజ్ఞాన పటిమవల్లా విమల ప్రేమానందముగా మెరుగు పెట్టి, తలపుతలపునా, పలుకు పలుకునా అడుగడుగునా ఆ సహచరీమండలాన్ని పలకరిస్తూ వస్తూ ఉన్న తపస్వి, మహర్షి కనుక మన 'గురుదేవు'డైన బాబయ్యగారు అర్థశతాబ్ది నుంచి ఆంధ్రయువ మనస్సునకు ఆశయ పక్షాలు తొడుగుతున్నారు; ఆంధ్రయువ హృదయాన్ని కరిగించి కావ్యాలుగా జేస్తున్నారు. రవీంద్రుడు 'Lover's Gift and Crossing'లో అంటాడు: ఇప్పుడు నీవు వెళ్ళిపోయి నాలోనికి వచ్చావు; ఇప్పుడు నేను సమగ్ర సుందరంగా ఆయాను' అని !

ద్విజేంద్రలాల్ రాయల 'చంద్రగుప్త' నాటకంలో చాణక్యదేవుడు పూనుకున్న కార్యం అసామాన్యమైనది. శిథిలమై, నీరసమై, స్వార్థపంకిలమైన నందసామ్రాజ్యాన్ని విధ్వంసం చేసి, జీవవంతమై, స్వచ్ఛసుందరమై మానవ శ్రేయోదాయకమైన భారతలోకం నిర్మించాలి. అప్పుడు ఆయన సప్తమరుత్తులూ జెబ్బా జెబ్బా కలిపినట్టు, త్రేతాగ్నులూ కౌగిలించుకున్నట్టు, ద్వాదశార్కులూ పంక్తి తీర్చినట్టు అనివార్యశక్తితో సాక్షాత్కరిస్తాడు. ఆ చాణక్య దేవుడు భావించే ముందు, పలికే ముందు, పాలించే ముందు ఇట్టే ఒక్కసారి కన్నుమూసో, అట్లే ఒక్కసారి కన్ను పూర్తిగా తెరిచో ''నీవేమంటావు?'' అని ఎవరినో అడిగి, ఆత్మేశ్వరి ఆలోచనకోసమో, ఆజ్ఞకోసమో నిరీక్షిస్తుంటాడు ఆ ఆలోచనా, ఆ ఆజ్ఞా లేనిదే అతడు నంద సామ్రాజ్య విధ్వంసి అయి ఉండును కాని, భారత సామ్రాజ్య ప్రతిష్ఠాపనాచార్యుడు కాలేడు.

పంతులుగారు తన జీవితంలో మొదటి అరవై రెండు ఏళ్లూఒకలాగా, తర్వాత పది సంవత్సరాలూ ఒక లాగా-అలాగే నడిపింపబడ్డారు.

అసలు పంతులుగారికీ, ప్రచండ చాణక్యునికీ కొంత పోలిక ఉంది కదూ ? నందరాజ్యం అంటే అంధకారం, అన్యాయం అనుకో-అనాచారం, అవివేకం అనుకో.

ఉత్తమ సతీ సహవాసం అచేతన పదార్థాన్ని చైతన్యవంతం చెయ్యడమేకాక, పశువుని మానవుణ్ణి చేస్తుంది. మానవుణ్ణి దివ్యుణ్ణి చేస్తుంది. ఇంకో చిత్రం – మానవత్వానికి విలక్షణమైన, అతీతమైన ఒక ప్రబల (Superhuman) శక్తిగా మారిపోయినవాణ్ణి మళ్ళీ మధుర శాంతమైన మానవలోకంలోకి దింపుతుంది. ''ఎప్పుడైన చిత్తోద్రేకము కలిగినప్పుడు నే నెవ్వరిని లక్ష్యము చేయక ముందు విచారింపక తొందరపడి మత్తగజమువలె సంచరింప జూచినప్పుడు తానంకుశమయి నన్ను మరలించియుక్త సమయమున శాంతవాక్య సుధారసముతో నన్నప్పుడు మరల స్వస్థచిత్తుని చేయుచుండును.'' అందుకనేపంతులుగారి కార్యాల్లో మేధా, హృదయమూ, తీక్ష్ణతా, తీయదనమూకూడా కనిపిస్తాయి.

స్త్రీని గూర్చి గీతం వ్రాస్తూ శాంతినికేతనంలో నుంచి పాశ్చాత్యలోకం దాకా కవి ఏ సందేశం విసిరాడో విన్నావా?

''సాయం సంధ్య శర్వరిగా కరిగిపోతూంది. సమర రంగంలో మహాయోధులు క్షతగాత్రులై ధూళి శయ్య మీద ఒరిగిపోయారు. రావమ్మా తల్లీ! నీ మధురహస్తంతో ప్రతివీరుని భిన్నగాత్రానికీ శిశిరాంజనం అవలేపనము చెయ్యి: మర్త్యుణ్ణి అమర్త్యుణ్ణిగా మార్చు.''

ప్రతి పురుషుని దైనందిన చర్యలో జీవితం పొడుగునా స్త్రీ చేసే పని నిరూపిస్తుంది ఈ గీతం. అంతేకాదు. ''పాశ్చాత్య లోకం పురుషుడు; ప్రాచి స్త్రీ.అది పౌరుషశాలు లొనర్చే లౌకిక సంగ్రామం; ఇది క్షమా తపస్సులు పరచే పరమపథం. అది పగలు; ఇది రాత్రి. పగలు పైకి చూస్తాం: రాత్రి లోపలున్నదాన్నే అన్వయించుకుంటాం. సర్వ మానవ కల్యాణానికి రెండూ ఎలాగ అవసరమో, ప్రతి గృహ వికాసానికీ, సమాజ శ్రేయానికీ, దేశకల్యాణానికి స్త్రీ పురుషుల సంపూర్ణ సమ్మేళనం అవసరం" అని ఈ గేయం ప్రబోధిస్తుంది.

అందుకనే పంతులుగారనగానే సింహంలాగ గర్జిస్తూ, ప్రభంజనంలాగ తరుముతూ, చక్రంలాగ ఖండించే ఒక శక్తి ఒక్కటే జ్ఞాపకింరాక, స్మితాననంతో, స్విన్న నేత్రాలతో, అభయహస్తంతో, అమృతభాండంతో ఆ మాతృమూర్తితానే ముందుకు వచ్చి సాక్షాత్కరిస్తుంది.

నేను కవిననుకో! ఏ మహా ముహూర్తమందో నా అంతర చక్షువు వికసించి వికసించి ఏ పారలౌకిక దృశ్యమో చూస్తుంది; నేను మీ లోకందాటి పైకిఎగిరిపోతాను; షెల్లీ భరతపక్షిలాగ 'Cloud of Fire' అయిపోతాను; ఇంక ఏ మహాకావ్యమో సృష్టిస్తాను. వెనకాతే నా వృద్ధజనని, నా జీవితేశ్వరి పొంచి ఉండి ఎన్నిసార్లు నా స్వర్ణ స్వప్నాలను భిన్న శకలాలుగాజేసి నన్ను ధూళిలోకి లాగలేదు? నేను జాతీయ యోధుడననుకో! పొంగిపోతూన్న విశాల వక్షం కింద నాట్యం జేస్తూన్న నా హృదయంలో జన్మభూమిని ప్రతిష్ఠించుకుని కారాగారాలకీ, కఠిన శాసనాలకీ ఆవల వెలిగే స్వాతంత్ర్య తేజస్సు నందుకుందామని బ్రతుకారా చాచే నా చేతుల్ని ఎన్నిసారులు నా యింటిలోని అబలా విలాపాలు కిందకి ఈడ్వలేదు? 'సర్వ మానవ సౌభ్రాత్రం' అంటాను. జాతి కుడ్యాల్లో ఊపిరాడదు నాకు, ఆర్యర్షులు తపస్సు అంటాను. అణాపైసల్లో పడి అడగిపోతాను. అంతకూ కారణం నా యిల్లు! మన సమాజము నీరసంగా ఉండే దానికి గృహదేవత అయిన స్త్రీ కారణం! నేను విద్యాబుద్ధుల్లో కొంత పెరిగితేనేమి? ఎగరవోతే నేమి? ఎప్పటి కప్పుడు రెక్కలు కత్తిరించే వారు ప్రక్క ప్రక్కనే ఉంటే !

ఈ స్థితి కంతకీ కారణం నేను, నా కుమారుడి మనోవికాసం కోసం, నా మనోవికాసం కోసం నేను పడే శ్రమలో వేయోవంతు నా భార్య సంస్కారానికి వినియోగించడంలేదు. నా భార్య సంస్కారిణి కావడంలేదు కనుక నేనూ ఏమీ చెయ్యలేను; నేను ఎంత తయారు చేసినా నా కుమారుడూ నా ఆశయానికి దూరు డౌతాడు. కనుక నాకేస్,

BRAOU

నేను చేసిన అల్పాల్ప కృషికేసీ, నేను చేయవలసిన కార్య ప్రణాళికకేసీ, నా యింటికేసీ ఒక్కసారి చూసి, పంతులు గారికేసీ, ఆ మహాపురుషుని లోకోత్తర జీవితంకేసీ, ఆయన చెయ్యకుండా వదిలిన పనులకేసీ, ఆయన యింటికేసీ ఒకసారి చూస్తే, దానిలో నిత్య జాగ్రన్నేత్రాలతో ఆయన్ని కనిపెడుతూ ఉన్న రాజ్యలక్ష్మమ్మగారి ముందు మనము ధూళిదాకా శిరస్సులు వంచుతాము. ఆధునికాంధ్ర కుటుంబాలు ఆదిమ దంపతులుగా స్వీకరింపవలసిన వారిద్దరికీ పదే పదే ప్రణమిల్లుతాము.

ఇంకొక విషయం: నాకు తెలుసును బ్రాహ్మధర్మం ద్వారా లభించిన ఆశయము సమగ్రమైనదని, సమస్త మానవ సమస్యలూ సముచితంగా పరిష్కారం అవడానికి నేటి మానవకోటికి దానికంటె వేరే సాధనం లేదనీ నాకు తెలుసును. పరమేశ్వర ప్రసాదంగా నాకు దొరికిన ఈ వరాన్ని ప్రతి నిముషమూ ఉపయోగించకుండా ఉంటే, నేను అహల్య లాగ శిలగా అయిపోవడమే కాక, మానవాభ్యుదయానికి తోడు పడకపోవడంవల్ల అడ్డుగానే వస్తున్నానని కూడా నాకు తెలుసు! ఇంత బాధ్యతాయుతమైన మహాసత్యాన్ని నా మనస్సులో ఎందుకు వెలిగించాడో కదా! నా ఒక్కనిలో ఇంత మహా కార్యం మొగ్గై, మోడై సఫలించుకపోతే ఎలాగ? ఈ వేదనే పంతులు గారి జీవితాన్నంతా ఊపిరాడని, ఎవరికీ ఊపి రాదనీయని కార్యోత్సవంగా చేసేసింది. ఎందరో పంతులుగారికి కోపం ఎక్కువంటారు. నేను కాదంటాను, అది కోపం కాదు; "అయ్యయ్యో నేను చెయ్యవలసిన పని ఎంత ఉందీ, ఎంత! ఎప్పుడు పిలుపు వస్తుందో! ఒక్కొక్కనికి బోధించి, నమ్మించి, బుజ్జగించి కార్యరంగంలోకి లాగుతూ ఉంటే ఏ ఒక్క పని అయినా ఎప్పటి కౌను? ఊరికే గర్జించి లేవగొట్టి వీపుమీద తట్టి పనికి పురమాయించడమే చేయాలి. అంతే!" అనే తొందర ( impatience ) అది. ఇలాంటి ప్రళయ జీవితాన్ని అనుసరించడమే కష్టం. కూడా కూడా రావడం కష్టతరం! నడిపించారు రాజ్యలక్ష్మమ్మగారు నెమ్మది నెమ్మదిగా! కాని ఇంకోటి కూడా జ్ఞాపకం ఉంచుకోవాలి. తన్ను నడిపించేటంత శక్తి గలదానినిగా మొదట ఆమెను తయారుచేసుకున్నారు కూడా పంతులుగారు! ఆయన మాట లివి:

"పదమూడవయేట కాపురమునకు వచ్చినది మొదలుకొని యంతకంతకు మా యిరువురకును పరస్పరానురాగము ప్రబలి యిద్దఱము నేకాభిప్రాయులము గా జొచ్చితిమి. ఆమెకు నాయందుఁ గుదిరిన యవ్యాజ ప్రేమనుబట్టి నాయెడల పరమ విశ్వాసము కలదయి నా తోడిదె లోకమని మంచి కయినను చెడ్డ కయినను సర్వమునందు నన్ననుసరించుచు భ్రమరకీట న్యాయమున నాచే నావలె మాఱిపోయెను. అందుచేత నే నే సాహస కార్యము నందడుగు పెట్టినను తాను వెనుకంజ వేయక, నన్ను వెనుక కీడ్వక తోడు సిద్ధయై యుండి ప్రోత్సాహవాక్యములు పలుకుచు నన్ను ముందుకు నడిపించు చుండెను"

BRAOU

ఈ వాక్యములు చదివాక అయినా కేవలము స్త్రీమీద నేరారోపణము నేను ఎలాగ చెయ్యగలను? నా దోషమే ద్విగుణీకృత మైపోతూంటే?

రాజ్యలక్ష్మమ్మగారి జీవితంలోని కొన్ని గాథలు: వీటిని చదివేముందు కొన్ని సంగతులు మాత్రం జ్ఞాపకం ఉంచుకోవాలి. అప్పుడు ఆంధ్రలోకంలో ఇంకా అంధయుగమే ననీ; ఒక వైపున శ్రావణ మేఘమూ, అమావాస్య రాత్రి కలసి ఆగ్రహిస్తూ ఆక్రోశిస్తూ ఉన్నట్టు ద్వేషం, కౌటిల్యం, మౌఢ్యం, క్రౌర్యం లాంటి సైనికుల్తో అంధకారం చుట్టూ ముంచెత్తుతూ ఉంటే తానూ తనతో ఏ ఒకరిద్దరూనో పంతులుగారనీ; ఇప్పటికీ ఆ సైన్యంలో ఏ సామాన్య యోధు డొక్కడితో నైనా మనము పూర్తిగా యుద్ధం చెయ్యలేక పోతున్నామనీ; అప్పుడు ఆ సంగ్రామ మధ్యాన్ని ఒక్కసారీ భర్తను వదలకుండా క్షమాద్యుత మయిన హృదయంతో ఉల్లాసంగా రాజ్యలక్ష్మమ్మ గారనీ!

వితంతు వివాహ ప్రయత్నాలు ప్రారంభించిన రోజులవి ఆంధ్రదేశ మంతా-ముఖ్యంగా రాజమహేంద్రవరము - అట్టుడికి పోతూంది. బంధువులూ, మిత్రులూ, పూర్వాచార పరాయణులూ, అశేషజనమూ వద్దన్నారు; జాగ్రత్తన్నారు ఆయన హిమాలయం! కదపలేక పోయారు. రాజ్య లక్ష్మమ్మగారిని పట్టుకున్నారు. లాభము లేక పోయింది. ఆమెను ప్రేమించి పెంచిన మేనమామా, బంధువులూ వచ్చారు; చుట్టుముట్టారు, గొల్లుమన్నారు; మరణాన్ని మించిన ఘోరవిపత్తు వచ్చిం దన్నారు; బెదిరించారు; ఏడిచారు. ఆమె మేరువు: చలించలేదు. అప్పుడామె అన్నమాటల్లో ఎంత గొప్పతనం ఉందో గ్రహించండి. భర్తతోడిదే లోకం అనీ, ఆయన్ని వదిలితే నేను ఏమి అయిపోననీ, మంచి అయినా చెడ్డ అయినా తప్పదనీ అని ఊరుకో లేదు. "ఆయన పూనుకున్న పని చాలా గొప్పది. నేను వద్దని చెప్పడ మేమిటి? ఎన్ని కష్టాలు వచ్చినా సహాయం చేస్తా నసలు." ఎప్పుడూ పంతులుగారి కళ్ళు బహిరంగంగా చెమ్మగిల్లినట్లు ఎవ్వరూ చెప్పలేదు. ఆ రోజున ఆయన కపోలాలు తడిసి ఉంటాయి. భాద్రపదమునాటి వేయి గౌతములు లోపలకు పొర్లుకుని వస్తే ఆయన హృదయం మాతృహృదయం లాగ ఆంధ్రదేశమంత విశాలమై ఉంటుంది.

ఆ రోజుల్లో ధూమ శకటాలు లేవు. రాజమహేంద్రవరానికి రాకపోకలకు గంజాం జిల్లా కాశ్మీర మంత దూరంగా ఉండేవి. అప్పుడు అంధ దినాలు కూడా కనుక ఎంత సాహసవంతురాలయిన స్త్రీ కయినా గడపదాటడమే కాశీయాత్ర. రాజమహేంద్రవరం రేగిపోతూంది; ఆంధ్రదేశ మంత అంటుకుంది. స్త్రీ పునర్వివాహోత్సవాలు ప్రారంభ మయాయి. ఎక్కడి గంజాం? ఎక్కడి ఆస్కా? ఇద్దరు బ్రాహ్మణ బాల వితంతువులు అక్కడినుంచి బయలుదేరారు- గౌతమీ తీరానికి! కాలినడక! చేతిలో కాసయినా లేదు! బంధు మిత్రుల్ని ఎలాగ ఏమరించారో తెలియదు-విజయనగరం చేరారు. ఒక అమె మనస్సు చెదిరిపోయింది! పాపం ఆ తల్లి ఇంక కదలలేక పోయింది. రెండో బాలిక సామాన్యు రాలు కాదు. వెనక్కి 'పూర్వ జీవితం కేసి చూసుకుంది. తన చేతి రాగి పట్టెలలో బంగారం అమ్మింది' మళ్ళీ ప్రయాణం - కాలినడకనూ, మోటుబండ్లమీదను; ఆమె వారణాశి దక్షిణాన్ని ఉంది, పతిత త్రాణానికి బద్ధకంకణు డైన ఆ మహావీరేశ్వరు డెక్కడుంటే అక్కడికే ప్రణయ యాత్రికుల ప్రస్థానం!

ఇంక ఇక్కడ రాజమహేంద్రవరంలో పంతులుగారు కట్టించిన పుర మందిరం తెరుస్తా రా రోజున. రాజ్య లక్ష్మమ్మగారు మిత్రురాండ్రతో మహోత్సాహంతో చూడ్డానికి బయలు దేరుతున్నారు. మండు వేసంగి, మధ్యాహ్నం రెండు గంటలు. మాసి మాసి, చివికి, చిగిరిపోయిన కట్టుబట్టతో, మార్గా యాసమువల్ల బడలి సడలి తుప్పింది పెందూళితో వికృతంగా ఉన్న శరీరంతో ఆ యువతి గుమ్మానికి ఎదురుగా తోచింది. విశ్వ శైశవావస్థలో ఈ మానవ స్వరూపాన అవతరించి యుగయుగాల మహావరణాలు దాటి వస్తూ, యాత్రాపథముమీద పతనాభ్యుదయాలతో పడుతూ లేస్తూ, లోకశాంతికీ, పావిత్ర్యానికీ, ఆనందానికీ, ముక్తికీ వేంచేసిన ప్రణయభిక్షుకి, ప్రణయధాత్రి, ఉత్తమసతి, ఉజ్జ్వల మాతృమూర్తి నిండారా తెరచుకున్న తన హృదయాన్ని తన కళ్ళల్లో మెరపిస్తూ బతు కంతా చాచి తన యింటి మొగసాల సాక్షాత్కరించినప్పుడు మాతృశ్రీ రాజ్యలక్ష్మమ్మగారి మనోవీధిలో ఏ శరజ్జ్యోత్స్న అలముకొని పోయిందో, హృదయావకాశంలో ఏ పాల కడలి పరవళ్ళు త్రొక్కిందో!

ఆమె పురమందిర ప్రయాణం మానుకున్నారు. ఆమెను స్నానం చేయించడం, సుందర వస్త్రములు ధరింప చేయడం, పొరుగింటికి పోయి అన్నము మున్నగునవి తెచ్చి భుజింపజేయడం - ఇంతలో పంతులుగారు వస్తున్నారు! నవ్వు మొగంతో వీధి గుమ్మంవద్ద నిలబడి, ఆయనకి దగ్గరగా వచ్చి, మీ కొక శుభవార్త చెప్తా నని లోపలికి ఆయన్ని తీసుకుని వెళ్ళి ఆ ప్రేమాతిథిని చూపించారట! అయన హృదయం అప్పుడు ఏమయిందో!

BRAOU

అనంతరం ఆంధ్రప్రముఖులు, భక్తుడు, కవి ఆదిపూడి సోమనాథరావుగారి జీవితేశ్వరి ఆ బాలిక! సుప్రసిద్ధ విదుషీమణి తెలికిచెర్ల వసుంధరాదేవిగారి జనయిత్రి.

పాపం! అక్కడ విజయనగరంలో ఆగిపోయిన ధీరురాలు ఏమయిందో! అబ్బ! శ్రీచరణ స్పర్శలేని ఎందరు శిలాజీవులు! ఎక్క డెక్కడ ఉండి పోయారో! వారినికూడా వదిలెయ్యలేదు రాజ్యలక్ష్మమ్మగారి అనురాగము. ఇంద్రియ దౌర్బల్యము చేతనో, వంచకుల మోసము చేతనో అంధకూపంలో పడి పోయిన అనాథ యువతులకోసం 'పతిత యువతీ రక్షణశాల' అని వారి యింటి కెదురుగా పెట్టి, వారికి చదువు చెప్పడం, వారి చీకటి హృదయాల్లో అమృత కాంతులు పోయడం, వారిని మానవతులుగా చేసి రాజమార్గముమీద వదలడం! ఆమె జీవితకాలంలో అయిదుగుర్ని అలా రక్షించారట! ముగ్గురికి తర్వాత వివాహాలు అయ్యాయి! తక్కిన యిద్దంకీ శిశు హత్యా దోషము రాకుండా కాపాడారట! గర్భవతియై వచ్చిన యొక బ్రాహ్మణ వితంతువుని ప్రసవవైద్యశాలకి పంపారట! ఆమె అక్కడ తాను గన్న పిల్లను వైద్యశాలాధికారుల కిచ్చి వెళ్ళిపోబోతూంటే, రాజ్యలక్ష్మమ్మగారు పరుగెత్తుకుని వెళ్ళి, తల్లినీ పిల్లనూ తెచ్చితనయింట ఉంచి పోషిస్తున్నారు-ఇంతలో తన బిడ్డనువారి యింట వదలి తన వృద్ధమాత తనకోసం వస్తే ఆమెతో గంజాంమండలంలో తన బంధువులతో చేరా లని ఆ బ్రాహ్మణి వెళ్ళిపోయింది. తనలో జననీ ప్రేమ ఉంటే ఆ వృద్ధురాలు ఎలాగ తీసుకొని వెళ్ళిందో! రాజ్యలక్ష్మమ్మ గారికి ఆ బిడ్డ కన్నకూతు రయింది. ప్రేమావతి అని పేరు పెట్టుకున్నారట! ప్రేమావతి మన కందరకూ చెల్లెలు!

తమో వాహినిలో పడి మునిగిపోలేక గట్టుమీద ఒక పాదము పెట్టి, చలిత హస్తాన్ని అవలంబము కోసం చాచే వారిని పంతులుగారి అభయహస్తం పైకి లాగి ఆనంద జగత్తులో పడేసింది. వైతరణీ వాహినిలో మునిగి పోతున్నా వేద నన్న మాటలేక పాతాళ గర్భంలోకి పరిగెత్తుతూన్న వారిని రెండు దయా కరాల్తోనూ పట్టుకుని మాతృ వక్షానికి అదుముకుని, తీరాన్ని నిలబెట్టి దూరాన్ని ఉన్న స్వర్గాంగణాన్ని తమ నిర్వ్యాక దృఢహస్తం చాపి చూపెట్టిన వారు రాజ్యలక్ష్మమ్మగారు!

ఇంకో గాథ: భార్యాభర్త లిద్దరూ పురమందిరం ప్రక్కనుంచి వైద్యశాలవైపు వెడుతున్నారు. దారిలో ఒక పెద్దగుంపు. దాని మధ్య ఇద్దరు వృద్ధస్త్రీలు చేయిపట్టుకొని తీసుకొస్తూంటే బీటలు బీటలుగా చిదికిపోయిన కపోలముతో, రక్తార్ద్రంగా ఉన్న వస్త్రంతో, విగత కేశ పాశముతో ఒక వేశ్యాంగన ఉంది. బండిలోనుంచి "ఏమి టిది?" అన్నారు రాజ్యలక్ష్మమ్మగారు. "అలాగ అవవలసిందే! జారత్వ శంకచేత దౌడ బద్దలు కొట్టాడు విటుడు! బోగంది. వ్యభిచారిణి" అన్నాడు ప్రక్కనే నిలబడిన ఒక పెద్ద మనిషి! రాజ్యలక్ష్మమ్మగారు వెంటనే భర్తకేసి తిరిగారు. "ఏమండీ! వీరి స్థితిని బాగుచెయ్యడానికి మన మేదైనా చెయ్యాలండీ!" అన్నారు. "వృద్ధత్వం చేత అశక్తుల మయ్యాం. మన మిప్పుడు ఏం చెయ్యగలం!" అని ఆ ఏక వీరుడే అప్పుడు అంటే, "ఎందుకండీ సందేహం? అధైర్యపడకూడదు. చేయించే దేవుడు సహాయంగా ఉన్నాడు. వెనక తీయగూడదు" అన్నారు ఆమె!

బోగంవాళ్ళట! వ్యభిచారిణులట! నా ఒళ్ళు కంపర మెత్తుతుంది. నేనా మాట అనలేను. అంటే నాగుండె దహించుకుపోతుంది. ఉత్తమ సంస్కారంతో, వేనవేల సంవత్సరాల విజ్ఞానంతో, పరమ పవిత్రమైన ఆర్యభూమిలో, హిందూ సంఘంలో ఆ "సంస్థ" ఆలా నిలబెట్టడంచేత నేనే ఆ కపోలాన్ని చిదుకకొట్టినవాణ్ణి! నేను అలాగ అనగలనా? తలపులో, పలుకులో, పనిలో గడియ గడియకూ అంధకారమూ, కాలుష్యమూ, ద్వేషమూ నింపుతూ పది అడుగులు ముందుకు జీవితయాత్ర సాగించడానికి బదులు పాతిక అడుగులు వెనక్కి జారిపోతున్నవాణ్ణి! నేను అలాగ వేలెత్తి చూపగలనా?

నా దృష్టిలో వెలుగుంటే, నా మనస్సులో విజ్ఞానం ఉంటే, నా హృదయంలో స్వచ్ఛత ఉంటే, హేమంత నిశీథంలో వసంత ప్రభాతం చూడగల విశ్వాసమే ఉంటే, ఆ ఛిన్న కపోలలో, ఆ స్విన్న నేత్రలో, ఆజీర్ణ వసనలో

నాశరీరాన్ని తన చేతుల్తో లాగే నా జీవితాన్ని తన ప్రేమతో శుభ్ర సుందరంగా కడిగిన మాతృమూర్తిని చూడగలిగి ఉందును కదా-నేను అలాగ అనగలనా? ధర్మ హృదయంతో చూడు-ఆ అవమానిత భారత నారీమణి పాంచాలీదేవి వలె సాక్షాత్కరిస్తుంది. ద్వేషభావంతో చూడు-ఆ మానవతి భోగోపకరణ మైన వ్యభిచారిణి వలె గోచరిస్తుంది. నాడామె చెక్కిలి చితికి నప్పుడే మన బ్రతుకు కూడా స్వార్థంవల్ల భ్రష్ట లయింది.

BRAOU

దయా ప్రేమలతో తడిసిన హృదయాలకి సరిహద్దు లుండవు. అబలలంటేనే కాదు రాజ్యలక్ష్మమ్మగారు కరిగిపోవడం. దాహంచేత నాలుక ఇవతలికి చాపి వగరుస్తూ ఉన్నట్లుంటుండే సొమ్మసిలిన జంతువులాగ వేసంగి మధ్యాహ్నం-అటువంటి సమయాన పంచముడు ఒకడు పంతులుగారి యింటిముందు వీథిలో స్పృహ తప్పి పడిపోయి ఉన్నాడు. ఆయన కళాశాలకి వెళ్ళారు. ఇరుగు పొరుగు వారినీ, దారిన పోయే వారినీ ఎంత పిలిచినా, ఎంత వేడినా, ఎవరూ రాకపోవడంవల్ల రాజ్యలక్ష్మమ్మగారి మనస్సు బాధచేత కొట్టుకుపోతూంది. అంతలో కనపర్తి శ్రీరాములు గారు ఆ త్రోవను వెళ్ళుతున్నారు. ఆయన్ని వేడితే, చేతిలోని పుస్తకాలు కిందపెట్టితే, ఆయనా ఈమె చెరోవైపూ సాయంపట్టి వారి అరుగుమీద పరుండపెట్టారు. అతనికి సేవ చేయగా తేరుకున్నాడు. ఆ రోజుల్లో అస్పృశ్యతా నివారణ సంఘాలు, హరిజన సేవా పరాయణులూ లేరు. పంచముడికి ఎండదెబ్బ తగలకూడదు: తగిలినా, చనిపోవడం సబబుకాని సహాయం పొంది బ్రతకడం జన్మహక్కు కాదు కూడాను. ఇప్పుడయినా పంచముడే అని కాక, పేద వాడనో, వీథిలో ననో, మన హోదాకిఏదో లోపమనో పురుషులమే మనలో కొంతమందిమి ఈ సాయంచేయలేము. ధర్మగ్రంథాలు తలగడలుగా పెట్టుకుని పెట్టుకుని సంపాదించిన మనస్సులోని అస్పష్టభావమో. లేకమన కోసమో, మన మేర్పరచుకున్న కార్యప్రణాళికకోసమో అవసరమైన సిద్ధాంతమో మన సర్వ మానవ సౌభ్రాత్రం. అంతరాంతరముల నుండి పొంగి పొంగి, అంచులు దాటి, బహిర్లోకంలో ప్రవహిస్తూ అందర్నీ తడిపే దైనందిన కార్యక్రమం ఆమెకి సర్వ మానవ సౌభ్రాత్రం:

ఇటువంటి వెన్ని సంఘటనలు, ఎన్నెన్ని ఆమె జీవితంలో! పంతులుగారి యశస్సులో ఆమె పేరు అడగిపో నక్కరలేదు-ఒకరి జీవితం ఒకరివల్ల సఫలీకృత మైనది కనుకా, సంపూర్ణం అయింది కనుకా! ఆమె విద్యాసక్తి, ఆమె ప్రార్థనాశీలమూ సత్యసంవర్ధనుడైన పంతులుగారే పొగిడారు

పంతులుగా రంత విరామంలేని కార్యశీలి లేడు; ఆయన చరిత్ర ఇంత దూరాన్ని చదువుతూ ఉంటేనే మన కూపిరాడదు కూడ. ఆయన ఇంకా చేయకుండా వదులుతూన్న పనుల్ని ఆయనకి నిరూపిస్తూ తాను కొంతవరకు నిర్వహిస్తూ కూడాకూడా పరిగెత్తినవా రామె!

పంతులుగారు ఎప్పుడూ నిద్రపోయి ఉండ రనిపిస్తుంది నాకు. ఆమెకు నిద్ర అక్కరలే దనిపిస్తుంది- తానాయన్ని కూడా కనిపెడుతూండాలి కనుక! అన్నింటికన్నా ఆమెలో ఉన్న గొప్ప సుగుణం సోమరితనం లేక పోవడమే అని పంతులుగారు నిర్ధారించారు. ఆయన కార్యదీక్షమృత్యువుని గడగడ లాడించి దూర దూరాలని ఉంచింది: ఆ కార్యోత్సవంపూర్తి అయ్యాక ఒక గదిలోనుంచి ఇంకో గదిలోకి ఆయనే హాయిగా నడిచిపోయారు.

నాడు ఇహలోకంలో ఇద్దరూ కలిసి కృషి చేస్తూన్నప్పుడు ప్రతిసాయంకాలమునా ఆయనకళాశాలనుంచీ, కార్యరంగంనుండీ ఇంటికి రాగానే వీధి గుమ్మంవద్ద మందహాస రంజితమైన ముఖ మండలంతో నిలబడి 'మీకొక శుభవార్త చెప్తాను' అని చేయి చేయి కీలించి లోపలికి తీసుకొని వెళ్లినట్లే, అవిశ్రాంతమూ, అమోఘమూ అయిన నిరంతర కర్మదీక్షతో ఇహలోకాన్ని ఉజ్జీవింపజేసి ఆయన జీవితాంతంలో అమరధామం యొక్క ప్రాంగణ కవాటము వద్దకు రాగానే, తన కంటే, జీవితంలో లాగే, ముందే అక్కడకు పోయిన రాజ్యలక్ష్మమ్మగారు దరహాసవదనంతో ఎదురు వచ్చి ఉంటారు.

[కృష్ణశాస్త్రి వ్యాసావళి. 3, రాజహంస ప్రచురణలు, మద్రాసు, 1982, పేజీలు 13-25]

మానవతామూర్తి

# వీరేశలింగం

## దేవులపల్లి కృష్ణశాస్త్రి

వీరేశలింగమూ, నా గురుదేవుడు వేంకటరత్నమూ నా మనస్సులో నిలిచినప్పుడు ఎంతో చెప్పాలని ఉంటుంది. ఎంతెంతో!

BRAOU

బ్రతికున్నప్పుడు మహాపురుషులను గొప్పవారు అని స్వీకరించడానికి మనస్సు ససేమిరా ఒప్పుకోదు. వారిలో కూడా మనలో లాగే సమానంగా ప్రతి దినమూ, ప్రతి నిముషమూ రోగాలూ రొష్టులూ, రాగాలూ ద్వేషాలూ అన్నీ కనబడి, మనకన్న వారు అధికులని అనాలని అనిపించదు.

ఇక గతించిన మహాపురుషులను కూడా ఖచ్చితంగా, సరిగ్గా విలువ కట్టలేము.

వారిని దేవపదవి కయినా ఎత్తుతాము. లేదా, ''ఔనూ, కాదు'' అన్నట్లు వారికి ఒక చిన్న సర్టిఫికెట్టు అయినా యిచ్చి తోసేస్తాము - ''గొప్ప సంఘ సంస్కర్త'' అనో, మరేదో అనో!

రామమోహన రాయలు అంటే ''విలియం బెంటింక్ సాయంతో సహగమనమును మాన్పించెను'' అంటాం. దిక్కుమాలిన textbook లో అంతే ఉంది. అది అప్పగించేస్తాం. ఆయన సమగ్ర భారతాభ్యున్నతికి ఏ విధంగా మూలపురుషుడో, ఆయన ఏలాగున నవయుగానికి ప్రవక్తో, తొలి విశ్వమానవుడో ( universal man ), ఆయన చూపించిన గమ్యస్థానాన్ని ఇంకా స్పష్టంగా దర్శించలేక, లోకం యావత్తూ అటు కదలి నడవడానికి గిలగిల లాడుతూ, కిందా మీదా పడుతూ, ఎలాగ ప్రయత్నం చేస్తూందో తెలుసుకోలేము.

అలాగే, వీరేశలింగం అనగానే, ''ఆయన విధవా వివాహములు చేయించెను. అనేక గ్రంథములు వ్రాసెను. తెలుగులో మొదటి నవల రచించెను. ఆంధ్ర కవుల చరిత్ర వ్రాసెను. ఆయన ధైర్యశాలి, సంఘాన్ని ఎదిరించెను'' అంటూ ఒకటే పాట పాడి ఊరుకుంటాం.

అంతే గాని-

> అధిన వాంధ్ర శుభోదయ ప్రాప్తి కెల్ల
> మూల పురుషుం డొకండె, విశాల దృష్టి
> ఆ మహర్షి నాదిన మహోద్యమ లతికలె
> సూన పల్లవతతి మోసె.........

అని గ్రహించము.

సాహిత్య క్షేత్రంలో, సంస్కరణ మార్గంలో, సేవా వీథిలో, రాజకీయ రంగంలో, కృష్ణా గౌతమీ తుంగభద్రా ఘట్టాల్లో, సాగర తీరాల్లో, వనుల్లో, గనుల్లో, కేదారాలలో, కార్ఖానాలలో ప్రబుద్ధమైన చైతన్యంతో దాదాపు నాలుగు కోట్ల ఆంధ్ర ప్రజ నేడు అవిశ్రాంత కార్యోత్సవంలో మునిగి ఉన్నదంటే, ఆ దుర్వార కర్మధారకు జన్మస్థానం యుగకర్త, ప్రవక్త అయిన వీరేశలింగం.

వీరేశలింగం నాసిక్యాత్ర్యంబకం. నవ్యాంధ్ర జీవితం అఖండగౌతమి. నూరేళ్ల ఈ మధ్య ఉన్న తెలుగు వారందరూ, వారికి తెలియకుండానో, తెలిసో వీరేశలింగంలో ఉన్నారు - అందరూ, అందరూను!

వీరేశలింగం వితంతు వివాహోద్యమం, మరో ఉద్యమం లేవదీసి నడిపించా డంటే, దాని అర్థం అంతేనా?

అంతే అయితే, అందరూ ఆ ఉద్యమాన్ని హర్షించే ఈ రోజులలో ఇంకా ఎందుకు అముదం లాగున ఆ మాటే అనడం?

ఆయన పని ఏనాడో అయిపోయిందన్న మాట!

ఊఁహుఁ-అదికా దండి! ఆ ఉద్యమం నడిపిస్తూ ఆయన ఆంధ్రజనాన్ని ఈ విధంగా హెచ్చరించా రన్న మాట:

"ఇదిగో, ఇది మన జాతి. ఇది ప్రస్తుతం తెగ కుళ్ళి ఉంది. దీనిలో మౌఢ్యం, అంధకారం, కల్మషం, కౌటిల్యం, దాస్యం చిక్కగా మూగిపోయి ఉన్నాయి. ఉదాహరణకు చూడండి - బాల వితంతువుల దుస్థితి, ఈ హరిజనుల దుర్దశ, ఈ కళావంతుల హేయపద్ధతి! వీటి నన్నిటినీ, ఇంకా ఇట్టివాటిని ఎన్నిటినో మనం తొలగించి పారెయ్యక పోతే ఎలాగ? దాస్యా లన్నిటిలోనూ మనోదాస్యం మరీ చెడ్డది. అది వదలించు కోకపోతే ఎలాగ? ముందు నీ మనస్సును కట్టి పెట్టిన సంకెల తెంచేస్తాను. కొన్ని సంస్థలూ, ఆచారాలూ మనకు ప్రియతమ మై పోయాయి. అవి మనకు సంకెళ్లని అసలే తెలియదు. నీకు భయం లేదు. వానిని బద్దలు కొట్టెయ్. భయ మెందుకు? సత్యానికి భయ మేమిటి? ధర్మం, న్యాయం, కరుణ - వీటికి బెదు రేమిటి? ఇదుగో నా వైపు చూడండి! ఇలాగ! ఇదుగో, ముందు ఈ సంకెల బద్దలు కొట్టి చూపిస్తున్నా నిర్భయంగా! చూసేరా? ఇలాగే ముందు ముందు సంకెళ్ల నన్నిటినీ మీరు తెంచి పారెయ్యాలి!

"బూజు, దుమ్ము, ధూళి
మూసెను తిమిరాళి!
మూసె నీ హవేలీ!
పురాణ మీ దివాణం, చెడి
బూజు పట్టకుండా -
తెరవండి తలుపులు!"

అంటూ కర్కశమైనా కరుణార్ద్రమైన హస్తంతో, కోట్ల జనాన్ని ఛెళ్ళుమని కొట్టి, లేపి, నిలబెట్టా రన్న మాట!

కనుక వీరేశలింగం విద్యాసాగర్ లాగ వట్టి సంస్కర్త మాత్రమే కాడు.

రామమోహన రాయలులాగ ప్రవక్త, యుగకర్త.

ఒక గొప్ప విద్వాంసుడూ, విజ్ఞుడూ ఆయన్ని బసవేశ్వరునితోనే పోలుస్తాడు.

వీరేశలింగాన్ని కీర్తిస్తూ, "ఆయన ఒక మహావ్యక్తి మాత్రమే కాదు - ఆయన ఒక గొప్ప సంస్థ" అనీ, ఒక "మహోద్యమం" అనీ కొందరు అంటూంటారు. అబ్బే! సంస్థ లన్నీ ఆయనే! ఉద్యమా లన్నీ ఆయనే! జనం అంతా కలిసిన జనశక్తి ఆయనే కనుక.

BPAOU

వీరేశలింగం ప్రజ!
వీరేశలింగం మంది, కోట్ల మంది.

వ్యక్తికి కులం ఉంది. ప్రజలకు లేదు. వ్యక్తికి ఒక మతం ఉంది, జనానికి లేదు. వ్యక్తికి వయస్సు ఉంది, మందికి లేదు. మందికి జనన మరణాలు లేవు, ఉద్యమాలన్నీ కలిపి ప్రజది.

అది జీవద్వాహిని, అది భాద్రపదంలో గోదావరి, నిత్యమూ జీవనము నింపుకుంటూ సాగిపోవడమే!
వీరేశలింగం కేవలమూ ప్రజ కూడా కాదు.
వీరేశలింగం మానవత.

అప్రతిహత మైన ఆయన బల మంతా ఆ మానవతలోనే ఉంది. ప్రబుద్ధ మైన నవయుగ ప్రజాశక్తి అణువంటి ఆ అర్భక మూర్తిలో ఇమిడి ఉండి, క్రుద్ధ గౌతమిలాగ, రుద్ర ప్రభంజనంలాగ, అటంకా లన్నిటినీ తుడిచిపెట్టి సాగిపోయింది.

ఎందరో తెలియక అంటారు—'వీరేశలింగం ఒక్కడూ నూరేళ్ల క్రితం సంఘ తిరస్కృతికీ, మృతికీ కూడా భయపడకుండా, ఒక్కడూ, ఒక్కడే, ఎలాగ నిలిచి జయించాడండీ? అసలు సంఘాని కంతకీ అడుగున ఉన్నవాడు స్కూలు మేస్టరు. వాళ్ళలో అట్టడుగున ఉన్నవాడు తెలుగు పండితుడు, వీరేశలింగం అట్టి తెలుగు పండితుడు. అంత కలవాడు కాడు. వట్టి అర్భకుడు. ధనికుల్నీ, అధికారుల్నీ, బలశాలుల్నీ, పండితుల్నీ, అందరినీ, సంఘాన్నంతనీ ఒక్కడూ ఎదిరించి ఎలాగ జయించా డండీ?'' అని. ఒక విధంగా చూస్తే అది నిజం కాదు.

ఆయన్ని చుట్టుముట్టి పీడించిన వాళ్ళకే బలమూ తక్కువ, సంఖ్యాబలమూ తక్కువ అంటాను.

కన్నూ, నోరూ లేని ప్రజ తెలిసో తెలియకో వీరేశలింగం పక్షమే: ప్రజది ఎప్పుడూ భవిష్యత్కాలం వీరేశలింగంది రాబోయే కాలం: ఆయన ప్రతి కక్షులది, పాపం, పోయేకాలం! వాళ్ళది దైర్బల్యం, ఆయనది చైతన్యం.

చిదికి, బీటలువారి. కూలిపోతున్న మందిరాన్ని వాళ్లు ''వదలము'' అన్నారు. ఆయన వాళ్లనుకూడా పట్టుకుని కొత్త మందిరములోనికి తీసుకుపోయి తీరతానన్నాడు. కనుక వాళ్లపక్షమే బలహీన మైనది.

ఇక్కడ ఒక్క మాట:

ఆయనకు అలవి కాని కోపం ఉండే దనిపించేది అందరికీ. రాజు అననీ, రెడ్డి అననీ, ఎంత మేటి అయినా, ఆయన ఎదుట కుంచుకుపోయి, వెనక్కి తగ్గి నిలబడేవాడు—సత్యం సమక్షాన అసత్యపు నీడలాగ, చీకటి మసక లాగ, ఎక్కడో ఏకొంచమో మాలిన్యం ఉన్న వ్యక్తిలాగ!

అయితే అది కోపం కాదంటాను నేను. ఆయనచేత అంతపని చేయించిందే కరుణ ఆయెను!

అది తొందర-impatience !

ఎంతో పని చేయవలసి ఉంది! ఏమో ఎన్నేళ్లజీవిస్తాడో! ఎటు చూసినా సమాజం కుళ్లి ఉంది. Aegean stables లాగు. అంతులేని మాలిన్యం-త్వరగా త్వరగా, త్వరత్వరగా తాను ఎంతో పని చేసి మరీ వెళ్లిపోవాలి, ప్రతీవిషయమూ ప్రతీ ఒక్కనికీ, వాద ప్రతివాదాలు చేస్తూ నచ్చచెప్పుతూ పోతా నంటే ఎప్పటికి తేలదం? ఏం చేయడం? ''చెయ్!'' అంతే! ''ఊఁ ! నడు!'' అంతే ! తొందర ! తొందర ! తొందర !

భయంకరమైన, తీవ్రాతితీవ్ర మైన ఆ కార్యోత్సవంలో ఆయనకు మరణించడానికి తీరిక లేకపోయింది.

లేకపోతే ఆ దుర్బల శరీరం చిన్నతనంలోనే రాలిపోయి ఉండేది.

ఆయన జీవితానికి స్తిమితం లేదు. ఎప్పుడూనడకే! వట్టి కదలిక కాదు-అది మనది.

వట్టి నడకకు గమ్యస్థానమూ ఉండదు; తీర్చిదిద్దిన మార్గమూ ఉండదు.

BRAOU

మన మందరమూ సాధారణంగా చూపు ఒకవైపూ, నడక మరియొకవైపూ ఉన్నట్లు ఉంటాం. కొందరం శరీరం గదిలోనూ, తల కిటికీలోనుంచి ముందుకు చాపినట్టూ ఉంటాం.

ఆ ద్రష్టకు, ఆమహర్షికి లక్ష్యం, గమ్యస్థానం సుస్పష్టం, కనుక ఏ చేయో, కాలో, ముక్కో ముందుకు చాపి ఆ కాస్తా ప్రగతి అనుకోక, మనిషి మనిషే పూర్తిగా ముందుకు నడవా లన్నాడు: సమాజం కూడా అలాగ నడవాలన్నాడు.

ఒక్కొక్కప్పుడు మాకు అనిపించేది-ఆ ప్రచండునిలో ఎక్కడయినా చల్లదనమూ, తీయదనమూ ఉన్నాయా అని!

అలాగ అనుకోవడం మా దృష్టిలోపం.

అయనలో తండ్రితనమూ, తల్లితనమూ రెండూ కూడా ఉండేవి.

అనాథనూ, అభాగిని రక్షించింది ఆ రెండో గుణమే!

ఆ రెండో గుణం రాజ్యలక్ష్మమ్మ-ఆయన భార్య. ఆమెకు ఆయనమీద అమోఘ మైన ప్రభావ ముండేది. ఆమె కరస్పర్శ మృదుభాషణ ఆయనను ఎంతగా సాంత్వన పరచేవో ఆయన చరిత్ర ఎరుగున్న వాళ్ళకు తెలుస్తుంది!

ఆమె చనిపోయాక మరీని ! ఆయన అంతరంగంలోనే ఆమె నివాస మేర్పరచుకుంది. అప్పుడు స్త్రీ పురుష ప్రకృతులు రెండూ ఆయనలో కలిసిపోయి నిండిపోయాయి. భార్య పోయిన తర్వాత రవీంద్రుడు ఒక గేయంలో అదే అంటాడు.

తుది దినాల్లో ద్విజేంద్రలాల్ రాయ్ వ్రాసిన చంద్రగుప్త నాటకంలోని చాణక్యునివలె వీరేశలింగం కనిపిస్తాడు. ఎన్నడో పరమపదించిన భార్యను పదే పదే ఆహ్వానిస్తూ "నీ వేమంటావు? ఈ పని చెయ్యనా?" అని అడుగుతూ, అడుగడుగూ వేస్తూన్నట్లు!

BRAOU

ఇక్కడ ఒక్క మాట!

వీరేశలింగంగారిని గురించి స్మరించినప్పు డల్లా మాగురుదేవులు శ్రీ వేంకటరత్నం నాయుడుగార్ని గురించి కూడా చెప్పుకోకుండా ఉండలేను.

దాదాపు అరవై అయిదు సంవత్సరాల క్రితం ఒక ప్రముఖ ఉత్తర భారత పత్రిక వీరిద్దరినీ కీర్తిస్తూ, "దక్షిణ భారతాకాశాన్ని నేడు రెండు జ్యోతిర్మండలాలు ప్రకాశింపజేస్తూ ఏలుతున్నాయి. వీరుడైన వీరేశలింగం పంతులు, రుషి అయిన వేంకటరత్నం నాయుడు" అని వ్రాసింది.

వీరేశలింగం వేంకటరత్నం కంటే ఎక్కువ నవ్యుడని అనిపిస్తుంది. వీరేశలింగమే ప్రబుద్ధ ప్రజ. భవిష్యత్తు ఆయన !

వీరేశలింగ యుగం ఆయన చనిపోయాక ఇప్పు డిప్పుడే ప్రారంభ మయినట్టు తోస్తుంది.

వేంకటరత్నం దూర భవిష్యత్తులోనికి దృష్టి సారించినా. తన శిష్యులకు అంతవరకూ మార్గాన్ని పరచి చూపించిన, తాను మాత్రం యుగ ప్రాంగణాన నిలబడ్డ ఉపదేశకుడిలాగ దర్శన మిస్తాడు.

వీరేశలింగం పంచభూతాలకూ ప్రజలాగే సన్నిహితుడు. కోపాలూ, తాపాలూ, తిక్కలూ, అనురాగాలూ, ద్వేషాలూ-వీటితో జనం లాగే నేల పైనా, ధూళిలోనూ నిలిచి, ఒక్క నిమిషం విశ్రాంతి లేక, ఒక్క కను రెప్ప పాటు విశ్రాంతి నియ్యక, పదినుందిని తిడుతూ కొడుతూ, తాను పది పడుతూ, ఆందోళన పరుస్తూ, యుద్ధం చేస్తూ పోతూన్న ట్టుంటాడు.

వేంకటరత్నం ఉదాత్తుడులాగ, అంటే aristocrat లాగ దర్శన మిస్తాడు, ఎప్పుడూ కైలాస పర్వత శిఖరం నుంచి, ఒక విశిష్ట సంస్కార ఆధిక్యత మీదనుంచి దిగన ట్టుంటాడు.

వీరేశలింగం పీడిత మానవ జగత్తులో నిలబడి, దానికి జరిగే అన్యాయాన్ని కోసి పారేసి, ఎదిరించిన వారిని తుడిచి పారేస్తా నంటాడు.

వేంకటరత్నం అనాథలకోసం, అభాగినులకోసం తల్లి లాగ తండ్రిలాగ ఆప్యాయంగా చేతులు చాపుతూ, ఓదారుస్తూ వంగుతున్న ట్టుంటాడు.

వీరేశలింగం, ''ఏ! ఇది అన్యాయం! జరగడానికి వీల్లేదు. చూస్తా నెవరు వస్తారో! దీన్ని ఖండించి పారేస్తాను'' అంటాడు.

వేంకటరత్నం, ''అయ్యో! పాపం ఈ దిక్కుమాలిన వాళ్లు ఎలా ఉన్నారో!'' అనే ప్రేమమూర్తిలాగు ఉంటాడు!

వీరేశలింగం నడిపిన ఉద్యమాలలో ప్రధానమైనది విధవా పునర్వివాహం. లోకంలో తీవ్రమైన యుద్ధాలకు కారణం అయిం దది.

వేంకటరత్నం తలపెట్టిన ఉద్యమాలలో, సంస్థలలో ముఖ్య మైనవి కళావంతుల సముద్ధరణం, అనాథ శరణాలయమూను.

ఇవి వద్దని ఎవరు పోరాడగలరు?

ఒక్కొక్కప్పుడు వీరేశలింగం యొక్క దైవం దండధారీ, సమవర్తీ అయిన లోక శాసకు డనిపిస్తుంది.

వేంకటరత్నం యొక్క దైవం తరిమి తరిమి రక్షించే వాత్సల్యమూర్తీ, పతితపావనుడూ అనిపిస్తాడు.

అయితే వీరేశలింగంలో ప్రేమభక్తులు లేవని కాదు. వేంకటరత్నంలో కార్యతత్పరత లే దనీ కాదు.

కాని వీరేశలింగం జీవితచరిత్ర అవిశ్రాంత కార్యోత్సవం లాగ ఉంటుంది-భారతంలో ఒక వీర మానవుని కథలాగ సామాన్య హృదయాలను ఆవేశపరచే తీవ్రసంఘటనలతో నిండి!

వేంకటరత్నం జీవితచరిత్ర భాగవతంలోని భక్తుని గాథలా ఉంటుంది-స్థూలంగా కనబడళ్ళి, పట్టుకు దొరకని లక్ష్యాలూ, అనేక అపేక్షాలూ, వేదనలూ - అలాటి వాటితో నిండి!

వీరేశలింగం కథ నాటక రచనకూ, చలనచిత్ర నిర్మాణానికీ ఇట్టే లొంగుతుంది.

వేంకటరత్నం కథ అలా లొంగదు; అది భావకావ్యం, కీర్తన! మొదటిది ఎక్కువ జనరంజకం — ముఖ్యంగా ఈ నేటి కాలంలో.

వీరేశలింగం నవమానవుడు, రాగల కాలంలో మానవుడు బుద్ధీ, హృదయమూ రెంటినీ బాగా ఉపయోగించు కోవాలి ఇది విజ్ఞానయుగం. మానవుడు పశువు కాడు. ఏ విషయాన్నైనా స్వంతంగా తన మెదడును ఉపయోగించి పరిశీలించి. తూచి సత్యం తెల్సుకోవాలి. మరి కవి అన్నట్టు, ప్రాక్పశ్చిమాలు రెండూ ఒకే ఒక హృదయం యొక్క రెండు స్పందా లయిపోయినపుడు మానవు లందరూ ఒకే ఒక ప్రేమ పాశంతో కట్టబడి, ఒకే ఒక విశ్వ విశాల సంసారంలో ఇమిడి శాంతంగా సుఖంగా బ్రతకాలి! భగవంతుడికి రెండు కళ్లున్నాయి అంటాయి పురాణాలు-సూర్యుడూ, చంద్రుడూ, మానవునకూ, ఉన్నవాడికి, రెండు కళ్లే—బుద్ధీ, హృదయం (reason, love). ఈ రెంటిలో దేనికి లోపం వచ్చినా నవమానవుడు ఈ జగత్తులో మనలే డన్నది వీరేశలింగం సందేశం. ఆయనది మానవతా ధర్మం!

మెథొడిస్ట్ (Methodist) మత ప్రచారకుడైన John Wesley ని గూర్చి ఒక కథ ఉంది. ఆయనకు ఒకసారి ఒక vision - ఒక సాక్షాత్కారం కలిగింది. Wesley స్వర్గద్వారం దగ్గర ప్రవేశం కోసం నిలబడ్డాడు. ''నీ వెవరవు?'' అని ద్వారపాలకుడు ప్రశ్నించాడు. ''I am a Wesleyan నేను వెస్లీ ధర్మ సంప్రదాయానికి చెందినవాణ్ణి'' అని జవాబిచ్చాడు. ''మేము వాళ్లెవరో వినలేదు'' అన్నాడు ద్వారపాలకుడు. ''పోనీ ఇక్కడ ప్రొటెస్టెంట్ మతం వాళ్లు ఉన్నారా?'' అని ప్రశ్నించాడు వెస్లీ. మళ్లీ ''ఊహుఁ'' అన్నాడు ద్వారపాలకుడు. 'క్రైస్తవులు?' ''ఒక్కరూ లేరు!'' ''మ రెవ్వ రున్నారు?'' ''విశ్వాసులు - believers'' అన్నాడు ద్వారపాలకుడు.

స్వర్గద్వారం అంటూ ఉంటే, అక్కడ ఓ ద్వారపాలకుడంటూ ఉంటే, మొదటనే ''మానవుణ్ణి'' అని చెప్పి వీరేశలింగం నమ్మకంగా లోపలికి వెళ్ళిపోయి ఉంటాడు.

''భారతేర్ మహామానవేర్ సాగర తీరే'' అంటాడు, కవిరాజరాజు రవీంద్రుడు. మానవ మహాసాగరం అంటాడు; ఎంత నిజం ఈ మాట!...

సుఖాలూ, దుఃఖాలూ, మహాకల్లోలాలూ, ఆందోళనలూ, ఆలింగనలూ, అలజడులూ, ప్రళయ యుద్ధాలూ, మారణ హోమాలూ పండుగలూ, పబ్బాలూ, వేడుకలూ, ఆశలూ, ఆనందాలూ — వీటితో ఈ మానవ మహాసాగర మధ్యాన నవయుగారంభవేళ నిలబడిన నవమానవుడు universal man, తెలుగునాట వీరేశలింగం.

అలాగ నిలబడి ఇలాగ అన్నట్లు నాకు తోస్తుంది:

''ఓ మానవుడా: నవమానవుడా! నీది-అంటే నీ బదులు, నాది ధర్మ సమరం సుమా! నీవు సాధించే విజయం సామాన్యమైంది కాదు. నిన్ను నీచపరచేది కాదు ఆ విజయం. దానివల్ల లభించే ప్రభావం నీ హస్తాల్లోనే గుప్తపరుచుకోలేవు. నీది ధర్మసమర మయితే నీ అస్త్రాలు కూడా ధర్మ యోధునికి ఉచిత మైనవే! నీకు ఆగ్రహం పనికిరాదు. ద్వేషం పనికిరాదు. దైన్యం, అల్పత్వం, అసత్యం, పిరికితనం నీ దగ్గరకు రానివ్వకూడదు. ఉషస్సులో తొంగిచూసే ఆశ నీది. ప్రభాతంలో భాసించే విశ్వాసం నీది.

కనుక, ముందు ముందు ఆశకు కూడా అతీతమైన కష్టాలను పడడం, రాతిరి కన్నా, మృత్యువుకన్నా నల్లనైన అవమానాలను క్షమించడం, ఎదిరించడానికి కూడా వీలులేనట్లు కనబడే శక్తుల్ని

తృణీకరించడం,

ప్రేమించడం,

ఓర్మితో సహించడం,

శైథిల్యంనుండీ, జరనుండీ నవజీవనాన్ని సృజించుకోవడం,

చలించక పోవడం,

నీ మార్గంనుండి తప్పుకొనకపోవడం.

నీరస పశ్చాత్తాపంతో కుంగకపోవడం.

ఇవన్నీ, అన్నీ నాలాగే నీవూ జ్ఞాపకం ఉంచుకోవాలి సుమా!'' అని!

వీరేశలింగాన్ని ''దేవత'' అన్నాడు రామలింగారెడ్డి.

ఆ మహా మానవ సాగర తీరాన నేను ఒకసారి నిలబడి ఆ ''దేవత''కూ, నరదేవతల కందరకూ నమస్కరిస్తున్నాను.

[కృష్ణశాస్త్రి వ్యాసావళి 1, రాజహంస ప్రచురణలు, మద్రాసు, 1982. పే. 1-12]

BRAOU

## అభ్యాసం (రాసేపని)

1. ఈ రెండు వ్యాసాల నుంచి కింద గీతలుంచిన మాటలను ఒకే సైజున్న చిన్న కాగితం ముక్కల మీద రాయండి. రాసిన మాటలను అకారాది క్రమంలో ఏర్పాటు చేసుకోండి. ఆ తరవాత ఒక కాగితం మీద కాని, మీ నోటు పుస్తకంలో కాని, రాసుకోండి. ఆ మాటలకు నిఘంటువులో ఇచ్చిన అర్థాలు రాయండి. సంస్కృత శబ్దాలు అచ్చుతో అంతమైతే మూలభాష (సంస్కృతం)లో ఆ అచ్చు ఏదో రాయండి. అకారాంతం, ఇకారాంతం ఆ కారాంతం - ఇట్లాగా. వీటి అవసరం సమాసాలను గురించి నేర్చుకున్నప్పుడు తెలుస్తుంది.

2. ఈ కింద ఇచ్చిన పదాల సంధులు విడదీసి రాయండి. తెలుగు సంధుల్లో తప్పని సరిగా సంధి చెయ్యవలసినవి చెయ్యక్కర్లేనివి - వేరు వేరుగా రాయండి. సంస్కృత సంధుల్లో మీకు చెప్పనివి కూడా ఉన్నాయి. వాటి కోసం మీ సలహా దారును సంప్రదించండి.

| | | |
|---|---|---|
| ఎంతెంతో | తెలియకుండానో | జీవద్వాహిని |
| ప్రవక్తో | పెళ్లమని | దృగావరణం |
| అంతరాంతరం. | మానవుణ్ణి | జ్యోతిర్లోకం |
| సరస్వతై | దివ్యుణ్ణి | అల్పాల్ప |
| మూగై | చెప్పాలని | శరజ్జ్యోత్స్న |
| మోడై | ఉద్యమాన్ని | తమోవాహిని |
| | | స్వర్గాంగణం |

BRAOU

3. కృష్ణశాస్త్రి గారి వాక్యాలలో ధ్వని మాధుర్యం కనిపిస్తుంది. సమతూకం గల పదాలను క్రమంగా వాడటం ద్వారా, ఒకేరకం ధ్వనితో మొదలయ్యే మాటలను మధ్యమధ్యలో వాడటం ద్వారా ఈ ధ్వని మాధుర్యాన్ని సాధిస్తారు. ఈ ఉదాహరణలు చూడండి.

(అ) అణువు వంటి ఆ అర్భక మూర్తి

(ఆ) క్రుద్ధ గౌతమిలాగ, రుద్ర ప్రభంజనంలాగా

మొదటి ఉదాహరణలో అణువులోనూ, అర్భక లోనూ మొదటి అచ్చు ఒకటే కావటంవల్ల ధ్వని సమత్వం ఏర్పడింది. అందువల్ల వాక్యానికి అందం వచ్చింది. రెండో ఉదాహరణలో క్రుద్ధ, రుద్ర అనేమాటల సమతూకం వల్ల అందం వచ్చింది. రెండు మాటల మొదటి అక్షరంలో ఉ అనే అచ్చు, రెండో అక్షరంలో అ అనే అచ్చు ఉన్నాయి, రెండో అక్షరంలో ద అనేహల్లు రెండుచోట్లా ఉంది. రెండింటి అక్షర పరిమాణం ఒకటే.

ఈ రకం వాక్యాలు ఈ వ్యాసాల్లో ఇంకా ఉన్నాయి. ఏరండి.

4. కృష్ణశాస్త్రిగారి శైలిలో ఆత్మీయతా గుణం ఉందన్నాం, ఎదటి మనిషితో మాట్లాడినట్టే ఉంటుందన్నాం, ఉదాహరణకు ఈ వాక్యాలు చదవండి

''పోనీ! ఇంకోలాగా అను! వాగర్థాలని విడదీయ లేనట్లు వారినీ విడదీయలేము కనుక ఇద్దరికీ కృతి ఇస్తానను, నిజానికి ఏ మహా పురుషుడు ఉత్తమ మహిళా ప్రభావం లేకుండా లోకోత్తర కార్యాలు చేశాడయ్యా?''

పై పేరాలో పోనీ, అను, అనే క్రియారూపాలు, అయ్యా, అనే సంబోధన ఒక మనిషితో మాట్లాడేటప్పుడు మాత్రమే వాడేవి. వీటివల్ల ఈ శైలిలో ఆత్మీయత కనిపిస్తున్నది. ఇట్లాంటి వాక్యాలు రెండు వ్యాసాల్లో నుంచి ఇంకా ఏరండి.

5. "వ్యక్తికి కులం ఉంది, ప్రజకు లేదు. వ్యక్తికి ఒక మతం ఉంది. జనానికి లేదు. వ్యక్తికి వయస్సుంది మందికి లేదు. మందికి జనన మరణాలు లేవు"

ఈ పై భావాన్నే ఈ కింది విధంగా చెప్పవచ్చు: "వ్యక్తికి కులమూ, మతమూ, వయస్సు ఉన్నాయి. జనానికి అవేమీ లేవు, జనన మరణాలు కూడా లేవు."

రెండిటిని పోల్చిచూసి కృష్ణశాస్త్రి గారు చెప్పిన పద్ధతిలో అందం ఉందనుకుంటే అది ఎట్లా వచ్చిందో కనుక్కోటానికి ప్రయత్నించండి.

6. కృష్ణశాస్త్రిగారి కవిత్వంలో కాల్పనిక గుణం ఉందని, అది ఆయన వచనంలో కూడ కనిపిస్తుందని చెప్పాం. ఊహాలోకాన్ని ఒకటి స్ఫురింపచేస్తూ చేసిన కల్పన కాల్పనికతకు ఒక లక్షణం.

''వేంకటరత్నం ఉదాత్తుడు లాగ, అంటే aristocrat లాగ దర్శనమిస్తాడు ఎప్పుడూ సైనాయ్ పర్వత శిఖరం నుంచి, ఒక విశిష్ట సంస్కార ఆధిక్యత నుంచి దిగనట్టుంటాడు''.

పై పేరాలో వేంకటరత్నం గారిని ఒక పర్వతం మీద నుంచొని ఉన్నట్టుగా రచయిత ఊహించారు. ఇట్లాంటి పేరాలను, వాక్యాలను ఈ వ్యాసాల నుంచి వెతకండి.

7. ఈ కింది వాక్యాలను చదవండి

(అ) "రామమోహనరాయలు అంటే విలియంబెంటింకు సాయంతో సహగమనమును మాన్పించెను 'అంటాం' దిక్కుమాలిన text book లో అంతే ఉంది అప్పగించేస్తాం''.

ఇక్కడ దిక్కుమాలిన అనేమాట వాడటంవల్ల రచయిత ఆవేశం వ్యక్తమయింది. ఈమాట తీసి వేసి చదవండి, ఈ ఆవేశం కనిపించదు.

BRAOU

(ఆ) ''భయమెందుకు? సత్యానికి భయమేమిటి? సత్యం, న్యాయం కరుణ-వీటికి ఎదురేమిటి?''

ఈ పై పేరాలో ప్రశ్న వాక్యాలు వరసగా రావటం వల్ల ఆవేశం వ్యక్తమయింది. ఈ ప్రశ్నలు సమాధానాలను ఆశించి వేసినవి కావు. ఇందువల్ల కూడా ఆవేశం వ్యక్తమవుతుంది.

ఈ విధంగా ఆవేశం వ్యక్తం అయ్యే వాక్యాలు వెతికి ఏపద్ధతి ద్వారా అది వ్యక్తమవుతున్నదో వివరించండి.

8. ఈ కింది వాక్యాల భావాన్ని స్పష్టం చెయ్యండి.

(అ) ''మనమందరమూ సాధారణంగా చూపు ఒకవైపూ, నడక మరియొక వైపూ ఉన్నట్టు ఉంటాం. కొందరం శరీరం గదిలోనూ, తల కిటికీ లోనుంచి ముందుకు చాపినట్టూ ఉంటాం''.

(ఆ) ఆయనలో తండ్రితనమూ, తల్లితనమూ రెండూ కూడా ఉండేవి.

(ఇ) వీరేశలింగం నాసికా త్ర్యంబకం నవ్యాంధ్రజీవితం అఖండగౌతమి ఈమధ్యఉన్న తెలుగువారందరూ. వారి వారికి తెలియ కుండానో తెలిసో వీరేశలింగంలో ఉన్నారు-అందరూ, అందరూను!

(ఈ) ''వీరేశలింగంది రాబోయే కాలం, ఆయన ప్రతికక్షులది, పాపం!, పోయేకాలం! వాళ్లది శైథిల్యం, ఆయనది చైతన్యం".

(ఉ) ''ఆ కార్యోత్సవం పూర్తి అయ్యాక గదిలోనుంచి ఇంకో గదిలోకి ఆయనే హాయిగా నడిచి పోయారు''.

(ఊ) ''భయంకరమైన, తీవ్రాతితీవ్రమైన ఆ కార్యోత్సవంలో ఆయనకు మరణించడానికి తీరిక లేక పోయింది''.

9 ఈ రెండు వ్యాసాల ఆధారంగా కృష్ణశాస్త్రి గారి వచనంలో విశేషాల గురించి ఒక వ్యాసం రాయండి.

10. మీకు అందు బాటులోని ఒక తెలుగు నిఘంటువు ప్రణాళికను ఈ పాఠాలలో చెప్పిన అంశాల ఆధారంగా విమర్శించండి.

ఖండిక 3 పాఠం 5

# పదాలు: అర్థభేదాలు

ఉద్దేశం

మాటలకు సందర్భాన్ని బట్టి అర్థ భేదాలు వస్తాయి. ఈ అర్థ భేదాలు వచ్చే పద్ధతులను వివరించి, వాటి విభజనను సూచించటం.

ప్రణాళిక :

1. అర్థం అంటే
2. పదానికి అర్థానికి మధ్య సంబంధం
3. సందర్భాన్ని బట్టి అర్థం
4. ప్రధానమైన అర్థం అభిధ
5. రెండో అర్థం లక్షణ
6. అభ్యాసాలు, ప్రశ్నలు.

మనం మాట్లాడే భాషగానీ, రాసే భాషగానీ వాక్యాల రూపంలోనూ, వాక్యాలు పదాల రూపంలోనూ ఉంటాయి. ఈ పదాలకు అర్థాలుంటాయి. వ్యక్తీకరించదలుచుకున్న అర్థాన్ని వ్యక్తీకరిస్తాయి. పదాలకు అర్థాలకు మధ్య నియతమైన' సంబంధంలేదు. ఒక అర్థంలో ఒక పదాన్ని సమాజం ఒక కాలంలో వాడటం వల్ల-అంటే వాడుక వల్ల-ఆ పదానికి ఆ అర్థం వస్తుంది. కనుక వ్యవహారంలో మార్పు వస్తే అర్థంలోనూ వస్తుంది. ఒకే పదం వివిధ రీతులుగా అర్థం ఇస్తుందన్న మాట. భాషలోని మాటలకూ, వాటికుండే అర్థాలకూ ఉండే సంబంధాన్ని గురించి పరిశీలించిన వాళ్ళు దీని పైన కొంత వివరంగా చర్చలు చేశారు. ఈ పాఠంలో పదాల అర్థం, అర్థస్ఫూర్తి గురించిన కొన్ని ప్రాథమిక అంశాలను వివరించటం జరుగుతున్నది.

ఎదుటివాళ్ళకు మన అభిప్రాయాలుగాని, ఆలోచనలుగాని తెలియజేయాలంటే మనం ప్రధానంగా వాడేటు వంటి సాధనం భాష. ప్రధానంగా అని ఎందుకు అన్నామంటే, సైగల ద్వారా, ముఖకవళికల ద్వారా, ఇతర సంకేతాల ద్వారా కూడా మనం కొంతవరకు-కొంతవరకు మాత్రమే-మన భావాన్ని తెలియజేయ గలుగుతాము.

భాషలో ధ్వనులు ఉంటాయి. ఈ ధ్వనుల కలయిక వల్ల మాటలు ఏర్పడతాయి. మాటల కలయిక చేత వాక్యాలు ఏర్పడతాయి. వీటి సహాయంతో మనం మన మనస్సులోని భావాన్ని వ్యక్తం చేస్తాము. ఇది మాట్లాడేటప్పుడు (ధ్వనులు చేసేటప్పుడు) భాష నిర్వహించే పాత్ర. ప్రత్యక్షంగా అవతలి వాళ్ళు వినగల స్థితిలేనప్పుడు ఈ ధ్వనులకే మనం ఏర్పరుచుకున్న 'లిపి' గుర్తుల ద్వారా-వ్రాత ద్వారా-మనం మన భావాలను వివరిస్తాము. ఏదైనా, భాషద్వారా ఒకరి భావం మరొకరికి తెలియటంలో పదాల 'అర్థం' ప్రముఖపాత్ర వహిస్తున్నది.

అయితే, 'అర్థం' అంటే ఏమిటి?

ఎవరో ఒక పరదేశి మనకు రాని భాషలో మనతో మాట్లాడే ప్రయత్నం చేస్తున్నాడనుకోండి లేదా మీరే మరొక భాషా ప్రాంతం వెళ్ళి తెలుగురాని వాళ్ళతో మాట్లాడు తున్నారనుకోండి. అతడు చెప్పేది మీకుగాని, మీరు చెప్పేది వాళ్ళకుగాని తెలుస్తుందా? మరి మీరుగాని, అతడుగాని ఉపయోగిస్తున్న పదాలకు అర్థం ఉన్నదిగదా! ఎందుకు అర్థం కాదు?

'ఏ పదానికిగాని ఫలాని అర్థం అని ఆ పదం ఉపయోగించే వాడికి తెలియాలి. అర్థం చేసు కోవలసిన వాడికీ తెలియాలి. లేని పక్షంలో వ్యవహారం సాధ్యం కాదు' అని దీనిని ఒట్టి గ్రహించ వచ్చు.

ఒకే భాష మాట్లాడే వాళ్ళ మధ్య పరస్పర అవగాహన ఉంటుంది. కనుక వాడిన పదాల అర్థం బోధపడుతుంది. దీన్నే ఇంకో రకంగా చెప్పాలంటే ఏ మాటకు ఏ అర్థమో స్థూలంగా ఒక భాష మాట్లాడే వారందరి మధ్యన ఒక ఏకాభిప్రాయం ఉంటుంది.

BRAOU

మన చుట్టూ ఉన్న ప్రపంచంలో ఎన్నో భౌతికమైన వస్తువులు ఉన్నాయి. అవసరాన్నిబట్టి వీటికిపేర్లు పెట్టుకోవలసి వస్తుంది. ఆ పేర్లు నలుగురూ కలిసి పెట్టుకుంటే ఆ పేరు అర్థం ఏమిటో నలుగురికీ తెలుస్తుంది. అట్లా వచ్చినవే భాషలోని చాలా పదాలు. ఆ పేర్లు ఆయా వస్తువులకు సంకేతాలు. ఉదాహరణకు, చెట్టు, పుట్ట, పిట్ట, బల్ల, కుర్చీ, ఆకాశం, భూమి.

'సంకేతం' అంటే గుర్తు, చిహ్నం. ఒక వస్తువుకు మనం పెట్టుకున్న ఆ పేరే ఎందుకు వచ్చింది? ఎట్లా వచ్చింది? నిజానికి 'పేరు'కు 'వస్తువు'కు మధ్యన 'నియతమైన' (అంటే, మార్చడానికి వీలు లేనటువంటి) సంబంధం ఏమీలేదు.

ఒక చెట్టు ఉంది. తెలుగువాడు దాన్ని 'చెట్టు' అన్నాడు ఇంగ్లీషువాడు 'ట్రీ' అని అన్నాడు. మరొకడు వచ్చి 'పేడ్' అంటే ఇంకొకడు 'రూఖ్' అన్నాడు. ఇంతకీ అసలు వస్తువు ఒక్కటే గదా! పేరుకూ వస్తువుకూ మధ్య మార్చరాని, ఖచ్చితమైన సంబంధమే ఉంటే ఇన్ని పేర్లు ఎట్లావస్తాయి, ఇన్ని భాషలు ఎట్లావస్తాయి?

మనుషుల పేర్లతో ఈ సందర్భాన్ని పోల్చి చూడండి. పిల్లవాడు పుట్టగానే వాడికో పేరు అవసరం-వ్యవహారం కోసం వాడికి రాముడని పేరు పెడితే రాముడైనాడు, భీముడని పేరు పెడితే భీముడైనాడు. వ్యవహారంలో పేరు స్థిరపడుతుంది. కనుక పేరు అనేది వ్యవహార ధర్మంగా వచ్చేదే. అట్లాగే లిపితో కూడా పోల్చి చూడండి. అ, ఆ అనే ధ్వనులు ఇంచుమించుగా అన్ని భాషలలోను ఉన్నాయి. వ్రాయవలసి వచ్చినప్పుడు ఆ అక్షరాలను ఒక్కొక్క భాషలిపిలో ఒక్కొక్క రకంగా వ్రాసుకుంటారు. వస్తువులకు పెట్టుకునే పేర్లుకూడా అట్లాంటి గుర్తులే.

పేరుకు, వస్తువుకు మధ్యనియతమైన సంబంధం లేదని చెప్పడానికి పూర్వులు మరో ఉదాహరణ చూపించారు. 'నిప్పు' - ఒకదాని పేరు. 'నిప్పు' అన్న ధ్వనుల సముదాయానికి, అంటే శబ్దానికి నిప్పు గుణం లేదు. ఉంటే, ఆ శబ్దం. ఉచ్చరిస్తూనే నోరు కాలాలి గదా! అందుకే షేక్స్పియర్ మహాకవి 'ఏ పేరుతో పిలిస్తేనేమి, గులాబి తావులు విరజిమ్మదా?' అన్నాడు.

పదానికీ, దాని అర్థానికి మధ్యనఉన్న సంబంధం 'నియతం' కాదనీ, వ్యవహార ధర్మాన్ని పురస్కరించుకొని వచ్చిందనీ ఇంతవరకు మనం చెప్పుకున్న దాని సారాంశం.

'అర్థం, అర్థం' అని ఇంతదాకా చాలాసార్లు అన్నాము. 'అర్థం' అన్నదాని 'అర్థం' ఏమిటి అనే ప్రశ్నకు సమాధానం అంతసులువైనది కాదు. దీనిని గూర్చి ఎంతో కాలం, ఎంతోమంది చర్చలు సాగించారు. ముఖ్యంగా తత్త్వవేత్తలు, తర్కవేత్తలు, భాషావేత్తలు ఈ చర్చలు చేశారు. ఈ చర్చలలో అనేక సూక్ష్మాతిసూక్ష్మ విషయాలను, ఆసక్తికరమైన విషయాలను వారు వెలికి తెచ్చారు. అవన్నీ మనకు ఇప్పుడు అవసరం కాదు. కానీ కొన్ని స్థూలాంశాలను మాత్రం తెలుసుకుందాం.

సందర్భం ఏమిటో చెప్పకుండా 'పులి' అంటే అర్థం ఏమిటి అని ఎవరైన ఒక ప్రశ్న వేశారనుకోండి. ఏమి చెప్పాలి? 'పులి' అనేది ఒక జంతువు; దాని ఆకారం ఇట్లా ఉంటుంది. దాని స్వభావం ఇది. దాని అలవాట్లు ఇవి అని వివరించి చెప్పాలి. దీనినే 'నిర్వచనం' అంటాము అర్థాలు తెలుసుకోవడానికి మనం ఈనాడు ఉపయోగిస్తున్న నిఘంటువులలో ఇటువంటి నిర్వచనాలు ఇస్తున్నారు. (దీనిని గూర్చి కిందటి పాఠంలో మీరు కొంత తెలుసుకున్నారు.) ఒక ఇంగ్లీషు-ఇంగ్లీషు నిఘంటువులో ఎట్లా ఉన్నదో చూడండి:

tiger - a large, carnivorous, tawny-coloured, black striped feline, Panthera tigris, of Asia ranging in several races from India and the Malay peninsula to Siberia;

తెలుగులోకి దీనిని అనువాదం చేస్తే —

పులి :- మాంసాహారి, ముదురు పసుపు పచ్చరంగు మీద నల్లని చారలు ఉన్నది, పిల్లి జాతికి చెందినది అయిన పెద్ద జంతువు, ఆసియా ఖండానికి చెందిన పాంథెరా టైగ్రిస్, భారత దేశంలోను, మలేద్వీపకల్పం నుంచి సైబీరియా దాకా వ్యాపించి వివిధ ఉపజాతులలో కనబడేది.

పులి అంటే అర్థం అడిగినవాడు 'పులి' అంటే ఏమిటో అర్థం చెప్పారు బాగానే ఉంది. కాని ఇక్కడ 'వాడు పులి' అని ఉన్నది. ఇదేమిటి? అని ప్రశ్న వేశాడనుకోండి.

BRAOU

'వాడు పులి' అన్నప్పుడు పులి అన్న మాటకు అర్థం ఇంతకు ముందు వర్ణించి చెప్పిన జంతువు కానేకాదు. పులికి ఉండే కొన్ని గుణాలు మనం ఒక మనిషిలో చూసి వాడు పులి వంటివాడు అనే పోలిక తోచటం వల్ల వాడుపులి అని వ్యవహరిస్తాము. వాడెవడైనా ఎదురు లేనివాడు, మొనగాడు, పౌరుషంతో ఠీవిగా, గంభీరంగా ఉంటాడు అటువంటి వాడిని, పులి అన్నాము. ఇక్కడ గమనించ దగిన ఒక విశేషం ఉన్నది. పులికి క్రౌర్యం ఉన్నది హింసించే గుణం ఉన్నది. ఆ గుణాలు ఉన్న వాడిని కూడా పులి అనవచ్చునుగదా! కాని, సాధారణంగా మనం ఇటువంటి సందర్భాలలో గ్రహించేవి ఆ గుణాలుకాదు-ఎదురులేక పోవటం, గాంభీర్యం వంటి గుణాలనే దృష్టిలో ఉంచు కుంటాము. ఇది కూడా వ్యవహారంలో ఏర్పడే సంప్రదాయమే.

ఈ ఉదాహరణను పరిశీలిస్తే తేలేదేమిటి? పులి అనే మాటకే రెండు సందర్భాలలో రెండు అర్థాలు వచ్చినాయి. ఒకే మాటను మనము సందర్భాను సారంగా రెండు విధాల ఉపయోగించాము. ఈ రెండో అర్థంకూడా నిఘంటువులకు ఎక్కవలసినదే. ఇంతకు ముందు చెప్పిన ఆంగ్ల నిఘంటువులో ఎట్లా ఉన్నదో చూడండి.

(tiger) <u>Informal</u> - an especially energetic, dynamic, or hard-working person.

ఈ అర్థం ఆ మాటకు ప్రధానమైన అర్థం కాదు. రెండో అర్థం ఇంగ్లీషులో దీనిని **figurative use** అంటారు.

పూర్వులు ఈ విధంగా వచ్చే ప్రధానమైన అర్థాన్ని వాచ్యార్థం అని అన్నారు. రెండో అర్థాన్ని లక్ష్యార్థం అన్నారు. పులి అనే శబ్దం ప్రధానంగా ఇంతకు ముందు వర్ణించిన జంతువును చెబుతుంది. 'వచించుట' అంటే చెప్పటం; చెప్పబడినది వాచ్యం. పులి అంటే ఆ జంతువు అన్నప్పుడు అది వాచ్య + అర్థం = వాచ్యార్థం. పులి అంటే పులిలాంటి మనిషి అనే అర్థం వాచ్యార్థంకాదు. కొన్ని లక్షణాలను పురస్కరించుకొని గ్రహించే అర్థం. దీనిని లక్ష్య + అర్థం = లక్ష్యార్థం అని అంటారు.

కనుక ఒక పదం వాచ్యార్థానికీ, లక్ష్యార్థానికీ కూడా సంకేతంగా ఉండవచ్చు. ఏదయినా పదం వాచ్యార్థానికి సంకేతంగా వ్యవహారంలో ఉన్నప్పుడు ఆ సందర్భంలో అది అభిధావృత్తిలోను, లక్ష్యార్థానికి సంకేతంగా వ్యవహరిస్తున్నప్పుడు లక్షణావృత్తిలోను ఉన్నదని అంటారు. అభిధ అంటే పేరు అని అర్థం. అభిధా వృత్తిలో పదం అది దేనికి పేరో ఆ అర్థాన్నే ఇస్తుంది. లక్షణా వృత్తిలో అది కొన్ని లక్షణాలను మాత్రమే స్ఫురింపజేస్తుంది. ఈ అంశాన్ని ఇట్లా సూచించ వచ్చు.

శబ్దం (పులి) అభిధావృత్తి వాచ్యార్థం (ఒక జంతువు) లక్షణావృత్తి లక్ష్యార్థం (ఆ జంతువు లక్షణాలు కొన్ని ఉన్న వ్యక్తి)

ఈ వివరణ ఆటుంచి అర్థాన్ని గూర్చి మరికొన్ని విశేషాలు పరిశీలిద్దాము.

అర్థం అనేది శబ్దం యొక్క సహజమైన గుణం కాదు. మనము శబ్దానికి అర్థం కల్పించుకొని సంకేతంగా వాడుతున్నాము. ఆ సంకేతం తెలియనప్పుడు ఆ శబ్దం అర్థం కాదు. అందుకనే ఒక కొత్తభాష విన్నప్పుడు మనకేమీ బోధపడదు.

రహస్య స్థావరాలలో ఉండి కార్యక్రమాలు నడుపు కుంటున్న ఒక వర్గంవారిలో ఒకరు మరొకరిని కలుసుకోవాలి. ఒకరిని ఒకరు ఎరగరు. ఏదో రోడ్డుమీద ఫలాని చోట ఈ సమయంలో కలుసుకోవాలని నిర్ణయమైంది. అయితే అక్కడ కాకతాళీయంగా ఎవరయినా ఉండవచ్చుగదా! ఆ సమయంలో అక్కడ నిలబడి ఉన్నవ్యక్తిని సమీపించి అతడు అడిగాడు. "మాస్టారూ, మంచి కాఫీ దొరికే హోటలేదయినా దగ్గరలో ఉందా?"ఆ నిలబడ్డవాడు చిరునవ్వునవ్వి, కాఫీమాట చెప్పలేనుగాని చక్కటి టీ కావాలంటే మాత్రం నాతోరండి; నేను తీసుకుపోతా" అన్నాడు. అయితే పదండి అని ఆతడిని అనుసరించాడు ఇతడు. ఈ సంభాషణను సంకేతంగా వాడుకొని ఒకరినొకరు గుర్తించారన్నమాట. ఈ సంభాషణ మరెవరయినా వింటే ఏం అర్థమౌతుంది. వాళ్ళకు మాత్రం ఇది మరో విధంగా అర్థమైంది.

కాబట్టి అర్థమనేది మాటలోకంటె మన మనస్సులో ఉన్నది. ఒక్కొక్క మాట వల్ల మాటల కలయిక వల్ల మనస్సులో కొన్ని భావ చిత్రాలు ఏర్పడతాయి. ఒక్కొక్కసారి వ్యక్తికీ వ్యక్తికీ మధ్య ఈ అర్థంలో భావ చిత్రాలలో తేడాలు రావచ్చు. అయినా వీటిలో సామాన్యాంశమే ప్రధానమై ఒకరి నొకరు అర్థం చేసుకోవడం సంభవిస్తుంది.

BRAOU

ఇల్లు, ఊరు, భోజనం లాంటి మాటలకు ఎవరికి పరిచితమైన విధంగా వారి మనస్సుకు గోచరమౌతుంది. పూరిల్లో, పెంకుటిల్లో, భవంతో ఏదయినా ఇల్లే. కనుక ఆ వ్యక్తి తాహతు, అనుభవం, అభిరుచి లను బట్టి వీటికి అర్థాలు వస్తాయి. ఇటువంటి మాటల అర్థాన్ని ఆత్మాశ్రయ అర్థం అనవచ్చు.

అట్లాగే ఒక్కొక్క మానవ సమాజానికి ఒక్కొక్క రకమయిన జీవన సరళి ఉంటుంది. అది ఆ సమాజం యొక్క సంస్కృతి. అది ఒక సమాజానికి మరొక సమాజానికి మధ్య వేరువేరుగా ఉండవచ్చు. నోము, వ్రతము పూజ, పసుపుకుంకుమ, పాదాభివందనం, పేరంటం లాంటి పదాల వెనక అటువంటి ఆచార సంపత్తి ఉంటుంది. వాటిని సాంస్కృతికంగా అర్థం చేసుకోవాలి. దాన్ని సాంస్కృతికార్థం అనవచ్చు.

మాటలు వాటి అర్థాలను గురించి ముందు ముందు పాఠాలలో ఇంకా తెలుసుకునే అవకాశం వస్తుంది. ఈ పాఠంలో వచ్చిన కొన్ని ముఖ్య పదాలు వాటి వివరణ:

నియతమైన - మార్చడానికి వీలు లేని, ఖచ్చితమైన
సంకేతం - గుర్తు, చిహ్నము
నిర్వచనం - వర్ణిస్తూ ఒక విషయాన్ని వివరిస్తూ తెల్పడం
వాచ్యం - స్పష్టంగా చెప్పినది
వాచ్యార్థం - ఒక మాట దేనికి పేరో దానినే చెప్పే అర్థం
లక్ష్యార్థం - (సందర్భాన్ని బట్టి) ఒక మాట దేనికి పేరో సరిగా ఆదే అర్థంగా చెప్పకుండా ఆ లక్షణాలు కొన్ని గ్రహించి చెప్పుకొనే అర్థం.
అభిధ - పేరు
అభిధా వృత్తి - ఒక మాట వాచ్యార్థం తెలిపేటప్పుడు 'అభిధా వృత్తి' లో అర్థమిస్తున్న దంటారు.
లక్షణా వృత్తి - ఒక మాట లక్ష్యార్థం ఇస్తున్నప్పుడు 'లక్షణా వృత్తి' లో అర్థమిస్తున్న దంటారు.

## అభ్యాసం (చదివేపని)

BRAOU

ఈ క్రింద ఇచ్చిన కథ చదవండి. రాచకొండ విశ్వనాథ శాస్త్రి గారు చాలా కథలు, నవలలు రచించారు. 'ఆరు సారా కథలు' వీరి కథా సంపుటాలలో ఎక్కువ ప్రశస్తి పొందింది. అల్పజీవి, రాజు-మహిషి, గోవులోస్తున్నాయి జాగ్రత్త, రత్తాలూ రాంబాబు, మూడుకథలు బంగారం, సొమ్ములు పోనాయండి, ఇతర నవలలు, నాటకాలు కూడ రాశారు. 'నిజం' నాటకం చాలా ప్రసిద్ధి చెందిన నాటకం.

మాండలిక భాషను అత్యంత శక్తివంతంగా వాడిన కొద్దిమందిలో విశ్వనాథశాస్త్రిగారొకరు. ప్రజల భాషలోని నుడికారం, జీవం వీరి వచనంలో ప్రతి ఫలిస్తుంది. ఇంతకు ముందు రచయితలు అంతగా పట్టించు కోని అధో జగత్సహోదరుల జీవితాలను, వైరుధ్యాలను, జీవిత సంఘర్షణలను చిత్రించటంలో విశ్వనాథశాస్త్రిగారు నేర్పరులు మద్య నిషేధం రోజుల నాటి కథ ఇది.

నేర ప్రవృత్తిని పెంచడానికి దోహదం చేస్తున్న యంత్రాంగం మీద, సమాజ పరిస్థితుల మీద రచయిత చేసిన దాడి ఈ కథలో కన్పిస్తుంది. రాకెట్ అప్పారావు చేసినది మోసమో, హెడ్ గారు పెట్టాలను కున్న మోసం కేసు ఎక్కువ మోసమో అన్నది కథలో సమస్య.

# మోసం

రాచకొండ విశ్వనాథశాస్త్రి

పెద్దోడివే కాని గురూ, నీకేటీ <u>తెల్దుగురూ</u>" అన్నాడు రాకెట్ అప్పారావు.
<u>గురుడు</u> ముఖం వేలేసుకున్నాడు.

రాత్రి పది గంటలయింది. ఇద్దరూ గురు వింట్లో నడవలో నులకమంచంమీద కూర్చున్నారు. చీకటిగా చలిగా తడిగా ఉంది. పైన <u>కమ్మలమీద</u> వర్షం దడదడ లాడిస్తోంది. వీధిలోంచి కుళ్ళువాసన ఉండి ఉండి గుప్పున

కొడుతోంది. గురుడు చుట్టా, శిష్యుడు సిగరెట్టూ కాలుస్తున్నారని వాసన బట్టి తెలుస్తోంది. వాన తడికి చీకటి మరీ బిగిసి పోయిందేమో, వాళ్ళిద్దరూ నీడలో నీడల్లా ఉన్నారు.

రాకెట్ అప్పారావుకి పాతికేళ్ళుండవచ్చు. మీసం గడ్డం సరిలేకపోడంచేత ఇంకా లేతగ కనిపిస్తాడు. పొట్టిగా ఉండడంచేత కొన్నాళ్ళు అతణ్ని అందరూ "ఒరే! జపాన్!" అని పిల్చేవారు. సైకిలెక్కిన ఓ జవానొక సారి అతణ్ని వెంటబడితే మూడు గాలన్ల సారా మోసూనే రయ్‌మని రాకెట్లా పరిగెట్టి జవాన్ని మెడ్డీసేడతను. అప్పటి నుంచే రాకెట్ అప్పారావయేడు. అతను సంబరాల్లో ఏ ఆడదాన్నయినా ఏ మూలకైనా వెళ్ళి 'అటాక్' ఇచ్చేస్తాడు. అందుచేత బాణంమార్కు అప్పారావని కూడ రసజ్ఞులతణ్ణి పిలుస్తారు. లైలాలయెడల అతను మజ్నూ సారాయిలో 'దేవదాసే దేవదాసు, మనోడే మనోడు.'

గురుడి పేరు గురయ్య. మొదట్లో సారా కూలీలకి పైలట్‌గా ఉండేవాడు. కాని, జవానెవడో, మనిషెవడో సరిగా పోల్చుకో గలిగే జ్ఞానం అతనికి లేక పోవడంవల్ల చాలా మంది కూలీలు జెయిలుకి పోవడం, వారి షావుకార్లు దెబ్బ తినటం జరిగింది. తరువాత, సారాకూలిగా కుదురుకున్నాడు. సత్తువైన మనిషవడంచేత ఎక్కువ సారా మోయ గలిగేవాడు. ఎంత యెక్కువ మోసినా అదంతా వ్యర్థమే, పోలీసు లతణ్ని మూడు నిమిషాల్లో పట్టేసేవారు. తరువాత స్వంతంగా వ్యాపారం పెట్టుకొని స్వయంగా చాలా డబ్బు పోగొట్టు కున్నాడు. అతనికి ముప్పయ్యయిదేళ్ళుండవచ్చు ఇంకా ఎక్కువ వయసువాళ్ళా వుంటాడు.

''యాపారంలోకి దిగి సెడిపోన్రా నా శిసువా!'' అన్నాడు గురుడు.
''నీ కేటీ తెల్దుగురూ!'' అని మళ్ళీ అన్నాడు రాకెట్టు.
''తెల్దు'' అని గురుడు వప్పేసుకున్నాడు.
''అందుకే కాకావోడిలా నీ పెళ్ళాన్ని గెద్ద తన్నుకు పోయినట్టు తన్నుకుపోస్తు'' అన్నాడు రాకెట్టు.
''దొంగ నంజకొడుకు. నమ్మించి దగాచేసేడు నంజి కొడుకు.''
''అదిసేత ఇప్పుడది టీకొట్టు ఎట్టించింది. సారా అమ్ముతుంది. ఆడికి మదుపులేని యావారం.''
''అలా సూస్తావుండు. లంజకొడుకుని సరికేస్తానో నేదో!''

"ఆ పనినా కొగ్గి! అణ్ని, కికాస్ జేయిస్ని నీ పెళ్ళంని నీ కప్ప జెప్పే పూసీ నాది. కాని గూరూ! ఒక్క మాటిను, ఎంత సెడ్డా నువ్వునాకు గురువ్వి. తొలీత నాను కూలికొచ్చింది నీయినకే. ఆ ఇశ్వాసం నాకుంది. అందు చేత నీ పెళ్ళంని నీ కప్పజెప్తా అయితే నువ్వెర్రి పీరువి, బావుపడ నచ్చనాలు నేవంటే నేవు. నువ్వు బావుపడా లంటే–శిశువుని గురువుకి దోధజేస్తున్నాను, ఇనుకో! నువ్వేకాదు, నోకంలో యెవరు ఈ రోజుల్లో బావుపడాలన్నా, డబ్బుండాలి; మాయుండాల. దబాయింపు సెక్సనుండాలి! బోధపడిందా? డబ్బులో దేవుడున్నాడు"

"అందులో తప్పేటుంది గనక!"

"అవును గురూ? డబ్బులో అన్నీ వున్నాయి కాపోడు, మాలోడు, బేపనోడు, రాసోడు, కోమిటోడు డబ్బుంటే అంతమందిరీ దేవుళ్ళే. లచ్చి తల్లికి జాతిభేదం నేదు. రైటేనా?''
"రైట్"

'ఆ లచ్చి తల్లి యెందుల వుంది? యెందులబడితే అందలే వుంది. ఆ యమ్మ యెందలనేదు? నాయెంలలేదు. అన్నాయంల వుందిగాని నాయెంల నేదు. రైటేనా?

'నువ్వు నాయెంగ బతికేవు. బతికితె నీ కేటొచ్చింది?'
సేతికి సిప్ప!''
'అందుచేత, ఏటన్నా మాటా? సారాల నీళ్ళాయ్యాల. నల్లమందుల మన్నుకలపాల. బ్రాకెట్ల దొంగటిరి సెప్పాల. బియ్యెంల రాళ్ళు కలపాల, బియ్యే ఎమ్మేల లంచాలు కొట్టాల! అప్పుడే డబ్బు.'
'బాగా సెప్పేవు.'

నాను సెప్పిందే కాదరా గురూ! మొన్న పార్కుల బెజాడవోడెవుడో గాని పెద్ద 'పీచ్' ఇచ్చి అందల ఆడు జెప్పేడు. మాబాగా జెప్పినాళ్ళె. ఉంచ తగ్గోడు. అయితే, యీ మాయపనులూ దొంగపనులూ సెయ్యడానికి అడ్డొచ్చే దేటి? అని అడిగినాడు. అడ్డొచ్చేది గవర్నమెంటూ అని ఆడే జెప్పినాడు. మరయితే సేసేవోళ్ళంతా మాయపన్లు యెలా సేస్తున్నారు? అసలు యీ గవర్నమెంటంటే ఏటి? అని అడిగినాడు. గవర్నమెంటంటే ఏటి? ఇప్పు!

'ఏటా?' అని ఆలోచించేడు గురుడు.
'అఁ, ఏటి?'
''సెప్తానుండు, గవర్న మెంటంటే వోట్లు.'
'కాదు''
'మరయితే యేటి'
''నోట్లు!''

'అవ్వ్రన! మా బాగా సెప్పేవు! ఆ మద్దెల ఎలక్ సాన్లకి బట్టల షావుకారు పెచారానికి పిలిస్తే ఎళ్ళేను. పెచారానికి నాలుగిస్తానని ముందల జెప్పి ఆ యెనక అయిదు పెచారాలకీ పదిచ్చి 'శాన శాన' పొమ్మని గసిరీసినాడు. నంజికొడుకు. అది ఎకస్పార్టీ నంజికొడుకు ఆడేటి జేసేడంటే, తొల్త అయిదిస్తానన్చెప్పి, ఆ యెనక వోటేయించు కున్నాక నా సేతల రెండెట్టేడు! సూడీ అన్నేయం.

మరేటనుకున్నావు? మాయ లంజికొడుకు లంతే సేస్తారు. అయితే - గవర్న మెంటంటె డబ్బేగదా? డబ్బే కాని మనకి పైక్కనింపిచేదేటి?

ఏటి? సెప్పు.
తెల్లార్లెగిస్తే మనక్కనిపించేదేటి?
పోలీసోడి టోపి,

పస్టుక్లాస్‌రగురూ! పనికొస్తావు. పరవానేదు. నిజం కనిపెట్టేవు. ఆడు సెప్పిందీ అదే? గవర్న మెంటంటే మనకి పోలీసోడు. మన పళ్ళెటూళ్ళంట మున్సీబు, కర్నాలు. పైకెల్తె తాసీల్‌దారు, కల్క్రెటు, ఇంకా పైకెళ్ళి గవర్న మెండేటని జూస్తే ఎమ్మెల్యే నెంబరు, ఆడిపైని మినిస్టురి! అసలు సంగతది. ఈళ్ళందరూ గవర్నమెంటు. అంచేత ఆళ్ల అడ్డు మనకి నేకుండ ఉండాలంటే ఆళ్లని మనమే డబ్బెట్టి నిలబెట్టాల; నేకపోతే ఆళని కొనాల. అంటె- డబ్బున్న పెద్దపెద్దమాయగోళ్ల అసలు గవుర మెంటు! అళ్ల ఈల్లందిర్నీ కొనుక్కు నిలబెట్టుకున్నారు అందుకేరాగురూ! డబ్బుండాల, మాయుండాల, డబాయింపు సెక్సనుండాల!''

అని ఈ విధంగా గురువుకి రాజనీతి, బతుకు తెరువూ వగైరా విషయాల గురించి బోధించిబోధించి చివరికి అసలు విషయంలోకి దిగేడు రాకెట్టు.

''మూణ్రోజులయి వోరసం, ఊర్లె సరుకునేదు. రేపుగాని మనం సరుకు ఒట్టుకొచ్చామా, మరింక జూసుకో! ఒంకగేలన్ల సరుకూ గంటలకలాస్! మంచి సరుకు సవగ్గ తెచ్చి పూసీనాది. కాని సేతల కాన్లేదు. యాబయ్యయినా బజాన యిస్తేగాని ఆడు సరుకివ్వడు. యాబయ్ యిస్తే రొండందల సరుగ్గాదు అయిదొందొలదైనా యిమ్మంటే యిచ్చేస్తాడు మరేటంటావు! నాబం సెరిసగం! సరుకు రప్పించే పూసీనాది. అమ్మకం పూసీనాటి. నష్టంవొస్తే ఎట్టుకుసేపూసీనాది. మరేంటంటావ్' అని గురుణ్ని ప్రశ్నించాడు.

గురుడు గుణిసేడు: చేతిలో నయాపైసా లేదన్నాడు. ఉంది కాని అది మరొకరిదన్నాడు. ఇవ్వడానికి వీల్లేదన్నాడు. ఇచ్చేస్తేయెలా, వున్నదే అదికాదా? అన్నాడు. చివరికి యిచ్చేడు. ఇచ్చేముందు బుడ్డిదీపం వెలిగించి, డబ్బుసరిగా లెక్కపెట్టిమరీ యిచ్చాడు.

''సూసేవాగురూ! డబ్బు అవుపించేసరికి దీపం ఎలా యెలిగిందో?'' అన్నాడు రాకెట్టు, పంట్లాంజేబులోకి డబ్బుదోపుతూ.

''ఇంటికిదీపం ఇల్లాలు గురూ!'' అన్నాడు గురుడు.
''దాని సికప్పజెప్పే పూసినాది'' అన్నాడు రాకెట్టు

మర్నాడు సాయంకాలానికల్లా వర్షం బాగా వెలిసింది. మబ్బులన్నీ తేలిపోయాయి. ఆకాశం నిర్మలంగా వుంది. రాత్రి పదిగంటల సమయంలో పోలీసు స్టేషన్‌లో హెడ్డుగారు చొక్కా విప్పేసి, తెల్లని బనియనూ, కాఖీ నిక్కర్తో కుర్చీలో కాళ్లు ముడుచుకు కూర్చొని లోకాన్నీ, డిపార్టుమెంటునీ బూతులు తిడుతున్నాడు. అతనికి నలభై సంవత్సరాలుండొచ్చు. దళసరిగావున్న అతని ముఖం భీకరంగాను, బద్ధకంగానూ వుంది. అతనికళ్లు నిద్రకళ్లు.

''ఇదెక్కడ పోలీసుద్యోగంరా నాయనా! సస్తన్నాం! అని ఎదురుగా ఉన్న జవాన్తో సెప్తున్నాడు. తెల్లారేస్తే నాలుగు సెవాలు, పడేక్సిడెంట్లు, యిరవై స్టోరీలు! ఈటితో ఛస్తంటే ఇయి సాలక ఎయ్యిమందికి బందో బస్తులు. రోజుకి పీకలమీదికి తోక తక్కువ తొంబై మంది మినిష్టర్లు, అయిదరాబాదోళ్ళు యిరవై. సెంటలోళ్లు అరవై! ఎడ్డికేషన్ మినిష్టరొహడు, ఎగ్రికల్‌సర్ మినిష్టరొహడు, ఎగిరిగెంతే మినిష్టరొహడు! ఈళ్లందరికోసం ఎండల మన పడిగాపులు. తిండుండదు కంటిమీద కునుకుండదు. ఈలోపల, 'నా పెల్లం నెగిసిపోయింది సార్' నా 'కూతురు కని పించదు సార్,' 'నా మొగుడు తొంగోడంట సార్' 'నాయత్త కొట్టింది సార్' ఇలా యెయ్యి కుక్కజట్టీలూ కంప్లేంట్లూను. అన్నిటికీ అందరికీ పోలీసోడే కావాల! మొన్న - ఆడెవడో పెద్ద కంపెనీ డైరక్టరట, డవిరెకటరు- ఆడి పెరట్లోకి పెద్ద పాముచ్చిందని పోను! పోలీసోడికి పాంమంత్రం రావాలనకున్నాడో ఏటో లంజికొడుకు. దేసెంల యింతమంది లంజికొడుకులూ ఉన్నారుగాని ఒక్కడూ కాజీ కసగడు గదా! ఎవణ్నెత్తి మీద సేతులెడదామా అని మనం ఎయ్యికళ్ళతో యెదుకుతుంటే, ఎనకనుంచి సబిన్‌స్పెటుర్బాబు మననెత్తిమీద యేస్తాడు అస్తం! బాబుది మా సల్లటి సెయ్యికదూ! ఎయ్యగానే అక్కడికాడు బస్మం. ఒకనెలకి ఎయ్యిరూపాయలు ఎందర్నెత్తి మీద ఎయ్యేస్తే గాని కిడతాయి? అడి బాబుగోరుసొమ్మా? ప్రజల సొమ్ము! అందల మన కేటైనా వుందా? కాన్లేదు! పరువూ, మరియాదా పొదులుకు ఈణ్నీ అణ్నీ బక్కరగా బక్కరగా నెలకి నూరుకిట్టడం బెంమాండంగుంది మనకి. అదైనా ఒట్టినె పోనిస్తారా అయ్యలు? మనకాడికొచ్చేసరికి రోజుకి నాలుగు శార్జీలు, ఆరు షోకాజులూను! ఏదీ కతక్కుండా కట్టినకేసు కట్టినట్టుగా దరియాప్తుచేసి కోర్టుకి పట్టుకెళితే అక్కడ పీకలమీదికి రాబందుల్లా ఈప్లీడరుగాళ్లొహళ్లు! ఈసాక్షికాలు లంచాలు తినీడం కేసుల కెసరెట్టీడం! ఏం చెప్పమంటావు మనబాధలు?! ఇంక ఆ మేస్త్రీబోపాపం! శిన్న పిల్లల్లాస్తె జడుసుకు మంచాలెక్కేయాలన్నమాట. అదియెనకాల ఆడికి కావలసిన శాకరీ సెయ్యక గట్టిగ బిగిద్దారంటె కేసుకీ మనకి యెయ్యి లొసుగులు. కడకి కేసులన్నీ ఎక్కిట్టు; మాటిమాటికి మనమీద ఊక్షలు! ఈలోపల కంటికి కునుకుండదు. కడుపుల టీ సుక్కలే తప్ప గెంజినీళ్ళయినా వుండవు. ఇలా కొట్టుకు సచ్చిసచ్చి ఇంటికి పోదావంటె దారే తెలకుండావుంది. మొన్న సాయంత్రం ఆరింటికి ఇంటికెళితే గుమ్మంలో గుమ్మటంలా నిల్సుంది'రె! సూసి గుమ్మయిపోన్ను. సిన్న సిరునవ్విసిరి పారేసి, ఎవరుపిల్లా? ఎవరుకావాల? అన్నాను. అంటే 'ఆసికాలా? ఏసికాలా? లేపోతే డోసెక్కువైందా' అందది. సూస్తే యింకెవరు? నా పెళ్లాం! ఇయిరా బాబు మనుద్యోగాలు! పెళ్ళాల్ని పోల్చిపట్టలేని ఉద్యోగాలు. జీతం నెలకి నాలుగుపదులు పన్జూస్తే పని బరువు నాలు గొందలు. ఏదో మోటు సామెత జెప్పినట్టుంది. యవ్వారం అంతాను ఏదీ! బేగళ్ళి ఒక మంచి టీ-బాగా యేడి గుండాల - పట్టుకుగప్పునా! ఆరుకాన్లీరవుజెప్పు, కరువుల అదికమాసం, కాన్లేక సస్తంటే ఇయాళ్దాక పొరసం ఒకటి ఇయాళైనా ఓ సారా బెయిలైనా ఉంటుందో వుండదో! ముందు నువ్వెళ్ళి బేగిరా!" అని హెడ్డుగారు అంటూవుండ గానే ఫోను గుర్రున మోగింది.

తిట్టుకుంటూ ఫొన్ తీసి 'చిత్తంసార్, సరే, సార్! అవును సార్! సరేసార్! సరే...చిత్తం, సెలవు' అని ఫోను పెట్టేళాడు హెడ్డు.

''చస్తుంటే సవ్వనీకంద ఈ డొక్కుడా!'' అని కేకలు వేశాడు.

సంగతేమిటి అంటే: రాకెట్టుగాడు డియస్పీ దొరగారి దగ్గరికి వెళ్ళి ఇన్‌పర్ మేషన్ ఇచ్చేట్టు - గురయ్య గాడు ఇవాళరాత్రి ఎగువనుంచి అరవై గేలన్ల సారా రప్పిస్తున్నాడు. ఆరుగురు కూలీలచేత ఆరు పెద్ద మోటరు. ట్యూబులు మోయించు కొస్తున్నాడు. దారి కాసి పట్టుకో వచ్చును. అది దొరగారికి రాకెట్ యిచ్చిన బోగట్టా.

సారానీ, కూలీలనీ దారికాసి పట్టుకోమని హెడ్డుగారికి డియెస్పీగారు ఆర్డరు జారీచేసేరు.

పర్యవసానంగా, అదే రాత్రి ఒంటిగంటకి, మూసివేసిన ఒక కిళ్లీబడ్డీ కింద చీకట్లో కూర్చొని, లోకాన్ని బూతులు తిడుతున్నాడు హెడ్డు. ఆ చీకట్లో అతనూ, రాకెట్టూ, నలుగురు జవాన్లూ బడ్డీకింద తారుడబ్బాల్లా కని పిస్తున్నారు. పక్కన కుళ్ల కాలవలోంచి మురికికంపు, జబ్బువాడి పగలా పట్టుకు వదలకుండా ఉంది. ఆకాశంలో చుక్కలన్నీ చలికి గజగజ వణుకుతున్నాయి.

''ఏరా లంజికొడకా! ఎవడూ అవుపించడేంరా? అన్నాడు హెడ్డు.

ఇంకా టయింకానేదు అన్నాడు రాకెట్టు.

ఆళ్ళు రాకపోతే నీ టయిం ఇవాళ్తోసరి అన్నాడు హెడ్డు.

BRAOU

చుట్టూ అంతా చీకటి చీకటిగా ఉంది. బురదబురదగా చాలా చిరాగ్గా ఉంది. కొంపలు మునిగిపోయినట్టు కప్పలు బెకబెకలాడి చంపేస్తున్నాయి. దోమలు, రెక్కలొచ్చిన కందచీమల్లా తినేస్తున్నాయి.

దేసెంమీద, ఎడ్డుగారూ, ఇన్ని కప్పలేటి? ఇన్ని దోమలేటి? అని ఒక జవాను నెమ్మదిగా అన్నాడు.
వాటినలా ఒగ్గి! ఈ కంపుమాటేటి? గోదారొచ్చి కొట్టేసినా ఈ కుళ్ళొగ్గదు! అనిమరో జవానన్నాడు.
''సలి సలి'' అన్నాడు రాకెట్టు.
''నువ్వు లంజికొడకా'' అన్నాడు హెడ్డు.

రాత్రి ఒంటిగంటదాటి రెండయింది. రెండున్నర దాటి మూడయింది. తెల్లవారుజాము నాలుగయింది. అయిదున్నరకి తెల్లవారింది.

కాని, గురయ్యలేడు, కూలీలులేరు, సరుకూలేదు.
హెడ్డుగారు ''ఏరా? లంజికొడకా !'' అన్నాడు రాకెట్టుని ఉద్దేశించి.

గురయ్యగాడు - నంజికొడుకు - ఇయాళ మస్కాకొట్టీసనాడు బాబూ! అయితే, ఇయాల్తో అయిపోయిం దేటి? ఇయాళ కాపోతే రేపైనా దొక్కడా? పట్టప్పజెప్పెపూసీ నాదీ!'' అంటూనే గబాగబా వెళ్ళిపోయేడు రాకెట్టు.

ఇలాటి కొడుకుని నమ్మేదా డియస్పీ ఛత్తెరి! ఆడికి డియస్పి ఉద్యోగం ఎవడిచ్చేడ్రా ?! అన్నాడు హెడ్డు

''ఆ బాబుని కూకద బెట్టాల్సింటీ సల్లో అన్నాడు జవాను.
''ఆళ్లకి రగ్గులకింద తొంగోడాలు, మనకి సల్లో సచ్చేదాలూ'' అన్నాడు మరొక జవాను.
''నడండార్రి నాయన్లారా నడండి. ఏటనుకుంటే ఏంలాభం? నడండి'' అంటూ దారితీశాడు హెడ్డు.

ఇదంతా జరిగిన మూడోరోజు సాయంకాలం నూకాలమ్మ గుడిదగ్గర కిళ్లిబడ్డీ దగ్గర రాకెట్టు విసురుగా నడుస్తూ వస్తు న్నాడు. సిల్కులాల్చీ, తెల్ల పంట్లాం, చుక్కల కర్చీపూ పువ్వుల్లా ఉన్నాయి. నోట్లో సిగరెట్టు వేళాడు తోంది. ఎడమ చేతిలో అగ్గి పెట్టె కుడిచేత్తో హుషారుగా లయపడుతోంది. ఆ సమయంలో ఆ గుడిదగ్గర రాకె ట్టుని అటకాయించేడు గురయ్య.

''గురూ గురూ''అంటూ, నంజికొడకా. ఎక్కటా ఏటి జేసేవు? ఇదా నువ్వు జేసినపని! నా డబ్బేది? నా సరుకేది? నా సరుకమ్మిన డబ్బేది? సెప్పు నంజికొడకా? అని కేకలు వేసేడు గురయ్య.

గురువుని ఒక్క ఊపూపి చొక్కా విడిపించుకున్నాడు రాకెట్టు. తరువాత, నలిగిన బట్టల మడతలన్నీ సర్దుకున్నాడు. మెళ్ళో రుమాలు ముడివిప్పి తిరిగి సరిగ్గా కట్టుకున్నాడు. ఆ తరువాత జేబులోంచి అయిదు కాయి తాలు తీసి గురువు చేతికిచ్చేడు.

''నెక్కెట్టుకో! యాబయ్యి ఉంటాయి. అయిదు పదులు. కాణెక్కువనేదు. కాణి తక్కువనేదు; మంచోణ్ణి కాబట్టి నీ డబ్బు నీ కిచ్చీసినాను.

''నా మదుపు నా కిచ్చీసినావు. మరి సరుకమ్మిన సొమ్మంతా ఏటి సేసేవు? అందుల నా వోటా ఏది?
''మరింకేం మాటాడక! మాటాడొద్దంతే! డబ్బుండాల, మాయుండాల, డబాయింపు సెక్సనుండాల! పాటం సెప్పినందుకు నీ వోటా నా ఫీజు కర్సుకి సెల్లు, మరింక బేగి ఇంటికెళిపో! నోరెత్తె తంతాను 'అని చెప్పేసి' కొత్త బూట్లు టకటక లాడించుకొంటూ వెళ్లిపోయేడు రాకెట్ అప్పారావు.

అదేరోజున అదే సమయంలో పోలీసు స్టేషన్లో ఒకజవాను తొందరగావచ్చి హెడ్డుగారితో, ఏఁవండోయ్ యెడ్డుగారు! ఆయాళ ఆ రాకెట్ అప్పారావుగాడేం జేసేడో తెలిసిందా!'' అన్నాడు.
''ఏం జేసేడు?''

BRAOU

''అదిగో పులి, అన్జెప్పి మన్ని ఆ దిక్కుల బడ్డీకింద తెల్లర్లూ కూకదబెట్టేడు. ఇవతల ఈ దిక్కుంట చల్లగ సడి సప్పణ్నేకండ ఇరవై గేలాంల సరుకు రప్పించేసుకున్నాడు. ఎంత మాయలంజికొడుకో కనిపెట్టేరా? సంగతంతా ఇయాళ తెలిసింది నాకు.''

''అమ్మ, పొట్టిలంజికొడుకు! ఎంతిపన్జేసేడు? అయాళ సల్లో బిగిసిపోయినజాయింట్లు ఇయాల్టికింకా సరిగా యిద్దం లేమ. మంగలాడు పావిఁనా ఈ యెదంకాలింకా సరిగా సాక్కుండుంది! అమ్మ లంజికొడుకెంత పన్జేసేడు!? సూడూ! నువ్వెళ్ళి ఆ లంజికొడుకు ఎక్కడుంటే అక్కడకెళ్ళి పిలకట్టు కీడ్సుకొచ్చి కొట్లో అడేయ్! 'అర్ధరేత్తిరి స్మశానం అవతల గోనెమూటన మోటరు ట్యూబుల నాలుగ్గేలంల సారా బుజాన్నెత్తుకు మోసుకొస్తున్నాడు. అనుమానంమీద సెకింగ్ జేసి పట్టుకున్నాము. స్మశానం కాడదెయ్యాలప్ప ఏరే మద్దెవత్తులు దొరకనందున యీ అక్కారెన్సు రిపోర్టు రాయడమైనది' అని ఆడిమీద కేసు పెట్టకపోతే సూడు మోసం కేసే, దగాయే, అన్నేయంవేఁ! కాని ఏ మేస్ట్రీటు కేసు కొట్టేస్తాడో, కొట్టేదాని కాడి కెన్నిగుండెలున్నాయో నానూ సూస్తాను. బోనెక్కి పోలీసోడు జెప్పిన మాటకి తిరుగులేదంటే లేదని యెయ్యి తీర్పులున్నాయి అంచేత, ఎళ్ళు బేగెళ్ళి అట్నీడ్సుకురా? అని జనాన్ని తగిలేరు హెడ్డుగారు.

[రాచకొండ విశ్వనాథశాస్త్రి, ఆరు సారాకథలు, విజయాబుక్స్, విజయవాడ-2 1962 పే 73-98]

## అభ్యాసం (రాసేపని)

1. అభిధా వృత్తిలోను లక్షణా వృత్తిలోను అర్థాలు చెప్పడానికి వీలయిన కొన్ని పదాలను పాఠుకలోనుంచి గ్రహించి వాక్యాలలో ఉపయోగించి ఉదాహరణలు ఇవ్వండి. ఆ తరువాత ఆ పదాలను అకారాది క్రమంలో నిఘంటు రూపంలో పట్టికగా వ్రాయండి.

ఉదా.

అది పులి.

వాడు పులి.

**పులి**- 1. మాంసాహారి, ముదురు పసుపు పచ్చ రంగు మీద నల్లని చారలున్నది, పిల్లిజాతికి చెందినది అయిన పెద్ద జంతువు. ఆసియా ఖండానికి చెందిన పాంథెరా టైగ్రిస్, భారత దేశంలోను, మలె ద్వీప కల్పం నుంచి సైబీరియా దాకా వ్యాపించి వివిధ ఉప జాతులలో కనిపించేది. 2. (లక్షణ) ఠీవిగా, గంభీరంగా, ఎదురు లేకుండా ఉండి భయం గొలిపే వ్యక్తి

గమనిక

1. తెలుగు నిఘంటువులలో పదాలకు నిర్వచనాలు దొరకటం చాలా అరుదు. ఇంగ్లీషు-ఇంగ్లీషు నిఘంటువులు చూస్తే నిర్వచనాలు దొరుకుతాయి. వాటిని అనువాదం చెయ్యవచ్చు.
2. కింద గీత గీసిన మాట వాలుగా ఉండే అక్షరాలు ఇటాలిక్స్‌లో ముద్రించేవి. పాంథెరా టైగ్రిస్ ఒక జాతి పేరు. జంతువులకు, వృక్షాలకు శాస్త్రజ్ఞులు ఇలాంటి జాతి పేర్లు పెట్టారు. అవి ఇటాలిక్స్‌లో ఉంటాయి.
3. మోసం కథలో నుంచి కొన్ని పదాలను తీసి క్రింద ఇస్తున్నాం. వీటిని కథలో ఏ అర్థంలో వాడారు? ఆ మాటలకు ఇంకా వేరే ఏ అర్థాలు ఉన్నాయి?

| | |
|---|---|
| గురుతు | పైలెట్ |
| కమ్మలు | బ్రాకెట్ |
| పెచారం (ప్రచారం) | సల్లటిసెయ్యి (చల్లటిచెయ్యి) |
| హెడ్డు | దోసు |
| బెమాండం (బ్రహ్మాండం) | టయం |
| కేసు | జాయింట్లు |
| చుక్క | బోను |
| తల్లి | మాయ |

BRAOU

4. ఈ కథలో అపరాధాలు, పోలీసు కేసులు న్యాయ విచారణ సంబంధించి ప్రత్యేక అర్థంలో వాడే పదాలను ఒక జాబితాగా తయారుచేసి వాటి అర్థాలు వ్రాయండి. (గమనిక) చదువుకోని పాత్రల నోటివెంట వాడుకలో ఎట్లా ఉంటుందో అట్లాగే రచయిత రాయటం వల్ల పదాల రూపం కొన్ని మార్పులతో ఉంటుంది. ఉదా: మాటి మాటికి మన మీద టిక్చర్సు strictures: an adverse criticism or remark, censure (కేసులో బలం లేనప్పుడు అధికారుల మీద వారి సమర్థత, నిజాయితీ మొదలయిన వాటి గురించి కోర్టుచేసే వ్యతిరేక విమర్శ, వ్యాఖ్య)

స్పీచ్ Speech
ఫోన్ Phone

౬. జపాన్, రాకెట్ అప్పారావు, బాణం మార్కు అప్పారావు, లైలామజ్నూ, దేవదాసు- ఈ పేర్లు ఏ అర్థంలో ఉన్నాయి?

BRAOU

ఖండిక 4 పాఠం 6

# నానార్థాలు, పర్యాయ పదాలు

ఉద్దేశం:

మాటలను కొత్త కొత్త సందర్భాలలో ఉపయోగించటం వల్ల, కొత్త కొత్త కలయికలవల్ల నానార్థాలు ఏర్పడతాయి. భాషవాడుకలో నానార్థాలు నిర్వహించే పాత్రను బోధించటం. పర్యాయపదాలు, వాటి అర్థాల్లో వచ్చే భేదాలను సూచించటం.

ప్రణాళిక:

1. కాల క్రమంలో మాటల అర్థాలలో మార్పు
2. మాటలవెనక చరిత్ర
3. సాహిత్యభాషలో నానార్థ పదాలు
4. అర్థవిస్తరణ
5. అర్థ సంకోచం
6. అర్థ పరివర్తనం
7. సంకేతం
8. ఇతర కారణాలవల్ల అర్థంలో మార్పు
9. పర్యాయ పదాలు
10. అభ్యాసాలు; ప్రశ్నలు

BRAOU

## నానార్థాలు

మాటలు - వాటి అర్థాల గురించి కిందటి పాఠంలో చెప్పుకున్నాము. ఒక మాటకు ఒకే అర్థం ఉండాలా? అవసరం కాదు; సంభవమూకాదు. కొత్తకొత్త భావాలు, అభిప్రాయాలు, ఆలోచనలు వస్తువులు వచ్చినప్పుడు ఉన్నపదాలనే కొత్త సందర్భాలలో వాడటం, అందువల్ల వాటికి కొత్త అర్థాలు ఏర్పడటం ప్రతి భాషలోనూ సహజంగా జరిగేదే-అట్లాగే పదాల కొత్త కలయికలు కూడా వచ్చి నూతన భావాలను బోధిస్తాయి ఒక మాటకు ఒకే కాలంలో వేరు వేరు అర్థాలు ఉండవచ్చు లేదా కాలక్రమంలో దాని అర్థం మార్పు చెందవచ్చు ఈ పాఠంలో మాటల నానార్థాలు (నానా + అర్థాలు) గూర్చి తెలుసుకుందాము.

మానవుల అవసరాలు తీర్చటానికి భాషకూడ ఒక సాధనమని చెప్పుకున్నాము. సమాజ జీవితంలో కాల క్రమాన అవసరాలు మారుతూ ఉంటాయి. దానికి అనుగుణంగా భాషకూడా మారుతూనే ఉంటుంది.

భావాలను, అర్థాలను బోధించే పద్ధతి భాషలో ఒక భాగం. కనుక ఆ వ్యవస్థ కూడా మార్పు చెందు తుందని వేరుగా చెప్పక్కర్లేదు. ఒకటి రెండు ఉదాహరణల ద్వారా ఈ విషయాన్ని నిరూపించుకుందాము.

ఒకప్పుడు చీర అనేదానికి వస్త్రము అనే అర్థం. స్త్రీలు కట్టుకొనే వలువలను, పురుషుల దుస్తులనుకూడా చీరలనే అనేవారు. నార చీరలు తాల్చి సీతా రామ లక్ష్మణులు వనవాసానికి వెళ్ళారు. అన్న వాక్యం పరిశీలించండి. ఇక్కడ నార చీరలంటే నార బట్టలు అని అర్థం. క్రమ క్రమంగా వ్యవహారంలో స్త్రీల వలువలకు మాత్రమే చీర అనే మాట స్థిరపడి పోయింది.

అలాంటిదే మరొక పదం 'కంపు' ఈ మాటకు అర్థం గంధము - వాసన అనే వ్యవహారంలో కాల క్రమాన దీనికి దుర్గంధము అనే అర్థమే మిగిలిపోయింది. అర్థంలో వచ్చిన ఈ మార్పును పేర్కొంటూ అందుకనే ఒక విమర్శకుడు చమత్కారంగా "నన్నయ్య నాటి కంపు నేడు మనకు ఇంపుగాదు" అని వ్రాశాడు.

కొన్ని మాటల వెనక అవి ప్రచారంలోకి వచ్చిన నాటి ఆచార వ్యవహారాలు, నాగరికత, సంస్కృతి ఇమిడి ఉంటాయి. మనకు అనువుగా వీలుగా ఉన్న, అనువుగా లేని, విరుద్ధమైన అనే రెండు అర్థాలలో అనుకూల

ప్రతికూల అనే శబ్దాలు వాడుతున్నాము. కూలము అంటే ఒడ్డు. ఒకనాటి నౌకాయాన నైపుణ్యాన్ని సూచించే పదాలు ఇవి. ఒడ్డుకు చేర్చే గాలి అనుకూల వాయువు అయితే ఒడ్డుకు దూరం చేసేగాలి ప్రతి కూల వాయువు. గాలి వాటును వర్ణించడానికి వచ్చిన ఈ పదాలలో ఇప్పుడు ఆటు వంటి అర్థం లేకుండా అవి సామాన్య పదాలు అయిపోయినాయి.

ఒక విధంగా ఆరంభమై, చివరకు మరో విధంగా అర్థం తేలిన పదాలలో నూనె ఒకటి. ఇది పూర్వం రెండు పదాల కలయిక నూ (నువ్వు) + నెయ్యి = నువ్వు గింజల నుంచి తీసిన చమురు. కాల క్రమేణ నూనె చమురు అనే అర్థంలో వాడుక అయి కొబ్బరి నూనె, వేరుశనగ నూనె, ఆవనూనె, కుసుమనూనె, మొదలయిన సందర్భాలలో ఉపయోగానికి వచ్చింది. ఆఖరికి నూనె అనే మాట ఎంతగా సామాన్య పదం అయినదంటే నువ్వుల నూనె అని కూడా వాడుతున్నాము.

ఇటువంటి వాటిని దృష్టిలో ఉంచుకొనే భాషాశాస్త్ర వేత్తలు అర్థాన్ని గూర్చి ఇట్లా చెప్పారు. ఒక పదం గాని, పదాల కలయిక వల్ల ఏర్పడిన పద బంధంగానీ, వ్యవహారంలో అనేక సందర్భాలలో అవి ఇచ్చే అర్థాలు కాస్త అటూ ఇటూగా వేరు వేరుగా ఉండ వచ్చు. ఆ అర్థాలు, ఆ అర్థచ్ఛాయలూ అన్నీ కలిపితే ఆ పదం యొక్క అర్థం అవుతుంది. లేదా పద బంధం యొక్క అర్థమవుతుంది. దీనిని మరికొంత విపులంగా పరిశీలిద్దాము.

కత్తెర అనే పదముంది. దీని అర్థం ఏమిటి? ఈ బట్ట కత్తిరించాలి. కత్తెర తీసుకురా. ఈ సందర్భంలో కత్తెర కత్తిరించే సాధనం. కత్తెరలో ఇల్లు కట్టడం సంబంధించిన పనులు చెయ్యరు. ఈ సందర్భంలో కత్తెర కొన్ని రోజుల కాల వ్యవధి - కృత్తికాకార్తె రోజులు. ఇట్లా కత్తెర అనే పదం రెండు వేరు వేరు సందర్భాలలో వేరు వేరు అర్థాలు ఇస్తున్నది. కనుక ఒక సందర్భంలో ఒక అర్థం. మరొక సందర్భంలో మరో అర్థం ఈ పదానికి ఉన్నాయి. ఈ రెండూ ఆ పదానికున్న అర్థాలే. మాటలు ఉపయోగించే సందర్భం ఏమిటో తెలుసుకోకుండా అర్థం చెప్పటం కుదరదు. సందర్భాన్నే ప్రకరణం అనవచ్చు. ఈ అర్థాన్ని ప్రకరణార్థం అంటాము.

(ఇంగ్లీషులో bank అనే పదాన్ని ఒక ఉదాహరణగా తీసు కోవచ్చు. కాలవ, నది మొదలయిన వాటి గట్టు. ఆర్థిక లావాదేవీలు జరిగే వ్యాపార సంస్థ, నిలవ చేసే చోటు లేదా నిల్వ (book bank, blood bank, question bank మొదలగునవి ఇన్ని అర్థాలలో ఈ మాటను వేర్వేరు సందర్భాలలో ఉపయోగించవచ్చు.)

ఒకే పదానికి ఈ విధంగా ఒకటి కంటె ఎక్కువ అర్థాలు ఉంటే వాటిని నానార్థాలు అంటున్నాము. మన కావ్యాల్లో, సాహిత్యంలో ఇటువంటి నానార్థ పదాలు చాలా ఉన్నాయి. సంప్రదాయ పద్ధతులలో నేర్చుకుంటున్న వాళ్ళు ఎప్పుడో ఒకప్పుడు ఈ కింది ఉదాహరణల వంటి వాటిని నేర్చుకునే ఉంటారు:

హరి — విష్ణువు, ఇంద్రుడు, సూర్యుడు. చంద్రుడు, యముడు, సింహం, గుఱ్ఱం, కోతి, పాము, గాలి, కిరణం, కప్ప, చిలుక, పచ్చనిది, బంగారు వర్ణం కలది.

శ్రీ — లక్ష్మి, సంపద, ఐశ్వర్యం, వృద్ధి. శోభ, అలంకరణం, కీర్తి, బుద్ధి, సరస్వతి, విషం, ఉపకరణం, (సంగీతములో) ఒక రాగం.

కరము — చేయి. కిరణం, తొండం, కప్పం, వడగల్లు, అత్యంతం.
శరము — బాణము, రెల్లు, నీళ్ళు.

ఈ రకంగా నానార్థాలు ఈ పదాలకు ఎప్పుడు ఎట్లా వచ్చినాయో ఇప్పుడు చెప్పలేము. అయితే కొన్ని పదాలకు అర్థాలు ఏ విధంగా కొత్త కొత్తవి వచ్చి చేరుతాయో తెలుసుకోవచ్చు. అర్థాలలో మార్పులు వచ్చే పద్ధతులు ప్రధానంగా నాలుగు మార్గాలుగా ఉంటాయి. అవి :-

BRAOU

## అర్థ విస్తరణ

ఒక కాలంలో ఒక ప్రత్యేకమయిన వస్తువును చెప్పే మాట కాలక్రమాన సామాన్యంగా ఒక జాతిని సూచించే పదంగా విస్తృతి పొందవచ్చు. ఇంతకు ముందు చెప్పిన నూనె ఇందుకు ఒక ఉదాహరణ. తైలము ఇటువంటిదే. తిలలు అంటే నువ్వులు. కనుక తైలము అంటే నువ్వులనూనె. క్రమంగా ఇది నూనె అనే సామాన్య అర్థాన్ని వివరించే పద మైంది. సోదరులు అంటే ఒక తల్లి కడుపున పుట్టిన వారు. ఒకదేశం, ఒక ప్రాంతం, ఒక సంఘం, ఒక వృత్తి ఆశ్రయించిన వారిని నేడు ఈ మాట వ్యవహారంలో సూచిస్తున్నది.

అర్థం విస్తరించి ప్రత్యేకం నుండి సామాన్యానికి మారినట్లే. సామాన్యం నుండి ప్రత్యేక వస్తువుకూ మారవచ్చు, అంటే అర్థం కుంచించు కొన్నదన్న మాట. ఇంతకు ముందు చెప్పిన ఉదాహరణలో నూనె అనేది నూ + నెయ్ అనే రెండు పదాల కలయిక అన్నాము. ఇక్కడ నెయ్యి అనేది ఈ నాటి నూనె వలె సామాన్య వాచకం. అయితే ఇప్పుడు దీనిని ప్రత్యేకంగా (పశువుల) ఆవు, పాడి గేదె నుంచి వచ్చే నెయ్యికి మాత్రమే పరిమితంగా వాడు తున్నాము, ఇందుకు మరో ఉదాహరణ మృగం మృగమంటే జంతువు. కాలక్రమంలో ఇది లేడి అనే అర్థానికి పరిమితమైన ఉపయోగం సంతరించుకుంది మృగం అనే మాటకే వికృతి మెకం (జంతువు). కాని మెకము ఎక్కువగా పులి, చిరతపులి అనే అర్థంలో నిలిచి పోయింది.

## అర్థ పరివర్తనము

ఒక మాట కాల క్రమంలో తన అర్థాన్ని కోల్పోయి కొత్త అర్థాన్ని గ్రహించటం కద్దు. అట్లా అర్థం పరివర్తనం పొందటంలో కొన్ని పదాలకు అర్థం గౌరవం పొందితే మరికొన్ని నిందార్థం పొందుతాయి. ఈ ఉదాహరణలు పరిశీలిస్తే ఈ విషయం స్పష్టం కాగలదు.

BRAOU

| | ముందుండిన అర్థం | ఇప్పుడున్న అర్థం |
|---|---|---|
| ఛాందసుడు | వేదవేత్త | లోకజ్ఞానం లేనివాడు, వెర్రివాడు, సంప్రదాయమే సర్వస్వం అనుకొనేవాడు. |
| కైంకర్యం | సేవ | మోసం, దొంగతనం |
| పూజ్యం | పూజింపదగినది | శూన్యం |
| కంపు | గంధం | దుర్వాసన |
| సభికుడు | జూదగాడు | సభలో ఉన్నవాడు |
| రాక్షసుడు | | సమర్థుడు |

## 4. సంకేతం :

ఒకమాట జన సామాన్యానికి ఒక అర్థమిస్తూ ఉండగా, ఏదో ఒక వృత్తినో, విజ్ఞాన రంగాన్నో అంటి పెట్టుకునే వారికి అది ఒక అర్థాన్ని సంకేతించే సాంకేతిక శబ్దం కావచ్చును. ఆధునిక శాస్త్ర విజ్ఞానం తెలుగులో బాగా వ్యాప్తి కావటం ఆరంభించిన తరవాత భాషాపదాలు అనేకం ఈ విధంగా పారిభాషిక లక్షణం పొందుతూ ఉన్నాయి.

వాయువు : (సామాన్య) గాలి.
: (పశువైద్యం) పశువులకు వచ్చే వాతపు రోగం.
: (ఆధునిక విజ్ఞానం) gas .

ద్రవ్యం : డబ్బు
: (ఆధునిక విజ్ఞానం) పదార్థం - (mass)

ఇంధనం : చిదుగు, వంట చెరకు

(ఆధునిక విజ్ఞానం) ఉష్ణ శక్తిని ఇచ్చే ఏ పదార్థమైనా, చమురు, బొగ్గు, కట్టె మొదలైనవి.

ఈ రకంగా అర్థం మార్పు చెందడానికి మన మనస్తత్వం, మన అవసరాలే కారణం.

తెలిసిన వస్తువు ద్వారా కొత్త వస్తువును చెప్పడానికి చేసే ప్రయత్నంలో వివిధ వస్తువుల మధ్యన పోలికలు గమనించటం వల్ల పలుకు బడులు అర్థాలు మారుతుంటాయి. ధర్మరాజు, యముడు, భీముడు, రంభ, సరస్వతి వంటి పౌరాణిక కావ్య పాత్రల పేర్లు అసలు అర్థంతో పాటు లక్షణార్థం కూడా పొందినాయి.

అట్లాగే శరీరావయవాలను తెలిపే మాటలకు కూడా విస్తృతార్థాలు ఏర్పడినాయి. ఉదాహరణకు -

కాలు - కుర్చీకాలు

చెయ్యి - చొక్కా చేతులు

చెవి - గంగాళం చెవులు, తాళం చెవి

కన్ను - వలకు ఉండే కన్ను

కడుపు - దోనె (ఒక రకం పడవ) కడుపు

పరిసరాలలో నుంచి సైతం ఇట్లా పదాలను గ్రహించి విస్తృతార్థంలో వాడటం గమనించవచ్చు.

ముల్లు - గడియారపు ముల్లు, త్రాసుముల్లు

గూడు - బండి గూడు

కాయ - తలకాయ

వినయం, గౌరవం ప్రకటించేందుకు, ఇతరుల మనసులు నొచ్చుకోకుండా మృదువుగా చెప్పేటందుకు, అశుభం అనుకునే వాటిని తెల్పేటందుకు కొన్నికొన్ని భావాలను నొక్కి చెప్పేటందుకు కూడా పదాలఅర్థాలను మార్చి ప్రయోగించటం గమనించవచ్చు. ఈ కింది ఉదాహరణలను పరిశీలించండి.

(ఎ) దయచెయ్యండి, దేవరవారు, ఏలినవారు, (బి) పెద్దకులం వారు, హరిజనులు, (సి) రజకులు, నాయీ బ్రాహ్మణులు, విశ్వబ్రాహ్మణులు, కీర్తి శేషుడు, అస్తమించారు, పసుపునిండుకున్నది, మంగళసూత్రం పెరిగి పోయింది, దీపం కొండెక్కింది, తెల్లగుర్రం ఎక్కాడు, మహాచెడ్డ సంతోషం, చచ్చే కోపం, బ్రహ్మాండమైన ఊరేగింపు మొ॥

## పర్యాయపదాలు

ఒక మాటకే కొన్ని రకరకాల అర్థాలు ఉన్నట్లుగానే, దాదాపుగా ఒకే అర్థంలో పెక్కుమాటలు వాడుకలో ఉండటమూ మనం గమనించవచ్చు. వీటిని పర్యాయపదాలు అని అంటాము.

ఉదా : దారి, మార్గము
నీళ్లు, జలము,
గాలి, వాయువు.........

పర్యాయ పదాలను గూర్చి చెప్పుకొనేటప్పుడు ఒక మాట బాగా జ్ఞాపకం ఉంచుకోవాలి. సిద్ధాంతరీత్యా చెబితే పర్యాయపదాలు అనేవి ఉండవు. ఎందువల్లనంటే, ఇంతకు ముందు చెప్పిన మాట మళ్లీ ఒక సారి జ్ఞాపకం చేయాలి. ఒక మాటకు అర్థం ఆ మాటను ఎన్ని ప్రకరణాలలో వాడవచ్చునో అన్ని ప్రకరణాలను బట్టి మొత్తంగా వస్తుంది అయితే పర్యాయపదాలు స్థూలంగా ఒకే వస్తువునో, అర్థాన్నో సూచించవచ్చునుగాని అన్నివిధాల, అన్ని ప్రకరణాలలోనూ ఒకమాట బదులు పర్యాయపదమని అనుకునే మరొక మాటను ఉపయోగించటం సాధ్యంకాదు. ఇంకోవిధంగా చెబితే ప్రతి మాటకూ ఒక వ్యక్తిత్వం ఉంటుంది.

ఒక ఉదాహరణ పరిశీలిద్దాము:

1. నెమ్మదిగా నడిచిరా !
2. మెల్లగా నడిచిరా !

స్థూలంగా 'నెమ్మదిగా' అన్నా, 'మెల్లగా' అన్నా ఒకటే ననిపిస్తుంది. కాని శ్రద్ధగా పరిశీలిస్తే రెండింటికీ ఉన్న వ్యత్యాసాన్ని గమనించవచ్చు. నడవటానికి ఏదయినా ఆరోగ్యరీత్యా అశక్తత ఉన్నా, నడిచేచోట నీళ్లు, బురద, జారుడువంటి ఇబ్బందులున్నా 'జాగ్రత్తగా' అనే అర్థాన్ని సూచిస్తూ 'నెమ్మదిగా' నడిచిరా అనవచ్చు. మెల్లగా అనే దానిలో ఆ సూచన తక్కువ.

ఒక్కొక్కచోట సభ్యత, ఒక మాటకు మనం సంఘంలో ఇచ్చే గౌరవ స్థానం మొదలయిన వాటివల్ల ఇటువంటి తేడాలు వస్తాయి. ఇందుకు ఒక ఉదాహరణ 'ఎడమ', 'పుర్ర' అనే మాటలు. నీ ఎడమచెయ్యి తీసేసి నా పుర్రచెయ్యి పెడతానన్నాడట' అనిఒక వాడుక. 'ఎడమ' అనే మాటకున్న నాగరికమైన వాడుక 'పుర్ర' అనే దానికి లేదు. ఎవరయినా ఒక కావలసిన పని చెడగొడితే "పెట్టాడుగా వాడి పుర్రచెయ్యి" అంటుంటారు.

ఇందువలన తేలే దేమిటంటే అచ్చుగా అన్ని విధాలా ఒక పదం స్థానం ఆక్రమించగల మరో పర్యాయ పదం ఉండదు. కాని వ్యవహారంలో స్థూలంగా ఒక పదానికి మరో పదం పర్యాయంగా గణించటం కద్దు.

పర్యాయ పదాలను గూర్చిన చర్చ ఆరంభించేటప్పుడు ఇచ్చిన ఉదాహరణలు చూస్తే (దారి, మార్గం, నీళ్లు, జలం) ఒకటి దేశీయమైన పదం కాగా మరొకటి సంస్కృతం నుంచి తెచ్చుకున్న పదం అని గ్రహించవచ్చు.

పరభాషనుంచి తెచ్చుకున్న పదాలలో కూడా ఒక విశేషం మనం గుర్తు పెట్టుకోవాలి. ఆ భాషలో ఆ పదాల కుండే విస్తృతార్థం అంతా ఆ మాటలు మనభాషలో ఇవ్వవు కారణం ఏదో కొన్ని సందర్భాలలో మాత్రమే ఆ పదాలు మనకు పరిచితాలు అవుతాయి. ఆ మాటలకు ఆ అర్థాలను మాత్రమే మనం గుర్తిస్తాము.

ఉదాహరణకు Paper– పేపరు. ఇంగ్లీషులో ఈ మాటకు ఉన్న అర్థాలలో 'a written or Printed document or the like' అనేది ఒకటి. మనము 'వార్తాపత్రిక' అనే అర్థంలో ఈ మాటను ప్రత్యేకించి వాడుతాము Negotiable notes, bills, etc ' అనే అర్థం ఈ మాటకు ఇంగ్లీషులో ఉంది తెలుగులో లేదు.

BRAOU

ఒకమాటకు విస్తృతమైన అర్థాలు ఉన్నప్పుడు వాడుకలో కొన్ని ప్రధానమైనవి, మరికొన్ని అప్రధానమైనవి అనే భావం కలుగుతుంది. ఇందుకు కారణం వ్యవహారం మాత్రమే. అలంకార శాస్త్రంలో ఒక ఉదాహరణ ఉంది. 'ఒకడు వారణము కోరి రాజ సౌధమున కేగెను. వానికి వారణమే లభించెను వారణము అంటే ఎక్కువగా చెప్పుకొనే అర్థం ఏనుగు అని. ఒకడు ఏనుగు కావాలని రాజుగారి మేడకు వెళ్లాడు. కాని వాడిని లోపలకు పోకుండా భటులు ఆపివేశారు. ఆపటం అనే అర్థం కూడా 'వారణం' అన్నమాటకు చెప్పవచ్చు. కనుక వాడికి వారణం లభించింది అని యిక్కడ చమత్కారం. ఏనుగు అనే అర్థం చెప్పుకోవడానికి వీలయిన మరో పర్యాయ పదం ఉపయోగిస్తే ఈ చమత్కారం చెయ్యగలమా? ఇట్లా పదానికి లేదా పద బంధానికి ఉన్న వేరువేరు అర్థాలతో చేసే చమత్కారాన్ని 'శ్లేష' అనీ, Pun అనీ అంటారు.

అందుకనే పర్యాయ పదాలు అనేవి స్థూలంగా ఆలోచిస్తే ఉన్నాయి. సూక్ష్మంగా చూస్తే లేవు.

## అభ్యాసం (చదివేపని)

ఒక మాటకున్న నానార్థాలను కవులు రకరకాలుగా ఉపయోగించుకున్నారు. ప్రాచీన కాలంలో రెండర్థాలూ మూడర్థాలూ వచ్చే కావ్యాలు ఉండేవి. పింగళి సూరన రచించిన రాఘవ పాండవీయం అనే కావ్యంలో ప్రతి పద్యానికీ రామాయణ పరంగానూ, మహాభారతపరంగానూ అర్థాలు చెప్పుకోవాలి. అట్లాగే భట్టుమూర్తి రచించిన హరిశ్చంద్రనలోపాఖ్యానమూ రెండర్థాల కావ్యం. ఈ కావ్యాల్లో ఎక్కువగా పదాల విరుపులలో భిన్నత్వం వల్ల భిన్న పదస్ఫూర్తి కలిగి భిన్నార్థాలు వస్తాయి.

ఇట్లా ప్రతి పద్యంలో రెండర్థాలు కాకపోయినా అక్కడక్కడ చమత్కారంకోసం కవులు రెండర్థాలు వచ్చేట్టుగా కొన్ని పద్యాలు రాస్తారు. అట్లాంటి వాటిల్లో మనుచరిత్ర నుంచి ఈ పద్యం చదవండి. ఆర్. వెంకటేశ్వర అండ్ కంపెనీ వారు మద్రాసు నుంచి 1936 లో వెలువరించిన వ్యాఖ్యాన సహితమును చరిత్రం నుంచి తీసుకున్న భాగమిది. దీనికి వ్యాఖ్య కూర్చిన వారు కోమండూరి అనంతాచార్యులు గారు. ప్రాచీన కావ్యాల వ్యాఖ్యాన సంప్రదాయం తెలుసుకోటం కోసం వ్యాఖ్యానం కూడా ఇస్తున్నాం.

అపరిమితానురాగ సుమనోలసయై చిగురాకుఁజేతులం
దపసిని గౌఁగిలించె వనితా! ఇదె రంభ; తలంప రంభదా
నపరిమితానురాగ సుమనోలసయై చిగురాకు జేతులం
దపసిని గౌగిలించుట యుచితంబె కదా! యన నవ్వెరంభయున్. (3-77)

టీ. వనితా = ఓ చెలియా, రంభ = అరటిచెట్టు, అపరిమితాను...అలసయై - అపరిమిత = మితిలేని, అనురాగ = అనుసరించిన యెఱ్ఱదనము గలిగి - ఎఱ్ఱగా నుండెడి, సుమనః = పువ్వుచేత, అలసయై = వాలియల్లు కొను స్వభావముగలదై, చిగురాకుజేతులన్ = లేత యాకులనెడి చేతులతో, తపసిన్ = అగిసె చెట్టును, కౌగిలించెన్ = ఆలింగనమును చేసి కొనెను, ఆవరించు కొనెను. ఇదె = ఇదిగో, చూడుము (అని యొకతి చెప్పగా మరియొకతె), తలంపన్ = విచారింపగా, రంభ = రంభయనెడి యప్సరస, తాన్ = తాను, అపరిమిత ... అలసయై అపరిమిత = మితిలేని, అనురాగ = అనురక్తితో కూడిన, సుమనః = మంచి మనస్సు గలదగుట చేత అలసయై = ఓపికలేనిదై, కాల విళంబము నోర్వలేనిదై; చిగురాకు జేతులన్ = చిగురాకుల వంటి చేతులతో, కౌగిలించుట = ఆలింగనము చేసికొనుట, తపసిని = తపస్సు చేసి స్వర్గ సుఖముననుభవింప వచ్చిన పురుషుని, కౌగిలించుట = ఆలింగనము చేసికొనుట, ఉచితంబెకదా = యుక్తమేకదా-విశేష తపస్సు చేసి పొందిన పుణ్యాత్ములు స్వర్గమునకు వచ్చి రంభా సంభోగము చేయుదురు గనుక రంభ తపస్విని కౌగిలించు కొనుట వింత గాదనట, అనన్ = అనగా, రంభయున్ = (వారిలోనొకతెయై విహ రించుచున్న రంభ యనెడి యప్సరసయు, నవ్వెన్ = అందులకై నవ్వెను.

తా. అప్పుడొక యప్సరస మరియొక దానితో చెలియా! రంభ (అరటి చెట్టు) మిక్కిలి యెఱ్ఱనైన పువ్వుయొక్క బరువు చేత వాలినదై తపసిని (అగిసె చెట్టును) గౌఁగిలించెను. (చేరుకొనెను) . చూడు మనగా నది మరల దానితో, రంభ మిక్కిలి యనురాగముతో మంచి మనసు గలదై తపస్సు చేసి కృతార్థుడయి స్వర్గమునకు వచ్చిన పుణ్య పురుషుని గౌఁగిలించుట యుక్తమె కదా! యనగా రంభ నవ్వెను. అరటి చెట్టు పూచి యగిసె చెట్టు మీద వాలెనని చెప్పిన మాటకు నర్థాంతర వివక్షచే రంభ తపస్వినిగౌఁగిలించు కొనుటగాఁ గల్పించుకొని యది సహజమే యనియెనని భావము అలం. వక్రోక్తి."

పై పద్యంలో 'రంభ, తపసి, సుమనస్, అనురాగ' అనే మాటలకున్న రెండేసి అర్థాలవల్ల ఈ పద్యంలో రెండర్థాలు వచ్చినాయి. అరటి చెట్టు పూచి అగిసె చెట్టు మీద వాలింది అనేది అసలు సందర్భానికి సరిపడిన అర్థం అప్సరసలు వన విహారం చేస్తూ మాట్లాడు కున్న సందర్భం అది. రంభ అనే అప్సరస పరంగా వచ్చిన అర్థం చమత్కారం కోసం ఉద్దేశించింది. వ్యాఖ్యానంలో అర్థాంతర వివక్ష అంటే "వేరే అర్థం చెప్పాలను కోటం".

కావ్యాల్లో రెండర్థాల మాటలను ఎట్లా ఉపయోగించు కుంటారో చూపించటం కోసమే ఈ పద్యం ఉదహరించాం. అప్సరసలు, రంభ, రంభకోసం తపస్సు చేసి స్వర్గానికి వెళ్లటం- ఇవన్నీ కల్పితపురాణగాధలు (ప్రతిజాతి సంస్కృతిలోను ఇట్లాంటి కల్పిత గాథలు ఉంటూనే ఉంటాయి. వీటిని వాస్తవాలుగా భ్రమ పడకూడదు.

ఇక వ్యాఖ్యానంలో భాష చూడండి. ఈ కోర్సులో మనం నేర్చుకొనే భాషకు భిన్నమైనది. ప్రాచీన కావ్య భాషకు సన్నిహిత మైనది. <u>అది, దాని</u> అనే పదాలు (వీటిని సర్వ నామాలు అంటారు.) స్త్రీల పరంగా ఉపయోగించటం ఇప్పుడు గౌరవ ప్రదం కాదు. చిన్న పిల్లలనుద్దేశిస్తే అదిముద్దు. ఇక్కడ అప్సరసలు యువతులుగా అనుకోవాలి. అట్లాగే 'మిక్కిలి యెఱ్ఱనైన పువ్వుయొక్క బరువు చేత వాలినదై' అని ఈనాటి భాషలో రాయము. ప్రాచీన భాషలో అయినా ఇట్లాంటి వాక్యాలు సమాసాలకు అర్థం చెప్పేటప్పుడే వాడతారు.

(సమాసాలను గురించి కొద్ది రోజుల్లోనే తెలుసు కుంటారు. ప్రాచీనాధునిక భాషా భేదాలను గురించి కూడా రాబోయే పాఠాల్లో నేర్చుకుంటారు).

రెండర్థాల మాటలను సాహిత్యపరం"గా వాడుకున్న ఇంకో ఉదాహరణ చూద్దాం. ఈ సారి పద్యం చేమకూర వేంకట కవి విజయ విలాసంలోనిది. దీనిని కూడా వ్యాఖ్యాన సహితంగా ఉదహరిస్తాం. వ్యాఖ్య తాపీ ధర్మారావుగారు హృదయోల్లాసం అనే పేరుతో రచించారు. ధర్మారావు గారు తమ జీవితమంతా ఈ గ్రంథాన్ని వ్యాఖ్యానించటానికి కృషి, చేశారని అంటారు. ఇది 1968 లో అచ్చయింది.

రాజున్ భోగియు సౌమ్యుఁడున్ గవియు సర్వజ్ఞుండు నీతాననన్
దేజః ప్రౌఢవచో వివేక నయభూతి శ్లాఘలన్ మించు, నా
రాజున్ భోగియు సౌమ్యుడున్ గవియు సర్వజ్ఞుండు నెబ్బంగులన్
యోజింపన్ రఘునాథ భూరమణవర్యుడే ధరామండలిన్



BRAOU

అర్థము :

రాజున్ = చంద్రుడును, భోగియున్ = ఆదిశేషుడును (భోగము అనగా పడగ కలది, పాము) సౌమ్యుండున్ = (సోముడు అనగా చంద్రుడు, అతని కొడుకు సౌమ్యుడు) బుధుడును, కవియున్ = శుక్రుడును, సర్వజ్ఞుండున్ = శివుడును, రుడుజౌను అనన్ = సాటియగుదురు అనునట్లుగా, తేజః ... శ్లాఘలన్ = (క్రమంగా) తేజః = కాంతి యందు, ప్రౌఢవచః = మాట నేర్పునందు, వివేక = తెలివి యందు, నయ = నీతియందు, భూతి = ఐశ్వర్యము నందు, శ్లాఘలన్ మించున్ = పొగడ్తలచే అతిశయించును, కాన్! అంతేకాదు :- ఎట్లంగులన్ యోచింపన్ = ఎన్ని విధముల ఆలోచించినను, రాజున్ = పరిపాలించువాడును, భోగియు = భోగములనను భవించువాడును, సౌమ్యుడు = సమరసభావము కలవాడును, కవియున్ = కవీశ్వరుడును, సర్వజ్ఞుండు = సకల విద్యలు ఎరిగినవాడును, ధరామండలిన్ = ప్రపంచమునందు, రఘునాథ, భూరమణ వర్యుండె = రాజశ్రేష్ఠుడే మరియొకడు లేడని భావము.

తాత్పర్యము :

రఘునాథుడు చంద్రుని వంటి కాంతిని, ఆదిశేషుని వంటి మాటకారి తనమును బుధుని వంటి వివేకమును, శుక్రునివంటి నీతిని, శివుని వంటి ఐశ్వర్యమును కలవాడు, అంతేకాదు చక్కని పరిపాలనము, భోగానుభవము, సమరసభావము, ప్రశస్తమైన కవిత్వము, అపారమైన జ్ఞానము కలవాడని భావము.

## విశేషాలు

ఈ పద్యములో మొత్తము పది మంచిగుణాలు చెప్పాడు కవి. మొదట ఉపమానాలుగా చెప్పిన రాజు, భోగి, బుధుడు కవి, సర్వజ్ఞుడు అన్న మాటలు సుప్రసిద్ధులైన వ్యక్తులను తెలిపేవి. ఆ మాటలనే ఉపయోగించి మూడవ చరణంలో గొప్ప గుణములు గల ఒక వ్యక్తిని తెలియజేసి కవి చమత్కరించాడు.

చంద్రుడు మొదలయిన ఆ అయిదుగురు ఒక్కొక్క గుణాని కే ప్రసిద్ధులు, కాని రఘునాథుడు ఆ ఐదు గుణాలకూ ప్రసిద్ధి కలవాడని కవి హృదయము.

కొందరనుకున్నట్లు చివరనున్న ధరామండలిన్ అన్నది పాదపూరణము కాదు. ఎందుచేత నంటే పైన చెప్పిన ఉపమానాలన్నీ చంద్రుడు, ఆదిశేషుడు, శుక్రుడు, శివుడు, అన్నవారితో, వీరందరు ఈ లోకానికి చెందిన వారు కాదు. ఈ లోకంలో సరిపోల్చడానికి ఎవరైనా ఉన్నారా అని అడిగితే దానికి కవి ఇచ్చిన బదులు ఈ భూరమణ వర్యుండే ధరా మండలిన్'' అని ఎంతో అభిప్రాయముతో ఆ పదము ప్రయోగించాడు.

## పాఠాంతరాలు

వేభంగులన్ యోజించినన్ అని. ఎబ్భంగులన్ = ఏలాగు ఆలోచించినా అన్న దానికి బదులు, వేయి విధలా ఆలోచించినా అని అర్థం అవుతుంది. భావంలో వ్యత్యాసం లేదు.

తిరపతి కవులు భోగి = రాహువు, సర్వజ్ఞుడు = అంగారకుడు అన్న అర్థాలు కూడా చూపించిరు. ఈ అయిదుగురిని గ్రహాలుగా చూపాలన్నఅభిలాష! మాటకారి తనానికి రాహువుతో పోల్చటం బాగుండదుకదా! ఏమయినా కవి ఉద్దేశంలో ఆ అర్థం లేదు.

## అలంకారము

శ్లేష, క్రమము, వక్రోక్తి.

వ్యాఖ్యాన సంప్రదాయంలో ధర్మారావుగారిది సులభ పద్ధతి. ఈ కాలపు మాట్లాడే భాషకు దగ్గరగా ఉండే రచనా పద్ధతిని అవలంబించటం వల్ల అది సాధ్యమయింది.

LIBRARY

## అభ్యాసం (రాత పని)

1. మీ సలహాదారు సహాయంతో రెండు పూర్వకావ్యాలు వ్యాఖ్యాన సహితంగా ఉన్నవాటిని సంపాదించి ఈ పాఠంలో ఇచ్చినట్టుగా రెండు పద్యాల్ని ఏరండి. ఆ పద్యాలమీదా వ్యాఖ్యమీదా, మీ అభిప్రాయాలు తెలపండి. ఇందుకు వసుచరిత్ర, పారిజాతాపహరణము, ఆముక్తమాల్యద, శృంగార నైషధము- అనే కావ్యాల వ్యాఖ్యానాలు చూడవచ్చు. ఈ పుస్తకాలు మీ దగ్గరలో ఉన్న ఏ కాలేజీ లైబ్రరీలో గాని, ఇతర గ్రంథాలయాల్లోగాని, మీకు తెలిసిన తెలుగు విద్వాంసుల దగ్గరగాని దొరుకుతాయి.
[పద్యాలు ఏరే పని మీ సొంతంగానే చేయండి. ఏ ఇద్దరూ ఒకే పద్యం చూపించగూడదు.]
ఏరిన రెండు పద్యాల్లో ఒకటి అభిద, లక్షణార్థాలను ఉపయోగించినదయి ఉండేటట్లు చూడండి.

2. ఈ క్రింద ఇచ్చిన పద్యం కూచిమంచి తిమ్మకవి రచించిన అచ్చతెలుగు రామాయణం పీఠికలో మూడో పద్యం.

సీ. గ్రుడ్డు కానుపుఱేడు గ్రుడ్డు కానుపుఱేడు
గుజ్జంబు పాన్పునై కొమరుమిగుల
జింకతాలుపరియు, జింకతాలుపరియు
మఱిడియు, నమగునై మెఱుపుజాపు
నీరుపుట్టువయును, నీరుపుట్టువయును
బూరయుతొడవునై పొలుపు రెఱప
పచ్చవార్వపుజోదు పచ్చవార్వపుజోదు
వలకన్ను, కొడుకునై వలపుగులుక

గీ॥ చుట్టువాలును నెవ్వపోగొట్టు నాలు
బిట్టుగ్రాలు పసింటి క్రొంబట్టు సేలు
మెట్టజాలు మొగిల్పసమెట్టజాలు
నట్టిడాలును గల జగజెట్టి దలతు.

BRAOU

ఈ పై పద్యంలో కవి విష్ణువును స్తుతించాడు. ఇందులో గ్రుడ్డు కానుపుఱేడు, జింకతాలుపరి, నీరు పుట్టువ, పచ్చవార్వపుజోదు అనే మాటలకు ఒక్కొక్కదానికి రెండర్థాలున్నాయి. రెండర్థాలు తెలుసుకోటానికి పద్యంలోనే కొంత సూచనఉంది. మిగతాది మీకు అందుబాటులో ఉన్న ఏ నిఘంటువులోనైనా వెతికి అర్థాలు పట్టుకొని ఈ పద్యంలో మొదటి భాగానికి అర్థం చెప్పండి. అచ్చతెలుగు నిఘంటువు మీ దగ్గర గ్రంథాలయంలో ఉంటే దాన్ని సంప్రదించండి. అవసరమయితే మీ సలహాదారు సహాయం పొందండి.

3. ఈ రకంగా ఒకే మాటకున్న రెండర్థాల వల్ల రెండర్థాలు వచ్చిన వాక్యాలను మీరు చదివిన పుస్తకాల నుంచి ఒక పది ఏరండి.

4. ఈ కింద నానార్థాలున్న కొన్ని మాటలు ఇస్తున్నాం. వాటినిముందు అకారాది క్రమంలో ఏర్పాటు చెయ్యండి తరువాత నిఘంటువులో చూసివాటి అర్థాలు రాయండి. ఈ మాటల్తో రెండర్థాలువచ్చే 10 వాక్యాలు రాయండి. ఆ వాక్యాల అర్థాలు కూడా వ్రాయండి.

| | |
|---|---|
| హాలాహలము | సొమ్ము |
| శూరుడు | తరణి |
| శారద | ప్రాణము |
| బుధుడు | నెల |
| ధాత | పల్లవము |
| లత | వారము |
| పుండరీకము | పావకుడు |
| పాత్ర | బింబము |
| ప్లవంగము | హేతి |
| హరితము | తీర్థము |

5. ఈ క్రింది మాటలను అకారాది క్రమంలో కూర్చి నిఘంటు సహాయంతో పర్యాయ పదాలు రాయండి. పర్యాయ పదాలు సాధారణంగా ఏదో విధంగా ఇతర పర్యాయ పదాలతో భేదిస్తాయి. అట్లాంటి అర్థచ్ఛాయా భేదాల్ని సూచించండి. ఒక్కమాటకు రెండుగాని మూడుగాని పర్యాయపదాలు చాలు. పర్యాయ పదాలమధ్య అర్థ భేదాలుగానీ, వాడుక భేదాలుగానీ, ఉంటే వాక్యాలలో వాడి చూపించండి.

తల్లి
తాడు
చెక్కిలి
నేర్పరి
ఎల్లప్పుడు
ఎనిమిది
ఉలుము
ఏడుపు
నొప్పి
నీళ్లు

కోపము
చావు, చనిపోవు
పని
నమస్కరించు
నిద్రించు
పోట్లాడు
చూచు
మాట్లాడు
దుఃఖము
నవ్వు

BRAOU

# ఆధునిక భారతీయ భాషలు : తెలుగు

## పాఠ్య ప్రణాళిక

ఖండిక 1 రాసే అలవాట్లు

పాఠం 1 భాష రాయటంలో వచ్చే చిక్కులు, పరిష్కారాలు
పాఠం 2 సంధి - మాటల కలయిక

ఖండిక 2 నిఘంటువు

పాఠం 3 నిఘంటువు - మాటలకు అర్థాలు తెలిపే పుస్తకం
పాఠం 4 నిఘంటువును ఉపయోగించే పద్ధతి

ఖండిక 5 పదాలు, అర్థాలు

పాఠం 5 పదాలు, అర్థభేదాలు

ఖండిక 4 నానార్థాలు, పర్యాయ పదాలు

పాఠం 6 నానార్థాలు, పర్యాయ పదాలు

ఖండిక 5 నుడికారాలు

పాఠం 7 జాతీయాలు
పాఠం 8 సామెతలు

ఖండిక 6 పదాలు ఏర్పడే పద్ధతులు, సంబంధాలు

పాఠం 9 పదాలు, ప్రత్యయాలు
పాఠం 10 పదాల మధ్య రూప సంబంధాలు

ఖండిక 7 సమాసాలు

పాఠం 11 సమాసాలు - పదాల కలయిక, సమాస భేదాలు

ఖండిక 8 వాక్య భేదాలు

పాఠం 12 సరళ వాక్యాలు
పాఠం 13 సంశ్లిష్ట వాక్యాలు
పాఠం 14 సంయుక్త వాక్యాలు

ఖండిక 9 వాక్యాల పరివర్తనం

పాఠం 15 కర్త, కర్మ మొదలైనవి
పాఠం 16 ప్రత్యక్ష పరోక్ష అనుకరణలు మొదలైనవి

ఖండిక 10 వాక్యాలమధ్య సంబంధాలు

పాఠం 17 రూప సంబంధాలు
పాఠం 18 అర్థ సంబంధాలు

ఖండిక 11 రచనలో విరామ చిహ్నాలు

పాఠం 19 విరామ చిహ్నాలు, పేరాల విభాగం, పేరాల అంతస్సంబంధాలు మొదలైనవి

ఖండిక 12 వాక్య ప్రయోగం

పాఠం 20 వాక్యాల ప్రయోగ పరిమితులు

BRAOU

ఖండిక 13 పదాలు - శైలి

పాఠం 21 మాండలికాలు

పాఠం 22 నిరాడంబర శైలి, అలంకారిక శైలి

ఖండిక 14 వాక్యాలు - శైలి

పాఠం 23 సరళ సంశ్లిష్ట వాక్యాలు-అవగాహనలో, శైలిలో వాటి పాత్ర

పాఠం 24 ఒకే అర్థంలో వాక్యభేదాలు - వాటి పాత్ర

ఖండిక 15 శైలిలో క్రమ బద్ధత

పాఠం 25 ప్రాచీన నవీన శైలుల మిశ్రమం

పాఠం 26 మాండలికాల మిశ్రమం

ఖండిక 16 ప్రాచీన రచన పద్ధతులు - ఆధునిక రచన పద్ధతులు

పాఠం 27 శబ్ద రూపాలు

పాఠం 28 వాక్య రూపాలు

ఖండిక 17 వ్యాసరచన

పాఠం 29 విషయ ప్రధాన వ్యాసాలు

పాఠం 30 వినోద ప్రధాన వ్యాసాలు

పాఠం 31 సామయిక వ్యాసాలు

పాఠం 32 ఇతరాలు

ఖండిక 18 పత్రికా రచన

పాఠం 33 యథావిధి వార్తా రచన

పాఠం 34 వార్తా సంగ్రహణ

పాఠం 35 వార్తా వివరణ

ఖండిక 19 ఉత్తరాలు రాసే పద్ధతులు

పాఠం 36 వ్యాపార లేఖలు

పాఠం 37 అధికార లేఖలు

పాఠం 38 సాంఘిక లేఖలు

ఖండిక 20 అనువాదం

పాఠం 39 అనువాద సందర్భంగా పద క్రమంలో, వాక్యక్రమంలో సర్దుబాట్లు

ఖండిక 21

పాఠం 40 మూల భాషలోని వాక్యాలకూ, లక్ష్యభాషలోని వాక్యాలకూ మధ్య ఉండే సామ్యవైషమ్యాలు

ఖండిక 22 అనువాద భేదాలు

పాఠం 41 మూల విధేయానువాదం, జాతీయానువాదం, స్వేచ్ఛానువాదం

పాఠం 42 అనువాదంలో వచ్చే ప్రత్యేక సమస్యలు

ఖండిక 24 నేటి సాహిత్యము : సృజనాత్మక భాషా ప్రయోగం

పాఠం 43 కథానికలు, వాటి భేదాలు

పాఠం 44 కథానిక : సాహిత్య వస్తువు

పాఠం 45 కథానిక : శిల్పం

ఖండిక 25 నాటిక

పాఠం 46 నాటికలు, వాటి భేదాలు

పాఠం 47 నాటిక - వస్తువు

ఖండిక 26 కవిత్వం

పాఠం 48 భావ కవిత్వం

పాఠం 49 అభ్యుదయ కవిత్వం

పాఠం 50 వచన కవిత్వం


BRAOU

LIBRARY

BRAOU